# TELUGU SÃNGHIKA NAVALA MÃNAVA SAMBANDHÃLU

**(1878 - 1947)**

A Thesis submitted to the UNIVERSITY OF HYDERABAD in partial fulfillment of the Degree of

**Doctor of Philosophy**

in

**Telugu**

by

**P. VISHWA PRASAD**

Regd.No.96HTPH02

**Department of Telugu**
**School of Humanities**
**UNIVERSITY OF HYDERABAD**
**Hyderabad–500 046**
**Telangana,** India

**December**
**2015**

# తెలుగు సాంఘిక నవల

# మానవ సంబంధాలు

## (1878 – 1947)

పిహెచ్.డి. పట్టా కోసం

హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధనా వ్యాసం


పరిశోధన

**పోగుల విశ్వ ప్రసాదు**

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు – 500 046



డిశంబరు

2015

# <u>DECLARATION</u>

I, **P. Vishwa Prasad** hereby declare that this Thesis entitled ***'Telugu Sãnghika Navala – Mãnava Sambandhãlu (1878 – 1947)*** submitted by me under the guidance and supervision of **Dr. Darla Venkateswara Rao** is a bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**P. Vishwa Prasad**
Regd. No. **96HTPH02**

Date: 21 December 2015

## CERTIFICATE

This is to certify that the Thesis entitled ***'Telugu Sãnghika Navala – Mãnava Sambandhãlu (1878 - 1947)*** submitted by ***Mr. P. Vishwa Prasad*** bearing Reg. No. **96HTPH02** in partial fulfillment of the requirements for the award of **Doctor of Philosophy** in Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The dissertation has not been submitted previously in part or in full to this or any other University or Institution for the award of any degree or diploma.

**Dr. Darla Venkateswara Rao**
**Research Supervisor**

**Head, Department of Telugu**

**Dean, School of Humanities**

# కృతజ్ఞతలు

అమ్మా నాన్నలకు, అక్షరాలు దిద్దించిన గురువులకు, ఉన్నత విద్యకు అవకాశం ఇచ్చిన హైదరాబాదు విశ్వవిద్యాలయం వారికీ, పరిశోధనాంశాన్ని సూచించి, మార్గదర్శనం చేసిన ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య గారికీ సాహిత్య పాఠాలు నేర్పిన గురువులు కీ॥శే॥ ఆచార్య జి.వి సుబ్రహ్మణ్యం, ఆచార్య కే.కే. రంగనాథాచార్యులు, ఆచార్య రవ్వా శ్రీహరి, ఆచార్య సి. ఆనందారామం, ఆచార్య పరిమి రామనరసింహం, ఆచార్య నడుపల్లి శ్రీరామ రాజు, ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి గారలకు,

నా పరిశోధనకు ఆర్థిక సహకారం అందించిన యు.జి.సి. న్యూఢిల్లీ వారికి, నా ఆలస్యాన్ని మన్నించి, తిరిగి నాకు ఈ 'మహదావకాశాన్ని ఇచ్చిన యూనివర్సిటీ అధికారులకు, అంగీకరించిన తెలుగ శాఖాధ్యక్షులు ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికీ, ప్రస్తుతం, నా పరిశోధనకు పర్యవేక్షణ వహించి, పూర్తి చేయించిన మిత్రులు డా. దార్ల వేంకటేశ్వరరావు గారికి,

నాకు తోడుగా ఉన్న మా కళాశాల, ప్రభుత్వ డిగ్రీ మరియు పి.జి. కళాశాల, గోదావరిఖని, కరీంనగర్ ప్రిన్సిపాల్, అధ్యాపకులకు, యూనివర్సిటీ మిత్రులకు, విషయసేకరణలో సహాయపడిన ఇందిరాగాంధీ మెమోరియల్ లైబ్రరీ, సిటీ సెంట్రల్ లైబ్రరీ, హైదరాబాదు, ఉస్మానియా విశ్వవిద్యాలయం గ్రంథాలయాలకు,

అందంగా డి.టి.పి. చేసి సకాలంలో అందించిన శ్రీమతి రాధాకుమారి, శ్రీ భవానీ శంకర్ గారలకు,

నా జీవిత సహచరి జ్యోతికి–

– ఇవన్నీ నాకు ఇచ్చిన కాశీ విశ్వనాథునికీ......

**–పరిశోధకుడు**

# విషయసూచిక


కృతజ్ఞతలు iv

ప్రవేశిక v–IX


మొదటి అధ్యాయం

## భారతీయ జీవన విధానం-మానవ సంబంధాలు

(పుటలు: 1–44)


1.0 పరిచయం 1

1.1 వ్యక్తి – సమాజం 2

1.1.1 మానవ సంబంధాలు –నిర్వచనం, లక్షణాలు 5

1.1.2 Human Relations Theory 6

1.2 వ్యక్తి దర్శనం 6

1.3 భారతీయ సంస్కృతి 10

1.4 పురుషార్థాలు 12

1.4.1 ధర్మం 13

1.4.2 అర్థం 16

1.4.3 కామం 17

1.4.4 మోక్షం 17

1.5 ఆశ్రమ వ్యవస్థ 18

1.6 స్వాతంత్ర్యానికి పూర్వం భారతీయ సమాజం 21

1.7 గ్రామీణ సంబంధాలు 23

1.8 భూ సంబంధాలు 26

1.9 పట్టణ నాగరికత 29

1.10 విద్య 30

1.11 మతం 35

1.11.1 బ్రహ్మసమాజం 38

1.11.2 ప్రార్థనా సమాజం 39

1.11.3 ఆర్యసమాజం 39

1.11.4 రామక్రిష్ణమిషన్ 39
1.6 స్వాతంత్ర్యం వైపుగా... 41

రెండవ అధ్యాయం

## తెలుగు సాంఘిక నవల- మానవ సంబంధాల పరిణామం

(పుటలు: 45-116)

2.0 నవల – పూర్వరంగం 45
2.1 ఆంగ్లసాహిత్య ప్రభావం 45
2.2 పత్రికల తోడ్పాటు 46
2.3 తెలుగు సమాజంపై పాశ్చాత్య ప్రభావం 46
2.4 నవల నిర్వచనం 48
2.5 నవల స్వభావం 49
2.6 నవల నిర్మాణాంశాలు 50
2.7 నవలల్లో సామాజిక వాస్తవికత 51
2.8 నవల సామాజిక సంబంధాలు 54
2.9 నవలేతివృత్తాలు – సాధారణీకరణం 58
2.10. తెలుగు సాంఘిక నవల 59
2.11 సాంఘికనవల – లక్షణాలు 60
2.12 నవల- మానవ సంబంధాల చిత్రణ 60
2.13 తెలుగు నవలల్లో మానవసంబంధాల పరిణామం 66
2.14 సాంఘిక నవలలు-మానవసంబంధాల వివిధ పరిణామాలు 67
2.14 .1 రాజశేఖర చరిత్ర – ఇతివృత్తం –పరిచయం 67
2.14 .1.1 రాజశేఖర చరిత్ర నవల సామాజిక పరిణామం 68
2.15 గణపతి నవల –ఇతివృత్తం – పరిచయం 80
2.16 'నారాయణరావు'- ఇతివృత్తం——పరిచయం 86
2.17 మైదానం నవల 106
2.17.1 'మైదానం' – ఇతివృత్తం - పరిచయం 107
2.17.2 'మైదానం' నవల-సామాజిక సంబంధాల విశ్లేషణ 109

మూడవ అధ్యాయం

# *మాలపల్లి, వేయిపడగలు* నవలలు - మానవసంబంధాలు

(పుటలు: 117–169)


3.0 భారతీయ, పాశ్చాత్య జీవనసంఘర్షణను చిత్రించిన నవలలు 117

3.1 మాలపల్లి నవల– ఇతివృత్తం 119

3.1.1 మాలపల్లి నవల మానవసంబంధాల విశ్లేషణ 121

3.1.2 మాలపల్లి నవల ఆర్థిక సంబంధాలు 122

3.1.3 మాలపల్లి నవల ధార్మిక ప్రవృత్తి 124

3.1.4 మాలపల్లి నవల సంఘర్షణ–తిరుగుబాటు 126

3.1.5 మాలపల్లి నవల మతసంబంధాలు 129

3.1.6 మాలపల్లి నవల చట్టం– జైలు — సెటిల్ మెంటులు 130

3.1.7 మాలపల్లి నవల ఆధ్యాత్మిక సంబంధాలు 130

3.1.8 మాలపల్లి నవల పీడిత స్వభావం 131

3.1.9 మాలపల్లి నవలలో కుటుంబ సంబంధాలు 133

3.2 వేయిపడగలు నవల — పరిచయం 138

3.2 .1 'వేయి పడగలు'– ఇతివృత్తం–పరిచయం 140

3.2.2 వేయిపడగలు నవలలో మానవసంబంధాల విశ్లేషణ 144

3.2.2.1 వేయిపడగలు నవలలో పరిపాలన వ్యవస్థ 144

3.2.2.2. వేయిపడగలులో సామాజిక సంబంధాలు 151

3.2.2.3. వేయిపడగలులో వ్యవసాయక వ్యవస్థ 152

3.2.2.4. వేయిపడగలులో *పసరిక* – ప్రతీకాత్మకత 154

3.2.2.5. వేయిపడగలులో కబీరు పాత్ర — సేవాసంబంధాలు 156

3.2.2.6. వేయిపడగలులో అసిరి పాత్ర — సంతృప్తికర జీవనం 157

3.2.2.7. వేయిపడగలులో చెంగల్రావు పాత్ర — తామస ప్రవృత్తి 158

3.2.2.8. గిరిక పాత్ర — సాంప్రదాయిక విలువల కొనసాగింపు 158

3.3 వేయిపడగలులో కుటుంబ సంబంధాలు 161

నాల్గవ అధ్యాయం

## *చివరకు మిగిలేది, అసమర్థుని జీవయాత్ర నవలలు-*

## మానవసంబంధాలు (పుటలు:170-209)


4.0 మనస్తత్వశాస్త్ర నవలలు పరిచయం 170

4.1 నవలా సాహిత్యంపై ఫ్రాయిడ్, ఆల్ఫ్రెడ్ ఆడ్లర్ ల ప్రభావం 170

4.2 ఇడ్ – ఇగో – సూపర్ ఇగో భావనలు 171

4.3 ఈడిపస్ కాంప్లెక్స్– ఎలక్ట్రో కాంప్లెక్స్ 171

4.4.1 'చివరికి మిగిలేది' ఇతివృత్తం 172

4.4.2 'చివరికి మిగిలేది' మానవసంబంధాల విశ్లేషణ 175

4.4.3 చివరకుమిగిలేదిలో సమాజీకరణం 177

4.4.4 ఆత్మన్యూనతా భావం 178

4.4.5 దయానిధి – అమృతంపట్ల వ్యక్తావ్యక్త భావనలు 185

4.4.6 దయానిధి – ఇందిర: దాంపత్య సంబంధాలు 189

4.4.7 దయానిధి – ఇతర వ్యక్తులతో గల సంబంధాలు 189

4.5 అసమర్థుని జీవయాత్ర – పరిచయం 194

4.5 .1 'అసమర్థుని జీవయాత్ర' ఇతివృత్తం 195

4.5 .2 'అసమర్థుని జీవయాత్ర' – మానవసంబంధాల విశ్లేషణ 197

4.5 .3 సీతారామారావుపై తండ్రి ప్రభావం 198

4.5 .4 సీతారామారావు బలహీనతలు 199

4.5 .5 సీతారామారావు దాంపత్య జీవితం 202

4.5 .6 సీతారామారావు పై వంశ ప్రభావం 204

4.5 .7 సీతారామారావు వాస్తవికతా సంఘర్షణ 207


ఐదవ అధ్యాయం

## తెలుగు నవలల్లో మానవ సంబంధాలు- శిల్ప వైవిధ్యం

(పుటలు: 210-243)


5.0 నవల పరిచయం 201

5.1 నవల నిర్వచనం 210

5.2 నవల– శిల్ప ప్రయోజనం 212

5.3 నవలా శిల్పం – రకాలు 216
5.3.1 సర్వజ్ఞతా దృక్కోణం 216
5.3.2 పరిమిత సర్వజ్ఞతా దృక్కోణం 216
5.3.3 నాటకీయ దృష్టి కోణం 217
5.4 నవలల్లో మానవ సంబంధాలు – శిల్ప వైవిధ్యం 218
5.4.1 రాజశేఖర చరిత్ర నవల – శిల్ప వివేచన 221
5.4.2 గణపతి– శిల్ప వివేచన 221
5.4.3 మాలపల్లి– శిల్ప వివేచన 223
5.4.4 వేయిపడగలు– శిల్ప వివేచన 226
5.4.5 నారాయణరావు– శిల్ప వివేచన 232
5.4.6 మైదానం– శిల్ప వివేచన 234
5.4.7 చివరకు మిగిలేది– శిల్ప వివేచన 236
5.4.8 అసమర్థుని జీవయాత్ర– శిల్ప వివేచన 239
5.4.9 మానవసంబంధాల అభివ్యక్తి వైవిధ్యం 241

ఆరో అధ్యాయం

## తెలుగు నవలల్లో మానవసంబంధాలు- దార్శనికుల ప్రభావం

(పుటలు: 244–285)

6.0 ఆధునిక దార్శనికుల ప్రభావం 244
6.1 ప్రాచీన సంస్కృత సాహిత్య ప్రభావం 244
6.2 వేయిపడగలు – వివాహం–విలువలు 252
6.3 కుటుంబం – దాంపత్యం 254
6.4 జిడ్డు కృష్ణమూర్తి దార్శనిక ప్రభావం 273
6.5 అరవిందుల దార్శనిక ప్రభావం 274
6.6 స్వామి వివేకానంద దార్శనిక ప్రభావం 276
6.7 గాంధీజీ దార్శనిక ప్రభావం 277
6.8 ఫలితాంశాలు 283

**ముగింపు** 286

**ఉపయుక్త గ్రంథసూచి** 289

# ప్రవేశిక

**ఉపోద్ఘాతం (Introduction):**

మానవ సమాజంలో సహోదర సామరస్య భావాలను పెంపొందింపజేయడానికి ఉద్దేశింపబడినది. ఉత్తమ సాహిత్యం ధర్మబద్ధ జీవనానికి మానవతా భావవికాసానికీ సాత్త్వికమైన చైతన్యదిశగా సాహిత్యం వెలుగుతుంది. విస్మరించబడుతున్న జీవన విలువల్ని, అడుగంటుతున్న మానవీయ చింతనల్ని సాహిత్యాత్మకంగా, కళాత్మకంగా నిర్మించేది నవల. మానవుని అంత: సంఘర్షణలను, బహి: సంఘర్షణలను అద్దం పట్టి చూపే ప్రక్రియగా నవలను చెప్తారు. సామాజికమైన వ్యక్తి – తన జీవన విధానం ద్వారా సంఘంలో చైతన్యవంతుడిగా జీవించి ఉత్తమ కార్యసాధకుడై, సమాజానికి మార్గదర్శిగా ఉండవచ్చు. దానికి వ్యతిరేకంగా బతుకుతూ, జీవితంలో ఓడిపోయి సంఘంలో పలచనా కావచ్చు. ఈ రెండు రకాల మార్పులకు వ్యక్తిలోని చైతన్యం కారణమౌతుంది. తనలోని చైతన్యం ద్వారా మనిషి ఉన్నత శిఖరాలను అందుకోవచ్చు. సమాజంలో ఉత్తమ పరివర్తనలు తీసుకు వచ్చేందుకు ప్రయత్నం చేయచ్చు. దార్శనికులు ఈ ప్రయత్నం చేస్తారు.

తెలుగు నవలల్లో సాంఘిక నవల విస్తృతమైన పరిధి గలది. దీనిలో మానవ సంబంధాలను విశ్లేషించడం అంటే అప్పటి కాలాన్ని మొత్తంగా అంచనా వేయడం. ఆధునిక తెలుగు సాహిత్యంలో నవల ప్రజా జీవనంలో భాగస్వామిగా మారింది. ప్రధానంగా సాంఘిక నవలలో, సమకాలీన సమాజాన్ని చిత్రించడం జరుగుతుంది.

స్వాతంత్ర్యానికి పూర్వ వచ్చిన సాంఘిక నవలల్లో ప్రధానంగా జాతీయతా స్ఫూర్తి కనబడుతుంది. పాశ్చాత్య సంస్కృతి సంప్రదాయాలు భారతదేశంలోకి చొచ్చుకొని వచ్చిన తర్వాత, భారతీయుల ఆలోచనా విధానాల్లో స్పష్టమైన మార్పు కన్పించసాగింది. అలాగే పాశ్చాత్య విద్య ద్వారా ప్రపంచ సాహిత్యాన్ని అధ్యయనం చేసే అవకాశం వచ్చింది. విస్తృతమైన విశ్వ సాహిత్యాన్ని అక్కడి సామాజిక, రాజకీయ, నైతిక వర్తనాల్ని అవగాహన చేసుకున్న రచయితలు భారతీయ వాతావరణంలో వాటి ఛాయల్ని ప్రవేశపెట్టదలచినారు. పాశ్చాత్య భావజాలం సాంఘిక నవలల్లో మనకు విస్తృతంగా కనిపిస్తుంది. దాన్ని భారతీయ వారసత్వాన్ని పెకలించేదిగా అలాగే ఇక్కడి సంప్రదాయాల్లో సంస్కరణల్ని తెచ్చేవిధంగా కూడా చూడవచ్చు.

పాశ్చాత్య సాహిత్య అధ్యయన ప్రభావంతో దేశంలోని మూఢాచారాలు మూఢవిశ్వాసాలు, అవిద్య, స్త్రీల అణచివేత లాంటి అనేక సంస్కరణభావాలను అలాగే భారతీయ గొప్ప వారసత్వానికి గొడ్డలి పెట్టుగా మారనున్న పాశ్చాత్య నాగరికతా ధోరణులను ఎదుర్కొనేందుకు జాతీయభావాలు, ఆధ్యాత్మిక భూమిక, ప్రాచీన సంస్కృతీ భావాల గురించి గొప్పగా చిత్రించే నవలలూ వచ్చాయి.

తర్వాత్తర్వాత స్త్రీ స్వేచ్ఛ గురించి కుటుంబంలోని పెదధోరణుల గురించి, వ్యక్తి అంతస్సంఘర్షణల గురించి కూడా నవలలు వచ్చాయి. వీటన్నింటినీ పరిశీలిస్తే మానవసంబంధాల్లో అనేక మార్పులు కనిపిస్తున్నాయి. ఈ మానవసంబంధాలను ప్రతిఫలింపజేయడంలో తెలుగు నవలా రచయితలు చాలావరకు కృతకృత్యులైయ్యారు. వీటిని అధ్యయనం చేయడం ద్వారా మానవ సంబంధాల్లో వచ్చిన మార్పులను, తద్వారా సాహిత్యంలో వచ్చిన వికాసాన్ని గుర్తించగలిగే అవకాశం ఉంది.

**పరిశోధన పరిధి (Scope of Research):**

స్వాతంత్ర్యానికి పూర్వం తెలుగు సాంఘిక నవలల్లోని మానవ సంబంధాలను విశ్లేషించేందుకు 'తెలుగు సాంఘిక నవల – మానవ సంబంధాలు' (1878 – 1947) అనే అంశాన్ని ఈ పరిశోధనకు ఎంచుకున్నాను. స్వాతంత్ర్యానికి పూర్వం దేశంలో నెలకొన్న సామాజిక, రాజకీయ, మత, నైతిక, విద్య మొదలైన వాటి స్థితిగతుల ద్వారా 'మానవ సంబంధాలు' ఏ విధమైన 'ఘర్షణ'కు గురైనాయి అనే కోణంలో ఈ సిద్ధాంతవ్యాస రచన కొనసాగింది. నవలల కాల పరిమితి ఎక్కువ కావడం, తెలుగులో వచ్చిన నవలల సంఖ్య కూడా ఎక్కువే కావడం వల్ల మొత్తం నవలల్లోని మానవ సంబంధాలను కాకుండా, ఆయా సిద్ధాంతాలకు, భావాలకు ప్రాతినిధ్యం వహించే 'ఎనిమిది' నవలలు మాత్రమే ఈ పరిశోధనకు తీసుకున్నాను. తొలి తెలుగు నవలగా అనేకమంది భావిస్తున్న 'రాజశేఖరచరిత్ర' నుండి భారత స్వాతంత్ర్య సమయంలో వచ్చిన 'అసమర్థుని జీవయాత్ర' వరకు ఎనిమిది నవలల్లో నవలాకారులు నిర్మించిన మానవసంబంధాలపై ఈ అధ్యయనం కొనసాగింది.

**పరిశోధన పద్ధతి (Methodology):**

ఈ పరిశోధన ఆయా నవలల్లోని కుటుంబ, సామాజిక సంబంధాలపై దృష్టికేంద్రీకరించడం జరిగింది. అప్పటి సామాజిక, రాజకీయ విషయాలను రేఖామాత్రంగా పరిచయం చేస్తూ, రచయితలు ఏ ఉద్దేశ్యాన్ని తన రచన ద్వారా ప్రధానంగా పాఠకులకు చేరవేయదలిచారో ఆ'కోణం'తో ఈ పరిశోధన సాగింది. ఈ క్రమంలో రచయితలు ఉద్దేశించిన లక్ష్యానికి, ఆయా నవలల్లోని వ్యక్తుల మధ్య నిరూపించబడిన మానవ సంబంధాలు ఏ మేరకు నిరూపించబడినాయో ఈ విశ్లేషణలో సమన్వయించే ప్రయత్నం చేశాను.

ఏ రచయిత అయినా సమకాలీన 'లోకాన్ని వీడి' రచన చేయలేడు. ప్రతీ రచనలో అప్పటి సమాజం ప్రతిఫలిస్తూ ఉంటుంది. వివేకవంతుడై బాధ్యతగల రచయిత తన రచనను సమాజ ప్రతిఫలన మాత్రమే కాకుండా, సమాజాన్ని చైతన్యపరిచే దిశలో తన రచనను తీర్చిదిద్దుతాడు. తన నవలలోని పాత్రలద్వారా రచయిత మానవీయ విలువల్ని ఉద్బోధిస్తాడు.

విశ్లేషణ పరిశోధనా పద్ధతి ద్వారా నవలల్లో ప్రతిఫలించిన మానవ సంబంధాలను నిరూపించే విషయంలో నమూనా పద్ధతి (Sample Method) ద్వారా ఎంచుకున్న ఎనిమిది నవలల్లో

'రాజశేఖర చరిత్ర' 'గణపతి' నవలల్లో సంస్కరణ భావాలు, మూఢవిశ్వాసాలు, స్త్రీ విద్య, మిథ్యాడాంబికాల గురించి, 'మాలపల్లి' లో హరిజన సమస్య భూస్వామ్య వర్గదోపిడీ, ఆధ్యాత్మిక చింతన, గాంధీజీ నాయకత్వం, అమలిన శృంగారాల గురించి, 'వేయిపడగలు'నవలలో భారతీయ పునరుజ్జీవనం, జాతీయ విద్య, పాశ్చాత్య నాగరికత వ్యతిరేకత, గాఢమైన, భారతీయ కుటుంబ సంబంధాల గురించి, 'నారాయణరావు'లో జాతీయస్ఫూర్తి, గాంధీజీ నాయకత్వం, స్వేచ్ఛా ప్రణయం లాంటి అంశాలు 'మైదానం'లో స్త్రీ స్వేచ్ఛ, కుటుంబ సంబంధాల వైఫల్యం, 'చివరకు మిగిలేది', 'అసమర్థుని జీవయాత్ర' లలో వ్యక్తి అంతరంగిక ఘర్షణల లాంటి అంశాలపై చర్చ జరుగుతుంది.

**పరిశోధన లక్ష్యాలు (Objectives of the Research):**

తెలుగులో సాంఘిక నవలలపై ఇప్పటికే అనేక సిద్ధాంత గ్రంథాలు, విమర్శ గ్రంథాలు, వ్యాసాలు వచ్చాయి. ఎందరో లబ్ధ ప్రతిష్టులైన విమర్శకులు అనేక రకాలైన చర్చలు చేసారు. అయితే సాధారణంగా వీళ్ళంతా ఏదైనా ఒక్క నవలపై ప్రత్యేకంగా చర్చ చేయడం, లేక కుటుంబ సంబంధాలపై చర్చ చేయడం, సామాజిక అంశాలాధారంగా వామపక్ష భావజాలతో చర్చ చేయడం లాంటివి, లేదా, ఒకే రచయిత యొక్క వివిధ నవలలపై అధ్యయనం చేయడం జరిగింది. కాని నాకు తెలిసినంత వరకు స్వాతంత్ర్యానికి పూర్వం సాంఘిక నవల్లో పాశ్చాత్య భావజాలానికి లోనైన రచనల్ని అలాగే ప్రాచీన భారతీయ వైభవాన్ని, భారతీయ సంస్కృతీ వారసత్వాలను నిరూపించే ప్రయత్నంతోపాటు ఇక్కడి కుటుంబ సంబంధాలు, సామాజిక సంబంధాల లోని గాఢతను నిరూపించే దిశగా ప్రయత్నం చేసినట్లు కనబడలేదు. ఇందులో నేను పాశ్చాత్య సాంగత్యం వల్ల ఇక్కడి కుటుంబ, సామాజిక సంబంధాలలోని మానవీయ విలువలు ఏ మేరకు ప్రభావితం కాబడ్డాయో అధ్యయనం చేశాను. అప్పటి సామాజిక, వ్యక్తిగత, నైతిక సంబంధాలలోని కాంతి కిరణాల్ని, చీకటి కోణాల్ని విపులంగా పరామర్శించాను.

ప్రాచీన భారతీయ జీవన విధానం నుండి ఆధునిక జీవనం వరకు కుటుంబ, సామాజిక సంబంధాల చర్చలను 'సాంఘిక నవల' (1878 – 1947) ల నేపథ్యంలో చర్చించడం జరిగింది. ఈ పరిశోధనకు స్వీకరించిన నవలల్ని జాగ్రత్తగా పరిశీలిస్తే, నాటి సమాజానికి ప్రాతినిధ్యం వహించేటట్లుగా ఉన్నాయనిపించింది.

ఈ సిద్ధాంత వ్యాసాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించాను. అధ్యాయాల వారీగాను, ఫలితాంశాలను ఈ పరిశోధన చివరిలో పేర్కొన్నాను.

★★★

రెండవ అధ్యాయం

# తెలుగు సాంఘిక నవల

# మానవసంబంధాల పరిణామం

## 2.0 నవల – పూర్వరంగం:

పందొమ్మిదో శతాబ్ది ఉత్తరార్థం భారతదేశ చరిత్రలో చాలా ప్రధానమైనది. దేశంలో రాజకీయ, సాంస్కృతిక రంగాలలో గొప్ప మార్పులు వచ్చాయి. మద్రాసు, కలకత్తా, బొంబాయి నగరాలలో మూడు విశ్వవిద్యాలయాలు స్థాపించబడినాయి. వీటి ద్వారా నిర్ణయించిన సమయంలో ప్రణాళిక బద్ధంగా 'ఇంగ్లీషు చదువులు' పాశ్చాత్య సాహిత్య సంస్కృతులు దేశంలో వ్యాపించాయి. మేధావులయిన భారతీయ రచయితలందరూ పాశ్చాత్య సాహిత్య సంస్కృతులలో గల వైవిధ్యానికి ముగ్ధులైనారు. తమ భావాలను సృజనాత్మక శక్తిని తీర్చిదిద్దుకునేందుకు ఆంగ్లవిద్యను నేర్చుకున్నారు. ఇది ఒక సంధియుగం.

## 2.1 ఆంగ్లసాహిత్య ప్రభావం:

ఇంగ్లీషు చదువులు, పరిపాలనా పద్ధతులు, కొత్త పాతల కలయిక, సంఘర్షణల ద్వారా వారి బుద్ధి వికసించింది. ఈ కాలం నాటి రచయితలందరూ కాలానుగుణ ప్రభావాలకు లోనైనవారే, ఆంగ్లభాషా, సాహిత్యాలను నేర్చుకున్నవారే. ఆంగ్ల జీవన ప్రభావాలను ఒంటపట్టించుకున్నవారే, భారతీయ విద్యలు ముఖ్యంగా సంస్కృత బోధన పాఠశాలలో అక్కరలేదని, అసలు అవి బోధించే పాఠశాలలే అవసరంలేదని రాజారామోహనరాయ్ లాంటి సంస్కర్తలు బ్రిటీష్ గవర్నర్ జనరల్ కు లేక కూడ రాసారు. కేవలం ఆంగ్లవిద్య మీద 'ప్రేమ' తోనే ఇది జరిగినట్లు తెలుస్తుంది.

పాశ్చాత్య పద్ధతుల్లో, ఆంగ్లవిద్యను నేర్చుకునే క్రమంలో విద్యార్థులు అధికసంఖ్యలో విశ్వవిద్యాలయాల్లో చేరినారు. ఈ విద్యవ్యాప్తి వల్ల భారతీయుల ఆలోచనల్లో తీవ్రమైన మార్పువచ్చింది. ఆంగ్ల విద్యా సాంగత్యంలో మనదేశంలో విద్యావిధానములో గణనీయమైన మార్పులు వచ్చాయి. చదువుకొనే పద్ధతిలో చాలా మార్పులు కనిపించాయి. 'ముద్రణ' కూడా ఈ మార్పుకు తోడైంది. దీని సాయంతో వచన రచనాభివృద్ధి' కూడ ఎక్కువ అయింది. మౌఖిక విద్యకు కాలం చెల్లినట్లేనని అందరూ అభిప్రాయపడ్డారు. దీనితో ఆంగ్లేయుల ఆలోచనలు నిజమయ్యే పరిస్థితులు కనిపించాయి. అప్పటివరకు విద్యను అభ్యసించడం ద్వారా ఇక్కడి

మేధావులు భారతదేశ సనాతన సాంప్రదాయాలు సంస్కృత వారసత్వాల గురించి గొప్పగా చెప్పుకునేవారు. బ్రిటీష్ వారి ఆధిపత్య భావజాలాన్ని లెక్కజేయని పరిస్థితి ఉండేది. కానీ ఆంగ్లవిద్య ద్వారా బ్రిటీష్ వారు ఊహించిన దానికంటే భిన్నంగా అనేకమంది దేశీయ మేధావులు పాశ్చాత్య విద్యను అభ్యసించేందుకు మొగ్గు చూపడం ఆంగ్లేయుల సంతోషానికి కారణమైంది. దీనిద్వారా భారతదేశములో సాహిత్యములో సంఘములో విప్లవాత్మక మార్పులకు మార్గం సుగమమైంది.ఈ మార్పు ముందుగా బెంగాల్ లో ఎక్కువగా కనిపించింది.

## 2.2 పత్రికల తోడ్పాటు:

పాశ్చాత్యుల సంపర్కము వంగదేశమునందు ఎక్కువగా ప్రభావము చూపెట్టింది. దీనితో పాశ్చాత్య విద్యావ్యాప్తికి, నవీన భావాలను ప్రసారం చేసేందుకు 'భాషా పత్రికలు' కూడా తోడ్పడ్డాయి. 1821 డిసెంబరులో రాజారం మోహన్ రామ్ ''సంబాద్ కౌముది'' అనే పత్రికను స్థాపించి, నూత్నభావాలను ప్రచారం చేయడం మొదలుపెట్టాడు. భారతీయులు స్వయంగా మొదలుపెట్టిన మొదటి దేశ భాషా పత్రిక ఇదే. తర్వాత మద్రాసులో కూడ గాజుల లక్ష్మీ నర్సు సెట్టిగాడు 'క్రీసెంట్' అనే ఆంగ్లపత్రికను స్థాపించారు. ఇది ప్రథమంగా జాతీయతను పెంపొందించేందుకు కుంఫిణీ పరిపాలనలో జరుగుతున్న అన్యాయాలను విప్పిచెప్పేందుకు కృషి చేసింది.

## 2.3 తెలుగు సమాజంపై పాశ్చాత్య ప్రభావం:

1871లో కొక్కొండ వెంకట రత్నం పంతులుగారు , 'ఆంధ్ర భాషా సంజీవని'ని స్థాపించారు. 'వివేకవర్థిని'ని 1874లో కందుకూరి మొదలుపెట్టారు. ఇంకా ఎందరో పండితులు, పత్రికలను నడిపినారు. పందొమ్మిదో శతాబ్ది ఉత్తరార్థం భావ విప్లవానికి ఇలాంటి పత్రికలెన్నో దోహదపడ్డవి. ఈ పత్రికల్లో కొన్ని కేవలం పాండిత్య ప్రదర్శాలకే నిలవగా, మరికొన్ని పాశ్చాత్య సంపర్కం వల్ల వచ్చిన జ్ఞానాన్ని వివరించేవిగా ఉన్నవి. స్వదేశీయులతో పాశ్చాత్య విజ్ఞానవ్యాప్తిని పెంచి, భావ విప్లవాన్ని, సాధించారు. ఆంగ్ల ప్రభువులు, భావ విప్లవం ద్వారా భారతీయులందరికీ పాశ్చాత్యీకరణ చేసేందుకు ప్రయత్నిస్తున్న ఆంగ్లేయులకు, ఆ పని ద్వారా సాధ్యం కాలేదు. ఎందుకంటే తమ సంస్కృతిని భారతీయులపై ప్రసరింపజేసేంతగా పాశ్చాత్య దేశస్థులైన ఉపాధ్యాయులు అప్పుడు లేకుండిరి. కాబట్టి పాఠశాలలో ఆంగ్లభాషా సాహిత్యాలను చేర్చిరి. దీన్తో 'ఇంగ్లీషు చదువులు' మనదేశంలో ప్రారంభమైనవి. పాఠశాలలో ఆంగ్లవిద్యను నేర్చుకుంటున్న విద్యార్థుల భావవ్యాప్తికి గ్రంథాలయాలు కూడా స్థాపించిరి. పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు ఉచిత భోజన వసతిని కూడ కల్పించినారు. ఐదవయేట బడిలో

వేసి పన్నెండయేట పనులకై బయటికి పంపించేవారు. క్రైస్తవమతమును స్వీకరించిన భారతీయ బాలబాలికలకు 1792లోనే క్రైస్తవ విజ్ఞాన ప్రసార సమితివారు పాఠశాలను స్థాపించారు. క్రమక్రమంగా విద్యావ్యాప్తి పెరిగింది.

1784లో విలియం జోన్స్ కృషి ఫలితంగా 'ఏషియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్' స్థాపించబడెను. దీన్తో పాటు 'ఏషియాటిక్ రీసెర్చెస్' అనే పత్రిక కూడ ప్రారంభమైంది. ఈ సంస్థ పాశ్చాత్య పరిశోధన పద్ధతులను 'ప్రాచ్య విషయముల పరిశీలనకు వినియోగించి, దేశములో సృజనాత్మక పరిశోధనకు నాంది పలికింది. పాశ్చాత్యులలో సన్నిహితంగా ఉండే, దేశీయ ప్రభువులు 'ఇంగ్లీషు చదువు'ను వ్యాప్తి చేసే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఆయా జమిందారుల సహకారంతో ఏర్పడిన ఆంగ్ల పాఠశాలల్లో లెక్కలు రాయడం, చదవడం, క్రైస్తవ మత సిద్ధాంతాలను నేర్పేవారు.

తర్వాత నెమ్మదిగా ఆంగ్లవిద్య పాఠశాల స్థాయిలో దేశంలోకి ప్రతి ఇంటా వ్యాపించింది. ఆంగ్లవిద్యతో పాటు పాశ్చాత్య విజ్ఞాన శాస్త్రమును కూడ నేర్చుకోవాలనే కోరిక అప్పటి విద్యాధికులలో కనిపించింది. 'ఇంజనీరింగ్' చదువు గురించి ఆలోచన మొదలైంది. క్రమంగా ఉన్నత విద్యలో విజ్ఞాన శాస్త్రమునకు సంబంధించిన విషయాల గురించి ప్రజలలో అవగాహన తీసుకువచ్చేందుకు కంపెనీ వారు ప్రణాళికలు వేసారు. పాఠ్యగ్రంథ ప్రకటనలు, దేశీయ సాహిత్యాభివృద్ధికై కూడ ఆంగ్ల ప్రభుత్వం ప్రయత్నించింది. అంతేగాక దేశభాషలలో విజ్ఞానాత్మక గ్రంథ రచనకు కూడా ప్రోత్సాహం లభించింది కానీ, ఆంగ్లవిద్యనేర్చిన చాలామందికి దేశీయ భాషల్లో పాండిత్యం లేకపోవుటచే ఆంగ్ల గ్రంథాలను దేశీయ భాషల్లోకి అనువాదం చేసే కుతూహలము చాలా తక్కువమందికి ఉండెను.

'ఆంగ్లభాష'ను లోతుగ అధ్యయనం చేసినప్పటికీ, దేశం నలుమూలలా వీరి సంఖ్య తక్కువే కావడంవల్ల ఆయా దేశీయ భాషల్లోకి ఆంగ్ల సాహిత్యాన్ని అనువాదం చేయిద్దామనుకున్న ఆంగ్లేయులకి ఆంగ్లభాషా పట్టభద్రులు అయిన దేశీయులకు దేశభాషా పాండిత్యం తక్కవగా ఉండడమనేది రుచించలేదు. దీని కారణంగా ఆంగ్లసాహిత్యం ఆయా దేశీయ భాషల్లోకి వేగంగా ప్రసరింప లేకపోయింది.

క్రమేపీ ఆంగ్లవిద్యా ప్రభావము కంపెనీ వారి చిత్తశుద్ధి, భారతీయుల ఆంగ్లభాషా శక్తి – ఇంగ్లీషు చదువులను దేశం నలుమూలలా వ్యాపింపచేసినవి. పాఠశాలల స్థాయి నుండి సంస్కృతీ, సభ్యతల వరకు 'ఆంగ్లం' వ్యాపించింది. జాతీయ, పాశ్చాత్య భావముల సంఘర్షణ, సాహిత్యాల సంఘర్షణ వైవిధ్యాలను, దేశీయులపై తీవ్ర ప్రభావాన్ని చూపెట్టాయి. సాంఘిక

రంగమున సంస్కరణాభిలాష భావనారంగమున విపరీతమైన స్వేచ్ఛ, భాషా విషయంలో సరళ పద ప్రయోగం సాహితీ రంగంలో నూతన ప్రక్రియల కల్పన.  ఇవన్నీ ఆంగ్లభాషా సాహిత్య ప్రభావముతో దేశములోకి చొచ్చుకొని వచ్చిన మార్పులు.సాహిత్యంలో నూతనంగా పరిచయమౌతున్న ప్రక్రియల్లో 'నవల' ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.  ఆంగ్లభాషా సాహిత్య ప్రభావంగానే తెలుగు సాహిత్యంలో కూడ 'నవల' పుట్టింది.[1]

## 2.4 నవల నిర్వచనం:

'నవల' ఎలాంటి కట్టుబాట్ల నుండి పుట్టక సొంత అస్తిత్వంతో, సొంతగొంతుకతో, విస్తృతమైన ప్రజల జీవన విధానాల్లో మార్పుతెచ్చేందుకు, వారి జీవిత విధానాలను, సమాజ ప్రతిరూపాల్ని నిరూపించేందుకు పుట్టింది.  అయినా నవలను నిర్వచించే ప్రయత్నం కొంతమంది పాశ్చాత్య విమర్శకులు చేసారు.  ''వచనంలో రచించబడిన హాస్యాత్మక ఇతిహాసం'' – హెన్నీఫీల్డింగ్, 'మధ్య తరగతి ప్రపంచం యొక్క ఇతిహాసం' – హెగెల్.  ''జీవితానికి పాతినిధ్యం వహించే ప్రయత్నమే నవల ఆవిర్భావానికి ఏవైన కారణం – హెన్రీ జెమ్స్.  'నవల కథ చెప్తుంది' – ఈ.ఎమ్. పోర్ స్టర్.  ''నవల అంటే సమకాలీన వాస్తవిక జీవితాన్ని 'సత్యం ప్రదాయాలను చిత్రించే సాహితీ ప్రక్రియ' – క్లారారీవ్.  'నవలలు ఒకవైపు ఆసక్తికరంగానూ, మరొకవైపు వాస్తవికంగానూ ఉండేందుకు అసాధారణ, సాధారణ విషయాల మధ్య ఏ విధంగా సమన్వయించాలన్నదే రచయిత ఎదుర్కొనే సమస్య – థామస్ హార్డీ.  'నవల తత్కాలాన్ని ప్రతిబింబించే అద్దం వంటిది'..... ఈ అద్దం ఆ యుగపు బాహ్య స్వరూపాన్నే కాక, అంతరంగాన్ని కూడా ప్రతిఫలింప జేస్తుంది – వాల్లర్ అలినె''[2]

ఇలా పాశ్చాత్య విమర్శకులు నవలను నిర్వచించే ప్రయత్నం చేసారు.  పాశ్చాత్యుల విమర్శల ఆధారంగా నవలను ఇలా నిర్వచించవచ్చు.  నవల వ్యక్తి యొక్క అంతరంగాన్ని విశ్లేషిస్తుంది.  వ్యక్తికి సమాజం పట్ల ఉన్న బాధ్యతను గుర్తుచేస్తుంది.  అతని వ్యక్తిగత, కుటుంబ, సామాజిక, నైతిక, విలువల్లోని గుణదోషాలను వివరిస్తుంది.  వ్యక్తికి, సమాజానికి మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తుచేస్తుంది.  వ్యక్తికి, సమాజాల సంప్రదాయాలను, సంస్కృతీ, వారసత్వాలను నిలబెట్టే ప్రయత్నం చేస్తుంది.  కాలానుగుణంగా మారుతున్న జీవన విలువలను గుర్తించి, వాటిని తనలో పొందుపరుచుకొని వ్యక్తిని, సమాజానికి విలువలను గుర్తించి, వాటిని తనలో

[1] తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషు ప్రభావం, పు: 393 – 418.

[2] తెలుగు సాంఘిక నవల – కథాకథన శిల్పం, పు. 2 – 6.

పొందుపరుచుకొని వ్యక్తిని, సమాజానికి చైతన్య పరుస్తుంది. సాంఘిక ఆచార వ్యవహారాలను వ్యాఖ్యానిస్తుంది. సమాజంలోని అన్ని రకాల వర్గాల ప్రజల జీవితాలను విశ్లేషిస్తుంది. అణచివేయబడుతున్న ప్రజల పక్షాన నిలబెడుతుంది. పాఠకుడి ఆలోచన స్థాయిని పెంచుతుంది. జీవితాన్ని చైతన్యవంతంగా, ఆనందంగా, రసాత్మకంగా, అనుభవించేందుకు దారి చూపుతుంది. రాబోయే తరాలకు చక్కని మార్గదర్శకత్వం వహిస్తుంది. వర్తమాన జీవితాలను, జీవన విధానాలను, వ్యక్తిగత, సామాజిక, నైతిక, ఆధ్యాత్మికత లాంటి పలు రంగాలను చిత్రీకరించి – రాబోయే తరాలకోసం 'రికార్డు' చేస్తుంది.

## 2.5 నవల స్వభావం:

ఆధునిక సాహిత్యం విస్తృతమైన ప్రక్రియా వైవిధ్యం గలది. ఈ విస్తృత పాశ్చాత్య సాహిత్య ఆధ్యయనం వల్ల కల్గింది. ఆంగ్లంలో కాల్పనిక సాహిత్యాన్ని 'Prose Fiction' అంటారు. ఈ కాల్పనిక సాహిత్యంలో కథ, నవల లాంటివి వస్తాయి. ఈ సాహిత్యం భౌతిక జీవనం, మనో జీవనం, ఆధ్యాత్మిక జీవనాల ద్వారా వ్యక్తమౌతుంది. రచయితకు ఆయా జీవన విధానాల పట్ల ఉన్న అవగాహన, పరిశీలన, దృక్పథాల ఆధారంగా సృజింపబడుతుంటుంది.

నవల విస్తృత పరిధి గల సాహితీ ప్రక్రియ. ఇది జీవితంలోని వివిధ కోణాలను దర్శింపజేస్తుంది. విస్తారమైన, సంక్లిష్టమైన వ్యక్తుల, సమాజపు జీవన చిత్రాలను స్పష్టంగా లోతుగా అధ్యయనం చేసి చిత్రించేందుకు ఆధునిక సాహితీ ప్రక్రియల్లో 'నవల' అగ్రస్థానంలో ఉంది. చారిత్రక, రాజకీయ, ఆర్థిక, సామాజిక, ఆధ్యాత్మిక, నైతిక, తాత్విక, మనస్తత్వాలన్నిటినీ ఇది చిత్రించగలదు. నవల సమగ్ర మానవ జీవన చైతన్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఆత్మాశ్రయం, వస్త్వాశ్రయ రూపాల్లో సాహితీ సృజన జరుగుతుంది. నవల ప్రధానంగా వస్త్వాశ్రయం, విస్తృత సామాజిక జీవితాన్ని, తన రచనకు భూమికలు తీసుకున్నప్పుడు రచయితకు వస్త్వాశ్రయరీతియే కుదురుతుంది. దీనివల్ల రచయిత ఆలోచనలు స్ఫుటంగా ప్రకటితమౌతాయి. సమాజము యొక్క అన్ని రకాల చైతన్యాలను నిరూపించే అవకాశం రచయితకు నవలా రచనలో సులువౌతుంది. ఆధునిక జీవితం లాగానే ఆధునిక సాహిత్యం కూడా క్లిష్టమైనది. మానవుని జీవితానికి సంబంధించిన వ్యక్తిగత, కుటుంబ, సామాజిక, భౌతిక, ఆధ్యాత్మిక జీవితాలకు సంబంధించిన రచనల సృజనలో రచన విస్తృతంగా కొత్త కొత్త రచనా పద్ధతుల్ని తన 'కథాక్రమం' లో కూర్చి తాను ఆశించిన ప్రయోజనం, పాఠకులను చేరేలా రచయిత తీవ్రంగా శ్రమించాల్సి ఉంటుంది. నవలా రచయిత చైతన్యశీలి కావడం ప్రధానం. సమాజంలోని వివిధ సమస్యల్ని, వివిధ రంగాల్ని, అనేక వ్యక్తుల వ్యక్తిత్వాల్ని వివిధ కోణాల ద్వారా చిత్రించే విస్తారమైన వేదిక నవలలో కనిపిస్తుంది.

వివిధ పాత్రలు, సన్నివేశాలను సృష్టించి జీవితాన్ని విశ్లేషించి వ్యాఖ్యానిస్తుంది నవల. అనేక పాత్రల ప్రవేశంతో సామాజిక, చిత్రణ చేస్తూ, వ్యక్తికీ, సమాజానికి మధ్య ఉన్న సంబంధాల్ని నిరూపిస్తుంది. పాత్ర చిత్రణలో నవలాకారునికి ఎక్కువ స్వాతంత్ర్యం ఉంటుంది. తానుద్దేశించిన జీవితాలను, సిద్ధాంతాలను, భావాలను రచయిత ఆయా పాత్రల రూపంలో యథేచ్ఛగా చెప్పించవచ్చు. మిగతా ప్రక్రియల్లో ఇంత వెసులుబాటు ఉండదు. పాత్రల అంతరంగాన్ని కూడా సూక్ష్మాతిసూక్ష్మంగా చిత్రించవచ్చు. పాత్రలచే తన అభిప్రాయాలను చెప్పిస్తూ పాఠకులకు సరిగ్గా అర్థంకాలేదని అనుకుంటే, అవే అభిప్రాయాలను రచయితగా తానే దూరి విశ్లేషించే అధికారం కూడ రచయితకు నవలలో కనిపిస్తుంది. సామాజిక జీవితాన్ని, వర్తమాన పరిస్థితుల్ని తన 'కోణం'లో వివరిస్తూ తన భావజాలాలను బలంగా పాఠకులపైకి ప్రసరింపజేయగలడు.

## 2.6 నవల నిర్మాణాంశాలు:

నవలలో సంభాషణలు, సంఘటనలు, కవితాత్మక శైలి, ఉండడంతో నవల బహుముఖాలతో పాఠకుల్ని ఆకర్షిస్తుంది. విస్తారమైన జీవిత వ్యాఖ్యానము. అనేకమైన సంఘటనలు, క్లిష్టతతో కూడిన అన్వయాలు, హృదయం ఉప్పొంగే, మనసుల్ని చైతన్యపరిచే సంభాషణలు, సంఘటనలను, అత్యంత ప్రతిభావంతమైన కవితాత్మకశైలిలో, రచయిత యొక్క పూర్తి సామర్థ్యాన్ని, భావాలని, ఆలోచనలని తీవ్రతలను, గాఢతలను, సమాజాభ్యుదయాన్ని, మానసిక, ఆధ్యాత్మిక జీవితాల్లోని అనంతపొరలను విశ్లేషించేందుకు పుట్టిన 'నవల' ఆధునిక సాహిత్యంలో అత్యంత గౌరవాన్ని సంపాదించుకున్నది.

జీవితాన్ని వ్యాఖ్యానించేది నవల – నవలలో అనేక సంఘటనలను, సన్నివేశాలను చిత్రించినంత మాత్రాన నవల కేవలం 'కల్పన' కాదు. నవల మానవుని యథార్థ జీవితాన్ని, లోతుగా, సూక్ష్మంగా అర్థం చేసుకొని అత్యంత ప్రతిభావంతంగా వ్యక్తీకరిస్తుంది. కాల్పనికత ధోరణులతో నవల సాగినా, ప్రధానంగా నవలలో నిరూపితమయ్యేది వాస్తవిక జీవనమే.'నవల' ప్రాచీన సాహిత్యంలోని అలౌకికతను, శృంగారాన్ని, విపరీత మానవ పోకడలను, రాజాస్థానాలను, మూఢనమ్మకాల్ని వదిలించుకొని, ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పోరాటాల్ని, విప్లవాల్ని, ఆధునిక భావజాలాన్ని ఆకళింపు చేసుకొని, కొత్తరూపాన్ని, సారాన్ని సంతరించుకొంది.

ముద్రణాయంత్రం యొక్క ఆవిష్కరణతో ప్రపంచంలోని సాహిత్యమంతా అందరికీ అందుబాటులోకి వచ్చింది. అప్పటివరకు 'మౌఖికంగా' ఉండే చదువు నిరాదరణకు గురైంది. ప్రపంచ సాహిత్యం అంతా పుస్తకాల రూపంలో అందరికీ అందుబాటులోకి వచ్చింది. దాన్తో పాటే

'విద్య' కూడ మధ్య తరగతి వారి దగ్గరికి చేరింది. పూర్వ సాహిత్యమంతా రాజులు, దేవుళ్ళ కీర్తనలతో, కర్తనలతో, పై వర్గాల వారి సమస్యలే ప్రధానంగా నిర్మించబడేవి. మధ్య తరగతి, కింది తరగతుల ప్రమేయం ప్రాచీన సాహిత్యంలో తక్కువ. కానీ, మధ్య యుగంలో జరిగిన అనేక విప్లవాత్మక మార్పులు, పురుడుపోసుకున్న భావజాలాలు చదువుకున్న మధ్యతరగతి ప్రజలు తమ జీవితాలను ప్రతిబింబించే, నిరూపించే, సృజన రూపం కోసం అన్వేషించారు. సులువుగా అర్థమయ్యేందుకు గాఢంగా ప్రభావం చూపేందుకు విస్తారమైన జీవితాన్ని పరిచయం చేసేందుకు, సూక్ష్మ అనుభవాలను నిరూపించేందుకు సమాజం యొక్క మూలమూలలా, ప్రతివ్యక్తి దగ్గరికి అత్యంత 'చనువు'గా పుట్టిందే నవల. మధ్య తరగతి జీవుల హృదయ సంవేదన నవల, ప్రాచీన సృజన సాహిత్యంపై గొప్ప తిరుగుబాటు నవల. లోకోత్తమైన అనుభవాల్ని, ఆలోచనలను, సగటు మనిషికి అందించింది నవల. వ్యక్తి లోపట బయట జరిగే నిత్య సంఘర్షణలకు వ్యాఖ్యానం నవల. ఆధునిక సాహితీ ప్రక్రియలను ఎత్తిన గొడుగు నవల. జీవితానికి ప్రతిబింబం నవల.

## 2.7 నవలల్లో సామాజిక వాస్తవికత:

నవల జీవితాన్ని ఉన్నది ఉన్నట్టుగానే వ్యాఖ్యానించడం జరుగదు. ఉన్నది ఉన్నట్లుగా వివరించేది వార్త. వాస్తవమైన జీవితాన్ని వ్యాఖ్యానించినా 'ఉన్నతీకరణ' చేసే ప్రయత్నం చేస్తుంది నవల. యదార్థమైన జీవితంలో ఎన్నో అంసబద్ధమైన సంఘటనలు జరుగవచ్చు. అనేకమైన విషయాలు ఎప్పటికప్పుడు పునరావృతం అవుతాయి. ఎప్పుడో కానీ, జీవితంలో 'గొప్ప మార్పు' రాకపోవచ్చు. జీవితాల్ని చిందరవందర జేసే సంఘటనలు అనేకంగా ఉండొచ్చు. జీవితాన్ని తీర్చిదిద్దుకునే అవకాశం ఉన్నవీ ఉండొచ్చు. అయితే జీవితానికి సంబంధించిన ఏ పార్శ్వాన్నైనా దాని మూలాన్ని, సారాన్ని గ్రహించి నేర్పుతో రచయిత సృజన చేయాల్సి ఉంటుంది. వాస్తవికతకు దర్పణం నవల అంటే అర్థమిదే, జీవిత సారాన్ని గ్రహిస్తూనే, మానవ సమాజానికి కొత్త జీవితాన్ని, ఉన్నతమైన విలువల్ని, మానవీయ కోణాల్ని, ఉత్తమ సంస్కారాన్ని, సామాజిక చైతన్యాన్ని, ఆధ్యాత్మిక చింతననూ, కళాత్మకంగా చిత్రిస్తుంది. నవలలో రచయిత వ్యక్తం చేసిన, నిరూపించిన జీవిత సత్యాలు, నిజ జీవితంలోని వాస్తవాల కంటే ఉన్నతమైనవి. వ్యక్తి జీవితాన్ని, సామాజిక జీవితాన్ని వాస్తవ జీవితం కంటే 'ఉదాత్తంగా' ఉండే విధంగా సృజన చేయడం నిజమైన సృజనకారుడి లక్ష్యం.

నవలాకారుడు తానుంటున్న సమాజంలోని సంఘటనలపై స్పందిస్తాడు. ఆయా సంఘటనల ద్వారా వ్యక్తులకు గానీ, సమాజానికి జరిగే లాభనష్టాలపై తనకున్న

విశేషానుభవంతో ఒక సూత్రానికి వస్తాడు. ఆ సూత్రం ఆధారంగా సామాజిక మార్పులకు తన నవలను వేదికగా చేస్తాడు. ఇందులో నవల కావడం తాను కోరిన సామాజిక, మానవీయ మార్పుల కోసం, తాను సృష్టిస్తున్న పాత్రలతో సన్నివేశాలలో తీవ్రంగా ఘర్షణ పడతాడు. తాను భావిస్తున్న మార్పుకోసం, ప్రతి పాత్రను చాలా 'పకడ్బందీగా చెక్కుతాడు. అలాకాకుండా రచయిత భావన గాఢంగా లేక పాత్రచిత్రణ కళాత్మకంగా ఉన్నా కూడా రచయిత శ్రమంతా తేలిపోయే ప్రమాదం ఉంది.

*''ఒక రచయిత గ్రంథంలో పాత్రల ప్రవర్తన పూర్తిగా, సరిగా వివరించబడినా, ఆ పాత్రలు సజీవంగా ఉండవు. అలాంటి పొరబాట్లను బయటపెట్టాలి. తాను రాసే గ్రంథం తనలో ఒక పరిపూర్ణ భాగం అని రచయిత భావించని పుస్తకాలు, తన రచనకు ప్రసవవేదన లాంటి శ్రమను పడని పుస్తకాలు – రచయిత ఉద్దేశ్యాలయినప్పటికి కూడా సాధారణంగా అవి చాలా తక్కువరకం పుస్తకాలవుతాయి. అలాంటి రచయిత తన పాత్రను తెలిసికోలేడు. వాటిని అర్థమూ చేసుకోలేడు.''*[3] కాబట్టి జీవితంలో ప్రతీ అంగుళాన్ని స్పృశించదలచిన రచయిత సమాజంపై గాఢమైన ప్రభావాన్ని చూపుతాడు. సమాజంలోని అన్ని కోణాలను ఎవ్వరూ పట్టుకోలేదు. ''రచయిత దేనిపై బడితే దానిపైన ఎవరిపైబడితే వారిపైన రాయలేడు. విషయాన్ని ఎన్నుకోడంలోను, పాత్రలను ఎన్నుకోవడంలోను, ప్రతి రచయితకూ ఒక పరిమితి వుంది. ప్రతి రచయితకూ, అతడందరికన్నా గొప్పవాడైనా, కొన్ని అడ్డుగోడలున్నాయి. నవలా రచయిత యొక్క రచన అతను నివసించే సమాజం చేత నిశ్చయింపబడుతుంది.'' తను 'ఎరిగిన' ప్రపంచాన్ని తను కోరుకున్న రీతిలో చిత్రించేందుకు రచయిత శ్రమిస్తాడు.

నవల ద్వారా పాఠకుడు విస్తారమైన జీవితానుభవాన్ని పొందవచ్చు. ఒక వ్యక్తి ఏకకాలంలో అనేకమంది వ్యక్తిత్వాలను అంచనావేయలేకపోవచ్చు. కానీ, ఒక మంచి నవలను చదవడం ద్వారా ఆ పాఠకుడు నవలలోని పాత్రల మనస్తత్వాలను సునాయసంగా అర్థం చేసుకుంటాడు. దాన్ని ఆధారంగ చేసుకొని నిజజీవితంలోని వ్యక్తులను పరిచయం చేసేందుకు రచయిత తన అంతరంగంలో, బయటా అత్యంత చైతన్యవంతుడిగా ప్రతిభాశీలి అయ్యుండాలి. రచయిత తన జీవితకాలంలో చూసిన సంఘటనలను, ఎదుర్కొన్న మనుష్యులను వారి మనస్తత్వాలను, ప్రకృతి రమణీయతను, భీభత్సాలను సామాజిక వైఫల్యాలను, అభివృద్ధిని – మొత్తం నవలలో నిక్షిప్తం చేస్తే – పాఠకుడు నింపాదిగా చదువుకొని అర్థం చేసుకొంటాడు. కానీ,

[3] రచయితా శిల్పము. పు: 12.

ఇక్కడ పాఠకుడు కూడా తన అవగాహనా పరిధిని పెంచుకొంటేనే ఇది సాధ్యం. లేకుంటే 'రచయిత ఉద్దేశించినది' ఒకటి. పాఠకుడు జీర్ణించుకున్నది వేరొకటి అయితే రచయిత శ్రమ వృథా అయినట్లే– ఈ రకంగా సమాజాన్ని వ్యక్తికి అత్యంత తక్కువ సమయంలో పరిచయం చేస్తుంది నవల – సమాజ పరిశీలన – అవగాహనలకు 'నవల' ఒక దిక్సూచి లాంటిది.

పాఠకుడు 'నవల'ను అర్థం చేసుకునే క్రమంలో తాను సామాజిక బాధ్యతను తీసుకోవచ్చు. ఆత్మవిమర్శ చేసుకోవచ్చు. సమాజం పట్ల వ్యక్తులపట్ల అవగాహన పెంచుకోవచ్చు. నవల సామాజిక న్యాయాన్ని, నీతుల్ని ప్రదర్శిస్తుంది. సమకాలీన సమస్యలపై స్పందిస్తుంది. రచయిత పాఠకున్ని చైతన్య పరుస్తాడు. *''రచయితలు ప్రజల గురించి ప్రజలు వ్రాస్తారు''*[4] జీవితం నవల లాంటిది. నవల జీవితం లాంటిది. అనడంలో ఉద్దేశం నవల జీవితమంత విశాలమైనది, లోతైనది అనీ కాబట్టి అంతలోతైన జీవితాన్ని, ఆ జీవితంలోని సంఘర్షణని, చైతన్యాన్ని మానవీయ విలువల్ని, చిత్రించాల్సిన బాధ్యత నవలపై ఉంటుంది. ఈ రెండూ పరస్పర ఆధారాలు. నవలలో జీవితాన్ని సరియైన అంచనాతో చూడగలుగుతారు. ఎందుకంటే నవల ద్వారా రచయిత 'సామాజిక బాధ్యత'ను నిర్వహిస్తున్నాడు. కాబట్టి ఆ నవలలో జీవితం యొక్క ఉదాత్తత కనిపిస్తుంది.

అనుభవజ్ఞుడైన రచయిత – సామాజిక చైతన్యాన్ని కలిగించే రచన చేస్తాడు. సమాజంలోని వర్తమాన పరిస్థితులకి స్పందించి – వ్యక్తుల హృదయాల్ని స్పృశించి రచన చేస్తాడు. నవలా రచయితకు ఇతర ప్రక్రియలలో లాగ ఎలాంటి నిర్మాణ సూత్రాలు అవసరం లేదు. నియమాలూ వర్తించవు. తనకున్న స్వాతంత్ర్యంతో తాను ఏ వర్గాన్ని ఉద్దేశించి సృజన చేయదలిచాడో – ఆ వర్గపు ఆలోచనలను, ఆశయాలను క్రమపద్ధతితో పేర్చి – సాంఘికాభివృద్ధి, సహజీవనంతో సామరస్యంతో ఉదాత్తరీతిలో 'సమాజ నిర్వహణ' జరిగేందుకు తాను 'రచనా ప్రణాళిక' వేసుకొని రచన చేస్తాడు. జీవితం నుండే కథా వస్తువును తీసుకుంటాడు. కాబట్టి, రచయిత – పాత్రచిత్రణ – కథానిర్వహణలో, సన్నివేశ కల్పనలో తగినంత జాగ్రత్త తీసుకుంటాడు. సాహిత్యానికి ప్రయోజనం – ఆనందం, ఉపదేశం అని పూర్వ ఆలంకారికులు చెప్పారు. ప్రాచీన సాహిత్యంలో ఉపదేశం కన్నా 'ఆనందం' పాలు కాస్త ఎక్కువగానే ఉంది. ప్రసిద్ధ రామాయణ, భారత, భాగవతాలు మినహా కావ్యాలు, ప్రబంధాలు, పద్య సాహిత్యం చాలా మట్టుకు ఆనందమే ప్రయోజనంగా ఉండేది. ప్రాచీన సాహిత్యాల్ని అగ్రవర్ణాల, ధనికవర్గాల

[4] రచయితా శిల్పము , పు: 14

సాహిత్యంగా చెప్పడం వల్ల ఆయా వర్గాలను సంతృప్తి పరిచే సాహిత్యమే అప్పుడు వచ్చింది. దానికి అనేక కారణాలున్నాయి. అది ప్రాచీన సాహిత్య లక్షణాల్లో ఒకటి.

## 2.8 నవల సామాజిక సంబంధాలు:

ఆధునిక సాహిత్యం పుట్టుకనే సంఘర్షణ నుంచి పోరాటాల నుంచి తిరుగుబాటుల నుంచి వచ్చింది. కాబట్టి, ఆ పోరాటవర్గ ప్రతినిధులకు – ప్రాతినిథ్యం వహించేది ఆధునిక సాహిత్యం. ఆ వర్గపు ప్రజలు తమ సామాజిక ప్రయోజనం నెరవేర్చుకునేందుకు, తమ జీవితాల్లోని, చీకటిని తొలచించుకునేందుకు – ఆదర్శవంతమైన, నీతివంతమైన జీవితాన్ని పొందేందుకు 'వాస్తవిక' స్థితిగతులకు అద్దం పట్టే రచనగా 'నవల'ను తమకు 'కాలక్షేపం'గా గాక 'దిక్సూచి'గా భావించి, ఆనందం కన్నా, ఉపదేశాన్ని కోరుకున్నారు. అయితే 'నవల' కేవలం 'ఉపదేశం' మాత్రమే ఇవ్వదు. ప్రాచీన సాహిత్యంలోన ఆనందం పాలు ఎక్కువ. ఇక్కడ ఉపదేశం పాలు ఎక్కువ. అప్పటి సాహిత్యానికి లక్ష్యప్రాయులు. ఇప్పటి సాహిత్యానికి లక్ష్యప్రాయులు. 'భిన్నమైన నేపథ్యం గలవారు కావడం గమనార్హం. సామాజిక ప్రగతికి దోహదం చేయడమే ఆధునిక సాహితీ ప్రక్రియలన్నింటి లక్ష్యం. వ్యాప్తి ఎక్కువగా ఉంది. కాబట్టి నవల దాని బాధ్యతను ఎక్కువగా మోస్తుంది.

నవల మానవ జీవిత దృశ్యాలను చిత్రీకరించడమే కాకుండా, సంస్కరణ దృష్టిని అవలంబించింది. పరిణామాత్మక సమాజంలో నిత్యం జరిగే మార్పులను నవల అందిపుచ్చుకుంది. ఆధునిక యుగ మానవుని నడక, నడతలను అవి జాగ్రత్తగా అంచనా వేస్తూ, ప్రతీ మలుపు దగ్గర తన 'కాంతి'ని ప్రసరిపంజేస్తూ, సమాజానికి నిజమైన ప్రతినిధిగా నిలబడింది. వినాశనాన్ని ఎంతగా అడ్డుకుందో, వికాసానికి అంతగా చేయూతనిచ్చింది. సమస్యలలోని క్లిష్టతను, నిదానంగా విప్పిచెప్పుతూ అక్కడక్కడా 'కఠినంగా' వ్యవహరిస్తూ – సంస్కరణ భావాల్ని అత్యంత నిర్మాణాత్మకంగా ప్రసరింప జేసింది నవల.

నవలా రచన ఉద్దేశం జీవితాన్ని చిత్రించడం దాన్ని విడమరిచి చెప్పడం. వ్యక్తికి, సమాజానికి వున్న పరస్పర సంబంధాన్ని విశ్లేషించడం, వాస్తవికత దృష్టిలో రచన చేయడం. వాస్తవికత అంటే యధార్థమని కాదు. ''*నవలల్లో ప్రతిబింబించే జీవితం తాలూకు వాస్తవికత, జీవిత సత్యం మాత్రమే. ఈ సత్యం వ్యక్తులది కానప్పుడు జీవితాన్ని ఎంత వివరంగా చిత్రించినా కూడా ఏమీ ప్రయోజనం ఉండదు.*''[5] నవలా రచయిత జీవిత యధార్థాన్ని అవగాహన చేసుకొని,

[5] 'సాహిత్య ప్రయోజనం, పు: 119

జీవిత సంఘర్షణను తన మనస్సుతో, భావనలతో ఐక్యపరిచి జీవిత సత్యాన్ని ఆవిష్కరింపజేయాలి. ఆ సత్యావిష్కరణమే సాహిత్యంలో వాస్తవిక చిత్రణ *''వ్యక్తుల జీవితాన్ని ప్రధానంగా తీసుకొని సామాజిక జీవితాన్ని స్ఫురింపజేసేది''*[6] గా ఇది ఉండాలి. వ్యక్తుల జీవితాల్ని దగ్గర్నించి పరిశీలించి, తన ఊహాబలంతో, కొత్త సంఘటనలను జోడించి, సామాజిక సంబంధాలతో ముడివేస్తూ రచన చేయడం దీనిలోని భాగమే. *''వాస్తవిక జీవితాన్ని గురించిన కాల్పనిక కథ''*[7] అని దీనిని భావించారు. పాత్రల వేష భాషల్ని, మనోభావాల్ని, చిత్రిస్తూ, మానసిక ప్రవృత్తుల్ని విశదీకరిస్తాడు.

రచయిత, నవల ఒక్క సంఘటనతోనైనా, అనేక సంఘటనలతోనైనా ఉండొచ్చు. అలాగే, నిర్దిష్ట కాలపరిమితి కూడ లేదు. సామాజిక పరిస్థితులను చిత్రిస్తూ తరతరాల కథల్ని ఇక్కడ వివరించవచ్చు. పాత్ర చిత్రణ, సంభాషణలు, కథాకథనం, సంఘటనలు వీటన్నిటి సమన్వయం నవలకు పరిపుష్టినిస్తాయి. గొప్పరచన, సార్వజనీన, సార్వకాలీనత అపాదించుకొంటుంది. అంటే ఇది *''ఏ మహా రచన అయినా మూడు భూమి కులాల్లో సువ్యక్తమౌతుంది. రచయిత రచనా వైలక్షణ్యం ఒకటి. తత్కాల చైతన్యంలోని ప్రధాన లక్షణాలన్నింటినీ ప్రస్ఫుటం చేయగల గాఢత్వం రెండోది. మూడోది దేశ కాలాలకు అతీతంగా మానవీయ చైతన్య లక్షణాలకు రూపుకట్టించేశక్తి''*[8] గా ఉండాలని విమర్శకులు మహారచన ఎలాంటి పరిస్థితుల్లో పుడుతుందో వివరించారు. *''ఈ విధమైన రచన పాఠకునిలో విజ్ఞానాన్ని, జిజ్ఞాసను, పెంచుతుంది. ఆనందంతోపాటు పాఠకుని యొక్క బాధ్యతను, అతనికి తన పట్లా, తన కుటుంబం పట్లా, దేశం పట్లా ఉన్న ప్రగాఢ సంబంధాన్ని తెలియజేస్తూ అతని విధి నిర్వహణను గుర్తుకు తెస్తుంది. వ్యక్తికి సమాజానికి, మధ్య గల అభేద్యమైన సంబంధాన్ని వివరిస్తుంది. ఇలా వ్యక్తుల సాంఘిక జీవనానికి ప్రతిబింబరూపమైన నవల''*[9]. సాంఘిక నవల, సమకాలీన సమాజంలోని వ్యక్తుల యొక్క జీవితాలకి విశ్లేషించి, వివరిస్తుంది.

*''పరస్పర విభిన్నాలయిన రెండు కార్యాలను నిర్వర్తించినప్పుడే మనం ఒక నవలను సాంఘిక నవల అంటాం. మొదటిది సమకాలీన సమాజాన్ని ప్రతిబింబించాలి. రెండవది సమకాలీన సమాజాన్ని ఎదిరించి నిలవాలి. అంటే — సమకాలీన సమాజాన్ని ప్రతిఫలిస్తూనే ఆ*

---

[6] తెలుగు నవల, నూరు సంవత్సరాలు, పు: 41

[7] తెలుగు నవలావికాసం, పు: 4

[8] సహృదయచక్రము, పు: 2

[9] తెలుగు నవలావికాసం, పు: 125

*సమాజ శ్రేయస్సుకు భంగం కలిగించే ఆచారాలను, సంప్రదాయాలను, సంఘవిద్రోహ శక్తులను ఎదిరించి నిలబడాలి. అంతేకాదు, స్థూల దృష్టికి కనబడని సామాజిక అంతఃశ్చైతన్యాన్ని ఆవిష్కరించాలి*''[10] కాబట్టి నవలా రచయితపై ఎంతో గురుతరమైన బాధ్యత ఉంది. అతనికి స్వాతంత్ర్యముతో పాటు, ఎంతో స్పష్టమైన, దీర్ఘమైన ఆలోచనా శక్తీ ఉండాలి. సమాజాన్ని పూర్తిగా అవగాహన చేసుకొని, వ్యక్తుల జీవితాల్లో పరకాయ ప్రవేశం చేస్తేనే గానీ ఈ విద్య అలవడదు. సాహిత్య ప్రక్రియల్లో నవల యొక్క పాత్ర మిక్కిలి గురుతరమైనది. ఇది ప్రజల సమాజం యొక్క పూర్తి నిడివి చిత్రాన్ని, అందులో భాగమైన అనేకరకాలైన వ్యవస్థల్నీ మనముందుంచగలదు. నవల పరిధి విశాలమైనట్టిది కాబట్టి ఇది ప్రజలకు ఆనందంతో పాటు, ఉపదేశాన్ని కూడ ఇవ్వగల స్తోమతను కలిగివుంటుంది. అలా రెండూ ఏ నవలలోనైతే ఇమిడి పోతాయో దాన్నే 'గొప్పరచన' గా భావించవచ్చు. సామాజిక చైతన్యాన్ని ఇది ఇంతలా వ్యక్తం చేయగలదు, వ్యక్తి జీవితంత ముడివేయబడి వుంది. కాబట్టీ ''*జీవితం నవల లాంటిది. నవల జీవితం లాంటిది*''[11] అని అన్నారు. మొదట తెలుగు నవల పాశ్చాత్య నవల ప్రభావంతోనే పుట్టింది. అయితే దేశంలో జరుగుతున్న వర్తమాన సంఘటనలకు ఆధారంగా చేసుకొని రచనలు వెలువడ్డాయి. పాశ్చాత్య సాహిత్యాన్ని అవగాహన చేసుకొనే సందర్భంలో, అక్కడి ప్రజల ఉద్యమాలు పూర్తిగా అర్థమవసాగాయి. తద్వారా దేశీయుల మనస్సుల్లో కొత్త కోణాలు విచ్చుకోసాగాయి. దేశంలో అప్పటికే పేరుకుపోయిన అనేక రకాలయిన దురాచారాలను ఖండించేందుకు ప్రయత్నాలు జరగసాగాయి.

ఇవన్నీ క్రమంగా సాహిత్యంలో ప్రతిఫలింపసాగాయి. తద్వారా జాతీయోద్యమం స్ఫూర్తితో, స్వాతంత్ర్యేచ్ఛను కోరి రచనలు వచ్చాయి. వీటితో పాటే ఇతరమైన సామాజిక ఉద్యమాల వల్ల రచనలు వచ్చాయి. వ్యక్తి వ్యక్తిగా తన కుటుంబంతో, బయటి సమాజంతో అనేక రకాలైన సంబంధాలను కలిగివుంటాడు. కుటుంబ వ్యవస్థలో ఉండే రకరకాల బంధుత్వాలతో మొదలైన వ్యవస్థల్లో వ్యక్తి యొక్క స్థానం బలీయమైంది. వ్యక్తి – వ్యష్ఠిగా, సమిష్ఠిగా వీరందరితోనూ సుహృద్భావం ప్రదర్శించాలి. వ్యక్తికి – సమాజానికి మధ్య ఉండే ఈ 'మానవ సంబంధాలు' అనేక రకాలుగా నిర్వచింపబడ్డాయి. వీటన్నిటిని తృప్తి పరుస్తూ వ్యక్తి, సమాజాభివృద్ధికి పాటుపడుతుండడం, ఆరోగ్యకరమైన సామాజిక సంబంధాలను పెంపొందింపజేస్తుంది. ఇలాంటి దశలోనే, కొందరు దానికి ఆ వ్యక్తితో గల విపరీతమైన

---

[10] నవలావిమర్శ, పు: 11

[11] రచయితా – శిల్పమూ, పు: 80

మానసిక ప్రవర్తననో, కుటుంబ పరిస్థితులో, సమాజమో ఏదో ఒకటి కారణమయ్యే అవకాశముంది. ఇది సామాజిక రుగ్మతగా మారే ప్రమాదముంది. కాబట్టి, దీన్ని సాధ్యమైనంతగా నివారించే విధంగా ఆయా వ్యక్తులను గుణాత్మకంగా మార్చే కనీసపు బాధ్యత సమాజానికి ఉంది. అయితే ఇలాంటి సంక్లిష్ట పరిస్థితులను అంచనావేసి, వివరించి, ఆయా సమస్యలకు పరిష్కార మార్గం చూపించాల్సిన సామాజిక బాధ్యత రచయితపై ఉంటుంది. సమాజంలోని మంచి – చెడులను నిరూపించి, సామాజికాభివృద్ధికి అవసరమయ్యే మానవీయ గుణాలను, మానవ సంబంధాలను రచయిత తన రచనల్లో పొందుపరచాలి.

ఆధునిక యుగంలో సమాజంలో, వ్యక్తి జీవితంలో వస్తున్న మార్పులను నవల క్షుణ్ణంగా గమనిస్తూ – దానికి అనుగుణంగా తనూ పరిణామం చెందుతూ వస్తుంది. సగటు వ్యక్తి విద్యావంతుడై, సామాజిక బాధ్యతను నిర్వహిస్తున్నప్పుడు, గణనీయమైన ఆంగ్లబోధన ద్వారా – ప్రపంచాన్ని అవగాహన చేసుకున్న మధ్యతరగతి కటుంబీకుని ఆలోచనారీతికి అనుగుణంగా, సంస్కరణ, హేతువాద భావాలను విస్తరింపజేసే సంస్కర్తల ఆచరణాత్మక విధానాలను ప్రజల్లోకి తీసికెళ్ళడంలో, సాంప్రదాయ, వారసత్వాన్ని నిలుపుకునే ప్రయత్నంలో, స్వాతంత్ర్య పోరాటస్ఫూర్తిని ప్రకటించడంలో ఆంగ్లసాహిత్యం ద్వారా అబ్బిన స్వేచ్ఛా ప్రణయ సిద్ధాంతాను నిరూపించేదిశల్లో, ఒత్తిడి ప్రపంచంలో సమాజం నుండి వేరై, వ్యక్తిగత ప్రపంచంలో లీనమయ్యే మనుషుల గురించి– విశ్లేషించే క్రమంలో వస్తువు స్వీకరణలో, పాత్రపోషణలో, రచనావిధానంలో, భాషా విషయాలలో నవల తొలిరోజులకి తర్వాత్తర్వాత అనేక మార్పులకు లోనైంది. తాను ఏ మార్పును పొందుతున్నా ఆ మార్పు ప్రజలను మరింత దగ్గరయ్యేందుకే తప్ప – నేలవిడిచి సాము చేసే ప్రయత్నం నవల చేయలేదు. నవల ప్రధానోద్దేశ్యమే ప్రజాచైతన్యం. సమాజాన్ని చైతన్యపరిచే, చైతన్యాన్ని ప్రతిబింబించేందుకు సాయపడే శక్తివంతమైన 'మాధ్యమం'గా నవల రూపుదిద్దుకుంది.

నిత్యజీవితాన్ని, తాను ఎక్కడ ఆగిపోయాడో, లేక తాను ఎక్కుడున్నాడో, ఎక్కడుండాలో అన్న విషయాలను 'నవల' పాఠకుడికి తెలుపుతుంది. సామాజికపరంగా తన స్థానాన్ని నవల్లో చూసుకుంటాడు. *"తనకంటే రచయిత మానవ మనోనైజాలను గాఢంగా అధ్యయనం చేశాడు. యక్స్ రేల్లాంటి కళ్ల రచయితకు ఉన్నాయనీ పాఠకుడు భావించుతాడు. తన సహచరుల, సమకాలికుల, స్నేహితుల, శత్రువులను గురించి విశేష పరిజ్ఞానం అభించుతుందేమోనని ఒక నవల ప్రారంభించిన తర్వాత పాఠకుడు ఆశించుతాడు. తన జీవితాన్ని శోధించి*

*పరిశీలించడానికిగాను తనను గురించి వాస్తవ పరిపూర్ణజ్ఞానాన్ని పొందాలని అతడు ఆశించుతాడు.*"[12]

## 2.9 నవలేతివృత్తాలు – సాధారణీకరణం:

నవలలోని పాత్రలలో తనను తన అనుభవాలను పోల్చుకుంటాడు. తన్మయీకరణ చెందుతాడు. ఈ పోలిక నవలలో ఎక్కువగా కనిపించడం చేత– 'నవల' అందరి వ్యక్తిగత జీవితాలను వారికి పరిచయం చేసే 'పెద్దరికాన్ని' కూడ వహిస్తుందని చెప్పవచ్చు. ఆలోచనలో, ఆచరణలో, విశ్లేషణలో, సాధనలో వ్యక్తి యొక్క అభివృద్ధిని 'పాత్ర'లద్వారా సంఘటనల ద్వారా నిరూపించడం వల్ల– సామాజికుడు జాగ్రత్తపడే అవకాశం ఉంది. తనను తాను తీర్చిదిద్దుకునే అవకాశం ఉంది. నవల వ్యక్తి, సమాజానికి ప్రతిబింబం అంటే అర్థం ఇదే.నవల సమాజానికి ప్రతిబింబం అయినపుడు నవలలో వాస్తవికత ప్రధానంగా కనిపిస్తుంది అప్పుడప్పుడు కాల్పనిక ధోరణిలో, మానవ జీవితానికి కొంత పై మెట్టులోనో కనిపించినా. 'కాలం' ప్రధానంగా కొంత ముందువెనుకలను ప్రస్తావించినా – ప్రధానంగా నవల– వాస్తవికత ఆధారంగా నిర్మించబడుతుంది. 'వాస్తవికత' అంటే 'ప్రస్తుతం' కండ్లకు కనబడేదనే అర్థంలో కాదు. సంభవించవలసి వుంది. సంభావన కలది– అనే అర్థవ్యాప్తిలో చూడాలి. అసాధారణమైన ఘటనలు జీవితంలో అప్పుడప్పుడు జరుగవచ్చు. కానీ, నవలలో అసంగతాలు, అసహజాలను చూపించకపోవడమే మేలు.

రచయిత తన సృజనాత్మకతతో సమాజంలో జరుగుతున్న అవాంఛనీయ ఘటనలను రూపుమాపేందుకు– తన నవలలో ఆదర్శవంతమైన పాత్రలను సృష్టిస్తాడు. ఈ పాత్రల నిర్మాణంలో రచయిత అత్యంత క్రియాశీలంగా వ్యవహరించాలి. సమాజానికి మార్గం చూపే పాత్రల సృష్టి క్రమంలో రచయిత ఏమరుపాటు వహిస్తే– ఫలితం తారుమారౌతుంది. అత్యంత సూక్ష్మపరిశీలనాశక్తి, విస్తృత అధ్యయనం, లోకజ్ఞానం, విశేషమైన భాషా పరిజ్ఞానం, లోతైన అవగాహన, సమస్యలపట్ల సానుభూతి, పరిష్కారంలో నేర్పరితనం అన్నింటికంటే ముఖ్యంగా సామాజిక బాధ్యత ఉన్న రచయిత ఇలాంటి 'లోకోత్తర కావ్యాలను చేపట్టుతాడు. ఆ పాత్రలు సజీవమైన పాత్రలు. జీవితంలోని అన్ని కోణాలను ప్రదర్శిస్తాయి. సమగ్రమైన జీవనవిధానంతో కనిపిస్తాయి.

---

[12] రచయితా శిల్పము, పు:8

ఉన్నతమైన విలువలు, ఉత్తమ సంస్కారంగల రచయిత ప్రజలలో సంబంధాలు, సాహితీ సంప్రదాయాల వారసత్వం ఈ అన్నింటి ప్రభావాలు రచనలో కనిపిస్తాయి. పాత్రలు అంతటి 'స్థాయి'ని కల్గివుంటాయి. నవలలోని పాత్రలు సమాజాన్ని వివిధ కోణాల్లో చూస్తూ– ఆయా వర్గాల వికాసానికి దోహదపడుతాయి. రచయిత పాఠకునికి తన పాత్రల ద్వారా ఉత్తమ సంస్కారాన్ని అందించే ప్రయత్నం చేస్తాడు.

## 2.10. తెలుగు సాంఘిక నవల:

తెలుగు సాహిత్యంలో నవల సంస్కరణాభిలాషతోనే మొదలైంది. నవల యొక్క ప్రధాన ఉద్దేశ్యం సమాజానికి–వ్యక్తికి మధ్య ఉన్న సంబంధాన్ని నిరూపించడమే. కాబట్టి సమాజంలోని అన్ని రకాల వ్యవస్థలను, వ్యక్తులను, ధోరణులను, చైతన్యాలనీ, తెలుపుతూ, వ్యక్తిలోని అంతశ్చైతన్యాన్ని, ఆందోళనను, వివరించే ప్రయత్నం చేస్తుంది. వర్తమానకాలంలో సమాజం, వ్యక్తుల పరస్పర ఆధార ఆధేయాలను విపులంగా వివరిస్తుంది. వర్తమాన జీవన చిత్రాన్ని వివరిస్తూనే, ఆదర్శ జీవనం కోసం ప్రయత్నిస్తుంది. సమాజంలో కుళ్ళును, అనైతికతను, మూఢ విశ్వాసాలను నియంతృత్వ పోకడలను ప్రశ్నిస్తూనే– చైతన్యాన్ని నింపే ప్రయత్నం చేస్తుంది. వ్యక్తి, శారీరక, మానసిక అవస్థలను వివరిస్తుంది. ఉన్నతమైన ఆలోచనలతో, ఆధ్యాత్మిక భావజాలాన్ని పెంచే ఆలోచన చేస్తుంది. సమాజంలోని వ్యక్తిలోని, 'ఘర్షణ'ను తొలగించే ప్రయత్నం చేస్తుంది. నిర్వీర్యమైన సమాజాన్ని 'ఘర్షణ'లోకి నెట్టి, తేజోవంతంగా తీర్చిదిద్దేందుకు సిద్ధపడుతుంది. సమాజంలో, వ్యక్తిలో ఉండాల్సినవి లేకుంటే– తెచ్చే ప్రయత్నం చేస్తుంది ఉంకూడనివి ఉంటే తొలగించే ప్రయత్నం చేస్తుంది నవల. సామాజిక బాధ్యతను వహిస్తుంది. సమయ సందర్భాలను పురస్కరించుకునే తన 'స్వభావాన్ని' మార్చుకుంటుంది. తెలుగు సాహిత్యంలో సాంఘిక నవల పేరుతో ఇదంతా జరుగుతుంది. తెలుగులో నవలలు సాధారణంగా చారిత్రక, సాంఘిక నవలలుగా విభజించబడ్డాయి. కానీ, సాంఘిక నవలవే ఎక్కువ ప్రాధాన్యతను పొందాయి.

'సాంఘిక నవల'ను సమకాలీన సమాజంలోని వ్యక్తుల బాహ్యాంతర జీవితాలను భిన్నమైన కోణాలనుంచి సాధ్యమైనంత సమగ్రంగా చిత్రించే దానిగా చెప్పుకోవచ్చు. వ్యక్తిగత ఆచారాలు, మత విశ్వాసాలు, ప్రాంతీయ జాతీయ సమస్యలు, ప్రభావాలు, కుటుంబ సంబంధాలు, అంతర్గత ఘర్షణలు, జీవిత దృక్పథం, భావోద్వేగాలు, ప్రణయం, పోరాటం, నైతిక, రాజకీయ, వైజ్ఞానిక, నేపథ్యాలు ఇలా చాలా విస్తారమైన భూమికతో 'సాంఘిక నవల' చిత్రణ జరుగుతుంది.

## 2.11 సాంఘికనవల – లక్షణాలు:

సాంఘిక లక్షణాలుగా విమర్శకులు *"1. సమకాలీన జీవితం, 2. సాంఘికాచార సంప్రదాయాలు, 3. సంఘజీవితానికి ప్రాతినిధ్యం వహించే పాత్రలు, 4. వాస్తవ జీవితానుగుణమైన సంవాదాలు, 5. వ్యావహారిక భాష"*[13] వివరించారు. ఈ అయిదు లక్షణాలు తప్పనిసరిగా సాంఘిక నవలలో కనిపిస్తాయి. వ్యక్తి–సమాజం యొక్క విడదీయరాని సంబంధం–సమాజాన్ని విస్మరించినవ్యక్తి మనుగడ ప్రశ్నార్థకం అలాగే 'వ్యక్తి'ని పరిగణనలోకి తీసుకోకుండా, సమాజం ముందుకు వెళ్ళలేదు. మానవాభివృద్ధి వ్యక్తి–సమాజాల పరస్పర సమన్వయంతో, సహకారంతోనే కనిపిస్తుంది. కాబట్టి, పైన చెప్పిన ఐదు అంశాలు సమకాలీన జీవితాన్ని, ఆ సమాజంలోని ఆచార సంప్రదాయాలను వివరిస్తూ జీవితాన్ని సమగ్రంగా నిరూపించే భావజాలం. ఆయా సమాజాలకు అనుకూలమై, వారు అర్థం చేసుకునే వ్యావహారిక భాషతో సమకాలీన సమాజంలో ఉండే వ్యక్తుల నమూనాలతో నిర్మింపబడే సాంఘికనవలగా చెప్పవచ్చు. పరిశోధనాంశానికి సంబంధించిన సాంఘికనవలల ఇతివృత్తాలను ఇక్కడ పరిచయం చేస్తున్నాను. దీనివల్ల తెలుగు సాంఘిక నవలల్లో ప్రతిఫలించిన మానవసంబంధాలను విశ్లేషించే ముందు ఆ నవలల్లో గల కథను గుర్తించడానికి వీలవుతుంది.

## 2.12 నవల – మానవ సంబంధాల చిత్రణ :

మానవున్ని కేవలం భౌతికసుఖాల ఆధారంగానే లెక్కించే ప్రయత్నం చేస్తే అతనియొక్క సంపూర్ణమైన, శాంతిమయమైన జీవనాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేకపోవచ్చు. మానవుడు కేవలం భౌతిక వనరు మాత్రమేకాదు. శారీరక అవధుల్ని దాటి అంతరంగిక మూలాల్ని గమనిస్తే అతనిలో అనేకమైన సంఘర్షణలు కనిపిస్తాయి. భౌతిక పరిస్థితుల ఆధారంగానే గణిస్తే– లోపలి అశాంతి చెలరేగితే– వ్యక్తికి సమాజానికీ రెంటికీ ప్రమాదమే. మనిషికి విశృంఖలమైన స్వేచ్ఛగాని, అతడి వ్యక్తిత్వాన్ని అణచివేయడంగాని, శాంతికి దారితీసేవికావు. మానవుడి సమగ్రమైన అధ్యయనం వ్యక్తి–కుటుంబం–సమాజం ఈ పరిధుల్లో గమనిస్తేనే సాధ్యం. అయితే ఈ మూడు మనిషి యొక్క భౌతిక అంతరంపైనే గాకుండా అంతరంగిక ప్రపంచంపైన కూడా ఆధారపడి ఉంటుందన్న విషయాన్ని గమనించాలి. ఈ మూడు పరస్పర సంబంధాన్ని కలిగి వుంటాయి. దేనికదే ప్రత్యేకంగా ఉంటే వ్యక్తియొక్క సమగ్రమైన మూర్తిమత్వాన్ని అంచనా వేయలేము.

[13] తెలుగు సాంఘిక నవలలో – కథాకథన శిల్పం , పు:29

భారతదేశంలో వ్యక్తికి కుటుంబానికీ మధ్య సంబంధం గాఢంగా ఉంటుంది. ఇక్కడ వివాహవ్యవస్థ మూలకంగా కుటుంబంలోని ప్రతీవ్యక్తి ప్రత్యేకమైన అస్తిత్వాన్ని కలిగివుంటాడు. ఈ అస్తిత్వం అతన్ని వ్యక్తి నుండి, కుటుంబంనుండి సమాజానికి పరిచయం చేస్తుంది. అంతేకాక సమాజంలో ఒక 'విశిష్టమైన' స్థానాన్ని కల్పిస్తుంది. కేవలం కుటుంబం కారణంగానే వ్యక్తి సామాజికుడౌతున్నాడు. సమాజంలో ఉండే వ్యవస్థలతో అతనికి సమన్వయం కుదురుతుంది.

వ్యక్తి కుటుంబం నుండి ఆత్మీయతను పంచుకుంటాడు. సమాజం నుండి విద్య నేర్చుకుంటాడు. సమాజంలోని వ్యవస్థలన్నీ అతన్ని విద్యావంతునిగా చేసేందుకు సహకరిస్తాయి. వ్యక్తి సమగ్ర వికాసానికి సంబంధించిన విషయాలను కుటుంబం – సమాజం నుండి తీసుకోవడం – కుటుంబం సమాజాల అస్తిత్వానికి సక్రమ వ్యవహారానికి సంబంధించినంత వరకు తన స్వార్థాన్ని త్యాగం చేసేందుకు సిద్ధంగా ఉండడం కనిపిస్తుంది. వ్యక్తి విద్యార్థి దశలో, బ్రహ్మచర్యాశ్రమంలో ఉన్నప్పుడు అతడి ఆలనాపాలనా కుటుంబం చూసుకుంటుంది. సమాజం అతనికి సరైన మార్గ నిర్దేశం చేస్తుంది. ఆ వ్యక్తిలోని నైపుణ్యాన్ని గుర్తించి అతనికి జీవనోపాధి కల్పిస్తుంది. ఆ జీవికతో తిరిగి కుటుంబంలో గృహస్థాశ్రమంలో తన విధులు నిర్వహిస్తాడు. వ్యక్తి, కుటుంబ ఆధీనంలో ఉంటూ, సమాజం నుండి విద్యను నేర్చుకున్నాక, ఆ సమాజమే, ఆ ప్రభుత్వమే అతనికి ఉపాధి చూపించాల్సి ఉంటుంది. చైతన్యవంతుడైన వ్యక్తి తనలోని శక్తిని సమాజం యొక్క అభివృద్ధికి వినియోగిస్తాడు.

ఇక్కడ వ్యక్తికి–కుటుంబానికి–సమాజానికి సమన్వయం కుదిరితే ఈ ముగ్గురూ శాంతియుత జీవనం గడుపుతారు. ఇందులో ఏ ఒక్కరి దగ్గరైనా సూత్రం విడిపోతే అన్ని వ్యవస్థల్లో అలజడి మొదలౌతుంది. కుటుంబంలో ప్రధానంగా గృహస్థాశ్రమం సమాజానికి అత్యంత విశ్వసనీయమైన ఆశ్రమం. దీని ఆధారంగానే సమాజంలోకి అనేకమంది కొత్త వ్యక్తులు రావడం– ఆ ఆశ్రమం ద్వారానే సమాజాన్ని సువ్యవస్థీకరింపజేయడం జరుగుతుంది. గృహస్థాశ్రమం ద్వారా కాకుండా సమాజంలోకి వచ్చిన వ్యక్తులను అదుపుజేయడం సమాజానికి శక్తికి మించిన పని. కాబట్టి మన భారతీయ సమాజంలో గృహస్థాశ్రమం లేని కుటుంబాన్ని గాని, సమాజాన్నిగానీ, ఊహించుకోవడం కష్టం గృహస్థాశ్రమవాసిగా మిగిలిన ఆశ్రమాలను ఆదుకోవడం, కుటుంబీకునిగా ఇటు కుటుంబ సభ్యులకు ప్రేమానురాగాల్ని పంచి ఇవ్వడం, జాతి సమిష్టి చేతనకు, ఉదాత్తమైన కార్యకలాపాలకు తనవంతు పాత్ర నిర్వహించడం, వ్యవస్థా నిర్వహణలో తన బుద్ధి కుశలతను త్యాగాన్ని అందజేయడం అతని కర్తవ్యాలే అవుతాయి. వ్యక్తి – కుటుంబానికి, సమాజానికి జవాబుదారీగా మెలగాలి. బాధ్యతా రహితమైన ప్రవర్తనతో

అధర్మపరుడిగా ఉంటే అన్ని వ్యవస్థలచేత తిరస్కరింపబడతాడు. ప్రభావాన్ని చూపడం, ప్రభావానికి లోనుకావడంతోనే సంబంధం ఏర్పడుతుంది. మనిషి తాను పుట్టడంతోనే తనకు తెలియకుండానే ప్రకృతితో, తాను నివసించబోయే సమాజంతో 'సంబంధాన్ని' కలిగి వుంటాడు. వీటి ప్రభావాన్ని పూర్తిగా పొందిన వ్యక్తి వాటికి అనుకూలమైన ప్రవర్తనతోనో లేదా వ్యతిరేకమైన ప్రవర్తనతోనో జీవనాన్ని సాగిస్తాడు. ప్రకృతి, సమాజాలతో సంబంధం ఏర్పరచుకున్న వ్యక్తి తను పెరిగే వాతావరణం ఆధారంగా, సమాజం, కుటుంబం ఆధారంగా, తనలో ఉప్పొంగే భావాల కనుగుణంగా తన వ్యక్తిత్వాన్ని నిర్మించుకుంటాడు. దీని ద్వారానే ఇతర ప్రపంచంతో సంబంధాన్ని కలిగివుంటాడు. మనిషి చనిపోయినా, అతని వ్యక్తిత్వం సమాజంలో మిగిలిపోతుంది. దాని ప్రభావం కుటుంబం మీద, సమాజం మీద పనిచేస్తుంది.

మనిషి మొదటగా తాను పెరగవలసిన సంఘంతో సంబంధం కలిగివుంటాడు. ఆ సమాజాన్ని బట్టే– కొంతవరకైనా అతని పెరుగుదల – మానవ జీవితానికే పరిమితమైన అతి ముఖ్యమైన సుదీర్ఘబాల్యం, ఆదశలో అతనిలో ఏర్పడే వివిధ సంస్కారాలు ఇవన్నీ ప్రభావిత రకాలుగా ఉంటాయి. దానికి సమాంతరంగా అతనికీ తన తల్లిదండ్రులతో గరిష్ఠమైన సంబంధం ఏర్పడుతుంది. కటుంబ సంబంధాలనేవి వ్యవస్థాత్మకంగా మానవుడిలో ఏర్పడే ప్రాథమిక సంబంధాలౌతున్నాయి. కుటుంబంలోని వ్యక్తిగా అతడు పెరుగుతున్నప్పుడు పాఠశాల, క్రీడాస్థలం మొదలగునవి వాటితో సంబంధం ఏర్పడుతుంది. అతని మూర్తిమత్వం రూపుదిద్దుకుంటుంది. అతనిలోని సహజాతాలు, సంవేదనలు, వ్యవస్థా సంబంధాల, సంప్రదాయాల కారణంగా అణిచివేయబడతాయి.

శారీరకంగాను, మానసికంగాను, ఎదిగిన వ్యక్తి సమాజంలో వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకుంటాడు. సంఘంలోని వ్యవస్థాయుత జీవితం నుండి ప్రత్యక్ష సంబంధంలోకి వస్తాడు. ప్రాణి సహజమైన కోర్కెల సంతృప్తి కోసం జీవనోపాధిని వెతుక్కుంటాడు. దీనితోపాటు కుటుంబాన్ని ఏర్పరచుకుంటాడు. ఇది సాధారణంగా వ్యక్తి పొందే సంబంధం.

దీనికంటే విశిష్టంగా అతని మూర్తిమత్వంతో అతని వ్యక్తిత్వం సంఘర్షించడం మొదలౌతుంది. మనస్సులో జరిగే ఈ సంఘర్షణలు అతనికి విశిష్టమైన మానవసంబంధాలను ఏర్పరచుకొనే స్థితి లభిస్తుంది.వ్యక్తికీ, వ్యక్తికీ మధ్య అభిరుచిని మలచుకోవడంతో సామాజిక సంబంధం ఏర్పడుతుంది. మానవ సంబంధాలలో ఒక్కొక్క అభిరుచి, మరొకపక్క విలువ, ఈ రెండూ సహసంబంధంలో వుంటాయి. ఈ రెండూ రెండు వైపుల నుండి పనిచేస్తాయి. వీటిని ఉపసంహరిస్తే సంబంధాలు కుప్పకూలిపోతాయి. సమాజానికి వీటిని వర్తింపజేస్తే అందరికీ

అభిరుచి వున్న వస్తువు సామాజిక విలువ అవుతుంది. ఇవే సంఘ నిర్మాణానికి హేతువులు అవుతాయి.

సమాజం ఆవిర్భవించడంతోనే దాని వ్యవస్థాపన కూడా మొదలౌతుంది. సమాజంలో వివిధ భాగాలు ఒక క్రమపద్ధతిలోను, అదుపాజ్ఞలోను ఉండాలంటే వ్యవస్థాపక అత్యంత ఆవశ్యకం. సమాజం అంటే ఒక క్రమశిక్షణ లేని గుంపుకాదు. ఒక పెద్ద వ్యవస్థాయుత సంఘం. పరస్పర సంబంధాలతోను, ఆధారాలతోను కూడుకొని ఉన్న వివిధ భాగాలే వ్యవస్థాపన. సామాజిక ప్రమాణాలు, విలువలు, విశ్వాసాలు, సామాజిక సంబంధాలు మొదలైనవన్నీ సామాజిక వ్యవస్థాపనలోని విభాగాలే.

వ్యవస్థాపన సమాజానికి, ప్రభుత్వానికి శాంతి భద్రతలను, సుస్థిరతను ప్రసాదిస్తుంది. మానవ జీవితంలోని విభిన్న పార్శ్వాలన్నీ ఆయా వ్యవస్థలతో ముడిపడివున్నాయి. పరిపాలన, ఆర్థిక, విద్య, న్యాయ, కళారంగాలు, చేతిపనులు, ఇవన్నీ సమాజంలోని వ్యవస్థలు, సమాజంలోని ఐక్యతకూ, శ్రమ విభజనకు దోహదపడతాయి. అయితే సామాజిక వ్యవస్థలు నిశ్చయంగా ఉండక ఎల్లప్పుడూ పరివర్తనానికి గురి అవుతూ నిత్యనూతనంగ సజీవంగా ముందుకు సాగిపోతూ ఉంటాయి. అందువల్ల సమాజ నిర్మితిలో మార్పులు కల్గుతాయి. సమాజంలో వ్యవస్థాపన లేకపోతే వ్యక్తులు తాను భౌతిక, మానసిక సాంస్కృతికావసరాలు తీర్చుకోలేరు. సామాజిక ప్రక్రియలు వ్యక్తికి – వ్యక్తికి మధ్య అనేక చర్యలను కలుగజేసి సామాజిక సంబంధాలను పటిష్టం చేస్తాయి. ప్రజల మధ్య సమన్వయ సహకారాలను సాధించేవి సంయోజక సామాజిక క్రియలు కాగా సంఘర్షణ, పోటీ, మనస్పర్థలను వైషమ్యాలను రేకెత్తించేవి విఘటన సామాజిక ప్రక్రియలౌతాయి.

సమాజంలోని ప్రజల నిత్యావసరాలను తీర్చడానికి కొన్ని ఆచరణ యోగ్యాలైన పద్ధతులను ప్రజలే రూపొందించుకుంటారు. తరువాత ఇవి ప్రజల సంప్రదాయాలతో సమన్వయం పొంది, వాటి ఆమోదంతో పటిష్టమైన సంస్థలుగా రూపొందుతాయి. కుటుంబ, మత, ప్రభుత్వ, ఆర్థిక, విద్య, సంస్థలనేవి ముఖ్యమైన సంస్థలుగా కన్పిస్తాయి. ఇవన్నీ సమాజంలోని వ్యక్తుల మౌలికావసరాలను తీర్చడానికి ఉద్దేశింపబడినవే. వ్యక్తుల, శారీరక, మానసిక, కోర్కెలను సంపూర్ణంగా ఆమోదయోగ్యంగా తీర్చుకోవడానికి మన పద్ధతులు తోడ్పడతాయి. వివాహ, కుటుంబ, రాజకీయ, ఆర్థిక, విద్యావిషయాల్లో విలువలను ఏర్పరచడం సంస్థలపని. నైతికతను, సమాజశ్రేయస్సును ఇవి దృష్టిలో ఉంచుకుంటాయి.

చరిత్రకు అందని కాలం నుంచి జతకట్టడం మానవ స్వభావం. ఆహార, నిద్ర, భయ మైధునాలు అన్ని జీవులకు సాధారణమైన వ్యాపకాలు, ప్రాచీనకాలం నుండి కూడ మానవుడు సమూహాలుగా ఏర్పడి బతకడానికి అలవాటు పడ్డాడు. శారీరక అవసరాల దృష్ట్యా స్త్రీ పురుషులు పరస్పర ఆకర్షితులై సృష్టికార్యాన్ని నిర్వహించారు. ప్రత్యేక కుటుంబాలుగా ఏర్పడకపోయినా స్త్రీ పురుషులు పరస్పర ఆధార, ఆధేయభావంతో, ఆరాధనాభావంతో వ్యవహరించడం సహజమైనది. పరస్పర పూరకమైన జీవితాలను కొనసాగించారు. క్రమంగా కుటుంబం, సంతానం, ఆస్తి మొదలైన దశలను పొందుతూ ఇప్పటి ప్రామాణిక కుటుంబ వ్యవస్థను పరిణమింపజేసుకున్నారు.

స్త్రీ, పురుషుల సంయోగంతోనే మానవతకు పరిపూర్ణత, వీరిలో ఏ ఒక్కరూ తమకై తాము స్వయం 'పూర్ణత్వాన్ని' పొందలేరు. సుకుమార ప్రవృత్తి త్యాగమయ జీవితం, స్త్రీ ది. మనోహర రూపం. లావణ్యం, ఈమెను అరాధనీయురాలని చేసాయి. గాంభీర్యం, శారీరక దృఢత్వం పురుషుడిది. స్త్రీ ప్రకృతిలో ఒదిగిపోయేందుకు చూసేది పురుష ప్రకృతి. స్త్రీ, పురుషుల అంతస్సౌందర్యం, బాహ్య సౌందర్యం ఎలాగున్నప్పటికీ సహజీవనం మానవ సమాజ మౌలిక సూత్రం. సమాజంలోకి వ్యక్తులు వస్తుంటారు. పోతుంటారు. సమాజం అవిచ్ఛిన్నంగా సాగుతూనేవుంటుంది. సమాజానికి గల పటిష్టమైన సంస్కృతే దీనికి కారణం. సమాజాన్ని నిత్య చైతన్యవంతంగా, ప్రవాహరూపంతో ఉండడానికి కొత్త తరాలు రూపొందాలి. అంటే సమాజం ప్రత్యుత్పత్తి మార్గాలు తనలో ఏర్పాటు చేసుకోవాలి.

సాధారణంగా అన్ని సమాజాలలోనూ వివాహవ్యవస్థ ద్వారా వ్యక్తులు, లైంగిక స్వేచ్ఛ పొందుతారు. సంతానాన్ని పొందేందుకు అర్హత సంపాదించుకుంటారు. వివాహేతర లైంగిక సంబంధాలను సమాజం ఆమోదించదు.కుటుంబం ద్వారానే వ్యక్తి భవిష్యత్తులో తాను జీవించేందుకు అవసరపడే సంస్కారాలను, పద్ధతులను నేర్చుకుంటాడు. దీనికి ఆ వ్యక్తికి గల ప్రత్యేక స్వభావం, సహజగుణం మార్పు చెందాల్సిన అవసరం లేదు.

కోరికలు ఒక్కసారి తీరగానే ఆగిపోయేవి కావు. వ్యక్తుల కోర్కెలన్నిటినీ సమాజం యధాతథంగా అంగీకరించదు. ఇక్కడే వ్యక్తికి సమాజానికి మధ్య ఘర్షణ ఏర్పడుతుంది. అప్పుడు వ్యక్తుల సహజాతాల తృప్తికోసం కొన్ని ఉన్నతమైన మార్గాలను ఏర్పాటుచేస్తుంది. అలా దేశకాలాలకు అనుగుణంగా సంస్కృతీ, సంప్రదాయాల మార్గంలో మానవుడు నిర్మించుకునే వ్యవస్థలు ఆకృతిలో స్వభావంలో ప్రత్యేకంగా ఉంటాయి. కాలాన్ని బట్టి మారతాయి. ఇలా ఉన్నతీకరణ, ఉదాత్తీకరణం పొందిన కామమే 'ప్రణయం'గా మారుతుంది. ఉద్రేకపూరిత

శృంగారమయ కామాన్ని ప్రణయం సంపన్నం చేసి సాత్వికమైనదిగా మార్చే వ్యవస్థే కుటుంబం. సమాజం పట్ల గల ఋణాన్ని తీర్చుకోవడానికి వ్యక్తికి కుటుంబమే ఆధారం. కుటుంబమే వ్యక్తుల్ని సమాజంలో అనుసంధానించే సాధనం. సహజ ప్రవృత్తుల్ని సంతృప్తి పరుస్తూ వారిని సంస్కరిస్తూ కళాత్మకంగా విస్తరింపజేస్తూ భద్రతాభావాన్ని కల్గించే వ్యవస్థే కుటుంబం. స్త్రీ, పురుష సంబంధాలను స్థిరమైన, ఆమోదయోగ్యమైన రూపాన్ని కల్పించి సంతానాభివృద్ధికి, అనుబంధాల వ్యాప్తికి దోహదం చేసే కుటుంబమే సమాజానికి ఆధారం. హిందూ కుటుంబంలోని అన్ని ఆదర్శ భావాలకు మూలం వివాహవ్యవస్థ భార్యాభర్తల అన్యోన్యత. ఇది నాలుగు పురుషార్థాలను, నాలుగు ఆశ్రమ ధర్మాలను సాధించేందుకు ఉపయోగపడుతుంది. సంతాన కార్యానికి హేతువైన వివాహబంధంతో ప్రారంభమైన సంస్కారం, వ్యక్తి తన చివరి ఊపిరి విడిచే వరకే కాక, తర్వాత కూడ పార లౌకిక ప్రయోజనాన్ని ఆశించి కొనసాగించటం ఈ సమాజం యొక్క విశిష్టత. ఇలా వ్యక్తిని భౌతికంగా, ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దేది కుటుంబం. మన ప్రాచీన సాహిత్యం మొత్తం పురుషుడు స్త్రీతో కలిస్తే గాని సంపూర్ణుడు కాడనే భావాన్ని తెలియజేస్తుంది.

మానవ సంబంధాలన్నిటిలో ప్రాథమికమైనది. మధురమైనదీ స్త్రీ, పురుష సంబంధం. దీనిని దివ్యంగా మార్చేది వివాహ ధర్మం. ఇలాంటి ధర్మబద్ధమైన ప్రణయమే కుటుంబజీవనం. 'విశేషంగా వహించేది' కనుక వివాహం – భారతీయ వివాహవ్యవస్థలో 'విశేషత'కు ఇహలోకం, పరలోకం రెంటినీ సమన్వయంచేదిగా నిర్ణయించారు. భారతీయ సమాజంలో వ్యక్తి – విశిష్టరూపంలో కుటుంబంగా మార్పు చెందుతున్నాడు. కుటుంబం క్రమేణా కులంగా, గ్రామంగా, దేశంగానూ పరిణామం చెందుతుంది.

భారత కుటుంబమంటే భర్త, భార్య, పిల్లలే కాదు. కుటుంబంలో వయస్కులైన పుత్రులు, వారి భార్యలు, పౌత్రులు, అంతాకలిపి కుటుంబం. పినతండ్రి, పెదతండ్రి, వారి భార్య పిల్లలు అంతా ఒక కుటుంబం. వారిలో రాగద్వేషాలుండవచ్చు. కానీ కుటుంబ ధర్మం యొక్క విధులకు వారంతా కట్టుబడి ఉండాలి. వ్యతిరేకంగా ప్రవర్తిస్తే, సంఘం వారిని నిందిస్తుంది. సభ్య సమాజం వేలెత్తి చూపుతుంది. ఈ భయంతోనైనా వారు తమ ప్రవర్తనా పద్ధతులను మార్చుకుంటారు. ఉమ్మడి కుటుంబంలో ప్రతి వ్యక్తీ స్వంత భావాలను సమానావకాశాలన్ని కల్గి వుంటాడు.

మనదేశంలో వివాహం సామాజికమైనది. ఇది ఒప్పందం కాదు. విడదీయరాని బంధం. శాశ్వతత్వం భారతీయ వివాహ ప్రత్యేకత. సమాజంలోని ప్రతి వ్యక్తీ వివాహితుడయ్యే అవకాశం పొందాలని, వైవాహిక జీవితం కేవలం, ప్రేమ కలాపానికో, అదృష్టానికో వదిలిపెట్టదనేది

భారతీయ కుటుంబ దృష్టి. వ్యక్తుల్లో ఈ విధానం భద్రత భావాన్ని నిర్మిస్తుంది. సాధారణంగా వివాహం యావజ్జీవ సహచర్యంగా భారతీయులు భావిస్తారు. భారతీయ కుటుంబంలో భార్య, వ్యక్తిత్వం లేనిదికాదు. కుటుంబ జీవితంలో ఆమెకు భర్తకంటే ఎక్కువ బరువు బాధ్యతలు ఉంటాయి. ప్రకృతి సిద్ధంగా రూపొందే మాతృత్వంలాంటి స్థితులు పురుషుడికంటే స్త్రీకి గల గురుతర స్థానాన్నే సూచిస్తాయి.

మన సమాజంలో జీవితం సంస్కృతీ పునాదులపై ఏర్పడింది. ధర్మం అమలు జరగటానికి కుటుంబ సంస్కారం. కుల సంస్కారాలు ఆధారాలైనాయి. వీటి నియమాల ద్వారా, ప్రపంచంలోని ఏ ఇతర ప్రజానీకమూ నిర్వహింపని గురుతరమైన బాధ్యతను జాతీయ జీవితంలో నెరవేర్చడం జరిగింది. మనదేశంలో కుటుంబం – వంశపారంపర్యంగా వృత్తిని అందించింది. భార్యాభర్తలు ఒకే కులం వారు కావడంతో కుటుంబం వృత్తి విద్యాకేంద్రం అయింది. కోటానుకోట్ల ప్రజలకు వృత్తులను కల్పించడమే కాకుండా వారికి బాల్యదశనుంచి శిక్షణ నిచ్చి నైపుణ్యాన్ని మెరుగు పరిచే బాధ్యతను కుటుంబం తీసుకుంది. కుటుంబం వ్యక్తిని పరిపూర్ణ వ్యక్తిత్వంతో 'సామాజికుడి'గా తీర్చదిద్దుతుంది.

ఈ సంబంధాలు తెలుగు నవలల్లో అనేక విధాలుగా నిరూపితమైనాయి. భార్యాభర్తల మధ్య అనురాగం, నమ్మకం, ద్వేషాలు లాంటివి. కుటంబం మధ్య సామరస్యాలు, వైషమ్యాల లాంటివి అనేకంగా కన్పిస్తాయి. వ్యక్తికి – కుటుంబానికి, వ్యక్తికి – సమాజానికి అలాగే కుటుంబం – సమాజానికి మధ్య ఆధునిక జీవన విధానం ఎంతటి క్లిష్టతను, గాఢతను సృష్టించిందో ఆయా నవలల్లోని పాత్రల మధ్య నున్న మానవ సంబంధాల విశ్లేషణ ద్వారా అర్థమౌతుంది.

## 2.13 తెలుగు నవలల్లో మానవసంబంధాల పరిణామం:

తొలుత, నవల వ్యక్తి యొక్క 'జీవిత చరిత్ర'ను వివరించే విధంగా ఉంది. ఇది వ్యక్తికి, విధికి మధ్య జరిగిన ఘర్షణలో మనిషి ఎలాంటి ఒడిదుడుకులకు గురైనాడో నిరూపిస్తూ, అప్పటి మూఢాచారాలను ఖండిస్తూ, నీతిని భోదిస్తూ, సంఘ సంస్కరణే ధ్యేయంగా భావించి, చివరికి ఆ వ్యక్తి ఆయా ఆటుపోట్లను ఎలా అధిగమించాలో నిరూపించింది. తర్వాత వ్యక్తి నుండి కుటుంబాన్ని గూడ కలుపుతుంది. కుటుంబంలోని సంబంధాలు – తల్లిదండ్రులు, భార్యాభర్తలు, అత్తామామలు, ఆడపడుచులు మొదలైన సంబంధాలు, వారిలో పరస్పరం ఎదురయ్యే సమస్యలను వివరించడం జరిగింది. తర్వాత సాంఘిక వ్యవస్థను, వర్ణవ్యవస్థలను గురించి నిశితంగా విమర్శిస్తూ, ఆర్థిక, సాంఘిక రంగాల్లో వస్తున్న మార్పులను, భేదాలను తద్వారా

మానవ సంబంధాల్లో ఏర్పడుతున్న సంకుచితత్వాన్ని వెల్లడి చేసే మధ్య తరగతి జీవిత చిత్రణలు వచ్చాయి.

### 2.14 సాంఘిక నవలలు–మానవసంబంధాల వివిధ పరిణామాలు

తెలుగు నవలా సాహిత్యం పుట్టుక గురించి ఇప్పటికే అనేకవాదోపవాదాలు వచ్చాయి. అందువల్ల వాటిని మరలా చెప్పే ప్రయత్నం చేయడంలేదు. తొలితెలుగు నవలలుగా కందుకూరి వీరేశలింగం గారి రాజశేఖర చరిత్రను కొంతమంది, నరహరి గోపాలకృష్ణమశెట్టిగారి 'శ్రీరంగరాజచరిత్ర'ను మరికొంతమంది తొలితెలుగు నవలగా వాదిస్తున్నారు. కానీ నా పరిశీలనలో తొలితెలుగు నవలగా కందుకూరి వారి రాజశేఖరచరిత్రగానే భావిస్తూ ఈ పరిశోధనలో ఆనవలతో ఈ పరిచయాన్ని ప్రారంభిస్తున్నాను.

### 2.14 .1 రాజశేఖర చరిత్ర — ఇతివృత్తం –పరిచయం:

ఈ నవల సమకాలీన సంఘంలోని మనుషుల కథ. క్రీ.శ. 1878 నాటి తెలుగు సమాజంలోని ఆచార వ్యవహారములను, విశ్వాసాలను, రచయిత ఇందులో వివరించారు. జ్యోతిష్యంపై పిచ్చి నమ్మకం, మంత్రతంత్రాలు, వరుసవేది, బైరాగులను గుడ్డిగా నమ్మడం, భూత వైద్యుల మోసాలు, గ్రహణ కాలంలో కీడు జరుగుతుందని నమ్మే ప్రజల మూడ నమ్మకాలు, బాల్య వివాహాలు, వితంతువులను హీనంగా చూచి అవమానించడం, సాటి మనుషులను అస్పృశ్యులుగా భావించడం, దొంగ సన్యాసుల ఆగడాలు, పొగడ్తలను పొంగి అపాత్ర దానాలు చేయడం లాంటి అనేక సమకాలీన అంశాలు ఇందులో కందుకూరి పొందుపరిచినారు.

'రాజశేఖర చరిత్రము'లో రాజశేఖరుడనే సంపన్న గృహస్థు. పండితుడు, దాత. దయగల మనిషి. కూతురు రుక్మిణికి పెళ్ళి వైభవంగా జరిపిస్తాడు. పెళ్ళి సమయంలో శక్తికి మించి దానాలు చేస్తాడు. పెళ్ళి తర్వాత కూడ బంధువులు ఇంట్లోనే తిష్ఠ వేస్తారు. ఆయన ఆస్తి కరిగిపోతుంది. అయినా ఆడంబరాలు తగ్గించుకోకపోవడంతో డబ్బుకై ఇబ్బందులు కలుగుతాయి. ఎలాగైనా డబ్బు సమకూర్చుకోవాలనీ దురాశతో ఒక యోగిని ఆశ్రయించి బంగారం చేయించుకోవాలని ప్రయత్నించి ఇంట్లో ఉన్న వెండి, బంగారాలను పోగొట్టుకుంటాడు. అప్పులు ఇక్కట్ల పాలయ్యాడు. బంధుమిత్రులు దూరమయ్యారు. ఊళ్ళో ఉండలేక కుటుంబంతో కలిసి కాశీయాత్రకు బయలుదేరాడు.

మార్గమధ్యంలో రాజశేఖరుడు దొంలబారిన పడ్డాడు. అంతకు మునుపు దాహం ఇచ్చి కాపాడిన రామరాజు రాజశేఖరుని కుటుంబాన్ని రక్షించాడు. దొంగలదాడిలో రుక్మిణి తప్పిపోతుంది. చీకట్లో ఆమెను వెతికేందుకు మరొక కుటుంబంతో కలిసి రాజశేఖరుడు

భీమవరం చేరుకుంటాడు. అక్కడ బంధువుల వల్ల ఎలాంటి సాయం లభించదు. కొడుకును ఏదైనా ఉద్యోగం చూసుకొమ్మని పితాపురం పంపిస్తాడు. బంధువైన శోభనాద్రి వంచనా స్వభావం కలవాడు. రాజశేఖరుని రెండో కూతురు సీతను తనను ఆశ్రయించిన పద్మరాజుకు ఇప్పించదలచినాడు. డబ్బులు లేని రాజశేఖరునికి దీనికై కొంత డబ్బు కూడ ఇస్తాడు. మధ్యలో రామరాజు వచ్చి శోభనాద్రి కుట్రను భగ్నం చేస్తాడు. తన దగ్గర డబ్బు తీసుకొని ఇవ్వలేదని శోభనాద్రి రాజశేఖరునిపై నేరం మోపి, జైలుకి పంపిస్తాడు. తర్వాత తన మనుషుల్ని పంపి సీతను ఎత్తుకుపోతాడు.కొడుకు సుబ్రహ్మణ్యం పితాపురంలో రాజుగారి అనుగ్రహం పొందాడు. భీమవరం వచ్చి తండ్రిని కలుసుకున్నాడు. దారిలో దొంగల దోపిడి సందర్భంలో స్పృహకోల్పోయిన రుక్మిణి తేరుకొని తనను తాను కాపాడుకునేందుకు పురుషవేషం ధరిస్తుంది. రామరాజు సాయంతో సీతను దుండగుల నుండి రక్షిస్తుంది. పెద్దాపురం రాజు రాజశేఖరుని నేరాన్ని విచారించి నిర్దోషిగా తేల్చి విడుదల చేయించాడు. రుక్మిణి భర్త మమాగారిని చేరుకుంటాడు. రుక్మిణి, సీత, రామరాజు రాజశేఖరుని ఇంటికి చేరుకుంటారు. పెద్దాపురం రాజు సాయం పొందిన రాజశేఖరుని కుటుంబం సుఖంగా ఉంటుంది.

కందుకూరి వీరేశలింగం వ్యక్తుల యొక్క వ్యక్తిగత జీవితాలను విమర్శిస్తూ తద్వారా సంఘంలో పాతుకుపోయిన కుళ్ళను శుభ్రం చేసే ప్రయత్నం చేశారు. వ్యక్తిలోని బలహీనతలను ఆధారంగా చేసుకొని అతన్ని అన్ని పార్శ్వాల నుండి సంఘం ఏ విధంగా ఇబ్బందులను సృష్టిస్తుందో వీరి నవలలో నిరూపితమైంది. ఆ ఇబ్బందులకు నేపథ్యమైన కారణాలను, మూలాలను గుర్తించి దాన్ని బయటపెట్టే ప్రయత్నం మాత్రమే అప్పటి రచయితలు చేయగలిగారు.

### 2.14 .1.1 రాజశేఖర చరిత్ర నవల సామాజిక పరిణామం:

''.....*ఆయన (వీరేశలింగం) ఆశయం సమకాలీన సంఘ విమర్శ. దానిని పందొమ్మిదో శాతాబ్దపు సమాజంలో మతం పేరిట, కులం పేరిట, ఆచారం పేరిట, సంప్రదాయం పేరుతో అనేకనేక మూఢాచారాలు, మూఢనమ్మకాలు, చెడు పద్ధతులు చోటుచేసుకున్నాయి.*''[14] వీటిపైనే ప్రధానంగా తమ దృష్టిని కేంద్రీకరించారు. కాని కచ్చితమైన పరిష్కార మార్గాన్ని సూచింప లేకపోయారు. సంఘంలోని ఉన్నత కులాల్లో పేరుకుపోయిన మూఢ నమ్మకాలు, వితంతువులు, జూదం, మోసం, కన్యాశుల్కం, ఇంగ్లీష్ విద్యపై వ్యామోహం, స్త్రీ విద్య వ్యతిరేకత, దుబారా ఖర్చు లాంటి అనేక సమస్యలకు అద్దం పట్టింది రాజశేఖర చరిత్ర. మూఢ నమ్మకాలు అప్పటి

[14] విభాత సంధ్యలు. పు. 4.

సమాజంలో విస్తృతంగా ప్రచారంలో ఉండేవి. ప్రజల యొక్క మూఢత్వాన్ని ఆసరాగా చేసుకొని కొందరు స్వార్థపరులు వీటికి ఎక్కువ ప్రాచుర్యం కల్పించి లబ్ది పొందేవారు. ప్రజల్లోని అవిద్య పరాధీనతలు దీనికి కారణాలుగా కనిపిస్తాయి. రాజశేఖరచరిత్రలో గ్రహబాధలు, దయ్యాల ప్రసక్తి కనిపిస్తుంది. సిద్ధాంతితో రాజశేఖరుడు వారి అమ్మాయికి పట్టిన గ్రహబాధను గురించి వివరించినపుడు దానికి సిద్ధాంతి పిల్లదాని జాతకం గూర్చి చెప్పి శాంతి జరిపించాలనడం వారిలోని మూర్ఖత్వాన్ని సూచిస్తుంది.

ఈ విషయంపైనే వీరేశలింగం *''.... ఆకాలమునందెల్ల వారికిని దయ్యముల యందలి విశ్వాసమత్యధికము. స్త్రీలతో నొకానొకప్పుడును దయ్యము పట్టని వారెక్కడనో కాని లేకయుండిరి. ఎవ్వరికే వ్యాధి వచ్చినను వైద్యుని యింటికి మాఱుగా ముందుగా భూతవైద్యుని యింటినో సోదె చెప్పువాని ఇంటినో పరిగెత్తుచుండిరి. ఏ యింట ఏ పురుషుడు మరణము నొందినను, ఏ తరుణి మరణము నొందినను దయ్యము తిరుగుచుండునని స్త్రీ పురుష సామాన్యముగా నెల్లవారును నమ్ముచుండిరి...''* [15] అనడం గమనార్హం. అలాగే గోదావరి నీళ్ళకోసం వచ్చిన స్త్రీల మాటల్లో కూడ దయ్యముల ప్రసక్తి కనిపిస్తుంది. *''....మగడు పట్టుకొని వేపుకొని అనుచున్నాడు.... ఏమి పాపమో కాని మూడ దినముల నుండి మరింత వేపుకొని తినుచున్నాడు. ఈ మున్నాళ్ళలోనూ పిల్లది సగమయిపోయినది. ఇదే కదా? మగనితో'*[16] అనడం వారి అమాయకత్వానికి, మూర్ఖత్వానికి నిదర్శనం. మగని యొక్క దుర్వర్తనం కూడ ఇక్కడ తెలుస్తుంది. భర్తగా పురుషుడు బతికి ఉన్నప్పుడే కాకుండ చనిపోయిన తర్వాత కూడ ఎటువంటి నీచ ప్రవృత్తిని కలిగివుంటాడో! వ్యక్తం చేస్తుంది. మనిషిలోని దురాశ అతనిలోని వివేకాన్ని నాశనం చేస్తుంది. దురాశ దుఃఖానికి చేటన్నమాట రాజశేఖరుని విషయంలో స్పష్టంగా జరిగింది. రాజశేఖరుడు ఏనాడు శ్రమించినట్లుగా కనిపించడు. ఎప్పుడూ పదిమందిని పోగేసుకొని కాలం వృధా పుచ్చుకొనే వాని లాగానే కనిపిస్తాడు. ఆస్తి కరిగిపోయింది. అయితే ముఖస్తుతికి అలవాటుపడిన రాజశేఖరుడు డబ్బులేని పరిస్థితిని ఊహించుకోవటం కష్టం. భవిష్యత్తును ఏ మాత్రం అంచనా వేయని రాజశేఖరుడు వర్తమానం పట్ల అలక్ష్యాన్ని వహిస్తాడు. ఇది అతనిలోని దురాశను మేల్కొలిపి పరుసవేది విద్య ద్వారా బంగారాన్ని సంపాదించాలనే అసంబద్ధమైన నమ్మకం వైపుకి తీసుకెళ్తుంది. బైరాగి ద్వారా మోసపోయిన రాజశేఖరునికి ఊళ్ళో తలెత్తుకోలేని దుస్థితి ఎదురౌతుంది. *''.... అతడు సమాజంలోని మూఢాచారాలను మాన్పడానికి*

---

[15] రాజశేఖర చరిత్రము, పు:17

[16] వీరేశలింగం రచనలు- సమగ్రపరిశీలన, పు:12

*ఎవరితోనూ, ఏవిధంగానూ పోరాటం సాగించలేదు. ఏ సంఘ విద్రోహ శక్తులతోనూ పోరాటానికి సిద్ధపడలేదు. వ్యక్తిగతంగా డాబు దర్పాలకు పోయాడు. ఆస్తిపోయాక తన తప్పు తెలుసుకున్నాడు. రామరాజు దయతో కష్టాలనుండి బయటపడ్డాడు. రామరాజు బోధనతోనే కనువిప్పు కలిగింది.''*[17]

ఆర్థికపరమైన ఇబ్బందులు వచ్చినప్పుడు కొంత వాస్తవం ప్రతి మనిషికీ కనబడుతుంది. లేమిలోనే ప్రపంచం యొక్క అసలు రూపు తెలుస్తుంది. అంతవరకు రాజశేఖరుని దగ్గరున్న డబ్బుకై ఆశపడినవారు ఎవ్వరూ అతడు కష్టాలనుభవించేటప్పుడు సాయం చేయరు. కనీసం అటువైపైనా చూడరు. ఇలాంటి పరిస్థితిలో అతనికి జ్యోతిష్యంపై నమ్మకం సడలుతుంది. ''.... *నా కిప్పుడు జ్యోతిష్యశాస్త్రము నందలి నమ్మకము పోయింది. నావద్ద కొల్లగా ధనము పుచ్చుకొని వ్రాసిన వాండ్రు జన్మ పత్రికలో ఫలము లేవియు నిజమయినవి కావు. మేము కాశీయాత్రకు బయలుదేరునపుడు మంచి ముహూర్తము పెట్టుకొని యిల్లు బయలుదేరినను త్రోవలో గొప్ప యాపదలు వచ్చినవి....''* [18] అనడం వాస్తవ ప్రపంచంలోకి రావడంగా గమనించవచ్చు. మనుషుల మధ్య సంబంధాలు కేవలం స్వార్థ పూరితమై పోయాయని తెలుస్తుంది. వివాహాల ముహూర్తంలో కూడ ఇలాంటి అభిప్రాయమే కందుకూరి ''*మన దేశములో వివాహములకు మంచి ముహూర్తములు పెట్టుకొనని వారెవ్వరుందురు? వధూవరుల జాతకములను బరీక్షించి చూచుకొనక లగ్న నిశ్చయములను బట్టి దీర్ఘాయుష్మంతులయిన వరుల నేర్పఱచుకొని వివాహ కార్యములు నడుపునప్పుడు వివాహితలలో లక్షలకొలది బాల వితంతువు లేల కావలెను? అట్టి చోట్ల నెల్ల జాతకములు యేమగును? ముహూర్త బల మేమగును....?*''[19] అని తెలియపరిచారు.

''*నాకు స్త్రీ యందును స్త్రీల యభివృద్ధి యందును విశేషాభిమానము స్త్రీల దురవస్థకు, బలుమాఱు పరితపించి వారి దుస్థితికి దొలఁగింపఁ బ్రయత్నింప వలయుననియు, స్త్రీలను ప్రస్తుత స్థితిలోనే యుంచి తాము పైకి లేచుట పురుషులకెన్నఁడును సాధ్యము కాదనియు, తాము బాగుపడవలెనన్నచో వారికి గూడ విద్యావివేకాదుల యందు మంచి స్థితిలోనికిఁ దెచ్చి వారితోఁ గలిగి యున్నత పదవికి తేవవలయుననియు, తాము మాత్రమే వృద్ధి నొంది వారిని నిజమైన మైత్రి కనర్హమైన దాస్యము నందీ యుంచఁదలచిన పక్షమునఁ దెలియకయే, దినదిన క్రమమున, దామున్నత పదము నారోహించుచు వచ్చుటకు మాఱుగా, నొక్కొక్కమెట్టు దిగుచువచ్చి కడపటి*

[17] నవలా విమర్శ , పు:15

[18] రాజశేఖర చరిత్రము, పు. 103.

[19] వీరేశలింగం రచనలు-సమగ్రపరిశీలన, పు. 7.

*వారి తోడఁ గూడనడుగంటుట యనివార్యమనియు, నేను దలచు చుండెడు వాఁడను*''[20] అనడం వల్ల పురుషుని దౌర్జన్యానికి బలైపోయిన స్త్రీ సమాజంలో సగభాగంగా ఉంటూనే తన ఉనికిని, వ్యక్తిత్వాన్ని కోల్పోవలసి వచ్చింది.

చదువునేర్చిన స్త్రీ ప్రపంచం నలుమూలలా జరుగుతున్న సామాజిక మార్పులను గమనించి, తదనుగుణంగా తాను పురుషునితో సమానంగా సమాజాభివృద్ధిలో పాలుపంచు కోగలుగుతున్నది. సమాజము సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే పురుషుని భాగస్వామ్యంతో పాటు స్త్రీ భాగస్వామ్యం అనివార్యమని వీరేశలింగం అభిప్రాయపడ్డాడు. ఇదే అభిప్రాయాన్ని 1918లో మహాత్మాగాంధీ ''*స్త్రీ పురుషులు హోదాలో సమానులే కాని వారు అన్నింటా ఒకరిని పోలి మరొకరు ఉండరు. ఒకరు మరియెకరికి దోహదకారి. ఒకరికి కొన్ని లక్షణాలు ఉంటే మరొకరికి భిన్నమైన లక్షణాలు, గుణాలు ఉంటాయి. అలా స్త్రీ పురుషుల జంట అసమానమైనది*''[21] అని వ్యక్తం చేశారు. ఆకాలంలో స్త్రీ అవిద్య వల్ల ఎంతటి దీనస్థితిలో ఉందో తన జీవితాన్ని ఎంతగా బానిసత్వంలోకి దిగజార్చుకుందో, కుటుంబాన్నీ, సంఘాన్నీ ఎంతటి నరకప్రాయం చేసిందో ఆయా నవలలు చక్కగా వివరించాయి.

ఈ నేపథ్యాన్ని ఆధారంగా రాజశేఖర చరిత్రలోని సామాజిక సంబంధాలను విశ్లేషణ చేయవచ్చు.

ఇందులో ఆ కాలంలో కందుకూరిని వేధించిన అనేక సాంఘిక సమస్యలున్నాయి. పాత కొత్త నాగరికతల సంఘర్షణ, వింత పరిణామము, చర్చలు దీనిలో కనిపిస్తాయి. సమకాలీన సమాజంలో తనకు ఎదురౌతున్న, తాను ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై కందుకూరి పోరాడి నిలిచాడు. సమాజానికి ఏది మంచినిస్తుందో పూర్తిగా అవగాహన చేసుకొని, తద్భిన్నమైన సంఘ వ్యతిరేక శక్తులతో, కుహానా విలువలతో జీవితాంతం పోరాటం చేసాడు. ఆధునిక భారతదేశ పిత, రాజారం మోహన్ రాయ్ సంస్కరణ భావాలకు ప్రభావితుడైన కందుకూరి ఈ నవలలో వాటిని యథాతథంగా ఆవిష్కరించాడు. అప్పటికే రాజారాం మోహన్ రాయ్ సతీసహగమనాన్ని మాన్పించాడు. వితంతువులకు వివాహం ధర్మబద్ధమనే ఆలోచన సమాజంలో నెమ్మదిగా అడుగుపెడుతోంది. ఆనాటి సమాజంలో వేళ్ళూనుకున్న అనేక మూఢాచారాలు, మూఢవిశ్వాసాలపై కందుకూరి నవల ద్వారా స్పందించారు. ఇలాంటి అనాగరికి చర్యల ద్వారా వ్యక్తుల, సమాజంలోని వివిధ మూర్ఖపు విధానాల వల్ల మానవ సంబంధాలు ఎంతగా శిధిలం అయ్యాయో కందుకూరి వివరిస్తారు. ఈ నవలను గురించి రాస్తూ ''మనలో మూఢ విశ్వాసాలను

[20] వీరేశలింగం రచనలు. స్వీయ చరిత్రము II. పు. 143.

[21] ఆంధ్రప్రదేశ్ లో మహిళాద్యమం. పు. 21.

పోగొట్టుకోవలెనన్న ముఖ్యోద్దేశముతో దీనిని వ్రాసితిని''[22] అన్నాడు. ఈ నవల ద్వారా ఆయన సమాజానికి ఒక నూతన నైతిక చైతన్యాన్ని ప్రసాదించారు. సమాజంలో అడుగంటిపోతున్న అనేక రకాలైన మానవీయ కోణాల్ని ఇందులో ఆవిష్కరింపజేసారు. అందుకే ఇది ఎంతో వాస్తవికతతో కూడి ఉన్నదిగా కనిపిస్తుంది. మూఢ విశ్వాసాలు, దురాచారాల నిర్మూలనం లాంటివి ఆనాటి సమాజంలో ప్రజా బాహుల్యంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపాయి. బైరాగులూ, భూతవైద్యులు, గ్రహబాధ, జాతకాలు, జ్యోతిష్యము, శకునాలు, ఎఱుకచెప్పడం, ప్రశ్న చెప్పడం, శాంతి చేయుట, వ్యయం, మత ఢాంభికత్వం, దొంగ సన్యాసులు, పీఠాధిపతుల ఆర్భాటాలు, వర్ణవ్యవస్థ, అస్పృశ్యత మొదలైన అనేక వాటి గురించి ఈ నవలలో చర్చించాడు.

రాజశేఖరుడు బ్రాహ్మణుడు కుమార్తె వివాహ సమయంలో గొప్పలకి పోయి విపరీతంగా ఖర్చుపెట్టడంతో ఆస్తి హరించుకుపోతుంది. ముఖస్తుతులకు పొంగిపోవటం, ఎదుటివారి మనస్తత్వాన్ని పనిగట్టలేని అమాయకత్వం రాజశేఖరునిది. ఉన్న కాస్తా నగలను బైరాగి చేతిలో పెట్టేస్తాడు. నగలను ఎక్కువ చేస్తానని, 'పరుసవేది' విద్య నాదగ్గరుందని బైరాగి చెప్పిన మాటలకు మోసపోతాడు. పెళ్ళి విషయంలో ఆడంబరాలకు లొంగిపోయిన రాజశేఖరుడు, ధనం విషయంలో అత్యాశకు పోయి దరిద్రుడౌతాడు. రాజశేఖరుని మనస్తత్వం మనకు ఇక్కడే కనిపిస్తుంది. కష్టపడకుండా, డబ్బు సంపాదించేందుకు మూర్ఖపు ఆలోచనలు చేస్తాడు కానీ, ఉన్న డబ్బును సద్వినియోగ పరుచుకోవాలనే 'ఇంగితం' ఉండదు. 'ముఖస్తుతి'కి లొంగి పోయేంతగా 'ముందుచూపు'ను పెంచుకోలేకపోయాడు. రాజశేఖరుడు, అప్పులవాళ్ళు వెంటపడగా ఉన్న ఇల్లును అమ్మి మిగతాపైకంతో కాశీయాత్రకు బయలుదేరతాడు కుటుంబంతో కలిసి. అతనికి సంతానం ముగ్గురు. పెద్దకొడుకు సుబ్రహ్మణ్యం, కూతురు రుక్మిణి, చిన్నమ్మాయి సీత. రుక్మిణికి వివాహమౌతుంది. భర్త చెడు సాహసం వల్ల దేశాంతరం వెళ్ళిపోతాడు. కొన్నాళ్ళకు ఒక వ్యక్తి వచ్చి చచ్చిపోయాడని చెప్తాడు. ఇక్కడ కూడ రాజశేఖరుని 'నిర్లిప్తత' కనిపిస్తుంది. ధనవంతుడైన రాజశేఖరుడు కుమార్తె వివాహ విషయంలో గొప్పలకు పోయినట్లుగా, కాబోయే అల్లుని గురించి వాకబు చేయకపోవడం రాజశేఖరుని 'మిథ్యాడాంబికాన్ని' సూచిస్తుంది. చెడు సాహవాసం వల్ల చెడిపోయినా, దేశాంతరం పోయినా, చనిపోయాడన్న వార్త తెలిసినా 'కర్మ' అని సరిపెట్టుకోవడమే తప్ప 'రుక్మిణి' గురించి ఆమె అంతరంగం గురించి ఏనాడూ పట్టించుకోలేదు. విధవగా మారిన కూతురిపై ప్రేమతో తల వెంట్రుకలు తీసేందుకు, మాత్రం ఒప్పుకోలేకపోతాడు.

---

[22] కందుకూరి వీరేశలింగం స్వీయచరిత్రము. పు. 132.

అయితే రాజశేఖరుడు మూర్ఖత్వంతో అమాయకత్వంతో సమాజంతో పలుమార్లు మోసగించబడతాడు. కానీ, విద్యాధికుడు – విద్యవల్ల జ్ఞానాన్ని, వివేకాన్ని పెంచుకోలేకపోతాడు. చిన్నప్పుడే రుక్మిణికి తానే కొంత విద్య నేర్పుతాడు. స్త్రీలు చదువుకునే అవకాశం లేకపోయినా కూడా, బ్రాహ్మణుల ఇండ్లలో పురుషులు విద్యాధికులు కావడం వల్ల తమ ఆడ పిల్లలకు, భారత, రామాయణాల గురించి చెప్పేవారు. అక్షరజ్ఞానం కూడ కల్పించేవారు. అయితే ఆ బ్రాహ్మణులే విద్య నేర్చుకొంటే రాజశేఖరుడు చేసిన పనిని ప్రశ్నించారు. ఆడపిల్లలు చదువు నేర్చుకుంటే దేశానికి అరిష్టమని, స్వాతంత్ర్యేచ్ఛ పెరిగిపోయి మగవారిని ఎదిరిస్తారని వాదిస్తారు. కానీ రాజశేఖరుడు స్త్రీ విద్య ఏ శాస్త్రంలోనూ నిషేధించబడలేదనీ, పూర్వ పతివ్రతలందరూ విద్యావంతులయి ఉండడం వల్ల వాళ్ళు జీవితంలో గెలిచి నిలిచారంటారు. ఇంతగా ఉపన్యాసాలు చెప్పే రాజశేఖరుడు కుమార్తె పెళ్ళి విషయంలో తరువాత జరిగిన దురదృష్టకర సంఘటనలను విశ్లేషించే ప్రయత్నం చేయడు. స్త్రీ విద్య పట్ల సరియైన అవగాహన ఉన్న రాజశేఖరుడు స్త్రీ జీవితం పట్ల అలాంటి ఆలోచన పెంచుకోలేకపోయాడు. కారణం తాను ధనవంతుడు కావడం వల్ల లోకం మొత్తం తన కనుసన్నల్లో నడుస్తుందన్న గుడ్డి నమ్మకం. అంతా అయిపోయాక గానీ ''తత్త్వం బోధపడలేదు'' రాజశేఖరునికి. రుక్మిణి విద్యావంతురాలు కావడంతో, తనకు ఎదురైన ఆపదలని ఎదుర్కొనే వివేకం, ధైర్యం, తెగువ ఆమెలో కనిపిస్తాయి. కాశీయాత్ర సందర్భంలో దొంగలచే దెబ్బలు తిన్న రుక్మిణికి చనిపోయిందని ఆ అడవిలోనే వదిలి వెళ్ళిపోతారు తల్లిదండ్రులు. రుక్మిణి మూర్ఛ నుండి తేరుకొని, భయపడి తర్వాత ధైర్యం తెచ్చుకొని పురుషవేషం ధరించి, వైద్యం చేయించుకొని, ఒక గ్రామకరణం దగ్గర లెక్కలు రాస్తూ కొన్నాళ్ళకు పరిస్థితులు అనుకూలించి తల్లిదండ్రుల్ని చేరుకుంటుంది.

ఇక్కడ తండ్రి కూతుళ్ళ మానసిక స్థాయిని అర్థం చేసుకోవచ్చు. విద్యాధికుడైన తండ్రి అరణ్యం మధ్యలో కూతురును దిక్కులేని దానిగా కనీసం బతికిందా? లేదా? అనే పూర్తి విచారణ కూడ చేయకుండా వదిలి వెళ్తాడు. రుక్మిణిని వదిలించుకునే ప్రయత్నం చేసినట్లుగా అతని ప్రవర్తన ఎలా ఉందో గమనింపవచ్చు. విధవరాలైన కూతురు ఇంట్లో ఉంటే చాకిరీ చేయాలి. అడవైతే వదిలేసి వెళ్ళాలి. ఇది విద్యాధికుడైన తండ్రి మానస్తత్వం. పురాణ స్త్రీలు కూడ చదువుకొని, నిర్ణయాలు తీసుకునేవారు అని గ్రంథాలను ఉటంకించడమే కనిపిస్తుంది. కానీ కూతురు బతికిందా? చచ్చిందా? అనే ఆలోచన లేదు. కానీ చదువుకున్న కూతురు తన అసహాయతను సవాలుగా తీసుకొని జీవితాన్ని గెలిచేందుకు ప్రయత్నించింది. 'చదువు' తండ్రికి ఉపన్యాసాలకు అక్కరకొస్తే, కూతురుకు జీవితాన్వయానికి ఉపయోగపడింది.

ఒకసారి 'రామరాజు' అనే వ్యక్తి అడవిలో వడదెబ్బతో ప్రాణాపాయస్థితిలో ఉంటాడు. ఆ సమీపంలో ఉన్న 'శూద్రులు' కొందరు అతనికి దాహాన్ని తీర్చే ప్రయత్నం చేయగా రామరాజు నిరాకరిస్తాడు. చివరికి ప్రాణం మీదికి వచ్చేసరికి జ్ఞానోదయమై నీళ్ళు తాగేందుకు సిద్ధపడతాడు. అందులో ఒకడు పంతులుగారికి మంచినీళ్ళు అలాగే ఇస్తే పాపం అని మజ్జిగ కలిపి ఇస్తే మనకు పాపం అంటదని మజ్జిగ కోసం ఊళ్ళోకి పరిగెత్తుతాడు. ఒక ముసలి ఇదంతా గమనించి నాకే దోషం వచ్చినా పర్వాలేదు. నేనతన్ని బతికిస్తానని ముందుకు వస్తాడు. కానీ, మిగతావారు ఇంతకు ముందు జన్మలో ఏయే పాపాలు చేస్తే ఈ జన్మలో ఈ పుట్టుక వచ్చింది. మళ్ళీ తప్పు చేసి వచ్చే జన్మలో కూడా ఈ బాధలు పడ్తావా? అని ఆపుతారు. ఇంతలో రాజశేఖరుడు అటుగా వచ్చి పరిస్థితి గమనించి రాజుకి నీళ్ళిచ్చి ప్రాణాలు కాపాడతాడు. ఈ సంఘటన మనకు అప్పటి కాలంలో మూర్ఖత్వం, మూఢవిశ్వాసాలు ఎంతగా ఉన్నాయో తెలుస్తుంది. రామరాజు తెలివి, విజ్ఞానం, చదువు అతని ప్రాణాలను కాపాడలేకపోయింది. శూద్రుని అజ్ఞానం, ప్రాణాలు నిలిపే ప్రయత్నం చేసింది కులహంకారంతో. విద్య ఉండి కూడా ప్రాణాలు మీదికి తెచ్చుకునే మూర్ఖులు ఉన్నారని ఈ సంఘటన తెలుపుతుంది. చదువు, సంస్కారం లేకపోయినా, వచ్చే జన్మలో మళ్ళీ పాపాత్ముడుగా పుట్టినా సరే– ఎదురుగా పోతున్న ప్రాణాలు కాపాడాల్సిన ధర్మం తనకుందని తెలియజెప్పే మనుషులూ అప్పుడున్నారు.

నిరర్ధకమైన చదువు, కేవలం డాంబిక ప్రదర్శన కోసమే కాని మౌలికమైన మానవీయ విలువలను అది నేర్పలేదు. చదువు కంటే సంస్కారం ముఖ్యమని అర్ధమౌతుంది. ఇంత చేసినా రాజశేఖరుడు తన చేత్తో నీళ్ళు తాగిస్తాడు. అదే శూద్రునిచే ఇప్పించే ప్రయత్నం చేయలేదు. కాశీయాత్రకు బయలుదేరినా లోపలి మలినాన్ని తుడిచివేసుకోలేకపోయాడు.ఈ సంఘటన అస్పృశ్యత ఎంత అనాగరికమైనదో తెలుపుతుంది. తాము అస్పృశ్యులమనే భావన వారిలో ఉన్నా, వారు దానిని ఎంతమాత్రం పట్టించుకోకుండా జీవితం గడిపేవారు. చిన్నచూపు చూసే వారికే జాగ్రత్త పడవలసిన అగత్యం ఉండేది. అమాయకత్వంలో, స్వచ్ఛంగా బతికే వారు శూద్రులు తెలివితేటలతో తమను తాము హింసించుకునేవారు. అగ్రవర్ణీయులు ప్రాణాల మీదికి వస్తే గాని నిజం అర్ధం కాలేదు.

రాజశేఖరుడికి ధనగండం వస్తేనేగాని తెలియలేదు. రామరాజుకు ప్రాణగండం వస్తేనేగాని అర్ధంకాలేదు. వీరిద్దరి మధ్య 'విద్య'ను జీవితానికి చక్కగా అన్వయించుకొని మగవాని వేషంలో 'గుమాస్తాగిరి' చేసే రుక్మిణి ఎంతో యోగ్యురాలు. కుటుంబానికి దూరమయ్యానని భర్త చనిపోయాడని, స్త్రీనని నుయ్యో! గొయ్యో! చూసుకోకుండా లెక్కలు చూసుకుంటూ కాలానికి

ఎదురీదుతుంది రుక్మిణి.డబ్బులేని రాజశేఖరుడు అందరికి లోకువౌతాడు. డబ్బున్నప్పుడు నోరెత్తని సమాజం, ఇప్పుడతని కంట్లో నలుసుగా మారుతుంది. ఆయన సోదరి మరణించినప్పుడు కనీసం శవాన్ని మోయడానికి కూడ బంధువులు, కులస్థులు, రావడానికి తిరస్కరిస్తారు. దీన్ని రచయిత ''సమస్తాపదలలోను ఘోరమయిన యీ యాపదనే యెవ్వరును తోడుపడనపుడొక మతములో నుండుట వలన ప్రయోజనమేమి? ఉండకపోవుట వలన హానియేమి?'' అని ప్రశ్నిస్తారు. అంటే కొందరు వ్యక్తులు చేసిన అనాగరికపు చర్యల వలన మతౌన్యత్యానికి, మతం ఉనికికే ప్రమాదం ఉందనే హెచ్చరింపు కనిపిస్తుంది. డబ్బున్నప్పుడు కూతురి వెంట్రుకలు తీయ నిరాకరించిన రాజశేఖరుని ఏమీ చేయలేని కులం, ఇప్పుడు దరిద్రుడైన రాజశేఖరునిపై శ్రీ శంకరాచార్య గురుస్వామికి ఫిర్యాదు చేసేంతగా ముందుకొచ్చింది.

బ్రిటీష్ ఆర్థిక మూలాలు, పెట్టుబడిదారీ వ్యవస్థ, భారతదేశ జమీందారులతో జతగట్టే సమయం అది భారతీయ సమాజం కులం, మతం, సంప్రదాయం, విలువలు అంటే అనేక వేల ఏండ్ల నాటి వారసత్వాన్ని కొద్దికొద్దిగా ఒదిలించుకుంటున్న దశ, డబ్బు వెలితిని భర్తీ చేస్తున్న సందర్భం. ఈ సంధికాలంలో కులంవారు చిన్న తప్పు చేసినా అంతకు మునుపులా పెద్దల సంక్షంలోన తీర్పులుగా కాకుండా ఆంక్షలు పెట్టి సొమ్ము వసూలు చేసేవారు. ఇవ్వకపోతే కుల బహిష్కరణ చేసేవారు. సొమ్ము చెల్లిస్తే తప్పు ఒప్పయ్యేది. అంతకు ముందు చేసిన తప్పుకు క్షమాపణ, పశ్చాతాపాలు ఉండేది. ఇప్పుడు వస్తు వినియోగం పోయి డబ్బు చలామణి అయినట్లుగానే తప్పును డబ్బు ఒప్పుగా మార్చేసింది. ఆచారాలు వెలితిగా ఉన్నాయా, ఆలోచనలు వెకిలిగా ఉన్నాయా? అనే ప్రశ్న ఇప్పుడు వస్తుంది. డబ్బే అన్నింటిని సరిచేసినట్లయితే ఈ ప్రశ్నకు జవాబు మనుషుల హృదయాలే కలుషితమైనాయని తెలుపుతుంది.

*''... ఆయన ఆశయం సమకాలీన సంఘ విమర్శ. దానిని పందొమ్మిదో శతాబ్దపు సమాజంలో మతం పేరిట, కులం పేరిట, ఆచారం పేరిట, సంప్రదాయం పేరుతో అనేకానేక మూఢాచారాలు, మూఢనమ్మకాలు, చెడు పద్ధతులు చోటు చేసుకున్నాయి. మధ్య యుగాల భూస్వామ్య సమాజంలోని సాంఘిక బలహీనతలన్ని ఆంధ్రదేశపు సమాజంలో వికృతరూపం ధరించాయి.... మతం మంచి పట్టులో ఉంది. కాబట్టి మతాన్ని ఆలంబనం చేసుకొని మత గురువులు, సిద్ధాంతులు.... ఉన్నత కులాలవారినీ, ఇటు తక్కువ కులాల వారినీ– రెండువైపులా పీడించారు. వారి అజ్ఞానంతో వ్యాపారం చేసారు.''*[23]

[23] వీరేశలింగం రచనలు: రెండవ సంపుటము – స్వీయ చరిత్రము – రెండవ భాగం , పు: 158-159

పీఠాధిపతులు డాంబికత్వం, చిత్తచాంచల్యం, స్త్రీ లౌల్యం, డబ్బు పిచ్చి మతం పేరుతో వారు సాగించే వికృత కార్యక్రమాలు– దేశలో మతం, సాంప్రదాయాలపై విశ్వాసం సన్నగిల్లే ప్రమాదం కనబడుతుంది. కుహనా వ్యక్తులు అమాయక ప్రజల బలహీనతలను అడ్డం పెట్టుకొని భక్తి పేరుతో, మతం పేరుతో చాలా అరాచకాలు సృష్టించేవారు. మతం, సంస్కృతి లాంటి సున్నితమైన అంశాలను విస్తృతంగా, విశాలంగా అవగాహన చేసుకోలే సామాన్యులు ఈ బూటకపు మంత్రగాళ్ళ చేతిలో బలయ్యేవారు. రాన్రాను మతం కాస్త 'మతమౌఢ్యం'గా మారింది. ''*దురాచారమునెప్పుడును బ్రవేశించినంత సులభముగా వదిలిపోవు. ఎంత యవివేకమయినదైనను దేశము నందొక్కసారి నెలకొన్న యాచార పిశాచము చిరకాలము పలువురు పలు ప్రయత్నములు చేసి కష్టపడి వెడలగొట్టఁబాటు పడినంగాని యొక పట్టునకాలు కదల్పదు*''.[24]

ముహూర్తాలు, శకునాలు, పురుళ్ళు, గ్రహణాలు, జాతకాలు ఇలా ప్రతిదీ దుర్మార్గుల చేతిలో ప్రజలు మోసపోయేందుకు ఉపయోగపడ్డాయి. దీనికంతటికీ కారణం ప్రధానం 'అవిద్య'గా కనిపిస్తుంది. చదువుతో వివేకం, విచక్షణ శాస్త్రీయ దృక్పథం అలవడిన తర్వాతగానీ వీటి వికృతరూపం అవగాహన కావడం కష్టం. అయితే ఆంగ్ల విద్య ద్వారా శాస్త్రీయ దృక్పథం అలవాట చేసుకున్న మేధావులు కొందరు 'భారతీయత' అంటేనే తల తిప్పుకునేంతగా ప్రభావితులైనారు. 1899 అక్టోబరు 30న మిస్ మేరీహాలేకు వివేకానందుడు రాసిన లేఖలో... ''*ఆధునిక భారతదేశంలో బ్రిటీష్ పాలన ఒకే ఒక సానుకూల అంశాన్ని కలుగజేసింది. యిది యేదో యధాలాపంగా జరిగింది. అదేమంటే బ్రిటీష్ పాలన, భారతదేశాన్ని మరొకమారు ప్రపంచ నాటకరంగం మీదకు తెచ్చింది. బయటి ప్రపంచంలో సంబంధాన్ని బలవంతంగా రుద్దింది. ఆదేశ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకొని అది జరిగి వున్నట్లయితే, జపాన్ లో పరిస్థితులు అనుకూలించినట్లుగా భారతదేశానికి సంబంధించి మరింత అద్భుతమైన ఫలితాలు కలిగివుండేవి. రక్తము పీల్చివేయడమే ప్రధానమైన ఆలోచన అయినప్పుడు ఎలాంటి మంచి జరుగదు. ఆధునిక భావాలు కలిగించబడిన అర్ధవిద్యావంతులైన విజాతీయం చేయబడిన కొద్ది వందల మంది వ్యక్తులు ఆధునిక ఆంగ్ల భారత ప్రతిబింబాలుగా నిలిచిపోయారు. అంతకంటే ఏమీలేదు.*''[25] ''*పాతదైనా, కొత్తదైనా, దేశీయమైనా, విదేశీయమైనా, జీవన వికాసానికీ, మానవ సంబంధాలను బలోపేతం చేసేందుకు అన్ని వర్గాల ప్రజల మధ్య సమన్వయం కల్గించేందుకు*

---

[24] విభాత సంధ్యలు, పు:4

[25] వివేకానందుని సామాజిక – రాజకీయ దృక్పథాలు, పు:48-49

*ఉపయోగపడే 'దృక్పథం' ఉండాలి. నిజమైన జాతీయ సంస్కృతి అంటే పూర్తిగా పాత సంస్కృతిగానీ దిగుమతి సంస్కృతిగానీ కాదు. అలాగే ఉత్పత్తి సాధనాలమీద అధికారం గల పాలకవర్గ సంస్కృతి అంతకంటే కాదు. ప్రజాబాహుళ్య సంస్కృతే జాతీయ సంస్కృతి. సమకాలీన జీవిత వాస్తవాలను ప్రతిబింబించే సంస్కృతే నిజమైన జాతీయ సంస్కృతి. పాత సంస్కృతిలో సామాజికాంశం గల ఉత్తమ లక్షణాలను మాత్రమే అది స్వీకరిస్తుంది.''*[26] మూఢ నమ్మకాల్ని ఖండించడంతో పాటు సమాజ తత్వాన్ని, సమాజంలో ధనానికి గల ప్రాముఖ్యాన్ని, ఆనాడు నగరాల్లో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ మెల్లగ చోటు చేసుకుంటున్న లక్షణాల్ని కూడ స్పష్టం చేసాడు రచయిత.

రాజశేఖరుడు బీదవాడయిన తరువాత ఆయన ఇంట్లో తిండికి ఖర్చులను తగ్గించి అయినా బయట వేషాదులను జాగ్రత్తగా చూసుకుంటూ లేని డాంబికానికి పోతుంటాడు. తన జీవితం గురించి తను నిర్ణయించుకోలేక బయటి వారి మెప్పుకోసం, గొప్పకోసం కొంత బీద సాదలకు సాయం చేస్తుంటాడు. బీద సాదలకు తనకున్నదాంట్లో సాయం చేయడం మంచిదే, కాని మిథ్యాడాంబికాలను ప్రదర్శించటం వెగటు కల్గించే విషయం. తాను సుఖంగానే జీవిస్తున్నానని అందరికి తెలియజెప్పడం కోసం దానం చేస్తున్నాడు కానీ, నిజంగా హృదయములోంచి వచ్చిన భావన కాదు. ''*బీద తనము వలన గలుగు సౌఖ్యములను లాభములను వేదాంత గ్రంథములు వర్ణించి చెప్పుచు ధనము పాపమునకు గుదరని దూషించుచున్నను, రాజశేఖరుడు గారు మాత్రము మరల నీ దారిద్ర్య దేవత యెప్పుడు వదలునాయని నిమిషమొక యుగముగా గడుపుచుండిరి.''*[27] అని రచయిత అంటాడు. ఈ విషయంలో మళ్ళీ రాజశేఖరుని మనస్తత్వం అర్థమవుతుంది. ఎంతసేపటికీ తనను తాను మోసగించుకుంటూ సోమరిగా కాలం గడిపాడే కానీ శ్రమ విలువ తెలియని, శ్రమ సౌందర్యం గుర్తించని, శ్రమ భావనను అర్థం చేసుకోలేని వ్యక్తి ఈయన.

రాజశేఖరుని జీవితంలో చాలా సందర్భాల్లో డబ్బు ప్రాధాన్యత వస్తుంది. ఇతని జీవన విధానమే ఇందుకు కారణంగా కనిపిస్తుంది. రాజశేఖరుని చూపు ఎప్పుడో ధన సంబంధమైన విషయాలపట్ల సుముఖంగా ఉండటం వల్ల ఎక్కడున్నా అక్కడి సమాజాన్ని, ప్రజలను ఆకోణంలోనే చూస్తాడు. ఆ దృష్టితోనే ఆలోచిస్తాడు. ఆ రీతిగానే అన్వయం చేసుకుంటాడు.

---

[26] సామాయిక వ్యాసాలు. పు. 9.

[27] రాజశేఖర చరిత్రము. పు. 97.

రాజమహేంద్రవరంలో ఉంటున్న సందర్భంలో పట్టణ ప్రజలకు, పల్లె ప్రజలకు తేడా గమనిస్తాడు. ధనం ఉండటం వల్ల పట్టణ ప్రజలకు దక్కే గౌరవం చూస్తాడు. పై పై మెరుగులకు ప్రాధాన్యత నిస్తూ, బాహ్యవేషధారణతో, పండితులుగా చెలామణి అవుతున్న అర్భకుల్ని పరిశీలిస్తాడు. ''*కష్టపడి పనిచేయువారు తాము తెచ్చుకున్నది అన్న వస్త్రాదులకు చాలక బాధపడుచుందురు. పాటుపడని సోమరిపోతులు పూర్వులార్జించిన మాన్యములనుభవించుచు విలువ బట్టలను పంచభక్ష్య పరమాన్నములను గలిగి సుఖించుచుందురు....*''[28] అని సత్రపు బ్రాహ్మణుడు రాజశేఖరునితో అంటాడు. మొత్తానికి శారీరక, మానసిక శ్రమ లేకుండానే ధనవంతులై నాగరికుల వేషంలో కాలం గడపాలనే ఆలోచన – కు మూలం. ధనవంతుడే అందరికి ఆదర్శప్రాయుడు కావడం – డబ్బే అందరికీ పరమావధి కావడం, బ్రిటీష్ వలసవాదులు తెచ్చిన పెట్టుబడి దారీ వ్యవస్థ భారతీయుల జీవన విధానాన్ని, మానవ సంబంధాల్ని శిధిలంచేసే ప్రయత్నం చేసింది. విజయం సాధించింది.

రాజశేఖర చరిత్రలో గోదావరికి నీళ్ళకొరకు వెళ్ళినపుడు అక్కడికి వచ్చిన స్త్రీలు అందరూ ఒకచోట చేరి అనవసరమైన ముచ్చట్లు పెడతారు. ఊళ్ళో ఎవరింట్లో ఏమి జరిగిందో, ఎవర్ని భర్త కొట్టాడో, ఎవరి భర్త ఏ వేశ్యను ఉంచుకున్నాడో, ఎవరి భర్త భార్యకు వొంటినిండా నగలు నింపాడో, ఎవరి అత్త ఏ కోడల్ని కొట్టింది, గ్రహబాధలు, జాతకాలు ఇలాంటి ఏ మాత్రం ఉపయోగపడని ముచ్చట్లు పెట్టి కాలం వృథా చేసుకుంటారు. అందులో వారిలో వారే విషయ అవగాహన కుదరక పోట్లాటకుదిగి తర్వాత ఎవరిళ్ళకు వారు వెళ్తారు. ఊర్లో అగ్రకులాల ఆడవారికి నీళ్ళకోసం గోదావరికి వచ్చినప్పుడే, ఒకరి నొకరు మాట్లాడించుకునే అవకాశం కలిసివస్తుంది, కాబట్టి ఆ సమయంలో అవీ ఇవీ మాట్లాడుకుంటారు. కానీ జరిగిన చర్చల్లో ఎవరికీ ఏవిధంగా ఉపయోగపడని చర్చలే ఉంటాయి. పైగా ఒకరిద్దరికి మనస్తాపాన్ని కలిగించేవిగా గూడ ఉంటాయి.

''*ఇప్పటి మనదేశపు స్త్రీలలోఁ గనఁ బడుచున్న యీ కలహప్రియత్వము నకుఁ బ్రధాన కారణము స్వప్రయోజన పర్వము చేత దురాలోచన మట్టుపడినవారు తమ తరుణీమణులను విద్యాగ్రంథవిహీనులాంధ్రనుగాఁ జేయుట వలన వారి నాశ్రయించియున్న మౌఢ్య భూతాలేశ రోషమే కాని, సహజ కోమలమైన స్త్రీ స్వభావము కాదు*''[29] అనడం పురుషుని బానిసత్వంలో చీకటిలో కుంగిపోతున్న స్త్రీ యొక్క అవస్థ తెలుపుతుంది.

---

[28] రాజశేఖర చరిత్రము. పు. 136-137.

[29] వీరేశలింగం రచనలు. స్వీయ చరిత్రము I. పు. 24.

రాజశేఖర చరిత్రలో డబ్బు ప్రాధాన్యత గల సన్నివేశాలు అనేకం. నగలు, డబ్బు వ్యక్తి యొక్క సామాజిక స్థాయిని నిర్ణయిస్తాయి. ఆ కారణంగా వ్యక్తి స్థాయి అతనికి సామాజిక సంబంధాలను నియంత్రించడం జరుగుతుంది. అందుకే స్త్రీలు అధికంగా నగలు ధరించే వారి విషయంలో అంతశ్శత్రువులు మేల్కొని వారి మనస్సులను ఈర్ష్యాసూయలతో ముంచి వేస్తాయి.

నీటి కోసం కాలువకు వచ్చిన అగ్రవర్ణాల స్త్రీలు తమ తమ గొప్పతనాన్ని, అసూయల్ని, చూపెట్టుకొనే సందర్భంలో ''*కాంతమ్మా! ఈ పట్టెడుఁ కొత్తగా చేయించుకున్నవా! నీకేమి? నీవు అదృష్టవంతురాలవు. గనుగ తల మొదలుకొని పాదముల వరకు నీ మగడు నీకు నగలు దిగవేయుచున్నాడు.....*''[30] అనడంతో ఉన్నతీకరించే భావన కనబడుతుంది. వీరేశలింగం ఒకచోట ''*వే యేల! చాటున లక్ష దుష్కార్యములు చేయుచున్నను, బాహ్యవేషధారణము నందు మాత్రము లోపము లేకుండనున్నచో వారి ప్రవర్తనమును సంపూర్ణముగా నెరిగియు నట్టివారి కందరును సభలో సహితము మంచి నడవడి గలవారికి చేయుదానికంటే నెక్కువ మర్యాదను చేయుచుండిరి*''[31] అనడం డబ్బు ప్రాధాన్యతను తెలుపుతుంది. ''*ఈ దినం వరకు కూడ ఉంటున్న ఆ చిన్న చిన్న అతి ప్రాచీన భారతదేశం గ్రామ సమితులు భూమిని ఉమ్మడి ఆస్తిగా పెట్టుకొని వ్యవసాయం, చేతిపనులు ఎప్పటికీ మారని విభిన్నవృత్తులు (శ్రమవిభజన) అనే ప్రాతిపదిక మీద అవి పనిచేసేవి. ఈ ప్రణాళిక ఖచ్చితంగా ఏ కొత్త సంఘానికైనా అలాగే అమలు జరిపేవారు.... ఉమ్మడిగా సేద్యం చేసుకునేవారు.... ఈ స్వయం సంపూర్ణ గ్రామ సంఘాల చిక్కులు లేని నిర్మాణం (వ్యవస్థ) వరుసగా అలాంటి సంఘాలనే సృజించేవి..... ఈ సులభ పద్ధతే – ఆశియా సమాజం మారకుండా ఉండడానికి మూలమయింది ఎల్లప్పుడూ ఒక వేపు ఆశియా రాజ్యాలు విచ్ఛిన్నమవుతూ, ఉన్నప్పటికీ గ్రామసంఘాలు మాత్రం మారకుండా ఉండేందుకు అదే కారణం. రాజకీయాకాశంలోని మేఘాడంబరాలు సంఘంలోని ఆర్థిక సూత్ర నిర్మాణాన్ని తాకేవి కావు*''[32] యూరప్ లో పారిశ్రామిక యుగంలో అప్పటికీ స్థిరపడిన పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ బ్రిటీష్ వారికి అనుకూలంగా ఉన్న సందర్భం. రాజరికపు పాలన స్థానంలో జమీందారీ పోకడల్తో ముందుకెళ్తున్న భారతదేశానికి ఈ పెట్టుబడిదారీ విధానం తోడైంది.

''*ఇంగ్లీషు కంపెనీ వారు ప్రవేశపెట్టిన భూసంస్కరణల పర్యవసానంగా రూపుదాల్చిన రెండు వర్గాలు – భూస్వాములు, వడ్డీ వ్యాపారులు రైతాంగంలోని అత్యధిక సంఖ్యాకులను,*

[30] రాజశేఖర చరిత్ర. పు. 22.

[31] రాజశేఖర చరిత్ర. పు. 74.

[32] నేటి భారతదేశం. పు. 99 – 100.

*గ్రామీణ పేదలలోని యితర వర్గాలను దోచుకు తినడానికి పై వారిరువురు చేతులు కలిపారు. ఆ విధంగా కొల్లగొట్టిన దానిలో ప్రధాన వాటాను ఇంగ్లీషు కంపెనీ వారికి చెల్లించే పద్ధతి కూడా అమలులోనికి వచ్చింది. వీటితో పాటే చేతివృత్తులు, ఆ వృత్తుల ప్రాతిపదికపై సాగే విదేశీవ్యాపారము – భారతదేశంలో అనేక శతాబ్దాలుగా సాగుతున్నదే అయినప్పటికీ – క్రమక్రమంగా తగ్గుముఖం పట్టింది.''* [33] తద్వారా పాశ్చాత్య సంస్కృతి, సాంప్రదాయాలు, నాగరికతలు భారతదేశంలోకి వెల్లువలా ప్రవహించాయి. ఈ సంధి యుగంలో భారతదేశంలోని సంపన్నులు అంతకుముందున్న సంప్రదాయాల స్థానంలో ఈ కొత్త భావాలను అందుకునేందుకు ముందుకొచ్చారు. *''దేశం తన అభివృద్ధికి భిన్నంగా ఆలోచించే ప్రాచీన మూఢాచారాలపై ఆధారపడటం వల్ల.....*

*.......మన జాతీయ పతనోన్ముఖత్వానికి ప్రధాన కారణం మనం ఇతర జాతులతో కలవకపోవడం అనేదే – ఏకైక, సమగ్ర కారణం అని నా భావన. ఇతర స్వరాలతో పోల్చుకునే అవకాశం మనకు ఎన్నడూ కలగలేదు. మనం కూపస్థ మండూకాలం – బావిలో కప్పలం''*[34] దేశంలో సాంప్రదాయం పేరుతో పెచ్చురిల్లిపోతున్న విపరీతపోకడలతో నిమ్నవర్గాలను దూరం చేసుకోవడానికి బ్రిటీష్ సాంగత్యం వల్ల మనదేశంలోకి దిగుమతి అయిన ఆంగ్లవిద్య, శాస్త్రీయ దృక్పథం లాంటి ఆధునిక భావాలతో ఘర్షణ ఏర్పడింది. జమీందారీ వ్యవస్థ వల్ల, దేశంలో నెలకొన్న అరాచకాలు, కరువుకాటకాలు, ఆర్థిక, సామాజిక స్థితిగతుల పురోగతికి అడ్డంకిగా మారాయి.ఆంగ్లేయుల ఆర్థిక వ్యవస్థ, శాస్త్ర విజ్ఞానం, హేతువాద భావాలు భారతీయ సాంస్కృతిక రంగాల్లో నూతన కోణాల్ని ఆవిష్కరింపజేసాయి.

### 2.15 గణపతి నవల –ఇతివృత్తం – పరిచయం:

చిలుకమర్తి లక్ష్మీనరసింహం గారి 'గణపతి' నవల 1920 లో వచ్చింది. గోదావరి ప్రాంతంలోని బ్రాహ్మణకుటుంబాల్లో దిగజారిపోతున్న మానవసంబంధాలను హాస్యస్ఫోరకంగా వివరించిన నవల. అయితే తండ్రిలేక, తల్లి ఆజ్ఞల్లో పెరగక – బలాదూరుగా, చిల్లరగా తిరుగుతూ అందరి దృష్టిలో నవ్వుల పాలైన గణపతి కథగా కూడా పరిశీలించాల్సి ఉంది. దీన్ని కామెడీ మోడ్ లో చెప్పడం వల్ల మానవసంబంధాల్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన సీరియస్ విషయాలకంటే, హాస్యం కోసం రాసిన నవలగా చాలా మంది భావించారు.

---

[33] తెలుగు సీమలో సాంస్కృతిక పునరుజ్జీవనము. పు. 33 – 34.

[34] వివేకానందుని సామాజిక – రాజకీయ దృక్పథాలు. పు. 28.

గణపతిది పప్పుభొట్ల వంశం. తాత పాపయ్య నిరుపేద. శవవాహకుడు. తండ్రి గంగాధరుడు. నీళ్ళు మోసి జీవనం చేసేవాడు. వయస్సు మళ్ళిన తర్వాత ఎలాగో నాలుగు వందల రూపాయలు కన్యాశుల్కం ఇచ్చి రెండేళ్ళ వయస్సున్న పిల్లను పెళ్లి చేసుకున్నాడు. ఆ పిల్ల పేరు సింగమ్మ. యాభై ఏడేళ్ల వయస్సులో గంగాధరుడికి కొడుకు పుట్టాడు. ఆ పిల్లవాడే గణపతి.

పేరుకు తగ్గట్టే గణపతిది గుజ్జురూపం పెద్దపొట్టతో వికార స్వరూపం. ఎంత తిన్నా అరాయించుకునే జీర్ణశక్తి అతనికున్నది. గణపతికి నాలుగేళ్ళ వయస్సులో తండ్రి చనిపోయాడు. మేనమామ గణపతికి, అతని తల్లికి ఆశ్రయమిచ్చాడు. మేనమామ, ఉపాధ్యాయులు ఎంత ప్రయత్నించినా గణపతికి చదువు మాత్రం అబ్బలేదు. చెడు అలవాట్లు, చీట్లాట, చిల్లర దొంగతనాలు, చుట్ట తాగటం ఇంకా తప్పు చేసి బొంకటం అలవాటయ్యాయి. తల్లి అతన్ని గుడ్డిప్రేమతో వెనకేసుకొచ్చినా కొన్నిసార్లు దొరికి పోయేవాడు.

ఒకసారి గణపతికి గుఱ్ఱమెక్కి స్వారీ చేయాలని కోరిక కలిగింది. ఒక చాకలికి చుట్టముక్కలు దానమిచ్చి అతని గాడిదనెక్కి ఊరేగే ప్రయత్నం చేశాడు. దుడ్డుకర్రతో ఎదురొచ్చిన మేనమామకు భయపడి గాడిద మీద నుండి దూమికి దెబ్బలు తగిలించుకున్నాడు.గణపతికి గిరిజాలు పెంచుకొని, కోటు తొడుక్కొని చేతిలో బెత్తం పట్టుకొని ఆనాటి పెద్దల్లాగా దర్జా వెలగబెట్టాలని కోరిక. తేలికకాబట్టి గిరిజాలు పెంచాడు. చేతిలో బెత్తం పట్టుకున్నాడు. కాని కోటు ఎలా వస్తుంది. డబ్బు లేదాయె! గణపతి మిత్రులతో కలిసి శ్రాద్ధభోక్తగా వెళ్ళినపుడు తమకు ఇచ్చే సైనుగుడ్డకు బదులుగా తాము కోరిన కోటు గుడ్డలివ్వమని పేచీపడతాడు. అది ఆచారం కాదని ఎంత చెప్పినా వినడు. యజమాని గణపతిని ఒక్కడినే పిలిపించి జువ్వతో రెండు దెబ్బలు తగిలించి బుద్ధి చెప్పాడు.

మేనమామ కూతురు పసిపిల్లను చాటుగా ఎత్తుకుపోయి తాళికట్టాడు. కాని మేనమామ ఆ తాళి తెంచేసి గణపతి కంటపడితే చంపేయాలనుకున్నాడు. గణపతి మరొకవూరు పారిపోయి అక్కడ బతుకు తెరువు కోసం బడిపంతులు అవతారమెత్తాడు. తనకు చదువురాని సంగతి బయటపడకుండ జాగ్రత్తపడుతూ పిల్లల్ని చితకబాది భయపెడతాడు. చదువెప్పుడైనా వస్తుంది. పిల్లలకు భయభక్తులు ముఖ్యమని బడిపిల్లల తల్లిదండ్రుల్ని నమ్మింప జూస్తాడు.

బడికి వచ్చిన ఒక కొత్త పిల్లవాడు గణపతిని ఆటపట్టించే ఉద్దేశ్యంతో ''శ్రీ రఘురామ చారుతులసీదళదామ'' పద్యానికి అర్థం చెప్పమని కోరాడు. గణపతి ఏ మాత్రం భాషా జ్ఞానం లేకపోవటం చేత చెప్పిన తప్పు పాఠకులను కడుపుబ్బ నవ్విస్తుంది.గణపతిని పెళ్ళికొడుకును చేసి

పల్లకీ ఎక్కించి అతని శిష్యులు ఊరేగిస్తారు. గణపతి కొంత సొమ్ము ఇచ్చి పెళ్ళి చేసుకున్న పిల్ల కన్యకాదని, ఆ పిల్లకు అంతకుముందే మరొకరితో పెళ్ళి అయిందని తెలుస్తుంది.

గణపతి నవలలో మూడు తరాల వ్యక్తుల యొక్క అవిద్య గురించి వివరించబడింది. గణపతి తాత పాపయ్య, బ్రహ్మణ వంశంలో పుట్టి, చదువు నేర్చుకోక, చీట్లాట, దొంగతనాల్లో ఆరితేరుతాడు. తిండిపోతు, ఊళ్ళో తిండి దొరకదు. వివాహ వయస్సు దాటిపోతుంది. చేతిలో గుడ్డి గవ్వ ఉండదు. కన్యాశుల్కం లేకుండా ఎవ్వరూ పిల్లనివ్వరు. కేవలం వివాహానికి అయ్యే డబ్బు సంపాదించేందుకు 'పునహా'(పునా)కు వెళ్ళి అక్కడ శవ వాహకత్వం చేసి డబ్బు సంపాదించి వచ్చి పిచ్చమ్మను వివాహమాడతాడు. గంగాధరుడు పుట్టగానే పిచ్చమ్మ విధవరాలౌతుంది. ఇక్కడ జీవితం కోసం కాక కేవలం వివాహం కోసమే డబ్బు సంపాదించే వయస్సు మీరి పోయినా కన్యాశుల్కం ఆశచూపి చిన్నపిల్లను వివాహం చేసుకోవడంలోనే అన్యాయం కనిపిస్తుంది. బతుకు దెరువు కోసం కష్టపడాల్సిన వాడు సరైన సమయంలో బలాదూరుగా తిరుగుతూ, తాను చెడిపోవడమే కాకుండా, వివాహం పేరుతో అభం శుభం తెలియని అమ్మాయి జీవితాన్ని కూడ నాశనం చేసిన అనేక మందికి పాపయ్య ఒక ఉదాహరణ మాత్రమే.

విధవగా మారిన పిచ్చమ్మ చదువుకున్నది కాదు. ఆమె ప్రమేయం లేకుండానే ఆమె జీవితం సంక్షోభంలో పడింది. దీనికంతకూ తండ్రి దురాశనే కారణమని గ్రహించే స్థితిలో కూడ లేదు పిచ్చమ్మ. ఇలాంటి సంఘటననే ఖండవల్లి రామచంద్రుడు ధర్మవతీ విలాసములో ఒకచోట ''*మేమేపాటి వాడికిచ్చినా వాడే దేవుడనుకొని పతిభక్తితో వుండడం ఆడవాళ్ళ ధర్మం. నువ్వు చదువుకున్న లాభం వెంటనే కలిగింది. రేపటినుండి చదివితివా చితకబొదుస్తాను చూడు. నీ వయసొచ్చిన వాడు కావాలే నీకు?*'' అనడం చదువుకున్న స్త్రీల విషయంలోనే తల్లిదండ్రుల ఆలోచనలు ఇంత దుర్మార్గం ఉంటే, చదువులేని విధవగా మారిన అజ్ఞానురాలైన పిచ్చమ్మ విషయంలో ఎలా వుంటుందో ఊహించుకోవచ్చు. పాపయ్య పిచ్చమ్మపై జాలి చూపించకపోగా, ఆమెకు భర్త ద్వారా సంక్రమించిన ఆస్తిని చేజిక్కుతుంటాడు. అవన్నీ ఏమీ తెలియని పిచ్చమ్మ, తండ్రి ఎంతకూ తనకు వచ్చే డబ్బు గురించి ప్రస్తావించక పోవడంతో ''*నాన్నా మీ యల్లుడు పోయి యిప్పటి కెనిమిది మాసములైనను నేను నోరెత్తి మాటాడలేదు. ఏమున్నదో ఏమి లేదో నేనెఱుగను. అర్థ ప్రాణములు నీచేత పెట్టితిని. నిన్ను నమ్ముకుంటే. లోకులు కొందరు మనకు సొమ్మియ్యవలెనని చెప్పతివి గదా! ఆ సొమ్మేమైనది? పుట్టెడు దుఃఖములోనున్న దానను నేనే మొగము పెట్టుకొని నిన్ను వ్యవహారము విషయమై యడుగనని, నీవే నాకప్పగింతువని యింత*

*కాలమూరకుంటిని. నీ దారిన నీవు వెళ్ళుచున్నావు. నా గతి యేమి?'*[35] అని దీనంగా అడుగుతుంది. తండ్రి రావల్సిన డబ్బేమీ లేదు. ఉన్న ఇంటిని ఆధారంగా చేసుకొని బతకమని అంటాడు. కేవలం కన్యాశుల్కానికి ఆశపడి కన్న కూతురును తెగనమ్మి, జీవితంలో అన్నీ కోల్పోయి దీనంగా తన దగ్గరికి వచ్చిన కూతురికి సంబంధించిన ఆస్తిని కాజేసి, ఆమెను దోచుకొని నెట్టివేయడం అనేది తండ్రి వికృత రూపానికి పరాకాష్ఠ. కూతురు విధవ అయితే ఇంట్లో మూలన కూర్చున్నా ఫరవాలేదు, వ్యభిచరించినా ఫరవాలేదు. ఆమె డబ్బు కాజేసినా సిగ్గు పడనవసరం లేదు. ఇలాంటి దృశ్యాలు చూస్తుంటే ఆడపిల్లల జీవితాలు అటు అత్తారింట్లో, ఇటు తల్లి గారింట్లో ఎంతటి నరకాన్ని చవి చూసాయోనని పిస్తుంది.

అప్పటికే పిచ్చమ్మకు గంగాధరుడు జన్మిస్తాడు. గంగాధరునితో ఉపనయనం చేయిస్తుంది పిచ్చమ్మ. గంగాధరుడు పొట్టకూటికై ఎన్నో పనులు చేస్తూ నీళ్ళు మోయడం కూడా చేసాడు. చదువుకునే అవకాశం, సంస్కారం, అవసరం ఉండి కూడా చదువుకోలేక పోవడం దౌర్భాగ్యం. బ్రాహ్మణ కులంలో పుట్టి జీవనాధారమయిన పౌరోహిత్యం కోసమైన అక్షరాలు నేర్చుకోకుండా గాలివాటుగా పెరగడం అప్పటి కుటుంబాల్లో క్షీణిస్తున్న విలువలకు దర్పణం పడుతుంది. గంగాధరుడు సంపాదించిన డబ్బు చీట్లాటకి, వేశ్యయైన చిత్తజల్లు సింహాచలానికి సరిపోయేది. ఆ కాలంలో వేశ్యాసంపర్కం గౌరవ సూచకంగా కనిపించేది. స్త్రీని భోగ వస్తువుగా చూడడం, ఇంట్లో భార్య ఇద్దరు ముగ్గురు పిల్లల్ని కనగానే అందం చెడిపోయిందని భార్యను నిర్లక్ష్యం చేయడం సహజంగా కనిపించేది. దీనికి స్త్రీలు కూడా ఎలాంటి అభ్యంతరాలు పెట్టినట్లు కనిపించదు. ఆర్థిక, సాంఘికాది స్వాతంత్ర్యాలు లేని స్త్రీకి అందం ఒక ఆయుధంగా ఉపయోగపడేది. వితంతువులైన స్త్రీలు, వేశ్యలు ఈ ఇద్దరూ సామాజిక రుగ్మతగా మారే సందర్భం. కుటుంబం ఎంతగా బలహీనపడాలో, అంతగా బలహీనమయ్యే తరుణమిది. వేశ్యలు మగవాడికి సుఖాన్నివ్వడమే కాకుండా, అతనికి ఉద్యోగాల్లో కోర్టు వ్యవహారాల్లో ఇంకా అనేక సందర్భాల్లో తమ ప్రతిభలో తమ దగ్గరికి వచ్చే వారికి ప్రయోజనాన్ని చేకూర్చేవారు. మగవారికి కుటుంబం, ఆస్తి, ఆరోగ్యం గుల్లయినా, సామాజికంగా గుర్తింపు లభించేది.

గంగాధరం వివాహ ప్రయత్నాలు చేసి చివరకు నాల్గువందల రూపాయలు మందపల్లి నివాసుడైన కోట కోనప్ప కిచ్చి, అతని కూతురు రెండు సంవత్సరముల వయస్సున్న పిల్లను వివాహమాడతాడు. అతనికి నలభై సంవత్సరాలు. గంగాధరుడు యథాప్రకారముగా నీళ్ళు

---

[35] గణపతి. పు. 57.

మోసి జీవించాడు. అతనికి ఏభై ఏడు సంవత్సరాల వయస్సులో ఒక కుమారుదు కలిగాడు. ''*సింగమ్మకు వరప్రసాదియై పప్పుభొట్ల వంశ రత్నాకర పూర్ణచంద్రుడై యీ కథానాయకుడైన గణపతి జన్మించెను.*''[36] గణపతి రూపం చాలా వికృతమైనది. అతడు పుట్టిన మూడు నెలలకే నాయనమ్మ మరణించింది. పిల్లాడి జాతకం చూడమని గంగాధరుడు జోతిష్కునకిస్తాడు. జోగావధానులు జాతకం చూసి ఇలాంటి జాతకం నేనెక్కడా చూడలేదు. దేశదేశాలందు ప్రసిద్ధి పొంది నీ వంశానికి కీర్తి తెస్తాడు అంటాడు. గణపతిని నాలుగేళ్ళకే గంగాధరుడు మరణిస్తాడు. తల్లితో సహా గణపతి మేనమామ ఇంట్లో ప్రవేశిస్తాడు.

గణపతి బడికి పోవడం ప్రహసనంగా కనిపించేది. చింతబరికి పుచ్చుకొని పంతులు నలుగురు పిల్లల్ని వెంటబెట్టుకొని ప్రతిరోజూ గణపతి ఇంటికిరావడం, గణపతి కాళ్ళూచేతులూ కట్టేసి బడికి తీసుకెళ్ళడం, దారిలో పిల్లల్ని గణపతి గీరడం, రక్కడం లాంటి సాధారణంగా జరిగేవి. బడి పేరెత్తగానే గణపతికి జ్వరం రావడం, తలపోటు రావడం సహజం. ఎలాగో బడి తప్పించుకొని మేనమామ కంట్లో పడకుండా ఏ రాత్రో వచ్చి పడుకునేవాడు. గణపతికి పదేళ్ళు నిండాయి. ఇంకా చదువు మొదట్లోనే ఉంది. గణపతికి చదువు అబ్బలేదు కానీ చీట్లపేక అబ్బింది. ఆట కోసం ఇంట్లో దొంగతనానికి అలవాటు పడ్డాడు. డబ్బులు మాయమవడం మొదలైంది. ఇంట్లో తనకు అందకుండా దాచి పెట్టినట్లయితే ఇరుగు పొరుగు వారిళ్ళలో దొంగతానాలు చేయడం మొదలుపెట్టాడు. గుఱ్ఱమెక్కాలన్న కోరిక గాడిదనెక్కి తీర్చుకున్నాడు గణపతి.

గణపతికి అన్నయ్య కూతుర్నిచ్చి వివాహం చేయాలనుకుంటుంది సింగమ్మ. అన్న కూతురు కోడలని ఆశపడుతుంది. కానీ, గణపతి వాలకం చూసి వాళ్ళ అన్నయ్య ఈ సంబంధం ఒప్పుకోడు. గణపతి కూడ తండ్రి, తాతల వలెనే తిండిపోతు, దొంగ, బడిదొంగ, జులాయి. పెళ్ళి సంబంధం తప్పిపోయేసరికి సింగమ్మ శోకాలు పెడుతుంది. ఊరంతా ఒక్కటి చేస్తుంది. అన్నయ్యను ఒప్పించలేక పోతుంది, గణపతినీ మార్చలేకపోతుంది. చివరికి అన్నయ్య ఇంటినుండి గెంటివేస్తాడు. ఉన్న కాస్త నీడ కూడ ఆమెకు పోతుంది.

తనకున్న కాస్త చదువుతో బడి తెరుస్తాడు గణపతి. గణపతి చదువు నేర్చుకోవడం, చదువు నేర్పడం రెండూ యమలోకపు శిక్షలుగా కనిపిస్తాయి.

గణపతి శిక్షణలో రోజూ నాలుగైదు బెత్తాలు విరిగిపోతాయి. ''*మూఢవ ఫారంలో హెడ్ మాస్టర్ కాళిదాసు వెంకట సుబ్బయ్య గారి క్లాసులో సరిగా ప్రత్యుత్తరం ఇవ్వజాలని విద్యార్థులను*

---

[36] గణపతి. పు. 118.

*జుట్టుపట్టుకొని వంగదీసి బాదేవాడు. ఈ చర్య నాకు చాలా ఘోరంగా ఉండేది.''*[37] పిల్లలను దండించడంతో గణపతికి ఎలాంటి సంకోచాలుండవు. మా చిన్నప్పుడు మాకు గురువులు విధించిన శిక్షలలో ఇవి ఏ మూలకు? అని దబాయిస్తాడు. ''*ఒక పరియాయము నేను బడికి రాక యాగడము సేయ జుట్టుకు త్రాడుపోసి నూతిలో దింపినారు. అంతంత శిక్షలు వేసి యాయన నాలుగు ముక్కలు చెప్పబట్టి నేనింత బాగుపడి యక్కఱకు వచ్చినాను. ఆ మహారాజు పెట్టిన దీపమిది. ఈ వృద్ధంతా ఆయనదే. ఈ గ్రామము పిల్లలందఱును నాయంత వాళ్ళను చేయవలెనని తలంచుకోగా మీరా పని సాగనియ్యక బాధపెట్టుచున్నారు*'' అని బాధపడ్తాడు. పంతులు పాఠాలు చెప్పనక్కరలేదు. భయము చెప్పాలి. ''చదువు చెప్పుట కష్టమనుకున్నావా యేమిటి? దాశరథీ యని రెండు కూనిరాగాలు తీసి చెప్పగానే సరా యేమిటి? భయము చెప్పాలి? అదీ ప్రతిజ్ఞ. అదీ సొగసు. పంతులుగారిని చూడగానే గజగజ వణికి మూర్ఛపోవాలి పిల్లవాడు వాడే పంతులూ. ఇలా ఉంటాయి గణపతి ఆలోచనలు. కొన్నాళ్ళకు బడికూడ మూత పడుతుంది. ఇలా గణపతిలో తాత, నానమ్మ, తండ్రి, అమ్మ, గణపతి వీళ్ళందరూ కేవలం అజ్ఞానం, మూర్ఖత్వం, బుద్ధిమాంద్యం, తెలివిహీనత, అవిద్య వల్ల వారి జీవితాలను ఆదర్శప్రాయంగా గడపలేకపోయారు. పైగా సమాజం దృష్టిలో గణపతి లాంటి వాళ్ళు ఎందుకూ పనికిరాని దద్దమ్మలు. వీరికి సాయం చేసేందుకు కూడా ఎవ్వరూ ముందుకురారు. సరైన దారిలో పెట్టేందుకు ఎవ్వరూ ఆలోచించరు. అందరికీ గణపతి ఒక ఆటవిడుపు. ఒక వినోదం. ఒక హేళన. మహాదేవ శాస్త్రి, పుల్లయ్యలు కూడా గణపతిపై ప్రేమతో, సానుభూతితో కాక, వారి లాభాపేక్షతో అతన్ని దగ్గరికి చేర్చుకుంటారు. పుల్లయ్యకు, నాగన్నపై (సింగమ్మ అన్నయ్య) ఉన్న కసితో, మహాదేవశాస్త్రి ముందు మామూలుగానే తన ఇంట్లో ఉండనిచ్చినా, అతనికి దినసం వెచ్చాలు అందరితో పాటు ఇవ్వకపోవడం, బంగారు పిల్లి తయారు చేయవలసి రావడం వల్ల, ఆ డబ్బును మాయమాటలు చెప్పి గణపతి దగ్గరినుండి కైంకర్యం చేయడం, అతనిలోని దివాళా తనాన్ని చూపుతుంది. గణపతికి చదువులేకపోవడం, సంఘానికి అనుకూలంగా తన ప్రవర్తనను మార్చుకోలేకపోవడం లాంటి కారణాలు అతని పతనానికి కారణాలు.

చివరకు భైరవ దీక్షితులు తన కూతుర్ని గణపతి కిచ్చి వివాహం చేద్దామనుకుంటాడు. గణపతి నలభై వరాల సొమ్ము పిల్ల తండ్రి చేతిలో పోస్తాడు. వివాహమైంది. కానీ, ఆ పిల్లకు అంతకు ముందే వివాహమౌతుంది. డబ్బు కాజేసే ఉద్దేశ్యంతో భైరవ దీక్షితులు ఈ నాటకము

[37] నేనూ – నా దేశం. పు. 27.

ఆడతారు. నిజానికి దీక్షితులు ఆ అమ్మాయి తండ్రికాదు. ఈ విషయంపై పోలీసులు మామా అల్లుణ్ని అరెస్టు చేసేందుకు వస్తే గణపతి అక్కడి నుండి పారిపోతాడు. ఈ నవలలో మానవ సంబంధాలు అత్యంత బలహీనంగా ఉన్నట్లు కనిపిస్తాయి. పైకి హాస్య నవలలా కనిపించినా లోపల గంపెడంత విషాదం ఉంది. గణపతి తల్లి, నాయనమ్మ లిద్దరిదీ బాల్య వివాహమే. ఇద్దరూ బాల వితంతువులే. ఇద్దరూ వ్యవహారం చక్కదిద్దుకునే నేర్పులేనివారే. లోకజ్ఞానం లేని వారే. నాయనమ్మ వాళ్ళ తండ్రి చేతిలో మోసపోతే, గణపతి తల్లి అన్న చేత గెంటబడుతుంది. నాయనమ్మ దోషం కనిపించకున్నా గణపతి తల్లి గారాబం వల్ల గణపతి చెడిపోతాడు. చదువు అందుబాటులో ఉన్న కుటుంబమయినా, తండ్రి లేక, తల్లి రక్షణ లేక పిల్లలు దుర్వ్యసనాల పాలయ్యారు. అయినా జీవించేందుకు ఏ పని చేయడానికైనా సిద్ధపడతారు. కుటుంబ గౌరవం నిలబడేలా ప్రవర్తించరు. అగ్రవర్ణల్లోని బాల్య వివాహాలు కుటుంబ, ఆర్థిక, సామాజిక, నైతిక విలువలను ఎలా దిగజార్చాయో చెప్పే కథే గణపతిది.

## 2.16 'నారాయణరావు'– ఇతివృత్తం–– పరిచయం:

తన జన్మభూమి పట్ల ఎప్పుడూ వినయంగా ఉంటూ అవ్యాజమైన ప్రేమను కలిగివుండడాన్ని, ఆ నేలను, అక్కడి సాంప్రదాయాల్ని, చరిత్రను అభిమానిస్తూ, గాఢమైన అనురాగాన్ని కలిగివుండడాన్ని జాతీయతగా పిలుస్తారు. జాతీయ భావాలున్న వారికి స్వాతంత్ర్య కాంక్ష ఉంటుంది. మనిషికి ఆర్థిక, సామాజిక, రాజకీయ, మానసిక, ఆత్మీయ, ఆధ్యాత్మిక స్వాతంత్ర్యాలు ముఖ్యమైనవి. జన్మభూమిని దాస్యశృంఖలాల నుంచి విముక్తి చేసేందుకు ఎందరో త్యాగాలు చేసారు.

ఆంగ్లేయులు రాజకీయంగా మాత్రమే కాకుండా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, భాషాపరంగా అన్ని రంగాల్లోనూ భారతీయుల్ని బానిసలుగా చేసారు. 'విభజించి పాలించు' అన్న సిద్ధాంతాన్ని పాటిస్తూ జాతి సమైక్యతకు విఘాతం కల్పించారు. ఆంగ్లేయుల పాలనని మట్టుపెట్టి స్వరాజ్యం సాధించేందుకే జాతీయోద్యమం ప్రారంభమైంది. ఇది మహాత్మాగాంధీ ప్రవేశంతో గొప్పమలుపు తిరగింది. గాంధీజీ జాతిని జాగృతపరిచి ఉద్యమాన్ని ఉవ్వెత్తున విజృభింప జేసాడు. గాంధీ సహాయనిరాకరణోద్యమం, స్వదేశీ ఉద్యమం, ఖాదీ ఉద్యమమం వంటివి దేశమంతటా వ్యాప్తిచెందాయి. 1920లో మహాత్మాగాంధీ సత్యాగ్రహాన్ని శంఖం పూరించారు. రైతు జనసేన, అస్పృశ్యత నివారణ, మద్యపాన నిషేదం, జాతీయ విద్య వంటి కార్యక్రమాలను గాంధీజీ రూపొందించి నూతన తేజస్సుతో జాతినంతటినీ ఏకం చేసారు.

స్వాతంత్ర్య సమరంలో ఎందరెందరినో జైలుకి వెళ్ళి పడరానిపాట్లు పడ్డారు. వికలాంగులయ్యారు. అయిన భయపడలేదు. జైలుకి వెళ్ళడం మహద్భాగ్యంగా భావించి మాతృభూమి సేవలో పునీతులయ్యారు. ఇలాంటి సందర్భంలో అడవి బాపిరాజు 'నారాయణరావు' నవల వెలువడింది.

నారాయణరావు సకల సద్గుణాలు గల ఆదర్శ పురుషుడు. లలిత కళో పాసకుడు, సంస్కృతీపరుడు, బాపిరాజు నారాయణారావులో తనకు గల ఉత్తమాభి – రుచులన్నిటిని ప్రవేశపెట్టారు. నవలలో కథనంతటినీ రచయితే పూసగుచ్చినట్లు చెప్పటం శిల్పలోపమే గాని, కథాకథన కౌశలం వల్ల చదివేవారికి విసుగు కలగదు. ఆసక్తికరంగా వుంటుంది కూడ.

శ్రీ లక్ష్మీ సుందర వర ప్రసాదరావు విశ్వలాపురము జమీందారు, శాసనసభ్యుడు. ఆదర్శవ్యక్తి. ఒకనాడాయన రైలు ప్రయాణంలో నారాయణరావు అనే యువకుడిని కలుసుకున్నాడు. అతని చదువు, సంస్కారం, అందం చూచి జమీందారు అతన్ని అభిమానించాడు. నారాయణరావు బంధువు లక్ష్మీపతి వల్ల అతను గుణవంతుడని తెలుసుకున్నాడు. తన రెండవ కూతురు శారదను నారాయణరావుకు ఇచ్చి పెళ్ళి చేస్తే బాగుంటుందను కున్నాడు. శారద అందగత్తె అప్పటికామె వయస్సు పధ్నాలుగేళ్ళు.

నారాయణరావు తండ్రి సుబ్బారాయుడిగారికి ఇద్దరు కొడుకులని, మూడు వందల ఇరవై ఎకరాల మాగాణి, ముప్పై ఎకరాల పండ్లతోట, బేంకులో రెండు లక్షల నగదు ఉన్నట్లు జమీందారు, లక్ష్మీపతి వల్ల తెలుసుకున్నాడు. నారాయణరావు బి.ఎస్.సి ఆనర్సులో రెండవ వాడుగా నెగ్గి 'లా' పరీక్షకు చదువుతున్నాడని కూడ ఆయనకు తెలిసింది. ఇంటికి చేరగానే జమీందారు తన సోదరి సుందర వర్ధనమ్మకు భార్య వరద కామేశ్వరికి పెండ్లి సంబంధం సంగతి చెప్పాడు. వాళ్ళకు యీ సంబంధం నచ్చలేదు. జమీందారులు కారని, పల్లెటూరివారని చులకనగా మాట్లాడారు. అయినా జమీందారు శారదను నారాయణరావుకు ఇచ్చి పెళ్ళి చేయదలచాడు.

తమ స్థితి కంటె పెద్ద సంబంధం చేసుకోవటం సుబ్బారాయుడు గారికి ఇష్టం లేదు. పెద్ద మనుషులాయనకు నచ్చజెప్పి ఒప్పించారు. రాజభోగాలతో పెరిగిన శారద తనతో ఎలా మసలు కొంటుందోనని నారాయణరావు అనుమానించాడు. పెళ్ళి వైభవంగా జరిగింది. జమిందారు బంధువులు పల్లెటూరి సంబంధమని ఎద్దేవా చేశారు.అత్తగారు పాటించే మడి, మైల లాంటి ఆచారాలు శారదకు చాదస్తంగా తోచాయి.జమీందారు గారి భార్య వరదరాజేశ్వరికి అల్లుడంటే చులకన భావం. ఆమె శారదను తన మేనల్లుడు జగన్మోహనరావుకు ఇచ్చిచేయాలని

అనుకున్నది.జగన్మోహనరావు నారికేళ వలస జమీందారు. భోగలాలసుడు. మద్యపానం, గుఱ్ఱపు కుందేలు లాంటి వ్యసనాలకు అలవాటుపడ్డాడు. అతను శారద అందచందాలను పొగడి ఆమెకు దగ్గర కావటానికి ప్రయత్నించాడు. శారదకు కూడ అతనంటే ఇష్టమే.నారాయణరావుకు శ్యామసుందరీదేవి అనే సంగీత విద్వాంసురాలు పరిచయమైంది. అతడామెను సోదరిగా భావించి అభిమానించాడు.నారాయణరావు మిత్రుడు రాజేశ్వరరావు అనే ఇంజనీరింగ్ విద్యార్థి పుష్పశీల అనే గృహిణితో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. పుష్పశీల భర్త సుబ్బయ్యశాస్త్రి వయోవృద్ధుడు. నారాయణరావు రాజేశ్వరరావు చర్యను తప్పు బట్టాడు. ''*నీ మీద క్రిమినల్ కేసుపెట్టి జైలుకు పంపవచ్చు*''నన్నాడు. ''*దేశం కోసం జైలుకు వెళ్ళినట్లే నేను నీకు ధర్మమని తోచిన పవిత్ర కార్యం కోసం జైలుకు వెళ్తా*''నన్నాడు రాజేశ్వరరావు.

సహాయ నిరాకరణోద్యమంలో నారాయణరావు జైలుకు వెళ్ళాడు. తన కుమారుడు చేసిన పనికి సుబ్బారాయుడు గర్వపడ్డాడు. జమీందారు నారాయణరావు నొక వీరునిగా తలచారు.శారద జగన్మోహనరావుపై మోజుతో భర్తను నిర్లక్ష్యం చేసింది. నారాయణరావు అక్కయ్య సత్యవతి తన భర్త పెట్టే బాధలు భరించలేక పుట్టింటికి వచ్చి తన గోడు తమ్ముడితో మొరపెట్టుకున్నది. నారాయణరావు బావగారితో మాట్లాడి వాళ్ళ కాపురం చక్కబెట్టేందుకు ప్రయత్నించాడు. తన మీద పుట్టింటి వారికి చెప్పినందుకు సత్యవతి భర్త ఆమెను అనరాని మాటలు అన్నాడు.

తోటలో విహరిస్తూ కుమారుడు శారదను ముద్దు పెట్టుకోబోయాడు. జమీందారు కుమారుడు కేశవుడు ఆ దృశ్యం చూశాడు. శారద అప్పటికి ఏదో బొంకి తప్పించుకున్నది. జమీందారు శారదను జగన్మోహనరావుతో ఎక్కువ చనువుగా వుండవద్దని హెచ్చరించాడు.నారాయణరావు బి.ఎల్. పరీక్షలో ప్రథముడుగా నెగ్గి ఒక సీనియర్ అడ్వకేట్ దగ్గర జూనియర్ గా చేరాడు. శారద మెట్రిక్ పాసై ఇంటర్ లో చేరింది. పెద్దలు నారాయణరావు శారదలకు పునస్సంధానం ఏర్పాటు చేశారు.

శోభనం గదిలో శారద వెక్కి వెక్కి ఏడవసాగింది. నారాయణరావు దిగ్భ్రాంతి చెందాడు. ''*నీ వంటి దివ్య సౌందర్యమూర్తి నాకు ప్రణయిని అయిందంటే అది నా అదృష్టం శారదా!*'' అంటూ ఆమెను ప్రసన్నం చేసుకొనే ప్రయత్నం చేశాడు. ఎంతకీ ఆమె ఏడుపు మానలేదు. రెండవరోజు కూడ అంతే. ''నాకు *నీ మీద ప్రేమ లేదు*'' అని అతనితో చెప్పేసింది. తన బతుకు నిరర్థకమైందని అతను బాధపడ్డాడు.

నారాయణరావు కొన్నాళ్ళపాటు ఉత్తరదేశ యాత్ర చేసి వచ్చాడు. తిరిగి వచ్చాక రాజేశ్వరరావు పుష్పశీలను తీసుకొని ఎక్కడికో వెళ్ళిపోయినట్లు తెలిసింది.యాత్రకు వెళ్ళి వచ్చిన తర్వాత జరిగిన సంతర్పణకు శారద భర్త చెంతకు వచ్చింది.జగన్మోహనరావు పెళ్ళిలో తల్లి, చెల్లి, మరిది గారిని చులకన చేయటం భరించలేక శారద అక్క శకుంతల ''*నారాయణరావు వంటి అల్లుడు తపస్సు చేసినా దొరకడు*'' అన్నది. శారద అలిగి విడిది ఇంట్లో గదిలోకి వెళ్ళి పడుకున్నది. జగన్మోహనరావు అక్కడికి వచ్చి తమకంతో ఆమెను ముద్దుపెట్టుకోజూచాడు. శారద అతన్ని విదిలించుకొనే సమయంలో శకుంతల అక్కడికి వచ్చింది.

నారాయణరావు శారదతో మద్రాసులో కాపురం పెట్టాడు. భర్త ప్రవర్తన, సంఘంలో అతనికున్న గౌరవం చూచి శారద క్రమంగా అతనిపై అభిమానం పెంచుకున్నది.పుష్పశీల హుస్సేన్ అనే మరొకడితో సంబంధం పెట్టుకోవటంతో హతాశుడై రాజేశ్వరరావు విషం తాగి చనిపోయాడు. నారాయణరావు సోదరి సత్యవతిని ఆమె భర్త కొట్టి హింసిస్తున్నట్లు 'టెలిగ్రామ్' వచ్చింది. బావకు నయానా భయానా బుద్ధి చెప్పి నారాయణరావు వాళ్ల కాపురం చక్కబరిచాడు.

కొత్తపేటలో పెదకాపుగారి సావిడికి నిప్పు అంటుకున్నది. తగలబడుతున్న మంటల్ని ఆర్పి ఆస్తిని రక్షించిన నారాయణరావు సాహసాన్ని అందరూ మెచ్చుకున్నారు. తన భర్త ఉత్తముడని శారద తెలుసుకున్నది. జగన్మోహనరావు అప్పులపాలై ఆపదలో వుంటే నారాయణరావు అప్పులు తీర్చి ఆదుకున్నాడు. అయినా జగన్మోహనరావు బుద్ధి మారలేదు. పుట్టింట్లో వున్న శారదను అతనొకనాడు ముద్దుపెట్టుకోబోతే ఆమె అతని చెంప పగలగొట్టింది.

నారాయణరావును ఆవు పొడవబోతుండగా అడ్డుకోబోయి శారద గాయపడింది. శారదకు తనపై గల ప్రేమకు నారాయణరావు సమ్మోహితుడైనాడు. శారద నారాయణరావుల దాంపత్యం అనురాగభరితమై, ఆనందపూర్ణమై విలసిల్లింది. నారాయణరావు న్యాయశాస్త్రం చదువుకున్నాడు. కళాశాలలో విద్యార్థిగా ఉన్నప్పుడే సహాయనిరాకణోద్యమం ప్రభావంతో చాలామంది నాయకులు జైళ్లకు వెళ్ళడంతో అప్పుడు చదువుకున్న, విద్యావంతులైన యువకులు కూడ జైళ్ళకు వెళ్ళడం జరిగింది. ఇది నారాయణరావు కళాశాలలో చేరిన తొలిరోజుల్లోనే జరగడం – నారాయణరావులో అప్పటినుండే జాతీయోద్యమ బీజాలు స్పష్టమైనాయి. ఆనాడు ఉద్యమాల్లో పాల్గొని జైళ్ళకు వెళ్ళడం దేశభక్తిగా భావించేవారు ప్రజలు.

గాంధీగారి సత్యాహింసలు దేశమంతా వ్యాపించాయి. దేశం మొత్తం గాంధీవైపు చూస్తుంది. ఆయనంటే అందరికీ విశ్వాసం కుదిరింది. విద్యార్థుల్లో కూడ ఇలాంటి ఆదర్శాలు బహిర్గతమైనాయి. విద్యార్థులు భారతదేశానికి స్వాతంత్ర్యం రావాలని మనస్ఫూర్తిగా

కోరుకుంటున్నారు. ''*బెంగాలు విభజనోద్యమము బాబు బిపిన్ చంద్రపాలు గారి ఆంధ్రదేశ పర్యాటనయు, వారి గాంభీరోపన్యాసములు ఆంధ్రులు యందు జాతీయభావమును, స్వరాష్ట్ర నిర్మాణవాంఛను పురిగొల్పెను. బందరు నగరమునందు వోపల్లె మాధవరావు గారు జాతీయ కళాశాల స్థాపించిరి.*''[38] మధ్య తరగతి యువత, విద్యార్థి లోకం విశేషమైన పోరాటస్ఫూర్తిని కల్గివుంది. అనేక విషయాలు గ్రంథ పఠనం ద్వారా తెలుసుకుంటున్నారు. గ్రంథాలయాల స్థాపన జరిగి, దేశంలో అన్ని ప్రాంతాల్లో జరుగుతున్న జాతీయోద్యమ భావజాలాన్ని మూలమూలను విస్తరింపజేస్తున్న సమయం.

ఇలాంటి సమయంలో నారాయణరావు కూడ గాంధీ ప్రభావాన్ని జాతీయోద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుంటాడు. లలిత కళల్లో కూడ ప్రవేశమున్నవాడు రూపసి. ఈయన రూపాన్ని వర్ణిస్తూ ''*విపులవక్షుడై, గో మూర్ధకటి సుందరుడై, అల్ప మధ్యముడై, గంభీరవదనుడై, ఉన్నత శరీరుడై, జలక్లిన్న ప్రకాశోజ్వాల హరిద్రరోహిత వర్ణుడై*''[39] అంటూ బాపిరాజుగారు వర్ణిస్తారు. అందుకె ఇంతటి అందగాడిని చూసి విశ్వలాపురం జమీందారు లక్ష్మీ సుందర వర ప్రసాదరావు మొదటి పరిచయంతోనే 'నీకు పెళ్ళి అయినదా?' అని అడుగుతాడు. ఇక్కడి జమీందారుగారి మనస్తత్వం తెలుస్తుంది. నారాయణరావుది జమీందారీ వంశం కాదు. జమీందారు ఆధునిక భావాలు గల వ్యక్తి, జమీందారీ వంశంలో పుట్టినా, నూతన భారతదేశాన్ని కలలు కంటున్న వ్యక్తి. ''*తాను జమీందారుడయ్యు రైతుల కష్టములు పటాపంచలయి వారు బాగుపడిననే కాని భావి భారత భాగ్యోదయము కాదని నిశ్చయించి పూర్వపు శాసన సభలకు నూత్న శాసన సభలకును గూడ అధిక సంఖ్యాలకులగు ప్రజలచే ప్రతినిధిగ వరింపబడి ప్రభుత్వమునకు ప్రక్కలోనే బల్లెమయి మెలగినాడు.*''[40] ప్రజా సంక్షేమమే పరమావధిగా నడుచుకునే వ్యక్తి.

నారాయణరావులో ఆధునిక భావాలను, జాతీయతాస్ఫూర్తిని చూసి తన కుమార్తెను ఇతనికిచ్చి వివాహం చేయాలని అనుకుంటాడు. కానీ జమీందారీ మిత్రులు, ఇంట్లోవారు నారాయణరావు పట్ల చిన్నచూపు చూస్తారు. తమ స్థాయిని, హోదాను అందుకోలేడని రాబోయే రోజుల్లో జమీందారీ పరువు దిగజారుతుందని అనుకుంటారు. వర ప్రసాదరావు అల్లుడిలో యోగ్యతను చూస్తాడు. హోదాను చూడడు. ఎందుకంటే, నిజానికి జమీందారు యొక్క

---

[38] ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి, పు: 447

[39] నారాయణరావు, పు:98

[40] నారాయణరావు, పు:24

భావాలకు ప్రతిబింబంలా నారాయణరావు కనిపిస్తాడు. వియ్యం అందుకోవడంలో జమీందారు యొక్క 'దూరదృష్టి'ని అర్థం చేసుకోవచ్చు.

నారాయణరావు కేవలం జాతీయోద్యమంలో చురుకుగా తిరగడమే కాకుండా, అందరితో స్నేహంగా ఉండేవాడు. ఇతరుల కష్టాలను తన కష్టాలుగా భావించే మనస్తత్వం గలవాడు. ఇంతకు ముందు తనకు ద్రోహం చేసిన వారిపట్ల ఉదారంగా ఉండగలిగిన ధీరోదాత్తుడు. ఊర్లో అగ్ని ప్రమాదం జరుగుతుంది. ఇంటి యజమాని భోషాణంలో విలువైన ప్రామిసరీనోట్లు, కొంత డబ్బు ఇతర పత్రాలుంటాయి. అవి అగ్నికి ఆహుతి అయిపోతే ఆ ఇంటి యజమానికి ఆత్మహత్యే శరణ్యంగా ఉన్నప్పుడు, నారాయణరావు వెనకాముందు ఆలోచించకుండా ఇంట్లోకి ప్రవేశించి, మాటల్ని తప్పించుకొని ఆ భోషాణాన్ని బయటికి తీస్తాడు. ఈ సంఘటన అతనిలోని ధైర్యాన్ని పరోపకారబుద్ధిని తెలియజేస్తుంది.

నారాయణరావు అల్లుడిగా రావడం జమీందారీ ఇంట్లో వాళ్ళకి నచ్చదు. రెండు కుటుంబాల మధ్య ఆర్థికమైన అంతరమే దీనికి కారణంగా కనబడుతుంది. శారద చిన్నపిల్ల. సంగీతం నేర్చుకుంటుంది. జనాకర్షంగా పాడగలదు. సంగీతంతో పాటు ఆంగ్లవిద్యను నేర్చుకుంది. ఊహ తెలీని వయస్సులో తండ్రి మాటను కాదనలేక నారాయణరావును వివాహం చేసుకుంటుంది. ఇది తల్లికి, తల్లి తరుపున బంధువులకి ఇష్టం ఉండదు. నారాయణరావు పల్లెటూరివాడని అతని కుటుంబసభ్యులు మొరటువాళ్ళనీ నిందిస్తారు. శారద ఇదంతా నిజమని నమ్ముతుంది. లోకం పోకడను అర్థం చేసుకునే వయస్సు, నేర్పు లేకపోయేసరికి తల్లి మాటలను గుడ్డిగా నమ్ముతుంది. శారద తల్లి, ఆమె బావ జగన్మోహనుడు బంధువులు ఆమె లేత మనసులో విషబీజాలు నాటుతారు.

శారద మనసు కలుషితం అయిపోతుంది. భర్తను అంగీకరించే పరిస్థితిలో ఉండదు. భార్యను తన ప్రణయదేవతగా భావించుకుంటున్న నారాయణరావు మనసు గాయపడుతుంది. అయితే అగ్నిప్రమాదం జరిగినపుడు నారాయణరావు చేసిన సాహసకార్యం, అతని పరోపకార బుద్ధి తన పట్ల ఆయన చూపే ఔదార్యం ఆమె మనస్సులో కొంత మార్పు తెస్తుంది. మొదటిరాత్రే ''*నీపై నాకు ప్రేమే లేదు*'' అని తీవ్ర స్వరంలో చెప్పిన శారద భర్త పట్ల అనురాగం పెంచుకోవడం, అతనితో కలిసి జీవిస్తూ సంసారంలోని ఆనందాన్ని అనుభవించడం ఆమెలోని గణనీయమైన మార్పును సూచిస్తుంది. మనస్సు పరిపక్వం కాని వయస్సులో వివాహం చేస్తే తల్లిమాటలు, వచ్చీ రాని వయస్సులో ఆడపిల్ల మనసును ఎంత గాయం చేస్తుందో మనం గమనించవచ్చు. లోకంలో శారద లాంటి అమాయకులు, కాపురాలు నాశనం చేసుకునేవారు అనేకమంది ఉన్నారు. అయితే

శారద చదువుకున్నది. కాబట్టి వయస్సుతో పాటు మానసికంగా కూడా పరిపక్వస్థితి చేరుకుంటుంది. పైగా భర్తతో కాపురముంటూ భర్త యొక్క శీలాన్ని దగ్గరినుండి గమనిస్తూ అతనిలోని మంచితనాన్ని అర్థం చేసుకుంది. కాబట్టే ఇంతకు ముందటి నమ్మకాన్ని కొట్టిపారేసింది. ఇక్కడ శారద యొక్క వివాహం గురించి చర్చించుకోవచ్చు. వీరేశలింగం పంతులుగారి సంస్కరణోద్యమం ప్రభావం ఆనాడు సమాజంలో చాలా చోట్ల కనిపిస్తుంది. జమీందారు గారు స్వయంగా పంతులుగారి శిష్యుడు. ఆయన భావజాలంతో నడుస్తాడు. తన కూతురు వివాహానికి 'వెయ్యినూటాపదార్లు' – 'వితంతు వివాహ సమాజానికి' విరాళంగా కూడ ఇస్తారు. కూతురు వివాహాన్ని ఘనంగా జరిపిస్తారు. పంతులుగారి శిష్యుడైన జమీందారు 'విరాళం' ఇవ్వడం బాగానే కనిపిస్తుంది. కానీ కూతురి వివాహానికి ఆడంబరంగా ఖర్చు చేయడం పంతులుగారి ఆలోచనలకు దూరంగా ఉన్నట్లు తెలుస్తుంది. అంటే ఎంత సంస్కరణ భావాలు ఉన్నప్పటికీ అవి తమ దగ్గరున్న ఆర్థికాంశాలను ఆడంబరాలను దాటి మానవీయ కోణాలను స్పృశించలేదని స్పష్టం.

విరాళమిచ్చి సమాజంలో తమకు గౌరవం పెంచుకున్నాడు. కానీ తన కుటుంబంలో సంస్కరణలు తీసుకురాలేకపోయాడు. దాన్తోనే కుమార్తె శారద నారాయణరావుని మొదట్లో అపార్థం చేసుకుంటుంది. ఇక్కడ తండ్రిగా జమీందారు గారి మనస్తత్వం పరిశీలిస్తే – ఎదురుగా చక్కనైన వ్యక్తి అల్లుడిగా వచ్చే అవకాశం కనిపిస్తుంది. అంతకంటే ముఖ్యంగా తనకు ఏమాత్రం ఇష్టంలేని మేనల్లుడు జగన్మోహనరావు యొక్క దుష్ప్రవర్తన ఎక్కడ అతను భవిష్యత్తులో తన కుమార్తెకు భర్తవుతాడోనేమో నన్న బెంగ జమీందారు స్థాయిలో ఉంటూ కూడ కుటుంబ విషయాల్లో జవాబు చెప్పుకోవలసి రావడం ఆడపిల్లల తండ్రుల అసహాయతను తెలుపుతుంది. అందుకే మంచి సంబంధం అంటూ చిన్నప్పుడే శారద పెళ్ళి చేసేశాడు.

శారదతో వివాహమయిన తొలిరోజుల్లో నీవంటే నాకిష్టం లేదన్న శారద మాటలు నారాయణరావు మనస్సును గాయపరుస్తాయి. ఈ వాస్తవాన్ని ఎలా ఎదుర్కోవాలో అర్థం కాదు. భార్యను గూర్చి ఎన్నో మధురమైన కలలు కంటూ తీయతీయని ఊహల్లో తేలిపోతూ, శారదపై ఎన్నో ఆశల్ని పెట్టుకుంటాడు. ఆమె సహకారం లేకపోవడంతో, ఇద్దరు కలిసున్న కాలమంతా ఎడమొహం, పెడమొహంగా గడిచిపోతుంది. ఈ విషయాన్ని నారాయణరావు ఎవ్వరిదగ్గరా ప్రస్తావించడు. తన ప్రాణ స్నేహితులకు కూడా తెలియనివ్వడు. మింగలేక కక్కలేక నారాయణరావు బాధనంతా మనస్సులోనే దాచుకుంటాడు. అందరితో ఎప్పటిలాగానే కలిసిమెలసి హాయిగా నవ్వుతూ తిరుగుతుంటాడు. ఈ దృశ్యం మొత్తం నారాయణరావు యొక్క

వ్యక్తిత్వాన్ని తెలుపుతుంది. కుటుంబవిషయాలను అందులో భార్యాభర్తల దాంపత్య విషయాలను మూడోకంటికి తెలియకుండా దాచడం – నారాయణరావు యొక్క నాగరికతా లక్షణాల్ని తెలియజేస్తుంది. భార్య తనను ఎప్పటికీ ప్రేమించకపోతే ఎలా అంటూ ''*సంఘము యొక్క దౌర్భాగ్యస్థితి యట్లున్నది. వివాహములు నిజముగా ఇనుపగుళ్ళ భోనులా? ఒకసారి వివాహమయినచోనది రద్దగుటకు వీలులేదు.*'' [41] తనలో తానే అసహనాన్ని వ్యక్తం చేసుకుంటాడు. కానీ ఆ అసహనం వివాహవ్యవస్థ మీద ఉండడం విచారకరం. జాతీయభావాలు గల వ్యక్తి సంస్కారవంతుడైన నారాయణరావే ఇంతలా ఆలోచించాడంటే అవగాహన, ఓర్పు, సహనం లేని వారి వివాహాలు ఎంతలా నరక ప్రాయమైనాయో ననిపిస్తుంది. ఈ విధమైన సహనమే నారాయణరావు దాంపత్యాన్ని సఫలం చేస్తుంది.

నారాయణరావు బావ మాత్రం భార్యను అనుమానించి హింసిస్తుంటాడు. సత్యవతి భర్త పెట్టే బాధల్ని అనుభవిస్తుంది. నారాయణరావు బావను మార్చే ప్రయత్నం చేస్తాడు. ప్రాచీన పతివ్రతల్ని ఉదహరిస్తారు. భార్యను 'మనిషి'లా చూడమంటాడు. కాపాన్ని తలచుకొని, శాంతంగా ఉండాలంటాడు. ఎదుటివారి ఇష్టాఇష్టాలను గమనించాలని బావకు హితవు చెప్తాడు. స్త్రీ, పురుషుడిని ఎదురించలేదు. కాబట్టి వాళ్ళ పట్ల కోపంతో, వాళ్ళని అణచి ఉంచడం మంచిది కాదని వారిపట్ల ప్రేమచూపితే వారు మన పట్ల కృతజ్ఞతగా ఉంటారని చెప్తాడు. ''*ఆడది ఎల్లగా దెబ్బలు పడుతుంది. ఎదిరించలేదు. అది పతివ్రతులకు ధర్మం! సహజం! కాని వాళ్ళు మన తోటి వాళ్ళు అని ఆలోచించాలి. నేను నిన్ను వేడుకునేదింతే.*''[42] అని బావను మేల్కొలిపే ప్రయత్నం చేస్తాడు. స్త్రీ మగవాడు కొట్టినా, తిట్టినా పడి ఉండాల్సిన అవసరం ఏమిటో తెలియదు. ఆర్థిక స్వాతంత్ర్యం విద్యాగంధం లేని స్త్రీలు, సమాజం పట్ల ఏ మాత్రం అవగాహన లేని వాళ్ళు భర్తల నిరంకుశత్వానికి, ఎదురుచెప్పలేక వారి కాళ్ళ దగ్గర పడి ఉండవచ్చు. కానీ నారాయణరావు లాంటి ఉన్నత విద్యావంతుడి సోదరి చదువుకున్నది. అంతగా వ్యక్తిత్వాన్ని కోల్పోనవసరం లేదు. దానికి నారాయణరావు వచ్చి 'ధర్మబోధ' చేయడమనవసరం – ఇక్కడ 'పతివ్రతా ధర్మం' మగవాడి క్రూరత్వాన్ని అంగీకరించేందుకు ఉపయోగపడడం విచారకరం. భారతీయ వివాహవ్యవస్థ ధర్మం గురించి చాలా విపులంగా చర్చించింది.

నారాయణరావులోని ఇంకొక విషయం మనకు బోధ పడుతుంది. తన దాంపత్య విషయాలు అటు తల్లిదండ్రులతో గాని, మిత్రులతో చర్చించేందుకు గాని కనీసం

---

[41] నారాయణరావు, పు:251

[42] నారాయణరావు, పు:190

ప్రస్తావించేందుకూ ఇష్టపడదు. కానీ సోదరి సంసారం విషయంలో బహిరంగంగా 'బావకు సుద్దులు' చెప్తాడు. సోదరి కాపురం సరిదిద్దే బాధ్యత నారాయణరావుపై ఉన్నప్పటికీ, ఆలుమగల విషయంలో పట్టించుకోవడం ఆశ్చర్యకరం. ఇక్కడ నారాయణరావు తెలియకుండానే తన సోదరి కుటుంబవ్యవహారాల్లో దూరే ప్రయత్నమే చేస్తాడు. దీన్నే నారాయణరావు తన యొక్క ఉన్నతమైన శీలంతో భార్య మనస్సును తనవైపుకి ఎలాగైతే తిప్పుకున్నారో అలాగే — బావ ఎంతటి క్రూరుడైనా — భార్యభర్తల మధ్య అవగాహన వారిద్దరి మధ్య జరిగే సంఘటనల ఆధారంగానే ఒకటయ్యేలా ఏర్పాటు చేస్తే విజ్ఞతగా ఉండేది. మూడో వ్యక్తి సిఫారసువల్ల, బెదిరింపుల వల్ల, ఉపన్యాసాల వల్ల, కుటుంబాల్లోని పొరపొచ్చాలు తొలగిపోవు. ఇద్దరు చక్కని అవగాహన, నిజాయితీలతో కూడిన నమ్మకాల్ని పెంపొందించే ప్రయత్నమే చేయాలి. సహాయనిరాకరణలో పాల్గొని ఉపన్యాసాలిచ్చిన ధోరణిలో బావకు ఉపదేశం చేస్తాడు. నారాయణరావు, అయితే సమాజంలో మార్పుకోసం ఉపన్యాసాలు, సంసారంలో మార్పుకోసం ఉపచారాలు మాత్రమే వాటిని బలోపేతం చేయగలవు.

ఈ రకమైన 'గృహహింస'కు కారణం ఏ ఒకరిద్దరు వ్యక్తుల యొక్క బలహీనత మూర్ఖత్వం అనుకోరాదు. ఇలా ఎవరైనా ఉపన్యాసాలతో ఎందర్ని మార్చగలడు? ఈ లోపం సామాజిక వ్యవస్థలోనే ఉన్నది. ''*కుటుంబం అనేది నాల్గు దశలు గడిచి అయిదో దశలో వుందని మనం ఒప్పుకుంటే భవిష్యత్తులో ఈ దశ మాత్రం స్థిరంగా ఉండగలదా అనే ప్రశ్న వెంటనే ఉదయిస్తుంది. దానికొక్కటే సమాధానం గతంలో లాగానే భవిష్యత్తులో కూడ సమాజం పురోగమించినప్పుడల్లా అది కూడా పురోగమించాలి. సమాజం మారినప్పుడల్లా దానితోపాటు అది కూడా మారిపోతుంది. దానిని సామాజిక వ్యవస్థ సృష్టించింది. కనక సామాజిక సంస్కృతి దానితో ప్రతిబింబిస్తుంటుంది. నాగరిక యుగం వచ్చాక దంపతీ కుటుంబంలో ఎంతో మార్పు వచ్చింది.... దీనిని బట్టి స్త్రీ పురుషుల మధ్య సమానత్వం సాధించబడేంతవరకూ దానిలో ఇంకా మార్పులు వచ్చే అవకాశం వుందనుకోవచ్చు.*''[43] పురుషాధిక్యసమాజం — తన స్వరూపాన్ని స్వభావాన్ని మార్చుకుంటే తప్ప స్త్రీల సమస్యలు పరిష్కారం కాలేవు.

నిజానికి, నారాయణరావు తన సోదరి విషయంలో, భార్యాభర్తల మధ్య విభేదాలకు కారణాలేమిటి? అనే ఆలోచనలు కూడ చేయడు. ప్రేమతో చూసినంతమాత్రాన స్త్రీల సమస్యలు తీరుతాయా! చదువుకున్న స్త్రీ యొక్క మనస్సెరిగి, ఆమె చదువును ఇంటినీ, సమాజాన్ని మర్చేందుకు, చక్కదిద్దుకునేందుకే ఉపయోగపడేలా చేయడంతోనే — నిజంగా స్త్రీ కి

---

[43] మార్క్స్ — ఎంగెల్స్ రచనలు, పు: 215 — 216

గౌరవమిచ్చినట్లు. ఆ ధోరణిలో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నం నారాయణరావు చేసినట్లు కనిపించరు. నారాయణరావు కళారాధకుడు కాబట్టి సౌందర్యాత్మక దృష్టి ఎక్కువగా ఉంటుంది. భార్యాభర్తల మధ్య సంబంధాల్ని కేవలం కళాత్మకంగానే చూసాడు. కానీ ఇద్దరి మధ్య భౌతిక కారణాల అనేకం ఉంటాయి.

శారద మేనబావ జగన్మోహనుడు. జమీందారు భార్య వరదకామేశ్వరీదేవికి మేనల్లుడు. ఎలాగైనా శారదను తనదానిగా చేసుకోవాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. ఆనాడు పతనావస్థలో ఉన్న జమీందారీ వ్యవస్థను ప్రతిబింబం జగన్మోగహనరావు బ్రహ్మసామాజికున్ని అని చెప్పుకుంటారు. జంధ్యం తీసివేసాడు. తద్దినాలు మానివేసాడు. ''*పాశ్చాత్య సాహిత్య సంస్కృతుల ప్రభావము భారతీయుల రాజకీయార్థిక నైతిక జీవితములందు గొప్ప మార్పులను తెచ్చెను. భారతీయుల వేషభాషలు విద్యావిధానము, ఆచారవ్యవహారములు మతము, విశ్వాసముల ఒకటనేల సర్వసంస్కృతి యిందును గొప్ప విప్లవము సంభవించెను.*''[44] పాశ్చాత్య నాగరికతను ఒంటబట్టించుకున్నవాడు. భోగవిలాసాలకు మరిగినవాడు. కట్నం తీసుకొను విధవా వివాహం చేసుకుంటానంటాడు. తర్వాత కట్నం తీసుకొని పెళ్ళి చేసుకుంటాడు. ''*పాశ్చాత్య నాగరికతా ప్రభావము మొట్టమొదట వంగదేశములో కన్పించెను. ఆంగ్లేయ పరిపాలనతో పాటు క్రైస్తవ మతము కూడ దేశమునందు వ్యాపింపజొచ్చెను. తన్మత ప్రచారకులైన మిషనరీలు అభినివేకము తోను, అసూయతోను, హిందూమతమును భజింప దొరకొనిరి.... పూర్వాచారా ప్రియులైన భారతీయులను హేళన చేయుటయు, వారి మత విశ్వాసముల ధిక్కరించుటయు, వీరి కార్యముగ పరిగణింపబడెను.*''[45]

నూతనంగా సంస్కర్త రూపాన్ని పొందుతాడు. ఇలా సంస్కర్తలపేరుతో ఎప్పుడూ, ఏ కాలంలోనైనా కొందరూ కుహానా ఆలోచనాపరులు కొన్ని విచిత్రమైన చర్యలు చేస్తారు. జంధ్యం తీసివేయడం, తద్దినాలు మానేయడం లాంటివి. ఇవి మానేస్తే – జరిగిందేమిటి? ఒరిగిందేమిటి? అతని జీవన విధానంలో ఆర్థిక సామాజిక స్థితిగతుల్లో ఏమైనా మార్పు వచ్చిందా? అతనిని నిజ జీవితంలో 'జరుగుబాటు'కి ఎక్కడైనా ఇబ్బంది కల్గిందా? నయాపైసా ఖర్చులేని పని జంధ్యం తీసేయడం? తద్దినాలు మానేయడం – పై పెచ్చు దానివల్ల అయ్యే మిగులు – 'లాభం'. ఇలాంటి పనులు చేస్తూ – సంస్కర్తల్లా ప్రవర్తింపజూస్తారు. నిజానికి ఇవే ఒకప్పుడు భారతదేశంలో సనాతన ధర్మాన్ని నిలబెట్టి – పూర్వీకుల ఆచార సాంప్రదాయాల్ని కాపాడుకుంటూ వచ్చినవి.

[44] భావుకసీమ, పు: 180

[45] ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి, పు: 432

క్రమేణా కాలం మారుతున్న కొద్దీ సమాజంలో అనేకమైన భౌతిక, అధ్యాత్మిక మార్పులు వచ్చాయి. వాటి ఆధారంగా ప్రజలు జీవిస్తున్నారు కానీ ఈ కుహనా సంస్కర్తలు తమ పవిత్రతను నిరూపించుకునేందుకు అనూచానంగా వస్తున్న భారతీయ మౌలిక భావాలపై తమ నిరసన వ్యక్తం చేసారు. ఇలా చేయడం వల్ల సమాజంలో వీరిని ఎవ్వరూ ప్రశ్నించరు! పైగా సంస్కరణవాదులు అనే పేరు కూడా.

తర్వాత ఈ జగన్మోహనరావు లాంటి వాళ్ళు, వాళ్ళ ఆర్థిక వ్యవహారాలకు ఇబ్బంది రానంతవరకు సంస్కరణవంతులు, కొత్తకొత్తగా అనేక సంస్కరణలని, తీసుకువచ్చి – సంఘ మర్యాదల్ని పొందుతారు. సంస్కరణోద్యమం ప్రభావమే ఇది. జగన్మోహనరావుకు అవకాశం చిక్కినప్పుడల్లా నారాయణరావు గురించి అనేక విధాల చెడు ప్రసంగాలు చేసి శారద మనస్సును తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తాడు. దీనికి శారద తల్లి ప్రోత్సాహం కూడ లభిస్తుంది. ఈ సంఘటన జమీందారీ వ్యవస్థలోని 'కుళ్ళు'ను తెలుపుతుంది. స్వయానా తల్లే కూతురు కాపురాన్ని కూల్చే ప్రయత్నం చేస్తుంది. పెళ్ళయిన కూతురును ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్న మేనల్లుణ్ని హెచ్చరించేది పోయి, కూతురి దృష్టి నుండి అల్లుణ్ని తొలగించె ప్రయత్నం చేస్తుంది. అగ్నిసాక్షిగా పెళ్ళయిన దంపతులను కేవలం తన మాట చెల్లుబాటు కాలేదని నిస్సంకోచంగా వేరుచేసే ఆలోచన దుర్మార్గంగా కనిపిస్తుంది. దీన్తో జగన్మోహనరావు ఆలోచనలు మరింత వికృతంగా తయారవుతాయి. ఇదే నారాయణరావు దంపతుల మధ్య దూరం పెంచుతుంది.

దివాళాతీస్తున్న జమీందారీ వ్యవస్థకు ప్రతిబింబమైన జగన్మోహనరావు దృష్టిలో భారతీయుల కన్న పాశ్చాత్యులు గొప్పవారు. వారి నాగరికత గొప్పది. ఈతనికి లేని చెడు అలవాటు లేదు. విస్కి, బ్రాందీలు తీసుకోవడం, గొడ్డుమాంసం భక్షించడం, భోగకాంతలతోడి జల్సాచేయడం, ఆ స్త్రీల సంతృప్తిపై తన ధనాన్ని నీళ్ళలాగ ఖర్చుచేయడం అతని నిత్యకృత్యాలలో కొన్ని, యూరోపియన్ జాతికి చెందిన డయానా జగన్మోహనుడి ప్రియరాళ్ళలో ముఖ్యురాలు. ఆమె సాంగత్యంలో తన సర్వస్వాన్ని కోల్పోయి అప్పుల పాలైనాడు. ఇతని యొక్క నిజ స్వరూపాన్ని చివర్లో గమనించిన మేనత్త వరద కామేశ్వరీదేవి ఇంటి నుండి గెంటివేస్తుంది. చివరిక నారాయణ రావే ఇతన్ని ఆదుకుంటాడు.

స్వేచ్ఛా ప్రణయ సిద్ధాంతాన్ని ప్రచారాన్ని చేసే వ్యక్తులు నారాయణరావు స్నేహితుడు తిరుపతిరావుకి స్త్రీ పురుషుల మధ్య సంబంధం – వారి స్వేచ్ఛకు భంగం కలిగించని రీతిలో ఉండాలని, వివాహం వారి కోర్కెలను కట్టివేస్తుందని స్త్రీ పురుషులు వారికి ఇష్టం వచ్చిన రీతిలో జీవనం కొనసాగించే స్వేచ్ఛ ఉండాలని కుటుంబం వారి పాలిట ప్రతిబంధకం కాకూడదని –

ఇలా స్వేచ్ఛా ప్రణయాన్ని శిష్యులకు నూరిపోస్తుంటాడు. ''*భౌతిక శక్తులను గుర్తించి సహజ – కుటుంబ – వైయుక్తిక పరస్పర ప్రభావాలను విశ్లేషణాత్మకంగా పరిశీలించి చారిత్రక అవగాహనతో రచనలు చేసే రచయిత ప్రతిస్పందన వేరు. భావకుడు, కాల్పనికుడు రచయిత రచనల్లో సాధారణంగా ఆలోచన కన్నా స్పందన తీవ్రంగానూ, అధిక తరంగానూ వుంటుంది.*''[46] వీరి సిద్ధాంతంలోని అసలు సమస్య – వీరి శృంగార కామకేళి నిరాఘాటంగా జరిగిపోతుంది సరే. కాని వారి నిత్యజీవితంలోని మిగతా అవసరాలు ఎలా తీరుతాయి? ఎవరు తీరుస్తారు? అనేది ఎక్కడా ప్రస్తావించకపోవడం గమనార్హం.

తిరుపతిరావు తాను సమాజంలో ఏయే మార్పులు రావాలని పోరాడుతున్నాడో, ఆ చరణాత్మకంగా పాటించి చూపుతూ ప్రచారం చేస్తున్న అకల్మష హృదయుడుగా, అతని అభిప్రాయాలతో ఏకీభవించని వారిచేత కూడ మెప్పు పొందుతున్నాడని రచయిత ఆ పాత్ర గురించి తెలియజేస్తాడు. ''*జీవించినందుకు రెండే ఫలితాలు. తీవ్రమైన ప్రేమతో జీవితం వెలగాలి. లేకపోతే విరహంతో కాలిపోవాలి. అంతేకాని ధనము, సుఖము, భోజనము ఇవన్నీ కలిగి బతకడం యెందుకు*''[47] లాంటి భావాలు ప్రచారం చేస్తూ యువకులను తన వైపుకి తిప్పుకుంటాడు.

తిరుపతిరావు శిష్యుడు రాజేశ్వరరావు 'స్వేచ్ఛాప్రణయం'తో తన జీవితాన్ని గడిపేందుకు నిశ్చయించుకుంటాడు. సుబ్బయశాస్త్రి భార్య పుష్పలీలను లేవదీసుకుపోతాడు. ఇలాంటి సంఘటనలు విచిత్రంగాను, జుగుప్సాకరంగాను కనిపిస్తాయి. ''*వైయుక్తిక ప్రణయమెంత మధురమైనా, దాంపత్య ధర్మం స్వీకరించిన తర్వాత సహజ ప్రణయాన్నే పోషించుకోవడం సాంఘిక దాంపత్యధర్మాన్ని సమూలంగా ఛేదించుటయే*''[48] ఒక వ్యక్తి నిజంగా ప్రేమించదలిస్తే, అతనికి నిజంగా పాశ్చాత్య నాగరికత అంటే ఇష్టంగా ఉంటే ప్రేమపై అంతటి నమ్మకమే ఉంటే – ఇలా పరాయి వాడి భార్యను లేవదీసుకపోవడంలో ఔచిత్యం ఏమిటో అర్థం కాదు. ఇది కేవలం భారతీయ కుటుంబ వ్యవస్థపై జరుగుతున్న దాడిగా గమనించవచ్చు.

అనేక కుటుంబాల్లో భార్యభర్తల్లో రకరకాల బలహీనతలు ఉంటాయి. అది సహజం అయినంత మాత్రాన కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసుకోవడం తాను కూర్చున్న కొమ్మను తానే నరుకుకుపోవడం లాంటిది. ప్రేమకు గౌరవమిచ్చి, స్వేచ్ఛా ప్రణయానికి విలువనిస్తే అలాంటి

---

[46] చలం – మ్యూజింగ్స్ , పు: 63

[47] చలం – ప్రేమలేఖలు, పు: 74

[48] శ్వేతపద్మం, పు: 285

స్వేచ్ఛనుకోరే పెళ్ళి కాని యువతీమణులతో ఈ వ్యవహారాన్ని నడిపించవచ్చు. ఎందుకంటే — ఆ స్వేచ్ఛా ప్రణయ సమయంలో నిజంగానే వారి శరీరాలతోపాటు ఆత్మలూ ఏకం అయ్యే అవకాశం ఉండొచ్చు. అప్పటికి వచ్చిన అనుభవంతో ఇద్దరు 'వివాహబంధం'తో ఒకటి కావచ్చు. లేక అలాగే ఉండిపోవచ్చు. కాని సంసారంలోకి స్వేచ్ఛా ప్రణయాన్ని తీసుకురావడం వల్ల — కచ్చితంగా ఒక కుటుంబం మాత్రం కూలిపోతుంది. ఇది ఎవరికీ మేలుచేసేదో!

ఈ స్వేచ్ఛాప్రణయ సంఘంలో రాజేశ్వరరావుతో పాటు సుబ్బయ్యశాస్త్రి కూడా సభ్యులే. సుబ్బయ్యశాస్త్రి కూడా తాను పరాయిస్త్రీలతో ఆనందించేందుకే ఆ సంఘంలో చేరడం గమనార్హం. సుబ్బయ్యశాస్త్రి వేరు స్త్రీ పొందుకోసం చూస్తుంటే తన స్త్రీని పొందేందుకు వేరేవాడు చూస్తున్నాడన్న విషయాన్ని గమనించలేక పోయారు. కామంతో కళ్ళు మూసుకుపోయిన సుబ్బయ్యశాస్త్రికి ఇంట్లోంచి భార్య లేచిపోయేసరికి 'స్పృహ'లోకి వచ్చాడు. ఎంతో కృంగిపోయాడు. రాజేశ్వరరావు, పుష్పలీలల ప్రణయం కొంతకాలం హాయిగా సాగుతుంది. తర్వాత పుష్పలీల మనసు మరో యువకుని మీదికి పోతుంది. ''పాత ప్రియుణ్ణిగాన్ని, భర్తనిగాని వొదిలి యింకొకర్ని ప్రేమించడానికి ప్రతి స్త్రీకి స్వేచ్ఛ వుండాలి. అది వుపయోగించవలసిన అవసరం కలగడం దురదృష్టమంటాను.''[49]

ఇదేమీ వాళ్ళ స్వేచ్ఛా సంఘం భావాలకు వ్యతిరేకం కాకపోయినా, పైగా అది వాళ్ళు కోరిన స్వాతంత్ర్యమే అయినా తన దురదృష్టానికి కుమిలిపోతూ ''*స్త్రీ యింకెవరినీ మోహించకుండా తనని మోహించడం మానినా సహిస్తాడు. కాని యింకొకరిని మోహించగానే అతని మీద 'జెలసీ' వొస్తుంది. తనని మోహానో యింకొకరి మీద కొంచెంగా మొహం చూపినా యీ 'జెలసీ' తప్పదు. అప్పుడు బాధ యింకా ఎక్కువ. తను మోహించిందా యితని మోహమంతా ద్వేషంగా మారుతుంది. ఆమె కష్టాలు పడ్డకొద్దీ యితనికి సంతోషం. ఇది పశుత్వం. మొగకుక్కలు ఆడకుక్కల కోసం పోట్లాడిన తత్వం యింకా మనుషుల్లో కనిపిస్తోంది. వీనివల్లనే తగాదాలు, కొట్టుకోడాలు, నరుక్కోడాలు జరుగుతో వుంటాయి.*''[50] తాను పుష్పలీలకు ఆటంకం కావడం ఇష్టంలేక తనే ఆత్మహత్య చేసుకొంటాడు రాజేశ్వరరావు.

ఒక జాతి యొక్క సంస్కృతి. వారసత్వాలు ఆదేశ, భౌగోళిక పరిస్థితులు, వాతావరణం, శీతోష్ణస్థితిపై కూడ ఆధారపడతాయి. ఒక్కోదేశం ఒక్కోజాతి తమ సంస్కృతి, వారసత్వాలను క్రమక్రమంగా నిర్మించుకుంటూ వస్తాయి. ఏ చిన్న ఉత్సాహమో, ఆవేశమో దాని మూలాలను

---

[49] చలం — ప్రేమలేఖలు, పు: 251.

[50] స్త్రీ, పు:82

ఛేదించలేదు. ''.....కాని, భారతీయుల దృష్టిలో ఇవన్ని పరస్పర సంబంధాలతో పెనవేసుకొని ఉన్నాయి. మతము సంఘ పరము, సంఘము మత నిబంధనానుగుణంగా సాగుతుంది. అందువల్లనే ఈ జీవితాన్ని స్వయం సిద్ధంగా భావించక మానవుడు సాధించవలసిన పురుషార్థాల సాధనంగా గ్రహించినాడు. ధర్మార్థకామ మోక్షాలు మానవ జీవిత ధ్యేయాన్ని నిర్దేశిస్తున్నాయి. మానవుని అర్థకామ మోక్షసాధన ధర్మబద్ధంగా ఉంటుంది. ధర్మము సంఘబద్ధమయి ఉంటుంది. ఆ విధంగా మానవుని జీవితము సంఘ బద్ధమైపోతుంది. మోక్షాన్ని కాక్షించిన మానవుడు ఈ జీవిత నిరర్థకతను గ్రహించే పారమార్థిక చింతనావశ్యకతను గుర్తించి తత్వాన్వేషణ దృష్టితో సాగుతాడు''[51] కొన్ని వేల యేండ్లుగా మనదేశంలో బలీయమైన నాగరికత ఉంది. అనేకమంది ఋషులు, మునులు, పవిత్రమైన ఆలోచనలు, విస్తృతమైన సాహిత్యం అనేకమంది చక్రవర్తుల పరిపాలన, మనదేశానికి ఒక నిర్ధిష్టమైన పటిష్టమైన జీవన విధానాన్ని సృష్టించాయి.

''భారతదేశంలో తత్వశాస్త్రం ప్రధానంగా ఆధ్యాత్మికమైనది. భారతదేశం అభివృద్ధి చేసిన గాఢ ఆధ్యాత్మికత ఈ దేశాన్ని కాల ప్రవాహంలో కలిగే నష్టాలనుండి చరిత్ర దురదృష్టాల నుండి కాపాడింది. రాజకీయ వ్యవస్థ లేక సాంఘిక నిర్మాణమో కాదు. భారతీయ సంస్కృతినంతా ప్రభావితం చేసి, భారతీయ ఆలోచనంతా రూపుదిద్దిన ప్రధానశక్తి ఈ ఆధ్యాత్మికత ధోరణి ఇదొక మార్మికత. ఏదో అమానుషశక్తికి ఇందులో ప్రమేయం ఉన్నదని కాదు. ఆధ్యాత్మిక దిశను చేరుకునేందుకు మానవ స్వభావం పాటించే కఠిన క్రమశిక్షణే ఈ మార్మికత''[52] మనిషి కేవలం భౌతికమైన వనరు మాత్రమే కాదు. అతడు అందుకోవాల్సిన చేరుకోవాల్సిన ఉన్నతస్థాయి, 'ఆధ్యాత్మికత' ఆ వైపుగా ప్రయాణం సాగించడంలోనే జీవితానికి అసలైన అర్థం ఉందని ఇన్నివేల సంవత్సరాల నాగరికత మనకు నేర్పింది. ధృఢంగా నిర్మించబడిన భారతీయ వ్యవస్థలో అత్యంత ప్రధానమైనది 'వివాహవ్యవస్థ'. ఈ వివాహవ్యవస్థ ఆధారంగానే మనదేశంలో అన్నిరకాల వ్యవస్థలు తమ అస్తిత్వాన్ని కాపాడుకుంటున్నాయి. ఈ వివాహవ్యవస్థనే భారతీయ లౌకిక జీవనానికి జీవకర్ర.

ఇంతటి వ్యవస్థను కేవలం క్షణికావేశంలో కూలదోయాలనుకోవడం కేవలం భ్రమే. అందుకే సుబ్బయ్యశాస్త్రి, రాజేశ్వరరావు, పుష్పలీలలు ముగ్గురూ జీవితాల్లో ఓడిపోయారు. స్వేచ్ఛా ప్రణయం సిద్ధాంతాన్ని పుష్పలీల ఖచ్చితంగా పాటించింది. భర్తలో కొన్నాళ్ళు, రాజేశ్వరరావుతో కొన్నాళ్ళు తర్వాత మరొకరితో — ఇక్కడ అర్థం చేసుకోవలసింది. పుష్పలీల

[51] భారతీయ దర్శనం, పు: 6

[52] భారతీయ తత్త్వశాస్త్రం, పు: 194

శారీరకమైన స్వేచ్ఛకు ఎక్కడా భంగం జరుగలేదు. కానీ ఆమె శరీర లావణ్యం శాశ్వతంగా ఉంటుందా? ఇప్పుడుంటే వయస్సులో ఉంది కాబట్టి ఆమెని చేబట్టినవాడు ఆమె బాగోగులు చూసుకుంటాడు. కానీ, వయస్సు మీరిన తర్వాత లావణ్యం తగ్గిన తర్వాత – స్వేచ్ఛా ప్రణయం యొక్క ప్రయాణం ఎటువైపు? అనేది ప్రశ్నార్థకం. అలాగే సుబ్బయ్యశాస్త్రి తీవ్రంగా క్రుంగిపోయాడట – ఎందుకు? తను వేరే స్త్రీ పొందుకోసం చూస్తుంటే, మరి ఆ కుటుంబసభ్యుల మానసిక, సామాజిక పరిస్థితులు ఏంటి? అనే విషయం జ్ఞాపకం రాలేదు. రాజేశ్వరరావు ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏమిటి? పుష్పలీలకు తాను ఆటంకం కాకూడదని చనిపోయాడట? స్వేచ్ఛా ప్రణయంతో ఆటంకం ఎక్కడిది? తన భర్తనే వదిలేసి వచ్చిన స్త్రీ, ఇతనితో శాశ్వతంగా ఉంటుందనీ ఎలా అనుకున్నాడు? స్వేచ్ఛగా నడిచే వారెవ్వరికి శాశ్వతత్వం మీద నమ్మకముండకూడదు. తత్కాల వాంఛలని తృప్తి పరుచుకోవడం తప్ప, స్వేచ్ఛా ప్రణయంపై మిత్రుడై రాజేశ్వరరావుతో చర్చిస్తాడు నారాయణరావు. ''*స్త్రీ పురుషులు స్వేచ్ఛ పరులయి నిరంతరం సంఘ సుస్థితి భంగం కలిగించే కొట్లాటలు తెచ్చిపెట్టుకోగారరు.*''[53] అని అంటాడు. ఇంకా, వివాహ ప్రసక్తి లేకపోయినా సరే స్త్రీ పురుషులు జంటగా సహజీవనమైనా చేయాలిగదా! అంటాడు. ఒక స్త్రీ, ఒక పురుషుడు అనే సంప్రదాయాన్నైనా పాటించాలి అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తాడు. స్త్రీ కి స్వాతంత్ర్యమివ్వడం అంటే ఇష్టమొచ్చిన రీతిగా శృంగార కార్యకలాపాలు సాగించడం కాదనే నారాయణరావు అభిప్రాయం.

''*కుటుంబం అనేది నిత్యం మారుతూ ఉంటుంది. అదెప్పుడు స్థిరంగా వుండదు. సమాజం నిమ్నదశ నుండి ఉన్నతదశకు మారుతున్న కొద్దీ అది కూడ నిమ్నదశ నుండి ఉన్నతదశకు పరోగమిస్తూవుంటుంది..... కాని కుటంబసంబంధాల వ్యవస్థ అలాకాదు. అది మారదు. చాలా కాలానికో మారు, కుటుంబంలో వచ్చిన ప్రధానమైన మార్పుల్ని అది నమోదు చేస్తుంటుంది. కుటుంబవ్యవస్థ గణనీయంగా మారినప్పుడు అదీ మారుతుంది. అంతవరకు అది మారదు*''[54] సహజీవనంలో నీతి, నియమాలు ఉన్నట్లయితే – అవి సంఘనీతికి ఏ మాత్రం ఆటంకం కలిగించకపోతే అలాంటి ప్రణయం అహ్వానించదగిందే అంటాడు. వివాహవ్యవస్థలో లోటుపాట్లు ఉంటే, వాటిని సరిచేసుకోవాలి గానీ, మొత్తం వివాహవ్యవస్థనే కాదని, విచ్చలవిడిగా తిరగడం దుష్పరిణామాలకు దారితీస్తుందని రాజేశ్వరరావుకి బోధిస్తాడు నారాయణరావు.

---

[53] నారాయణరావు, పు:83

[54] మార్క్స్ – ఎంగెల్ రచనలు, పు: 160

స్వేచ్ఛా ప్రణయ సిద్ధాంతం ప్రకారం "*స్త్రీ స్వాతంత్ర్యం, అన్నదమ్ములతో పాటు స్త్రీలకు పితృస్వమున భాగమొసగు చట్టము. విడాకుల చట్టము. పరభార్యా సంభోగమునకు, గర్భవిచ్ఛిత్తికి శిక్షాస్మృతిలో ఏర్పడిన శిక్షలు తొలగించుట*"[55] మొదలైనవి వీరి ఆశయములని తెలుస్తుంది. అయితే ఇందులో కొన్నిటి వల్ల సమాజానికి ఎలాంటి కీడు సంభవించకపోగా ఆడవారిని ఉద్ధరించేవిగా కనిపిస్తాయి. తల్లిదండ్రుల ఆస్తిలో వాటా విడాకుల చట్టము లాంటివి నిజంగా స్త్రీకి నైతికబలాన్ని ఇచ్చేవే. "*నేను వాంఛించే మార్పు యీ వివాహంలో వున్న అక్రమాలు, అన్యాయాలు పోవాలని, ఈ దుర్మార్గాలు వొదిలించినంత మాత్రాన అసలు చచ్చేటంత దుర్భరం కాదు. వివాహం, అంతేకాకుండా వివాహం వొద్దన్న వాళ్ళకి బలవంతంగా కట్టకూడదనీ, వివాహం అయినంత మాత్రాన సర్వమూ నీతిగా తలచడమూ, కానంత మాత్రాన అవినీతి అనడమూ మూర్ఖమనీ నా వాదన*"[56] అయితే పరభార్యా సంభోగము లాంటివి. స్వేచ్ఛా రూపంలో వస్తున్న సంఘపతన హేతువులు.

ఏ భావజాలమైనా దాని పర్యవసానం ఎలా ఉంటుందో, ముందే మేధావులు ఊహించి ప్రచారం చేయాలి. సామాన్య ప్రజానీకం మేధావుల ఆలోచనలకు ఎంతో విలువనిస్తారు. తాము ఎంచుకన్న మార్గం తమ జీవితాలకు ఆటంకంగా మారితే, తామ ఊహించిన ఫలితాలు ఆ సిద్ధాంతములో కనబడకపోతే – ముందు ఎంతగా ఉత్సాహవంతులై దానిని ఆచరించారో విఫలమైతే అంతకన్నా ఎక్కువగా ఉద్రేకపడతారు. సమాజంలో ఎక్కువ శాతం ప్రజలు ఆమోదించిన ప్రయత్నాలు విఫలమైతే, దానికి సమాజం మొత్తంగా స్పందించి – తమ నిర్ణయాల్ని పునః సమీక్షించుకునే అవకాశం లభిస్తుంది. "*..... ఎంత నరకంగా వున్న, లేచిపోవడం కన్న సంసారమే నయం. ఎంత బాధలువున్నా సంసారంలో స్త్రీ కి ఒక స్థానం వుంది. ఎంత నీచమైన స్థానమైనా సరే దాంట్లోనే ఓ విధమైన రక్షణా, శాంతీ వున్నాయి. సంఘం ఇరుగుపొరుగూ, బంధువులూ కొంతవరకన్నా స్త్రీ వైపు పలుకుతారు.*"[57]

ఏ కొద్దిమందో సంఘసభ్యుల ఆరాటమైతే దానికి సమాజం అంగీకరించదు. తత్ఫలితంగా ఆ సంఘసభ్యులు పతనావస్థకి చేరుకుంటారు.అయితే ఈ చర్చల్లో కూడా నారాయణరావు ఆలోచనల్లో కొంతవైరుధ్యము కనిపిస్తుంది. మానవ సంబంధాల విశ్లేషణలో తన, పరభేదం ఇక్కడ కనిపిస్తుంది. "*పూర్వకాలం నుండి స్త్రీ తన ప్రకృతి లోపమువల్ల నొక*

---

[55] నారాయణరావు, పు:85

[56] చలం – మ్యూజింగ్స్ , పు: 33

[57] స్త్రీ, పు: 241

*పురుషుని జేరి అతని నాధార పరచుకొని యున్నది. అంతియే కాని తాను బానిసయై పురుషునికి లోబడి యుండలేదు.*''[58] అనే సందర్భంలో 'ప్రకృతి లోపము' ఏమిటో తెలియడం లేదు. శారీరక అవస్థలను 'ప్రకృతి లోపం'గా ఎలా భావించవచ్చు? అలా భావించడంలోనే పురుషస్వామ్యం కనిపిస్తుంది. స్త్రీల పట్ల అనవసరపు సానుభూతి కనిపిస్తుంది. ఈ సానుభూతి స్త్రీల చైతన్యానికి ఏ మాత్రం ఉపయోగపడనిది. నారాయణరావు బావ తన సోదరిని బాధపెడుతుంటాడు. సోదరి సంసారాన్ని చక్కదిద్దేందుకు బావకు బోధ చేస్తాడు. 'మన క్రింద పడి వుండే స్త్రీ లను బానిసలుగా చూడకూడదు. వాళ్ళపైన దయ చూపితే వాళ్ళు కృతజ్ఞతగా వుంటారు' అంటాడు. ఒకవైపు వ్యవస్థలో పురుషుని అహంకారానికి స్త్రీ బలౌతుందని బాధ పడుతూనే, మరోవైపు 'మగవాడి కింద పడి ఉండే స్త్రీల పట్ల దయ చాపడం 'అనడం నారాయణరావులోని వైరుధ్య భావాలను తెలుపుతుంది.

నారాయణరావు మిత్రుడు పరమేశ్వరమూర్తి భావకవిగా ప్రసిద్ధుడు. వీరిద్దరిది 'ఆదర్శమైత్రి', ''*ఈతడు కవి, చిత్రకారుడు విమలగాన విలోలుడు. అభినయం దారి తేరిన కళా హృదయుడు, చిత్రవిచిత్రమగు విషయములు పాటలుగా మార్చగలడు*'' [59] అని వర్ణిస్తాడు రచయిత. పరమేశ్వర మూర్తికి 'కలబాల' ఊహాప్రేయసి, పరమేశ్వరమూర్తికి చిన్నతనముననే వివాహం జరుగుతుంది. బాల్య వివాహాలలోని 'డొల్లతనం' మూర్తి విషయంలో కూడ కనిపిస్తుంది. ఊహ తెలియని వయస్సులో వివాహం జరగడం వల్ల, పెరిగి పెద్దయ్యాక వారి ఆలోచనలు, భావాలు, ఊహలకు భాగస్వామి తూగకపోతే వివాహం ఎంత దుర్భరమో అర్థమౌతుంది. మూర్త 'రసగ్రహణపారణుడు' ఆమె 'నిష్కళాహృదయ' సౌందర్యం తెలియదు. సరసం అంతకుముందే తెలియదు. ఇదంతా మూర్తిలో అసంతృప్తికి కారణమౌతుంది. 'కలబాల' అనే ఊహాప్రేయసి రూపుదిద్దుకుంది. మనసు గాయపడ్డ మూర్తి భార్యతో 'మనోసౌందర్యాని'కై దేవులాడుతాడు. ఇదే విషయాన్ని రాజేశ్వరావుతో ''*ఒరే! సర్వవిధాలా నా హృదయం ఆకర్షించి నా జన్మం సువాసనాలహరిలో ముంచి, నాకు ఉపాస్య అయ్యే బాలికను ప్రేమించడానికి మరి నేను ప్రేమింపబడడానికి ఇన్నాళ్ళు ఎదురుచూస్తున్నాను. నీకున్న ఆశయం చాలా తక్కువ. నీకు చిరుతపులిలా అందంగా ఉండి డాబుజేబుగా ఉంటే చాలు నీ మనస్సు ఆకర్షింపబడుతుందిలా. రాజీ! నా హృదయం అల్లా సరిపోదు. నాకు కళాపూరితమైన హృదయం కావాలి. కళాపూరితమైన రూపం కావాలి. రెండూ ఎక్కడ సమకూడుతాయి! ఒరే*

[58] నారాయణరావు, పు: 331

[59] నారాయణరావు, పు: 163

*రాజీ! నా కట్టి బాలిక సాక్షాత్కరిస్తే నాకామెతో దేహసంబంధమే కావాలని కోరను''*[60] అని ఆవేదన వ్యక్తం చేస్తాడు. భావకవిత్వానికి ప్రతినిధిగా ఉన్న మూర్తి ఆలోచనలు ఇలాగే ఉంటాయి. కానీ చర్చ రాజేశ్వరరావుతో చేయడంతోనే 'ఇబ్బంది' కనిపిస్తుంది. స్వేచ్ఛా ప్రణయం కోరుకునే మిత్రునిలో 'శారీరక సంబంధం' అవసరంలేని ప్రేమను గురించి చెప్పడం వల్ల ఏం లాభం! తన సుకుమార హృదయాన్ని ఆవిష్కరింపజేసుకుంటే ఫరావాలేదు. కానీ స్వేచ్ఛా ప్రియుల్ని మార్చే ప్రయత్నమైతే వృథా తోస్తుంది.

నారాయణరావు, శారదల జీవితంలో ముఖ్యమైన వ్యక్తి, శ్యామసుందరీ దేవి. దాంపత్యజీవితంలో తాను ఆశించిన ఆనందాన్ని పొందలేని సందర్భంలో నారాయణరావుకి శ్యామసుందర దేవి పరిచయమౌతుంది. పరిచయం స్నేహంగా మారుతుంది. సంగీతం విషయంపై ఒకరోజు సంభాషిస్తుండగా సూచనప్రాయంగా నారాయణరావు దాంపత్యంలోని 'స్తబ్ధత' దేవికి తెలుస్తుంది. నారాయణరావు దుస్థితికి జాలిపడింది. దేవుని లాంటి నారాయణరావు పట్ల ఆవేదన చెందుతుంది. తక్షణమే నారాయణరావును సమీపించి అతని తలను తన హృదయానికి అదుముకొని అతని నుదిటిని చుంబిస్తుంది. ఈ ఘటనలో దేవి మనసులో వాత్సల్యమే తప్ప కామ భావనలేదు. ''*తానిట్టి తెలివి తక్కువ పనిచేసి యతని కలంచినదేమి?..... తానింత యబలయేనదేమి. అతనంత కంగారుపడినాడేమి! తానేమి దోషమాచరించినది? కరుణావేశమై యతనిననునయింపబోయినది. ఇంతలో శీలమునకేమైన భంగము కలిగించినదా? .....చంటిబిడ్డను ముద్దుగొన మధురముగా నుండదా? అంతకన్న వేరు రుచి తానతనికి సమర్పించిన ముద్దులో గోచరింపలేదు. ఎంతగట్టిగ కౌగిలించినాడు. భయపడిన బాలుడటులనే యాలింగనము చేయును. త్రికరణములచే తాను దోషమాచరించినట్లే తనకు దోచుట లేదు''*[61] ఈ విధముగా శ్యామసుందరీదేవి ఆలోచనలు సాగినవి. ఈ సంఘటన నారాయణరావులో తీవ్రమైన శోకాన్ని రేపుతుంది. తర్వాత వీరిద్దరిలో సోదర ప్రేమతో తమ స్నేహాన్ని వృద్ధి చేసుకుంటారు. తర్వాత నారాయణరావు దంపతులనిద్దరినీ కలిపే ప్రయత్నంలో శ్యామసుందరీ దేవి శారద ముందు నారాయణరావును పదే పదే ప్రశంసిస్తుంది. నారాయణ పట్ల శారద కుటుంబీకులు చేసిన అసత్య ప్రచారాన్ని శ్యామ సుందరీదేవి పూర్తిగా తొలగించి ఇద్దర్నీ కలుపుతుంది.

---

[60] నారాయణరావు, పు: 172

[61] నారాయణరావు, పు: 326

అయితే భార్యాభర్తల మధ్య మూడో వ్యక్తి ప్రమేయం ఆక్షేపణీయమే. కానీ, ఆ మూడో వ్యక్తి దురాలోచనతోనే భార్యాభర్తల మధ్య విభేదాలు వస్తే, మళ్ళీ అలాంటి సందర్భంలోనే ఇద్దర్నీ కలిపే సంఘటన ఔచిత్యాన్ని తెలుపుతుంది. గాంధీ అనుయాయుడు అయిన నారాయణరావు చట్టం దేశంలో ధర్మానికి, సత్యానికి చాలా దూరంలో ఉంది. అసత్యం కలవనిదే నిజం కూడ గెలిచే పరిస్థితిలో లేదు. ఇలాగే కొనసాగితే చట్టం, సత్యం దగ్గరికి రావడానికి చాలా సమయం పడుతుందంటాడు. బ్రిటీష్ వారి చట్టంలో ఎన్నో లోపాలున్నాయంటాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో డబ్బున్నవాడిది చట్టం, ధర్మం అని నారాయణరావు అభిప్రాయ పడుతుంటాడు. అక్రమాలు చేసినా శిక్షనుంచి తప్పించుకోవచ్చునంటాడు. గాంధీజీ సహాయ నిరాకరణోద్యమం తర్వాత రాజకీయంగా స్తబ్ధత ఏర్పడుతుంది. అధికారానికి ఏమాత్రం అవకాశం లేనప్పుడు, ప్రజలకు మేలు చేసే అవకాశం రానప్పుడు ఎన్నికల్లో నిలబడటం ఎందుకని, కాంగ్రెస్ వారు ఎన్నికల్ని బహిష్కరిస్తారు. గాంధీజీ పిలుపుకోసం నారాయణరావు చూస్తుంటాడు.

నారాయణరావు కర్మసిద్ధాంతాన్ని, గాంధీజీ ఆలోచనలను పాటిస్తాడు. ''*నిజమైన ప్రజాస్వామిక ప్రభుత్వం..... ఆస్తి అందరికీ సమము కావింపబడవలె అంటే ఆస్తి యంతయు ప్రభుత్వముది*''[62] అని స్నేహితులతో సంభాషిస్తాడు. ఇంకా ప్రపంచంలో కావలసినంత తిండి తయారవుతోంది. అంతాపంచితే అందరికీ పూర్తిగ ఆకలి తీరుతుంది. కానీ ఎన్ని కోట్లమంది ప్రజలు మలమల మాడిపోవుట లేదు. ఏమిటి ఆ లోటు? తయారైన పదార్థాలని పంచే మార్గం సరిగాలేదు. ధనికవర్గం ఆ పని ఏనాటికి చేయలేదు అంటాడు. ఒకవైపు గాంధీయిజాన్ని అనుసరిస్తూ, జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొంటాడు. సంఘం పట్ల పూర్తి అనుకూల దృక్పథంతో ఉన్న నారాయణరావు కుటుంబ విషయంలో కూడ సహనంతో ఉండి – భార్యచేత స్వీకరించబడుతాడు.

''*మనము హైందవులము. సహజంగా మనవి. ఆధ్యాత్మిక స్వభావము. మనవాళి కోసము మనము జాతిని ఆధ్యాత్మికము చేయాలి. దీనిని మరే దేశము సాధించలేదు.'' భారత రాజకీయాల్లో నూతన భావాలకూ, పురాతన భావాలకూ, మధ్య రెండు అంశాలను గుర్తించాలి. ఒకటి ఉన్నవాటిని ఉన్నట్టు భౌతికంగా చూడడము రెండవది తీవ్రమయిన ఆధ్యాత్మిక చింతన.*''[63] అనే అరవిందుల ఆలోచన భారతదేశం యొక్క ప్రాచీనతను, సనాతనత్వాన్ని, ఆధునికతలను మేళవించి, అటు భౌతికంగా సమాజంలో వస్తున్న వైజ్ఞానిక, రాజకీయ, సాంస్కృతికమైన

---

[62] నారాయణరావు, పు: 288

[63] శ్రీ అరవిందులు నవజాత, పు: 110 – 111

మార్పులను ఆమోదిస్తూనే, ఆధ్యాత్మిక చింతనతో వాటిని సమ్మిళితం చేసి వ్యక్తి శ్రేయస్సు, సమాజ శ్రేయస్సులకై పాటుపడాలి.బ్రిటీష్ వారిపై ఆందోళన, సాంఘిక దురాచారాలపై నిరసన, స్వాతంత్ర్యం, న్యాయం సాధించాలనే నేపథ్యంలో ఉద్యమాలు, బెంగాల్ విభజన, గాంధీజీ ప్రభావం, దేశభక్తి ప్రబోధం కారణంగా, రాజకీయాల్లో జాతీయోద్యమం తీవ్రరూపం దాల్చడం, జాతి జీవన విధానాలలో విప్లవాత్మకమైన మార్పులు రావడం ద్వారా సంఘపీడితులను, స్త్రీలను పునరుద్ధరించే నవలలు వచ్చాయి. కుటుంబ జీవితాన్ని, సంఘ సంస్కరణాన్నీ, సంస్కృతీ వారసత్వాన్ని విడమర్చి, 'మానవీయ విలువ'లను నిరూపించే కాల్పనికవాద నవలలు తర్వాతి దశలో వచ్చాయి. ప్రాచీన సాంఘిక, ఆర్థిక, రాజకీయాది వ్యవస్థలన్నీ శిథిలమయ్యే, మానవ సంబంధాల్లో గణనీయమైన మార్పు కనిపించే దశలో పాత విలువలు మారిపోతున్నాయి. అలాగే మారుతున్న వ్యవస్థలన్నిటినీ ఆధునికయుగ అవసరానికి సరిపోయేవిధంగా తిరిగి నిర్మించుకోవాలనీ, అంటూ నూతన సమాజం ఆవశ్యకతను తెలియజేసే 'మాలపల్లి' ఇప్పుడే పుట్టింది. తర్వాత, అంతవరకూ లేని రచయితలు వ్యక్తిగత ఆలోచనలు, సిద్ధాంతాలు రచనల్లో కనిపించసాగాయి. అంతకుముందే పాశ్చాత్య దేశాల్లో వచ్చిన విప్లవాలూ, రెండు ప్రపంచ యుద్ధాల మధ్య ప్రపంచంలో జరిగిన అనేక పరిణామాలను దృష్టిలో ఉంచుకొని, మన దేశ సంస్కృతిని కాపాడుకోవాలనీ ఒక వర్గం, పాశ్చాత్య దేశాలలో జరిగే విప్లవాత్మకమైన మార్పును ఆహ్వానించి, దేశంలోని అనేక తరాలుగా వేళ్ళూనిన సంబంధాలను, వ్యవస్థలనూ కూలద్రోయాలనీ వేరొక వర్గం ప్రయత్నించింది.

ప్రాచ్య, పాశ్చాత్య నాగరికతల మధ్య సంబంధాలని ఘర్షణలను, భారతీయ సంస్కృతిపట్ల తన అభిమానాన్ని, భారతీయ ధర్మాన్ని, సంప్రదాయాల్ని, ఇక్కడి వ్యక్తుల జీవన విధానాల్ని వివరిస్తూ, పాశ్చాత్య నాగరికతా సంపర్కంలో దేశంలో మానవ సంబంధాలు ఏ విధంగా దిగజారిపోయాయో తన రచనల్లో వివరించారు విశ్వనాథ. స్త్రీ పురుష సంబంధాలు, వివాహం, నైతికత మొదలైన సాంఘిక ధర్మాలపై విశ్వనాథకు ప్రగాఢ నమ్మకం. సనాతన ధర్మాల్ని రక్షించి, తద్వారా జాతి శక్తిని సజీవంగా నిలుపు కోవాల్సిన ఆవశ్యకతను తన సిద్ధాంతాల ద్వారా, తార్కికత ద్వారా స్పష్టంగా వివరించారు. ఈయనికి పూర్తిగా విరుద్ధంగా స్వేచ్ఛా జీవనాన్ని కోరుతూ, తరతరాలుగా వస్తున్న భారతీయ సాంఘిక విలువల్ని బద్దలు కొట్టాలని, వ్యక్తి దేనికీ 'శృంఖలాబద్ధుడు' కారాదని తనకు ఇష్టం వచ్చిన రీతుల్లో నిర్భీతిగా వ్యవహరించాల్సిన హక్కు వ్యక్తికి ఉందని 'వ్యక్తివాదాన్ని' బలపరిచినవారు చలం. స్వేచ్ఛలేని ప్రణయం, నిర్బంధ వివాహం, ఆత్మవంచనలో జీవితం ఇవి చలానికి వ్యతిరేకం. విప్లవాత్మక ప్రణయాన్ని, స్వేచ్ఛ విహారాన్ని

'కట్టుబాట్లు' తెంచుకొనే తిరుగుబాటుని బోధించే రచనలు చేసారు. నీతిపేరిట జరిగే అనేక రకాలైన అన్యాయాలను నిరసించారు చలం.

## 2.17 మైదానం నవల :

చలం వివాహవ్యవస్థపై తీవ్రమైన వ్యాఖ్యలు చేసాడు. వివాహవ్యవస్థలోని లోపాలను భగ్నం చేయాలనే ఆలోచనలను తన రచనల్లో చూపట్టే ప్రయత్నం చేసాడు. ప్రేమతో మోహంతో స్త్రీ, పురుషులు తమ శృంగార కోరికలను తీర్చుకోవాలని అభిప్రాయపడ్డారు. ఒకవేళ వివాహ వ్యవస్థను ఆమోదిస్తే దానికి 'మోహ' మే ప్రధానంగా ఉండాలన్నాడు. ''*కనుక మోహమే ఆధారంగా వివాహమేర్పడాలి. మోహం లేకపోయిందా భర్త భర్తగాదు. భార్య భార్యగాదు. వారితో సంబంధం యితర మనిషితో చేసినట్లే, తనకి ఎవరిమీద మోహం కలుగుతుందో వారే తనకి భర్తగా స్త్రీ నిర్ణయించుకునే నీతికి సంఘం అభివృద్ధి చెందాలి*''[64] అంటూ కామం – మోహం – గురించి స్త్రీలో ''*శరీర సంపర్కం కోసం – స్త్రీ – పురుషులకి ఒకరి మీద ఒకరికి ఉండే వాంఛకామం*''[65] అని ''*ప్రత్యేకించి ఒకానొక స్త్రీ గాని స్త్రీలకి గాని వారే కావాలని పురుషుడు కోరడమూ, పురుషుణ్ణి గాని, పురుషులను గాని వారే కావాలని స్త్రీ కోరడమూ, కామం తీర్చుకోవడంతో తృప్తిపడక వారిని ఎప్పుడూ తమతోనే ఉంచుకొని తమవారిగా చేసుకోవాలను కోవడమూ, యిదే మోహం*''[66] అని అభిప్రాయపడ్డాడు.

స్త్రీ, పురుషుల శారీరక కలయిక కామం దగ్గరే ఆగిపోతే – అది తదనంతర ఫలితాలను జవాబుదారీగా ఉండలేదు. కామం మోహంగా మోహం ప్రేమగా మారడం – 'వివాహవ్యవస్థ' లోని ప్రత్యేకత. వివాహంలో స్త్రీ – పురుషుల సంబంధం కేవలం శారీరక పరిమితుల దగ్గరే ఆగిపోదు. అంటే 'కామ' విచారణలోనే ఆగిపోకుండా, మానసిక, ఆధ్యాత్మిక స్థాయిల్లో విస్తరించి 'ప్రేమ'గా నిరూపితమౌతుంది. చలం దృష్టి చాలాచోట్ల 'శారీరక పరిమితులు' దగ్గర ఆగిపోవడం విచారకరం. ''*అందరూ ధర్మాన్ని అంతస్సూత్రంగా పురుషార్థ భావనం చేస్తే చలం కామాన్ని, అంతస్సూత్రంగా పురుషార్థకామనం చేశాడు. అందువల్లనే అతడు వ్యక్తి ప్రాధాన్య వాదిగా పరిగణింపబడ్డాడు.*''[67] ఆ జీవనం స్త్రీ పురుషులు కలిసివుండాలని నిర్ణయించేది 'వివాహం' శారీరకమైన కలయికకు తగిన ప్రాధాన్యత ఉన్న అదే శాశ్వతం కాదు. ''*ప్రాచీన సంఘానికి*

---

[64] స్త్రీ, పు:30

[65] స్త్రీ, పు:25

[66] స్త్రీ, పు:26

[67] జీ.వి.యస్. పీఠికలు, పు: 337

*కేంద్ర గార్హస్థ్య ధర్మం. వివాహమన్నది పాశవిక కామతృప్తి కోసం కాదు. అది మత విషయకం. దాన్ని సంయమించటం సాంఘికక్షేమం కోసం అత్యవసరం. సంఘజీవన గతికి సుగమమైన మార్గం వివాహవ్యవస్థ....''*[68] శారీరక శృంగారం ఇద్దరికీ ఒకరి పట్ల ఒకరికి ఉండే అనురాగాన్ని 'తృప్తి' పరుస్తూ సమాజానికి 'కొత్త సంతతి'కి ఇచ్చే ఒక విలక్షణమైన బాధ్యత కూడ కలిగివుంది. ''*రెండు ప్రధాన కారణాల వల్ల సమాజానికి కుటుంబవ్యవస్థ అవసరం కల్గింది. ఒకటి సంతానాభివృద్ధి వారి భద్రత – అంటే ఒక తరం మరో తరంలోకి మార్పుచెందుట ద్వారా మానవజాతి అభివృద్ధి చెందడం, రెండోరకం వర్గ సమాజంలో కుటుంబ ఆస్తిని వారసుల కందించడం. ఈ రెండు కారణాల వల్ల కుటుంబం వ్యక్తిగతం కాదు. శారీరక సంబంధాలతో కూడిన సామాజిక విధానమైంది.''* [69] కాబట్టి శృంగారం తన పరిమితులను కుదించుకుంటుంది. స్త్రీ పురుషుల మధ్య శారీరకంగా, మానసికంగా వచ్చే మార్పులు సామాజికపరంగా నెరవేర్చే బాధ్యతలు. ఇవన్నీ ఎల్లకాలం స్త్రీ పురుషుల శృంగార కార్యకలాపాలకే కట్టిపడేయలేదు. వివాహం స్త్రీ, పురుషుల మధ్య ఉన్న సహజాతాలను వ్యవస్థీకరిస్తుంది.

సహజాతాలను, వివాహం ద్వారా తృప్తిపరచుకోకుండా వ్యక్తిగతంగా 'స్వేచ్ఛ' పేరుతో 'గీతదాటి' ప్రవర్తిస్తే సంఘం దానిని నిర్ద్వంద్వంగా ఖండిస్తుంది. వ్యక్తిగత దృష్టిలో 'మోహం' ఎంతో ప్రధానమైనా కూడా సామాజికపరంగా 'ప్రేమ' ఉన్నతమైనది. సామాజిక బాధ్యత ఉన్నవారందరూ 'ప్రేమ'ను ఆదర్శంగా తీసుకొని జీవిస్తూ, సామాజికోల్లంఘన చేయకుండా ప్రవర్తిస్తేనే వారి పట్ల సమాజం స్పందిస్తుంది. తద్భిన్నంగా ఉన్నవారిని సమాజం వెలివేస్తుంది.

### 2.17.1 'మైదానం' – ఇతివృత్తం – పరిచయం:

తెలుగు రొమాంటిసిజాన్ని కవిత్వంలో భావకవిత్వంగా కొంతమంది రాస్తే, నవలా సాహిత్యంలో స్వేచ్ఛాప్రణయాన్ని వస్తువుగా స్వీకరించి సంచలనం సృష్టించిన రచయిత చలం. ఈయన రాసిన నవలల్లో 'మైదానం' ఎంతో ప్రసిద్ధమైంది. ఒక లాయరు భార్య రాజేశ్వరి తమ ఇంటికి కోర్టు పనిమీద వస్తూ వుండే అమీర్ తో లేచిపోతుంది. అమీర్ ఆమెను మొదటిసారి చూచిన రోజున యింట్లోకి పనిమీద వెళ్ళే యజమాని లాగా లోపలికి వచ్చి ఆమెను కావలించుకున్నాడు. ఆమెకది తప్పుగా తోచకపోగా సంతోషపడింది. అమీర్ తనకు దేవత్వాన్ని అమృతత్వాన్ని ప్రసాదించినట్లు తలచింది. ఇక ఆ తర్వాత ప్రతిరోజూ మధ్యాహ్నం – లాయర్

---

[68] శ్వేతపద్మం, పు: 285-286

[69] శ్మశాన సాహిత్యం, పు: 105

ఇంట్లోలేని సమయంలో వాళ్ళు కలుసుకోసాగారు. లాయర్ వూళ్ళో లేనప్పుడు రాత్రుళ్ళు కూడ కలిసి గడిపారు. అమీర్ రాజేశ్వరిని లేవదీసుకొని నిజాం రాజ్యం వెళ్ళిపోవటానికి నిశ్చయించాడు. రాజేశ్వరి అతని ముఖం చూసి అతన్ని పూజించడానికి ఇష్టపడింది. నిజాం రాజ్యంలో ఒక వూరి వెలుపల ఏటిఒడ్డున ఒక గుడిసెలో రాజేశ్వరిని వుంచాడు అమీర్. ''*ఎటు చూసినా నీలపు కొండల్లోనూ ఆకాశంలోనూ అంతమయ్యే పెద్ద మైదానం.*''

''*పచ్చడిలో యిసిక పడ్డదనీ, అన్నం చిమిడిందనీ పులుసు వుడకలేదనీ తిట్లూ, లేచిపోవడాలూ విస్తరి మొహాన కొట్టడాలూ, పవిత్రమైన మానసిక ప్రేమగల ఆదర్శ సంసారాల్లో జరుగుతాయి గానీ, పశువులవలె కామంలో పొర్లాడే గుడిశెల్లో జరగనే జరగవు*'' అనుకుంటుంది రాజేశ్వరి. దొరికిన కొద్ది ఆహారంతోనే సరిపెట్టుకుంటుంది. ఒక్కోసారి ఆమె ''సుఖాలు వొదిలి పరమాత్మలో యేకమయ్యే ఆనందమంటారీ – అట్లాంటిదిగా అమీర్ తో అనుబంధాన్ని పోల్చుకుంటుంది. ఒకరోజు ఆమె మామయ్య ఆమె జాడను కనిపెట్టి వచ్చాడు. ఆమె ఆవిధంగా లేచి వచ్చినందుకు తిట్టిపోశాడు. పవిత్రం, పాతివ్రత్యం అనే మాటలకు కొత్త అర్థాలు చెప్పిందామె. ''ఈ రసికత్వమూ, ధైర్యమూ, యీ సత్తువా'' తన భర్త దగ్గర లేవు అన్నది. తనపై అమీర్ ప్రేమ ఎప్పటికీ పోదంటుంది. ''ఇది ప్రేమా! కామం. వొళ్ళు తెలీని పశుకామం. మదపిచ్చి....'' అని మామయ్య తిట్టినా లెక్క చెయ్యదు.

కొద్దిరోజుల తర్వాత అమీర్ కి రాజేశ్వరి మీద మోజు తగ్గింది. ఆ వూరి తోళ్ళ సాయేలు కూతురు మీద మనసైంది. ''ఇంకొకరి భార్య'' అని యోచించకుండా నన్ను కోరిన అమీర్ నన్ను వొదిలి యింకోర్ని మోహించటంలో ఆశ్చర్యమేముంది?..... ఇట్లా శరీర ఆకర్షణకి లోబడి జీవితాన్ని వప్పగించుకున్న దౌర్భాగ్యుల గతి ఇంతేగావును! అనుకున్నది రాజేశ్వరి. అమీర్ ను నోటికి వచ్చినట్లు తిట్టింది. తర్వాత ఆశ్చర్యంగా రాజేశ్వరి అమీర్ కోరిన సాయిబు కూతురితో సంబంధం ఏర్పరుస్తుంది. రాజేశ్వరి త్యాగానికి అమీర్ ఒక్కరవ్వ కృతజ్ఞత చూపలేదు.అమీర్ వల్ల రాజేశ్వరి గర్భవతి అయింది. ఆ గర్భాన్ని వదిలించుకోమని అమీర్ వత్తిడి చేస్తే ఆమెకు ఇష్టం లేకపోయినా శిశుహత్యకు ఒప్పుకున్నది.అమీర్ మరో చోటికి వెళ్తూ ఆర్నెల్లకి తిరిగి వస్తానని అందాక రాజేశ్వరికి తోడుగా మీరా అనే కుర్రవాణ్ణి తోడుగా వుంచాడు.

మీరా తనను కోరుకుంటున్నాడని తెలిసి, అంతవరకు అతన్ని తమ్ముడిగా భావించుకుంటున్న రాజేశ్వరి తన అభిప్రాయం మార్చుకున్నది. ''నేను అమీర్ దాన్నైనా అతని మీదకంటే నీ పైన నాకు ప్రేమ యెక్కువ'' అని అతన్ని తనతో కామక్రీడకు ఆహ్వానించింది. అమీర్ తిరిగి ఒచ్చాక మీరాను. అమీర్ ను ఇద్దరిని ఒదులుకోలేక క్షోభ పడుతుంది. అమీర్ నుండి

తప్పించి మీరా రాజేశ్వరిని మక్కాకో, బనారెస్ కో, లాహోర్ కో ఎక్కడికైనా తీసుకొని పోయి తనదాన్ని చేసుకోవాలనుకున్నాడు. ''నేను రాలేను'' అన్నది రాజేశ్వరి. రాజేశ్వరికి మీరాతో సంబంధం సంగతి తెలిసి అమీర్ మీరాను చంపటానికి కత్తి తీసుకువచ్చాడు. మీరాను చంపబోయాడు. రాజేశ్వరి మీరాను కౌగిలించుకొని అతని కత్తికి అడ్డుపడింది.పది నిమిషాల తర్వాత రాజేశ్వరికి గాయాలతో చావబోతున్న అమీర్ కనిపించాడు. ''నిన్ను చంపదలచుకోలేదు... నేనో మీరాయో ఒకరమే బతకాలి. నీకు మీరా కావాలి!''

''మీరాతో నిన్ను పంచుకుంటాననుకున్నావా? తురక బిడ్డని'' అన్నాడు అమీర్. పోలీసులతో మీరా తానే అమీర్ ను చంపానని చెప్పి లొంగిపోయాడు. నిజానికి అమీర్ ఆత్మహత్య చేసుకున్నాడు. కాని తనను రక్షించటం కోసం రాజేశ్వరి అమీర్ ను హత్యచేసిందని మీరా అనుకున్నాడు. ''తానే పొడుచుకున్నాడు'' అని రాజేశ్వరి చెప్తే మీరా తెల్లబోయాడు.రాజేశ్వరి హత్యానేరాన్ని తన మీద మోపుకొని పోలీసులతో ''నేనే పొడిచాను'' అని చెప్పింది.

**2.17.2 'మైదానం' నవల–సామాజిక సంబంధాల విశ్లేషణ:**

''*బాధకోసమే పుట్టాను. స్వర్గంలోనయినా స్వంతనరకాన్ని కల్పించుకోకుండా వుండలేను. అన్న చలం విషాదజీవి. చలం మాదిరిగానే అతని పాత్రలన్ని అసంతృప్తితో, నిట్టూర్పులతో, నిత్యజ్వలితం.....మేడలు, కార్లు, ధనం, మొగుడు యివన్నీ వదిలేసి 'కష్టాలేవీ' అని అడుగుతాయి....హఠాత్తుగా వాటినన్నిటినీ వదిలేసి ఏనది ఒడ్డుకో చెట్ల సందుల్లోకో పోయి, ఆనందంతో మృత్యువును ఎదుర్కొంటాయి.*''[70] మైదానంలో రాజేశ్వరి, అమీర్ లు కామ, మోహాలతో తిరిగారు. దీన్ని రాజేశ్వరి 'ప్రేమ'గా భావించింది. మైదానం కామ, మోహాలకు, అవ్యవస్థకు ప్రతీక. వివాహవ్యవస్థకు ప్రాణ సమానమైన 'ప్రేమను' సమాజం నిర్లక్ష్యం చేసిందని, 'ఆ ప్రేమ' తన అస్తిత్వంతో సామాజికావగాహనను తొలగవేస్తే అరాచకత్వనికి దారితీస్తుందని రాజేశ్వరి కథ తెలియజేస్తుంది.... ప్రేమ అరాచకమైతే జీవితం నరకమౌతుంది.

రాజేశ్వరి తన భర్తతో సంసారం చేస్తుంది. ఈ సంసారంలో ప్రేమ కన్న రాజేశ్వరికి 'కామ'మే కనబడుతుంది. ఓ విధమైన 'మత్తు'లో సంసారాన్ని ఈదుతున్నానని అనుకుంటుంది. చలం వివరించిన కామ ప్రవృత్తుల్లో రాజేశ్వరి భర్త మొదటిరకం. ''*కామ సంబంధంగా మనుష్యులు మూడు రకాలు. 1. మోహమంటే యెరగని వారు 2. మోహం కలిగి దానిని*

[70] తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణం, పు: 121

*జయించలేక పెనుగులాడే వారు. 3. మోహాన్ని జయించినవారు. సంఘం కళ్ళకి మొదటిరకం వారు ఉత్తములు. వారికున్నదల్లా కామం. ఆ నిమిషానికి పెళ్ళామంటే ఒకర్తే వుంటే చాలు. ఏ స్త్రీ ఐనాసరే స్త్రీ ఐతేచాలు. కనక భార్య వుంటే యితర స్త్రీల జోలికిపోరు.''*[71] శరీరంలో పుట్టే తాత్కాలిక ఉద్రేకాన్ని ఉపశమింపచేయడానికి ప్రక్కలో భార్య ఉంటే చాలుననుకొనే మనస్తత్వం. వీరిది సంప్రదాయ వివాహమే. కానీ భర్త 'మోహ' లక్షణాలు తెలియని వాడు 'ప్రేమ'ను గురించి తెలిసే అవకాశమే లేదు. ఆమెలో 'మోహా'న్ని గుర్తించే శక్తి లేనివాడు. వారికి 'కామ' తృప్తిలో మోహావస్థ లేదు. వీరిని గురించి చలం ''*అప్పటికే పువ్వుల్లి తలలోనూ, కోట్లకీ తగిలించుకుంటూనే వున్నారు. కాని అవి అందక నవ్వుతాయి. అయినా స్త్రీ ని మాత్రం యేం ఉపయోగించుకొని ఏం సౌఖ్యపడుతున్నారు. ఈ తృప్తినిచ్చేది కామంగాని, సౌందర్యభావం కాదు. కోటులో పువ్వు అందం వలెనే యింట్లో స్త్రీ అందం, నీకు అందక నీ గోడలికి, పేరంటాలకి, వియ్యాలకి అతీతమై దేవత్వాన్ని పొంది నిన్ను శుద్ధముగ్ధుణ్ణి చేసి నవ్వుతుంది. నువ్వు అనుభవించేది చర్మం! సౌందర్యం కాదు.''* [72] అని అభిప్రాయపడ్డాడు. పరస్పర ఆకర్షణ, ఆరాధన అసలే లేవు. భర్త లాయరు. అతనికి విధి నిర్వహణ ఎంత ఒత్తిడితో ఉంటుందో? రాజేశ్వరి ఈ కోణంలో భర్తను అర్థం చేసుకునే ప్రయత్నం చేయదు. భర్త విషయంలో తనను సుఖపెడుతున్నాడా? లేడా? అనేదే చూస్తుంది తప్ప. తామిద్దరం సమాజానికి జవాబుదారీగా ఉండాలి అనే ధోరణి ఆమెలో కనిపించదు. రాజేశ్వరిలో అనురాగం, వాత్సల్యం మచ్చుకు కూడ కనిపించవు. ''*తనూ సంగమ రూపమైన రతి మానవ హృదయంలో భావమధనాన్ని కలిగించి, అంతఃకరణ ప్రవృత్తిని ఉన్మిలింపజేస్తుంది. జంతువు తనూ ధర్మంగా భావించే కామాన్ని, మానవుడు హృదయధర్మంగా భావించి రతిగా సంభావిస్తాడు. అప్పుడు రతిని నియతితో యోగిస్తాడు. ఆనియతి జీవనధర్మం.... సంతతి కోసం స్త్రీ పురుషులు దాంపత్యాన్ని భజిస్తారన్నది నరనారీ లోకాన్ని పాలించే ధర్మ సూత్రం''*[73] అని తెలుసుకోలేని ఆమె 'మోహం' పరదాల్లోంచి బయటకు రాలేదు. రాదు.

రాజేశ్వరి మోహం తెలియని భర్త గురించి ఇలా చెబుతుంది. ''*నా పెనిమిటితో పడుకున్నప్పుడు అమీర్ మీద మోహం కలిగి నిద్రలో ఆయన్ని గట్టిగా కావలించుకున్నాను. నన్ను లేపి ఆయన 'చెడ్డ కల వచ్చిందా' అని అడిగాడు. భయానికి, మోహానికి భేదం తెలియని*

[71] స్త్రీ, పు: 75

[72] చలం – మ్యూజింగ్స్ ,పు: 171.

[73] జీ.వి.యస్. పీఠికలు, పు: 294

*ఆయనతో వొక మంచం మీద పడుకోవడంకన్న మన్మధునికి అపకారం వేరే వుందా? ఏదన్నా లా పాయింటు అడుగు దేనికది చీల్చి వివరంగా అరగంటసేపు చెపుతాడు. ఎదుట సాక్షి హృదయ పరీక్ష చేసి చీల్చి తికమక పెడతాడు. భార్య కావలించుకోవడం మోహం వల్లనో భయం వల్లనో తెలియదు. ఇల్లాంటి వారు మన భర్తలు*''[74] భర్త తనను సుఖపెట్టలేకపోతున్నాడని భావించిన రాజేశ్వరి, భర్తకు తను కేవలం ''*పడక సుఖాన్ని*'' ఇచ్చే బానిసగా ఉన్నానని అనుకుంటుంది. ''*ప్రేమను త్యజించి స్వేచ్ఛని పొందగలరా? స్వేచ్ఛ లేకపోతేనేం. అతని ప్రేమ ఏం ప్రేమ! స్త్రీ తన బలహీనత్వంతో, ప్రేమతో, శృంగారంతో చూపే బలవంతం హృదయమున్నవాడు తప్పించుకోగలడు. స్వతంత్రమైన ప్రేమలో బానిసత్వం ఎక్కడ వుంటుంది?*''[75] భర్త 'కామ' పరిధిని తన 'హృదయ విశాలత్వం'లో ప్రేమగా మార్చలేకపోయింది. సంఘం ఇలాంటి వ్యతిరేక ప్రవృత్తులున్న వ్యక్తులను 'వివాహం' పేరుతో ఏకం చేస్తే, తర్వాత వారి సంసార జీవితం సాఫీగా ఎలా సాగుతుందనే ప్రశ్న వస్తుంది. అయితే సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న భర్తను రాజేశ్వరి కేవలం పడకగది, దాటి బయట చూడలేక పోవడం విచారకరం. ''*ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చినా సెక్సు స్వాతంత్ర్యం రాలేదు. భర్త కోసం వెతకడం భర్త దొరికింతర్వాత తగాదాలు, ఈర్ష్యలు దాచుకోడాలు, నటనలూ, భర్త దొరక్కపోతే రహస్య ప్రియులు. ఇవీ నవీన స్త్రీల చరిత్రలు*''[76] ఆమె చెప్పినట్లుగానే ప్లీడర్ గా తన బాధ్యతను అతను ఎంతో అర్థవంతంగా నిర్వహిస్తున్నాడు కానీ తన 'మొగడి'గా తనను 'మోహ' పరచడంలేదని 'రాజేశ్వరి' వివాహవ్యవస్థపై భర్తపై విపరీత ద్వేషం పెంచుకొంది. ఇలాంటి కారణంతో వివాహాన్ని భిన్నం చేసుకోవడం రాజేశ్వరిలోని విపరీత 'మోహ' వాంఛ, సామాజిక అవగాహన లేకపోవుట, అజ్ఞానం కారణాలుగా కనిపిస్తాయి.

భర్తను వదిలి అమీర్ తో మైదానానికి లేచిపోయింది. అమీర్ ఆలింగనంలో మోహ మాధుర్యం జలజల విడిచింది. తనకు అమృతత్వాన్ని, దేవత్వాన్ని ప్రసాదించాడనుకొని తన్మయత్వం చెందింది. ఈ అమృతత్వం మోహమాధుర్యం వివాహవ్యవస్థలో దొరక్క 'మైదానం'లోకి వెళ్ళిపోయింది. రాజేశ్వరి అమీర్ లో సుఖాలను అనుభవించడంతో పాటు సమాజాన్ని గేలి చేస్తుంది. ''*నాకే కాదు. చాలామంది పతివ్రతలకే సాగుతుంది.' – కాని వాని యెంగిలి మూతితో నన్ను ముద్దు పెట్టుకుంటూవుంటే ఏం లాభం. మడిగా వేరే మూకుట్లో తిని? నాకు చాత కాలేదు. వేశ్యల ఎంగిలి రుచులు చవిచూసి కూడా కులం నిలుపుకునే నేర్పరితనం*

---

[74] మైదానం, పు: 10

[75] చలం – మ్యూజింగ్స్, పు: 39

[76] చలం – మ్యూజింగ్స్, పు: 1212

*మీ శ్రోత్రియులకి మాత్రమే చాతనవును' – చీరెలు చూస్తాడా అమీర్ నా వొంటిని చూస్తాడు గాని, అక్కడ పేరంటాలా భోజనాలా? చీరెల విలువనిబట్టి మనుషుల విలువ నిర్ణయిస్తారా. మీ వూళ్లల్లో మల్లే''*[77] భర్తను గేలిచేస్తుంది. మామనూ విమర్శిస్తుంది. అతడు కుహానా సంస్కారి. పైకి, నీతిని, వ్యవస్థను సమర్థిస్తూనే 'లోపల' వ్యభిచరించే గుణం కలవాడు. ఇటువంటివారు చలం దృష్టిలో కామదృష్టిలో రెండోరకానికి చెందినవారు. ''*వీళ్ళలో చాలామంది దొంగలు, నిజమైన వారి వాంఛలన్నీ, వ్యూహాలన్నీ, కార్యాల్నీ దాచిపెట్టి ఒకటోరకం, మూడోరకం మనుషుల్లాగ కనబడాలని చూస్తారు.''*[78] వీరు స్వేచ్ఛా ప్రియులకన్నా భ్రష్టులని చలం చెప్తాడు. మామయ్య గురించి రాజేశ్వరి చెప్తూ ''*నీ గుడ్డి కామం నిన్నెంతకి తెచ్చిందో! మామయ్య ఈ మాటలంది! నేను కాపురానికి వెళ్ళకముందు ఆరునెలలు నా వెంటపడి లోబరుచుకోవాలని చూశాడు. ఒక్కరికీ తెలీకుడా ఎవరితోనన్నా చెప్పుకోవడం నాకు సిగ్గని తెలుసు. చివరికి నేను అమ్మతో చెప్పితే అంతా అబద్ధమని బుకాయించాడు. ఆ మామయ్య యీ మాటలంది. నిజమని వొప్పుకునే ధైర్యమే కలవాడైతే నా స్వభావం మామయ్యని స్వీకరించి వుండునేమో''*[79] అని స్త్రీని ధైర్యంగా అనుభవించే సామర్థ్యం లేక దొంగచాటుగా అనుభవించ చూసే ప్రవృత్తికి ఆమె వ్యతిరేకం. ఆమె దృష్టిలో ఆ దొంగతనమే వ్యభిచారం. ఈ సంఘటన రాజేశ్వరి యొక్క రెండు పార్శ్వాలను తెలుపుతుంది. పెళ్ళి కాకముందు మామయ్యతో సంపర్కం మొదట ఆమెకు భయం వేసింది. 'మోహ' దృష్టిలోని రాజేశ్వరి ఆ సమయానికి ఊహల్లో కూడ 'పాడుపని' చేసేందుకు ఇష్టపడలేదు. తనకు రక్షణ కల్పించమని అమ్మను కోరింది. ఇది సహజంగా అమాయకంగా 'కుటుంబవ్యవస్థ'లో ఒదిగిన అమ్మాయి ఆలోచనలాగే ఉంది. కానీ పెళ్ళికి ముందు అంత 'కట్టడి'లో ఉండే రాజేశ్వరికి, పెళ్ళి అనంతర పరిణామాలు చాలా మార్పును తీసుకొచ్చాయి. అయితే 'సంతానవతి' అయ్యేంతవరకు కూడ భర్తతో ఆమెకు ఏం పేచీలేదు.

''*ఆ యింద్రియతత్పరణము వలన గొంతకాలమనురాగము నించియుండునే. రాజేశ్వరి గూర్చి భర్తపై నెంత ప్రేమ లేకున్నను సంతానవంతులగు వఊకుఁ గలిగి యుండుట యనెడి కారణము వలనఁ గొంతయైన యనురాగబంధమేర్పడియుండదో?*''[80] ఎందుకంటే అంతవరకు ఆమెకు 'అమీర్' లాంటి వ్యక్తులు కనిపించక పోవడమే కారణం. రాజేశ్వరి భర్త తన బాధ్యతను

[77] మైదానం, పు: 15-24-28

[78] స్త్రీ, పు:76

[79] మైదానం, పు: 13

[80] ఆంధ్ర నవలా పరిణామము, పు: 336

తాను సక్రమంగానే నిర్వహిస్తున్నాడు. ఒక్క రాజేశ్వరికి 'పడకటింటి' సుఖం తప్ప. ''*బహువిధాలైన సామాజిక సమస్యల్లో వివాహం, సెక్స్ లను ఒక అంతర్భాగంగా చూడాలి. సెక్స్ ను బ్రహ్మాండంగా పెంచి చూడటం అంటే ప్రధాన సమస్యను అప్రధానంగాను, అప్రధాన సమస్యలను అతి ప్రధానంగాను చూడటం. చూపించడం అవుతుంది. ఇది స్త్రీల వర్గ చైతన్యాన్ని దెబ్బతీయడమే అన్నాడు లెనిన్.*''[81] ఒకవేళ కలిగినా 'భర్త చాటు భాగోతం' నడిపేదే కానీ, రాజేశ్వరి 'శరీరం' అందుకు ఏ మాత్రం సహకరించడం లేదు. 'మోహ తీవ్రత' ఆమెను 'వివశురాల్ని' చేసింది. ఎంతగా అంటే తను తీసుకోబోయే నిర్ణయం కుటుంబాన్ని వీధిపాలు చేసి, భర్తను వెధవను చేసేంతగా, ఈ అక్కసుకు కారణం కేవలం భర్తే! అని ఈమె ఫిర్యాదు. మళ్ళీ ఇప్పుడు 'మామ రూపంలో' తనకు 'హితబోధ' జరిగే సరికి. 'నా స్వభావం మావయ్య స్వీకరించి ఉండునేమో' అంటూ పెళ్ళికాకముందు జరిగిన సంఘటనను, ఇప్పటి అనుభవంతో పోల్చుకోవాలని చూసింది. అంటే ఆమెలోని 'మోహం' ప్రవృత్తి 'పెళ్ళయిన తర్వాత' విజృంభించినట్లుగా తెలుస్తుంది. రాజేశ్వరి కేవలం భర్తపై ఉన్న 'ద్వేషం'తోనే ఇలాంటి పనులు చేస్తున్నట్లుగా కనిపిస్తుంది. దీనినే చలం ''*ఈ నాటికే సృష్టి అనాది నుంచి పేరుకున్న బానిసత్వం కింద మూలుగతోంది ఆమె స్త్రీ. ఆమెలోని దుర్గుణాలకీ, అల్పత్వానికీ యీ సంఘ దౌర్జన్యమే కారణం.... స్త్రీ చేసే ప్రతి మోసంలోనూ, పురుషుడి అక్రమ దౌర్జన్యం కన్పిస్తుంది. నాకు*''[82] అని బాధపడ్డాడు. పెళ్ళిద్వారా ఒకటైన స్త్రీ పురుషులు తమ 'కామాన్ని' మోహ రూపంలో ఉన్నతస్థితి 'ప్రేమ' వరకు తీసుకొని పోకపోతే – ఆ 'సంసారం' ఎంతటి ప్రమాదంలో పడిపోతుందో రాజేశ్వరి కాపురమే ఉదాహరణ. వ్యక్తిలో ఉండే బలమైన వాంఛల్ని వివేకంతో పూరించుకునే ప్రయత్నం చేయాలి గాని, క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు కుటుంబంపైన చూపెట్టడం సంగతేమో కానీ వ్యక్తిగతంగా ఎలాంటి భద్రతను కలిగించలేవు. ''*చలం నవలల్లో, కథల్లో వివాహవ్యవస్థ కాఠిన్యాన్ని చూపి స్త్రీకి ఆ బంధం నుండి విముక్తి కలిగించాలని ఉద్బోధించాడు. అయితే ఆ విశృంఖల స్థితిలో సుఖజీవన వ్యవస్థ ఎలా సాధ్యమో ఆయన సూచించలేదు.*''[83]

రాజేశ్వరి దృష్టిలో భర్తను ద్వేషించి, అతని చాతగానితనంపై దెబ్బకోట్టేందుకు తన 'స్వేచ్ఛా ప్రియత్వాన్ని' నిరూపించుకునేందుకే ఇలాంటి నిర్ణయం తీసుకుంది. ''*శృంగారభావం, సౌందర్యతృష్ణ మలినమే అయితే నేను మలినుణ్ణి. పశుత్వమే అయితే మీ నుంచి దూరంగా*

---

[81] చలం శ్మశాన సాహిత్యం, పు: 105

[82] ప్రేమలేఖలు, పు: 143

[83] సహృదయ చక్రము, పు: 140

*పశువుల్లో కలవడం గౌరవం నాకు. అది నాకు వున్న సౌందర్య తృష్ణ అనేకమందికి వుంది. జడులకు తప్ప తీవ్రతలోనే భేదం అంతే'*[84] అని కసితో, వ్యతిరేక ధోరణిలో అన్నదే కానీ తర్వాత ఆమె భర్త జీవితాంతం ఈమె కోసమే ఎదురుచూసే అవకాశం ఉందా? భర్త తన చేతగానితనంతోనే వేరే స్త్రీ తో సంసారం చేస్తాడేమో? ఆ వచ్చే స్త్రీ రాజేశ్వరిలా 'విశాలంగా' అలోచించక 'భర్త'ను దేవునిలా చూసుకుంటుందేమో! ఇవన్నీ జరగబోవని రాజేశ్వరికి తెలియదుగా! భర్తను వొదిలేస్తే – తాత్కాలికంగా ఆ కుటుంబానికి ఇబ్బంది ఉన్నా, ప్రత్యేకంగా రాజేశ్వరి చేసిన పనికి తనకే జీవితాంతం కష్టాలన్న విషయం ఆమెకు తోచలేదు. ఎందుకంటే ఆమె దృష్టిలో అమీర్ తో లేచిపోవడంపై – ఆమెలోని, అమీర్ లోని 'మోహ' వాంఛ కారణం కానీ మోహం శాశ్వతం కాదు. మోహం తగ్గిపోయేందుకు, పెరిగేందుకు వ్యక్తుల శారీరక స్పందనలే కారణమౌతాయి. ఈ శారీరక స్పందనలు ఎల్లకాలం ఒక విధంగా ఉండవు. తగ్గినా, పెరిగినా, ఇద్దరికీ నష్టమే. ఈ నష్టం రాజేశ్వరికి తొందర్లోనే కలిగింది.

రాజేశ్వరి 'మోహం' ఉన్మాదంలా కనిపిస్తుంది. విశృంఖలంగా కనిపిస్తుంది. ''*ఆ రాత్రంతా దూరంగా కూచొని నన్ను చూస్తూ తృప్తి పడేవాడు. నేనే ఉండలేక అతన్ని లాక్కొని వికారపడి కక్కేసేదాన్ని. పశుకామం. ఏం చెయ్యను''*[85] అంటుంది. ''*స్త్రీ శరీరం తనది కదా. తనకి చిక్కింది కదా అని పురుషుడు నలిపి, పాడు చెయ్యకూడదు. స్త్రీ అందుకు వొప్పుకోకూడదు. వొప్పుకున్నదా, త్వరలో ఇతర స్త్రీలను పరుషుడు వెతుక్కుంటాడు.''* [86] కామం యొక్క విశృంఖలత్వాన్ని రొమాంటిక్ ధోరణిలో రాజేశ్వరి చెప్తుంది. తనది 'కామం' కాదని 'ప్రేమ' అని 'త్యాగ'మని అంటుంది. ప్రేమ ఉన్నప్పుడు త్యాగం చెయ్యడం సులభమని, కష్టాలు కష్టాలుగా తోచకపోవడం ఉంటుందని తమ శృంగార కార్యకలాపాలను కాల్పనిక ధోరణిలో వ్యక్తం చేస్తుంది. నదిలో నగ్నంగా ఇద్దరు స్నానం చేయడం కళ్ళతో ఒకళ్ళనొకళ్ళని తాగెయ్యడం.... ఇవన్నీ వాస్తవిక ప్రపంచానికి దూరంగా తీసుకుపోయేవే.

ఈ రకమైన 'మైదానపు' జీవితం సమాజంలో ఎక్కడ జరిగివుండే అవకాశమే లేదు. సామాజిక దృక్పథానికి భిన్నమైంది. ఆచరణయోగ్యత లేనిది మైదానంలో శృంగార కార్యకలాపాలు సాగిస్తున్నారంటేనే, రాజేశ్వరి – అమీర్ లు సమాజవ్యవస్థ నుండి దూరమైనారని అర్థం. వీరి కామ, మోహాలు వీరద్దరికి సంబంధించినవే. కామ మోహాలుతో పాటు ఇతరాలు

---

[84] చలం – మ్యూజింగ్స్ , పు: 110

[85] మైదానం, పు: 27

[86] స్త్రీ, పు: 161

కూడ జీవించేందుకు కావాలి. వాటిని పొందాలంటే మళ్ళీ 'సమాజం' లోనికి రావాలి. ప్రస్తుతం రాజేశ్వరిలోని 'మోహ' తీవ్రత ఆమెను 'మైదానం'లోనే బందీ చేసింది. ఈ విషయం ఆమెకు తప్ప లోకానికి కంతా తెలుసు. సమాజం నుండి తప్పించుకొని పోవాలనుకునే వారి గురించి సమాజం పట్టించుకోకపోయినా, వారి గురించి సమాజానికి 'ఒక అవగాహన' అయితే ఉంటుంది. ఈ సందర్భంలో రాజేశ్వర 'తక్షణం గురించే ఆలోచిస్తుంది. కానీ 'భవిష్యత్తు' గురించి కాదు. ఆమె ఆలోచన వర్తమానంలోని 'మోహ బంధిత శృంగారం' కంటే ఉన్నతంగా లేదు.

రాజేశ్వరి – అమీర్ ల ప్రేమ ఉన్నతంగా పరిణామం చెంది ఆదర్శవంతంగా వ్యవస్థీకరించబడలేదు. ''*మోహం కన్నా చాలా అతీతమయింది ప్రేమ. మోహంలో వలె ప్రేమలో శరీరవాంఛ ప్రాముఖ్యం కాదు..... మోహం కలవాళ్ళు రెండోవాళ్ళని తమ సౌఖ్యం కోసం కోర్తారు. తమకు దక్కనిదైతే ఆ మనిషి మీద మోహం చచ్చిపోతుంది. ప్రేమ గలవారు తాము రెండో వారికివ్వగల ఆనందాన్ని గూర్చి ఆలోచిస్తారు గాని, తమకు వారివ్వగల ఆనందాన్ని గూర్చి తలవరు. రెండోవారి ఆనందంతో తాము ఐక్యమవుతారు. ప్రేమకలవారు తమను ప్రేమించకపోయినా వీరి ప్రేమ పోదు.*''[87] అమీర్ లో 'మోహ' తీవ్రత ఎక్కువ. సామాజిక బాధ్యత తక్కువ. వీరి ప్రేమ నిజంగా 'ఉన్నతమైన'దైతే అమీర్ – రాజేశ్వరిని లేవదీసుకుపోయి, వేరేచోట సమాజంలోనే కాపురం పెట్టేవాడు. కానీ మైదానం వైపు సాగేవాడుకాదు. మనిషి సామాజిక సంబంధాలను కలిగివుంటే, 'స్వేచ్ఛా ప్రణయం' అన్నా వ్యక్తిలోని నిజాయితీని కొంతవరకు అర్థం చేసుకోవచ్చు. నీ కేవలం మోహాన్ని తమ 'తీవ్రత'తో 'విచ్చలవిడి'గా అనుభవిద్దామనుకునేవారు, సమాజాన్ని వదులుకోవాల్సిందే. దీనికి రాజేశ్వరి యొక్క 'టెంపరితనం' అమీర్ కి బాగా కలిసివచ్చింది. కథలో అమీర్ యొక్క కుటుంబం ప్రస్తావన లేదు. ఎలాంటి బాధ్యతలు లేక, బలాదూర్ గా 'ఊరిమీద పడి' తిరిగే బాపతు అమీర్ ది. అమీర్ సంస్కారం 'శారీరక పరిధుల్ని' దాటలేకపోయింది.

''*ఇద్దరూ సమకాలీన సమాజంలో ఉన్న స్థితిగతుల్ని ఆమోదించలేదు. ఇద్దరూ సమకాలీన వ్యక్తుల స్వేచ్ఛను, కట్టుబాట్లకు లొంగని వ్యక్తి స్వాతంత్ర్యాన్ని కోరారు*''[88] విశ్వనాథ సంఘ కట్టుబాట్లతో కూడిన వ్యవస్థా ధర్మాన్ని, మానవ సంబంధాలను కట్టబెట్టే ప్రయత్నం, పూర్వుల నైతిక జీవిత విధానాల వైపుకి సమాజాన్ని నడిపించే ప్రయత్నం చేస్తే, దీనిని విరుద్ధంగా,

---

[87] స్త్రీ, పు: 111

[88] తెలుగు నవలా వికాసం, పు: 77

వివాహంలో కామగతమైన సంబంధాన్ని, స్తబ్ధమైన ప్రణయాన్ని విమర్శించి, స్వేచ్ఛలో స్త్రీ, పురుష పరస్పన ఆకర్షణకి పట్టం కట్టాడు చలం. ఒకరు జీవిత పరమార్థాన్ని అన్వేషించారు, వేరొకరు స్వేచ్ఛకై పరుగుతీసారు. వీరితోపాటే తెలుగువారి సంస్కృతికి, జీవితాన్ని జాతీయోద్యమ ప్రభావాన్ని, గాంధీజీ జీవకారుణాన్నీ, కళాత్మకంగా వివరించినవారు బాపిరాజు.

వ్యక్తినుండి, కుటుంబం నుండి, సమాజాన్ని వివరించి, విశ్లేషించిన నవలలు వచ్చాక, 'మానవతావాదాన్ని' ఆధారంగా చేసుకొని, అప్పటికి ప్రాచుర్యంలోకి వచ్చిన 'మనస్తత్వ శాస్త్రాన్ని' జీర్ణించుకొని, నవలలు నిర్మించినవారు బుచ్చిబాబు, గోపీచంద్ లు. వీరి నవలల్లో గతానికి వర్తమానానికి మధ్య జరిగే ఘర్షణ ముఖ్యమైనది. గతం వర్తమానంపై వేసిన ప్రభావం ద్వారా ఆయా వ్యక్తుల జీవితాలు ఎలాంటి విపరీత పరిస్థితులకు గురౌతాయో ఇక్కడ తెలుస్తుంది. వ్యక్తికీ, వ్యక్తికీ, వ్యక్తికీ – అతని మనస్సుకీ మధ్య జరిగే సంఘర్షణ ప్రధానంగా కనిపిస్తు వ్యక్తుల్లో ప్రేమ రాహిత్యం, ఈర్ష్య, ఆత్మన్యూనతా భావాలు ఎంతగా పెరిగిపోయాయో అవి మానవ సంబంధాల్ని ఎలా ఒడిదొడుకులకు గురిచేసాయో వీరి నవలల్లో ఇక్కడ కనిపిస్తుంది.

ఈ విధంగా వలస పాలనలో (1878 – 1947) వచ్చిన తెలుగు నవల, ఆంగ్లవిద్యా ప్రభావం పాశ్చాత్య యంత్ర నాగరికత, మతం, జాతీయోద్యమాలను ప్రేరేపించుకొని సమాజాన్ని, వ్యక్తినీ ప్రతిఫలింపజేసే ప్రయత్నం చేసింది. తన పరిధినీ, రూపాన్నీ మార్చుకుంది. వ్యక్తి – కుటుంబం – సమాజాలను దర్శించిన రచయిత రా॥రా॥ వ్యక్తిలోని అంతర్గత ఘర్షణాలను ఆధారంగా చేసుకొని రచనలు చేసాడు. ఈ భావనలు, సిద్ధాంతాలన్నీ తర్వాత వచ్చే అధ్యాయంలో *'మాలపల్లి', 'వేయిపడగలు'* నవలల్లో కనిపించేమానవ సంబంధాల్ని విశ్లేషిస్తాను.

★★★

## మూడవ అధ్యాయం

# *మాలపల్లి, వేయిపడగలు* నవలలు - మానవసంబంధాలు

### 3.0 భారతీయ, పాశ్చాత్య జీవనసంఘర్షణను చిత్రించిన నవలలు:

తెలుగు నవలా సాహిత్యంలో సంచలనం సృష్టించిన నవలల్లో మాలపల్లి, వేయిపడగలు అత్యంత ముఖ్యమైనవి. ఒకటి ప్రత్యక్షంగా పాశ్చాత్య ప్రభావంతో ఆర్థిక, మత పరిస్థితుల్ని వివరిస్తూనే భారతదేశంలో సంస్కరణోద్యమాన్ని సమర్థించింది. మరొకటి భారతీయజీవనాన్ని ఒక ధార్మికజీవనంగా అభివర్ణిస్తూనే పాశ్చాత్య సంస్కృతి వల్ల భారతదేశంలో ప్రవేశిస్తున్న వివిధ ధోరణులను విశ్లేషించింది. అందువల్ల ఈ రెండింటిలో గల మానవ సంబంధాలను ప్రత్యేకించి విశ్లేషించడం మంచిదనిపించింది.

బ్రిటీష్ పాలనలో దిగజారిపోయిన సామాజిక ఆర్థిక పరిస్థితులు దేశంలోని అన్ని వ్యవస్థలపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ఆంగ్ల విద్య ద్వారా సంస్కరణభావాలు పెంపొందించుకున్న మేధావులు, మధ్యతరగతివారు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న వలసవాద పోరాటాలను స్ఫూర్తిగా తీసుకున్నారు. జాతీయోద్యమం రకరకాల రూపాల్లో పురుడు పోసుకుంది. సంస్కరణోద్యమంతో సమాజంలో కలిగిన చైతన్యం జాతీయోద్యమానికి తోడ్పడింది. సంస్కరణోద్యమ నాయకులలో చాలామంది జాతీయోద్యమ నాయకులుగా తమ ఉద్యమాలు కొనసాగించాయి. బ్రహ్మసమాజం సభ్యులు చాలామంది జాతీయోద్యమానికి బాసటగా నిలిచారు. కాంగ్రెస్ లో గాంధీశకం ప్రారంభమయింది. సహాయ నిరాకరణోద్యమంతో జాతీయోద్యమం పూర్తిగా రాజకీయ స్వరూపాన్ని రూపొందించుకుంది. అంతవరకు జరిగిన ఉద్యమాలు కేవలం మేధావులు, సమీందారులు, మధ్యతరగతివారి ఆలోచనకు ప్రతిబింబంగానే ఉండేవి. ''*దేశానికి రాచకీయగా విముక్తి కలిగించడమొక్కటేకాదు, గాంధీ మహాత్ముని ధ్యేయం సమాజంలో ఆర్థికపరమైన సమానత్వాన్ని నెలకొల్పి, మానవులందరు సోదరులు అనే భావాన్ని నిత్యజీవనంలో సాధించడమే ఆయన ఆదర్శం*''.[1] గాంధీజీ జాతీయోద్యమాన్ని సామాన్య ప్రజల్లోకి తీసుకొని పోవడానికి హరిజనోద్ధరణ, అస్పృశ్యతా నివారణ, స్త్రీ జనోద్ధరణలాంటి

[1] సాహిత్యంలో దృక్పథాలు, పు:61

మార్గాలు ఎంచుకున్నాడు. జనాభాలో అత్యధిక శాతం గల ప్రజలను ప్రభావితం చేసేందుకు, వారిని ఉద్యమంలో భాగస్వామ్యం చేసేందుకు ముందుగా వారిలో చైతన్యం రావాల్సిన అవసరాన్ని గాంధీజీ గుర్తించారు. పూర్వపు సంస్కర్తలు చేపట్టిన మూఢవిశ్వాసాలు, దురాచారాల నిర్మూలనం కానీ, స్త్రీ జనోద్ధరణకానీ మామూలు జనానికి కలిగించిన ప్రయోజనం ఏమీలేదు. విద్యావంతులకు, అవిద్యావంతులకు మధ్యనున్న 'శూన్యాన్ని' గాంధీజీ పూరించే ప్రయత్నం చేశాడు. జాతీయతాభావం అంటే ఏమిటో తెలియని జనంలో జాతీయత ప్రజాస్వామ్య భావాలు వ్యాపించాయి. జాతిని మొత్తం ఏకత్రాటిపై తీసుకొచ్చిన ఘనత గాంధీ మహాత్మునికి దక్కింది.

''*సంఘ సంస్కరణ, రాజకీయమైన విప్లవము సాధించగలిగినది పరిస్థితులలో మార్పు నైతికంగా, ఆధ్యాత్మికంగా వ్యక్తి దృక్పథంలో రావలసినదేమో ఆంతరంగికమైన మార్పు ఈ రెండింటిలో దేన్ని ఉపేక్షించినా ఆశయసిద్ధి కలుగదు. రెండింటి మీదా దృష్టి నిలిపి దారి చూపడమే గాంధీజీ విశిష్టత. అందుకే గాంధీజీ దృక్పథంలో రాజకీయాలకూ నైతిక ప్రవర్తనకూ, సామాజిక విప్లవానికి ఆధ్యాత్మికతకూ సమన్వయం కుదిరింది.*''[2]

అన్ని రకాల ఉద్యమాల్ని సమన్వయం చేసుకుంటూ దేశస్వాతంత్ర్యానికై పాలకులతో అహింసాయుత మార్గంలో గాంధీజీ యుద్ధం చేసారు. గాంధీజీ కంటే ముందున్న సంస్కర్తలు సమాజం యొక్క భౌతిక, ఆధ్యాత్మిక జీవితాల్ని లక్ష్యంగా చేసుకొని ముందుకు సాగారు. గాంధీజీలో వీరందరి సమన్వయం కనిపిస్తుంది. భారతీయ ధర్మాన్ని, ఆధ్యాత్మికశక్తికి, భౌతిక జీవనవిధానాన్ని కొత్తమార్గంలో ప్రవర్తింపజేసారు. సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ, ఆధ్యాత్మిక రంగాల్లో ఆధునిక చైతన్యాన్ని కల్గించి, నవభారత నిర్మాణం కోసం ప్రయత్నాలు చేసారు. వీటన్నిటి ప్రభావం గాంధీజీ జాతీయోద్యమాన్ని మరింత తేజోవంతంగా మార్చింది ఆనాడు స్వాతంత్ర్యం కోసం దేశీయులంతా కలిసికట్టుగా బ్రిటిష్ వారిని ఎదిరించవలసి ఉన్నది. కానీ నాటి ఉన్నత వర్గ సమాజం కులం, మతం పేరుతో సమాజంలో వెనుకబడిన వర్గాల వారిని పంచములను దోచుకోవడం సాధారణ విషయంగా ఉండేది. భూస్వాముల ఆగడాలకు అదుపులేకుండా పోయింది. గాంధీజీకి ఈ పంచముల సమస్య, జాతీయోద్యమ విజయానికి పెద్ద అడ్డంకిగా మారింది. కాబట్టి ముందుగా ఈ సమస్యనే పెద్ద ఉద్యమంగా మార్చారు. మాలపల్లి నవలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

---

[2] సాహిత్యంలో దృక్పథాలు, పు:61

## 3.1 మాలపల్లి నవల– ఇతివృత్తం:

'మాలపల్లి' కథానాయకుడు సంగదాసు అని సంగ విజయం పేరును బట్టి అనుకున్నా, నవలలో ప్రాధాన్యం వహించేది రామదాసు పాత్ర. 'మాలపల్లి' నవలలో కథ అంతా రామదాసు కుటుంబ సభ్యుల చుట్టూ తిరుగుతుంది. రామదాసు హరిజనుడు. గొప్ప సంపన్నుడు కాకపోయినా, కొద్దిపాటి పొలం, పశువులు, దొడ్లు ఉన్నవాడు. రామానుజుడు ప్రచారం చేసిన వైష్ణవదీక్షను గ్రహించి జ్ఞానమార్గంలో ఆధ్యాత్మిక సాధన చేస్తుంటాడు. అతని భార్య మాలక్ష్మమ్మ. అతనికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. పెద్ద కొడుకు వేంకటదాసు. తండ్రికి సాయంగా పొలం పనులు, పశువుల పనులు చూస్తుంటాడు. రెండవ కొడుకు సంగదాసు. అతడిని రామదాసు చౌదరిగారి దగ్గర పాలేరుగా ఉంచాడు. సంగదాసు చౌదరిగారికి ఎంతో నమ్మకమైన సేవకుడు. సహృదయుడైన రామానాయుడి స్నేహంతో చదువు, సంస్కారం అబ్బినాయి. సామాజిక పరిస్థితిని అవగాహన చేసుకోగలిగాడు. తనవారి (హరిజనుల) దుస్థితిని చూసి అతని హృదయం ఎప్పుడూ పరితపించి పోతుంటుంది. వారందరిని చదువుకోమని, శుచిశుభ్రతలు పాటించమని ప్రభోదిస్తుంటాడు. అవకాశమున్నప్పుడు తానే స్వయంగా విద్యాబోధ చేస్తుంటాడు. సంగదాసు రామానాయుడితో కలిసి అనే సాంఘిక సమావేశాలలో హిందూ మహాసభలలో పాల్గొంటాడు. సంగదాసు అంటే హరిజనులకే కాక అగ్రవర్ణాల వారందరికి కూడా గౌరవమే. రామదాసు మేనల్లుడు అప్పాదాసు. జ్యోతి, అప్పాదాసులు పరస్పరం ప్రేమించుకున్నారు. రామానాయుడి భార్య కమల. ఆమె ఒక బలహీన క్షణంలో పసివాడైన కొడుకును కూడ వదిలి మోహనరావుతో లేచిపోయింది. ధాన్యం ధర పెరిగింది. అందుచేత చౌదరయ్య రైతు కూలీలకు మామూలు వాడుక ప్రకారం ధాన్యం కొలవడం మానేసి డబ్బులు ఇస్తానంటాడు. కూలీలు అందుకు ఒప్పుకోరు. ''*ధాన్యమైనా కొలవాలి, లేదా ధాన్యం ధర ప్రస్తుత వెల ప్రకారం ఇవ్వాలి*'' అని పట్టుబడతారు. చౌదరయ్య ఒప్పుకోడు. కూలీలు సమ్మె ప్రారంభించారు. ఆ సమ్మెకు సంగదాసు నాయకత్వం వహించాడు. చౌదరయ్య బయటి ఊరినుండి కూలీలను పిలిపించబోతే సంగదాసు వారిని మంచిమాటలతో వెళ్ళగొట్టాడు. ఇది చౌదరయ్యకు అంతులేని కోపం తెప్పించింది. దానికి తోడు చిన్నవాడు స్నేహంతో రామానాయుడు కులభేదం పాటించకుండా ప్రవర్తిస్తున్నాడనే విషయం అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది. ఎన్నో ఏళ్ళుగా నమ్మకంగా సంగదాసు చేసిన సేవనంతా మరిచి అతనిని కర్రలతో కొట్టి చంపించాడు. ఊరు ఊరంతా హాహాకారాలు చేసింది. చౌదరయ్య పోలీసులకు లంచాలుగా డబ్బు గుప్పించి ఖూనీ కేసు నుండి తప్పించుకున్నాడు. రామదాసు కుటుంబంపై పగబట్టి, రామదాసు అనుభవిస్తున్న భూములన్ని

తనవే అని దావా వేశాడు. బ్రిటిష్ వారు స్థాపించిన కోర్టులలో డబ్బు గెలుస్తుంది. కాని న్యాయం గెలుస్తుందా? రామదాసు దావాలో ఓడిపోయి సర్వమూ కోల్పోయాడు. ఈ పిరస్థితి వేంకటదాసులో తీవ్ర పరివర్తన తెచ్చింది. అతడు తండ్రిలా సహించి ఊరుకోలేక తక్కెళ్ళ జగ్గడిలా పేరు మార్చుకొని తిరుగుబాటు ప్రారంభించాడు. రామదాసుపై పగబట్టిన చౌదరయ్య రామదాసు కుటుంబం తక్కెళ్ళ జగ్గడి బంధువులనే మిష మీద వారిని సెటిల్ మెంట్స్ లో చేర్పించాడు. అక్కడ రామదాసు కుటుంబం ఎన్నో యాతనలకు గురి అయింది. అక్కడ కూడా రామదాసు తన ధర్మ ప్రచారాన్ని మానలేదు. అందుకు సెటిల్ మెంట్స్ అధికారులు కోపం తెచ్చుకొని రామదాసుమీద పై అధికార్లకు ఫిర్యాదు చేసి రామదాసును, మాలక్ష్మమ్మను జైళ్ళో పెట్టించారు. జ్యోతిపాల్ కు వశంకాలేదు. పౌల్ జ్యోతిని బలాత్కారం చేయబోతే కృష్ణానదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. అప్పాదాసు కూడ ఆమెతోనే మరణించాడు.

కమలను లేవదీసుకుపోయిన మోహనరావు ఆమెను ఒంటరిగా వదిలి తన ఇంటికి వెళ్ళిపోయాడు. కమల పశ్చాత్తాపంతో కృంగిపోయింది. ఆమెకు మశూచికం వచ్చి రూపమే మారిపోయింది. పేరు మార్చుకొని తన ఇంట్లోనే తాను పనిమనిషిగా చేరింది. భక్తిమార్గంలో కొడుకులోనే బాలకృష్ణుని చూసుకొని తరించడానికి ప్రయత్నించింది. చివరకు కుమారుడైన సాహు మరణించడంతో ఆతల్లి గుండె పగిలి పశ్చాత్తాపంతో భర్తపాదాల దగ్గర ప్రాణం వదిలింది.

జైళ్ళో రామదాసు ఎన్నో దీనగాథలు విన్నాడు. స్వయంగా ఎన్నో అవమానాలు భరించాడు. అవి అతనిలో వైరాగ్యభావాలను పెంచాయి. తక్కెళ్ళ జగ్గడు విప్లవవీరునిగా సమాజంలోని దీనులను ఆదుకుంటూ అందరికి చేతనయినంతా సహాయం చేస్తూ, దుర్మార్గులను శిక్షిస్తూ, అన్యాయంగా షావుకార్లు దోచుకున్న ధనాన్ని తాను ''ధర్మబద్ధంగా దోచుకుంటూ'' పేరు ప్రతిష్టలను సంపాదించుకున్నాడు. ప్రజలలో అతనిపై ఉన్న ప్రేమాభిమానాల కారణంగా ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా తక్కెళ్ళ జగ్గడిని పట్టుకోలేక పోయారు. చివరకు ఒక సార్జెంట్ అపారమైన సేనతో వచ్చి తక్కెళ్ళ జగ్గడిని బంధించాడు.

జైళ్ళో తక్కెళ్ళ జగ్గడు, రామదాసు, మాలక్ష్మి కలుసుకున్నారు. రామదాసు తక్కెళ్ళ జగ్గడి మార్గాన్ని అంగీకరించకపోయినా అతడి వ్యక్తిత్వాన్ని గౌరవించకుండా ఉండలేకపోయాడు. కలెక్టరు కూడా జగ్గడిని మెచ్చుకున్నాడు. ఉరిశిక్ష అనుభవించకుండానే జగ్గడు మరణించాడు. సంతానమంతా మరణించటంతో మాలక్ష్మి గుండె పగిలి చనిపోయింది. రామదాసు సంపూర్ణంగా సన్యాసి అయ్యాడు. రామానాయుడు ఎంతో ప్రయత్నం మీద రామదాసు నిర్దోషి అని చెప్పించి అతడిని ఖైదు నుండి విడిపించాడు. తండ్రి మరణించటంతో వారసత్వంగా తమకు

లభించిన డబ్బుతో సంగపీఠాన్ని స్థాపించి, దానికి రామదాసును కులపతిగా చేశాడు. జగ్గడు తాను ధర్మబద్ధంగా సంపాదించిన ధనాన్ని సంగపీఠానికి సమర్పించాడు. ఈరకంగా ఉన్నవవారు సంకల్పితంగానో అసంకల్పితంగానో గాంధీ మార్గానికి, విప్లవమార్గానికి విచిత్రమైన సమన్వయం సాధించారు.

### 3.1.1 మాలపల్లి నవల మానవసంబంధాల విశ్లేషణ:

మంగళాపురంలో మోతుబరి రైతు చౌదరయ్య. డబ్బే పరమావధియైన వ్యక్తి. అతని దగ్గరి గుమాస్తా సంగదాసు పంచముడు. అగ్రవర్ణాలవారు తమ వారికి చేస్తున్న అన్యాయాలను ఎదిరించేందుకు రాత్రింబగళ్ళు ఆలోచిస్తుంటాడు. ఈ అగ్రవర్ణాల నిరంతర దోపిడి కారణంగానే పంచములు విద్యకు, అభివృద్ధికి దూరమవుతున్నారని వీరి జీవితాల్లో వెలుగులు నింపాలని ప్రయత్నాలు చేస్తుంటాడు. యజమాని లాభాలు గడించేందుకు సహకరిస్తూనే, కూలీలు కూడ బాగుపడే ఆలోచన చేయాలంటాడు సంగదాసు. ఇతని తండ్రి రామదాసు అందరూ బాగుంటేనే బాగు అనే సిద్ధాంత సంగదాసుకు ప్రేరణ. కూలీల శ్రమ ఆసాముల లాభాలు రెంటికీ, పోలికే ఉండకపోవటం సంగదాసును తీవ్రంగా కలిచివేస్తుంది.

''*సంఘంలో విప్లవం సాధించేందుకూ, సంఘాన్ని క్రొత్తగా నిర్మించేందుకూ హరిజనులే కీలకపాత్ర వహించాలి అనేది గాంధీగారు అవగాహన చేసుకున్న సత్యం. అందులో వారి పాత్ర సంఘం యొక్క ఔదార్యాన్ని స్వీకరించే, కర్తృత్వ రహితమైన పాత్ర (Passive Role) కాదు: ఆత్మోద్ధరణ ద్వారా సంఘాన్ని క్షమించి సంఘానికి దారి చూపే కర్తృత్వ పూర్ణమైన పాత్ర (Active Role) కావాలి. గాంధీమార్గం సృజనాత్మకమైన విప్లవమార్గం అనడానికి ఇదొక తార్కాణం.*'' [3] సంగదాసు ఇరువర్గాలలో పరివర్తన తేవాలని అనుకుంటాడు. దేశస్వాతంత్ర్యం పంచములలో జ్ఞానాన్ని అగ్రవర్ణాలలో వివేకాన్ని తెస్తుందని భావిస్తాడు. రామదాసు దీనినే ''*సంగడు వీళ్ళందరికీ బళ్ళు పెట్టించి, చదువూ, వృత్తులు నేర్పించాలంటాడు. దీనికి 'డబ్బు, మనిషి చుట్టమూ' రెండూ కావాలి. ఇవి క్రమంగా జరగవలసిన పని 'దూకమంటే అయ్యేపనికాదు*'' [4] అంటాడు.

చౌదరయ్య మనఃస్థితి పూర్తిగా తెలిసిన సంగదాసు అతని కుమారునితో స్నేహం చేస్తాడు. అతనికి పంచముల ఆకలి బాధలు వారి జీవనాన్ని గురించి వివరించి వారి ఉన్నతికి పాటుపడాలని చెప్తాడు. ''*మా మాల మాదిగ పల్లెలలో నాలుగు నెలలు పూర్తైన భోజనమంటే*

---

[3] సాహిత్యంలో దృక్పథాలు , పు: 65-66

[4] మాలపల్లి, పు:30

*జొన్నన్నం, గోంగూర కారం యివి కడుపునిండా తినడం, నాలుగు నెలలు అర్ధభోజనం మిగిలిన రోజులు కటిక వుపవాసం.... దొరికితే నాగజెముడు పండ్లు, గొడ్డుకారం, చచ్చిన గొడ్ల మురికి మాంసము''* [5] ఇలా వారి ఆకలి దృశ్యాన్ని వర్ణిస్తాడు. 'మడత కుడుములు' అంటే అన్నం లేనప్పుడు పడుకుంటే ఎక్కువగా బాధ కలుగుతుందని అన్నపుతిత్తి మడతలు పడేటట్లుగా ముడిచిపెట్టాం' అని ఆకలిబాధను దయనీయంగా వివరిస్తాడు.

### 3.1.2 మాలపల్లి నవల ఆర్థిక సంబంధాలు:

రామానాయుడు ధనిక వర్గానికి చెందినా, చదువుకున్నవాడు, సంస్కారి వర్ణాహంకారం, ధనాశ రెండూ ఉండవు. సామాజిక సంబంధాలను సక్రమమైన పద్ధతిలో అవగాహన చేసుకుంటాడు. నిమ్న వర్గీయులలో సాన్నిహిత్యాన్ని పెంచుకుంటాడు. కూలీలతో కలిసి పొలం పనులకివెళ్తాడు. అందులోని కష్టాల్ని తెలుసుకుంటాడు. ఆకలి విలువను గుర్తిస్తాడు.

కొడుకు శ్రమ విలువను తెలుసుకునే ప్రయత్నంలో ఉంటే తండ్రి చౌదరయ్య 'శ్రమదోపిడి'కై రకరకాల మార్గాలు అన్వేషిస్తాడు. కూలీలకు 'బియ్యం గింజలు'కు బదులుగా 'డబ్బు'ను కూలీగా ఇస్తాడు. ఇతర భూస్వాములతో కూడి కూలీల జీవితాల్ని, శ్రమని దోచుకొంటాడు. సంగదాసు ఎంత ప్రయత్నించినా చౌదరయ్య మారే ఆలోచనలో ఉండడు. రామానాయుడికి ఇదంతా ఎంతో వేదన కల్గిస్తుంది. సంగదాసు హృదయ నిర్మలత్వం, తండ్రి హృదయ కర్కశత్వం అతనికి ఇబ్బందిని కలిగిస్తాయి. తండ్రిలోని కాఠిన్యం రామానాయుడిని పంచములవైపు అడుగులు వేసేందుకు దోహదపడుతుంది. చివరికి సంగదాసు కూలీలతో సమ్మె చేయించాలను కుంటాడు. కానీ వారి దీనావస్థను చూసి ''*వీండ్లిట్లా సమ్మెగట్టడం, పూటపూటకి లేదే అని సందేహించాడు. మనసు నిరాశ చెందకుండా మళ్ళీ ఆపుకున్నాడు*''[6] తర్వాత వారిని సమీకరించే ప్రయత్నంలో ఉంటే, చౌదరి సంగదాసుతో ''*నీవు శ్రీరంగనీతులు యిన్ని చెపుతావు గాని కూలివాడికి కడుపునిండా అన్నముంటే పనిచెస్తాడంటోయ్. వొక పక్క కాస్త కాలుతుంటే పనికోసం దేవులాడుతాడు గాని కడుపునిండితే పని మట్టే....''* [7] అనడం చౌదరిలోని అహంకారాన్ని తెలుపుతుంది. అయితే సంగదాసులోని సాత్త్వికత అతన్ని తిరుగుబాటుదారునిగా మార్చలేక పోయింది. సంగదాసు ఆలోచనలను అందుకొన్న కొంతమంది కూలీలు ఈ పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొనే ప్రయత్నం చేసారు. వారు తమ శక్తిని తక్కువగా అంచనా వేసుకోలేదు.

---

[5] మాలపల్లి , పు:81

[6] మాలపల్లి , పు:83 - 84

[7] మాలపల్లి , పు:113

బలంగా చౌదరయ్యతో తేల్చుకోవాలనుకున్నారు. శేషయ్య అనే కూలి ''*మేము రేపు పొద్దున వెళ్ళి కొయ్యకపోతే మీ యిరవై ఎకరాల జొన్న మట్టి గలుస్తుంది. గనిమెలు తీసి నీళ్ళు గట్టకపోతే అయిదువందల యెకరాల పల్లం యిగిరి చెక్కలవుతుంది. రేపు మీ జీతగాండ్లను బందు చెయ్యనియ్యండి. పొలాలు నీళ్ళు గాక యేమవతావో*'' [8] అని తీవ్రమైన నిరసన స్వరంతో అంటాడు. ఇక్కడ కూలీల చైతన్యం కనిపిస్తుంది. సౌమ్యంగా కనిపించే సంగదాసుకు ఇంతటి నిరసన ఇష్టం లేకున్నా కూలీరేట్లు పెరిగితే వారి జీవితాలు బాగు పడతాయేమోనని ఆశ. గాంధేయవాద ధోరణి సంగదాసులో కనిపిస్తుంది. నాలుగు డబ్బులు చేతికొస్తే వారు చదువుకుంటారు. ప్రయోజకులౌతారు అనుకుంటాడు. ''*అలగావాండ్లకు అన్నం దొరికే మార్గం జూపండి సాంఘిక హక్కులిచ్చి ప్రయోజనకారులు గావు, అవి నిలుపుకొనే శక్తి గూడా వారి కుండదు*'' [9] అనడం వారి దయనీయ పరిస్థితిని తెలుపుతుంది. ఈ విధంగా సంగదాసు ఆలోచనలు సాగితే చౌదరయ్య కూలివాడి జీవితానికి భూస్వామే ఆధారమని భావిస్తాడు. అంతేకాదు ''*ఈ వూళ్ళో పద్దాలుగు వీసాల కూలీ జనం నా వల్ల బతికే వాండ్లు, యెదురు తిరిగిన వాండ్లను నా చేలో అడుగుపెట్టనియ్యను.... చెడిపోతాడు చెప్పు*''[10] అనే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తాడు. అయితే చివరకు సంగదాసు కూలీలచేత సమ్మె చేయించేందుకే సిద్ధపడి తాను రామానాయుడితో కలిసి బెజవాడకు వెళ్తాడు.

''*చౌదరయ్య ఆర్ధ్రతలేని వాడు కాదు. కాని అతనిలో స్వార్థగుణమూ, లోభమూ పెద్దవి; గ్రహించుకొనే సంస్కారం బొత్తిగా లేదు. ఎదురు తిరిగిన వ్యవహారాన్ని, మనుషుల్ని అణగ గొట్టాలనే ఆవేశం తప్పితే మరో విధమైన వెరువులేని పెళుసుదనం అతని ప్రకృతి.*''[11] ఇతర భూస్వాములు కూలీల రేట్లు పెంచినా, తాను మాత్రం కూలీల ధరలు పెంచనని మొండిగా వాదించి చౌదరయ్య కూలీలు నవ్వుకుంటూ పక్క పొలాల్లోకి వెళ్ళడం జీర్ణించుకోలేకపోయాడు. దీనికంతకూ కారణం సంగదాసు అని తెలుసుకొని చచ్చేట్టు కొడతాడు. ఆ దెబ్బలకు సంగదాసు చనిపోతాడు.

సంగదాసు హత్యను గూర్చి రచయిత ''*లోకంలోని అక్రమాలను, జూచి ఆక్రోశించిన రక్తం, ఉన్నత భావాలను ఉద్రేకించిన రక్తం పవిత్ర భావాల చేత పావనమైన రక్తం. గొట్టా*

---

[8] మాలపల్లి , పు:116

[9] మాలపల్లి , పు:119

[10] మాలపల్లి , పు:110

[11] సాహిత్యంలో దృక్పథాలు, పు: 69

*చిమ్మినట్టు ప్రవహిస్తున్నది. భూమి పావనమైనది''* అని వర్ణించడం సంగదాసు పాత్ర ఉదాత్తతను వివరిస్తుంది. ఇక్కడ సంగదాసు మరణం అనేది కేవలం భౌతికమైనది మాత్రమే. సంగదాసు ఆశయాలు కొనసాగించబడడం గమనార్హం. ఏ ఉద్యమమైనా వ్యక్తిని ఆధారం చేసుకొని కొనసాగుతున్నప్పటికీ, ఆ ఉద్యమం సామాజిక శ్రేయస్సును ఆశ్రయించి ఉంటే, సామాజిక చైతన్యంతో ముడివడిఉంటే వ్యక్తి మరణం కేవలం ఒక ఘటన మాత్రమే. వ్యక్తి ద్వారా ఫలితం రావాలని చూడకుండా సంఘటితంగ, పోరాటాల ద్వారా విజయం సులవౌతుందని గ్రహించాలి.

### 3.1.3 మాలపల్లి నవల ధార్మిక ప్రవృత్తి:

సంగదాసు మరణం చిరస్మరణీయ ధర్మపోరాటానికి ధర్మ విజయానికి తాత్కాలిక అడ్డంకి మాత్రమే. ''*ధర్మ నిరోధ ప్రయత్నంలో బాధ కలుగజేసే వాండ్లకూ, బాధపడే వాండ్లకూ ప్రత్యేక వ్యక్తిత్వముండదు. ప్రత్యేక వ్యక్తుల యొక్క జయాపజయాలకు ధర్మ విజయంతో సంబంధం లేదు.... మహానుభావులు పడిన బాధలు వారికపజయాలు కావు. వారు పూనిన ధర్మానికి ధర్మ సంస్థాపనకు మార్గమేర్పరిచినారు''*[12] కాబట్టి ఈ విజయం చౌదరయ్యది కాదు. ''*సంఘర్షణము జీవుల పరిణామ కథలో నొక ఘట్టము. పరిణామ క్రమమున మానవునకు బాహ్య ప్రపంచము నిమిత్తముగా తన లోపలి లోకములలో మధనము జరుగును. కాలక్రమమున ఈ మధనమును వివేకమను వెన్న వెలికి వచ్చుచుండును. ఇది సామూహికముగా జరుగక వ్యక్తిగతముగా జరుగును. కనుక శాశ్వతముగా జరుగుచునే యుండును. అనగా ఎల్లప్పుడును ఒక్కొక్కనిలో ఒక్కొక్క స్థితి చొప్పున అందులోను అన్ని స్థితులును జరుగుచునే యుండును. క్రమోన్మీలనము చెందు వివేకము వలన నిత్యానిత్యతత్త్వ విభజనము జరుగును. ఇది జరిగిన వారికిని, జరుగుతున్న వారికిని నడుమ భావ సంఘర్షణము జరుగుచుండును. ఇది కార్యరూపమున వ్యక్తమగుటయే యుద్ధము.... తప్పని సరియైన ఈ పథమునందు అల్పదృష్టికి మృత్యువు, (కాంతదృష్టికి అమృతత్వమును గొచరించును.''*[13] సంగదాసు యజమాని క్షేమం, కూలీల శ్రేయస్సు కోరి, ఇద్దరికి సమన్వయం కుదర్చలేక, సంఘర్షణలో చనిపోవటం కేవలం ఉద్యమ కొనసాగింపులో ఒక భాగంగానే చూడాలి.

సంగదాసు విజయం గూర్చి తీవ్రంగా కలత చెందిన వాడు రామానాయుడు. మిత్రుడు, మార్గదర్శి మరణంతో పంచముల ఆశయాలు కూలీల బాగోగులు, భూస్వాముల ఆగడాలను ఎదుర్కోవడం ఇవన్నీ తన కర్తవ్యంగా భావిస్తాడు. మిత్రులు వెంకటయ్య నారాయణరావు

---

[12] మాలపల్లి , పు:127-128

[13] శంఖారావము – భగవద్గీత వ్యాఖ్యాన గ్రంథం, పు: 77

పంతులు మొదలైనవారు ముందుకు వస్తారు. సంగదాసు మరణానికి దుఃఖించేకంటే, ఆశయసాధననే సంగదాసుకి ఇచ్చే సరైన నివాళిగా భావిస్తారు. సంగదాసు ఆలోచనలను నెరవేర్చేందుకు ముందుకు సాగుతారు. సంఘనిర్మాణం గూర్చి సంగదాసు ఒక సందర్భంలో ''*సంఘ నిర్మాణమంటే వొక పెద్ద మేడగట్టడం మోస్తరు ఆయానికి దగిన దూలాలు, గోడలకు తగిన మొకరంలూ, తగినంత కలపావుండాలె. సంఘనిర్మాణం యేర్పాట్లన్ని ఈ విధంగానే వుంటవి – మహాసంఘం యొక్క క్షేమం దృష్టిలో లేకుండా జేసే ప్రయత్నాలు నేల విడిచి సాము చేసినట్లే అవుతది. మహా సంఘ నిర్మాణం యొక్క రాస్తా గుర్తెరిగి దానికి అనుసంధానంగా చిన్న సంఘాల అభివృద్ధికి పాటుబడితే పెద్దసంఘం యొక్క అభివృద్ధికి వొక విధంగా తోడ్పడ్డవాళ్ళమే అవుతాం*''[14] దీని ఆలోచనతోనే సంగదాసు పంచముల, కార్మికుల అభివృద్ధితో హిందూ సంఘ పునర్నిర్మాణం మొదలుపెడతాడు.

సంగదాసు మరణంతో కూలీలంతా ఏకమై చౌదరయ్యకు వ్యతిరేకంగా నిలుస్తారు. చౌదరయ్య పంట కోసేందుకు ఎవరూ ముందుకురారు. పొరుగూరు కూలీలను ప్రయత్నించినా వారూ రానంటారు. చివరకు చౌదరయ్య కూలీలతో రాజీకివచ్చి అయిదురోజుల కూలి ముందుగా వసూలు చేసిన తర్వాతే చౌదరయ్య పొలానికి కోతలకు వెళ్తారు. ఇది సంగదాసు సాధించిన విజయం. ఏ భూస్వామిలయితే తమ వారిని 'అలగాజనం'తో పోల్చి, తన దగ్గర కూలీగా పనిచేస్తేనే 'గింజలు' నోటికాడి కెళ్ళవు అని ఎకసెక్కాలు ఆడాడో ఆ వ్యక్తిని నిలబెట్టి క్షమాపణ చెప్పించి, 'జర్మానా' కింద ఐదు రోజుల కూలీని ముందు గానే 'వసూలు' చేయించింది సంగని పోరాటమే. అంతకు మునుపు భూస్వామి ఎదురైతే పక్కకు తిరిగి, గడ్డిమోపులు లాక్కుంటున్నా కిమ్మనకుండా అవమానపర్చినా మింగుతూ బతికే కూలీలకు 'సంగం' యొక్క విలువను అవగాహన చేయించింది. సంగదాసు పోరాటమే. కళ్ళు నెత్తికెక్కిన భూస్వామ్య వర్గానికి, కళ్ళు తేలేసే సందర్భాన్ని నిర్మించింది సంగదాసు గుండెల్లోంచి పెల్లుబిగిన ఆక్రోశమే.

సంగదాసు బతికి ఉన్నంతకాలం తండ్రికి తెలియకుండా సహకారాన్నందించిన రామానాయుడు సంగదాసు మరణానికి తన తండ్రి కారణం కావడంతో, ఆ బాధ్యతను తానే స్వీకరిస్తాడు. తండ్రిని లెక్కచేయడు. పంచములను విజ్ఞానవంతుల్ని చేసేందుకు వారు ఏర్పాటు చేసుకున్న సంగమందిరానికి పుస్తకాలు, పత్రికలు పంపిస్తాడు. 'ధర్మపఠన' మండలాలను ఏర్పాటుచేస్తాడు.

[14] మాలపల్లి , పు:144-145

### 3.1.4 మాలపల్లి నవల సంఘర్షణ–తిరుగుబాటు :

తమ్ముడి మరణానికి తీవ్రంగా స్పందించిన వెంకటదాసు తమ్మునిలా శాంతియుత మార్గంలో కాకుండా తండ్రిలా ఆధ్యాత్మిక ధోరణితో కాకుండ, 'తిరుగుబాటు' ధోరణిని అవలంభిస్తాడు. చిన్నవాడైనప్పటికి సంగదాసును నాయకునిగా ముందు ప్రవేశపెట్టడం, ఆపిదప, పెద్దవాడైన వెంకటదాసును నాయకునిగా ప్రవేశపెట్టడాన్ని గమనిస్తే సామాజిక అసమానత రూపుమాపదగిన రుగ్మతే అయినప్పటికీ దానికంటే గొప్పది ఆర్థిక అసమానత అని, ఆర్థిక అసమానతను రూపుమాపగలిగితే సామాజిక రుగ్మత దానంతట అదే తొలగిపోగలదని కవి భావించినట్లు తెలుస్తుంది. మొట్టమొదట సాంఘిక అసమానత సమస్యను ఆ పిదప ఆర్థిక అసమానత సమస్యనూ కవి ఎత్తుకోవటం మన భారతదేశంలో ఆయా సమస్యలు ప్రాధాన్యాన్ని వహించిన క్రమాన్ని సూచిస్తాయి. ధర్మకన్నాల ద్వారా ధనవంతులందరి మీద ప్రత్యక్షంగా సంఘర్షణకు దిగుతారు. ''*తమ్ముడి దుర్మరణం దానికి ప్రతిక్రియ లేకపోవడం అతని మనస్సులో నాటి అస్వాభావికమైన ద్వేషమును పురికొల్పినవి. చౌదరయ్య తన ధన తృష్ణకు బలియై నశించిన కుటుంబాలు చూసి ధనికులకు ప్రబల శత్రువైనాడు. లోకంలో అందరి దుస్థితికి ధనికులే కారణము.*''[15] అనుకున్నాడు. ఎవ్వరినీ పట్టించుకోకుండా, తన పని తాను చేసుకుంటూ పోయే వెంకటదాసుకి ఈ ఘటన అతని మనస్సుని తీవ్రంగా కలిచివేసింది.

కుటుంబంతో జరిపే చర్చలో ఒకసారి వెంకటయ్య ''*ధర్మానికి వ్యవస్థ లేదు.... ధర్మం చాలాకాలం క్రిందటనే పెడదారి బట్టింది. నేను చేసే యుద్ధం ధర్మయుద్ధం.*'' పౌరుషమనీ, ప్రతాపమనీ, దేశాభిమానమనీ, ధర్మరక్షణమనీ పేర్లు పెట్టి స్వలాభ ప్రేరితులై ప్రతినిధులైన, ధర్మవినాశకులైన భాగ్యవంతులు లక్షలకొలది బీదజనులను రణరంగాల్లో బలిదీస్తారు. లోభుని ప్రతినిధులైన, ధర్మవినాశకులైన భాగ్యవంతుల మీదనే ధర్మయుద్ధం ప్రకటిస్తాను రాజులు యుద్ధాలు చేసి దేశాలను నాశనం చేస్తే, నేను స్వల్ప సంఖ్యాలకులైన భాగ్యవంతులను నాశనం చేస్తాను. వాళ్ళు సంఘాలను దోస్తే, నేను కుటుంబాలను దోస్తాను. వాండ్లు అధర్మ చట్టాలను ఫిరంగల బలంతో చలాయించుకుంటే నా బాహుబలంతో నా ఉత్తర్వులను అమలులో పెడతాను. భాగ్యవంతుల ధన, ప్రాణ, రక్షణ అతడు చేస్తే, బీదలకు జీవనోపాధి నేను కల్పిస్తాను. దొంగలమయితే ఉభయులమూ దొంగలమే.''[16] అని తన భవిష్యత్కార్యక్రమాన్ని వివరిస్తాడు.

---

[15] మాలపల్లి, పు:312

[16] మాలపల్లి , పు:311

అప్పటి వరకు సామాజిక బాధ్యతను పెద్దగా పట్టించుకోకపోయినా ఒక్కసారిగా తన కుటుంబానికి, తీవ్రమైన ఎదురుదెబ్బ తగలగానే వెంకటదాసు ప్రతిస్పందించాడు. వ్యక్తిగత ద్వేషాలకు తమ్ముడు బలికాకపోవడం, సామాజికి ఉద్ధరణే లక్ష్యంగా భావించి ఆత్మార్పణ చేయడం వెంకటదాసును తీవ్రంగా కలిచివేసింది. వెంకటదాసు ప్రతిస్పందన సహజంగానే తీవ్ర వ్యతిరేక, హింసాత్మక దృష్టితోనే ఉంటుంది. ఉద్రేకంగానే స్పందిస్తారు. తండ్రి ఆధ్యాత్మిక చింతన కాకుండా, తమ్ముడి అహింసామార్గం కాకుండా ప్రత్యేకమైన తిరుగుబాటు మార్గాన్ని ఎంచుకుంటాడు. దేవునిపై కత్తిగడ్తాడు. అలాగే ధనవంతులపై గూడ హిరణ్యకశ్యపుని వారసుడిగా భావిస్తాడు.

''*ఈ సృష్టిలో పశుబలమనీ, ఆత్మబలమనీ రెండు శక్తులు లేవు. ఉన్నది ఒకటే శక్తి. ధనికులు, బీదలను మోసగించడానికి పండితులకు డబ్బిచ్చి ఆత్మశక్తిని సృష్టించారు. హిరణ్యకశ్యపుని వంటి పౌరుషశాలిని నేనెక్కడా చూడలేదు. అతని ధర్మనిష్ఠ అనుపమేయం.... ఇట్టి దృఢవ్రతుడు నభూతో న భవిష్యతి....*''[17] అనడం అతని ధోరణికి అద్దం పడుతుంది. వెంకటదాసు ఉద్దేశంలో దేవుడు ధనవంతుల పక్షపాతి. సంగదాసు ఎంతో అహింసావాది అయినా అప్పడప్పుడు ధర్మానికి జరిగే గ్లనిని ఎదుర్కోలేక దేవునిపై నిరసన వ్యక్తం చేస్తాడు. రామానాయుడితో సంభాషణలో ''*పూట కూటికి లేని యీ కూలీలు యేమి ప్రతిక్రియ చేయగలరు. వీండ్ల కాధారమెవరు? అంటే సంగదాసు 'దేవుడే ఆధారం' అంటాడు. ఒకవేళ ఆయన కూడ ధనవంతుల వైపు నిలబడితే మనమిద్దరం కూడ యెదిరింతాం*''[18] అనే మాటల్లోని నిజాయితీని గమనిస్తే, ధర్మాన్ని నిలబెట్టేందుకు అవసరమైతే భగవంతున్ని కూడ నిలదీద్దాం! అనడం అతని నిఖార్సయిన మానవీయ విలువలను చూపట్టుతోంది.

తమ్ముని దుర్మరణం, తండ్రి నిష్క్రియాపరత్వం వెంకటదాసుని తీవ్రవాదిగా భగవద్వేషిగా మారుస్తుంది. ధనవంతులకు లోబడిన భగవంతునిపై జరిపే పోరు ''*రోజులలో నెలలలో, సంవత్సరాలలో గూడ తెమిలేది కాదు. శతాబ్దాలు పట్టవచ్చు. వీడు జనాన్ని అంధకారంలో ఉంచవలెనని చూస్తున్నాడు. కాని తెల్లవారింది. జనులు ప్రబోధితులౌతున్నారు. యీ నిరంకుశుని బాటు సాగదు.*''[19] దేవునికి బుద్ధి చెప్పే రోజు వస్తుందని అంటాడు. ''*హిరణ్య కశ్యపుని పౌరుషానికి పొంగిపోతూ, నరసింహావతారానికి కూడా చలించక తనను చంపుతున్న*

---

[17] మాలపల్లి , పు: 294

[18] మాలపల్లి , పు: 78

[19] మాలపల్లి , పు:302 - 303

*నిర్లక్ష్యంగా తల పక్కకి తిప్పిన దృఢవంతుడు అని పొంగిపోతాడు. తన మరణకాలంలో కూడ తండ్రి భగవంతున్ని స్మరించుకొమ్మంటే, స్మరించుకుంటే నష్టమేమిటంటే "నష్టమా?" అది ఆత్మవంచనమవుతుంది. చేయి విరిగింది. కాలు తెగింది. మిగిలిన మొండాన్ని వేయిగా విభజించినా యెప్పుడూ నా శిరస్సు వంచను. చీలికలు గూడ వంగవు...."*[20] అని తండ్రికి స్పష్టం చేసాడు. కర్మ సిద్ధాంతాన్ని వ్యతిరేకిస్తూ "మీ దేవుడు ధన పిశాచాల చేతుల్లో నుండి బయటపడాల. దౌర్భాగ్యులైన యీ బీదలందరికీ ఉపకారం చెయ్యమనండి" అని దేవునికే కర్తవ్యాన్ని బోధించే నిర్ణాయక స్థితిలో వెంకటదాసు ఆలోచనలు ఉంటాయి. "*కర్మ కొద్దీ జననం, కష్టసుఖాలు ఉంటాయని ఎవరి ప్రాప్తం తీరుగా వారికి లభిస్తుంటుంది. ఎవరైనా వాదిస్తే, ఆ సిద్ధాంతం చాలా భాగం నేనూ ఒప్పుకుంటాను. ఈ రాత్రి గడ్డపారలు తీసుకొని బయలు దేరుదాం. తిరుమంగని పేరు చెప్పి ధర్మకన్నాల మూలంగ యెవరికి ప్రాప్తమున్నది వాళ్ళం తెచ్చుకుందాం."*[21] అని కర్మ సిద్ధాంతం గురించి కొత్త భాష్యం చెప్తాడు.

చివరికి తాను లేవదీసిన ఉద్యమం వల్ల చాలా డబ్బు సంపాదిస్తాడు జగ్గడు. తాను ప్రారంభించిన ఉద్యమం వల్ల సమాజం, ధనికులూ, ప్రభుత్వం స్పందిస్తుందని భావించి, ఇకపై బీదల జీవితాల్లో వెలుగు రాగలదని ఆశిస్తూ, తన అనుచరులతో "*యింతవరకు మనం పుట్టించిన ఆందోళన వల్ల ధనికులూ, ప్రభుత్వం వారూ ప్రస్తుత స్థితిగతులు మార్చక తప్పదని అభిప్రాయ పడుతున్నారు. ఇక మీద పాత పద్ధతి ఆపి కొత్త పద్ధతులవలంభించండి. అయిదుకోట్లు సంతానులంతా సమానంగా పంచుకొని న్యాయజీవనం చెయ్యండి."* [22] అని అందరూ కలిసికట్టుగా సంపదను పంచుకొని, కష్టపడి సమానంగా పనిచేస్తే, స్వరాజ్యం వస్తుందనే భావాన్ని తెలియజేస్తాడు. కూలీలకు పనికి దగ్గ కూలీ ఇవ్వాలని, వాళ్ళ స్థితి బాగు చెయ్యాలని, బీదలకు జీవనం కల్పించాలని జగ్గడు చేసిన సూచనలను అప్పటి సాధారణ కుటుంబీకులు, విద్యావంతులు ప్రశంసించారు.

"*చివరగా తండ్రితో సంభాషిస్తూ జగ్గడు వ్యక్తం చేసిన భావాలు దేవుడు వచ్చి స్వర్గ రాజ్యం భూమి మీద స్థాపిస్తానని చెప్పినా ధనికులయినను అంగీకరిస్తానని తోచదు అయినా దేవుడు కాదని వాళ్ళే అంటారు. బందిపోటు దొంగంటారు. ఖైదులో వేస్తారు. అప్పుడు బీదవాండ్ల దేవుడూ భాగ్యవంతులు దేవుడు వేరవుతారు. రెండు సైన్యాలుగ యేర్పడి యుద్ధం చేస్తారు. అది*

---

[20] మాలపల్లి, పు: 597

[21] మాలపల్లి , పు: 302-305

[22] మాలపల్లి , పు:525 - 526

*నైతికయుద్ధం అధర్మం నశిస్తుంది. ధర్మం స్థాపితమౌతుంది.*''[23] అనడం సాధారణ ప్రజానీకం ధర్మపాతం వహించినా ధనవంతులు, భూస్వాములు దేవుడు దిగివచ్చినా తమ అధికారాన్ని, గర్వాన్ని, ప్రవర్తనను మార్చుకోలేదని జగ్గని భావం కాబట్టి అనివార్యమైన మార్పుకోసం నైతికయుద్ధం తప్పదనడం స్పష్టమే.

### 3.1.5 మాలపల్లి నవల మతసంబంధాలు :

ఈ నవలలో మత మార్పిడి గురించి కూడ రచయిత చర్చించాడు. భారతీయులలో చీలికలు తెచ్చేందుకు ఆంగ్లేయులు వాడిన అస్త్రం మతమార్పిడి సంఘంలో అణగారిన వర్గాలకు సాంఘికంగా, ఆర్థికంగా, గౌరవాన్ని కల్పించారు. విద్యనేర్పి ఉద్యోగాలివ్వడం, ఉన్నతవర్గాల వారికి ఆంగ్లవిద్య, పాశ్చాత్య నాగరికతలను అలవాటుచేసి వారిని తమ మతం వైపు తిప్పుకోవడం తద్వారా ''భారతీయ ఏకాత్మ' భావానికి గండికొట్టాలని ఆంగ్లేయుల ఆలోచన. ''*జనాలలోని అజ్ఞానాన్ని తమకు అనుకూలంగా మలచుకొని మతాన్ని రుద్దే ప్రయత్నం చేసారు. ఆంగ్లేయులు, ఆంగ్లపాఠశాలల ద్వారా దీన్ని విస్తృతంగా ప్రచారం చేయడం మొదలుపెట్టారు. అయితే సంస్కరణవాదులు దీనికి వ్యతిరేకంగా అనేక ప్రయత్నాలు చేసారు. హిందూ మతాన్ని, పూజలను, పుణ్యక్షేత్రాలను నిందిస్తూ పాఠశాలలో పుస్తకాలు, కరపత్రాల ద్వారా హిందూ మత వ్యతిరేకతను ప్రారంభించారు.*''[24] దీనిని నిలువరించేందుకు నవలలో రామదాసు కుటుంబంతో పాటు, రామానాయుడు మొదలైన వారు బాధ్యత వహిస్తారు. క్రైస్తవమతాన్ని ఎదుర్కొనడంతో పాటు, హిందూమతంలోని సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని లక్షణాలను వెల్లడి చేస్తారు. మంగళాపురంలోకి క్రైస్తవం ప్రవేశించలేకపోయింది. ''*ఉద్యోగాల కోసమో, ధనాకర్షణ వల్లనో, సంఘంలో హీనంగా చూడబడటాన్ని భరించలేకనో, ఎందరో హరిజనులు ఆరోజులలో క్రైస్తవమతం ప్రారంభించారు.*''[25] పంచములకు గుడి కట్టిస్తామని, బడి ఏర్పాటుచేస్తామని, అప్పాదాసుకి, జ్యోతికి ఉపాధ్యాయ పదవులిస్తామని పెద్ద జీతాలు ఏర్పాటు చేస్తామని ఫాదరీలు రాయబారం పంపుతుంటారు. అన్ని ప్రయత్నాలు విఫలమౌతుంటాయి. హిందూ క్రైస్తవమతాల మధ్య చర్చలో చౌదరయ్య హిందూ పక్షపాతిగానే వ్యవహరిస్తాడు. ఫాదరీ ఏసుక్రీస్తే దేవుడని క్రైస్తవ మత ఆధిక్యతను చాటే ప్రయత్నం చేస్తాడు. అప్పుడు రామదాసు ''*అన్ని మతాలూ దేవుడు ఒక్కడనే చెప్పుతవి. దేవతలు అనేకులుండవచ్చు. వానిని ఇతర మతస్థులు దేవదూతలు*

[23] మాలపల్లి , పు: 600

[24] భారత స్వాతంత్రోద్యమ చరిత్ర – I , పు: 81 – 82

[25] నవలా విమర్శ, పు: 23

*మొదలైన పేర్లతో పిలుస్తారు. బ్రహ్మపర్యంతం దేవతలనే హిందువుల నమ్మకం''* [26] అని హిందూమత ప్రాచీనతను, ఔన్నత్యాన్ని తెలియజేస్తాడు.

### 3.1.6 మాలపల్లి నవల చట్టం– జైలు – సెటిల్ మెంటులు :

ఈ నవలలో సెటిల్ మెంట్లలో చేర్పించినా ''*నేరపు జాతులలో చేరినవాండ్లనందరినీ సెటిల్ మెంట్లలో నుంచి, వాటిని సమీపంలో సేనలను నిలుపవలసిందనీ మాల మాదిగలను కూడ నేరపు జాతులలో చేర్పించమనీ ఉత్తర్వులు''* [27] పంపుతుంది. అయినా రామదాసు లొంగడు. జైలు జీవితం దుర్భరంగా ఉన్న రామదాసు చలించడు. జైలులో పాలు తనను ఎంత ఇబ్బంది పెట్టినా అన్నింటినీ ఓర్చుకుంటాడు. చివరకు నగ్నంగా చేసినా నోరు మెదపలేదు. మల మూత్రభాండాలు మీద ఒలికినా చలించడు. దీనిని జైలు జీవితం అనుభవించిన ఉన్నవ వారే స్వయంగా

రాయవెళ్ళూరు జైలు జీవితం గూర్చి చెపుతూ కుమారరాజ వారితో....''*మన సెల్ లోనున్న మలమూత్ర భాండాలు మనమే తీసిపారబోయుదామన్నారు. అందుకు రాజాగారు అంగీకరించారు. ఉదయమే మలభాండం లక్ష్మీనారయణ గారు మూత్రభాండం రాజాగారు తీసుకెళ్ళి పారబోశారు. తర్వాత జైలు వార్డెన్ సూపర్నెంట్ కి ఫిర్యాదు చేయగా, అతను వచ్చి విచారణ చేసాడు. మిగతా వారందర్నీ మానిపించాడు ఉన్నవ.''*[28] అని తెలియజేసారు.

### 3.1.7 మాలపల్లి నవల ఆధ్యాత్మిక సంబంధాలు:

రామదాసు తన జీవితంలో పొందిన కష్టాలను, దుఃఖాలను పూర్వకర్మఫలంగా భావించుకొని అనుభవిస్తాడు. సుఖదుఃఖాలకు అతీతంగా రామదాసు జీవితం గడుస్తుంది. దేన్నయినా ప్రారబ్ధం అనుకొని ముందుకు సాగే తత్వం రామదాసుది ''*యేది సంభవించినా మహా ప్రసాదమని స్వీకరించే బుద్ధి కలవాడు''* [29] కాబట్టే దేనికీ చలించడు. ''*మనస్సులోని సమస్తములైన ఆలోచనలను వదిలి పెట్టుటయే యోగము. యోగమునే సన్యాసమనియు చెప్పుదురు. ఇంద్రియార్థములతోను, కర్మఫలములతోను, సంబంధమును విడిచిపెట్టిన వాడును, మనస్సులోని సకల సంకల్పములను తృజించిన వాడును యోగారూఢుడని చెప్పబడును. నానా జన్మల యందలి విషయ వాసనలతో మనస్సు నిండి జీవునకు ననేకములైన యాలోచనలను*

[26] మాలపల్లి , పు: 318

[27] మాలపల్లి , పు: 374

[28] సాహిత్యోపన్యాసములు, 17), పు: 14, 'ఉన్నవ'

[29] మాలపల్లి , పు:39

*బుట్టించును. బహు జన్మార్జిత రూపములైన ఈ ఆలోచనలను స్తంభింపచేసి మనను నాత్మస్థితము గావించుట యోగ విద్యకు బర మార్థము.''*[30] కొడుకులు చనిపోయినా, ఆస్తిపోయినా, కూతురు అల్లుడూ చనిపోయినా, జైల్లోకి పంపినా, భార్య నుండి దూరం చేసినా, చివరికి పాచి పని చేయాల్సివచ్చినా త్రికరణశుద్ధిగా స్వీకరించే గుణం రామదాసుది. తనకు సంభవించిన ప్రతి అనుభవాన్ని భగవంతుని వైపు మరల్చుకొంటాడు. త్రిగుణాతీత స్థితికి చేరుకుంటాడు రామదాసు. రామదాసు జీవితంలో సుఖాలకంటే దుఃఖాలు అధికంగా కనిపిస్తాయి. ఇహలోకపు విషయాలపై ఆసక్తిలేని రామదాసు పరలోకపు విషయాలపై ఆలోచన కలిగివుంటాడు.

*''తపస్సు మున్నగు సాధన చేయకయే, సహజముగా ఎవరికి భోగములు రుచింపవో అతడు జీవన్మక్తుడని చెప్పబడును. కాలానుగుణంగా నిరంతరము సుఖదుఃఖములు సంభవించుచుండినను ఎవడు హర్ష – విషాదములను పొందడో అతడు జీవన్ముఖుడని చెప్పబడును. మార్గము, అమర్షము, భయము, క్రోధము, కామము, కార్పణ్యము, ఈ సంకల్పవృత్తులు ఎవరి అంతఃకరణమును స్పృశింపజాలడో అతడే జీవన్ముక్తుడని చెప్పబడును.... ఎవరు సర్వథా ఆత్మానందమును పొందుచుందురో, ఎవరి మనస్సు పూర్ణముగా, పావనముగా నుండునో ఎవడు సర్వోత్తమ విశ్రాన్తిని పొంది యే విషయమును వాంఛింపక గీత స్నేహితుడై జీవించునో అతడు జీవన్ముక్తుడని చెప్పబడును.''*[31] తత్వజ్ఞానము, వైరాగ్యము, ఆశయసిద్ధి ద్వారా శాంత ప్రవృత్తిని ఆశ్రయిస్తాడు. భగవంతుని సాన్నిహిత్యం కోసం ఎదురుచూస్తుంటాడు.

### 3.1.8 మాలపల్లి నవల పీడిత స్వభావం:

మనుషులకు, మానవీయ విలువలకు, మానవ సంబంధాలకు విలువనివ్వక అన్నింటిలో ఆర్థిక మూలాలను అన్వేషించే మనస్తత్వం కొందరిలో ఉంటుంది. సామాజిక సంబంధాలను కేవలం డబ్బుతో తూకం వేయడం వీరికి తెలిసిన విద్య. అయితే ఇలాంటి వారు అన్ని రోజులు ఒకేలా ఉంటాయని భావించటం విచారకరం. ఎందుకంటే డబ్బు ప్రభావం సమాజంలో అనేక చోట్ల కనిపించవచ్చు కానీ, అన్నిచోట్ల కనిపించలేదు. ఒకానొక సందర్భంలో డబ్బుతో కొనలేనివి, డబ్బుకు అందని సంబంధాలు, విలువలు ఉంటాయి. అలాంటి సందర్భాల్లో ఈ ధన పిశాలచాల అహం తగ్గి, పూర్వపు వికృత చర్యలకు పరిహారం చెల్లించుకోవాల్సి వస్తుంది.

ధనం మీద వ్యామోహం జ్ఞానాన్ని నశింపచేస్తుంది. ఉచితానుచితాలను లెక్కలోనికి తీసుకోదు. చేసిన పాపకార్యలకు ఫలితం అనుభవిస్తున్న డబ్బు పొరలతో కళ్ళు మూసుకుపోయిన

[30] భాగవతము పై భగవద్గీత ప్రభావము, పు: 144

[31] ఉపనిషత్ కల్పతరువు, పు: 1093

వీరి పశ్చాత్తాపం పొందరు. ఎదురుగా జీవితాన్ని ఆదర్శవంతమైన విలువల్తో సుఖంగా గడిపేవారు. వీరికి అసమర్థులుగా కనిపిస్తారు. సమర్థత కేవలం ధనసంపాదనతోనే లెక్కగడతారు. ఆదర్శ జీవితం, ఆదర్శ వ్యక్తులు, వీరిక సరిపడవు. కుహనా ఆలోచనలు, నీచపుటెత్తులు, దౌర్జన్యాలు వీరిని నడిపించేవి. బతికించేది. పెద్దరికాన్నిచ్చేవి. అలాంటి పెద్దమనిషే చౌదరయ్య. ధన సంపాదనకు చౌదరయ్య వేయని ఎత్తు ఉండదు. చౌకధరతో కొని, తండ్రి ద్వారా సంక్రమించిన ఆస్తిని ఎన్నో రెట్లు పెంచుతాడు. ధనానికి ఉన్న విలువను గమనించి కూలిని ధాన్యం నుండి డబ్బుకు మార్చే ప్రయత్నం చేస్తాడు ఎదురొచ్చిన వారిని చంపేందుకు కూడ వెనుకాడడు. ఇంట్లో కూడ ఎవర్నీ సహించడు. భార్యతో దానగుణాన్ని కొడుకులోని జాలిగుణాన్ని భరించని చౌదరయ్య నిత్యశంకితుడు. నిస్సంతోషి. పరభాగ్యోప జీవి. అంతిమ విజయం ధర్మానిదే కాబట్టి చౌదరయ్య పాపాలు ఒక్కొక్కటి వికృతరూపం ధరించి అతని కుటుంబాన్ని కకావికలు చేస్తాయి. కూలీలు ఎదురు తిరుగుతారు. కోడలు లేచిపోతుంది. జనమంతా చౌదరయ్యకు 'తగినశిక్ష' పడిందని సంతోషిస్తారు. మానవసంబంధాలలో ప్రధానమైనవి సామాజిక, కుటుంబ సంబంధాలు. యివి రెండు బలంగా వుంటే ఆ వ్యక్తి జీవితం తృప్తితో నిండిపోతుంది. తృప్తిలేని జీవితం నరకం 'శృతి లేని కొంప కన్నా గతి లేని కొంప మేలు' అని కుటుంబంలోని మానవీయ విలువల గురించి తెలుపుతుంది. చౌదరయ్యకు తగిలిన రెండు ఎదురుదెబ్బలు అతని నీచ ప్రవర్తనకు పరిహారంగా కనిపిస్తాయి. కూలీల తిరుగుబాటు అనేది అతనిలోని ధనరాక్షసిపై సామాజిక తిరుగుబాటుగా, కోడలు లేచిపోవటం అనేది కుటుంబం బీటలు వారడంగా అర్థమవుతుంది. అటు సామాజికపరంగా ఇటు కుటుంబపరంగా 'రెంటికీ చెడ్డ రేవడి'గా చౌదరయ్య కనిపిస్తాడు. 'చెరపకు రా చెడేవు' అన్న సామెత చౌదరయ్యకు సరిగ్గా వర్తిస్తుంది.

కుటుంబ బాధ్యతలను మోసేవాడు యజమాని. కుటుంబంలోని మంచి చెడ్డలకు ముందుగా స్పందించేది కూడ యాజమానే. అయితే కమల లేచిపోవడం వాస్తవానికి రామానాయుడికి తగిలిన దెబ్బ. ఆయన కుటుంబం కూలిపోయింది. చివరకు భార్య కొడుకులను కూడ కోల్పోతాడు. అయితే ఇది రామానాయుడి మంచితనానికి, పంచమోద్యమ నిర్వహణకు గాని సంబంధించినదిగా చూడరాదు. రామానాయుడికి వాస్తవంగా దుఃఖం కలిగించినా, నైతికంగా ఇది చౌదరయ్య పతనహేతువు. అయితే సమాజం మేలుకోరే రామానాయుడికి ఇంత శిక్ష అవసరమా? అంటే ''రామానాయుడు సత్పురుషుడు. సాహు అమాయకుడా! అర్భకుడా! వారు చేసి తప్పిదం ఏమి లేదే! చౌదరయ్య దుష్కర్మకు వీరికిటువంటి శిక్షపడటం సహేతుకంగా

కనిపించదు. కానీ లోతుగా ఆలోచిస్తే సృష్టి రహస్యం యిదే; అనిపించేలా, కథా సంవిధానాన్ని పోషించారు రచయిత. తండ్రుల పాపకర్మలకు బిడ్డలు ఫలితం అనుభవించాలి. (The sins of father are visited on their children)''[32] అనే కోణంలో చూడాల్సి వస్తుంది.

తను ఎవరికోసమైతే, ప్రజలందర్నీ దోచుకొని సామ్రాజ్యాన్ని నిర్మిద్దామనుకున్నాడో ఆ కొడుకు, మనుమడు ఇద్దరూ చౌదరయ్యకు దక్కరు. తను నీచంగా చూసే పంచముల, జీవితాలకు వెలుగీయదు. ఇది కూడ కేవలం తండ్రి ఆ 'అలగాజనం' పై చూపించిన నిర్హేతుకమైన విద్వేషం వల్ల, మనవడిపై తాత పెంచుకున్న అవ్యాజమైన ప్రేమ మధ్యలోనే ముగిసిపోవటం అనేది కేవలం చౌదరయ్య పాపాలకు నిష్కృతిగానే చూడాలి. చివరగా చౌదరయ్య మరణం 'నారాయణ స్మరణ'తో ముగియడం ఒక్కటే ఆయనని రామానాయుడికి తండ్రిగా మిగిల్చింది. నిజజీవితం పూర్తిగా దుఃఖమయం కాగా సర్వస్వం కోల్పోయినా, ఏనాడూ సుఖసంతోషాలు కోరుకోని రామదాసు సుఖదుఃఖాతీతస్థితి పొంది జీవన్ముక్తుడౌతాడు.

పైన ఉదహరించిన రామదాసు, సంగదాసు, చౌదరయ్య, కమలామోహనులు, వెంకటదాసు వీరందరి జీవితాల ప్రభావం రామానాయుడి ప్రయత్నాలలో, గెలుపులలో కనిపించడం విశేషం.

### 3.1.9 మాలపల్లి నవలలో కుటుంబ సంబంధాలు:

రామదాసు కుటుంబం, చౌదరయ్య కుటుంబాలు ప్రధానంగా కనిపిస్తాయి. రామదాసు కుటుంబం అణచివేయబడుతున్నదైతే, చౌదరయ్య అణచివేతదారు, రామదాసు చెల్లెల్ని చౌదరయ్య అవమానించినా 'ప్రాప్తం' అనుకోవడం రామదాసు పరిచయంలోనే కనిపిస్తుంది.

''*సమాజానికి ఉభయజీవితాలున్నాయి. భౌతికమూ, ఆధ్యాత్మికమూ, ఈ రెండు సమాంతరంగా వికాసం పొందినప్పుడే సామాజిక చైతన్యం సంతులితమూ, సమగ్రమూ అవుతుంది. రామదాసులో ఈ బాహ్యాభ్యంతర ప్రవృత్తుల వికాసం సమాంతరంగా చిత్రితమయింది. ఆయన బహిరంగంగా చూస్తే నిష్క్రియుడూ, అకర్మణ్యుడూ కాదు. అంతరికంగా సర్వసంగ పరిత్యాగశీలం వ్యక్తమవుతూనే ఉంటుంది. కర్మ సిద్ధాంతం యొక్క ఆంతర్యం రామదాసు. ప్రవృత్తిలో నిక్షిప్తం*''[33] సంగదాసు అహింసావాదిగా చౌదరయ్య దగ్గర పనిచేస్తూ కూడ తన వర్గం వారికి అన్యాయం జరుగుతుంటే చౌదరయ్యలోని ''నిరంకుశత్వాన్ని'' పారదోలే ప్రయత్నం చేస్తాడు. కాని చౌదరయ్య మారదు. చౌదరయ్య కుమారురదు

---

[32] సాహిత్యంలో దృక్పథాలు, పు: 70-71

[33] మన నవల – పరిశీలన, పు: 23,

రామానాయుడు సంగదాసు యొక్క ప్రయత్నాల్ని, అర్థం చేసుకొని 'సంఘ' శ్రేయస్సుకై తల్లిదండ్రుల్ని కూడ లెక్కచేయడు. పంచములతో జతకట్టి, పొలంపని చేస్తాడు.

ఇక్కడ తన వర్గపు వారి శ్రేయస్సుకోరి సంగదాసు అహింసాయుత పద్ధతిలో మార్పు కోరితే రామానాయుడు సహృదయతో నిమ్న జాతీయుల మేలు కోరతారు. ఈ సంఘర్షణలో చౌదరయ్య దురాగతానికి రామదాసు కుటుంబం సంగదాసును దూరం చేసుకుంటుంది. చౌదరయ్య కోడలు లేచిపోతుంది. సామాజిక చైతన్యంకోసం సంఘశ్రేయస్సు కోసం ఒకరి కుటుంబం; అణచివేత దౌర్జన్యాన్ని ఆలంబనగా చేసుకొన్న ఇంకో కుటుంబం – ఇద్దరూ ఈ సంఘర్షణలో తమవాళ్ళను కోల్పోతారు.

రామదాసు పెద్దకొడుకు వెంకటదాసు తీవ్రవాద మార్గాన్ని ఎంచుకొని కుటుంబానికి దూరమవుతారు. చౌదరయ్య కొడుకు రామానాయుడు కుటుంబాన్ని వదిలి సంఘం వైపుకి మరలుతాడు. ఇలా కుటుంబసంబంధాలు సామాజిక ఘర్షణలో భిన్నమైపోయాయి. కుటుంబాల్లో జరిగిన పొరపాట్లుగానీ, ఆస్తి విషయాల్లో గానీ ఎక్కడా గొడవ కనిపించదు. 'మాలపల్లి'ని రక్షించిన వర్గం, 'మాలపల్లి'ని దోచుకునేవర్గం – ఈ సంఘర్షణను చూస్తూ జీవితాన్ని తామరాకుమీద నీటిబొట్టులా గడిపినవాడు రామదాసు. సామాజిక ఘర్షణలకు కుటుంబాల్లో ఎలాంటి చిచ్చు రేపాయన్న విషయాన్ని గమనిస్తే కమలామోహన్ రావుల కథ మనకు కుటుంబాల్లోని డొల్లను తెలుపుతుంది.

సామాజిక కట్టుబాట్లకు, నియంత్రణలకు లోబడి కుటుంబాలు సమాజంలో తమ పాత్రను నిర్వహించాలి. ''*సంఘం కుటుంబం ఆధారంగానే స్వరూపాన్ని ఏర్పరచుకుంటుంది. ఏ పునాది మీద కుటుంబం ఏర్పడుతుందో, దాన్ని బట్టి సంఘం యొక్క స్వరూప స్వభావాల్లోని మంచి చెడ్డలు నిర్ణయింపబడ్తాయి. అందువల్ల కుటుంబాన్ని ఏర్పరచటంలో అవసరమైన సామాజిక ఆచారాలు ఏరకంగానైనా అధర్మ, అన్యాయ విధానాన్ని బలపర్చి, ప్రోత్సహిస్తే కుటుంబవ్యవస్థయే కూలిపోతుంది. దాన్తో దాంపత్యం వ్యవస్థా స్వరూపం నుంచి ఆలోచన స్థితిలోకి దిగజారి సంఘంలో సుఖశాంతులు లేకుండా పోతాయి.*''[34]

సామాజిక ఘర్షణకు కుటుంబాన్ని దూరం చేసుకోవడం సంఘంలోని, కుటుంబంలోని విపరీత ధోరణులను చూపెడుతుంది. భారతీయ సమాజం తరతరాలుగా వివాహవ్యవస్థపై ఆధారపడి సంఘజీవనం చేస్తుంది. వివాహం లేని భారతీయ సమాజాన్ని ఊహించలేము.

[34] తెలుగు కవిత – సాంఘిక సిద్ధాంతాలు, పు: 46

వివాహం ఇద్దరి వ్యక్తుల మధ్య నున్న ప్రేమకు, నమ్మకానికి సూచన. ఈ నమ్మకం లేనిచోట వివాహవ్యవస్థ అభాసుపాలౌతుంది. ప్రేమలేని చోట నమ్మకమే ఉండదు. ప్రేమించిన వ్యక్తుల బలాలను స్వీకరించినట్లే, బలహీనతలను అర్థం చేసుకోవాలి. భార్యాభర్తలు 'ఏకాత్మ'గా జీవిస్తేనే సంప్రదాయ జీవనానికి అర్థం, సొంతవ్యవహారాలు, కోరికలు తీర్చుకునే పనిలో ఎవ్వరు గీత దాటినా అది మొత్తం వైవాహిక వ్యవస్థనే కుదిపేస్తుంది. భార్యాభర్తల నడుమ, కుటుంబ సంబంధాల్లో ఇది రేపిన చిచ్చు ఆర్పడం కష్టతరం. స్వేచ్ఛ ప్రయాణ సిద్ధాంతాల ఆధారంగా పెళ్ళికాని యువతీయువకుల పరస్పర అంగీకార ప్రేమలే ఈ దేశానికి సరిపడవు అనుకుంటే, స్వేచ్ఛా ప్రణయం మోజులో శారీరక తృప్తుల కోసం, వెంపర్లాడే వారిని సంఘం ఎలా క్షమిస్తుంది? ఇలాంటి వ్యక్తులు సంఘాన్ని ఏ విధంగా బలోపేతం చేస్తారు? జీవిత ఆశయానికి, సాఫల్యానికి, తద్వారా దేశాభివృద్ధికి వీరి చర్యలు ఎలా దోహదపడతాయి? ఇలాంటి చర్చలు 'శారీరక వాంఛ' లకు లొంగిపోయిన వివాహితుల విషయంలో కనిపిస్తాయి. కమల రామానాయుడి భార్య. రామానాయుడు పంచమోద్ధరణ కార్యక్రమంలో విరామం లేకుండా గడుపుతాడు. వీరికి ఒక మగబిడ్డ. ఇంటినీ, భార్యనీ పట్టించుకోకుండా తిరగటం రామానాయుడి లోపంగా కనిపిస్తుంది. అయితే అప్పటికే రామానాయుడి ఆలోచన నుండి కుటుంబం దూరమైంది. సంఘ శ్రేయస్సే ప్రధానమైంది. సంతానం కలిగిన తరువాత, భార్యాభర్తల సంబంధం పిల్లల ద్వారా మరింత దృఢమవ్వాలి కానీ, ఇక్కడ ఈ దంపతుల మధ్య ఎలాంటి పొరపొచ్చలు లేకుండా 'అగాధం' ఏర్పడుతుంది. దీనిని ఒక రకంగా రామానాయుడు కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయడంగా కనిపిస్తుంది.

'మాలపల్లిని సంస్కరించే పనిలో, వారి జీవితాల్లో వెలుగు నింపాలకునే ఆలోచనతో ఉన్న రామానాయుడికి తల్లిదండ్రుల హెచ్చరికలుగాని, భార్యాపిల్లలు జ్ఞాపకం రాకపోవడం నిజంగా బలహీనకుటుంబాల్నే సూచిస్తుంది. సంఘోద్ధరణలో కుటుంబాలని నిర్లక్ష్యం చేయడం రామానాయుడి వైఫల్యమే, సామాజికాభివృద్ధిలో కుటుంబం కూడ భాగమే అన్న విషయం రామానాయుడికి తెలిసిరాలేదు. భార్య వివాహబంధంతో కుటుంబంలో భాగస్వామి కాబట్టి తన అవసరం ఆమెకు లేదనుకున్నాడు. ''*పురుషుడు గృహస్థాశ్రమములో ఉంటూ ధర్మమార్గమున తన కామమును తృప్తిపరచుకొనవలెను. కామాగ్నిని ప్రయత్నపూర్వకముగ పెంచుకోరాదు. గృహస్థాశ్రమము కాముకితో యుద్ధం చేసి వానిని జయించుట కేర్పడినది. ఈ ఆశ్రమము ఒక దుర్గము వంటిది. దానిలో ప్రవేశించి కాముడనే శత్రువును జయించవలయును. ఈ విధమైన*

*గృహస్థాశ్రమమును సఫలము చేసుకొనుట బుద్ధిమంతుల లక్షణము''*[35] నిజానికి కమల కూడ ఇంట్లో ఏ పని లేకుండా సోమరిగా జీవితం గడుపుతుంటుంది. అదే రామానాయుడు తాను చేస్తున్న కార్యక్రమాల్లో కమలను కూడ భాగస్వామిని చేస్తే వారి కుటుంబం ఎంతో ఆదర్శప్రాయంగా ఉండేది. కమల కూడ భర్త యొక్క ఆలోచనలు అర్థం చేసుకున్నా లేక కొడుకుతో కాలక్షేపం చేస్తూ ఇంట్లో వారికి అన్ని విషయాల్లో అందుబాటుగా ఉన్నా, అనైతిక ఆలోచనలు ఆమెకు రాకపోయేవి. ఒంటరితనం, నిర్లక్ష్యం, సోమరితనం, సుఖమైన జీవన విధనం, ఎదురుగా మత్తుగొలిపే మగాడు, మనస్సులో విపరీతమైన కామవాంఛ ఇవన్నీ కమల పతనానికి కారణాలు. వీటన్నింటినీ సక్రమంగా ఉపయోగించుకునే 'వివేకం' కమలకు లేకపోవడం విచారకరం.

''*సరిగా నిర్మలంగా, క్రమంగా జీవితాన్ని నడుపుకోవడం తెలీక, తమ గృహాల్ని విచారంతో, కోపంతో, విసుగుతో నింపుతున్నారు. లేచిపోతున్నారు. పిల్లల్ని వొదులుతున్నారు. పైన సంఘమూ, బంధువులూ, భర్త పెట్టేటటువంటి నిరంకుశాధికారం వల్ల ఆత్మలు నలిగి, చచ్చి, తమ సహజవాంఛల్ని వంకరతిప్పి, వంచకులూ, నీచులూ, అధములుగా మారుతున్నారు. పాపం త్వరలో మేలుకొని సంఘం వీరికోసం మార్పు చెందిందా, పురుషుడు తన స్వార్థపరత్వం త్యజించాడా శుభయుగం ప్రారంభమవుతుంది. లేదా స్త్రీ ఈ విధంగా వెనక వెనక గోతులు తవ్వి అధమస్థితిలో పడి, తన సంతతిని అధమముగా చేసి కుళ్ళు పెడుతుంది.''*[36] మోహనరావు రామానాయుడు దూరపు చుట్టము. చుట్టము చూపుగా ఇంట్లో దిగుతారు. శశాంక విజయం బిల్హణీయం లాంటి గ్రంథాలు మోహనరావులోని అనైతిక ప్రణయాన్ని మేలుకొలుపుతుంది. ఎదురుగా నిర్వ్యాపారిగా కమల, ఆమె ఆలోచనలు కూడ తన పట్లే ఉన్నాయన్న విషయాన్ని కూడ గ్రహిస్తాడు మోహనరావు. ఇద్దరి మానసికస్థితి ఒకే విధంగా ఉంటుంది. కమల నిద్రలో కూడ మోహనరావునే కోరుకుంటుంది. మోహనరావుతో తనకు సామిప్యం పెరగినందుకు చింతిస్తూ ''*యిట్టి సమయముల గదా ప్రియుల కైదండ లొసంగి సేవింప నరసమవుతుంది. ప్రాణనాథుదు దండనుండ తనకట్టి భాగ్యము లభింపక దుస్సహమైన పారతంత్ర్య జీవనమే కదా కారణమని''*[37] అనుకుంటుంది కమల. గుండె రాయి చేసుకొని, భర్తనీ, పిల్లాడ్ని, ఇంటినీ వదిలి మోహనరావుతో

---

[35] భాగవత రహస్యోపన్యాసములు, పు: 226

[36] స్త్రీ, పు: 144-145

[37] మాలపల్లి , పు:220

లేచిపోతుంది కమల. స్వేచ్ఛా ప్రణయాన్ని అనుభవిద్దామని నిశ్చయించుకొని ''సహజమైన ప్రేమానుబంధాలకు వివాహ బంధాలు ప్రతిబంధకాలు''[38] కాగా లేచిపోతుంది కమల.

''*ప్రణయం వైయుక్తికమైనది. దాంపత్యం సాంఘికమైనది. ఒకటి కేవలం స్వార్థ విషయం. వైయుక్తికం. రెండవది ధర్మం. ధర్మమెప్పుడూ సామూహికమైనదే.... అంటే సంఘ భవితవ్యం కోసం కొన్ని ధర్మాలు పండితుల చేత ఏర్పరచబడి సాంఘిక జీవన ప్రశాంతికి సోపానాలు నిర్మిస్తాయి. ఆ సామూహిక భద్రతకు హేతువైనది ధర్మం. ఆ దృష్టితో ఆ భద్రతను నిర్మూలించే ప్రణయ స్వేచ్ఛావాదం నిషిద్ధమౌతున్నది.''* [39] ధర్మమార్గాన్ని తప్పి భవిష్యత్తును ఏమాత్రం ఊహించుకోకుండా, ఈ మోహనరావు యొక్క ప్రేమ సాంద్రతను సరిగ్గా అంచనావేయక లేచిపోతుంది కమల. తన శారీరక సౌందర్యం శాశ్వతమని, మోహనరావు సుందరరూపం మరింత శాశ్వతమని లేచిపోతుంది కమల. కానీ మోహనరావే ఆమెతో శాశ్వతంగా ఉండాలా? లేక మధ్యలో వదిలేయాలో నిర్ణయించుకోలేకపోతాడు.

కమల మోహనరావుతో లేచిపోకముందు తను కొన్ని సందర్భాల్లో నిర్ణయం తీసుకోలేకపోయింది. ఆమెలోని 'మాతృప్రేమ' ఆమెను నిలువరిస్తుంది. ''*సాహు యొక్క నిర్మలమైన నెమ్మోము చూచేవరకు కమలమ్మ హృదయ తాపాలన్నీ శమించి మరులుగొని పట్టి కౌగిలించుకో బోతుంది*''[40] సాహు అక్కడనుండి పరుగెత్తి బయటకు వెళ్ళిపోతాడు.

ఇక్కడ తల్లి హృదయం ''*కమలమ్మ నిలిచి మత్తిల్లి సాహు వంక వెఱ్ఱిదానివలె చూసింది. కాఠిన్యం వహించిన మనస్సు వెన్నవలె కరిగిపోయింది. కళ వెళ పడ్డది. కళ పెళ్ళడింది. గగ్గోలు పడి ఘూర్ణిల్లిపోయింది. బిడ్డను తప్పిపోయిన ఆడపులి వలె ఆక్రోశిస్తూ భవంతిలోకి వచ్చి చాపమీద మొదలు నరికిన చెట్టువలె విరుచుకు పడిపోయింది*''[41] సంఘర్షణకు లోనైంది.

మోహనరావుతో శారీరక వాంఛలు బలహీనపడ్డాక తిరిగి ఆమె హృదయంలోకి భర్త, కుమారుడు ప్రవేశిస్తారు. తను భర్తకు చేసిన ద్రోహాన్ని గుర్తుకుచేసుకుంటూ ''*రామానాయుడు గారూ! మీ కెంత ద్రోహం చేసాను? నీ పత్నీవ్రతానికి దోడు నీకొక పతివ్రత లభింపక పోయెనే యీ పాపి నీకేల తటస్థపడ్డది*'' [42] అని క్షణికావేశంలో తాను తీసుకున్న నిర్ణయానికి

[38] మాలపల్లి, పు:228

[39] శ్వేతపద్మం, పు:226

[40] మాలపల్లి , పు:284-285

[41] మాలపల్లి , పు:227

[42] మాలపల్లి , పు:270

కుమిలిపోతుంది. దీన్తో స్త్రీ, పురుషుల మధ్య కేవలం శారీరక వాంఛకు కేవలం వివాహం ద్వారానే గుర్తింపు భద్రత లభిస్తుందని తెలుస్తుంది. భార్యాభర్తల మధ్య కూడా ఒకానొక సమయంలో 'కామవాంఛ' లేకున్నా, అనిర్వచనీయమైన ప్రేమ వారి బంధాన్ని శాశ్వతం చేస్తుంది. ఆలుమగల మధ్య సెక్స్ ఎప్పుడూ ప్రధానవసరంగా గుర్తింపబడదు. భారతీయ సాంప్రదాయంలో పిల్లల్ని కనేందుకు మాత్రమే కాదు. ఒక గూటిలో కాపురముంటున్న భార్యభర్తలు సంతానం ద్వారా కుటుంబాన్ని నిర్మించుకొని సమాజాన్ని నిర్వహించి, తద్వారా శ్రేయోరాజ్యాన్ని నిర్వహించాలి. దీనికి వ్యతిరేక మార్గంలో ప్రయాణించిన ఎవ్వరికైనా పతనం తప్పదు. సెటిల్ మెంట్లో పాల్ అఘాయిత్యాల్ని భరించలేక జ్యోతి ఆత్మహత్య చేసుకుంటుంది. అప్పాదాసు పిచ్చివాడయి ఆమె శరీరంతో పాటు తాను కూడ కృష్ణానదిలో సహగమనం చేస్తాడు.

### 3.2 వేయిపడగలు నవల – పరిచయం:

భారతదేశంలో ఆంగ్లేయులు రాకపూర్వం పరిపాలన ప్రధానంగా సంస్థానాదీశులు, స్థానికంగా జమీందారులు చేసేవారు. దేశంలో పల్లెలు జమీందారుల ఆధీనంలో ఉండేవి. జమీందారులు ప్రజల్లో ఒకడిగా పాలన సాగించేవాడు. ప్రజల ఆస్తిపాస్తులకు రక్షణ కల్పిస్తూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ న్యాయ, విద్య, సాంస్కృతిక రంగాల్లో వారికి సహాయపడేవారు. ఆంగ్లేయులరాకతో జమీందారీ వ్యవస్థ నశించింది. జమీందారు ప్రజల కొరకు గాక ఆంగ్లేయుల ప్రభుత్వం కొరకు పాలకుడిగా ఉండవలసి వచ్చింది. బ్రిటీష్ వారికి 'ఏజెంట్లుగా' జమీందారులు మారిపోయారు. ప్రజల నుండి విపరీతమైన పన్నులు వసూలు చేసి అధికారులకు పంపేవారు. పూర్వంవలె ప్రజలలో ఒకరిగా ఉండలేకపోయారు.

దేశంలోని ప్రజలు ప్రధానంగా వ్యవసాయం వృత్తిగా గలవారు. పల్లెల్లో కుటీర పరిశ్రమలు నడుపుకునేవారు. ఇవి కూడా పెద్ద పరిశ్రమల కారణంగా రైలుమార్గలేర్పరచిన కారణంగా కూలబడ్డాయి. దేశంలో పూర్వం విద్యద్వారా పూర్తిగా జాతీయమైనది. వీథిబడులు, విద్యాసంస్థలుగా వుండేవి. పురాణగాథలు, రామాయణ భారత, భాగవతాలు ప్రధానంగా చదువుకొనే పుస్తకాలు, లౌకిక అవసరాలకు సరిపడే గణితం నేర్చుకొనేవారు. ఇంగ్లీషువారు వచ్చి కొత్త విద్యవిధానం ప్రవేశపెట్టి పాఠశాలలకు, కళాశాలలను స్థాపించారు. ఈ విద్య చదివిన వారికి ఉద్యోగాల ఎర చూపారు. ఈ మార్పువల్ల దేశీయమైన చదువులపట్ల ప్రజలకు అనాదరణ ఏర్పడి విదేశీవిద్యపై వ్యామోహం ఏర్పడింది. ఇంగ్లీషువారి పాలనలో దేశంలోని రాజకీయ, ఆర్థిక, విద్యారంగాలపై ప్రధానంగా విదేశీయత ముద్ర పడింది. ఫలితంగా భారతీయులు రాజకీయంగా బానిసలు, ఆర్థికంగా దరిద్రులు, సాంఘికంగా అనాగరికులుగా భావించబడ్డారు.

అంగ్లేయుల అణచివేతకు, ఒత్తిడులకు క్రుంగిపోయిన భారతీయులు ఎదురుతిరిగిన సంఘటనలు కూడా చరిత్రలో ఉన్నాయి.

ఆంగ్ల విద్యావంతులైన భారతీయులు దేశాన్ని ఈ పరిస్థితుల నుండి జాతీయతవైపు మళ్ళించే ప్రయత్నం చేసారు. 19వ శతాబ్ది ఉత్తరార్థంలో వంగదేశంలో రాజా రామోహనరాయ్, బ్రహ్మసమాజాన్ని స్థాపించారు. క్రమంగా ఆర్యసమాజం, దివ్యజ్ఞాన సమాజం వంటి సంస్థలు, రామకృష్ణ పరమహంస, వివేకానందులు, అరవిందులు లాంటి తాత్వికుల సాంస్కృతిక పునరుజ్జీవనానికి పూనుకొని దేశీయమైన గత సంస్కృతిని పునరుద్ధరించే ప్రయత్నం చేసారు. ఉత్తర భారతదేశంలో ఏర్పాటయిన సంస్థల ద్వారా, దేశమంతటా ప్రచారం చేయబడిన తాత్వికుల ఉద్యమాల ద్వారా ఆంధ్రదేశంలో కూడ సాంఘిక చైతన్యం చదువుకున్నవారిలో కలిగింది. తాత్వికత, గతిసంస్కృతీ విషయాలకన్నా సంఘసంస్కరణల ప్రభావం అధికంగా కనబడుతుంది కందుకూరి. స్త్రీ జనోద్ధరణ, బాల్యవివాహాల రద్దు, వితంతు పునర్వివాహం లాంటి సంస్కరణలు ప్రచారం చేసి, ఆచరించి చూపారు. సామాజిక రంగంలోను, సాహిత్య రంగంలోను నూతనశకాన్ని సృష్టించారు.

ఆంగ్లేయుల పరిపాలనలో అనేక విధాలయిన బాధలను సహించిన ప్రజలు పన్నుల భారాన్ని సహించలేకపోయారు. వారు విధించిన పన్నుల కారణంగా ప్రజలు దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించడమే కాక దేశంలోకి సంపదనంతా పోగొట్టుకోవలసి వచ్చింది. ఈ దుస్థితిని ఎదుర్కొనేందుకు తిలక్ నడుం బిగించాడు. ఆంగ్లేయుల పన్నుల విధానాన్నెదిరిస్తూ ప్రజలకు మేలుకొలుపు కలిగిస్తూ ఉద్యమం లేవదీశారు. ఆయన జైలుకు వెళ్ళిన తర్వాత, గోఖలే, నేతాజీ లాంటివారు ఎందరో ఆయన బాటలో ఉద్యమం కొనసాగించారు. గాంధీజీ ఉద్యమములో చేరి నాయకత్వం వహించేవరకు దేశంలో పర ప్రభుత్వం పట్ల నిరసన భావాలు ప్రచారం చేయబడ్డాయి. గాంధీ నాయకత్వంలో ఉద్యమం కొత్తదారులు త్రొక్కింది. ఆయన బోధనలో సత్యం, అహింస, శాంతి వంటి వాటికి ప్రాధాన్యం ఇస్తాడు. వాటినే ఆయుధాలుగా ఆంగ్లేయుల నెదుర్కోవలెనని ప్రభోదించాడు. సత్యాగ్రహాలు, సహాయనిరాకరణోద్యమాలు నిర్వహించాడు. ఈ ఉద్యమంలో దేశమంతా స్పందించింది. ఎక్కువ మంది విద్యావంతులు ఉద్యమంలో పాల్గొని ఉధృతం చేసారు. దీని ప్రభావం ఆంధ్రదేశంలో కూడ ప్రతిఫలించింది. ఎందరో ఉద్యోగాలు వదిలి, ఉద్యమంలో చేరారు. విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. న్యాయవాదులు తమ వృత్తులను వదిలివేసారు.

సాంస్కృతిక పునరుజ్జీవనం, జాతీయోద్యమం సమంగా ప్రజలలో కలిసిపోయి స్వాతంత్ర్యం లక్ష్యంగా కొనసాగాయి. వీటి ప్రభావం దేశంలోని సాహితీరంగంపై ప్రసరించింది.

జాతీయోద్యమాన్ని ప్రోత్సహిస్తూ ఠాగూర్, బంకింగ్ చంద్ర ఛటర్జీ వంటివారు రచనలు చేసారు. బంకించంద్ర చటర్జీ రాసిన ఆనందమఠంలోని 'వందేమాతరం' అన్న గీతం ఉద్యమకారులకు నినాదమై, ఉద్యమానికి కొత్త చైతన్యాన్ని కలిగించింది. ఈ గొంతుతో విశ్వనాథ కూడ గొంతు కలిపాడు.

## 3.2 .1 'వేయి పడగలు'– ఇతివృత్తం–పరిచయం

'వేయిపడగలు' నవలకు కేంద్రస్థానం సుబ్బన్నపేట. వేయిపడగల పాము విప్పారుకొని వచ్చి కాటందుకున్నది. కలలోన రాజును అనే గణాచారి పాటతో నవల ప్రారంభమవుతుంది. సుబ్బన్నపేట పెదకాపుగారి ఆవు నాగేంద్రుని పుట్ట దగ్గర నిలిచి పాలను స్రవిస్తూ ఉండగా ఆ పాలను పుట్టలో పాము తాగుతుంది. నాగేశ్వరస్వామి పెదకాపుకు కలలో కనిపించి దేవాలయం కట్టించమని ఆనతిస్తాడు.

వీరన్న నాయని వంశం వారు స్వామికి ప్రతినిధులు. పైన భగవంతుడు – కిందరాజు, బ్రాహ్మణుడు ఈ రెండు మహా సంస్థలకు గణాచారి తెంచరాని లంకె.ఇది నాలుగు స్తంభముల ధర్మ మంటపము, స్వామి జమీందారు, బ్రాహ్మణుడు గణాచారి వీరు నలుగురు నాలుగు స్తంభములు.కథాకాలము నాటికి వీరన్న వంశము వాడైన కృష్ణమనాయుడు సుబ్బన్నపేట జమీందారు. ఆయన దివాను రామేశ్వరశాస్త్రి. ఈయన కుమారుడు ధర్మారావు. ఇతను ఈ నవలకు ఆత్మ.

రామేశ్వరశాస్త్రి నాలుగు వర్ణముల నుండి నలుగురు కన్యలను వివాహము చేసుకున్నాడు. నలుగురికీ సంతానము వున్నది. వీళ్ళుగాక రత్నగిరి అనే భోగకాంత వల్ల ఆయనకు గిరిక అనే కుమార్తె వున్నది. ఆయన నాలుగవ భార్య పెదకాపు కూతురు. ఈమెకు పసిరిక అనే కొడుకు వున్నాడు. పసిరిక పాము, చెట్టు, పక్షి, మనిషి లక్షణాలున్న విచిత్ర వ్యక్తి.

రామేశ్వరశాస్త్రి దాతృత్వం వల్ల వాళ్ళ కుటుంబం ఆర్థికంగా దిగజారింది. ఆయన మరణం ధర్మారావును కుంగదీసింది. తండ్రికి కర్మకాండ జరపలేని దుస్థితి ధర్మారావు సంగతి తెలిసి కృష్ణమనాయుడు కర్మకాండకు ధనసహాయం చేశాడు. ధర్మారావు చదువు ఆగిపోయింది.

కృష్ణమనాయుని మరణానంతరం అతని కుమారుడు రంగారావు సుబ్బన్నపేట పరిపాలకుడయ్యాడు. ఇతనికి పాశ్చాత్య వ్యామోహం ఎక్కువ పట్టపుటేనుగు లక్ష్మణస్వామి

సంప్రదాయ విచ్ఛేదాన్ని సహించలేక పోయింది. రంగారావు మోటారు కారుకు ఎదురుగా నిలిచి, అతడిని నిర్లక్ష్యానికి గురియై మరణించింది.

రంగారావుకు ధర్మారావుపైన సదభిప్రాయంలేదు. ధర్మారావు సత్ప్రవర్తనను రంగారావు దివాను రామేశ్వరం సహించలేకపోయాడు. జమీందారు చుట్టూ చేరిన వాళ్ళు పరిపాలనను దిగజార్చారు. ధర్మారావుకు చిన్నవయసులోనే అరుంధతితో వివాహమైంది. ఇప్పుడామె ఈడేరి కాపురానికి రావటానికి సిద్ధంగా వున్నది. వదినకు ఇమ్మని గిరిక ధర్మారావుకు తన వ్రేలి ఉంగరం ఇచ్చింది. గిరిక మహాభక్తురాలు. స్వామికి తనను తాను అర్పించుకున్న దేవదాసి.శోభనం నాడు అరుంధతి పుట్టింటివారు ధర్మారావు దారిద్ర్యాన్ని దెప్పి పొడిచారు. గిరికను తన చెల్లెలని చెప్పినందుకు ఆక్షేపించి అరుంధతి తనకు ఉంగరం వద్దన్నది. ధర్మారావు భార్యను బుజ్జగించి దేవదాసీలను వారాంగనలుగా తలచరాదని చెప్పాడు. అరుంధతికి పాము కన్పించింది. ఆమె భయపడింది. సహస్ర ఫణా పండితుడైన సుబ్రహ్మణ్యస్వామి వలన తమకు ఆపద కలగదని, స్వామికి నమస్కరించమని చెప్పి, తాను స్వామిని ''*నన్నుగూడ నా పితురులను వలెనే సంప్రదాయమునకు దూరముగాకుండ కాపాడుము*'' అని ప్రార్థించాడు.

జమీందారుగారి భార్య ధర్మారావును చదువుకోమని, చదువుకోవటానికి డబ్బు తాను ఇస్తానని చెప్పింది. సూర్యవతి, రాఘవరావు, కిరీటి, ధర్మారావు, స్నేహితులు, ధర్మారావు గుంటూరు కాలేజీలో చేరాడు. ఒకనాడు రాఘవరావుతో కలిసి కొండవీడు విహారయాత్రకు వెళ్ళాడు. అక్కడ జరిగిన సంభాషణలో శ్రీనాథ కవి సీస పద్యపు నడక చెడగొట్టాడని అన్నందుకు రాఘవరావు ధర్మారావు చెంప పగలగొట్టాడు. అయినా ధర్మారావు ఓర్చుకున్నాడు.

ధర్మారావు తండ్రికి రంగాజమ్మ అనే భార్య వల్ల కలిగిన రామచంద్రరాజు. ధర్మారావు సోదర ప్రేమతో ఆదరిస్తాడు. రంగాజమ్మ జబ్బుచేసి మరణించింది. ధర్మారావు తన భార్య చనిపోయినంతగా దుఃఖించాడు. గిరిక నాట్యం చేసి భక్తి పారవశ్యంతో అప్పుడప్పుడూ మూర్ఛపోతుంది. దేవదాసీ వ్యవహార ఔన్నత్యాన్ని తెలిపి ధర్మారావు జమీందారిణితో ''*ఇవయన్నియు చచ్చిపోవుచున్న ఒక జాతి యొక్క మెఱుపులు*'' అన్నాడు.

గుంటూరులో కాపురం పెట్టిన తరువాత ధర్మారావు ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. జమీందారిణికి జబ్బు చేసింది. ధర్మారావామెను చూడటానికి సుబ్బన్నపేట వెళ్ళాడు. కాని అధికారుల అడ్డంకి వల్ల ఆమె దర్శనం దొరకలేదు. సూర్యపతి ధర్మారావుకు కొంత డబ్బు ఇచ్చాడు. ధర్మారావు చదువుకు ఇబ్బంది తొలగిపోయింది.ధర్మారావు మిత్రుడు కిరీటి తన మేనమామ కూతురు శశిరేఖను పెళ్ళి చేసుకోవాలను కున్నాడు. నిరుద్యోగి కిరీటికి

పిల్లనివ్వటానికి అతని మేనమామ ఇష్టపడలేదు.గణాచారి కోటలోకి వెళ్ళినప్పుడామెను ఎవరూ పట్టించుకోలేదు. జమీందారిణి రుక్మిణమ్మరావు మరణించింది. తర్వాత చిన్నరాణి సరోజనీదేవి కూడ మరణించింది. ఈమె చనిపోవటానికి కొంతకాలం కిందట కుమారుడు హరప్పను చేరబిలిచి మొదలు ధర్మారావు దగ్గర చదువుకోమని చెప్పింది. హరప్ప ధర్మారావు దగ్గర చదువుకోవటం మొదలుపెట్టాడు.

రంగారావు ఇంగ్లాడు వెళ్ళి సుసానీ అనే విదేశీవనితను పెండ్లి చేసుకున్నాడు. సుసానీ సుబ్బన్నపేటకు వచ్చిన తర్వాత తన పేరు శశిని అని మార్చుకుంది. శశిని అందరితో స్వేచ్ఛగా మెలగటం జమీందారుకు నచ్చలేదు. శశని పక్షుల్ని వేటాడటం ఊళ్ళో వాళ్ళకు వింతగా వుంది. జమీందారు అశ్రద్ధవల్ల గుళ్ళో స్వామి, గుడిముందరి ఆబోతు ఆలనాపాలనా లేకుండావున్నారు. హరప్ప, ధర్మారావు దగ్గర భారతీయ సంస్కృతీ విశేషాలను తెలుసుకుంటున్నాడు.

జమీందారు మద్రాసులో గుఱ్ఱపు పందేలు ఆడుతూ వ్యసనపరుడయ్యాడు. శశిని పల్లెటూరులో వుండటానికే ఇష్టపడుతున్నది. దివాను రామేశ్వరం గిరికను బలాత్కరించబోయి భంగపడ్డాడు. సుబ్బన్నపేటలో జాతీయ కళాశాల ప్రారంభమైంది. కళాశాల అధ్యక్షుడు శివరావు తాను కృష్ణుని అవతారమని అనుకుంటాడు. దివ్యజ్ఞాన సమాజం వారు అతన్ని అవతార పురుషుడని గుర్తించకపోయినా తన అనుభూతి నిజమనే అనుకుంటాడు.

దివాను రామేశ్వరం తాలూకాబోర్డు అధ్యక్షుడయ్యాడు. జోస్యులు అనే ఉపాధ్యాయుని భార్య మంగమ్మతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. జోస్యులు రామేశ్వరాన్ని హత్య చేయబోయి తానే హతుడయ్యాడు. దొంగనోట్ల కేసులో రామేశ్వరాన్ని అరెస్టుచేసి, ఏడేళ్ళు శిక్ష విధించారు. జమీందారు బంధువు నాగేశ్వరరావు దివాను అయ్యాడు.

సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నందుకు రాఘవరావును ప్రభుత్వం నిర్బంధించి జైలుశిక్ష విధించింది. మేనమామ ఇష్టపడటంతో కిరీటి శశిరేఖను పెళ్ళి చేసుకున్నాడు. ధర్మారావుకు కొడుకుపుట్టాడు. ఆ పిల్లవాడికి తండ్రి పేరు రామేశ్వరశాస్త్రి అని పెట్టుకున్నాడు.

ఒకనాడు ధర్మారావు గిరిక పొలాల మీదికి షికారు వెళ్ళినపుడు అక్కడ పసిరిక పాములను పట్టుకొని వాటితో ఆడుకోవటం చూసి ఆశ్చర్యచకితులయ్యారు.జమీందారు ఆ వూళ్ళో కొత్తగా ఒక కాలేజి స్థాపించారు. దానిలో ఆంధ్ర పండిత పదవికి ధర్మారావు అభ్యర్థన పంపుకున్నాడు. కాని అసూయపరుల చెప్పుడు మాటల వల్ల ఆ ఉద్యోగం అతనికి రాలేదు.ధర్మారావు భార్యను కుమారుని తీసుకొని మిత్రుడు పశుపతి వాళ్ళ వూరు 'ఉండి' వెళ్తాడు. పశుపతి కూతురు అరుంధతి ధర్మారావుకు బాగా మాలిమి అయింది.సుబ్బన్న పేటకు ఎలక్ట్రిక్ దీపాలు, నీటి

కొళాయిలు వచ్చాయి. మహిళా సంఘం ప్రారంభమయింది. స్త్రీ స్వాతంత్ర్యం బాల్యవివాహాలు, విధవ వివాహాల గురించి చర్చ ప్రారంభమయింది.

జమీందారు బియాట్రిస్ అనే ఫ్రెంచి వనితను పెళ్ళి చేసుకున్నాడు. సుసానీ, బియాట్రిస్ లకు పొసగలేదు. పోట్లాడుకున్నారు. బియాట్రిస్ కు కొంత భరణం ఇచ్చి జమీందారామెను పంపంచి వేశాడు. తర్వాత అతనికి జబ్బు చేసింది. రత్నాలు, బంగారు నగలు ఇరవైలక్షల రూపాయలు చేజిక్కించుకొని సుసానీ ఇంగ్లాండ్ వెళ్ళిపోవటానికి సిద్ధమైంది. సుసానీ దగ్గర నుండి డబ్బు రాబట్టడానికి ప్రయత్నించి రంగారావు విఫలమయ్యాడు. హరప్ప ఆమె గదిలోకి వచ్చి తన తల్లి నాయనమ్మల జవహరీ ఇచ్చివేయమని అడిగాడు. ఆ నగలు ఇచ్చివేసింది. దివాను సుసానీ దాచిన సొమ్ము కొంత దొంగిలించాడు. ఆమె అతన్ని ఏమీ చేయలేకపోయింది.

హరప్ప సంస్థాన పరిపాలనపై పట్టు సాధించాడు. నాగేశ్వరరావు దివాను పదవి నుండి తప్పుకున్నాడు. హరప్ప ధర్మారావును దివానుగా నియమించాడు. జీతభత్యాలు తీసుకోకుండ దివానుగ వుండటానికి ధర్మారావు అంగీకరించాడు.రాఘవరావు భార్య జబ్బుచేసి చనిపోయింది. శవవాహకులు దొరక్కపోతే ధర్మరావే ఆమెను బండిమీద ఎక్కించి, బండితోలి, శవదహనం చేయించాడు. రాఘవరావు సత్యాగ్రహోద్యమంలో మళ్ళీ అరెస్టయి జైలు పాలయ్యాడు.గార్డినర్ అనే విదేశీయుడు పసిరిక రూపాన్ని చేష్టల్ని చూచి అతన్ని బంధించి అమ్ముకొని డబ్బు సంపాదించ వచ్చునని తలచాడు. పసిరికను బంధించ జూచాడు. ధర్మారావు, పసిరికను గార్డినర్ బారినుండి రక్షించాడు.

అరుంధతి జబ్బు చేసి బాధపడుతున్నది. హరప్ప తన తల్లికి, నాయనమ్మకు కర్మలు జరిపించి ధర్మమాచరించి నందుకు సంతృప్తి చెందాడు.హరప్ప వేణుగోపాల స్వామికి కల్యాణోత్సవాలు జరిపించాడు. కూచిపూడి నాట్యాలు, తోలుబొమ్మలాటలు, పగటి వేషాలు, గారడీలు, పొట్టేలు పందేలుతో సుబ్బన్నపేట ఉత్సాహాన్ని పుంజుకున్నది.

నానాటికి అరుంధతి ఆరోగ్య పరిస్థితి దిగజారి పోతున్నది. చిన్న అరుంధతి ధర్మారావుకు సన్నిహితమౌతున్నది.గిరిక పారవశ్యంతో స్వామిలో ఐక్యమైంది. చేసిన పాపాలకు ఫలితంగా మంగమ్మ హత్యకు గురి అయింది. అరుంధతి వ్యాధి తీవ్రమై చనిపోయింది. రంగారావు తిరిగి ఆరోగ్యవంతుడయ్యాడు. హరప్ప తన కర్తవ్యం ముగిసినట్లు భావించుకొని ప్రాణాయామం చేసి యోగ మరణం చెందాడు. గణాచారికి కల వచ్చింది. పసిరిక తనకున్న పాము గుణాలను కోల్పోయాడు. గణాచారి నిద్రలోనే మరణించింది. చిన్న అరుంధతి ధర్మారావునే పెండ్లి చేసుకుంటానని పట్టుబట్టింది. పశుపతికి బాల్యవివాహాలు ఇష్టంలేదు. కాని అరుంధతి పట్టుదల

వల్ల సరేనన్నాడు. ధర్మారావుకు అరుంధతే చిన్న అరుంధతి రూపంలో తనను చేరవచ్చినట్లు అనిపించింది. ధర్మారావు చిన్న అరుంధతిని పెళ్ళి చేసుకున్నాడు.

''ఇంకనేమి మిగిలినది?'' అని ధర్మారావు అన్నాడు.''నేను మిగిలితిని'' అన్నది అరుంధతి. ''అవును నీవు మిగిలితివి. ఇది నా జాతి శక్తి. నాయదృష్టము. నీవు మిగిలితివి'' అన్నాడు ధర్మారావు.సంప్రదాయం ఎప్పటికీ నిలిచివుంటుందనే విశ్వాసం కల్పిస్తూ విశ్వనాథ వేయిపడగలు సమాప్తం చేశారు.

### 3.2.2 వేయిపడగలు నవలలో మానవసంబంధాల విశ్లేషణ:

భారతదేశంలో గ్రామం ఒక స్వయం సంపూర్ణమైన యూనిట్ గా విలసిల్లింది. గ్రామ జీవనంలో అన్ని తరగతులవారు సుఖంగా జీవించేందుకు అవసరమైన ఏర్పాట్లు ఆయా గ్రామాల్లో అనేక సంవత్సరాల నుండి జరుగుతున్నాయి. బ్రిటీష్ వారికి వలసరాజ్యంగా మారిన తర్వాత మనదేశంలో గ్రామవ్యవస్థ నిర్వీర్యం చేయబడింది. అనేకవ్యవస్థలు దెబ్బతిన్నాయి. నూతన వ్యవస్థా నిర్మాణం నిర్మాణాత్మకంగా జరుపబడలేదు. గ్రామ స్వరాజ్యం పరాధీనమైంది. వ్యవస్థలో అరాచకం బయలుదేరింది. ఈ నేపథ్యంలో విశ్వనాథ వేయిపడగల్లో గ్రామంలో జరుగుతున్న అనేక మార్పుల్ని చర్చించాడు. ఈ మార్పులు మానవ సంబంధాల్లో ఎలా ప్రభావితం చేసాయో చూపించాడు.

#### 3.2.2.1 వేయిపడగలు నవలలో పరిపాలన వ్యవస్థ:

భారతీయ గ్రామీణ వ్యవస్థ స్వయం సంపన్నంగా ఉండేది. స్వీయ నిర్ణయాధికారం గ్రామ పెద్దలకే ఉండేది. గ్రామంలో జరిగే తప్పొప్పులకు గ్రామ పెద్దలే తీర్పులు చెప్పేవారు. ఏనాడు ఊరి విషయాల్లో పాలకులు తలదూర్చేవారు కారు. తరతరాల నుండి గ్రామీణ న్యాయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థ పటిష్టమైన నిర్మీతిలో ఉండేవి. ఏ పాలకులు దీన్ని కూలదోసే ప్రయత్నం చేయలేదు. అందరూ ఆ వ్యవస్థల్లో ఇమిడిపోయారు. ''*దేశములో నొక పురాతనమైన సంఘవ్యవస్థ, ఏర్పడియుండెను. ప్రతి గ్రామమునందు పంచాయితీలు కలవు. గ్రామములోని వృద్ధులు ధర్మమెరిగినవారు, న్యాయమాచరించిన వారు న్యాయము చేయుదురని ప్రజలచేత విశ్వసింపబడినవారు, పంచాయితీ దారులుగా నుందురు. వారిని రాజు నియమించలేదు. ప్రజలే నియమించుకొనిరి. ఆ నియమము కూడ నొకనాడు జరిగినది కాదు. ఏండ్ల మీద వారు న్యాయము చెప్పుదురన్న అలవాటు మీద పంచాయితీ దారులైరి. ఊరిలోన జరిగిన యన్యాయము ఊరిలోని వారికంటె నెవరికెక్కువ తెలియదు. అట్లు అన్యాయము లెచ్చటి వచ్చటనే నిర్మూలింపబడుచుండెను. రాజు పన్నులు వసూలు చేయుటకు తప్ప సైన్యము గ్రామమున*

*ప్రవేశింపదు....''* [43] నవలలో 'సుబ్బన్నపేట' భారతీయ గ్రామవ్యవస్థకి ప్రతీక. 'రాజు' పాలనలోని కీలకవ్యక్తి. ''*ఇందులో ఉన్న సుబ్బన్నపేట ఒక ఊరు కాదు. దేశానికంతటికీ అది చిహ్నం. జమీందారు జమీందారు కాదు.... ఇక్కడి జమీందారు రాజస్థానీయుడు. రాజనగా ఒకే వ్యక్తి రాజు కాదు. దేశాన్ని పరిపాలించే వారందరూ కలిసి ఒక రాజు....''*[44]

వేయిపడగలు నవలలో భారతదేశమే సుబ్బన్నపేట గా రచయిత భావించారు. ధర్మమనేది వేయి విధాలుగా ప్రవర్థిల్లుతుంది. అంటే అనంతమైనదని అర్థం. ఈ ప్రపంచం ధర్మం చేతనే నడుస్తుంది.''*ధర్మార్థ, కామ, మోక్ష రూపమైన పురుషార్థ నిర్దేశము జీవనానికి లక్ష్య నిర్దేశం చేసింది. ఈ ధర్మము వ్యక్తికీ, కుటుంబానికి, గ్రామానికి, దేశానికి, విశ్వానికి ఉండవలసిన అనుబంధాన్ని నిర్దేశించింది. వ్యక్తి సుఖాన్ని ధర్మం ఎప్పుడూ వ్యతిరేకించదు. అయినా సుఖాన్ని మాత్రమే లక్ష్యంగా నిర్దేశించలేదు. వ్యక్తి క్రమంగా మమకారాన్ని విస్తరిస్తూ సర్వ జగత్తునూ తనదిగా తానుగా భావించే స్థితిని వసుధైక కుటుంబ భావనకి ఎదగటం''*[45] సమాజం క్రమ నిర్వహణకు 'ధర్మం' ప్రాణభూతం. ఈ ధర్మాన్ని ఆచరించి, తన రాజ్యాన్ని సుసంపన్నం చేసేందుకు రాజు, ధర్మ ప్రభువు కావాల్సి ఉంది. ప్రజల్ని కన్నబిడ్డల్లా పాలించాల్సిన ఔన్నత్యం రాజుకు ఉండాలి. రాజు శాసనాలు చేసే పాలకుడుగా కాక, ప్రజాధనానికి ధర్మకర్తగా వ్యవహరించటం భారతీయ ధార్మికత. ధర్మాన్ని ఆధారంగా చేసుకొని భారతీయ వ్యవస్థలు నిర్మితమైనాయి. ఇవన్నీ భారతీయ మతధర్మంపై ఆధారపడి ఉన్నాయి. ఇక్కడ మతం అంటే మానవుని జీవన విధానమే, అనాదిగా వస్తున్న భారతీయ ధర్మం – మతం రూపంలో వ్యక్తికీ, సమాజానికి, భగవంతునికీ మధ్య సమన్వయాన్ని కుదుర్చుతుంది. ఇది భారతీయ సనాతన సంస్కారం. ''*భారతదేశంలో మత స్వరూపం లేదు. పాశ్చాత్య దేశాలలో మత స్వరూపం వేరు. ఇక్కడి మతం మానవుడు బ్రతికే బ్రతుకులోని జీవన విధానము అదే ధర్మము. అదే మతము. ఇక్కడి మతమే ధర్మము. ధర్మమే మతము. ఇది మానవుని సమగ్ర చైతన్య వికాస హేతువైన జీవన విధానము. భారతదేశములో మతం ఏకకాలంలో, ఏకదేశంలో ఎవరో ఒకరి చేత కనిపెట్టబడింది కాదు. మానవుని నాగరికత చరిత్రకందని కాలం నుంచి ఈ దేశంలో మతం వ్యాప్తిలో ఉంది.... అందుకే ఆ మతం లేక ధర్మం, సనాతనము, సార్వకాలికము, విశ్వజనీనముగా దర్శింపబడింది.... సనాతన మతం వ్యక్తికి, వ్యక్తికి మధ్య వ్యక్తికి, సమాజానికి మధ్య, వ్యక్తికి,*

---

[43] సముద్రపు దిబ్బ, పు: 30

[44] వేయిపడగలోని అంతరార్థము (వేయిపడగలు నవల అనుబంధం)పుట, iii

[45] భావుకసీమ: సాహిత్యవ్యాస సంపుటి, పు: 6

*భగవంతునికి మధ్య మానవునిలోని విభిన్న భావముల మధ్య సమన్వయాన్ని సాధించడానికి ఆధారమైంది. అందుకే భారతదేశంలో మతాన్ని వదిలి మానవుడు లేడు, వ్యవస్థలు లేవు.''*[46] *''వీరన్న నాయని వంశము వారు స్వామికి ప్రతినిధులు, బ్రాహ్మణవంశము వారు ప్రచారకులు. కాపు వంశపుటాడపడుచులు. స్వామికి వ్యాఖ్యాతలు. ఈ రీతిగా భూమ్యాకాశముల మధ్య, స్వర్గ మర్త్య లోకముల మధ్య ప్రత్యక్షా, ప్రత్యక్షముల మధ్య నింక స్థిరమైన సంబంధమేర్పడెను''*[47] *''పైన భగవంతుడు క్రింద రాజును, బ్రాహ్మణుడును, ఈ రెండు సంస్థలకు మధ్య గణాచారి తెంచరాని లంకె'' ''ఇది నాల్గు స్తంభముల ధర్మమంటపము స్వామి, జమీందారు, బ్రాహ్మణుడు. గణాచారి. వీరు నల్గురు స్తంభములు.''*[48]

*''వేయిపడగలు నవలలో సమకాలీన, సామాజిక చరిత్ర, మానవుల మానసిక ప్రపంచము, ఆధ్యాత్మిక తాత్త్విక భూమిక, నిత్య – వ్యవహారిక కాలాల పరస్పర సంబంధము నాలుగు స్తంభాలై నిలుస్తాయి.''*[49] పరిపాలనా వ్యవస్థలోని కీలక వ్యక్తులను పరిచయం చేసాడు విశ్వనాథ. రాజు, మంత్రి, గణాచారి వీరు ముగ్గురు పరిపాలలను ఎలా సాగించారో ఈ నవలలో చూపించాడు. కృష్ణమనాయుడు జమీందారు. అంతకు ముందు నుండి పరంపరగా వస్తున్న పరిపాలనా విధులను తన పూర్వులు చూపిన మార్గంలోనే నడిపించాడీ రాజు. దక్షత గల రాజు. లోకజ్ఞానం, వివేచనాశీలం గలవాడు. పాలనా వ్యవహారాల్లో 'దివాను' రామేశ్వరశాస్త్రి, ప్రజా సంక్షేమానికి, రాజ్య సుస్థిరతకు వారధిగా నిలబడిన వ్యక్తి.

ప్రజాపాలన విషయంలో దివాను సూచనలను రాజు సవరించే నేర్పు గలవాడు. ఒకసారి రాజ్యంలో కరువు సంభవిస్తే ప్రజలు శిస్తుకట్టలేని పరిస్థితిలో ఉంటారు. అయితే అధికారులు శిస్తు కట్టమని ఒత్తిడి తీసుకురావడంతో రాజు ప్రజాపాలకుడిగా శిస్తు రద్దుకు ఆదేశాలిస్తాడు. *''వారును పేదవారు వారి మీద పడి పీకుకొని తినినచో మనకేమి శుభము? పదిమంది తిననిదే మంచిది. నాలుగు లక్షలలో రెండులక్షలు వసూలు మనకు చాలదా''*[50] అని రాజు సర్ది చెప్పడం నాయుడులోని ఔదార్యంగా గమనించవచ్చు.

---

[46] వేయిపడగలు – సమకాలీనత – సార్వకాలీనత, పు: 38

[47] వేయిపడగలు, పు: 9

[48] వేయిపడగలు, పు: 11

[49] నవలా విమర్శ, పు: 45

[50] వేయిపడగలు, పు: 52

కేవలం ధనాగారాన్ని నింపుకోవడమే పాలన కాదు. ప్రజలను సుఖసంతోషాలతో ఉంచడమే ప్రభువు బాధ్యతగా గుర్తించాడు రాజు. శాస్త్రి దివానుగా ఉన్నంతకాలం నాయుడు అతని నిర్ణయాన్ని కాదనలేకపోతాడు. శాస్త్రి నిర్ణయాలు ధర్మబద్ధంగా ఉండేవి. ప్రజా సంక్షేమం దృష్టిలో రాజుకన్న దివాను ఉన్నతంగా ఆలోచించబట్టే ''*రాజు కీర్తికన్న దివాను కీర్తియే ఎక్కువ*''[51] అనిపించుకున్నాడు శాస్త్రి.

రాజు, దివాను సమన్వయంతో రాజ్యపాలన ప్రజారంజకంగా సాగుతుంది. రాజ్యంలో రకరకాల వృత్తుల వారికి ఉపాధి చూపించాల్సిన బాధ్యత కూడ రాజుపైనే ఉంది. రైతులకు భూమిని సాగుచేసుకునేందుకు, నీటివసతి కల్పించడం, పంటలకు రక్షణ నివ్వడం, రైతుల భూములు అన్యాక్రాంతం కాకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదే. ప్రజల మధ్య అవాంఛిత పోటీ రాకుండా రాజ్యంలోని ప్రతి ఒక్కరికీ వారి స్థాయికి, శక్తికి సరిపోయే ఉపాధి చూపించి రాజ్యంలో పాలన సంతులనం చేయాల్సిన బాధ్యత రాజుదే. నాయని కాలంలో రాజ్యంలో బీడు భూములు అందరికీ ఉపయోగపడేలా చర్యలు తీసుకోబడినది. అడవి నుండి కలప, ఫలాలు, ఔషదులు ప్రజల ఉమ్మడి ఆస్తిగా భావించారు. వాటిపై ఎలాంటి సుంకం వసూలు చేసేవారు కాదు. పశువులకు యధేచ్ఛగా దాణా దొరికేది. ప్రకృతి ఇచ్చిన సంపదను ప్రజలందరూ సమిష్టిగా అనుభవించేవారు.

ఏ వృత్తిని కేటాయించిన పనులు ఆ వృత్తి వారే చేయాలనేది కృష్ణమనాయని ఆలోచన. ''*అందరూ కులాంతర వివాహాలను గర్హించారు. దీని మూలంగా కులవ్యవస్థకు స్థిరత్వం లభించింది. ప్రతి కులం దాని వ్యక్తిత్వాన్ని రక్షించుకొనగలిగింది. దీనితోపాటు ప్రతికులానికి ఏదో ఒక వృత్తి ఉండేది. వంశపారంపర్యంగా దానినే ఆకులానికి చెందినవారు అనుసరిస్తూ వచ్చారు.... దాని మూలంగా దేశంలో ఏ వృత్తీ నశించకుండా స్థిరంగా నిలబడిపోయింది*''[52] ఒకసారి గుంటూరు నుండి నాటక సమాజం వారు వచ్చి ప్రదర్శన కోసమని అభ్యర్థిస్తారు. వారు బ్రాహ్మణులు, పౌరోహిత్యం, వేదాధ్యయనం వదిలి భాగవత వృత్తిని స్వీకరించడం నాయుడికి నచ్చదు. ఇలా వేరే వృత్తి వారి కడుపుకొట్టడం, నాయుడి దృష్టిలో అనైతికమైనది. నైపుణ్యంలేని విద్య దీనికి కారణంగా కనబడుతుంది. ''*సమాజంలోని ప్రతివ్యక్తీ సంపూర్ణంగా వికాసం చెందినపుడు సమసమాజపు నిర్మాణం జరుగుతుంది.... సవ్యమయిన విద్యావిధానం వున్నప్పుడు సాంఘిక సంస్కరణల ద్వారా కాని లేదా యితర సంస్కరణలద్వారా కాని సమానత్వం కొరకు*

[51] వేయిపడగలు, పు: 11

[52] మారుతున్న సమాజం – నా జ్ఞాపకాలు, పు: 13

*ఆరాటపడవలసిన అవసరం వుండదు. ఎందుకంటే – అప్పుడు అసూయ, దానితోపాటుగా, ఒకరి శక్తి సామర్థ్యాలను మరొకరి శక్తి సామర్థ్యాలతో పోల్చి చూడటం అనేవి అంతరించిపోతాయి.''* [53] ఈ ధనాశ మనిషిలోని రాక్షసున్ని చూపెడుతుందని వచ్చిన బ్రాహ్మణులని కసురుకుంటాడు నాయుడు. ''*నాటకములు వేయుదుమని బయలుదేరి పాపము భాగవతుల వృత్తి చెడగొట్టు చున్నారటయ్యా! మీరందరు బ్రాహ్మణులవలె కన్పించెదరు. చాలా బాగున్నది. ఆ బీదముండా కొడుకుల నాటి దగ్గర కూడా చెడగొట్టెదరా? మీకేమైన ఆ విద్య వచ్చునా?*'' [54] అంటూ వ్యవస్థీకృత రాజధర్మాన్ని, ప్రజారక్షక ధర్మాలను కాపాడే విజ్ఞతతో ప్రయత్నం చేస్తాడు. రాజే కాకుండా ప్రజలు కూడ ఆయా వృత్తులను కాపాడడంలో సామాజిక బాధ్యతను వహించేవారు.

రాజ్యంలో 'కోట' ప్రజలందరికి ఆశ్రయమిచ్చేదిగా చెప్పబడింది. ఏ ఉద్యోగికైనా, వ్యాపారికైనా, రైతుకైనా ఏ వృత్తి పని వారికైనా కోట ఆధారం. పరస్పరం ఆధార ఆధేయాలతో అటుకోట, ఇటు ప్రజలు తమ అవసరాలు తీర్చుకునేవారు. నాగయ్యసెట్టి తన కుమారుని వివాహానికై నాయన్ని ఆశ్రయించగా నాయుడు సెట్టిని సామోపాయంతో లొంగదీసి శాస్త్రిపై సెట్టి పెట్టిన అక్రమవడ్డీ ఋణభారాన్ని' తగ్గిస్తాడు. శాస్త్రి కుటుంబానికి న్యాయం కల్పిస్తాడు. దూరప్రాంతాల నుండి వివిధ రకాలైన పనులపై అధికారులను, రాజును కలుసుకునేందుకు వచ్చిన ప్రజలకు కోట చక్కని విడిదిని ఏర్పాటుచేసేది. నెలల తరబడి, తమ పనులు పూర్తయ్యే వరకు కోటనే అందరికీ సదుపాయం చేసేది. ఉద్యోగార్థులు, ఆరోగ్య నిమిత్వం, ఇతరత్రా పనులపై వచ్చే సామాన్యజనం ఇబ్బంది పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత రాజుదని నాయుని నమ్మకం. ''*కోటయే వస్తు ప్రదర్శనాల కోటయే పుస్తక భాండాగారము. కోటయే విద్యాపోషణా సంస్థ కోటయే తల్లి – తండ్రి – సర్వము –* '' [55] కోట కేవలం రాజుగారి వినోదాలకు, శాసనాలనకు, ప్రజానియంత్రణకు ఏర్పాటు చేయబడింది కాదని అది ప్రజల సొత్తు. రాజు కేవలం ధర్మకర్తలేనని ఇక్కడ తెలుస్తుంది. అయితే రాజులు ఎళ్ళవేళలా అన్నిచోట్లా ఒకే విధంగా ఉండరని కూడ విశ్వనాథ 'రంగారావు' పాత్ర ద్వారా చూపెట్టారు. కేవలం రాజ్యానికి ధర్మకర్తగా ఉండే రాజే ప్రభువుస్థానంలో, తండ్రిస్థానంలో ఉంటారని తద్భిన్నంగా ప్రజలను, రాజ్యాన్ని తన సుఖాలకోసం, భోగాలకోసం అక్రమపద్ధతిలో ప్రవర్తిస్తే సంక్షోభం తాండవిస్తుందని

---

[53] ముందున్న జీవితం, పు: 4

[54] వేయిపడగలు, పు: 55

[55] వేయిపడగలు, పు: 59

నిరూపించారు. హరప్పా మాటల్లో ''*ప్రభువన్నట్లే (కృష్ణమనాయుడు) యుండవలయును. వారు నిగ్రహానుగ్రహ సమర్థులు. వారి నిగ్రహము కూడ ననుగ్రహము వలెనె యుండెడిది. నిర్దయుడైన రాజు బ్రతికియుండుటకన్న చచ్చుటయే మంచిది. కృత్రిమమైన రాజుకన్న సర్పదంష్ట్రా విషము మంచిది. అది నెత్తురులో చేరిన వెంటనే చంపును. త్రాగినచో చంపదు. చచ్చిపోవుచున్న వానిని సముద్ధరించును. క్రూరుడైన రాజు సేవించినను చంపును*''[56] అనడం శిథిలమౌతున్న రాజరికానికి, రాజాస్థానానికి చక్కని నిదర్శనం.

సామాజిక సంబంధాలు దృఢంగా ఉండాలంటే, రాజనీతి సక్రమంగా తన విధిని నిర్వహించాలంటే 'కారుణ్యం' ఎంతో అవసరం. ఆ కారుణ్యాన్ని ధర్మానికి అనుసంధానిస్తూ శ్రేయోరాజ్య నిర్వహణ చేస్తాడు రాజు రామేశ్వరశాస్త్రి. మరణం తర్వాత ధర్మారావుపై ఋణభారం పడుతుంది. అంతవరకు శాస్త్రి గారి మెప్పుకోసం ప్రయత్నించి, ఆయన దాతృత్వం వల్ల లబ్ధిపొంది శ్రీమంతులైన వారందరికి ఇప్పుడు ధర్మారావు పురుగులా కనబడసాగాడు. శాస్త్రిగారు చివరిదశలో, ఆర్థికంగా, చితికిపోగా, మరణానంతరం అప్పుల వాళ్ళు ధర్మరావుపై పడతారు. నిజానికి శాస్త్రిగారు చేసిన సాయానికి అప్పులవారు ఇచ్చిన అప్పులు పెద్దగా గణనలోనికి రానివే. అయినప్పటికి వ్యక్తిలోని 'స్వార్థపరుడు' అదును చూసి బయటపడే సందర్భమిది. అయితే ధర్మప్రభువైన రాజు ఆ అప్పుల వాళ్ళందరినీ పిలిపంచి, వారిని నచ్చజెప్పి, ధనమిచ్చి, ధర్మారావుని ఋణవిముక్తున్ని చేసి శాస్త్రితో తనకున్న మిత్రుత్వాన్ని, రాజుగా రాజధర్మాన్ని, వ్యక్తిగా మానవతా దృష్టి చూపుతాడు. న్యాయం, చట్టం, దయ విఫలమైన చోట అధికారులు సామాజిక బాధ్యత వహించాల్సి వస్తుందని ఈ ఘటన తెలయజేస్తుంది.

శాస్త్రి మరణానంతరం ధర్మారావును నాయుడుగారు ఆర్థికంగా ఆదుకునే ప్రయత్నం చేస్తాడు. కానీ, నాయుడు మరణానంతరం దివాణం పరిస్థితి చేజారిపోతుంది. ''*రాజు చెడిపోయినాడు*''[57] సమాజం నిర్మాణం యొక్క మూలసూత్రాలను అర్థం చేసుకోలేని రంగారావు రాజ్యం పాలిట ప్రభువు కాలేకపోతాడు. బ్రిటీష్ నాగరికతను, పూర్తిగా ఒంటబట్టించుకున్న రంగారావు 'సుబ్బన్నపేట'ను 'ఇంగ్లాండు' ఆత్మతో పరిశీలిస్తాడు. జమీందారుగా ప్రజలకు జవాబుదారిగా ఉండాల్సిన 'రంగారావు' బ్రిటీష్ వారసత్వాన్ని అలవరచుకొని దివాణాన్ని స్వప్రయోజనాలకు వినియోగిస్తాడు. ''*అది ప్రాత దినములు పోవుచు క్రొత్త దినములు*

[56] వేయిపడగలు, పు: 830

[57] వేయిపడగలు, పు: 42

*వచ్చుచున్న సంధివేళ ప్రాత మర్యాదలు పోవుచుండును....''* [58] ధార్మిక వ్యవస్థ స్థానంలో భోగవ్యవస్థ చేరింది. ప్రజల్ని హింసించి శిస్తు వసూలు చేసి నగరాలలో విలాసాలకి అలవాటుపడతాడు రంగారావు.

దీనితో జీతభత్యాలు లేకుండా నిస్వార్థంగా దివాన్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న ధర్మారావు రంగారావు పోకడలను జీర్ణించుకోలేక పోతాడు. తత్ఫలితంగా నాగేశ్వరరావు దివానౌతాడు. ప్రజాహితాన్ని కాలరాచి, ధర్మవర్తనను ఎగతన్ని బ్రిటీష్ ప్రభువుల ప్రాపకం కోసం రంగారావు హీనంగా పాతాళానికి జారిపోతాడు. దుష్టమిత్రులు, హిందూమత వ్యతిరేకత, భోగజీవనం, ఆంగ్లప్రభువుల మెప్పు, పాశ్చాత్యనాగరికతమోజు, లాంటి అవలక్షణాలు రంగారావుకి రాజ్యంపై పట్టుకోల్పోయేలా చేసాయి.

రాజు–మంత్రులు రాజ్యానికి కావాల్సిన అనేక అభివృద్ధి పనులు ప్రజారంజక కార్యక్రమాలు నిర్వహించడం అంతకు ముందు జరిగేవి. రంగారావు హయాంలో పాలకులకు, పాలితులకు మధ్య ఎడం పెరిగింది. తద్వారా మానవీయ విలువలు, ఘోరంగా దెబ్బతిన్నాయి. అంతకు ముందు బీడు భూములు, కోట, అడవి లాంటివి ప్రజాబాహుళ్య సంక్షేమం కోసం వినియోగించబడినే ఇప్పుడు పన్ను మీద పన్నులతో సామాన్య ప్రజానీకం నడ్డి విరిగే పరిస్థితి దాపురించింది. నాగేశ్వరరావు సలహాతో రంగారావు పాలన సామాజిక జీవనాన్ని, సహజీవన సూత్రాన్ని దెబ్బతీసింది. ఎప్పటినుండో కోటను అంటి పెట్టుకున్న, కాసావాళ్ళు అరవైమంది ఉద్యోగుల్లో సగానికి సగం మంది తొలగించబడ్డారు.

'తల్లీ–తండ్రీ–సర్వముగా ఉండే చోట 'జమీందారు బంగాళా'గా రూపాంతరం చెందింది. సుబ్బన్నపేట నగరంగా మారే క్రమంలో అనేకమంది తమ తమ వృత్తుల్ని కోల్పోవడం జరుగుతుంది. వ్యవసాయరంగానికి వచ్చిన మార్పులు మెట్టపొలాలు క్షీణించి, వాణిజ్య పంటలు పండించడంలో రైతు ధనాశపరుడైనాడని వ్యవసాయ కూలీలకు సరియైన పని దొరక్క వారి జీవనాధారం కోల్పోవలసిన ఆగత్యం ఏర్పడిందన్నారు. బీడు పొలాల్లో పశువుల దాణా పుష్కలంగా దొరికేది. మడికట్టి అంగుళం అంగుళం వాణిజ్యం చేయడంలో పశువుల్ని 'గడ్డి'కి దూరం చేసారని విశ్వనాథ వాపోయాడు. బ్రిటీష్ వారి వాణిజ్యపంటల విధానాన్ని నిరసిస్తూ మీరూ మా దేశపుకాపులై ఇక్కడి పంట విధానాలును గౌరవించమని గార్దినర్ దొరతో ధర్మారావు ధర్మాగ్రహన్ని వెళ్ళగక్కుతాడు.

---

[58] వేయిపడగలు, పు: 51

పంటను 'మార్కెట్' చేసి రైతును వ్యాపారి చేసిన బ్రిటిష్ విధానాన్ని సుబ్బన్నపేటలో రైతుకు సామాన్య ప్రజానీకానికి మధ్య ఉన్న మానవ సంబంధాల్ని దెబ్బతీసింది. స్వార్థ ప్రవృత్తికి పెంచుకున్న ధనికరైతు త్యాగజీవనాన్ని సహజీవన సంస్కృతిని మరిచిపోయాడు. ధనాన్ని సంపాదించడానికి, కోర్కెలను తీర్చుకోవడానికి 'ధార్మిక ప్రవర్తన' చెల్లకుండా పోయింది. గ్రామంలో ఉత్పత్తులు గ్రామ ప్రజల అవసరాలకు కాకుండా 'నగర' ప్రయోజనానికి కేటాయించబడడం విషాదం. దీన్తో గ్రామజీవనం అస్తవ్యస్తమై ఉపాధి లేక బడుగుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. దిక్కులేని జనులు అసహనానికి గురై, అసాంఘిక వర్తనులుగా మారే ప్రమాదం ముందుకొచ్చి మానవసంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అభివృద్ధి మాత్రం మనిషికి–మనిషికి మధ్య మానవీయ సంబంధాలను పెంచకపోగా, దోచుకునే ప్రవృత్తిని పెంచి మనిషిని యంత్రంగా మార్చింది.

### 3.2.2.2 వేయిపడగలులో సామాజిక సంబంధాలు:

భారతీయ వ్యవస్థలన్నీ 'ధర్మము' పునాది మీద నిర్మించబడినవి. వ్యక్తికి, సమాజానికి మధ్య ఉన్న అనేక సామాజిక, రాజకీయ, మానవీయ విలువలన్నింటిని సమన్వయించేది ధర్మముగా చెప్పబడింది. ఈ ధర్మాన్ని కాపాడుతుంటూ, ఆచరిస్తూ రాజ్యాన్ని/దేశాన్ని రక్షించే వ్యవస్థ రాజ్యవ్యవస్థ. దేశంలో ఎవరి ధర్మాన్ని వారు సరిగ్గా నిర్వహించేలా చూడడం ప్రభుధర్మం. ధర్మాన్ని అతిక్రమించే అధికారం రాజుకు సైతం లేదు. అలా తరతరాల నుండి వ్యక్తుల, సామాజిక సంస్థల మధ్య ఉన్నత మానవతా విలువలను స్థాపించేందుకే రాజ్యవ్యవస్థ నిర్ణయింపబడింది. కాలానుగుణంగా సమాజంలో వస్తున్న మార్పుల గుణాత్మక రీతులను అధ్యయనం చేసి, పాలన సాగించడం రాజు ధర్మం. దానికి వ్యతిరేకంగా రకరకాల వ్యామోహాలకు, చాపల్యాలకు లోనై ధర్మోల్లంఘన చేసిన తన పతనానికి, రాజ్య పతనానికి కారణమౌతాడు.

కృష్ణమనాయుడు తన కాలంలో ప్రజా సుఖాన్నే కోరినాడు. తన పూర్వీకులు అనుసరించిన మార్గాన్నే అనుసరించినాడు. సమాజంలో అన్ని వర్గాల మధ్య చక్కని సమన్వయాన్ని కుదిర్చినాడు. ప్రేమ, దయ, వాత్సల్యము రూపుకట్టిన వ్యక్తి నాయుడు. జీవించడంలోని ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని తెలిసిన వ్యక్తి కావడం చేత పరిపాలనలో మానవీయ విలువలకి ప్రాధాన్యం ఇచ్చాడు. ధర్మారావును పట్టాభిషేకానికి ఆహ్వానించకపోవడం కూడ దీనిలో భాగంగానే చూడాలి. ధర్మప్రచార సంస్థలైన దేవాలయాలను ఆదరించి పోషిస్తున్న శాస్త్రి కుటుంబాన్ని పక్కన పెట్టడంతో పాటుగా, ధర్మారావుపై రంగారావు అకారణ ద్వేషాన్ని

పెంచుకుంటాడు. ధర్మారావు సాంప్రదాయభావాలు రంగారావుకు రుచించవు. నాగేశ్వరరావును 'దివానుగా పెట్టుకున్న తర్వాత ప్రజాదోపిడి కార్యక్రమాలు ఎక్కువైనాయి. రంగారావు రాజ్యాన్ని, భూములను, అడవులను ప్రజాధనంగా భావింపక స్వంత ఆస్తిగా భావించాడు. బ్రిటీష్ రాచరికపు ఆలోచనల పోకడలతో దేశ ప్రజలను చిన్న చూపు చూస్తూ పన్నుల వసూలు కార్యక్రమంలో హింసామార్గాన్ని అవలంభించాడు. రాజధర్మం స్థానంలో 'నిరంకుశత్వం వచ్చింది. ప్రజల దగ్గర్నించి పన్నుల రూపంలో వసూలు చేసిన ధనాన్ని ప్రజాక్షేమానికి ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగించక 'జల్సా'లకు విచ్చలవిడిగా ఖర్చు చేసాడు.

రంగారావు *''న్యాయ, కార్యనిర్వహణ శాఖలు రెండింటినీ తన ఆధీనంలో వుంచుకున్న ఈ సర్వాధికార జాగీర్దార్లు ఎప్పుడూ స్వస్థానంలో వుండేవారు కాదు. ఈ పరాన్న భుక్కులు హైదరాబాదు, బొంబాయిలాంటి నగరాల్లో జీవితం గడిపేవారు. వీరి విలాసాలకోసం జాగీరు గ్రామాలను నిలువుదోపిడీ చేసేవారు. ఖాల్సా గ్రామాలకంటే 25 నుంచి 300 శాతం వరకు ఎక్కువ పన్నులను వసూలు చేసేవారు.''*[59] వలసపాలనలో ఇక్కడి జమీందారులు ఆంగ్లేయుల ప్రాపకం కోసం అనేక రకాల ప్రయత్నాలు చేసారు. విదేశీ వ్యామోహాన్ని అణువణువునా పులుముకొని జాతీయ మౌలిక విలువలను విస్మరించారు. ప్రజల నుండి వసూలు చేసిన పన్ను తిరిగి ప్రజాక్షేమానికి వినియోగింపక *'' 'గుర్రప్పందే'లకు ఖర్చు చేసిన జమీందారులు కనిపిస్తారు. రంగారావు ఇంగ్లీషు చదువు నేర్చుకొని ఇంగ్లండు, ఫ్రెంచి, డచ్ వనితలను వివాహం చేసుకుంటాడు. అంతకు మునుపూ సాంప్రదాయ వివాహం ద్వారా భార్యగా వచ్చిన 'సరోజినీదేవి' తో యాంత్రిక జీవనం మాత్రమే గడుపుతాడు. పట్టాభిషేకం అయిన తర్వాత కోటనున్న పాత తలపులు తీయించి ''తాతా అయిరన్ వర్క్స్ లో నుండి వేయి రూపాయలకొక యినుపతలుపు తెప్పించి అమర్పించిరి.... దానితోఁ గోటకుఁ గోట యాకృతి పోయి యొక్క పెద్ద ధనవంతుని యింటి యాకారము పడింది''*[60] రాజు దోపిడి వర్గ ప్రతినిధి అయ్యాడు.

### 3.2.2.3. వేయిపడగలులో వ్యవసాయక వ్యవస్థ:

భారతదేశం ప్రధానంగా వ్యవసాయక దేశం. గ్రామ ఆర్థిక వ్యవస్థ వ్యవసాయం పైనే ఆధారపడింది. రైతు దేశానికి వెన్నెముకలా గౌరవించబడ్డాడు. గ్రామంలో అనేక రకాల వృత్తులున్నప్పటికీ అందరూ రైతును ఆశ్రయించి జీవనం గడిపేవారు. *''మొదటినుండి గ్రామస్థులకు వ్యవసాయం ప్రధానవృత్తి. అధిక సంఖ్యాకులకు దీని మూలంగానే జీవనం*

[59] వీర తెలంగాణ – నా అనుభవాలు – జ్ఞాపకాలు, పు: 14

[60] వేయిపడగలు, పు: 217

*గడుస్తున్నది. తక్కిన వృత్తులను అనుసరించేవారు కూడా..... పంటలు బాగా పండినప్పుడు వ్యవసాయదార్లేగాక తక్కిన వృత్తులలోని వారు సుఖపడడం, క్షామం సంభవించి పంటలకు నష్టం కల్గినప్పుడు రైతులతో పాటు వీరు కూడ కష్టాలపాలు కావడం తప్పేది కాదు. గ్రామస్థుల జీవితమంతా పరస్పరాశ్రయం గాను, స్వయం పోషకంగాను ఉండేది. ఇతర గ్రామాలతో గాని, పట్టణాలతో గాని గ్రామస్థులకు ఎక్కువ సంబంధం ఉండేది కాదు. గ్రామస్థులు ఒక కుటుంబంలోని వారుగా జీవించేవారు.''*[61] స్వయం సంపూర్ణమైన గ్రామీణవ్యవస్థ ఆంగ్లేయుల పాలనలో నాశనం చేయబడింది. వేయిపడగలు నవలలో రైతుకూ భూమికి ఉన్న సంబంధం యిలా చెప్పబడింది. ''*రాజు పొలమునకధికారియూ రైతువద్ద నుండి శిస్తు తప్ప వేఱే చిల్లిగవ్వ ప్రజల నుండి హరించడు.*'' అనడం ఇక్కడ భూమి అంతా ప్రజలదని, బంజరులను సాగుచేసుకునే అధికారం కూడ ప్రజలకు ఉందని తెలుస్తుంది. శిస్తు రూపంగా ఆరవభాగం రాజుకు చెల్లించాల్సి ఉంటుంది. కృష్ణమనాయుని కాలంలో ఈ సంబంధం గూర్చి చెపుతూ రచయిత ''*ఈ ప్రభువుల యడవుల మీద నా ప్రాంతమందలి జనులందఱు బ్రతుకుదురు. నానా ఫలములు కోసికొని పోదురు. ఎండిన మ్రోడులన్నియు నఱుకుకొని పోదురు. కుందేళ్ళు మొదలయిన చిన్న జంతువులను జంపి యాహారమునకు దెచ్చుకొందురు. పశువుల నడవిలో మేపుకొందురు. పిల్లయు మేకయు బ్రొద్దున లేచినది మొదలు సాయంత్రమగు వఱకు, నచటనే యుండును. చెట్ల గింజలు, నాకులు, పుల్లలు వీనితో బ్రతుకుదురు. జమీందారునకీ వలసిన సుంకము పైసాలేదు*''[62] అనడం ప్రజల స్వేచ్ఛా జీవితాన్ని తెలుపుతుంది.

రంగారావు కాలానికి వచ్చేసరికి రైతులు విపరీతమైన శిస్తులు కట్టలేక రైతులు భూములు అమ్ముకొని కూలీలు అయ్యారు. జీవనోపాధి వెతుక్కుంటూ పట్టణాలకు వెళ్ళిపోయారు. గ్రామవ్యవస్థ విచ్ఛిన్నమైనది. సమిష్టి జీవనానికి ఆటంకం ఏర్పడింది. వ్యక్తి వ్యక్తిగత అభివృద్ధి ధ్యాసలో సాంఘిక మర్యాదల్ని, విలువలను వదిలిపెట్టడం, స్వార్థపరుడుయ్యాడు. గ్రామంలో అన్నికులాల వారు కలిసికట్టుగా జీవనము చేసేవారు. ''*ఒక గ్రామమునకు మరియొక గ్రామము నుండి పిల్లనిచ్చినచో పిల్లనిచ్చినచో పిల్లను ఆ ఊరికిచ్చితిమి*'' అనేవారు. అంటే ఊరు ఇక్కడ సమిష్టి కుటుంబమని అర్థం. అన్ని కులాల వారిని చుట్టరికపు మాటలతో పలకరించేవారు.

''*కులాల మధ్య హెచ్చు తగ్గులు గుర్తింపబడినా అన్ని కులాల వారు గ్రామ శ్రేయస్సుకై ప్రవర్తించేవారు.... అన్ని కులాలవారు అనాదిగా వారికి లభించిన స్థానంలో తృప్తిపడి ఒక*

---

[61] మారుతున్న సమాజం - నా జ్ఞాపకాలు, పు: 7

[62] వేయిపడగలు, పు: 58

*కుటుంబంలోని వారి వలె కలిసికట్టుగా గ్రామ శ్రేయస్సుకు కృషి చేస్తూ ఉండేవారు. కులాల మధ్య ఏర్పడిన తర తమ బేధాలు ఈ కృషికి ఆటంకం కలిగించలేదు.''*[63] అన్ని కులాల్లో పెద్దవారిని గౌరవించేవారు. వేయి పడగల్లో మనుషుల మధ్య ఉండే ప్రేమాభిమానాలు బహు విధాలుగా నిరూపించబడినాయి.

### 3.2.2.4. వేయిపడగలులో *పసరిక* – ప్రతీకాత్మకత:

రామేశ్వరశాస్త్రికి మంగమ్మ ద్వారా కలిగిన సంతానము. పసరిక, ఇతని రూపం ''*ఈన కణ్ణుపుల్ల కన్న సన్నము. ఆకుపచ్చని రంగు జుత్తు బూడిదరంగు*''[64] అతని ఏడుపు పాము కూసినట్లుండేది. పదేండ్ల పసరిక 'పచ్చని పాముతోఁక మీద నిలచున్నట్లుండేవాడు. పసరికకు పిట్టలతో, పాములతో మైత్రి. వాటితో ఆడుకుంటాడు. అవి అతన్ని పెనవేసుకుంటాయి. ఎప్పుడూ తోటవెంట, పొలాల వెంట తిరుగుతుంటాడు. పొట్లపాదులు, బీరపాదులలో కూర్చుంటాడు. జొన్నచేలు, పెసరకాడలు, వంగతోటలు, ఆకుమడులలో ఎక్కడో పడుకుంటాడు. పాములాగా ఉంటాడు. పాము కాదు. మనిషిలాగ ఉంటాడు మనిషికాదు. ''*వాడంతే పైరు పచ్చవాడుగాఁ బుట్టెను. వానికిఁ బైరునకు సంబంధము వాఁడే పైరు. పైరే వాడు. వాఁడింటి వద్ద నేట యుండును*''[65] అని మంగమ్మ అనుకుంటుంది. ''*పైరు పచ్చ పురుగు, జంతువు, పాము, ముంగీసు వీరంతా ప్రకృతి సంతానము. సంతానం అంతా పరస్పర సహజీవన సూత్రంతో అనురాగబంధంతో కొనసాగితేనే పురోభివృద్ధి. ధర్మారావు ఒకసారి పసరికను కావలించుకుంటాడు. వారి తండ్రిని కౌగిలించుకున్నట్లనిపిస్తుంది. 'నాయనా! నీకు వేయేండ్లు ఆయుర్దాయము' అంటాడు. పై నుండి తీతువు పిట్ట కూసింది. అపశకునముగా భావించిన ధర్మారావు 'అయ్యో! పసరికకే భంగమా! ధర్మారావు శరీరము కూడ నశించెననుకున్నాడు'*[66] మెట్ట భూములు పోయి మాగాణి భూములొస్తున్నాయని, రైతు విపరీత పోకడలు దేవ మాతృకలను నిర్జీవం చేస్తున్నాయని దీని భావం. ప్రకృతిలో సకల జీవరాశులన్నిటిలో మానవుడు నేర్పరి. సంవిధానము చేయగల సమర్థుడు. అతడి ప్రకృతి యొక్క నియతిని రక్షించగలడు. పసరిక పక్షులతో, పాములతో స్నేహం చేస్తుంది. మాగాణి భూములలో ఎక్కువసేపు గడపలేకపోతుంది. ఆర్థిక వ్యవస్థలోను, ఆహారపుటలవాట్లలోనూ, జీవన విధానంలోను వస్తున్న

[63] మారుతున్న సమాజం – నా జ్ఞాపకాలు: పు: 12

[64] వేయిపడగలు, పు: 48

[65] వేయిపడగలుపు: 49

[66] వేయిపడగలు, పు: 50

విపరీత ధోరణులు ఇక్కడ కనిపిస్తాయి. ఇదంతా మానవుడు తన స్వార్థబుద్ధితో, అత్యాశతో ప్రకృతిని బంధిస్తున్నాడనే అర్థం. మాగాణిలో పసరిక తిరగలేక, తాను కూడ మార్పులకు లోనౌతాడు. శరీరంలో మార్పులు స్పష్టంగా కనిపిస్తుంటాయి. శరీరం దొందపారుతూ వచ్చింది. పక్షులతో పాములతో మైత్రి తెగిపోతుంది. అంతవరకు జబ్బే ఎరుగని పసరికకు జబ్బు చేస్తుంది. కృష్ణారెడ్డితో పసరిక స్నేహం చేస్తాడు. కృష్ణారెడ్డి కృత్రిమ నాగరికతకు లొంగిపోయి పొలంలో డబ్బును వెతికే మనిషి. మాగాణి పంటలకు నీరు పోసినవాడు. అతని వేసం పసరికకు నచ్చుతుంది. ఆ వేషాన్ని తనూ వేసుకుంటాడు. దేవమాతృకల స్థానంలో ఆదేవ మాతృకలు వచ్చాయిని ఈ సంఘటన తెలుపుతుంది. అందుకే ''*రైతు బిడ్డ కృతిక భావముల యందు నిమగ్నుడై మృషార్థముల చేత వ్యామోహితుడైన నాడే పసరిక చెడిపోయెను*''[67] పసరిక కృత్రిమ వేషం చేసి పక్షులన్నీ అతనికి దూరంగా వెళ్ళాయి. పసరిక చెడిపోయినాడు అని బిగ్గరగా అరిచాయి.

గార్డినర్ పసరికను బంధించాలని చూస్తాడు. పైరుపచ్చను అధికారికంగా విదేశీ సంస్కృతితో బంధించాలని చూస్తాడు. అప్పుడు ధర్మారావు గార్డినరుతో ''*అయ్యా! పసరిక వింత జంతువు కాదు. అతడు మా పైరు పచ్చ.... మా మతము చెడినను మాకుఁ దిండి చెడరాదు కదా?! మేము (బ్రదుకనైన వలయుగదా!*''[68] పసరికను వదిలిపెట్టమన్నాడు. భారతీయులు ప్రతిచిన్న విషయములో దైవాన్ని చూసారు. ప్రతి ప్రాణితో జీవితాన్ని సమన్వయం చేసుకున్నారు. ప్రకృతితో కలిసి జీవించారు. ప్రతి అణువులో ప్రాణశక్తిని దర్శించి కాపాడుకున్నారు. ప్రకృతి రక్షతోనే తన జీవితం ముడిపడి వుందని గ్రహించారు. ''*మా మతమున దేవుఁడున్నాడని కాదు. ఆ దేవుడుండనిమ్ము. చావనిమ్ము. సర్వమైన సృష్టియందును బ్రాణము, జీవము, ఆత్మ కలకలలాడు చున్నదని మా పూర్వీర్షులు చూచిరి. సర్వవస్తుగత ప్రాణమును సమారాధించిరి. అంతకన్న భూతదయ లేదు!*''[69] అనడం పురాతన నాగరికత స్థానంలో విశృంఖలంగా నూత్న నాగరికత చొచ్చుకొని రావడంతో మానవుడు ఉక్కిరిబిక్కిరయ్యాడు. ప్రకృతితో స్నేహంగా ఉన్నవాడు కాస్త ప్రకృతిపై దాడి చేయడం మొదలుపెట్టాడు. సమన్వయం చోట సమరం మొదలైంది. ఫలితంగా ప్రకృతి, జంతువులు, పక్షులు సమస్త ప్రాణికోటి నాశనం చేయబడుతున్నాయి. ''*ఇప్పుడు యజ్ఞముకాని యజ్ఞము జరుగుచున్నది. సర్వప్రాణులకు మహా*

[67] వేయిపడగలు, పు: 958

[68] వేయిపడగలు, పు: 632

[69] వేయిపడగలు, పు: 72

*మరణము ప్రారంభమైనది. చెట్లు తనప్పుడే పక్షులెచ్చట నిలువవలయును? మెట్టపొలాలు లేనిచో జాతిగల త్రాఁచులము. మేమెచ్చట బ్రతకవలయును? ఒకనాడే రయితుల నాశ్రయించియే మేము బ్రతికితిమి. ఈనాడు దుష్టుల మాటలు విని వారే మాకు నిలువనీడ లేకుండఁ జేయుచున్నారు?'*[70] అని వృద్ధ సర్పం అంటుంది. వృషన్నిది కథ ద్వారా మానవుని స్వార్థానికి మహా అడవులు ఏ విధంగా నాశనం చేయబడుతున్నాయో చెప్పబడింది. అదివటాన్ని నరికివేయడంతో వృషనిధి నీరక్కరలేని ఒక గుట్టపై తన నీరంతా కురిపించిపోయాడు.

ప్రకృతిలో జరుగుతున్న విపరీతమైన మార్పులను పసరిక ఓర్పుకోలేకపోయాడు. పక్షులతో, పాములతో స్నేహానికి ఉబలాటపడతాడు. కానీ అతన్ని ఎవ్వరూ దగ్గరకు రానీయరు. కాల గతిలో మార్పు సహజం. పసరికలో మార్పు అనివార్యం. చివరికి పాము కాటుకి పసరిక మరణిస్తుంది. పసరికను కరచిన పామూ మరణిస్తుంది. ప్రకృతి నాశనమైతే – ఆశ్రితులైన మనుష్యులూ, జీవకోటి కూడ నశించక తప్పదని సూచన.

### 3.2.2.5. వేయిపడగలులో కబీరు పాత్ర – సేవాసంబంధాలు:

కబీరు రత్నగిరి సోదరుడు. బలశాలి. చదువులేకపోయినా సమాజం పట్ల బాధ్యత గల వ్యక్తి. జనం కోసం. ఏదైనా మంచి చేయాలనే ఉత్సాహం ఉన్నవాడు. జనంలో మంచి పేరున్నవాడు. శారీరకంగా ప్రతిఘటించలేని రత్నగిరి. ధర్మారావు లాంటి వ్యక్తుల వెనుక కొండంత అండగా వారిని నిత్యం దుష్టుల నుండి కాపాడే ప్రయత్నంలో ఉంటాడు. సుబ్బన్నపేట నాగరికతా లక్షణాలు అందిపుచ్చుకొని పట్టణీకరణ చెందుతున్నందుకు వృత్తులు, జీవనవిధానాలు బతుకుదెరువులు ప్రశ్నార్థకంగా మారే దశలో జనాల్తో పాటు తాను ఈ మార్పును వ్యతిరేకిస్తాడు. కానీ చొచ్చుకొని వచ్చే అనేక పరిణామాలను అందరిలోనే చివరికి తానూ ఆహ్వానిస్తాడు. అంతేకాకుండా యూనియన్ మెంబర్ గా గ్రామ రాజకీయాల్లో బాధ్యతాయుత పాత్ర నిర్వహిస్తాడు. రంగారావు లాంటి జమీందారుకి వ్యతిరేకంగా పనిచేసేందుకు కూడా వెనుకంజ వేయడు. తనకు అర్థం కాని, అనేక విషయాలను, రాజకీయాలను ధర్మారావు ద్వారా తెలుసుకుంటాడు. రామేశ్వరం సినిమాహాలు స్థాపించే సందర్భంలో ఊరి డబ్బంతా ఒకేచోట పోగవుతుందని ఇలాగైతే గ్రామంలో అసమతౌల్యం ఏర్పడుతుందని విపరీతమైన ధన సంపాదన వ్యక్తిని రాక్షసున్ని చేస్తుందని వాదిస్తాడు. కబీరుకు దైవభక్తి ఎక్కువ. పాపభీతి కూడ ఎక్కువే. అన్యాయార్జితమైన ఒక్కపైసా కూడ ముట్టడు కబీరు.

---

[70] వేయిపడగలు, పు: 961

శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా ఎంతో ఉన్నతిని పరిణతిని సాధించి, పటిష్టమైన సామాజిక సంబంధాలు పెట్టుకొని అమాయకులైన గ్రామ ప్రజల పక్షాన, బలహీనులైన స్త్రీలు మానరక్షణకు దుష్టులబారి నుండి ధర్మారావు లాంటి సత్పురుషులని కాపాడేందుకు తద్వారా 'సామాజికశాంతి'ని స్థాపించేందుకు ప్రయత్నించిన వాడు కబీరు.

### 3.2.2.6. వేయిపడగలులో అసరిక పాత్ర – సంతృప్తికర జీవనం:

అన్ని జీవరాశుల కంటే మనిషి శారీరక పరిణామం విశిష్టమైంది. మనిషి యొక్క బాల్యం దీర్ఘమైనది. దానికి కారణం తర్వాత మానవ జీవితంలోకి వచ్చే కౌమారం, యవ్వనం, వార్ధక్యం లాంటి అవస్థలకు, ఆయా దశల్లో మనిషి జీవన విధానాలను, వ్యక్తిత్వాన్ని, పరిణామాన్ని, శీలాన్ని, బాల్యం క్రమబద్దీకరిస్తుంది. బాల్యంలోని వ్యక్తి ప్రవర్తన అతని ఆజీవనం పరుచుకుంటంది. క్రమశిక్షణతో, తర్ఫీదు ఇవ్వబడిన బాల్యం తర్వాతి దశల్ని ఆనందమయంగా ఉంచుతుంది. అయితే బాల్యం ఆనందమైన పరిస్థితుల్ని, దుఃఖాన్ని కూడ పంచుతుంది. తల్లిదండ్రుల వాత్సల్యాన్ని ప్రేమను పొందిన బాల్యం, పెద్దల నిరాదరణతో కూడిన బాల్యం రెండు వేర్వేరు ఫలితాలను పొందుతాయి. బాల్యంలోనే కొందరు పిల్లలు ఎలాంటి ఆదరణ, ఆప్యాయత లేకున్నా చిన్నప్పటినుండే 'సామాజిక ఒరిపిడి'లో రాటుదేలుతారు. చిన్నతనంలో జీవితాన్ని అర్థం చేసుకుంటారు. దృఢంగా ఆలోచిస్తారు. ధైర్యంగా ప్రవర్తిస్తారు. జీవితాన్ని ఆనందంగా స్వీకరిస్తారు. పోరాటం చేస్తారు. ఓడినా, గెలిచేంతవరకు విశ్రమించరు.

అలాంటి వాడు 'అసిరి' ఇంట్లో అమ్మను చూసుకోవాల్సిన బాధ్యత అసిరిదే, బడి లేదు. చదువులేదు. చిన్నప్పటి పరిస్థితులే 'ఆకలి' గూర్చి పాఠాలు చెప్పాయి. దాన్ని తీర్చుకునేందుకు ఆ పిల్లవాడు ఎంచుకున్న మార్గం 'దొంగతనం....' తను చేసే పని నేరమైనా కూడ అందులోనే 'ధర్మాన్ని' వెతుక్కుంటాడు. అసిరి ''*బాబూ! నేనిపుదు నాకు కావలసిన దానికన్న ఎక్కువ తీసుకోను...*''[71] అనే నిష్ఠతో ఉంటాడు. ధర్మారావుతో సంభాషణలో అసిరి మాటలు ఎంతో పరిణతితో కూడినట్లు తోస్తాయి. పోలీసుల జోక్యాన్ని నిరసిస్తూ వీరు ఖైదులోనూ వేయరు. సంపాదించుకోనీయరు అని అసమానం వ్యక్తం చేస్తాడు. అప్పుడు ధర్మారావు మరి నీవు జైలుకి వెళ్తే మీ తల్లిని ఎవరు చూసుకుంటారు. అంటే, ఎదురుగా ఉన్నంతవరకే మన బాధ్యత అనే గొప్ప సత్యాన్ని తెలియజేస్తాడు.

---

[71] వేయిపడగలు: (పు: 526).

### 3.2.2.7. వేయిపడగలులో చెంగల్రావు పాత్ర – తామస ప్రవృత్తి :

విడిప్రేమ సంఘ సిద్ధాంతకర్త రాధాపతితో కలిసి ఉంటాడు. తృతీయ ప్రకృతివలె నటించి మంగమ్మకు దగ్గరవుదామని ప్రయత్నిస్తాడు. రాధాపతి మిత్రుడైన రంగావధాని, మంగమ్మకు రాసిన ఉత్తరం ద్వారా చెంగల్రావు విశ్వాసం లేనివాడుగా, దుష్టునిగా మంగమ్మ తెలుసుకుంటుంది. మంగమ్మ లేని సమయంలో దేనికోసమో ఆమె పెట్టె సర్దుతాడు. మంగమ్మ తన ఆస్తిలో అధికభాగం 'కుమారస్వామికి' ఇవ్వడం చూసి సహింపలేడు చెంగల్రావు.

ఆస్తి మొత్తాన్ని కాజేద్దామనే ఉపాయంలో ఉంటాడు. అతని వెనక రాధాపతి, కుమారప్పలు మంత్రాంగం నడుపుతుంటారు. చెంగల్రావు ద్వారా ఆమె ఆస్తిని కాజేద్దామని వాళ్ళ ఆశ. మంగమ్మ ఆస్తి దక్కని పక్షంలో ఆమెను చంపేయమని చెంగల్రావుకు ఆజ్ఞ కూడ ఇస్తారు. మంగమ్మ ఇల్లు అతని పేరు రాస్తుంది. కానీ దానిని ఒప్పుకోక కూడూ గుడ్డలు చాలని నమ్మబలుకుతాడు. ఏకాదశి పర్వదినాన, నిద్రలోకి జారుకున్న మంగమ్మను కత్తితో పొడిచి హత్య చేస్తాడు చెంగల్రావు. ''*ఈ ఆస్తియంతయు కాకులకు, గ్రద్దలకు ఏల వేసితివి? నేను నిన్ను అన్నినాళ్ళు ఆశ్రయించి ఉంటిని. నాకీ వెధవ కొంప ఒక్కటియేనా?*''[72] అనడం చెంగల్రావులోని నీచ స్వభావాన్ని చూపుతుంది. మంగమ్మను చంపేందుకు చెంగల్రావు చూపిన కారణాలు కూడ ఎంత నీచమైనవో, అల్పమైనవో తెలుస్తుంది. ''*నిన్ను చంపెదనని రాధాపతికి నేను వాగ్దానమిచ్చితిని.... ఆయన రమ్మన్నచో నీవు ఏల వెళ్ళలేదు? ఆయన నీ మీద కత్తికట్టినాడు.....*'' ''*మాకును నీమీద కోర్కెగా నుండెను. నేనడుగుటకు నాకు భయమైనది.... అందుకు కూడ నిన్ను చంపుతున్నాను. ....నిన్ను చంపవలెనని నాకు మొదటి నుండి ఉన్నది. నిన్ను చంపవలెనని నాకు సరదా పుట్టినది. ఆ సరదా తీరుట కారేండ్లు పట్టినది.....*''[73] రాధాపతి ప్రయోజనం కోసం సరదాకోసం హత్య చేసే అసహ్యమైన వ్యక్తి చెంగల్రావు.

### 3.2.2.8. వేయిపడగలులో గిరిక పాత్ర – సాంప్రదాయిక విలువల కొనసాగింపు :

''ఈమె యుగయుగాల నాటి స్త్రీ''[74] మనదేశంలో వేల యేండ్లుగా వెలుగొందిన సంస్థల ప్రతిరూపం. రామేశ్వరశాస్త్రికి రత్నగిరికి కలిగిన సంతానం గిరిక. వీరిది దేవదాసి కుటుంబం. అన్ని వ్యవస్థలు పతనావస్థలో ఉండగా దేవదాసి వ్యవస్థను కూడ బోగం వాళ్ళ స్థాయికి దిగజార్చారు అప్పటి ధనవంతులు. దేశంలో అంతరించిపోతున్న దేవదాసి వ్యవస్థ యొక్క ఉదాత్త

[72] వేయిపడగలు, పు: 785

[73] వేయిపడగలు, పు: 795

[74] వేయిపడగలు, పు: 484

స్వరూపం గిరిక ద్వారా చూపింపబడింది. ''*మా గిరిక స్వామి కఁగదుంగడు ప్రియురాలు. పూర్వకాలపు భారతదేశమున నున్న దేవదాసీత్వ భావమంతయు నామెలోనున్నది*''[75] అని చెప్పడం ఆ వ్యవస్థలోని ఔన్నత్యాన్ని గుర్తు చేయడమే.... ''*ఈ రీతిలో ప్రేమోభావమిమిడియున్నది. ప్రేమ లేని భక్తి సాయుజ్యసుఖము నీయజాలదు. ప్రేమ రహితుడైన భక్తుడు భగవంతునకు దూరుడగును. ప్రేమతో నిండిన భక్తుడు భగవంతుని పాదములు ముద్దిడుకొనుచు, ఆయనచే ముద్దిడుకొనగోరుచు, తమ యిరువురకు హృదయైక్యమును భావించుకొనును. ప్రేమభక్తికి సజాతీయము. ఈ ప్రేమ మిళిత భక్తియే మధురాతి మధురమైన ప్రణయముగా పరిణమించును. ఆ భక్తుడు తాను ప్రేయసిగా భగవంతుడు ప్రియుడిగా విరహ బాధ ననుభవించును. ఒక్కొక్కప్పుడు భగవంతుడు తన కౌగిలిలో చేరినట్లు మానసిక సుఖమున సంభవించును. ఆ క్షణములో అతనికి సామాన్య సుఖము కలుగును. జీవన్ముక్తుడగును.... ఒక్కొక్క భక్తుని మనస్తత్వమును బట్టి భక్తితో ప్రేమ కలసియుండుననియు అది ప్రణయముగా మారి శృంగారముగా పర్యవసించుననియు రీత్యాలింగతమైన ఈ భక్తినే వైష్ణవ సాంప్రదాయమున మధురభక్తి యనియు నందురు.*''[76] అయితే నాగరికత విపరీత పోకడలకు పోతున్న సందర్భములో దేవదాసీలను భోగాంగనలుగా మార్చేసారు. భోగాంగనులు అనే పేరుకి అర్థాపకర్ష జరిగి, నీచార్థంలోకి దిగజారడం వల్ల ఆ వ్యవస్థపై అందరికీ గౌరవం పోయింది. ఒక ప్రయోజనాన్ని ఆశించి ఏర్పరచబడిన ఒక వ్యవస్థ కాలగమనంలో స్వార్థపూరిత శక్తుల చేత నాశనం చేయబడి, దాని ఉనికిని, స్వచ్ఛతను, స్వరూపాన్ని కూడ కోల్పోయే ప్రమాదముంది. భారతదేశంలో ఆంగ్లేయుల రాకతోనే అనేక వ్యవస్థలతో పాటు ఈ పవిత్రమైన వ్యవస్థకూడ నాశనం చేయబడింది.

''*భోగము వాండ్రు వేఱు, వారాంగనలు వేఱు. భోగము వాండ్రు భగవంతుని సన్నిధానమున నృత్యగానములు చేయటకెర్పడినారు. వారాంగనలు వారిలో గులయు చెడినవారు. భగవంతునకు దేవాలయములో నుత్సవములు చేయుటకు, రాజోపచారములు నెఱపుటయు భోగమందురు. స్వామిని నేఁడు భోగము జరిగిన దనుటయు వినలేదా? అందుకని వారికి 'భోగాంగనల'ని పేరు వచ్చెను.*''[77] అని ధర్మారావు అరుంధతితో చెప్తాడు. దేవదాసీలు భగవంతుని సేవలో జీవితాన్ని గడిపేవారు. రాగము – తాళము – నృత్యములతో భగవంతున్ని,

---

[75] వేయిపడగలు, పు: 478

[76] సాహిత్యశిల్ప సమీక్ష, పు: 74–75

[77] వేయిపడగలు, పు: 112

నిత్యము సేవించేవారు. ఇలా వారు సమాజాన్ని ప్రభావితం చేసేవారు. సంగీత, నాట్యాల ద్వారా సమాజంలో భక్తి భావాలను వెదజల్లేవారు. సమాజం వారిని గౌరవించేది. రాజులు, ధనవంతులు కూడ వారి జోలికి పోయేందుకు సాహసించలేదు.

కొన్ని వందల యేళ్ళుగా గౌరవించబడిన వ్యవస్థ, కృష్ణమనాయుని తదనంతరం హేళనకు గురైంది. 'రత్నగిరి'కి ఆస్థానంలో అవమానం జరిగింది. రంగారావు పట్టాభిషేక సమయంలో ఆహ్వానం లేకున్నా రత్నగిరి వచ్చింది. పిలవకున్నా వచ్చినందుకు అవమానింపబడింది. భగవంతుని ముందు నాట్యం చేయాల్సిన రత్నగిరి రాజు ముందు నాట్యం చేయాల్సి వచ్చింది.

ధర్మారావుచే, రాణిచే గిరిక గౌరవించబడింది. ''*రాణి దేవదాసివంక జూచెను. దేవదాసి కంఠము శంఖము వలె నడుము చక్రము వలె, కనులు పద్మమువలెఁ బ్రూశించెను. రాణి కనులు మూసుకొనెను. దేవదాసి వద్ద స్వామి వచ్చి నిలుచుండెను. ప్రభునామె శిరస్సుఁ జేయవేసెను. దేవదాసి యితని పాదములు తాకెను. రాణి కనులు దెఱచి అన్నట్లుగా నీమె గోపిక కదా! అనెను.*''[78] విష్ణువుకు గిరికకు అభేదమే. గిరిక భక్తి యోగిని.

''*మాంచ యోఽ వ్యభిచారేణ*
*భక్తి యోగేన సేవతే*
*సుగుణాన్ స్సమతీత్యైతాన్*
*బ్రహ్మ భూయాయ కల్పతే*' (గీ – 14, అ – 26 శ్లో ll)

''*భక్తి వలననే భగవంతుని వాస్తవజ్ఞానము జీవునకు స్ఫురించుచున్నది. తద్వారా భగవత్ప్రాప్తి కలుగుచున్నది. భక్తుడే గుణాతీతుఁడు కాగలడనియు, సర్వ భూతాంతరాత్ముడగు పరబ్రహ్మ అనన్యభక్తి వలననే దర్శింపబడుననియు, అనన్యభక్తుడే మహా యోగి యనియు గీతా సిద్ధాంతము*''[79] ఆమె గోపికల మార్గాన్ని అనుసరించింది. ''*గిరిక శృంగారరసరూపమై కృష్ణునకీడై నిలిచినది. శ్రీకృష్ణుడు సదానందమూర్తియైన చిద్రూపి, రాధిక ఆనంద స్వరూపిణి – రాధాకృష్ణులొక్కరేయన్న చైతన్య సిద్ధాంతము ప్రకారము గిరిక రాధికతో తుల్యమైన స్థానమును పొందియున్నది. ఇట్లు గిరిక మధురభక్తి సిద్ధాంతమునకు ప్రతీకయైనది. మధురభక్తి యనగా పరమాత్మ యొక్కడే పురుషుడుగను సర్వజీవులును, స్త్రీలుగను భావించి యామహాపురుషునకై విరహార్తిననుభవించుట*''[80] లక్ష్మీదేవికీ, గిరికకూ అభేదమే. లక్ష్మీదేవి స్వామికి వ్యక్తి రూపము.

---

[78] వేయిపడగలు, పు: 246

[79] భాగవతముపై భగవద్గీత ప్రభావము, పు: 233

[80] విశ్వనాథవారి నవలలలో ముఖ్య స్త్రీ పాత్ర చిత్రణము, పు: 56

ఆమె స్వామి నుండి వ్యక్తమై మరల స్వామిలో లీనమవుతుంది. కానీ ఇక్కడ భగవంతుడు గిరిక వద్దకు దిగివచ్చారు. గిరిక గురించిన వర్ణనలో రూపవర్ణన లేకుండా చైతన్యం దిగివచ్చినట్లుగా చెప్పబడింది.''*అవతారమనగా దిగివచ్చుట యని యర్థము. అవ్యక్త పరబ్రహ్మము వ్యక్తస్థితిని పొందుటయని దీని భావము. ఈ అవతారము స్వేచ్ఛాకృతమగు పరమాత్ముని జన్మము. ''అజాయిమానో బహుధా విజయతే'' అను శ్రుతి వాక్యము ఈ విషయమునే చాటుచున్నది. అవతారములందు జ్ఞానేచ్ఛ క్రియాశక్తులు పరాకాష్ఠనందును.... లోక కళ్యాణార్థమిది దివ్యమై, భవ్యమై, నిత్య నవ్యమై తనరారు జన్మను ధరించును.*''[81] ఈ విధంగా గిరిక పాత్రను లక్ష్మీదేవితో పోల్చడం ఆమెకు, దేవికి అభేదాన్ని ప్రకటించడమే.

### 3.3 వేయిపడగలులో కుటుంబ సంబంధాలు:

సమాజ పరిణామక్రమంలో కుటుంబం ప్రాధాన్యతను సంతరించుకుంది. వ్యక్తి నియంత్రణకు, గుణాత్మక అభివృద్ధికి, విచక్షణకు, సంతానం కొరకు ప్రతి ఒక్కరు కుటుంబంపైనే ఆధారపడతారు. తద్వారా సమాజంలో అత్యంత కీలక స్థానాన్ని, గౌరవాన్ని కుటుంబం కల్గివుంది. వ్యక్తిలో పాశవిక ప్రవృత్తి, విచ్చలవిడితనం, విపరీత లైంగికేచ్ఛలు సభ్య సమాజానికి గొడ్డలిపెట్టులాంటివి. ప్రాథమిక వనరు అయిన కుటుంబం వీటన్నిటిపైనా నియంత్రణను కల్గియుంటుంది. భవిష్యత్తు తరాల వారికి చక్కని మార్గదర్శకత్వం కుటుంబం ద్వారానే సాధ్యమౌతుంది. నిరంతరం కోరికలతో దహించుకుపోయే వ్యక్తికి సమాజంలో ఘర్షణ ఏర్పడకుండా, సహజాతాలను తృప్తిపరుస్తూ వ్యక్తిలోకి ఉన్నతమైన సంస్కారానికి దోహదపడుతుంది కుటుంబం.

సామాజికుడైన వ్యక్తికి తన సామాజిక బాధ్యతను పారలౌకిక బాధ్యతను తీర్చుకునేందుకు కుటుంబం ఒక చక్కని సాధనం. పారలౌకికానికెంత ప్రయోజనముందో, లౌకిక సుఖానికీ వివాహంలో అంతే విశిష్ట ప్రయోజనం ఉంది. భారతీయ సమాజంలో వ్యక్తి మాత్రుడిని విస్తరింపజేసే ప్రథమ వ్యాపకావరణం కుటుంబమే. వ్యక్తి తనను తాను విస్తరింపజేసుకొని కుటుంబంగా ఏర్పడుతున్నాడు. వ్యక్తిలోని 'అహం'కారం 'మమ'కారంగా మారడానికి పునాది కుటుంబమే. వ్యక్తిని సమాజంలో అనుసంధాన పరిచేది కుటుంబం. భద్రతనిచ్చేది కుటుంబం. జీవితాన్నిచ్చేది కుటుంబం. జీవితానికి అర్థాన్నిచ్చేది కుటుంబం.

---

[81] భాగవతముపై భగవద్గీత ప్రభావము, పు: 43

భారతీయ హిందూ జీవన విధానంలో కుటుంబం అనేది చతుర్విధ పురుషార్థాలను, చతురాశ్రమ పరిధుల్లో సాధించేందుకు నిర్ణయింపబడింది. సమాజామోదిత సంతానానికి కారణమైన 'వివాహం' ఆ వ్యక్తి మరణానంతరం కూడ కొనసాగించడం, ఇక్కడి విశిష్టత. భార్యను ధర్మపత్నిగా, అర్థాంగిగా భావించడం కుటుంబ భావనలోని గొప్పదనం. చతురాశ్రమాలలో గృహస్థ ధర్మానికి ఎంతో విలువ. భారతీయ వైదిక, లౌకిక సాహిత్యాలన్నీ ఈ విషయాన్నే నిరూపించాయి. మానవ సంబంధాలన్నింటిలో మధురమైనది స్త్రీ పురుష సంబంధం. దీనికి ఆలంబనే కుటుంబం.

భారతీయ కుటుంబమంటే కేవలం భార్య, భర్త, బిడ్డలే కాదు. ఎదిగిన పిల్లలు, వారి కుటుంబాలు, మనుమలు, ముసలివాళ్ళు, రక్తసంబంధీకులు వారి బంధుగణం. ఇదంతా కలిపి కుటుంబం. వీరందరిలో ఒకరికొకరు ప్రాణపదంగా ఉండొచ్చు. ద్వేష భావనతో ఉండొచ్చు. పలకరింపులు, ఈసడింపులూ ఉండొచ్చు కానీ, కుటుంబ ధర్మానికీ, అందరూ కట్టుబడాలి. దీనికి వ్యతిరేకంగా ఎవరైనా ప్రవర్తిస్తే సంఘానికి జవాబుదారిగా ఉండాల్సొస్తుంది. ఎందుకంటే కుటుంబం ఒక సాంఘిక వ్యవస్థ.

వేయిపడగలు నవలలో దాంపత్య ధర్మాన్ని ధర్మారావు – అరుంధతి పాత్రల ద్వారా విశ్వనాథ వారు వివరించారు. మానవసంబంధాలన్నింటికీ కుటుంబమే పునాది. దీన్ని ఈ పాత్రల ద్వారా స్థిరీకరించారు. ఈ విషయాలను భారతీయ సంస్కృత సాహిత్యం అందించిన ధార్మిక జీవనాన్ని, దాని వెలుగులను మరింతగా ప్రసరించిన ఆధునిక దార్శనికుల భావాలను వివరించే అధ్యాయంలో వీటిని మరికొంత సమన్వయించడం జరుగుతుంది.

జోస్యులు – మంగమ్మల దాంపత్యం అవినీతివంతంగా సాగి, దుఃఖాంతమౌతుంది. వివాహం ధర్మబద్ధమైంది. వివాహం ద్వారానే కామాన్ని పూరించుకోవడం ధార్మిక జీవనం దాంపత్య జీవనంలో భౌతిక కారణాల ద్వారా అనైతిక ప్రవర్తనకు దిగజారితే ఆ దాంపత్యం కూలిపోతుందనేందుకు ఈ జంట ఉదాహరణ.

రామేశం డబ్బున్నవాడనీ, జమీందారుకు దగ్గరి వాడనీ అతనికి దగ్గరౌతుంది మంగమ్మ. విషయం తెలిసిన జోస్యులు తీవ్ర ఆందోళనకు గురౌతారు. మంగమ్మను మందలించినా లాభం లేకపోతుంది. సమాజంలో తలెత్తుకు తిరగలేకపోతాడు జోస్యులు. తోటి ఉద్యోగస్తులతో నవ్వుల పాలౌతాడు. దుర్భరమైన మానసిక వేదన ఆ ఉపాధ్యాయున్ని రాక్షసునిగా మారుస్తుంది. రామేశాన్ని ఏమీ చేయలేక జీవచ్ఛవమౌతాడు. ఉన్మాదస్థితిలో రామేశాన్ని హత్య చేయబోయి, అతడి మనుషుల చేతిలో దుర్మరణం పాలౌతాడు. కేవలం భార్య యొక్క చంచల స్వభావం చేత

సంసారాన్ని విచ్ఛిన్నం చేసుకొని, గౌరవప్రదమైన ఉద్యోగంలో హేళన చేయబడి దిక్కులేని చావు చస్తాడు జోస్యులు. లోకరీతిని అనుసరించేటప్పుడు పాపభీతి కూడా ఉండాలనేది ఈ దంపతుల ఉదంతం తెలియజేస్తుంది.

అయితే భర్త జోస్యుల మరణానంతరం మంగమ్మ రెండో జీవితం ప్రారంభమౌతుంది. భర్త చనిపోయేటప్పుడు రామేశం దగ్గర సాధ్యమైనంతగా డబ్బు కాజేసి పారిపొమ్మని అమాయకురాలైన భార్యకు ఉపదేశం చేస్తాడు. భర్త చెప్పిన సూచన ప్రకారం రామేశం యావదాస్తిని చేజిక్కించుకొని అతడ్ని బికారిని చేస్తుంది. ఆమెతో శారీరక సంబంధం పెట్టుకుందామనుకున్న అందర్నీ తిప్పికొట్టే తెగువ సంపాదిస్తుంది మంగమ్మ. భ్రష్టుడి చేతిలో వంచనకు గురై జీవితాన్ని నాశనం చేసుకున్న మంగమ్మ, ధర్మరావు పరిచయంతో ఎంతో పరిణతి సాధిస్తుంది. సహవాసం మనిషిలోని మార్పుకు తోడ్పడుతుందనే దానిని మంగమ్మ రెండో జీవితం చక్కని ఉదాహరణ. ధర్మారావు, కుమారస్వామి వంటి సంప్రదాయ భావాలు గల వ్యక్తుల పరిచయం మంగమ్మలోని పైశాచికత్వాన్ని, అనైతిక భావాల్ని, విపరీత పోకడల్ని దూరం చేయగలిగింది. వారి ప్రభావం వల్ల మంగమ్మ మానసికంగా ఎంతో ఎదిగింది. తాను జీవితంలో నేర్చుకున్న పాఠాలు, సజ్జన సాంగత్యం వల్ల పొందిన జ్ఞానోదయం ఆమె ఆలోచనా రీతుల్ని పూర్తిగా మార్చివేసినాయి. ''*మంగమ్మ జీవితమును మూడు భాగములుగ విభజించవచ్చును. మొదటిది అజ్ఞానదశ, రెండవది పరిణామదశ, మూడవది ప్రక్షాళనదశ, రెండవదైన పరిణామము మంగమ్మ అజ్ఞానదశకు ఫలితముగ వచ్చినది. పరిణామ దశ ఫలితమే పశ్చాత్తాపము. ప్రక్షాళన కొఱకే దశలో నీమె కృషి సల్పినది. మొదటిదశలోని పొరపాటునకు మూడు దశలలో ననుభవించినది.*''[82] మహిళా మండలుల కార్యక్రమాల్లో మహిళామణుల అభిప్రాయాలు, పాశ్చాత్య వ్యామోహాలు, వివాహాల విషయంలో వారి ఆలోచనలు మంగమ్మకు వెగటుగా తోచాయి. విశ్వనాథ మంగమ్మ చేత ఈ సందర్భంలో ''*సంఘములో కాని మతములో కాని మీరెన్ని మార్పులైనా తేవచ్చును. ఇంద్రియ నిగ్రహము, మనో నిగ్రహము తద్వారా భక్తియో, జ్ఞానమో కలుగుటకు వీలుండెనేని మీరు తెచ్చిన మార్పు శిరోగ్రాహ్యము*''[83] అనిపిస్తాడు. ఏ ఇంద్రియ చాంచల్యం ద్వారా తాను అధఃపాతాళానికి దిగజారిందో, దాని స్థానంలో మొండివైరాగ్యాన్ని నింపుకున్నది మంగమ్మ. చివరగా పూర్తిగా ఆధ్యాత్మిక చింతనలో, శాంతి వైపు

---

[82] విశ్వనాథవారి నవలలో ముఖ్య స్త్రీ పాత్రచిత్రణము, పు: 205-206.

[83] వేయిపడగలు, పు: 583

తన మనస్సును తిప్పుకొని తన సంపాదనను, ధర్మకార్యాలకు వినియోగించింది. పాతాళంలోకి జారినా పరమాత్మను చేరుకునే 'ఆత్మోన్నత్యాన్ని'' సంపాదించుకొంది మంగమ్మ.

''*కోతి భగవద్భక్తుడైన ఆంజనేయుడుగా మారిపోయిన కథ. ఈ జీవితంలో మనిషి ప్రవాహమై ఎన్ని మిట్ట పల్లాలు మీదుగా ప్రవహిస్తాడో, సుళ్ళు తిరుగుతాడో, చివరకు నిస్తరంగ సముద్రంలో నిశ్చల జలబిందువుగా పరిణమిస్తాడో చిత్రించిన కథ. ఆధునికమైన భౌతిక జీవితం, ప్రాచీనమైన ఆధ్యాత్మిక జీవనంగా మలచుకోవడానికి, బయట చూపును లోపలకు త్రిప్పుకోవడానికి ఎంత తపన పడాలో జీవితం యోగంగా మలచుకోవడానికి ఎన్ని ఉలి గాట్లు, సుత్తి దెబ్బలు తినాలో వ్యాఖ్యానించిన అద్భుతమైన కథ.*''[84] మంగమ్మది. వివాహబంధాన్ని సఫలం చేసుకున్న జంట ధర్మారావు. అరుంధతిలదయితే విఫలం చేసుకున్నది జోస్యులు – మంగమ్మలది. ఎటూ తేల్చుకోలేక ఇరువురూ నష్టపోయినది రంగారావు – సరోజనమ్మలు. ఇవన్నీ సాంప్రదాయ వివాహబంధం ద్వారా ఏర్పడిన జంటలే. శాస్త్రోకంగా వైదిక ధర్మబద్ధంగా, పెద్దల అంగీకారంతో జరిగిన పెళ్ళిళ్ళ పరిణామాలు మనకు ఇక్కడ కనిపిస్తాయి. అయితే సాంప్రదాయేతర వివాహం ఈ వివాహాలతో ఎలా పోల్చబడునో కుమారస్వామి – శ్యామలల బంధం తెలుపుతుంది. పవిత్ర దాంపత్యానురక్తి ఉన్నట్లయితే సాంప్రదాయేతర వివాహం 'సుఫలమే' అని ఈ జంట నిరూపిస్తుంది. కైలాసపతి, రోహిణమ్మలు బ్రాహ్మణులు, కైలాసపతి క్రైస్తవమతం పుచ్చుకుంటాడు. అక్కడ ఉండలేక ఆర్య సమాజంలోకి చేరతాడు. వారి కూతురు పంకజమ్మ. కైలాసపతి తన కూతుర్ని ఎవరైనా తన కులస్థునికి ఇచ్చి పెళ్ళి చేద్దామనుకుంటే పంకజమ్మ రామిరెడ్డిల సంబంధం వివాహం దాకా వెళ్తుంది. వీరి సంతనమే శ్యామల. పేద బ్రాహ్మణ యువకుడైన కుమారస్వామి ఎఫ్. ఏ. చదువుతూ సహోధ్యాయురాలైన శ్యామలను ప్రేమిస్తాడు. చదువు పూర్తయిన తర్వాత పెళ్ళంటుంది పంకజమ్మ. కుమారస్వామి చదువుకు పంకజమ్మ సాయం చేస్తుంది. తర్వాత వివాహం విషయంలో పంకజమ్మ మనస్సు మార్చుకున్నా చివరకు కుమారస్వామికే తన కూతుర్నిచ్చి వివాహం చేస్తుంది. అన్యోన్య దాంపత్యం కుమారస్వామి దంపతుల మధ్య 'మతప్రసక్తి'ని తీసుకురాలేకపోయింది. ఇద్దరి మతాలు వేరయిన, ఇద్దరి మధ్య ప్రణయం సత్యమైంది. మానవ జీవితం సంఘర్షణాత్మకం మనిషి పుట్టినప్పటి నుండి మరణించేంత వరకు జీవితాన్ని అనుభవించే దశల్లో అనేక సందర్భాల్లో ఈ సంఘర్షణ కన్పిస్తుంది. మనిషి గుణాత్మకమైన ఆలోచన, క్రమ బద్ధమైన జీవన విధానం. ఓర్పు

[84] వేయిపడగల మణిప్రభలు, పు: 63

సహనం, వివేకం లాంటి లక్షణాలు అతన్ని ఆయా సంఘర్షణల సంక్షోభం నుండి బయటపడేటట్టు చేసి అతనికి సుఖసంతోషాలను ఆనందాన్ని ఇస్తాయి. రాగద్వేషాలకు ఏ వ్యక్తీ అతీతుడు కాకపోయినా సంయమనంతో, వివేచనతో తీసుకునే నిర్ణయాలు జీవిత సాఫల్యానికి తద్భిన్నంగా కుట్రలతో, అసహనంతో, రాక్షస, అనైతిక ప్రవృత్తులతో తీసుకునే నిర్ణయాలు వైఫల్య జీవితానికి మార్గం చూపుతాయి. తెలుగు నవలల్లో ఇలాంటి పాత్రలు అనేకంగా చిత్రించబడ్డాయి. ఉదాత్త గుణాలతో జీవితాన్ని ఆనందంగా, అనుదాత్త గుణాలతో జీవితాన్ని నరకంగా మార్చుకున్నవారు కనిపిస్తారు. ఎదుటివారి జీవితాల్లో కూడ వీరి చర్యలు తీవ్ర ప్రభావాన్ని చూపెట్టే అవకాశం ఉంది. కామేచ్ఛ, అర్థలోలుపత్వం, కృతఘ్నత, ప్రతీకారం, నిష్కారణమైన ద్వేషం లాంటి రాక్షస గుణాలు, ధార్మికత, కృతజ్ఞత, మైత్రి, కరుణలాంటి దైవీ గుణాలతో సమాజం ద్వంద్వాత్మకమైంది. ఈ ద్వంద్వవైఖరుల కుటుంబ సంబంధాలు, సామాజిక వ్యవస్థల్లోని మానవ సంబంధాలను ఎలా ప్రభావితం చేసిందో గమనించాలి.

మంగమ్మను మాయచేసి లోబరుచుకున్న రామేశ్వరం కామేచ్ఛ అధికంగా గల రాక్షస ప్రవృత్తి గల వ్యక్తి. కామాన్ని ధర్మబద్ధంగా నిర్వహించుకోవాల్సిన ఉన్నతస్థాయికి చెందిన వ్యక్తి, సామాజికంగా ఎత్తులో ఉన్న నైతికంగా పాతాళంలోకి జారినట్లు కనిపిస్తాడు. సాక్షాత్తు వేణుగోపాలస్వామికి తనను తాను అర్పించుకున్న గిరికను కోరతాడు. తన వెకిలి ప్రవర్తనతో గిరికను అవమాన పరుస్తాడు. చివరికి మంగమ్మ చేతిలో చావుదెబ్బ తింటాడు. జీవితాన్ని ఫలప్రదం చేసేవి సజ్జన సాంగత్యం, సత్సంగపఠనం. ఈ రెండు మనిషి జీవితాన్ని ఎంతో ఉన్నతస్థాయికి నిలబెడతాయి. అయితే అక్షరజ్ఞానం లేకుండా గ్రంథపఠనం అసాధ్యం. అలాంటి సమయంలో సజ్జన సాంగత్యమొకటే మనిషిని సన్మార్గునిగా మారుస్తుంది. హరిజన కుటుంబంలో పుట్టి సహజ చాంచల్యంతో రాణి నగలు కాజేసి, పట్టుబడి రాజుచె కోట నుండి గెంటివేయబడిన కాసావాడు గోపన్న. గోపన్నలోని అమాయకత్వాన్ని, సజ్జనత్వాన్ని గమనించి శాస్త్రి తిరిగి అతన్ని కోటలోనికి తీసుకువస్తాడు. ఆ కృతజ్ఞత తన జీవితాంతం శాస్త్రి గారి కుటుంబం పైన చూపిస్తాడు. శాస్త్రి మరణానంతరం ధర్మారావు ఆర్థిక స్థితిగతులను రాజుకు తెలియజేసి ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకొమ్మని రాజును అడుక్కుంటాడు. నాయుడిపట్ల ఆరాధనాభావం, గోపన్నకు నాయుడి దగ్గర చనువుకు కారణం. అయితే నాయుడి మరణానంతరం కోట నుండి వెళ్ళిపోతాడు. అవసానదశలో తన ప్రాణం కోటలోనే పోవాలని అనుకొని కోటకు తిరిగివస్తాడు. దారిలో ధర్మారావు కొడుకు చిన్నశాస్త్రి గోపన్నను కలిసినపుడు ఆ పిల్లవాడు తన పేరు 'గోపన్న' అని చెబుతాడు. ద్రవించిపోతాడు గోపన్న. రంగారావులో

వచ్చిన మార్పుకు సంతోషిస్తాడు. గోపన్న మరణం తర్వాత ధర్మారావు గోపన్న శీలం గురించి ''*గోపన్న చనిపోయినాడు. భక్తి ప్రపత్తులు, సేవ, భూతదయ, పరోపకార బుద్ధి మూర్తీభవించిన మనుజుడే పోయినాడు. స్వాతంత్ర్య మెరుగడు. కుతర్కమెరుగడు. వాడేల బ్రతికియుండును? అతనికిచట నేమి యున్నది?*'' [85] అనడం కాలంలో పాటు కోటలో వచ్చిన మార్పును తెలియజేస్తుంది.

నాయరు, కబీరు, అసిరి, పూటకూళ్ళ బ్రాహ్మణి, సూర్యపతిరావు, రాఘవరావు, దేవదాసి, రథంతం, శశిరేఖ లాంటి మృధుస్వభావులు, 'వేయిపడగలు'లో తమ జీవితాలను సమాజహితం కోసం ధారపోసి మానవతా మూర్తులుగా మిగిలిపోతారు. అలాగే రామేశ్వరం, రాధాపతి, చెంగల్రావు లాంటి వారు తమ నీచ ప్రవృత్తిచే అధోగతి పాలవుతారు.

విద్యావంతుడు ధనవంతుడైన రాజశేఖరుడు మూఢ విశ్వాసాలతో మిధ్యాడాంభికాలతో సర్వస్వము కోల్పోయి చివరకు డబ్బులేని 'లోటు'వల్ల అసలైన ప్రపంచాన్ని చూడగలుగుతాడు. ఉన్నప్పటికీ, లేనప్పటికీ తేడా రాజశేఖరుడు సంఘం ద్వారా గ్రహిస్తాడు. సంస్కరణల నేపథ్యంలో కందుకూరి వ్యక్తి సమాజంలో 'సంపద'వల్ల కలిగే గౌరవాన్ని చక్కగా చూపెట్టాడు. 'మానవ సంబంధాలన్నీ ఆర్థికపరమైనవే' అన్న మాట రాజశేఖరుని పాత్ర ద్వారా నిరూపితమైనాయి. తొలి నవలలోనే సమాజంలోని మానవ సంబంధాలు 'మానవీయ సంబంధాలు'గా ఎదగలేకపోయేందుకు సమాజంలోని మూఢవిశ్వాసాలు, మూఢనమ్మకాలు, వ్యక్తుల్లోని గర్వం, అహంకారం లాంటి అసురగుణాలు కారణమౌతాయో చక్కగా నిరూపించబడినవి. గణపతి నవల కేవలం అవిద్య, మూర్ఖత్వం, బాల్య వివాహాలు, అమాయకత్వం లాంటివి మనుష్యుల జీవితాలను ఎంతలా అవస్థలపాలు చేస్తాయో చూపెట్టింది. సంస్కరణల నేపథ్యంలో బాల్యవివాహాలు కన్యాశుల్కం విధవ దయనీయస్థితి అగ్రవర్ణాలలోని మానసిక దైర్భల్యాలను చక్కగా వివరించాడు చిలకమర్తి. మాలపల్లి గాంధీజీ సహాయనిరాకరణ, జాతీయోద్యమం అహింస లాంటి ఉద్యామాలు, ఉత్తమ సంస్కారాల నేపథ్యంలో పుట్టింది. రామదాసు యొక్క ఇద్దరు కుమారులు, అహింసకు-హింస ప్రతిరూపాలు. సమసమాజ స్థాపన, హరిజనోద్ధరణ ఈ నవల నిరూపిత లక్ష్యం. ఇందులో అగ్రవర్ణీయులు కూడ భాగస్వాములు కావడం హర్షణీయం. రెండు కుటుంబాల మధ్య 'ఘర్షణ'ను పుట్టించి, చివరికి 'సంఘపీఠం'ను స్థాపింపజేస్తాడు. ఉన్నత భారతీయుల జీవన విధానాన్ని, జాతీయ మూలాలను, సంస్కృతిని, మానవ

[85] వేయిపడగలు, పు: 899

సంబంధాలను ఇలా భారతజాతిలోని అన్ని రకాలైన ధర్మాలను పాశ్చాత్య విద్య–విలువలు ఏవిధంగా ధ్వంసం చేస్తున్నాయో కన్నులకు కట్టినట్లు వేయిపడగలు నవలలో కనిపిస్తాయి. సహస్రముఖాలైన భారతీయ ధర్మాలన్నీ కూలిపోయిన చివరికి 'వివాహధర్మాన్ని' మాత్రం భారతీయుల నుండి ఎవ్వరు మాత్రం విడదీయలేరని మొత్తం 'జాతిశక్తి' ఈ వ్యవస్థలోనే ఉందని. ఇది ఇక్కడ ఉన్నంత వరకు ఏ శక్తి 'భారతదేశాన్ని' ఏమీ చేయలేదని, ఇతర సంస్థల్లో జరుగుతున్న దౌర్జన్యాన్ని చూస్తూ, బాధపడుతూ సాక్షీభూతంగా ఉన్న ధర్మారావు చుట్టూ 'వేయి పడగల్ని' సృష్టించారు విశ్వనాథ. జాతీయోద్యమం, గాంధీ సత్యాగ్రహాల నేపథ్యంలో మనిషిలో కళా సౌందర్యాన్ని ఆవిష్కరింపజేసింది. నారాయణరావు. ఇందులో నారాయణరావు జాతీయోద్యమంలో పాల్గొంటాడు. జైలుకెళ్తాడు. స్వేచ్ఛాప్రణయం కారణం సమాజంలో జరుగుతున్న విచ్చలవిడితనాన్ని ఖండిస్తాడు. అపోహలతో దూరమైన కుటుంబజీవనాన్ని చక్కదిద్దుకుంటాడు. గాంధీజీ సహాయనిరాకరణ పిలుపుకోసం ఎదురు చూస్తుంటాడు. బాపిరాజుగారు ఇందులో కళాసౌందర్యాన్ని ఆవిష్కరించారు. స్వేచ్ఛాప్రణయం పేరుతో గౌరవనీయమైన కుటుంబాన్ని కూలదోసుకొని, మైదానంలో 'మోహవాంఛల్ని' తీర్చుకోలేక చివరికి జీవితంలో ఓడిపోయింది చలం రాజేశ్వరి. సత్యాన్వేషణ మార్గంలో తనను తాను తెలుసుకొనేందుకు జీవితంలో తనపై 'బలంగా' పడిన తల్లి యొక్క వ్యతిరేక భావనను తొలగించుకునేందుకు, సమాజంలో కలవలేక ప్రేమను, ఆప్యాయతను, పొందేందుకు సహజమైన 'కామాన్ని' అనుభవించేందుకు నిత్యం 'ఘర్షణ' పడే దయానిధి చివరికి 'సత్యంవైపు'గా ప్రయాణం చేయడాన్ని బుచ్చిబాబు అద్భుతంగా చిత్రించారు. 'వంశగౌరవం' అనే మిధ్యాడాంబికంతో సమాజంతో కలువలేక తనను తాను ప్రశ్నించుకుంటూ విపరీతమైన ఆత్మన్యూనతాభావంలో 'ఆత్మహత్య' చేసుకునే అసమర్థుడు సీతారామారావుని చక్కగా చూపించారు గోపీచంద్.

సంస్కరణతో మొదలై గాంధీ సహాయనిరాకరణోద్యమం, హరిజనోద్ధరణ, జాతీయ పునురుద్ధరణ, కులపాలికా ప్రణయం, స్వేచ్ఛా ప్రణయం, హేతువాద భావాలు, అస్తిత్వవాద సిద్ధాంతం, మనోవిశ్లేషణ లాంటి సిద్ధాంతాల నేపథ్యంలో స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్న తెలుగు సాంఘిక నవలలోని 'మానవ సంబంధాల్లో'ను విశ్లేషించడం జరిగింది. నవలల్లోని వివాహ సంబంధాల్ని పరామర్శిస్తే ధర్మారావు అరుంధతీలు ముందుగా అపార్థాలతో ఒకటి కాలేకపోతారు. దీనికి అరుంధతి వాళ్ళ తల్లిదండ్రులకు ధర్మారావు అంటే గిట్టకపోవడమే కారణంగా కనబడుతుంది. తర్వాత ధర్మారావు వారి గురించి ప్రస్తావిస్తూ వారిది 'రాక్షసప్రవృత్తి'తో పోల్చడం వారికి వారి కూతురు అల్లుడు పట్ల గల నిరాదరణను గుర్తు చేస్తుంది.

అరుంధతి కాపురానికి వచ్చిన తొలిరోజుల్లో తల్లిదండ్రుడల మాటలను నమ్మి ధర్మారావుని దూరంగా పెట్టడం అరుంధతిలోని బాల్యచాపల్యాన్ని సూచిస్తుంది. వివేకవంతుడైన ధర్మారావు రాజ్యలక్ష్మమ్మ ద్వారా అరుంధతి మనస్సును తనవైపు తిప్పుకొని, వివాహ జీవితాన్ని సుఖమయం చేసుకుంటాడు. ఇలాంటి సంఘటనే 'నారాయణరావు'లో కూడ చూడవచ్చు. నారాయణరావుకు శారదకు వివాహమౌతుంది. ఈ వివాహం శారద తల్లికి ఆమె తరపున బంధువులకు నచ్చదు. శారద మనస్సులో విషబీజాలు నాటుతారు. చదువుకున్నదైన శారద కూడ భర్తను సరిగ్గా అర్థం చేసుకోలేకోయింది. చివరికి నారాయణరావు సహృదయత, శ్యామసుందరీదేవి బోధలు శారద మీద పనిచేస్తాయి. చివరికి మిగిలేది కూడ ఇలాంటిదే కనిపిస్తుంది. దయానిధి దాంపత్యం కూలిపోతుంది. దయానిధి కూడ ఇందిరతో సఖ్యతగా ఉండేందుకు ఇష్టపడదు. ఇందిర తండ్రిచాటు బిడ్డ. చివరిక్షణాల్లో ఇందిర దయానిధితో కలిసి దాంపత్య ధర్మానికి ప్రతీకగా నిలుస్తుంది. అసమర్థుని జీవయాత్రలో ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను సీతారామారావు తన మానసిక దౌర్బల్యంతో మానసికంగా చిత్రహింసలు పెట్టి, సంసారంలోని ఆనందాన్ని ఒలకబోసుకుంటాడు. చివరికి ఆత్మహత్య చేసుకుంటాడు. హాయిగా నడిచే సంసారాన్ని 'స్వేచ్ఛ' పేరుతో కూలదోసుకుంటుంది. రాజేశ్వరి– మైదానంలో ఇలా ఆయా నవలల్లో నిరూపించబడిన వివాహ జీవితాలు, ఫలవంతం కావడానికి నిష్ఫలం కావడానికి, వైయక్తిక, కుటుంబ, సామాజిక కారణాలు ఎలా ప్రభావం చూపెట్టినాయో తెలుస్తుంది.

స్వేచ్ఛా ప్రణయం పేరుతో భర్తని, వదిలి ప్రియుడితో లేచిపోయి చివరికి జీవితంలో ఏవిధంగా ఓడిపోయారనే విషయాలని చంచలచిత్తం గల స్త్రీ పాత్రల ద్వారా నవలా రచయితలు చక్కగా చూపించారు. మాలపల్లిలో ప్రయోజకుడైన భర్త హరిజనోద్ధరణ లాంటి సంస్కారవంతమైన పనుల్లో నిమగ్నుడై ఉంటే వివాహకార్యాన్ని కుటుంబ భాధ్యతల్ని విస్మరించి సంస్కారహీనయై భర్తను, పిల్లాడిని వదిలేసి ప్రియుడితో లేచిపోయిన కమల ఉదంతం కనిపిస్తుంది. చివరికి అటు ప్రియుడి దగ్గర ఉండలే– పశ్చాత్థాపంతో మరణిస్తుంది. 'వేయిపడగలు'లో జోస్యులు భార్య 'మంగమ్మ'– ఉద్యోగస్తుడైన జోస్యులు 'అనాకారి' అని రామేశం అనే అధికారితో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తుంది. అవమానంతో కుంగిపోయిన జోస్యులు హత్యకు గురౌతాడు. చివర్లో జ్ఞానం తెచ్చుకున్న మంగమ్మ తనను లోబర్చుకున్న (ఇక్కడ రామేశం యొక్క ప్రలోభానికి మంగమ్మ మోసపోతుంది) రామేశానికి బుద్ధిచెప్పి చివరికి 'ఉత్తమురాలు'గా చనిపోతుంది. నారాయణరావులో సుబ్బయ్యశాస్త్రి భార్య పుష్పలీల, మైదానంలో అమీర్ వెంట వెళ్ళిన రాజేశ్వరి చివరికి అధోగతిపాలౌతారు. ఇలా

సంఘంలో గౌరవాన్ని, కుటుంబంలోని ఔన్నత్యాన్ని, మాతృత్వంలోని మాధుర్యాన్ని కేవలం తన అనైతిక, అసహజమైన కోర్కెల ద్వారా కూలదోసుకున్న స్త్రీలు నవలల్లో కనిపిస్తారు. అలాగే మాలపల్లిలో రామానాయుడు గానీ, వేయిపడగలలో జోస్యులుగానీ మైదానంలో రాజేశ్వరి భర్తగానీ– వీరందరూ సంఘంలో తమ విధిని సక్రమంగా నిర్వహిస్తున్నవారే. కుటుంబాన్ని చక్కగా పోషించుకున్నవారే. కేవలం భార్యలయొక్క మనోగతాల్ని సరిగ్గా అంచనా వేయలేకపోయారు. స్త్రీ పురుషులూ భార్యాభర్తల మధ్య సంబంధం కేవలం కామం వరకే ఆగిపోతే, ధర్మార్థాలు సరిగ్గా నిర్వహించబడకపోతే, ఇలాంటి భయానక దృశ్యాలే కనిపిస్తాయి. ఇది మానవసంబంధాల ఔన్యత్యానికి, పెద్దరికానికి గొడ్డలిపెట్టు. పుష్పలీల, రాజేశ్వరిలు తాము చేసిన నీచమైన పనిని సమర్థించుకోలేక జీవితాల్ని ముగించుకుంటే 'కమల' తన తప్పు తెలుసుకొని చివరి ఘడియలలో మారువేషంలో భర్త ఇంట్లోనే మరణిస్తుంది. మంగమ్మ భర్త మరణానంతరం రామేశాన్ని బికారిని చేసి, ధర్మారావు, కుమారస్వామి లాంటి సత్పురుషుల సాన్నిహిత్యంలో జీవితాన్ని ఉత్తమగతులవైపు తిప్పుకుంటుంది. అంటే జీవితంలో 'దిద్దుకోలేని తప్పు' అంటూ ఏదీ ఉండదనీ, నీ మనస్సు, నీ అధీనంలో ఉంటే చెడిపోయేందుకు ఎన్ని అవకాశాలుంటాయో, బాగుపడేమదుకు కూడా అన్నే అవకాశాలుంటాయని, ఎంతగా అధోగతి పాలైనా 'సంస్కరింపబడే' అవకాశం ఉంటుందని మంగమ్మ ఉదంతం తెలుపుతుంది.

అలాగే స్వేచ్ఛాప్రణయం పేరుతో కుటుంబాలను, వివాహాలను, సంసారాలను, ధిక్కరించిన స్త్రీల పరిస్థితి ఇలా ఉంటే వారిని 'లేవదీసుకుపోయిన' వారి ప్రస్థానం కూడ గమనించాలి. మాలపల్లిలో రామానాయుడు కుటుంబాన్ని కూల్చి కమలతో ప్రణయం సాగించిన మోహనరావు కుటుంబం కూడ చివరికి కూలిపోయింది. భార్య కాపురానికి రాకముందే మరణించడంతో, మోహనరావు ఒంటరివాడై తప్పు తెలుసుకొని పశ్చాత్తాపపడతాడు. వేయిపడగలలో మంగమ్మ జీవితాన్ని నాశనం చేసిన రామేశం చివరికి జైలుపాలౌతాడు. నారాయణరావులో పుష్పలీలను లేవదీసుకుపోయిన రాజేశ్వరరావు, మైదానంలో రాజేశ్వరిని లేవదీసుకుపోయిన అమీర్, ఆ ఇద్దరు స్త్రీలు వేరే 'పురుషునితో ప్రణయం' సాగించడం ఇష్టం లేక భరించలేక, 'పురుషాధిక్యత'కు బీటలు రాగా ఆత్మహత్య చేసుకుంటారు.

ఈ విధంగా స్వేచ్ఛా ప్రణయం అటు కుటుంబాలని, ఇటు 'స్వేచ్ఛా ప్రణయ' ప్రేమికుల్ని బలితీసుకోవడంతో ఈ సాంప్రదాయం భారతీయ వాతావరణానికి సరిపడదని తెలుస్తుంది.

★★★

నాల్గవ అధ్యాయం

# *చివరకు మిగిలేది, అసమర్థుని జీవయాత్ర నవలలు - మానవసంబంధాలు*

## 4.0 మనస్తత్వశాస్త్ర నవలలు పరిచయం :

తెలుగు నవలా సాహిత్యాన్ని ప్రభావితం చేసిన నవలల్లో చివరకు మిగిలేది, అసమర్థుని జీవయాత్ర, ఊబిలో దున్న, హిమజ్వాల, అంపశయ్య, సంసారవృక్షం, అల్పజీవి మొదలైన వాటిని ప్రస్తావించుకోవాల్సింది. సమకాలీన సమాజంలో వచ్చిన ఆలోచనాధోరణుల్ని ఆ యా రచయితలు వివిధ పాత్రల ద్వారా తమ సృజనాత్మక నైపుణ్యంతో మానవసంబంధాల్లో వచ్చిన మార్పుల్ని పాఠకులకు తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఈ పరిశోధనాంశ కాలంలో వచ్చిన చివరకుమిగిలేది, అసమర్థుని జీవయాత్ర నవలలను ప్రత్యేకంగా ఒక అధ్యాయంగా విశ్లేషిస్తున్నాను.

## 4.1 నవలా సాహిత్యంపై ఫ్రాయిడ్, ఆల్ఫ్రెడ్ ఆడ్లర్ ల ప్రభావం :

ఇరవయ్యో శతాబ్దంలో వివిధ రంగాలకు చెందిన ఆలోచనల్ని ప్రభావితం చేసిన గొప్ప మేధావుల్లో సిగ్మండ్ ఫ్రాయిడ్ (1856 –1939) ప్రముఖుడు. ఈయన ప్రతిపాదించిన మనోవిజ్ఞాన శాస్త్ర సిద్ధాంతాలు ఒక్క సాహిత్య విమర్శనారంగాన్నే గాక ఇతర రంగాలను కూడా ప్రభావితం చేసాయి.

ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ ప్రకారం, మనం చేసే చాలా పనుల మీదా, మన ప్రవర్తన మీదా మనకు తెలియనీ, మనం నియంత్రించలేని మన సొంత మానసిక శక్తుల ప్రభావం గాఢంగా ఉంటుందనీ నిరూపించాడు. మన మనస్సు చాలా అగాధమైనదనీ, దాన్ని వ్యాపారాలు 'అచేతనాతలం' కింద నిగూఢంగా ఉంటాయనీ అందువల్ల ఒక్కోసారి మన ప్రవర్తన మనకే అర్థం కాదనీ చెప్తూ అచేతనం యొక్క ఉనికిని అంగీకరించినా, దాని గురించి మనకు ప్రత్యక్షంగా తెలియదనీ, మానవ ప్రవర్తన అంతా 'కామ' ప్రేరితమైనదనీ కొన్ని కామ ప్రవృత్తులపై సామాజికంగా ఉన్న బలమైన ఆంక్షల వల్ల మనలో చాలామందికి ఉండే వాంఛలూ, జ్ఞాపకాలూ అణచివేయ బడతాయనీ వివరించాడు.

### 4.2 ఇడ్ – ఇగో – సూపర్ ఇగో భావనలు :

చేతనకూ, అచేతనకూ మధ్య నున్న సంబంధాన్ని ఫ్రాయిడో చిత్తం (Id) అహం (Ego) బుద్ధి (Super Ego)ల ద్వారా తెలుసుకోవచ్చునన్నాడు. Id పూర్తిగా అచేతనకూ చెందినదనీ, Ego, Super Ego కొద్దిగా చేతనలో ఉంటాయన్నాడు.

1. Id (చిత్తం): మానవుడిని నడిపించే అనాది జీవన సూత్రం అయిన ఆనంద సూత్రాన్ని అమలుపరచడానికి చిత్తం ఎప్పుడూ ప్రయత్నిస్తుంటుంది. దీన్ని ఏ తర్కమూ, హేతువూ నిరోధించలేవు. ఆనంద సూత్రాన్ని ఆశ్రయించడానికి ప్రకృతి వాంఛలు తీర్చుకోవడం కోసం విపరీతమైన తపనా, (తమకాలతో) చిత్తం నిండిపోయి ఉంటుంది. ఎలాంటి విలువలు, మంచి – చెడూ విచక్షణ అనేవి ఏవీ ఉండదు. ఫలితాల ప్రసక్తి లేకుండా, ప్రవృత్తి వాంఛలు తీర్చుకోవడం, శారీరక సుఖం అనుభవించడమే చిత్త స్వభావం.
2. Ego (అహం): Id యొక్క వినాశకర శక్తి నుండి వ్యక్తిని రక్షించే వాటిలో Ego ఒకటి. చిత్తానికున్న విపరీతబలం అహానికి లేకపోయినా ప్రకృతి వాంఛలు తీర్చుకోవటానికి చిత్తం అవలంభించే మార్గాలు స్వవినాశనానికి దారితీయకుండా వాటిని ప్రమాదం లేని ప్రవర్తనా రీతులకు మళ్ళిస్తుండేది అహం. అహంలో కూడ చాలా భాగం అచేతనం అయినా అందులో కొంత చేతన కూడ ఉంటుంది. అంతర్గత ప్రపంచానికీ, బాహ్య ప్రపంచానికీ మధ్య వారధిగా అహం వ్యవహరిస్తుంది.
3. Super Ego (బుద్ధి): మనస్సునీ, చిత్తాన్ని నియంత్రించి అంతరాత్మకూ, స్వాభిమానానికీ, ఆలవాలమైన 'బుద్ధి' నైతిక నియంత్రణ చేస్తుంది. సమాజం అనుమతించని చిత్తవృత్తులయిన బహిరంగ దురాక్రమణ, కామవాంఛలనూ నిరోధిస్తుంది.

ఫ్రాయిడ్ ప్రకారం లైంగిక పరమైన భావాలు అతి చిన్నతనంలోనే ప్రారంభం అవుతాయి. బాల్యంలోని 'శృంగార భావాలు' సరి అయిన దారుల్లో ఉండవు. కానీ పెద్దయిన తర్వాత, వ్యక్తి జీవితంపై వీటి ప్రభావం ఉంటుంది. బాల్యదశలోని 'శృంగార' భావాలు వ్యక్తికి తెలియకుండానే అతని 'అచేతన' లోనికి అణచివేయబడుతూ, కొన్ని సందర్భాల్లో మానసిక రుగ్మతలకు కూడా కారణమవుతుంటాయి.

### 4.3 ఈడిపస్ కాంప్లెక్స్– ఎలక్ట్రో కాంప్లెక్స్ :

ఫ్రాయిడ్ ప్రకారం అబ్బాయి చిన్నతనంలో తల్లి అనురాగానికి దగ్గరగా ఉంటాడు. అమ్మాయి తండ్రి వాత్సల్యాన్ని కోరుకుంటుంది. తల్లికి, తండ్రికి మధ్య గల సంబంధం

తెలియగానే అబ్బాయికి తండ్రి మీద కోపం వస్తుంది. తండ్రి విరోధిలా కనిపిస్తాడు. ఈ విధమైన తండ్రి పట్ల ప్రేమను 'ఈడిపస్ కాంప్లెక్స్' అంటారు. తల్లి చిన్నబ్బాయిపై ప్రేమను చూపిస్తుంటే వయస్సు పెరిగేకొద్దీ అబ్బాయి తన తల్లి గురించి 'విపరీతం'గా ఆలోచించడం మానేస్తాడు. ఆ 'శృంగారభావం' అతని అచేతనలో అణిచివేయబడుతుంది. అందులోనే అది జీవితాంతం ఉండిపోతుంది. ఈ రకమైన భావాన్ని 'Mother Fixation' అంటారు. వ్యక్తిగా మారుతున్న అబ్బాయికి తల్లి పట్ల గల 'వాంఛ' నుండి బయటపడలేదు. బయటపడదామన్న తాపత్రయాన్ని వదులుకోలేక, తనలోని అసభ్యకరమైన కోరికను తలచుకొని సిగ్గుపడుతూ 'మనోవ్యాధి' బారినపడతాడు. తల్లి పట్ల ప్రేమ, తండ్రి పట్ల ద్వేషం అతనిలో పెరిగిపోయి సమాజం పట్ల శత్రుత్వంగానూ, తిరుగుబాటు తనంగానూ ప్రవర్తనలో బయటపడుతుంది. అమ్మాయిలకు తండ్రిపట్ల ఉండే ఇలాంటి భావాల్ని మనస్తత్వశాస్త్రవేత్తలు **ఎలక్ట్రో కాంప్లెక్స్** గా వివరిస్తుంటారు.

'చివరకు మిగిలేది'లో నాయకుడు దయానిధిలో అన్ని సద్గుణాలున్నా కూడ జీవితంలో అన్ని సందర్భాల్లో 'తల్లి నీడ'లోనే బతుకుతాడు. ఆ నీడ నుండి బయటపడలేక, సమాజాన్ని ఎదుర్కోలేక సతమతమౌతాడు.

### 4.4.1 'చివరికి మిగిలేది' ఇతివృత్తం:

దయానిధి దశరథరామయ్య కొడుకు. దయానిధికి కోమలిపట్ల అంతులేని ఆకర్షణ. ఆమె లేచి వచ్చిన కామాక్షి కూతురు. దయానిధి కోమలిని ప్రగాఢంగా కాంక్షిస్తాడు తప్ప అతనికి ఆమెతో ఏవిధమైన సంబంధమూ లేదు. దయానిధి తల్లి పాత్ర మనకు నవలలో కన్పించదు. నాయకుని స్వగతాలలో వినిపిస్తుంది. దయానిధి తల్లి శీలం గురించి ఎన్నెన్నో పుకార్లు ఉన్నాయి. ఈ విషయం మీద దయానిధి అన్న రామానందానికి తల్లికి మధ్య గొడవలు జరుగుతుంటాయి. ఒకనాడు దయానిధి ఇంటికి తిరిగివస్తుండడగా నారయ్య ద్వారా తల్లి మరణించిదని కబురు అందుతుంది. అది సహజ మరణం కాదని, దశరథరామయ్య విషం పెట్టి చంపాడని పుకార్లున్నాయి. తల్లి మరణించినపుడు దయానిధి ఎంతో కృంగిపోయాడు. నేలమీద గడ్డిపరకను చూశాడు. మనం ఎంతో చులకనగా చూసే ఆగడ్డిపోచల్లో జీవశక్తి ఉంది. అది సృష్టికి ఆధారం. మనం ఎంత ప్రయత్నించినా ఆ గడ్డిపరకను సృష్టించగలమా? సృష్ఠి అద్భుత రహస్య సజీవ రూపావిష్కరణ ఆ గడ్డిపరక – దాని నిష్క్రమణమూ అంతటి రహస్యమే. రూపం పోతుంది జీవం పోదు. ప్రకృతిలో నిలిచే ఉంటుంది.

దయానిధి సెలవులకు ఇంటికి వచ్చేసరికి ఇంట్లో సుశీల, జగన్నాథం, అమృతం మొదలైనవాళ్ళ ఉన్నారు. వీళ్ళందరినీ ఒకేలా అభిమానిస్తాడు దయానిధి. అదొక విచిత్రనాటకం.

సుశీల పట్నవాసపు కృత్రిమ సంస్కారాలకు, భేషజాలకు ప్రతీక. అమృతం అచ్చమయిన పల్లీయుల సహజ నిర్మల మనస్తత్వానికి ప్రతీక. సుశాల తన గొప్ప చాటుకోవడానికి ఎదుటివారిని తృణీకరిస్తుంది. నొప్పిస్తుంది. ఒక సందర్భంలో దయానిధి తల్లిని గురించి కూడా అవహేళనగా మాట్లాడింది. అమృతం ఎవ్వరినీ నొప్పించదు. దయానిధి తల్లిని అభిమానిస్తూ మాట్లాడుతుంది. చివరకు తనను గాయపరచిన సుశీల మీదకూడా ఆమెలో మమకారమే పొంగిపొర్లుతుంది. జగన్నాథం కులాసాగా నవ్విస్తూ నవ్వుతూ కాలాన్ని గడిపేస్తాడు. వీరందరి మధ్య కోమలి. కోమలి చుట్టూ ఈ విచిత్ర మనస్తత్వాలన్నీ, వీరంతా కలిసి పిక్నిక్ వెళ్ళిన సందర్భంలో రచయిత కోమలిని ఉద్దేశించి చేసిన వర్ణనలు కోమలి పాత్రలోని ప్రతీకాత్మకతను నిరూపిస్తాయి. సుశీల తండ్రి గోవిందరావుకి సుశీలను దయానిధికిచ్చి వివాహం చేయడం ఇష్టం లేదు. అందుకు దయానిధి బాధపడడడు దయానిధి ఒకరోజు కోమలి ఇంటికి వెళ్ళి నిద్రిస్తున్న కోమలిని ఏమీ చేయకుండా ఆమె తలక్రింద డబ్బుపెట్టి వచ్చేస్తాడు. ఆ తరువాత కోమలి ఎమరో జమీందారుతో వెళ్ళిపోయిందని తెలుస్తుంది. సగలతోను, పట్టుచీరలతోను వ్యక్తిత్వాన్ని పోల్చుకొనే మరొక అల్పప్రాణి నాగమణి. మణి ఉన్నతం మాత్రాన సర్పాన్ని ఆదరించలేంకదా! రత్నాలతో అలంకరించుకున్న నాగమణి కూడా అలాంటిదే అని ధ్వని.

దయానిధికి మాధవయ్యగారి కుమారుడు ఇందిరలతో వివాహమైంది. చిత్రంగా ఆ వివాహం మున్నాళ ముచ్చటగా మిగిలిపోయింది. పెళ్ళిలో రాజారావుకూ సుశీలకూ సంబంధమేర్పడుతుంది. పెళ్లిలో భోజనాల పంక్తులమధ్యకు నల్లకుక్క వస్తుంది. అందరూ భయంతో దాన్ని బయటికి కావడికట్టి తీసుకొనిపోయారు. ఈ సంఘటన జరిగిన తరువాత భోజనాలవుతున్నాయని తెలియక పాలు తీసుకొని కాపువాడు, గడ్డిపోపు తీసుకొని యానాదివాడు అక్కడికి వచ్చారు. మాధవయ్యగారు వాళ్ళని కోట్టబోయాడు. దయానిధి అలిగి భోజనం మానేసి వాళ్ళకి కూడ తన పంక్తినే వడ్డించేవరకు అన్నం తినలేదు.

పెళ్ళితరువాత పరిస్థితుల్లో దయానిధి కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొని ఉపన్యసించాడు. మామగారు మాధవయ్యగారే అక్కడవారిపై లాఠీచార్జీ జరిపించారు. దయానిధికి కూడా దెబ్బలు తగిలాయి. అమృతం వచ్చి దయానిధిని ఓదార్చింది. మామగారు అల్లుణ్ని అరెస్ట్ చేయకుండా ఎక్కడకైనా దూరంగా పొమ్మని ఉత్తరం వారి ఔదార్యం ప్రకటించుకున్నాడు. రావుసాహెబ్ బిరుదం కోసం ఆత్మని అమ్ముకున్న మాధవరావంటే దయానిధికి అసహ్యం అలా భార్యాభర్తలు విడిపోయారు.

దయానిధి ఏలూరులో ప్రాక్టీస్ పెట్టాడు. అతని క్లబ్ స్నేహితులలో ముఖ్యుడు కృష్ణమూర్తి, శ్యామల ప్రకాశరావు చెల్లెలు. ఆమె వైవాహిక జీవిత వైఫల్యం కారణంగా ఉన్మాదిని అయింది. ఆమెను బాగు చెయ్యటానికి దయానిధి ఎంతో కృషి చేశాడు. ఒక దశలో ప్రకాశరావు నిధిని అవమానించి శ్యామలను తనతో తీసుకుపోయాడు. క్లబ్ లో దయానిధి ప్రవర్తనపట్ల దుష్ప్రచారం చెలరేగింది. అతని ప్రాక్టీసు పడిపోయింది. కొందరు కావాలని అతడి తల్లి ప్రస్తావన తెచ్చి అతడిని హింసించేవారు. కృష్ణమూర్తికి సుఖ వ్యాధులున్నట్లు దయానిధికి తెలుస్తుంది. అతనితో సుశీల వివాహం నిశ్చయమైనట్లు శుభలేఖ వస్తుంది. ఆ వివాహం ఆపు చేయించాలని దయానిధి ప్రయత్నించి విఫలుడౌతాడు. సుశీల కొద్ది రోజుల్లోనే శిశువును కని మరణించిందని తెలుస్తుంది.

అన్ని విధాలా ఆర్థికంగాను, మానసికంగాను కృంగిపోయిన నిధిని చూడటానికి అమృతం వస్తుంది. అనుకోకుండా అతనికి అమృతంతో భౌతికానుబంధం ఏర్పడుతుంది. అది దయానిధిని అతనిని ఆవరించిన స్తబ్దత్వం నుండి విముక్తున్ని చెస్తుంది.

రాయలసీమలో ప్లేగు, కలరా మొదలైన వ్యాధులు వ్యాపించాయని ఉచిత వైద్య సదుపాయం చేయటానికి దయానిధి అక్కడికి వెళ్లాడు. ఎందరో రోగులకు ఆత్మబంధువై సేవ చేస్తాడు. అక్కడ అతనికి పెద్ద వజ్రం దొరికింది. దానికి అనంతాచార్యులగారి అమ్మాయి కాత్యాయని అనే పేరు పెట్టాడు. వజ్రాల గని తప్పించటం ప్రారంభించాడు. బాగా డబ్బు గడించాడు. ఆస్పత్రి, పాఠశాల కూడ కట్టించాడు. అప్పుడు కోమలి అతని దగ్గరకి వచ్చింది. కోమలిలోని మార్పును రచయిత సహజమైన ప్రకృతి సౌందర్యాన్ని కృత్రిమమైన యాంత్రిక నిర్మాణాలతో నిండిన పట్నవాసంగా మార్చటంతో ఉపమిస్తాడు. రాజకీయ నాయకుడిగా మారిన రాజారావు దయానిధిని గురించి విష ప్రచారం సాగిస్తాడు. సర్కారు జిల్లాల వాళ్ళకి రాయలసీమ వారికి విద్వేషాలు పెరిగి, నారయ్యని చావగొడతారు. భార్య ఇందిర మరణశయ్య మీద ఉందని నిధికి టెలిగ్రామ్ వస్తుంది. నిధి ఆమె దగ్గరికి వెళ్ళి కడసారి ఆమె ప్రశ్నకు సమాధానమిచ్చి అంత్యక్రియలు జరిపించాడు.

అమృతానికి ఆడపిల్ల పుట్టినట్లు తెలుస్తుంది. అది ఏదో మహాద్భుతమైన సృష్టి రహస్యంగా ఊహించుకున్న దయానిధికి అమృతం ఇంట్లో అంతా అతి మామూలుగా ఉండటం విచిత్ర మనిపిస్తుంది. ప్రాణిసృష్టి అంత సాధారణం. జగన్నాధం ఊరికి దూరంగా పాఠశాల ఏర్పాటు చేసుకొని అక్కడి వారందరికి చదువులు చెప్తున్నాడు. దయానిధి తిరిగి వచ్చేసరికి రాయలసీమ ప్రజలు విద్వేషంతో అతని గనులు పూడ్చేశారు. అనంతాచార్యుల గారి ఇల్లు తగలబెట్టారు. కోమలికి శరీరంపైన చాలా చోట్ల కాలింది. ఆమెను తీసుకొని సంపాదించినదంతా వదులుకొని

ప్రకృతిలోకి వచ్చేశాడు దయానిధి. రెండు కొండల మధ్య లోయ. ఆ లోయలో దయానిధి పడుకొన్నాడు. అటువైపు కోమలి కుప్పకూలిపోయింది. ఇటువైపు నారయ్య మరణించాడు. అప్పుడు చివరకు మిగిలిందేమిటి అని ప్రశ్నించుకున్నాడు. ఒక వైపు మృత్యువు (నారయ్య) మరొకవైపు నశించినా ఎప్పటికప్పుడు కొత్తగా చిగురించే ప్రకృతి (కోమలి), ఈ రెండింటి మధ్య నిరంతర ప్రయాణీకుడు మానవుడు, జీవించటంలోని ఆనందాన్ని గుర్తించటమే మానవుడికి చివరకు మిగిలేది.

## 4.4.2 'చివరికి మిగిలేది' మానవసంబంధాల విశ్లేషణ:

''*జీవించుటకు బదులుగా జీవితమును గూర్చి యాలోచించేవాడు. దయానిధి తర్కవితర్కములచే సాధించిన సిద్ధాంతములతో దన్నుఁ దా బంధించు కొన్నవాఁడు జీవితములో దారసిలిన విషాదము ననుభవించుటకుఁ గాను సహజలక్షణములను గోలుపోయినవాడు. పరిస్థితుల నెదుర్కొనుటకు కేతనికి గుండె నిబ్బరము చాల లేదు.... ఈ హేతువుల వలననే సంఘజీవిగా నందఱతో గలసిమెలసి మాతఁ దుండలేకపోయెను. అన్వేషణీ పరత్వమాతని జీవ లక్షణము*''[1] చివరకు మిగిలేది నవల దయానిధి యొక్క సత్యాన్వేషణ. తాను జీవితంలో పొందిన అనుభవాలను విశ్లేషించుకుంటూ తనకు తానుగా గమ్యం వైపు ప్రయాణం చేస్తుంటాడు. ఇందులో రకరకాల వ్యక్తులు ఆయన జీవితంలోకి ప్రవేశిస్తారు. తనతో పరిచయమున్న వ్యక్తులందరితో, తన అనుభవాలను సమ్మిళితం చేసి, ఎక్కడా సహానుభూతిని పొందక, ప్రయాణం చేస్తూనే ఉంటాడు. ప్రధానంగా దయానిధిపై ప్రభావం చూపెట్టిన వ్యక్తులు దయానిధి తల్లి, కోమలి, అమృతం. ఈ ముగ్గురి యొక్క ప్రభావాలు, దయానిధి చుట్టూ విస్తరించుకున్నాయి.

దయానిధి తల్లి కథ ప్రారంభంలోనే మరణిస్తుంది. ఆమె మరణం దయానిధిని తీవ్రంగా కుంగదీస్తుంది. తల్లంటే దయానిధికి అమితమైన ప్రేమ. తల్లికి కూడ దయానిధి అంటే ఇష్టం. దయానిధి పుట్టినప్పుడు తల్లిగండాన పుట్టాడు – వాణ్ణి చంపేయండి. అంటే తల్లి అక్కున చేర్చుకుంది. చిన్నప్పుడు హాస్టల్ ఫీజు కట్టేందుకు నాన్న డబ్బులు పంపకపోతే, తన గాజులమ్మి ఫీజు కడ్తుంది. దీపావళినాడు తెల్ల పట్టుచొక్కా వేసుకొని మతాబులు కాలుస్తుంటే, తల్లి ఎంతో పొంగిపోయింది. చివరికి కోమలి గురించి చెప్తున్నప్పుడు కూడ తల్లి విసుక్కోలేదు. ఇలాంటి కారణాల వల్ల దయానిధికి తల్లి, అంటే వల్లమాలిన ప్రేమ.

[1] ఆంధ్ర నవలా పరిణామము , పు: 433

అయితే యుక్తవయస్సు వచ్చిన కొడుక్కి తల్లి యొక్క అనైతిక ప్రవర్తన గురించి తెలిస్తే తట్టుకోలేడు. అందులోని నిజానిజాలు తెలియకపోయినా లోకం తల్లిమీద నిందవేస్తుంది. తల్లి చేసిన అపచారాల ప్రభావం కొడుకుపై ఎంతగా పడుతుందో దయానిధి జీవితం ద్వారా తెలుస్తుంది.

కాలువ గట్టున గడ్డిపరకను చేత్తో చుట్టుకొని 'ఏకాంతం'గా దయానిధి కూర్చుంటాడు. నిజానికి గడ్డిపోచ విలువెంత? అనుకుంటాడు. తన తల్లి లాంటిదే. ఈ గడ్డిపోచ అని భావిస్తాడు. ఎంతశక్తి మంతుడైనా ఈ గడ్డి పోచ లోకువ. పెరికి ఆవల విసిరేస్తారు. ఈ దృశ్యంలో తన తల్లి కనిపిస్తుంది. తల్లి చేసిన తప్పు ఎవరికీ తెలియదు. అయినా తండ్రి నీకు ఇరవైరెండేళ్ళు వచ్చాయి. పిల్లనిచ్చేందుకు ఎవరూ ఎందుకు రావడం లేదో తెలుసా? అలాంటి తల్లికి కొడుకువు కాబట్టి నీకి దుస్థితి' అని తల్లిని ఈసడించుకుంటాడు. మామయ్య గోవిందరావు – 'బాబూ అమ్మను ఇంటి నుండి పంపించమంటావా! అని సరాసరి మొఖంపైనే అడిగేస్తాడు. ఇంటికి చుట్టపు చూపుగా వచ్చిన వ్యక్తులు 'మీ అమ్మ అలాంటిదే నటగా! అని వెక్కిరిస్తారు. చివరికి అన్న కూడ తల్లిపై పడిన నింద(?) కు, భార్యపోరు పడలేక ఇంటినుండి వెళ్ళిపోతాడు. ఇలా – తాను చిన్నప్పటినుండి ప్రాణంగా ఇష్టపడిన తల్లిని నిజమో అబద్ధమో తెలియని సంఘటనకి బాధ్యురాలిని చేస్తారు. ఇంట్లో అమ్మని ఎవరికి పనికిరాని వస్తువుగా తేల్చిపారేసి 'గడ్డిపరక'లా విసిరేస్తారు.

చివరికి 'లోకరీతి' నెగ్గి తల్లి మరణిస్తుంది. లోకంలో పురుషుడు ఎన్ని అనైతిక పనులు చేసినా సంఘం అతన్ని 'గెంటేందుకు' సాహసించదు. కానీ స్త్రీ అయితే ఛాయామాత్రంగా కనిపించినా అంతు చూస్తేగాని వదలదు అనేది స్పష్టం. ఈ సంఘటన తల్లిమీద పడిన నింద(?) దయానిధిని ఎక్కడా కుదురుగా నిలువనీయదు. ''*తల్లిని నిందించే వారిని ద్వేషించడం తన కర్తవ్యంగా భావించాడేతప్ప నిజంగా తల్లిలో దోషం వుంటే దానిని సహించి, ఆమెపై జాలి చూపవచ్చుగాని, అంతమాత్రం చేత మిగిలిన వారిని ద్వేషించవలసిన అవసరం లేదని గాని అతడు ఆలోచించలేకపోయాడు.*''[2] అతడు పనిచేస్తున్న ప్రతీచోట, పరిచయమున్న ప్రతీవ్యక్తి ఏదో సందర్భంలో తల్లి ప్రస్తావన తెచ్చి దయానిధిని మానసికంగా హింసిస్తారు. క్రమేణా దయానిధి అంతర్ముఖుడౌతాడు.

[2] తెలుగు నవల – మనో విశ్లేషణ, పు: 65

### 4.4.3 చివరకుమిగిలేదిలో సమాజీకరణము :

*"మానవ సమాజములో నొక సభ్యునిగ పెంపు చెందుటయే సమాజీకరణమనబడును. ఈ మార్పునకు రెండు హేతువులుండును. ప్రతి వ్యక్తికిని వంశానుగతముగ కొన్న గుణములు సంక్రమించిను. ఆయా గుణముల ననుసరించి అతడు బాహ్యములగు ప్రబోధ శక్తులకు ప్రతివచనము నొసంగును. అనువంశికమగు గుణగణములును వానిననుసరించి మానవుడు సమాజములో మెలంగుటయు, సమాజీకరణము నందలి ముఖ్యభాగములు"*[3] సామాజీకరణ చెందలేనటువంటి దయానిధి సొంతంగా తాను ఏర్పరచుకొన్న విలువలకే ప్రాధాన్యాన్ని ఇస్తాడు. లోకం ఏర్పర్చిన 'సంఘరీతి'ని పట్టించుకోడు. ముఖ్యంగా ప్రేమ, సౌందర్యం, పెళ్ళి ఈ మూడు విషయాల పట్ల స్పష్టమైన వైఖరితో ఉంటాడు. తాను సొంతంగా ఏర్పరచుకున్న నైతిక విలువలకు, సంఘానికి సంబంధాన్ని పెట్టదలచుకోలేదు. వాటి ప్రకారం దాపరికం, నటన లేకుండా వ్యక్తులు స్వేచ్ఛగా ప్రవర్తించటాన్ని ధైర్యంగా, నిర్భయంగా ప్రవర్తించటాన్ని అభిమానించే వ్యక్తిగా ఎదుగుతాడు. అయితే సంఘం అతని తల్లి విషయంలో ఏర్పరచుకున్న విలువలుకు భావాలకు, వ్యక్తిగా దయానిధి ఏర్పరచుకున్న విలువలకు ఎక్కడా పొంతన కుదరకపోవటంతో దయానిధిలో నిత్య సంఘర్షణ తప్పలేదు.

దయానిధి అన్న రామానందం తల్లి ప్రవర్తన కారణంగా ఇంటినుండి వెళ్ళిపోతాడు. అందువల్ల ఎవరైనా తల్లిని నిందిస్తే దయానిధిలా బాధపడడు. ఎందుకంటే రామానందం సంఘనిర్మిత విలువలకు బద్ధుడు. కాబట్టి అతని జీవితం హాయిగానే సాగిపోతుంది. ఘర్షణ లేని జీవితం; తల్లిని నిందించిన వారితో దయానిధి ఎప్పుడూ అంతస్సంఘర్షనకు గురౌతాడు.

కోమలి ఇంటికి వెళ్ళిన దయానిధితో కోమలి 'ఇన్నిసార్లు మా ఇంటికి వచ్చారు. నా కోసరం ఏమన్నా తెచ్చారా? అంటుంది. 'సర్కస్ కి వెడదాం' అని దయానిధి అంటే – 'ఏదీ జేబులో డబ్బులెన్ని ఉన్నాయో' చూస్తానంటుంది. జేబులో చెయ్యిపెట్టి 'గడ్డిపరక'ను తీసి – 'ఇదేంటీ – ఛీ – పాడు – గడ్డి' దాచుకో అంటుంది. ఆ గడ్డిపరకను దయానిధి ఆమె తల్లో పెట్టబోతాడు. 'గడ్డి నోట్లో పెట్టాలి – తల్లో కాదు' అని ఈసడించుకుంటుంది. గడ్డిపోచ విలువ కోమలికి తెలియదు.

---

[3] సామాజిక శాస్త్రము, పు: 227

### 4.4.4 ఆత్మన్యూనతా భావం:

దయానిధికి తల్లిమీద ఎంతప్రేమో చెప్పలేము. అయితే అంత ప్రేమ అతనికి 'గడ్డిపోచ' లాగానే తల్లిని కూడ తీసేసారు. సంఘం దృష్టిలో అమ్మ ఎలాంటిదో – కోమలి కూడ అలాంటిదే. లేచిపోయి వచ్చిన కామాక్షి కూతురు కోమలి. కోమలి అనాగరికురాలు. దయానిధి వైద్యవిద్యను చదువుకున్నవాడు అందగాడు. కాస్త సంపన్న కుటుంబీకుడు. అతనికి కోమలి మీద విపరీతమైన వ్యామోహం – దీనిని ఇతని తల్లి కూడ వ్యతిరేకించక పోవడం గమనార్హం. తల్లి దృష్టిలో కోమలి 'ప్రేమార్హురాలే' కాబట్టే కోమలి అంటే దయానిధికి అంత ఇష్టం. సంఘనీతిని ఎప్పటికప్పుడు, తన సొంత నిర్ణయాలతో తూకం వేసుకుంటారు. దయానిధి, కానీ కోమలికి ఈ ప్రేమ, ఈ సున్నితత్వం తెలియవు. ఆమెకు కావలసింది. ఆకాశం లాంటి ఆనందం, డబ్బుతో కొనగల ఆనందం. ఆమె కులస్త్రీ కాదు. వివాహిత కాదు. చదువులేదు. టెంపరితనం ఎక్కువ. పదిమందిలో దయానిధిని హేళన చేస్తుంది. 'గడ్డి నోట్లో పెట్టాలి. 'చూసి పోతుంటాడు' కానీ ఏమీ చేయడు! 'ఆయనకు సూడడమే సేతవును!' అన్నా దయానిధి స్వీకరిస్తాడు.

ఎందుకంటే తల్లి యొక్క నీడను కోమలిలో దయానిధి చూస్తున్నాడు. ''*కోమలి కూడ తల్లి వలె హీన చరిత్ర కలది. తన తల్లికి సాంఘికంగా హోదా వుంది. కోమలికి లేదు – అంతే తేడా. ఇది ఒక కారణం. రెండవ కారణం వయస్సుకి సహజమైన వుత్సాహం.... తల్లి మీద అపనింద వలన అతడికి సాంఘికంగా తనతో సమానస్థాయి గల స్త్రీ లంటే భయం. ఈ భయం అతడికి ఆత్మన్యూనతా భావం (Inferierity complex) వలన కలిగింది*''[4] కోమలి కూడ గడ్డిపోచలోంచి పుట్టేం – ''*గడ్డి పోచల మధ్య గంతులేస్తూ ఆకాశాన్ని, భూమినీ, బుజ్జగిస్తూ, స్నేహం చేసుకుంటూ వుండవలసిన వ్యక్తి కోమలి. పుట్టిల్లు పచ్చగడ్డి, అత్తిల్లు ఆకాశం*''[5] అని కోమలి స్వభావాన్ని వర్ణిస్తాడు. ప్రకృతిని స్త్రీ తో పోల్చడం పరిపాటిగా కనిపిస్తుంది. ''*స్త్రీ నుంచి పొందే ఆనందాన్ని ఆకాశపు నీలత్వం లోంచి, నీళ్ళ చల్లదనంలోంచి, గడ్డి మెత్తదనంలోంచి, పువ్వుల మెరుగులోంచి పొందాలి*''[6] ఈ సంబంధమే దయానిధికి కోమలి పట్ల ఇష్టాన్ని పెంచింది. ఆమె ఈసడించుకున్నా బాధపడడు. కోమలి తల్లి కామాక్షి మా అమ్మాయిని పెండ్లి చేసుకోండి – అన్నా స్పందించడు. ఈ మోటుపిల్లను చూసి అమృతం 'అట్లాంటి పిల్ల నీకెట్లా నచ్చింది బావా?

---

[4] తెలుగు నవల – మనోవిశ్లేషణ, పు: 66

[5] చివరకు మిగిలేది, పు: 23

[6] చలం – మ్యూజింగ్స్ , పు: 169

అని అడిగితే ''*ఏమిటో అమృతం? దానికి సమాధానం తెలిస్తే జీవిత రహస్యం తెలిసిపోవును*''[7] అని అంటాడు. కోమలి నీతి బాహ్యమైన జీవితంలో, ఆమె 'గడ్డపరక' బతుకులో ఒక నిండైన ఆప్యాయత, ఒక వ్యక్తావ్యక్తమైన స్పర్శ అతనికి దొరుకుతుంది. ''ఆ పెంట ముండతోనా సరసం – సౌందర్యానికి అసూయ చేసిన నామకరణం. దాంతో ఏం సుఖపడతావు బావా – పాపం సుఖపడడం అంటే మనుషులకంత భయం. ఎవరూ ఆచరించలేని ఉన్నత ఆదర్శాలు మాకక్కర లేదు. మాకు రెండో రకం చవకవి – యిప్పించండి. భరింపరాని మహత్తర సౌందర్యం – బాబోయ్ మాకొద్దు. కోమలి హిందూ స్త్రీ కాదు. కోమలి అసలు స్త్రీ యే కాదు. అన్ని శక్తుల్ని తనలో కలుపుకొని దహించి వేసే ఒక జ్వాల – సంప్రదాయం – ఆచారాలు – నైతిక విలువలు. కట్టుబాట్లు అన్నిటినీ ముంచెత్తి వేసే మహా సముద్రంలోని అఘాతం – అందుకనే లోపలికి వెళ్ళడమంటే అంత భయం''[8] అనుకుంటాడు.

దయానిధి ప్రణయ లక్షణాలలో తన వ్యక్తిత్వాన్ని రూపుదిద్దుకున్నాడు. ఈ వ్యక్తిత్వం గలవారికి కులం, మతం, హోదా, సంస్కారం మొదలైన వాటితో సంబంధం లేకుండా మనస్సుకు నచ్చిన వారికి, సంఘసూత్రాలపై ఆధారపడకుండా, అవసరమైతే తిరుగుబాటు చేసి తమ ప్రణయాన్ని కొనసాగించడం లక్ష్యం. అందుకే 'కోమలి' 'ఎలాంటిదైనా' తన ప్రణయాన్ని అడ్డుకోలేకపోయింది. కాకపోతే ఈ స్వేచ్ఛా ప్రణయ లక్షణాలు ఏమీ కోమలికి తెలియవు. దయానిధికి విపరీతమైన సౌందర్యారాధానా దృష్టి, దీని కన్నా మించింది – అతనికి కనబడదు. ఆ సౌందర్యం కోసమే కోమలిని ఆరాధించాడు. ''*చదువు లేకపోతే చెప్పించొచ్చు. సంపర్కం వల్ల సంస్కారం తెప్పించొచ్చు. ఎలా పడితే అలా తయారు చేసుకోవచ్చు. కానీ సౌందర్యం ఎక్కడ నుండి తేగలం.*''[9] అని దయానిధి అభిప్రాయం. కోమలి ఈసడించినా, లెక్కచేయక పోయినా దయానిధికి మాత్రం కోమలి పట్ల 'ఆరాధనాభావం' తగ్గదు. ఇలా సౌందర్యాన్ని ఆదర్శంగా పెట్టుకొని, సంఘనిర్మిత నియమాలకు అతీతంగా స్త్రీని కోరుకోవడం, ప్రేమించడం – అవతలివారు ఈ ప్రణయ భావాలను అంగీకరించినా, అంగీకరించక పోయినా తన మార్గాన తను స్వచ్ఛందంగా ప్రేమించుకుంటూ పోవడం భావ కవిత్వ లక్షణం. కానీ దయానిధికి తాను'కోమలి'ని ప్రేమిస్తున్నానని, ఆరాధిస్తున్నానని తెలుసు. ఎందుకు ఆరాధిస్తున్నాడో కూడ తెలుసు. 'స్త్రీ సౌందర్యం తనను ప్రేమించేలా చేస్తుందని తర్కించుకుంటాడు. లోకంలో

---

[7] చివరకు మిగిలేది, పు: 96

[8] చివరకు మిగిలేది, పు: 138 -139

[9] చివరకు మిగిలేదు, పు: 45

ఎంతోమంది అందగత్తెలుండగా – ఈ 'కోమలి'నే – ఎందుకు ప్రేమిస్తున్నావంటే – ఆమె 'గడ్డిపరక' కావడం – ఆ 'గడ్డిపరికే' తన తల్లి రూపంలో కనబడడం. సంఘం చేత నిందింప బడినది దయానిధి తల్లి. సంఘంచేత శపించబడింది కోమలి. ఈ రెండూ వ్యక్తి 'విషాదాన్ని' తెలియజేస్తాయి. కాబట్టి దయానిధి తల్లిమీద ఉండే గంభీరమైన దుఃఖాన్ని కోమలి పట్ల మహోన్నతమైన ఆరాధనగా రూపాంతరీకించుకుంటాడు.'

అప్పుడప్పుడు కేవలం కోమలి పట్ల ఆరాధనే కాకుండా ఆమె హేళన అతన్ని వివశుడ్ని చేస్తుంది. అతని సున్నిత మనస్సును గాయపరుస్తుంది. అతనిలోని అణచిపెట్టి ఉన్న కామాన్ని రేపుతుంది. చివరకు ఒకరోజు రాత్రి కోమలి దగ్గరకు డబ్బు తీసుకొని వెళ్తాడు. దయానిధి కోసం ఎదురుచూస్తూ మంచం మీద పడుకొని వుంటుంది కోమలి. ఏదో చెయ్యాలన్న తపనతో మంచం దగ్గరికి వస్తాడు కానీ ఏదో శక్తి అతనిలో ప్రవేశించి అతన్ని కార్యశూన్యుణ్ని చేసింది. ఏదో కాంతి కిరణం అతడి చీకటి హృదయాన్ని మెరుపులా వెలిగించింది. కోమలి అతనిలోకి ప్రవేశించి అన్ని తలుపులూ మూసేసినట్టు అనిపించింది. ఎక్కడ తాకినా అన్ని రేకులూ వూడిపోయే పుష్పం. వేలుతో తాకితే అంతా వొడలి పోతుంది. రంగులన్నీ పోయి నాశనమై పోతుంది. శరీరం యిది అన్యాయం. నేనే సౌందర్యం నన్ను నేను ధ్వంసం చేసుకోలేను. ఇతరులనీ ధ్వంసం చెయ్యలేను నన్ను వొదిలెయ్యి'' అంటుంది. తలకింద డబ్బు పెట్టి బయటికి వస్తాడు.

అంతకు ముందు కోమలిని చూస్తూ దయానిధి ''*సన్నటి పొడుగాటి చేతులు, మొనలన్నీ సర్దుకోని భుజాలు, మరో శరీరానికి వుద్దేశింపబడిన దానిలా కనబడే సన్నటి నడుం, సన్నగిలటం మానుకొని వ్యాపించిన చోట, ఏ చీర పడేసినా, చిలక్కొయ్యలా పట్టుకొనేల వొంకర, వికసించటం ప్రారంభించినట్లుగా వుండి, స్ఫుటమైన ఆకృతి తెచ్చుకొని మొగపిల్లాడి రొమ్ములు, పూర్ణచంద్రుడికి అడ్డం వొల్చిన పల్చటి మేఘం లాంటి మెత్తటి శరీరచ్ఛాయ*''[10] అని ఆమె రూప చిత్రణ చేసుకుంటాడు. ఆమె రూపాన్ని ఎంతగా వర్ణించినా దయానిధికి తనివి తీరదు. ఆమె జుట్టును 'చింపిరి జుట్టు' యిష్టం వచ్చినట్లుగా అరణ్యంలో సహజత్వాన్ని అనుకరిస్తున్నట్లు పెరిగిపోయి ''ఎక్కడా పాపిడికి లొంగదనుకుంటాడు. ఇంతగా ఆమె శరీరాన్ని వర్ణించిన దయానిధి ఆమెతో శారీరక సంపర్కం పెట్టుకోలేకపోతాడు.

నిజానికి ఆమెను అతడు కామించాడు. ఆమెను పొందేందుకు అతనికి అనేక అవకాశాలు వచ్చాయి. కానీ పొందలేకపోయాడు. ఆమెను ప్రేమించాడు కూడా. ఆమెలోని నీతి బాహ్యతపై

---

[10] చివరకు మిగిలేది, పు: 22

అతనికి ద్వేషం లేకుండా పోలేదు. దయానిధిలో మానసిక సంఘర్షణ అతన్ని కోమలి పట్ల నిర్వీర్యున్ని చేస్తుంది. ఈ సంఘర్షణను తనకు తానుగా పరీక్షకు పెట్టుకుంటాడు దయానిధి. కోమలి అంటే తనకు కామం కాదనీ, ప్రేమ మాత్రమేనని తనను తాను నమ్మించుకోజూస్తాడు. ''*కాలిపొయ్యే నుదురు మండి పొయ్యే పెదవులు, కోసేసే రొమ్ములూ అలసిపోయిన మూల్గూ, శృంగారం లేని రోదనా, యివి కావు కోమలి ప్రేమ చిహ్నాలు. ఆమె ఎక్కడికి వెళ్ళినా, ఎవరి హస్తాల్లో నలిగిపోయినా, ఏ దౌర్భాగ్యుడి శిక్షణలో వొంపులు పోగొట్టుకున్నా, ఆమె హృదయం, దృష్టి, మానసిక వైరాగ్యం, అన్నీ నాకోసం కాచుకోని వుంటాయి.''*[11] అని ''*నాకు చంద్రుడు, నక్షత్రాలు, మేఘాలు, హిమాలయ పర్వత శిఖరం, కోమలి, అందరూ సమానులే. ఇవి లేకపోతే నేను జీవించలేను. కానీ వాటిని కాంక్షించలేను. ప్రేమిస్తాను.''*[12] అంటాడు. కోమలి దయానిధి చైతన్యంలోని సౌందర్యారాధనకు ప్రతీక. తన ఆదర్శమైన సౌందర్యానికి బాహిర రూపంగా కోమలిని ఊహించుకుంటాడు. స్వేచ్ఛా ప్రణయ చిహ్నాలు దయానిధిలో కనిపించినా – కోమలిలో తన తల్లి నీడను చూస్తూ శరీర గత సౌందర్యం దగ్గర ఆగిపోకుండా, సృష్టిలోని సౌందర్యానికంతటికీ కోమలే ప్రతినిధిగా భావిస్తాడు. దయానిధిని 'శక్తిహీనుణ్ని, కార్యశూరుణ్ని చేసే తన్మయత కోమలిది. ఈ సౌందర్యాన్ని సొంతం చేసుకోవాలనే ఆలోచన దయానిధిది కాదు.

దయానిధి ఆత్మనుశీలనం చేసుకునే సందర్భంలో ఒక్కోసారి కోమలిపై ప్రేమతో పాటు ద్వేషం కూడ కనిపిస్తుంది. సామాజిక పరంగా కోమలి కుంటుంబం, అనైతికమైనది. సమాజములోని ఉన్నత విలువల పట్ల కోమలికి కనీసం అవగాహన కూడ లేదు. లోకం అంత డబ్బే అని అనుకుంటుంది. తల్లి పెంపకంలో పెరిగింది. సమాజం మొత్తం కోమలిని వేలెత్తి చూపిస్తారు. దీన్ని దయానిధి భరించలేకపోయాడు. తల్లిని ఏ సందర్భంలో పరిహసించారో, అదే విషయంలో కోమలి కూడ భాగం కావడం దయానిధి జీర్ణించుకోలేదు. ఇక్కడ ఒక్క విషయం గమనించాలి. తల్లి మీద కేవలం అనుమానమాత్రంగా అపవాదు ఉండడం కోమలి విషయంలో ప్రత్యక్షంగా కనిపించడం దయానిధిలోని 'ద్వేషా'నికి కారణం. దయానిధి దృష్టిలో తల్లి 'నిందకు బలౌతుంది. కానీ కోమలి దానిలో జీవితాన్ని పొందుతుంది. ఎంత స్వేచ్ఛా ప్రణయ సిద్ధాంతంపై మరులు ఉన్నప్పటికీ దయానిధి లాంటి సంస్కారవంతుడు కూడ దీనిని సహించలేకపోతాడు. అయితే ముందుగా కోమలిని ప్రేమిస్తున్న సందర్భంలో కోమలిని ద్వేషించే వారిపట్ల తాను అంతకంటే ద్వేషంగా ఉండేవాడు. కానీ తల్లి మరణం తర్వాత, తల్లి మరణానికి కరాణం ఆమె

[11] చివరకు మిగిలేది, పు: 85

[12] చివరకు మిగిలేది, పు:182

చరిత్ర అని లోకమంగా గట్టిగా నమ్మడం. తాను తల్లిని విపరీతంగా అభిమానించడం అనేది 'తల్లిప్రేమ'ను ఆమె అనైతిక చర్య, తన నుండి దూరం చేయలేకపోయింది. కానీ కోమలి విషయంలో తల్లి చర్యకు ప్రతిస్పందన లేనట్లుగా ఉండలేకపోయాడు. తల్లి పతనం సంఘదృష్టిలో దయానిధికి తీరని తలవంపులు తీసుకొచ్చింది. ''*దయానిధి రోమాంటిక్ హీరో కాదు. అతను ఆప్యాయత, ఆదరణ ప్రధానమైన విలువలుగా ఆశించి వాటిమీద ఆధారపడే సామాన్యుడు. అందువల్ల అతను మానసికంగా, సంఘంతో సంఘం కట్టుబాట్లతో, అభిప్రాయంతో ఘర్షణ పడతాడు. సంఘం ఆదరణనీ, అభఇమానాన్ని కోరకుండా ఉండలేడు. అవి లభించవు.*''[13] ఎవ్వర్నీ ఏమీ చేయలేక అంతర్ముఖడయ్యాడు. లోక బాధను, వెక్కిరింతల్ని తప్పించుకునేందుకు సొంతంగా 'మనో సామ్రాజ్యాన్ని' నిర్మించుకుంటాడు. అయినా దయానిధిలో తీవ్రమైన వేదన కనిపిస్తుంది. బయటకు కనిపించని ఒత్తిడి దయానిధిని అన్ని విధాలా ఒంటరిని చేస్తుంది. సంఘానికి, మనసుకు సర్ది చెప్పుకోలేకపోతాడు. ఈ సంఘర్షణకు చనిపోయిన తల్లిని ఏమీ చేయలేడు కాబట్టి. కోమలిపై తన ద్వేషాన్ని చూపాలనుకున్నాడు. తల్లిని ప్రేమించినట్లుగానే కళంకిత కోమలిని కూడ ప్రేమిస్తున్నానేమో అని ఒక్కోసరి నిస్పృహకు లోనౌతాడు. తన తల్లి ప్రవృత్తి గల కోమలిని చంపేందుకు రెండుసార్లు ప్రయత్నిస్తాడు. ఒకసారి ఊల్లో, రెండోసారి రాయలసీమలో.

'పోనీ! కోమలిని చంపేస్తే – ఆమె కలిగించిన బాధకు అదే ప్రాయశ్చిత్తం. అలాంటి వాళ్ళను చంపడం అపకారం కాదు. సంఘసేవ, ప్రపంచానికి పరమార్థం' అనుకుంటాడు. దీని వెనుక అతనికి తన తల్లిపై కోపం కనిపిస్తుంది. తన తల్లి చేసిన పాపం మీద కోపం. తన మీద తనకే కోపం. అందుచేత తన తల్లిలోని ఒక 'అంశ' అయిన కోమలిని చంపి తన మీద తనకున్న ద్వేషాన్ని చల్లార్చుకోవాలనుకున్నాడు.

మానవుడు సంఘజీవి. ఎంత కాదనుకున్న 'సంఘనీతి'కి లోబడి జీవతాన్ని ఆనందంగా నిర్మించుకోవడమే సులభం. సుఖం కూడ. అలా కాదని సంఘం మీద ద్వేషం పెంచుకోరాదు. ఈ ద్వేషం నిజానికి తమ తప్పు మీదే. తాము చేసిన తప్పును 'సంఘం' ఎలాగైనా వేలెత్తి చూపుతుంది. కట్టడి చేసే ప్రయత్నం చేస్తుంది. ఎందుకంటే అది సంఘనిర్మాణంలోని భాగం. విశృంఖలమైన స్వేచ్ఛ వ్యక్తి పతనంతోపాటు, సంఘ పతనానికి కూడ కారణమౌతుంది. దీన్ని సంఘం ఒప్పుకొనజాలదు. ఒక్కవ్యక్తి మానసిక దౌర్బల్యాన్ని కాపాడేందుకు సంఘం తనకు

[13] సాహిత్యంలో దృక్పథాలు: (పు: 232).

తానుగా బటికాజాలదు. వ్యక్తినే బలికోరుతుంది. ఇంది సంఘ మర్యాద. వ్యక్తిలోని ప్రాకృతిక లోపాలపట్ల సంఘం జాలి చూపుతుంది. చేయందిస్తుంది. నిలబెట్టుతుంది. కానీ వికృత చర్యలను ఏనాటికీ ఆమోదించదు. ఈ విషయం దయానిధికి బాగా తెలుసు. కాబట్టే ఈ ద్వేషమంతా.

అయితే ఈ ద్వేషం దయానిధి తత్వానికి సరిపోయేది కాదు. సౌందర్యారాధకుడు. స్వాప్నికుడు అయిన వ్యక్తి హృదయంలో ద్వేషం తత్కాలమైనదిగానే వుంటుంది గాని, శాశ్వతంకాదు. కోమలిని అనుభవించలేని దయానిధి ఆమెను కేవలం 'శరీరమాత్ర జీవి'గానే చూడడం లేదు. అంతకంటే ఎక్కువగానే భావిస్తాడు. కోమలిని వాంఛించడమంటే అనుభవించమని, అనుభవిస్తే ఆ వస్తువు నశిస్తుందని, ప్రేమ శాశ్వతమైనదని – నాశనం లేదని అంటాడు. కోమలితో శాశ్వత ప్రయాణం కోరుకున్న దయానిధికి 'అర్థాంతరం'గా ముగించడం ఇష్టం లేదు. కోమలి సమాజం తనకు సరిపడక పోవచ్చు. భౌతికంగా తమ కలయికకు ఆటంకాలు ఉండవచ్చు కాని, హృదయాల్లో ప్రేమను ఎవరూ ఏమీ చేయలేరని దయానిధికి తెలుసు.

అందుకే మార్నాడే కోమలి ఎవరో జమీందారుతో వెళ్ళిపోతే బాధపడలేదు. ''*నువ్వు ఏ వరం వల్లనో రంభ అంత అందంగా ఐతేనేం? శాపం చేత కురూపివైతేనేం? నా ప్రేమ మారదు. నేను ప్రేమిస్తోంది నిన్ను! నిన్నే! ఈ శరీకంతో సంబంధంలేని నిన్ను నేను ప్రేమిస్తున్నది.*''[14] కోమలిని ఆధారంగా చేసుకొని తాను ఏ సౌందర్యానుభూతిని పొందాలనుకుంటున్నాడో – దానికి కోమలి యొక్క శరీరం ఏ విధంగానూ సాయపడదని దయానిధి గ్రహించాడు.

రాయలసీమలో ఉండగా కోమలి మళ్ళీ అతని దగ్గరకు వచ్చింది. పెళ్ళి చేసుకొమ్మని పోరు పెడుతుంది. అయితే ఈసారి కోమలి కొంత మారింది. కొంత ఆత్మ సంస్కారం అలవాటయ్యింది. భగవద్గీత పఠించి, రాట్నం తిప్పటం లాంటి కొత్త అలవాట్లు నేర్చుకుంది. పాత జీవితాన్ని వదిలి కొత్త జీవితాన్ని అనుభవిద్దామనుకుంది. అంటే పాత కోమలి, కొత్త అవతారంలో దర్శన మిచ్చింది. ఇంతకుముందు పిచ్చిపిచ్చిగా, మోటుగా, వెకిలిగా ప్రవర్తించి సమాజం చేత తిరస్కరించబడింది. ఇప్పుడు సమాజామోదిత పనులు చేయడంతో సంఘంలో భాగస్వామిగా మారి తనను తాను పునర్నిర్మించుకుంటుంది. కొంత నాగరికత కూడ అలవడింది. దయానిధి అప్పుడు 'వద్దు కోమలీ – నా ప్రేమని పంచుకొని పాడు చెయ్యకు నాకు మిగిలింది

---

[14] చలం – ప్రేమలేఖలు, పు: 223

ప్రేమ ఒక్కటే' అంటాడు. ''*కోమలికీ, దయానిధికీ వున్న సంబంధం ఒక ఎత్తు. అతగాడికీ, మేనత్త కూతురు అమృతానికీ వున్న సంబంధం మరొక ఎత్తూను. వీళ్ళిద్దరి జీవితాలను ఒక వృత్తంగా గీస్తే, దానిని కేంద్ర బిందువుగా దయానిధి ఉంటాడు. అయితే చిత్రం ఏమిటంటే కోమలితో దయానిధికి వున్న సంబంధం కోమలికి సంబంధించినదిగా ప్రారంభమై, ఉన్నతమైన ప్రేమగా ముగుస్తుంది. మరి అమృతానికీ – దయానిధికీ వున్న సంబంధం పవిత్రమైన (?) ప్రేమగా ప్రారంభమై 'కామం'గా ముగుస్తుంది. ఆద్యంతాల మాట ఎలావున్నా – వాళ్ళిద్దరి బ్రతుకుల విషయంలో దయానిధి నడిచిన త్రోవ మాత్రం ఒక్కటే!*''[15] అంటే దయానిధి ప్రేమ శారీరక అవధులు దాటి, మనో ప్రపంచంలో ఆత్మల ఏకత్వం కోసం ప్రయాణిస్తుంది. ఇక్కడ కోమలి ఉన్నా కూడా దయానిధిలో పెద్దగా పరివర్తన కనిపించే అవకాశం లేదు.

దయానిధి తల్లి విగ్రహం కుడిచెయ్యి దగ్గర విరిగిపోయింది. మోహం మీద పై నుండి క్రింది వరకు పగులు కనబడింది. అది చూసి 'ఆయువుపట్టు మీద కొట్టిన దెబ్బ' అనుకుంటాడు దయానిధి. రాయలసీమలో చెలరేగిన ప్రాంతీయ దురభిమానాల ఫలితంగా దయానిధి సిరిసంపదలన్నీ పోయినై. ఇల్లు తగలబడిపోయింది. కానీ 'ఏదో మిగిలింది. అంశానాశనం కాలేదు. పైకి చూసాడు. తల్లి పాలరాతి విగ్రహం విరిగిపడి వుంది. పాదాలు మాత్రం మిగిలాయి. 'అమ్మయ్య' అనుకున్నాడు. దయానిధికి పరిపూర్ణ స్వాతంత్ర్యం వచ్చింది. ''*వ్యక్తి సత్యాన్వేషణ ద్వారా పరిపూర్ణ స్వాతంత్ర్యం పొందగల్గడం, ఆ స్వతంత్రతలో మొదటి అంశం 'గతం'తో బంధం. గతం వర్తమానాన్ని నాశనం చేస్తుండడం ఈ నవలలోని అసలు సమస్య. దయానిధి జీవితాన్ని భుగ్గిచేస్తున్నదీ సమస్యే. అతని వంశచరిత్ర ప్రతిక్షణం ఖూనీ చేస్తుండడమనే సమస్యకు పరిష్కారమే ఈ నవలా రచన. 'గతం ఎలా వర్తమానాన్ని కబళించి వేస్తుందో అతడు 'నిజం'గా అవగాహన చేసికున్న క్షణం పరిపూర్ణ స్వాతంత్ర్యం పొందాడు. ఆ అవగాహన కానివాడు సుశీల నుంచి దూరం వెళ్ళాడు. వివాహం చేసుకొని కూడ ఇందిరతో కాపురం చేయలేకపోయాడు. క్లబ్బులో ఎవరో పనికిమాలిన వాళ్ళు గతాన్ని జ్ఞాపకం చేస్తే తట్టుకోలేక ఆ ఊరూ, ఆ ప్రాంతం వదిలి పారిపోయాడు. రాజభూషణం జ్ఞాపకం చేస్తే అతణ్ణి కొట్టేటంత కోపంలో అశాంతుడౌతాడు. కాని చివరకు 'దాన్నం'తా తెలిసికొంటాడు. గతం విచ్చుకుంటుంది. అందుకే ఆకాశం నిర్మలంగా వుంది చంద్రుడు లేడు మేఘాలూ లేవు*''[16] అన్న ద్వంద్వాతీత స్థితిని అనుభవిస్తూ స్వతంత్రుడౌతాడు. విగ్రహం పూర్తిగా ధ్వంసం అయితే భ్రాంతి పోయిందని అర్థం.

---

[15] తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణం, పు: 160

[16] శ్రీ జిడ్డు కృష్ణమూర్తి తత్త్వం – చివరకు మిగిలేది, పు: 22-23

పాదాలు మాత్రమే మిగిలాయి అంటే, ఒక కొడుకు తల్లిపై చూపించాల్సిన భక్తి, గౌరవాలు మాత్రం మిగిలాయి. ఇప్పుడు కోమలిని మనస్ఫూర్తిగా స్వీకరించాడు. కోమలితో, 'కోమలీ, నాకు మనుషులన్నా, సంఘం అన్నా, యింతవరకు భయం ఉండేది. యివాళ ఆ భయం పోయింది' అంటాడు. కోమలితో జీవితాన్ని గడిపేందుకు దయానిధి సిద్ధపడతాడు. ''*ఆమె తను వదుల్చుకోలేని గత జీవితానుభూతి వంటిది తనువద్దన్నా కావాలన్నా తనలో ఉండే సత్యం, ఆమెతో సంభాషణ తనని తాను విమర్శించుకున్నట్లు ఉంటుంది. ఒక విధంగా ఆమె శరీరం తను ఆత్మ*''[17] అంతా మీకోసం అట్టే పెట్టుకున్నాను అనడంలో ఆమె మనస్తత్వం దయానిధిపై ప్రేమ కనబడతాయి. దయానిధికి అన్ని పనులలో సాయపడుతుంది. దయానిధికి తాను తప్ప మరెవ్వరూ పనికిరారని గ్రహిస్తుంది. దయానిధికి ఇష్టం వచ్చిన రీతిలోనే తాను ఉండేందుకు సిద్ధపడుతుంది. కోమలి ప్రేమ, ఈర్ష్యకు, అసూయకు అతీతమైనది.

జీవితంలో అనేక అనుభవాలు పొందిన దయానిధి చివరికి కోమలితో నడుస్తూ ''*వెలుగును చూసాడు. శ్మశానంలో మానవ హృదయంలో ద్వేషం ఎక్కడుందో కనుక్కున్నాడు. తనకేం కావాలో తెలియనప్పుడు మానవుడు ద్వేషిస్తాడు. ఏం కావాలో తెలిస్తే, ఆ వస్తువును ప్రేమించి దాన్ని పొందడం కోసం ప్రయత్నిస్తాడు. అది తేలనప్పుడు హృదయంలో మిగిలేది ద్వేషం*''[18] దయానిధికి ద్వేషం లేదు. అతనికి ఏది కావాలో అది దొరుకుతుంది. చివర్లో మనిషిలో ద్వేషం ఎక్కడుందో దయానిధి తెలుసుకొని ద్వేషాన్ని తొలగించుకుంటాడు. ద్వేష రహితుడైన దయానిధికి వైకుంఠం మాస్టారు చనిపోతూ ఇచ్చిన సందేశం ''*సంఘాన్ని మార్చలేదు. మనుషుల్ని మార్చలేదు. మారిస్తే బాధ, పగ, యుద్ధం. తనలో తాను సమాధానపడాలి. అది యీ నాటికి సాధించాడు. ఒక ప్రశాంతత, పవిత్రమైన మహత్తర ఆనందం, అతనిలో ఉద్భవించింది*''[19] దయానిధికి జీవితంపై నిరాశలేదు. సత్యాన్ని కనుగొన్నానన్న తృప్తి తప్ప.

### 4.4.5 దయానిధి – అమృతంపట్ల వ్యక్తావ్యక్త భావనలు:

దయానిధి జీవితంలో మరో అతి ముఖ్యమైన వ్యక్తి, అమృతం. దయానిధి తల్లి మరణించినపుడు పలకరించిపోదామని వచ్చిన చుట్టాలమ్మాయి. సెలవులకు ఇంటికి వచ్చిన దయానిధితో మంచి స్నేహమేర్పడుతుంది అమృతానికి. తల్లి గురించి అందరూ హేళనగా

---

[17] సాహిత్యంలో దృక్పథాలు, పు: 229

[18] చివరకు మిగిలేది, పు: 206

[19] చివరకు మిగిలేది, పు: 214

మాట్లాడుతుంటే అమృతం ఒక్కటే దయానిధి వైపు నిలుస్తుంది. అతనికి ఓదార్పునిస్తుంది. హృదయపూర్వకమైన సానుభూతిని ప్రకటిస్తుంది. 'నీలాంటి ఔదార్యం, సానుభూతి అందరికీ వుంటే ఈ సంఘం స్వర్గంగా మారును 'అమృతం' అంటాడు దయానిధి. అమృతం దయ గల మనిషి. లోకం పోకడను బాగా అర్థం చేసుకున్న వ్యక్తి. ప్రత్యేకించి దయానిధి తల్లి గురించి సుశీల, నరసమ్మ గారలను వ్యతిరేకించి మాట్లాడడంతో దయానిధికి అమృతం అంటే ఇష్టం కలుగుతుంది. దగ్గరి వ్యక్తిలా తోస్తుంది. అమృతం గురించి గోవిందరావు, కోమలిలు కూడ సదభిప్రాయం వ్యక్తం చేయడం దయానిధికి ఊరటనిస్తుంది. లోకమంతా తనకు వ్యతిరేకంగా నడుచుకుంటున్నప్పుడు, అందరూ తనని వేలెత్తి చూపిస్తున్నప్పుడు దయతో, ప్రేమతో – మాట్లాడేవారే కరువైనప్పుడు దయానిధికి అమృతంలా దొరుకుతుంది. అమృతం – సామాజిక సంబంధాలు పూర్తిగా శిథాలమైపోతున్న దశలో – వాటిని జాగ్రత్తగా పునఃనిర్మించేందుకు దయానిధి జీవితంలో ప్రవేశించింది అమృతం. అమృతం చర్యలు కూడ దయానిధిని ఆకర్షించే విధంగానే ఉంటాయి. తాను ఏ చీరకట్టుకున్నా దయానిధి అభిప్రాయాన్ని తెలుసుకోగోరుతుంది. చీరలో తానెలా ఉన్నానని – చీర తనకెలా ఉన్నదని ఇది అమృతంలో దయానిధి పట్ల ఉన్న ప్రణయభావాన్ని సూచిస్తుంది. దయానిధికి కనిపించే అమృతం రూపం ''*మిసమిసలాడే ఛామనఛాయ, గంభీరమైన కళ్ళు, ఉంగరాలు తిరిగి మెడంతా ఆవరించుకున్న పెద్ద జుట్టూ, బలమైన నడుం, గట్టిగా గుండ్రంగా వుండే భుజాలు, అన్నింటికంటే ఆకర్షణీయమైన వక్షస్థలం*''[20] దయానిధికి అమృతం పట్ల ఉన్న దృష్టి తెలుస్తుంది. తల్లి గురించి తనతో అనుకూలంగా ప్రవర్తిస్తున్న అమృతం తను కోమలి స్నేహం కోసం ప్రయత్నిస్తుంటే కూడ అడ్డురాకపోవటం. దయానిధికి తల్లి ఇచ్చిన ప్రోత్సాహంలాగే కనబడుతుంది.

అమృతానికి వివాహమై సాంసారిక జీవితంలో పడిపోతుంది. దయానిధిని ముందు అమృతం ప్రేమించలేదు. కానీ, గాఢంగానే అభిమానించింది. ఆ అభిమానం వల్ల అతని దగ్గరకు తరచు రాకపోకలు సాగించింది. ఒక ఆకస్మిక, బలహీన సందర్భంలో దయానిధితో లైంగిక సంబంధాన్ని ఏర్పరచుకుంటుంది. అమృతంది నిజానికి 'బలహీన వ్యక్తిత్వం' గల మనిషి కాదు. కానీ దయానిధి పట్ల స్నేహం – సానుభూతి అమృతాన్ని అందుకు ప్రేరేపించాయి. ఈ సంఘటన దయానిధిలోని స్తబ్ధతను తొలగించింది. ''*కోమలి వ్యవహారంలో అడుగు ముందుకు వెయ్యలేకపోయిన దయానిధి అమృతం విషయంలో తెగింపు చెయ్యడానికి కారణం –*

[20] చివరకు మిగిలేది, పు: 51

*అమృతంలో తల్లి మూర్తి అధికంగా వుండడమే. 'తల్లిలాంటి' అమృతం తెగించి తప్పటడుగు లేసేసరికి దయానిధికి అచ్చంగా తన తల్లి సాక్షాత్కరించి నట్లయింది.... అమృతంలో వున్నది తల్లి ''వెలుగు'' అయితే. కోమలిలో వున్నది ఆ వెలుగు యొక్క 'నీడ' అనిపించేది దయానిధికి. అయితే అమృతం చేసిన తెగింపులో ''వెలుగు – నీడ''ల సమన్వయం లభించింది.''*[21] ఈ సంబంధాన్ని కొనసాగించే ఉద్దేశం అమృతంలో కనబడదు. అమృతం ఉద్దేశం సంతానం. ఆమెకు భర్త ప్రేమ లేదు. సంతానమన్నా ఉంటే ఈ సంసారాన్ని యింకొంచెం సుఖంగా చేసుకోవచ్చని అమృతం ఆలోచన. పిల్లలు లేని అమృతానికి, జీవితం శూన్యంగా కనిపించింది. అమృతంలోని దిగులుకూ, విషాదానికి కూడ ఇది ఒక కారణం కాబట్టే దయానిధిలో సంపర్కం పెట్టుకుంది. రచయిత అమృతం దిగులును వర్ణిస్తూ, అమృతం దిగులుగా ఏదో మనోవ్యాధితో వున్న దానకి మల్లే వుంటుంది. మోహంలో విషాదం వుంది. నవ్వుతుంటే రాజ్యవినాశనం జరిగిన తర్వాత శిథిలాలను చూసి వొకప్పుడు మనోవైభవం అనుభవించిన రాణి నవ్వడంలా నిండుగా, బరువుగా, ఠీవిగా వుంటుంది.''[22] అంటాడు. దయానిధి ముందు అమృతాన్ని చూసినపుడు శృంగార దృష్టి ఉంటుంది. తర్వాత పిక్నిక్కు వెళ్ళినప్పుడు అమృతాన్ని చూస్తున్న దయానిధికి *''....రాతి శిధిలాల మధ్య వుండవల్సింది అమృతం. ఎక్కడో ఏ హంపీలోనో.... అన్నీ రాళ్ళు భగ్నప్రతిమలు, వొంటరిగా నిల్చిపోయిన స్తంభాలు ప్రేమకోసం గండెరాయి చేసుకున్న రాకుమార్తెల విగ్రహాలన్నీ శిధిలమైపోయి, ఏ అర్ధరాత్రో అడుగుల చప్పుడూ నిట్టూర్పు వినబడితే కదులుతాయోమోననిపించే ప్రమాద స్థితిలో పడివుంటే వాటి మధ్య అమృతం కూచుని విషాదంతో నవ్వుతుంది. ఆమె గడిచిపోయిన అనుభవపు వైభవాలను తల్చుకొని ఏడ్చిఏడ్చి, అతీతం ఐనప్పుడు కన్నీరు చుక్కలు చుక్కలుగా రొమ్ముల మధ్య నుంచి జారిపోయి యీనాటి నదిగా ప్రవహిస్తోంది. తన దుఃఖం నదులైపొంగి పొంగి దేశాన్ని ముంచివేస్తుంది – తప్పు. తను ఏడ్వకూడదు. విషాదంతో నవ్వుతుంది. ఆనాడు సౌందర్యం తన యాత్ర ముగించుకొని ఆమెను శిలగా మార్చివేసింది. ఏ రాతిని నిట్టూర్పుతో కదిల్చినా అమృతం కలలో కార్చిన కన్నీరల్లే నీరైపోతుంది''*[23] అని కనిపిస్తుంది. అమృతంలోని ఈ దిగులుకు కారణం పిల్లలు లేకపోవడం, సంసార జీవితంలో ఆనందం లేకపోవడం, భర్తకు తనపట్ల ప్రేమలేకపోవడం, వేరే అమ్మాయితో భర్తకు సంబంధం ఉండడం లాంటివి కనపిస్తాయి.

---

[21] తెలుగు నవలా సాహిత్యంలో మనో విశ్లేషణం, పు:165

[22] చివరకు మిగిలేది,పు: 57

[23] చివరకు మిగిలేది, పు: 124

అమృతం అన్ని తెలిసిన మనిషి. ప్రేమించడం, ఆరాధించడం అందంగా తయారవడం, తన అందాన్ని అందరూ గుర్తించాలనుకోవడం, బాధ్యత తీసుకోవడం, వాదించడం. ఓదార్పునివ్వడం ఇవన్నీ అమృతంలో ఉన్నాయి. స్థిరమైన మనిషి. తనకేం కావాలో, తనేం చేయాలో, ఎవరికి ఏం ఇవ్వాలో ఎలా ప్రవర్తించాలో అన్ని తెలుసు. అయినా వివాహబంధంలో సుఖం లేకపోవడం అమృతానికి దిగులుగా ఉంది. ఆ దిగులు పోవాలంటే తనకు సంతానం కావాలి అంతే. అమృతం హృదయంలో ఆనందం ఉంది. కానీ జీవితంలో లేదు. జీవితంలో కూడ ఆనందం కావాలంటే సమాజం దృష్టిలో తాను తల్లి కావాలి. భారత కుటుంబంలో భార్య వ్యక్తిత్వం లేనిది కాదు. కుటుంబ జీవితంలో ఆమెకు భర్త కంటే ఎక్కువ బాధ్యతలు ఉంటాయి. ప్రకృతి సిద్ధంగా రూపొందే మాతృత్వం లాంటి స్థితులు పురుషుడికంటే స్త్రీకి గల గురుతర స్థానాన్నే సూచిస్తుంది. భార్యకి భారతీయ సంస్కృతి అధికారరూపంలో తక్కువస్థానం ఇవ్వవచ్చు. మాత కాగానే ఆమెకు లభించే హోదా చాలా గొప్పది. దేవమూర్తికి పూర్ణత్వం దేవీమూర్తిలోనే సిద్ధిస్తుందనే సత్యం ఈ విషయాన్ని తెలుపుతుంది. ఇటు తల్లయి తనను తాను గెలిపించుకుంటూ తన లాంటి పరిస్థితిలో ఉన్న దయానిధిలోని 'స్తబ్ధత'ను కూడ దూరం చేయాలనుకుంటుంది.

దయానిధికి పెళ్ళయినా భార్యతో ఏనాడూ కాపురం చేయలేదు. దయానిధి 'పురుషత్వం' ఇంకా సుప్తావస్థలోనే ఉంది. ఇది దయానిధికి సంఘం పట్ల వ్యతిరేక భావాల్ని నింపుతుంది. దయానిధిలో 'అంతర్ముఖీనత' ఎక్కువౌతుంది. దీన్ని చెరిపివేయాలి. దయానిధికే స్వేచ్ఛనివ్వాలి. సంతోషాన్నివ్వాలి. ''*సుఖమూ, బాధ ఈ రెండే విలువలు ఏదయినా సరే. ఏ యత్నమైనా అన్నీ, అన్నీ విడతీసి చూస్తే చివరికి మిగిలే అసలు విలువలు బాధనించి తప్పించుకోవడమూ, సుఖాన్ని అనుభవించడమూ*''[24] కాబట్టే అమృతం దయానిధితో కలిసింది. పెళ్ళయి సంసారం చేసుకుంటున్న స్త్రీ పరాయి పురుషునితో సంపర్కం పెట్టుకోవడం సంఘం దృష్టిలో అనైతికమైనా తన పట్ల కుటుంబం తీసుకోవాల్సిన బాధ్యత తీసుకోలేకపోయినా, తన వాళ్ళు అనైతికంగా ప్రవర్తించినా, సమాజం దాన్ని సరిదిద్దే ప్రయత్నం చేయకపోయినా – వ్యక్తులు సామాజిక దృష్టిని పోగొట్టుకొని వ్యక్తిగత ఆనందమే తక్షణంగా భావిస్తారు. అమృతం అదే చేసింది. ''*...అమృతం దయానిధి జీవితంలో పాటు పంచుకోవాలనీ, అతడు తనవాడు కావాలనీ కోరదు! ఆమె లౌకికమైన వ్యవస్థలకూ, కట్టుబాట్లకూ, నీతికీ విధేయురాలు. సామాన్య సంసారిణి, కాని ఆమెలోని మానవత్వం, స్త్రీత్వం, అన్నింటికీ అతీతమైంది. దాన్ని ఏ ఆదర్శాలు ఏ*

---

[24] చలం – మ్యూజింగ్స్ , పు: 370

*'రొమాంటిసిజమ్' యిదమిత్థమని నిర్వచించలేవు. శాసించలేవు! అమృతం ప్రకృతి (Nature) వంటిది''*[25] తన కోరిక దయానిధి ద్వారా తీరిన తర్వాత సమాజం పట్ల, కుటుంబం పట్ల నిరసన తొలిగిపోయాయి. దయానిధితో సంబంధం కూడ ఆమెకు అవసరం లేదు. కాబట్టి వైవాహిక వ్యవస్థ యిచ్చే రక్షణలో నిశ్చింతగా వుండిపోయింది.

అమృతానికి, దయానిధి తన అంతరాంతరాలలో ఉన్న కామవాంఛకు ప్రతిరూపం. దయానిధి ఏమనుకుంటున్నాడో అమృతంలో ఆత్మోన్నత్యాన్ని గుర్తించే ప్రేమను దయానిధి వాంఛించాడు. కానీ మధ్యలో జరిగిన ఈ సంఘటన అతన్ని 'శారీరకపుటవధుల్ని' దాటనీయలేకపోయింది. అతని విశాలత్వాన్ని కుదింపజేసింది. తెలియకుండానే అమృతం దయానిధికి స్వేచ్ఛనిచ్చాననుకుంది. కానీ కాళ్ళకు బంధం వేసింది. మళ్ళీ ఏలూరుకు 'కూతురు' మిషతో వచ్చిన దయానిధికి ఆ బంధం తెగిపోయింది. *''అమృతంతో శారీరక సంబంధం పెట్టుకోవడం వల్ల దయానిధి జీవించదలచుకొన్న, ఆచరణలో కొంతగానయిన చూపించగలిగిన 'సృజనాత్మక జీవితాన్ని' దెబ్బతీసిన అంశాలు, స్వతంత్రంగా ఏ నియమాలకు సంస్థలకు లొంగకుండా బ్రతకదలచుకున్న దయానిధి తాత్కాలికంగానైనా, స్వల్పంగానయినా భయాలకు, సందేహాలకు లోను చెయ్యగలిగింది ఈ సంబంధమే. కృష్ణమూర్తి (జిడ్డుకృష్ణమూర్తి) 'మనం ప్రేమించం కాబట్టి ఇంద్రియ లోలత్వపు అన్వేషణ అయిన కామం దహించివేసే సమస్య అయింది అంటాడు. అమృతంతో సంబంధం ఏర్పడ్డాక దయానిధి ఈ సత్యాన్ని గుర్తించినట్టు కనబడుతుంది. గుర్తించాడు కనుకనే ప్రేమించే లక్షణాన్ని అభివృద్ధి చేసుకొని కామాన్ని జయించే ప్రయత్నం తనకు తెలియకుండానే చేశాడనిపిస్తుంది. అట్లా అనిపించడానికి కామంతో నిమిత్తం లేకుండా కోమలిని ప్రేమించడానికి దయానిధి తెలియచేసిన ప్రయత్నం నిదర్శనంగా వుంది.''*[26]

### 4.4.6 దయానిధి – ఇందిర దాంపత్య సంబంధాలు:

దయానిధి భార్య ఇందిర మాధవయ్య గారి పెద్ద కూతురు. తండ్రి, కూతురుకు ఇంటి వద్దనే చదువు చెప్పిస్తాడు. సంగీతంలో కూడా ప్రవేశం ఉంది ఇందిరకు. దయానిధి మామగారు పోలీసు డిపార్టుమెంటు మనిషి. బ్రిటీష్ ప్రభుత్వానికి అనుకూలమైన వ్యక్తి. రావు బహద్దూర్ బిరుదుకోసం ఎదురుచూస్తున్న పోలీసు. ఆస్తులు సంపాదించడంలో, రౌడీమూకల్ని కట్టడి చేయడంలో, ప్రభుత్వం కనుసన్నల్లో నడవడంలో మాధవయ్య ఘటికుడు. కూతురు పెళ్ళి సందర్భంగా ఒక వైపు అపురూపానందస్వామి చేత గీతా రహస్య బోధనా కార్యక్రమం, మరోవైపు

---

[25] సాహిత్యంలో దృక్పథాలు, పు: 228

[26] చివరకు మిగిలేది – మానసిక సామాజిక జీవన స్రవంతి – నవలా విమర్శ, పు: 271

'పెద్దాపురం భోగం మేళం' ఏర్పాటు చేస్తాడు. అల్లుడు బి.ఎ. అయితే పోలీసు డిపార్టుమెంటులో చేర్చి 'రావుబహద్దూరు'ను చేద్దామని ఉద్దేశం.

ఇందిర తండ్రి చాటు కూతురు. అందమైనది. 'ఇందిర ఇందీవర శ్యామలా సింహం లాంటి నడుముతో, శంఖం లాంటి మెడతో మధ్య ముక్కు అడ్డం వచ్చింది కానీ లేకపోతే ఒకే కన్నులాగుండే నేత్రద్వయం'లో మెరిసి పోతుంటుంది. పెళ్ళిపీటల మీద భయంతో, సిగ్గుతో కూర్చున్న ఇందిర దయానిధిని తీర్చిన కనుబొమ్మలు, చిత్రమైన బొట్టు, వొంకర తిరిగిన చెక్కిళ్ళు, రేగిపోయి భుజాలమీదికి జారిపోయిన వుంగరాల జుట్టు – సిగ్గుతో భయంతో వొణికి పోతున్న ఆమె పెదవుల'తో కనిపిస్తుంది. మొదటిరాత్రే ఇందిర అసంకల్పితంగా 'దయానిధి తల్లి' ప్రస్తావన తెస్తుంది. దయానిధి అవమానంతో బయటికి వెళ్ళిపోతాడు. ఇది దయానిధి వైవాహిక జీవితంలో తొలి చేదు అనుభవం.

దయానిధి స్వాతంత్ర్యోద్యమానికి సంబంధించిన మీటింగ్ లో పాల్గొంటాడు. సభను పోలీసులు చెల్లాచెదరు చేస్తారు. ప్రజల్ని కొట్టి హింసిస్తారు. దయానిధి మామ దయానిధిని పారిపొమ్మని చెప్తాడు. కానీ, దయానిధి అందుకు అంగీకరించడు. దెబ్బలు తిని ఆస్పత్రి పాలౌతాడు. దీన్తో మామగారికి అల్లుడికి చెడుతుంది. దయానిధి సూక్ష్మంగా ఆలోచించే మనిషి. ఆయన దృష్టిలో మామ జాతీయోద్యమాన్ని సమర్థించినా బాగుండేది లేదా పర ప్రభుత్వాన్నైనా కనీసం నిజాయితీగా సేవించి వుంటే మనిషిగా గుర్తించేవాడు. ఆయన బిరుదుల కోసం పనిచేస్తున్నాడని ఉద్యోగంలో బంధుత్వాన్ని పాటిస్తున్నాడని దయానిధి ఆవేదన చెందుతాడు. దయానిధికి మామలో నిజాయితీ లేకపోవడం నచ్చలేదు. ఆత్మవంచన, పరవంచన నిండిన మామ వ్యక్తిత్వాన్ని సహించలేకపోయాడు.

దెబ్బలు తగిలి ఆస్పత్రిలో ఉన్నప్పుడు, ఇందిర దయానిధిని చూసేందుకు వెల్తుంది. దయానిధిని కలువకముందే ఆమె తండ్రి ఆమెను వెనక్కి పిలిపించుకుంటాడు. ఈ విషయం తెలిసిన దయానిధికి ఇందిరపై ప్రేమ చచ్చిపోతుంది. ఇదే ఆఖరు అనుకుంటాడు. జీవితంలో ఇందిరను కలవకూడదని ''*తల్లిదండ్రుల చెప్పుచేతల్లో పెరిగి, వ్యక్తిత్వం లేని – అమాయకురాలు ఇందిర వాళ్ళ క్షేమం కోసం తన సౌఖ్యాన్ని త్యాగం చేసుకుంటుంది.*'' అని ఇందిర గురించి బాధ పడ్డాడు. ఇందులో ఇందిర తప్పేమీ కనిపించదు. కానీ, తల్లిదండ్రుల పెంపకంలో పెరిగిన అమ్మాయి, పైగా పోలీస్ డిపార్ట్ మెంటులోని వ్యక్తి కూతురు. తండ్రిని ఎదిరించే ధైర్యం, సాహసం ఆమెకు లేకపోయినవి. ఆమె పట్ల దయానిధి కొంత సానుభూతి చూపితే కథ వేరేలా ఉండేది కానీ, దయానిధి సంఘ నియమిత సూత్రాల్లో ఇమడడు. జాతీయోద్యమంలో పాల్గొనే వ్యక్తి

పరాయి ప్రభుత్వం ద్వారా సానుభూతి పొందదు. దయానిధి వ్యక్తిత్వం విచిత్రమైనది – విశిష్టమైనదీ. కాంగ్రెస్ తో సంబంధం పెట్టుకున్న అల్లునితో సంబంధాలు పెట్టుకోకుండా కూతుర్ని కాపురానికి పంపకుండా మాధవయ్య కట్టడి చేసాడు. భార్యపై అసహనంలో ఉన్న దయానిధికి ఈ చర్య అతని జీవితాన్నే కుదిపివేసింది.

దయానిధి ఏలూరులో ఉండగా పెద్దనాన్నతో అక్కడికి వెళ్ళిన ఇందిర అతను తనతో వచ్చి, తండ్రికి చెప్పి తనను కాపురానికి తెచ్చుకోవాలన్న కోరికను వ్యక్తం చేస్తుంది. ఇక్కడ ఇందిర పాత్రలోని ఔన్నత్యాన్ని గమనించవచ్చు. కేవలం తండ్రి దాష్టీకం, మూర్ఖత్వం వల్ల తమ ఇద్దరి మధ్య భేదాభిప్రాయాలు వచ్చాయని తెలుసుకొని, భర్తతో ప్రాధేయపడుతుంది. అదే సమయంలో తండ్రికి చెప్పి తనను తీసుకెళ్ళమంటుంది. దయానిధి దీనికి అంగీకరించడు. భర్తగా దయానిధి భార్య పట్ల ఇంతగా 'విపరీతం'గా ప్రవర్తించనవసరం లేదు. తిట్టినా గేలిచేసినా 'కోమలి' సాంగత్యం కోరే దయానిధి – అగ్నిసాక్షిగా వివాహం చేసుకున్న భార్య పట్ల, ఇంత నిర్దయగా మెలగనవసరం లేదు. ఒక మెట్టు దిగి – భార్యను కాపురానికి తెచ్చుకుంటే – దయానిధి గౌరవానికి, అతని వ్యక్తిత్వానికి ఎక్కడైనా భంగం కలిగేదా! ఎవరిమీదనో, తీరని కసిని ఇలా అమాయకమైన భార్య విషయంలో చూపించడం నిజంగా దయానిధి జీవితంలో మచ్చలాంటిదే. ఇద్దరు విరుద్ధ వ్యక్తుల, వ్యక్తిత్వాల నడుమ ఇందిర నలిగిపోయింది. తనను తాను వెతుక్కునే ప్రయత్నంలో దయానిధి ప్రయాణం సాగితే, తనకు తానుగా కోల్పోయిన ఇందిర ప్రయాణం 'వివాహం'తోనే ఆగిపోయింది. తన జీవిత గమ్యాన్ని తాను నిర్దేశించుకునే అవకాశం లేని జీవితం ఇందిరది.

ఇందిర జీవితం చివరి దశలో ఉండగా దయానిధి వెళ్తాడు. ఇందిర దయానిధితో ఏనాడూ కాపురం చేయకపోయినా, చివరిక్షణాల్లో భర్తకు తనకు తాను అర్పించుకుంటుంది. దయానిధికి తన పుట్టుకమీద, జీవన విధానం మీద ఎప్పుడూ అగౌరవమే. తల్లి సంఘంలో చెడిపోయినది. చెడిపోయిన వ్యక్తి సంతానంగా, తనను తాను వివాహవ్యవస్థలో ఇమడని వ్యక్తిగా ప్రయాణం సాగించాడు. అందుకే కోమలిని వివాహం చేసుకోలేదు. తనలో అణగివున్న కోర్కెలను తీర్చుకునేందుకు పెళ్ళయిన అమృతం సాయం తీసుకున్నాడు. ఈ రెండు విషయాల్లో దయానిధికి 'వివాహం' ఇచ్చే మానసిక తృప్తిని, శారీరక తృప్తిని అందుకోగలిగాడు. ఇందిర అతనిలోని ఆత్మన్యూనతా భావాన్ని 'తన సమర్పణ'తో పోగొట్టింది. వివాహం దయానిధి జీవితంలో వైఫల్యం కాదని సాఫల్యమేనని నిరూపించింది. ''*ఇందిర పాత్ర భారత స్త్రీకి పాతివ్రత్య భావం కలిగిన శక్తిని ఆధునిక రూపంలో వ్యక్తం చేసింది. అందువల్లనే దయానిధి తిరిగి తిరిగి ఆ*

*బిందువు దగ్గరకే వచ్చి తన్నుతాను పోల్చుకున్నాడు.''*[27] దయానిధి చివరకు దీనిని గ్రహించాడు. ''*స్త్రీ పురుష సంబంధాలలోని వున్నత విలువలు వివాహవ్యవస్థలో కూడా సాధించటానికి వీలుందని ఇందిర ఋజువుచేసి పోయింది. వివాహ వ్యవస్థ ద్వారా ఒకచోట పరస్పర ఆధేయాలుగా సాధించుకోవాల్సిన సౌందర్యానుభవం నియతకామం. పరస్పర ఆత్మార్పణం. అనే విలువలను దయానిధి వైయుక్తిక జీవితంలోని పరిమితుల వల్ల వేరు వేరుగా సాధించుకోవాల్సి వచ్చింది.''*[28] అని దీని ద్వారా తెలుస్తుంది.

ఇందిర వ్యవస్థకు ప్రతీక. వ్యవస్థ ప్రేమను నియమిస్తుంది. ఎన్నోరకాలైన అడ్డంకుల్ని ప్రేమను తుంచే ప్రయత్నం చేస్తాయి. దయానిధి విషయంలో 'వ్యవస్థ' ఈ పని చేసింది. ఇందిర 'వ్యవస్థ' లో చివరిదాకా పోరాడింది. చివరకు వ్యవస్థలో ప్రేమకు రాజీ చేసింది. ''*బుచ్చిబాబు, కాల్పనికోద్యమ అంశాలైన ఆనాటి అమలిన శృంగారం, స్వేచ్ఛా, ప్రణయము, కులపాలిక ప్రణయము ఈ మూడింటికి సంకేతాలుగా కోమలి, అమృతం, ఇందిరల వ్యక్తిత్వాన్ని నిర్మించాడు.''*[29]

### 4.4.7 దయానిధి – ఇతర వ్యక్తులతో గల సంబంధాలు:

దయానిధి తండ్రి లంచగొండి అని తెలుస్తుంది. దయానిధిని ఎప్పుడూ మందలిస్తుంటాడు. దయానిధికి కోమలితో వున్న సంబంధాన్ని సహించడు. దయానిధిని ప్రవర్తనను మార్చుకొమ్మని కోపగిస్తాడు. ఇతనికి దయానిధి కామాక్షి ఇంటికి వెళ్ళడం నచ్చదు. అతని భార్య ప్రవర్తన కూడ నచ్చదు. దయానిధి ఆటలను ఆమె ప్రోత్సహిస్తుంటుంటే, ఆమె ఆటలకు దయానిధి మద్దతిస్తున్నాడని ఆరోపిస్తాడు.

ఈ రకంగా తల్లీ, కొడుకులు అనైతిక చర్యలతో కుటుంబం పరువు తీస్తున్నారని, దయానిధికి పెండ్లి చేద్దమనుకుంటాడు. దయానిధి వ్యతిరేకించినా పట్టుబట్టి ఇందిరతో వివాహం జరిపిస్తాడు. అప్పుడప్పుడు దయానిధికి ఉత్తరాలు రాస్తుంటాడు.

దయానిధి తండ్రి సామాజికంగా ఉన్నత స్థానంలో ఉన్నా లంచగొండి కావడం వల్ల అతని వ్యక్తిత్వం ఆదర్శప్రాయం కాదు. అతని మనస్సులో ఎప్పుడూ భార్య శీలం మీద గౌరవం లేదు. కాబట్టి కుటుంబ జీవనం సవ్యంగా ఉండదు. పెద్దకొడుకు భార్యను తీసుకొని ఇల్లొదిలి వేరే

[27] సహృదయ చక్రము: పు: 238

[28] చివరకు మిగిలేది – మానసిక సామాజిక జీవన స్రవంతి – నవలా విమర్శ, పు: 95

[29] సహృదయ చక్రము, పు: 237

కాపురం పెడతాడు. చిన్నకొడుకు పెళ్ళయినా భర్యతో సంబంధం లేకుండా ఒంటరిగా గడుపుతాడు. కట్టుకున్న భార్య చనిపోతుంది. దశరథరామయ్య ఒంటరివాడు.

నారయ్య దయానిధి ఇంట్లో పనివాడు. దయానిధి దగ్గర చనువుంటుంది. నారయ్య కష్టసుఖాలను ఒకే విధంగా చూస్తాడు. తనకు జరిగిన నష్టానికి నవ్వుకుంటాడు. వేరే వారి కష్టాలకు ఏడుస్తాడు. కోమలిని అభిమానిస్తాడు. ఆమె కోసం తన్నులు తింటాడు. చనిపోతూ కూడా 'మీరెందుకూ పనికిరాకుండా వున్నారు.... మీరు భద్రంగా వుండండి' అని చనిపోతాడు.

జగన్నాథం అమృతం తమ్ముడు. చిన్నప్పుడు ఆకతాయిగా ఉన్నా పెద్దయ్యేసరికి జీవితాన్ని తేలికగా తీసుకోకుండా, గోదావరి ఒడ్డున 'పాక' వేసుకొని నలుగురికీ చదువు చెప్పుతుంటాడు. పెండ్లి ప్రసక్తి ఇష్టముండదు. వైకుంఠం గారు రిటైర్ అయిన వ్యక్తి. మొదట్లో జీవితానికర్థం ఏమిటని ప్రశ్నిస్తే, అలాంటి ప్రశ్న వేయడమే జీవితంలోని లోపమని అప్పటికి ప్రశ్నను దాటేసి – తాను మరణిస్తూ దయానిధి ప్రశ్నకు ఉత్తరం ద్వారా జవాబిస్తాడు. ఆ జవామును తెచ్చిన కవరు 'ఖాళీగా' ఉంటుంది అంటే జీవితానికర్థం ఏమీ లేదన్నమాట.

సుశీల తండ్రి హోదా వల్ల 'పొగరు'గా కనిపిస్తుంది. చదువుకున్నవ్యక్తి. నిర్లక్ష్యం ఎక్కువ. దయానిధి తల్లి మరణించాక, మిత్రులందరూ కలిసిన సందర్భంలో దయానిధికి కోమలి పట్ల ఉన్న అనురాగాన్ని చూసి 'నీకు అట్లాంటి వాళ్ళే నచ్చుతారు అని 'మీ అమ్మ బుద్ధులెక్కడికి పోతాయి' అని దయానిధి అభిమానం మీద దెబ్బకొడుతుంది. దయానిధి పెళ్ళిలో అతని స్నేహితుడు రాజభూషణానికి దగ్గరగా వచ్చిన సుశీలకు శ్రీనివాసరావుతో పెండ్లి సంప్రదింపులు జరుగుతాయి. అదీ కుదరక కృష్ణమూర్తితో వివాహం జరుగుతుంది. కృష్ణమూర్తికి కాకుండా ఎనిమిది నెలలు నిండకుండానే అతనికి తన సంతానాన్ని ఇవ్వలేక మరణిస్తుంది.

దయానిధి వ్యక్తిత్వాన్ని, కోమలిని, దయానిధి తల్లిని నీచంగా మాట్లాడిన సుశీల చివరికి తపపటడుగు వేసి జీవితంలో ఘోరంగా ఓడిపోయింది.

నాగమణి చదువుకున్న యువతి. దయానిధితో స్నేహంగా ఉంటుంది. ధనవంతురాలు. తన పట్ల దయానిధి దృష్టి ఎలాగుందో తెలుసుకునే ప్రయత్నం చేస్తుంది. అహంకారంతో సుశీల పోటీపడుతుంది. వస్త్రధారణ మీద శ్రద్ధ ఎక్కువ. పెళ్ళి చేసుకొని జీవితంలో, సమాజంలో గౌరవంగా జీవిస్తుంది.

రాజభూషణం దయానిధి స్నేహితుడు. స్త్రీలు మాతృత్వం కోసం మగవాణ్ణి బానిసగా చేసి, తన పని అయిన తర్వాత, పిల్లలు తనకు అన్నం సంపాదించే కూలీగా మారుస్తుందంటాడు. వివాహం ఒక జైలులాంటిది. వివాహం చేసుకోవడం, భావస్వాతంత్ర్యాన్ని కోల్పోవడమే.

సమాజంలో మనిషి మనిషిలా బ్రతకాలన్నా, తోటి ప్రజలతో సహజీవనం చెయ్యాలన్నా వివాహం దానికి అడ్డంకి. వివాహం ద్వారా వ్యక్తి తన సృజనాత్మక శక్తిని కోల్పోకూడదని అంటాడు. ఇంతాచేసి దయానిధి పెళ్ళిలో సుశీల పరిచయంతో కరిగిపోయి వివాహం గురించి అభిప్రాయం మార్చుకుంటాడు. కోమలిని ప్రయత్నిస్తాడు. సునాయాసంగా వచ్చే సుఖం కావాలతడికి. అవకాశవాది. దయానిధి రాయలసీమకు వెళ్తే, అక్కడి ప్రజలను కించపరిచే మాటలంటాడు. ఈ విధంగా దయానిధితో సంబంధమున్న ప్రతి ఒక్కరు ఏదో ఒక విషయంలో ప్రభావాన్ని దయానిధిపై చూపెట్టారు.

### 4.5 అసమర్థుని జీవయాత్ర – పరిచయం:

'వైయుక్తిక మనోవిజ్ఞానశాస్త్రం' అనే పేరుతో ఆల్ఫ్రెడ్ ఆడ్లర్ (1870 – 1937). ఒక కొత్త సిద్ధాంతాన్ని ప్రచారంలోకి తెచ్చాడు. ఫ్రాయిడ్ లో అన్ని మానవ ప్రేరణలకీ 'లైంగిక ప్రేరణ'లే కారణమనే వాదాన్ని ఇతడు అంగీకరించలేదు. అతని అభిప్రాయం ప్రకారం మానవుని మూర్తిమత్వాన్ని నిర్ధారించడంలో సామాజిక ప్రేరణలు చాలా ఎక్కువ పాత్రను నిర్వహిస్తాయి. ప్రతి వ్యక్తి బాల్యంలోని తన నిస్సహాయత కారణంగా 'న్యూనతా భావం' (Inferiority) లోకి నెట్టివేయబడతాడు. వాటిని తొలగించుకునేందుకు అతడు 'ఉత్కృష్టత'ను లక్ష్యంగా పెట్టుకొని ప్రయత్నిస్తారు.

వ్యక్తుల మధ్య మనస్తత్వాలతో వుండే తేడాలను ఆడ్లర్ ప్రధానంగా వివరించాడు. ప్రతీ వ్యక్తి, ఆధిక్యత కోసం ప్రయత్నిస్తాడు. ఆధిక్యత లభించనినాడు మనస్సు, ఆత్మన్యూనతతో కుమిలిపోతుంది. 'న్యూనత'ను అధిగమించేందుకు ప్రతీ వ్యక్తి, అనేక మార్గాలు వెతుకుతాడు. అవి విఫలమైతే అతనికి మిగిలేది 'రుగ్మతే'.

ఆడ్లర్ ప్రకారం ప్రతీవ్యక్తి విషయంలోనూ ఉండే అనేక రకాలైన సమస్యలన్ని మూడు రకాలుగా విభజించవచ్చు. వృత్తికి సంబంధించినవి, సాంఘిక పరమైనవి. లైంగిక పరమైన ఈ మూడు రకాల సమస్యల పరిష్కారంలోనే వ్యక్తి మూర్తిమత్వం అర్థమౌతుంది. ఆత్మన్యూనతా, ఆత్మఆధిక్యతా భావం ఈ రెండు సమస్యల్తో వ్యక్తులు రుగ్మతకు గురౌతారు. ప్రతీవ్యక్తి విషయంలో ఈ రెండు తరహాల 'భావాల' సమ్మేళనం ఉంటుంది. ఈ సమ్మేళనం విపరీత స్థితిలో వున్నప్పుడు – ఫలితం నిర్మాణాత్మకంగా కాక, వినాశనాత్మకంగా వుంటుంది. మానసిక రుగ్మత ఏర్పడుతుంది.

చిన్నప్పటి వాతావరణం, తల్లిదండ్రుల పెంపకం, కుటుంబంలో అతని స్థానం అతడి ఆదర్శవ్యక్తులు. ఇవన్నీ అతనిపై ప్రభావాన్ని చూపిస్తాయి. పిల్లల్ని గారాభంగా పెంచినా, నిర్లక్ష్యం

చేసినా పిల్లల్లో ఆత్మన్యూనతా భావం పెరిగిపోతుంది. గారాభంగా, తల్లిచాటు బిడ్డగా పెరిగి పెద్దయిన తర్వాత పోటీ ప్రపంచంలో నిలువలేక, లోకంపట్ల కసిని పెంచుకుంటారు. జీవితంలో సమస్యలు ఎదురైనప్పుడు వాటిని పరిష్కరించేందుకు కావలసిన మనోధైర్యం వీరిలో ఉండదు. తమ ఎదుటనున్న సమస్యల్ని అధికంగా ఊహించుకొని, ఆత్మన్యూనతా భావానికి' గురౌతారు. వీరికి ప్రేమ, అభిమానం తెలియవు కాబట్టి మానసికంగా కుంగిపోతారు.

ఆత్మన్యూనతకి గురైనవారు ''ఆధిక్యత'ను ఊహించుకుంటూ 'కలలో' తేలిపోతారు. ఈ కలల్లో కూడ తాను చాలా బాధల్లో ఉన్నట్లుగానూ లేకుంటే అపూర్వమైన శక్తితో ఆధిక్యతను పొందుతున్నట్లుగానూ భావిస్తారు.

సమగ్రమైన మూర్తిమత్వాన్ని పొందాలనుకునే వ్యక్తి తనలోని ఆత్మన్యూనతా భావాన్ని, ఆధిక్యతా భావంగా మలచుకునే ప్రయత్నంచేసి ఫలితాన్ని సాధిస్తే అతనికి సమగ్రమైన వ్యక్తిత్వం లభిస్తుంది. ఆ కృషి శక్తి సామర్థ్యాలు లేక, కేవలం పగటికలల్లో తేలిపోయేవాడు 'చిత్త చాంచల్యం'తో మతిస్థిమితం కోల్పోయే ప్రమాదం కూడా ఉంది.

ఈ రకమైన మానసిక వైకల్యం గల వ్యక్తి సీతారామారావు 'అసమర్థుని జీవయాత్ర'లో సీతారామారావు తన తండ్రి యొక్క 'గొప్ప వారసత్వానికి' వారసుడు కావాలనీ తపనతో జీవితంలో ఏమీ చేయలేక, నిర్వ్యాపారిగా, మానసిక వైకల్యం గల వ్యక్తిగా చివరికి ఏ విధంగా ఆత్మహత్య చేసుకున్నాడనేది, గోపీచంద్ చక్కగా వివరించాడు.

### 4.5 .1 'అసమర్థుని జీవయాత్ర' ఇతివృత్తం:

'అసమర్థుని జీవయాత్ర' కథానాయకుడు సీతారామారావు అస్థిరచిత్తుడు, అసమర్థుడు, వంశ గౌరవాన్ని నిలబెట్టమన్న తండ్రిమాటను పాటించటం కోసం నానాపాట్లు పడతాడు. తండ్రి కర్మకాండకు అతిగా ఖర్చుచేస్తాడు. బాకీలు రాబట్టటం కోసం కోర్టుకెక్కుతాడు. మేనమామ పొగడ్డలకు ఉబ్బిపోయాడు. ''*నీకు డబ్బు వొక లెక్కలోనిది కాదు*'' అనగానే నలభైవేల రూపాయల అప్పును తేలికగా పరిష్కరించుకున్నాడు. ''మేమేం పరాయివాళ్ళమా?'' అనే మాటకు కరిగిపోయాడు.

సీతారామారావు తనను తానొక విలక్షణ వ్యక్తిగా భావించుకుంటాడు. ''*పెళ్ళికి నూతనార్థం కల్పిస్తారంటూ బీరాలు పలికి పెళ్ళి చేసుకున్నాడు. అచిర కాలంలోనే ఆస్తి కరిగిపోయి సామాన్య సంసారుల్లాగ దైనందిన సమస్యలతో సతమతమవుతాడు.*

*పిల్లనిచ్చిన మామ సహాయంతో ఉద్యోగం సంపాదించుకొన్నందుకు ఆత్మన్యూనతా భావానికి లోనయ్యాడు. మేనేజర్ను అపహాస్యం చేసి ఉద్యోగం పోగొట్టుకున్నాడు. డబ్బు లేకపోవటంతో నా అనేవాళ్ళు కరువయ్యారు.*

*చేతిలో నాలుగురాళ్లుంటే అంతా మూగుతారు. ఆ తర్వాత మన మొగం చూచే వాళ్ళుండరు*'' అన్నాడు రామయ్య తాత. మళ్ళీ మొహం చూస్తారనే ఆపేక్షతో నేనీపన్లు చెయ్యటం లేదు తాతా? చేయటం కోసమే చేస్తున్నాను.'' అన్నాడు సీతారామారావు.

నవలలో రామయ్య తాత పాత్ర సహజంగా లేదు. రచయిత తాను చెప్పదలచుకున్న అంశాలకు లోకరీతిపై వ్యాఖ్యానాలకు యీ పాత్రను ప్రవేశపెట్టినట్లనిపిస్తుంది.

''*ఈ ప్రపంచం అనుక్షణం మారుతూ వుంటుంది. ఈ మార్పు ఎందుకో ఎవ్వరికీ అర్థం కాదు. ఈ మార్పుకి ఆదర్శం వున్నట్టు కనబడదు. ఇక మానవుడు చేసేది ఏమిటి?*'' అనుకుంటాడు సీతారామారావు. ఎప్పుడూ ముసుగు పెట్టుకొని పడుకొని కళ్లు మూసుకొని, బాహ్య ప్రపంచాన్ని మరిచిపోయి ఆలోచించేవాడు.

సీతారామారావుకు ఒకప్పుడొక కలవచ్చింది. అందులో అతను అడవిలో తపస్సు చేసుకుంటున్నాడు. చుట్టూ సింహాలు, పులులు, ఏనుగులు, కొండచిలువలు, పాములు, శివపార్వతులు ప్రత్యక్షమయ్యారు. సీతారామారావు ''*నాకు ఆకలి ఉండాలి. ఆకలి తీరే అన్నం ఉండాలి.... అనాది నుంచి వున్న మంచి పేరు చెడగొట్టుకోను. మీ అందరి కంటె పేరు ప్రఖ్యాతుల మీద ఎక్కువ ప్రేమ నాకు.... నా వరం ఇంకొకళ్ళకి ఇవ్వకూడదు.*'' అని కూడ కోరతాడు.

వ్యక్తికి వచ్చిన కల 'అచేతన' స్థితిలో గుప్తంగా ఉన్న ఆలోచనలకు, కోరికలకు ప్రతీక. కలలో అడవిలోకి వెళ్ళడంలోనే సీతారామారావులో పలాయన తత్త్వం వెల్లడి అవుతున్నది.

రచయిత ఈ కలను కల్పించంలో ఫ్రాయిడ్, ఆడ్లర్ ల సిద్ధాంతాల ప్రభావం ఉన్నది. సీతారామారావు తన దుస్థితికి తన స్నేహితులే కారణమని నిష్కారణంగా అనుకుంటాడు. ఇది అతని ఆత్మన్యూనతా భావమే. సీతారామారావు కలల్లో ఫాంటసీ కూడ చోటు చేసుకున్నది. మహారణ్యాల్లోకి వెళ్ళి దారులు కొట్టి బతకాలనుకోవటం దీనికి నిదర్శనం.

సీతారామారావుకు తన క్షోభే ప్రపంచపు క్షోభ. సీతారామారావు భార్యా పిల్లలతో గూడ ప్రేమగా మెలగలేకపోతాడు. కూతురిమీద భార్య మీద చెయ్యి చేసుకుంటాడు.

తనకూ లోకానికి సామరస్యం కుదరని సీతారామారావు శ్మశానం చేరుకున్నాడు. అందరూ చనిపోయిన తర్వాత చేరుకునే ప్రదేశానికి అతను బతికుండగానే చేరాడు.

ఒక ముసలివాడు తన కూతురు చితి మీద కాలిపోతూ వుంటే వచ్చి, ''నీతి, ధర్మశాస్త్రం అన్నీ బతికేవీలున్న వాళ్ళకి, బతకటమే కష్టమైన వాళ్ళకి, బతకటమే నీతి, బతకటమే ధర్మం. బతకటమే శాస్త్రం.'' అని కఠోరమైన జీవితసత్యాన్ని అతనికి చెప్పాడు.

''*బతకాలి అనుకోవటం మనుష్యులకు తప్పించుకోలేని వ్యసనం*'' అన్నాడు సీతారామారావు.

శ్మశానంలో చెట్లతో, పుట్లతో మాట్లాడటంగాక తన తల్లిదండ్రులతో మాట్లాడిన భ్రమకు లోనౌతాడు. తర్వాత అతనికి తన ఆకారం తనకే ముసలి రూపంలో కన్పిస్తుంది. మొహం ముడతలుపడి, జుట్టు పండిపోయి, కళ్ళు చింత నిప్పుల్లా, శరీరం అస్థి పంజరంలాగ కన్పిస్తుంది.

తన ఆకారం తన మీదకు దాడి చేసిన భ్రమకు లోనై రెండు చేతులతో గొంతు పట్టుకొని, మెడను కోడిమెడ విరిచినట్లు విరిచి తన్నుతానే హత్య చేసుకున్నాడు.

### 4.5 .2 'అసమర్ధుని జీవయాత్ర' – మానవసంబంధాల విశ్లేషణ:

సీతారామారావు యువకుడు. చదువుకున్నవాడు. ఆదర్శాలున్నవాడు. ఇలాంటి వ్యక్తి అసమర్థుడిగా మారిపోతాడు? మానవ సంబంధాల నిర్మాణంలో సీతారామారావు పూర్తిగా విఫలుడౌతాడు. సీతారామారావుకి మొదటినుండి మిథ్యాహంకారం. తన తండ్రి, వంశం గొప్పని వాళ్ళ ఆదర్శాలకు ఏమాత్రం తగ్గకుండా జీవించాలనుకునే తత్వం. కానీ జీవించాలనుకోవడం వేరు. జీవించడం వేరు. గొప్పవాడిననుకోవడం వేరు. గొప్ప కావడం వేరు. సీతారామారావు ఆలోచననుండి ఆచరణకు ప్రయాణం చేయలేకపోయాడు. దానికి కారణం విపరీత మనస్తత్వం. ఇది అతని జీవితమంతా పరుచుకొని వుంది. ''*భూస్వామ్య వ్యవస్థకు సంబంధించిన దర్పమూ, గర్వమూ వంశపారంపర్యంగా వస్తూ చివరి రోజులలో ఎటువంటి పరిణామం చెందిందో గోపీచందో యీ పట్టులో చక్కగా వ్యక్తం చేశాడు. లోకజ్ఞత, వ్యవహారదక్షత వాస్తవికతను గుర్తించే బుద్ధికుశలతా లోపించినా వంశగౌరవం అనే దురభిమానాన్ని డబ్బూ, ఆస్తీ, బంధువుల అభిమానం అనేవి ఉండటంవల్ల, ఒకతరం అసమర్థులు నిలబెట్టుకోగలిగారు. కాని సీతారామారావు తరం వచ్చేటప్పటికి అటువంటి ఆధిక్యత నిలవలేదు. సీతారామారావు ఆదర్శవాదీ, హేతువాదం వంటబట్టినవాడూ కావటం వల్ల డబ్బూ, ఆస్తీ, బంధువుల అభిమానమూ తొలగద్రోసి తన అసమర్థతను బయటపెట్టుకున్నాడు. అతని అభిమానానికి గట్టి దెబ్బ తగిలింది.*''[30] తండ్రి చనిపోయిన తర్వాత ఆస్తిని కాపాడుకోలేకపోయేలా చేసింది.

[30] సాహిత్యంలో దృక్పథాలు, పు: 156-157

మేనమామను కూడ అభిమానంతో కాక అహంకారముతో చూసేలా చేసింది. జీవనానికై ఉద్యోగం కూడ చేయనీకుండా చేసిందీ ఈ మనస్తత్వమే. సీతారామారావు వ్యక్తిగా సమూహంలో కలువలేక పోయాడు.

### 4.5 .3 సీతారామారావుపై తండ్రి ప్రభావం:

సీతారామారావు ఊహా ప్రపంచంలో కాకుండా నేలమీద జీవించి ఉంటే, నిజాన్ని గ్రహించి, దానికి అనుకూలంగా నడుచుకుంటే అతని జీవితం, నిజంగా ఆదర్శప్రాయమయ్యేది. ''*కొందరిలో స్వాభిమానం జిగీషగా ఉంటుంది. వ్యవహారాలలో దక్షతగా, సామర్థ్యంగా అది వ్యక్తమౌతూ ఉంటుంది. ఇది క్రియాశక్తి, ప్రధానమైన వ్యక్తులసంగతి. కాని ఆలోచనాశక్తి ప్రధానమైన వ్యక్తులలో, సీతారామారావు వంటి వారిలో, జిగీషకంటె నిరాకృతి లేక తిరస్కృతి ఎక్కువ. తిరస్కారభావమే వాళ్ళులోకం మీద సాధించే విజయం*''[31] తండ్రితో పాటే ఆస్తినీ పోగొట్టుకొని, ఉద్యోగమేదీ చేయక రోజంతా సోమరిగా గడిపే సీతారామారావుకు బీదరికపు రుచి తొందర్లోనే తెలిసింది. కానీ సమాజంలో 'వంశప్రతిష్ట'ను నిలబెట్టాలంటే తన ప్రస్తుతస్థితిని ఎవ్వరికీ తెలీకుండా ఉండేలా చేయడం కోసం సీతారామారావు చాలా శ్రమించాల్సి వస్తుంది. బీదరికాన్ని గుర్తిస్తూ అందుకు బాధపడుతూ గొప్పవాడిగా నటించడానికి, తనను తాను నమ్మించుకోడానికి ప్రయత్నం చేసాడు. ఆఫీసర్ గారి అమ్మాయిని స్టేషన్ నుండి తీసుకువచ్చేందుకు కూడా నామోషీయే. కూరగాయల వాడితో బేరమాడేందుకు నామోషీ. నడిచి ఇంటికి వచ్చేందుకు నామోషీ. ఇలా లేని పోకడలకు పోతూ ఉన్న మనశ్శాంతినీ, గౌరవాన్ని ఇంట్లో, బయట పోగొట్టుకుంటాడు సీతారామారావు.

అహంకారముతోపాటు సీతారామారావుకి ఉన్న మరో దరిద్రం నిష్క్రియాపర్వతం. విపరీతమైన ఆలోచనలతో, అతనిలోని చైతన్యశీలత్వాన్ని చంపేసుకుంటాడు. ఏమాత్రం తెలివిలేని, ఆలోచనా శూన్యుడైనా సరే, ఏదో పని చేసుకుంటూ జీవితాన్ని గడిపేవాడు. తార్కికంగా, హేతుబద్ధంగా ఆలోచనలు మెదడులో గజిబిజిగా తయారై ఏమి చేయాలో, ఎలా చెయ్యాలో అర్థంకాని స్థితిలో ఆలోచనలను క్రమపద్ధతిలో పేర్చుకొని, ఆచరణ వైపు మళ్ళించే నేర్పరితనం అతనిలో లోపించింది. అతి తెలివి సీతారామారావు పాలిట శాపమైంది. జీవితం గురించి తరచి తరచి ఆలోచించి తనలో చర్చించుకొని వాటిలో ఏ ఒక్కదాన్ని జీవితానికి అన్వయించుకోకుండా నిర్వ్యాపారిగా మిగిలిపోయాడు.

---

[31] సాహిత్యంలో దృక్పథాలు, పు: 155-156

### 4.5 .4 సీతారామారావు బలహీనతలు:

సీతారామారావు మానసికంగా వైఫల్యం చెందినవాడు. తన బలహీనతలన్నింటికీ ఎవరినో ఒకర్ని నిందించేరకం. ఎవర్నో కారణంగా చూపే మనస్తత్వం. తండ్రి ఆస్తిని చేతకాని తనంలో పొదుపు, నియంత్రణలు లేని కారణంగా, అనవసరపు భేషజాలతో పోగొట్టుకొని, తిరిగి తండ్రి వంశమర్యాదను నిలపడం కోసమే తాను ఆస్తి పోగొట్టుకున్నానని బుకాయిస్తాడు.

ఉద్యోగమిప్పించిన మామని నిందిస్తాడు. తనకు ఉద్యోగాన్ని జాగ్రత్తగా, తెలివిగా నిర్వహించుకొనే 'ఓపిక' లేక, ఇలా తన అసమర్థతని వేరే వారిపై నెట్టడం– బుకాయించడం. ఇవే అతన్ని ఎందుకూ పనికిరాని వాడిగా చేసినవి. తప్పు ఇతరులపై ఉన్నా– వారిని ఎదురించే ధైర్యం లేక కూతుర్ని, భార్యను కొడతాడు. ''*సమస్యా పరిష్కారమార్గం ఆలోచనకు తొంగిపోవడంతో, సంకల్పశక్తి చెదిరిపోవటంతో, సీతారామారావు ప్రవర్తన పిచ్చివాని ప్రవర్తనలా తయారవుతుంది. ప్రపంచాన్ని నిరాకరిస్తూ పరారీ అయ్యే ప్రవృత్తి శూన్యంలో గుడిసుళ్ళు తిరిగి చివరకు ప్రపంచం వైపే విధ్వంసక శక్తిగా, ద్వేషంగా ప్రసరిస్తుంది. దెబ్బతిన్న అహం ప్రపంచం మీద కక్ష తీర్చుకోవటానికి ప్రయత్నిస్తుంది.*'' [32] భార్యను సుఖపెట్టలేకపోతున్నానని, కూతురుది తప్పుకాదని యానాది మనిషిదే తప్పని తెల్సినా– తన ఇంటి మీదికి పోట్లాటకు వచ్చిందని. సంఘంలో తన గౌరవానికి భంగం కలిగిందని ఏ తప్పూ చేయని తను అతిగా ప్రేమించే కూతుర్ని కూడా కొడతాడు. భార్య తనను ఏమీ అనడం లేదని తన పట్ల విపరీతమైన నిర్లక్ష్యధోరణిలో ఉంటుందని, కొట్టినా చలించడం లేదని– వీటికన్నింటికీ కారణం తాను ''*ఆత్మన్యూనతాభావం'లో ఉన్నానని తెలిసినా, తప్పు ఇంటి వారి మీదికి తోసే ప్రయత్నమే చేస్తాడు, బుకాయిస్తాడు.*''

సీతారామారావుకి కల వచ్చింది. కలలో.... సీతారామారావు అడవిలో ఘోరంగా తపస్సు చేసుకుంటాడు. ఎలుగుబంటి అతని తపస్సును భగ్నం చేయబోయింది. కళ్ళు తెరచి కోపంగా ఎలుగుబంటిపై బొచ్చు చుర చుర కాలిపోయి, బొచ్చులేని ఎలుగుబంటి 'ఢాం' అని కింద పడిపోయింది. శివుని ముఖాన్ని, పార్వతిముఖాన్ని వేరుచేస్తూ నల్లని గుడ్డ ఉంటుంది. ఇటు తిప్పితే శివుడు, అటు తిప్పితే పార్వతి. శివుడు ఏ వరం కావాలో కోరుకోమంటాడు. సీతారామారావుకి కడుపులో 'ఆకలి' వేసింది. ''అన్నం! అన్నం!'' అన్నాడు. శివుడు ఆ వరం ఇవ్వబోయాడు. పార్వతి ఆపింది. మీరు ఆ వరం ఇస్తే నన్నే వండిపెట్టమంటాడన్నది. ఆ వరం

---

[32] సాహిత్యంలో దృక్పథాలు, పు:158

ఇవ్వొద్దు! అన్నది. శివుడు వేరే వరం కోరుకోమన్నాడు. నాకది తప్ప వేరేదేదీ వద్దన్నాడు సీతారామారావు. ఎవర్నీ అడక్కుండానే పంచభక్ష్య పరమాన్నాలు కోరుకున్నప్పుడల్లా అమరాలి. ఇదీ కోరిక శివుడు తథాస్తు అన్నాడు. సీతారామారావుకి మెలకువ వచ్చింది. ఇంకొక పగటి కల. కళ్ళు మూసి తపస్సు చేస్తుంటే రంభాది అప్సరసలు వచ్చి సపర్యలు చేస్తుంటారు. కలలో తానొక బందిపోటు, బాటసారులని దోచుకొని వాళ్ళ డబ్బంతా లాక్కొంటాడు. ఒక అందమైన అమ్మాయి తనను బలాత్కారం చేస్తాడేమోనని భయపడుతుంది. తాను మాత్రం ఊరికే వదిలేస్తాడు.

ఇది సీతారామారావులోని గూఢమైన పొరలను విశ్లేషిస్తుంది. అతడు కోపంతో చూసినా ఎలుగుబంటి చావలేదు అంటే అతని తపస్సుకు అంతశక్తి లేదు. అతని దీక్షలో నిజాయితీ లేదు. ఏపని పట్లా ఏకాగ్రతను చూపించలేని సీతారామారావుకి బాగా తెలుసు. అతనికి కనిపించిన శివుడు దసరావేషంలోని శివుడు, ఉద్యోగమే సరిగ్గా చేయని సీతారామారావు తపస్సేం చేస్తాడు. ఒక వేళ తపస్సే చేసే శక్తి ఉంటే, హాయిగా ఉద్యోగమే చేసుకునేవాడు. ఇది అతని స్వభావాన్ని తెలియజేస్తుంది. నిష్క్రియాపర్వతం– ఏపనీ చేయకుండా అన్నీ తన దగ్గరికి రావాలి అందరూ తన గొప్పదనాన్ని గుర్తించాలి, గౌరవించాలి ఏ మాత్రం కష్టం కలగకుండా తాననుకున్నది జరిగితే సీతారామారావు ఆనందంగా, సంతోషంగా ఉంటాడు.

ఎవ్వర్ని ఏమీచేయలేక పగటికలలు కంటూ, తాను పొందాలనుకునేవి కలల ద్వారా పొందే ప్రయత్నం చేస్తాడు. ఓ సందర్భంలో భార్యను కొడతాడు. కొట్టి, అలా చేసినందుకు తనకు తాను సమాధానం చెప్పుకోలేక ఊరి మీద పడ్డాడు. తనలోని లోపాన్ని సమాజలోపంగా తీర్మానించి తన తప్పులనుండి చేతకానితనం నుండి బయటపడాలనుకుంటాడు. తనకు ఎదురే చెప్పని భార్యని కొట్టడం, అతనిలోని అసహనాన్ని గుర్తుచేస్తుంది.

''*మనం కొన్ని కొన్ని అభ్యంతరకరమైన దుష్ట ఆలోచనలు అణచివేస్తాం. ఇలా అణచి వేయడమే ఈ అనర్ధాలన్నింటికీ మూలం. అణచబడిన ఆలోచనలకు 'దొంత' లేదా 'దమిత' స్మృతులు అంటారు. అవి బహిర్గతం కావాలని విశ్వప్రయత్నం చేస్తాయి. ఎంత ప్రయత్నంతో మనం వాటిని అణచామో అంత శక్తిలోను అవి పైకి రావాలని చూస్తాయి. ఆ ప్రయత్నంలో అవి ఈ తెగ లక్షణాల రూపాన్ని దాలుస్తాయి. రోగ లక్షణాలను దొంత స్మృతులు వేరుగావు.*''[33] కలగంటూ తానొక బందిపోటుగా ఊహించుకుంటాడు. బాటసారులని దోచుకొంటున్నట్లుగా భావిస్తాడు. అందమైన అమ్మాయి చిక్కితే, వదిలేసి, తను ఆదర్శవంతునిగా నిరూపించుకునే

[33] సిగ్మండ్ ఫ్రాయిడ్ , పు:55

ప్రయత్నం చేస్తాడు. ఇదంతా అతనిలో అణచిపెట్టి ఉన్న కామవాంఛను బాధపెట్టేదే. నిజజీవితంలో భార్యను హింసించే వ్యక్తి, కలల్లో అమ్మాయికి వదిలేయడం లాంటివి. అతనిలోని ద్వంద్వ ప్రవృత్తిని చూపిస్తాయి. డబ్బులేక అనవసర డాంబికాలకు పోయి ఇంట్లో భార్యాపిల్లల్ని మెప్పించలేక– తీవ్ర సంఘర్షణకు గురై, బందిపోటులా మారి సమాజాన్ని దోచుకోవాలని చూస్తారు.అంతేకాని కనీసం కలలోనైనా కష్టపడి డబ్బు సంపాదించునట్లు, ఊహించలేకపోతాడు. కలలో కూడ కష్టపడడం అంటే సీతారామారావుకి చికాకు, శారీరకకష్టం చేసే వాళ్ళంతా బలహీన మనస్తత్వం గల వాళ్ళు అజ్ఞానులు, మోటు మనుషులు అని సీతారామారావు ఆలోచన.

నిజానికి రోజంతా కష్టపడి పనిచేసేవాడికి ఇంట్లో భార్యాపిల్లల్లో, బయటి ప్రపంచంతో సఖ్యతగా ఉన్నవాడికి కలలే రావు. వచ్చినా ఇలాంటి అర్థరహితపు కలలు అసలే రావు. ''*జ్ఞానం ఒకటే మానవుడి అభివృద్ధికి సహాయపడదు. దాన్ని సంఘశ్రేయస్సుకి ఉపయోగపడేటట్టు చేసే మనస్తత్వం కూడా ఉండాలి.*''[34] అంటాడు రామయ్య. ఇలాంటి మనస్తత్వం లోపించడమే సీతారామారావుగారి అసమర్థత. సీతారామారావు భార్య ఇందిర. విద్యావంతురాలు. సీతారామారావు ప్రేమించి పెళ్ళిచేసుకుంటాడు. కానీ అతనితో సంపారం ఆమెను 'నిర్వేద' స్థితికి తీసుకువచ్చింది. స్త్రీకి స్వాతంత్ర్యం ఉండాలనే ఆదర్శవంతుడైన సీతారామారావు భార్య విషయంలో కూడా అలాగే ఉంటాడు. కానీ, ఆ ఆదర్శం తనకు అనుకూలంగా ఉండేటట్లు చూసుకుంటాడు. ఫొటో తీయించుకునేటప్పుడు భార్య కుర్చీలో కూర్చోమని తాను నిలుచుంటాడు. ఆమె ఇబ్బంది పడ్డా, బలవంతంగా కూర్చోబెడతాడు. ఈయనకు భార్యకు ఏది అనుకూలంగా ఉంటుందో, అనేది ముఖ్యంకాదు. ఈ విధంగా స్త్రీ స్వాతంత్ర్యాన్ని కోరుకుంటాననే తన అహాన్ని తృప్తిపరచడమే ముఖ్యం. అలా ఫొటోలో నిలబడి తన గొప్పను నిరూపించుకునే తపన ఇదే ఆయన ఆదర్శం, ఇంతటి భారద్యచేత 'నువ్వు' అనిపించుకోవడం, పేరుతో పిలిపించుకోవడం ఇవేవీ ఇందిరకు ఇష్టముండవు. అయినా నిర్బంధంలో ఇవన్నీ చేయించుకుంటాడు. స్వేచ్ఛగా ఉండాలనుకొనే వారు. నిర్ణయాన్ని వారే తీసుకోవాలిగానీ, పురమాయించడం స్వేచ్ఛ అనిపించుకోదు. పైగా, ఇందిర విద్యావంతురాలు. ఆమెకు ఏది మంచో, ఏది చెడో తెలుసు. కానీ, దానికి తగ్గట్టుగా ప్రవర్తించలేకపోయింది. అంటే భర్త ప్రవర్తన ఆమెను ఎంతలా క్రుంగదీసినవై ఉండాలి.

[34] అసమర్థుని జీవయాత్ర, పు:54

### 4.5 .5 సీతారామారావు దాంపత్య జీవితం:

ప్రేమించి పెళ్ళి చేసుకున్న భార్యను, ఎందుకు పెళ్ళి చేసుకున్నానా! అనే ఆలోచన కూడ వచ్చింది. తన అసమర్ధత కారణంగా ఇల్లంతా గుల్ల చేసుకొని, బయటి ప్రపంచాన్ని చూడలేక 'బల్లి'తో ముచ్చట పెట్టే సీతారామారావుకి భార్య బరువే అవుతుంది. అయినా కూడ ఇందిర అతన్నే నమ్ముకుంది. అతన్ని పూర్వపు రోజుల్లో ప్రేమించినంత, ప్రేమించక పోయినా, అతనికి ఇంట్లో కావలసినవన్నీ సమకూరుస్తుంది. అతని ప్రవర్తనకు విసుగు చెందినా, ఇల్లు విడిచి వెళ్ళలేదు. తన భర్త ఒంటరివాడవుతాడని, అతని అంతరంగం, ఆలోచనలు పూర్తిగా తెలిసిన ఇందిర తండ్రి పిలిచినా పుట్టింటికి వెళ్ళదు.

ఈ సందర్భంలో సీతారామారావు మేనమామ ''*నీలాంటి వాళ్ళ భార్యలు లేచిపోరు. నీలాంటి భర్తలు భార్యలను నీచంగా చూస్తారు. అందువల్ల వాళ్ళకి ఆత్మవిశ్వాసం చస్తుంది. భర్తలను సుఖపెట్టడానికి ప్రయత్నించడమే వాళ్ళకు జీవిత పరమావధి అవుతుంది. బానిస బ్రతుకుతో తృప్తిపడతారు. భర్తల వల్ల సుఖపడే భార్యల దృష్టివేరు. వాళ్ళకి తమ మీద తమకు చాలా సదభిప్రాయం ఏర్పడుతుంది. తమకు ఏ కష్టం కలిగినా తప్పు తమదే అనుకుంటారు. మరొకరైతే తమను ఎంత సుఖపెట్టేదీ ఊహించుకుంటారు లేచిపోతారు*''[35] అని అంటాడు.

తను ఎంత తిట్టినా తిరస్కారంతో మాట్లాడినా ఇందిర ఎదిరించలేకపోయేసరికి సీతారామారావుకి భార్య పెంపుడుకుక్కలా తోచింది. ''*తన కుక్క కూడా ఇంతే! కసిరినా తనను విడిచి పెట్టేది కాదు. చూపులు చూసేది కాదు. నీ సంగతి నాకు తెలుసులే! అన్నట్లు చూసేది. కొడితే 'కుయ్యో-కుయ్యో! అనేది మళ్ళీ అలాగే చూసేది*''[36] అనుకుంటాడు.

తన అసమర్ధతను కప్పిపుచ్చుకునేందుకు భార్యను, కుక్కతో పోల్చుతాడు. బయటివాళ్ళు ఇంటిపైకి పోట్లాడికి వస్తే——అకారణంగా కూతుర్ని కొడతాడు. వేశ్యతో మాట్లాడే సందర్భంలో కూడ ''*నీ గుణం మంచిదే కదా!*'' అని ఆమె వృత్తి జీవితం పట్ల పరిహాసమాడతాడు. సీతారామారావుకి ఆడవారిపై సదభిప్రాయం ఉన్నట్లు కనిపించదు. తండ్రి ఇచ్చిన మాట నెరవేర్చే సమయంలో తనను తాను శ్రీరామచంద్రునితో పోల్చుకుంటాడు. దీనిని రామయ్య తాత సహించలేకపోతాడు. ''*గొప్పవాళ్ళని ఆదర్శంగా పెట్టుకొని వాళ్ళకి మల్లే ప్రవర్తించడానికి నువ్వు ఎన్నడూ ప్రయత్నించలేదు. పై నీ దుర్మార్గంను అవినీతి ప్రవర్తనను, నీ నీచ స్వభావాన్ని సమర్ధించుకోవడానికి వీళ్ళలో నీ రూపాన్నే చూస్తున్నావు. మహనీయుల్ని నీ స్థితికి గుంజి*

---

[35] అసమర్థుని జీవయాత్ర, పు: 56

[36] అసమర్థుని జీవయాత్ర, పు: 58

*తృప్తిపడుతున్నావు. రామచంద్రమూర్తి భార్యను కష్టపెట్టింది. నీవు నీ భార్యను హింసించింది ఒక్కటేనా నీచుడా? రామచంద్రమూర్తి. సీతమ్మ తల్లిని ఎందుకు చితి ఎక్కించాడు? ఎందుకు మహారణ్యాలకు పంపాడు? ఒక ఆదర్శం కోసం తన ఆదర్శాన్ని త్యజించడమా; భార్యను త్యజించడమా? అని విషయ సమస్య వచ్చినప్పుడు శ్రీరామచంద్రమూర్తి భార్యను త్యజించి ఆదర్శప్రాయుడైనాడు. మరి నీవో? ఏ ఆదర్శాలతో, నీభార్యను హింసిస్తున్నావు? లోక కళ్యాణం కోసమా? శారీరక తృప్తి కోసం పశువాంఛలను తీర్చుకోవడానికి, నీ అసమర్ధతను కప్పిపుచ్చుకోవటానికి చేస్తున్నావు''*[37] అని సీతారామారావు ఆదర్శప్రాయుడు కాడు. స్వార్ధ సంకుచిత మనస్తత్వం కలవాడని చాలా ఘాటుగా విమర్శించాడు. సీతారామారావు నిర్ణాయకశక్తి లేనివాడు. అతడు పూర్తి జ్ఞానియైనా బాగుండేది. సగము తెలిసీ సగము తెలియని వారి పరిస్థితి ఇలాగే ఉంటుంది. ఏ విషయం పట్ల పూర్తి బాధ్యతతో ప్రవర్తించడు. అవగాహన పెంచుకోడు. పైగా పూర్తిగా తెలుసునన్నట్లు ప్రపంచానికి కనిపిస్తాడు. కానీ లోలోపల తన గురించి పూర్తి అవగాహనతో ఉంటాడు. తన లోపలి వ్యక్తినీ, బయటకి కనిపించే వ్యక్తినీ, బయటకి కనిపించే వ్యక్తిని ఒకటిగా చేసే ప్రయత్నం చేయడు.

*''మనలోనే ఉండి మనం గుర్తించడానికి ఇష్టపడని ఒక సంవేదన, ఒక ఉద్వేగం (Emotion) ఈ జబ్బుకు కారణమా? మనకు ఇష్టం కాని, లేదా మనం ఒప్పుకోని లేదా ఎదుర్కోలేని సంవేదన మనలో ఉన్నప్పుడు అది అసలు లేనట్లే మనకు మనం నచ్చచెప్పుకో చూస్తాము. అంటే మనం దానిని చేతన పరిధి నుంచి ఆవలికి నెట్టివేస్తాము.''* [38] ఈ విధంగా తనను తానే ఆత్మ వంచన చేసుకుంటూ, సమాజాన్ని నమ్మించాలని, చూస్తాడు. కానీ తన తప్పును, అసమర్ధతను ఒప్పుకొని, వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేయడు.

*''అతడు కాలానుగుణముగఁ దన యభిప్రాయమును మార్చుకొనఁజాలడు. దొడ్డ చలమున గాలి మాతనికి నెదురొడ్డి ప్రతిఘటించును. ఒక్కటియుఁ గలసిరాదు. అన్నియు నెదురు తిరుగును. జీవితఁపుటావలి యొద్దు నాతడు చేరలేదు. దేహ పదార్థములకుఁ దనలోని యాత్మ వస్తువునకు సంఘర్షణమేర్పడును. దానితో జీతమునందొక సమన్వయముకి కుదరదు. అతనికి వెఱ్ఱి యెత్తును. ఆవీఱిఁడినమునందే యాతఁడంతము నొదుటయుఁ గలదు.''*[39]

---

[37] అసమర్థుని జీవయాత్ర, పు:59

[38] సిగ్మండ్ ఫ్రాయిడ్ , పు:46

[39] ఆంధ్ర నవలా పరిణామము, పు:426

తండ్రి సంపాదించిన ఆస్తినంతా అత్యంత సునాయాసంగా ఖర్చుపెడతాడు. తద్వారా తన ఆధిక్యతను, వంశగౌరవాన్ని నిలుకునేందుకు కీర్తికోసం మాత్రమే దానాలు చేస్తాడు. అయినా అంతటి పేరు ప్రతిష్టలు పొందలేకపోతారు. అతని నుండి ఆర్థికసాయం పొందినవాళ్ళే ''*ఖర్చుపెట్టాడంటే ఎవరికోసం పెట్టాడు? మనకోసం పెట్టాడా? తనపేరుకోసం, పదిమందిలో మంచివాడనిపించుకోవడానికి పెట్టాడు.*''[40] అని ఈసడించుకుంటారు. ఏ సమాజమైనా గుడ్డిగా దీన్నీ ఆమోదించదు. సులువుగా బిరుదులూ ఇవ్వదు. సీతారామారావుకి తండ్రి వారసత్వంగా ఏ మాత్రం ఆస్తి రాకపోయినా, తాను ఒక్క రూపాయి దానం చేసినా దానికి తగ్గ కీర్తి వచ్చేది ఎప్పుడు? తను సమాజంలో భాగస్వామియై సంఘశ్రేయస్సుకోసం తన ప్రయత్నాలు తాను చేస్తుంటే! ఆ తపన లోని నిజాయితీ, ఆ వ్యక్తిత్వంలోని గాంభీర్యం అతనికి ఎవ్వరి కితాబులు లేకుండా గౌరవాన్ని తెచ్చిపెట్టేవి. కానీ చొక్కా నలగకుండా దానం చేస్తే 'కొవ్వే'ననుకుంటారు ఎవ్వరైనా !

ఆడవారిపట్ల ఏమాత్రం సదభిప్రాయంలేని సీతారామారావుకి వివాహం పట్ల కూడా భిన్నాభిప్రాయాలుంటాయి. వివాహం ఎందుకు చేసుకోవాలంటూ ప్రశ్నిస్తాడు. ఇందిరను ప్రేమించి పెళ్ళి చేసుకుంటాడు. పెళ్ళికి ఒక నూతన అర్థాన్ని కల్పిస్తాను' అని తనను తాను సమర్థించుకుంటాడు. రోజులు గడిచే కొద్దీ ప్రేమించిన భార్య శారీరక లావణ్యం పోతుంది. సగటు మధ్యతరగతి స్త్రీగా మార్పుచెందుతుంది. ఒక పిల్లకు తల్లవుతుంది. కుటుంబాన్ని పోషించలేని అసమర్థతతో సీతారామారావు. భార్యను శత్రువుగా చూడడం మొదలుపెడతాడు. లైంగిక జీవితంలో కూడ ఓడిపోతాడు.

### 4.5 .6 సీతారామారావు పై వంశ ప్రభావం:

సీతారామారావు తండ్రి, తాతల వారసత్వాన్ని ఒంటపట్టించుకున్నాడు. డబ్బుదేముంది, మనిషికి కావలసింది పేరు' అనేది వాళ్ళ వంశం ఫిలాసఫి కాబట్టే తాతముత్తాతల కాలం నుండి వారసత్వంగా సంక్రమించిన ఆస్తిపాస్తుల్ని సునాయసంగా ఖర్చు చేసారు. అడిగిన వారికి అగిగినంతగా దానం చేసాడు. ఇక్కడే వీరి కుటుంబం యొక్క 'పోకడ' తెలుస్తుంది. వారసత్వంగా వచ్చిన ఈ 'అపాత్రదానం' వీరి కుటుంబాన్ని మెల్లగా మెల్లగా దివాళా తీయించింది. సీతారామారావు దగ్గరికి వచ్చేసరికి ఆస్తి హారతికర్పూరంలా హరించుకుపోయింది. ఇలాంటి సందర్భాలు మనం నిజజీవితంలో కూడ అనేకం గా

[40] అసమర్థుని జీవయాత్ర, పు: 22

చూస్తుంటాము. ఉన్నతంగా బతికినవారే 'అనవసర భేషజాలకు పోయి తిండికి అవస్థలు పడేవారు చాలామందీలోకంలో, వారికండ్లముందే మిగతావారు క్రమంగా ఎదుగుతుంటే, అది చూసుకుంటూ దాన్ని అర్థం చేసుకుంటూ తమ బలహీనతల్ని దాటలేక జీవితంలో ఓడిపోయేవారు అనేకం.

తండ్రి చనిపోతూ ''*బాబూ! మన వంశంపేరు నిలబెట్టు అంతకంటే నేను చెప్పేది లేదు.*'' అంటాడు. అక్కడున్న వాళ్ళంతా ఆశ్చర్యపోతారు. డబ్బుగురించి, ఆస్తిపాస్తుల గురించి, ఏమీ చెప్పక పేరు, ప్రఖ్యాతుల గురించి, మాత్రమే చెప్పి, చనిపోతాడు. సీతారామారావుకి తండ్రి చూపించిన మార్గమే శిరోధార్యం. వసూలుకాని బాకీలను పేరు ప్రఖ్యాతులకోసం వదిలేసాడు. మేనమామ నలభై వేల రూపాయలు చెల్లించవలసి వుంటే, పదివేల రూపాయల విలువ చేసే భూమిని తీసుకొని బాకీ రద్దు చేసాడు. చేతికి ఎముకలేదనిపించుకున్నాడు. అంతా అయిపోయాక, తండ్రి తాత నుండి ఆస్తిపాస్తుల రూపంలో వచ్చిన సమర్థత అవి కరిగిపోగానే అది కూడా కరిగిపోయింది. నిజానికి ఇప్పుడే అచ్చమైన వ్యక్తిత్వం బయటపడుతుంది. తనపై ఎవరినీడ , ప్రభావం లేకుండా ఉన్నప్పుడే సొంత వ్యక్తిత్వం బహిర్గతమౌతుంది. తీసుకునే నిర్ణయాలు జీవితాన్ని ఏ వైపుకి నడిపిస్తాయో తెలుస్తుంది. ఆస్తి కరిగిపోగానే చుట్టూ మూగిన జనం కూడ దూరం జరిగిపోయారు. ''*తెప్పలు తేలిపోగానే కప్పలు వెళ్ళిపోయాయి*'' చుట్టూ మూగిన జనంతో, తన కీర్తిని అంతెత్తులో నిలబెడతామనుకుంటే చివరికి కుటుంబమే మిగిలేసరికి, తను కూడ పొట్టకూటికై ఉద్యోగం చేయాల్సి రావడంతో సీతారామారావులో అసహనం మొదలైంది. సీతారామారావు జీవితం చిత్రమైంది. ఉన్నత శిఖరాగ్రం నుంచి స్వచ్ఛమైన జలంతో భూమిమీద పడి, మలినాన్ని కలుపుకొని మురికి కూపంలోకి ప్రవహించే సెలయేటిని జ్ఞప్తికి తెస్తుంది'. అనడం అతడి జీవితానికి, ఆదర్శానికి అద్దం పడుతుంది.

కొంత తెలివిమంతుడు కావడంతో జరిగిన సంఘటనలను విశ్లేషిస్తాడు. కారణాలు వెతికితే బాగుండేది కానీ కేవలం విశ్లేషిస్తాడు. ఈ విశ్లేషణ సుదీర్ఘంగా తార్కికంగా, మంచితనం అనే ముసుగుతో, రకరకాలుగా రోజుల తరబడి చేస్తూనే ఉంటాడు. మిత్రులను కూడా సంప్రదిస్తాడు. తను ఊహిస్తున్న జవాబులు రాకపోయేసరికి ఒంటరిగానే ఆలోచిస్తుంటాడు. సమాజానికి దూరమై కుటుంబానికి భారమై మంచానికి పరిమితమౌతాడు. ''*మానవుల శరీరాలకే కాక ఆత్మలకూ రోగాలు వస్తాయి. భౌతిక (శారీరక) లక్షణాలకు చికిత్స చేసే వైద్యుడు మానవునిలోని భాభాగానికే చికిత్స చేస్తున్నాడు. మానవుడంటే శరీరం ఒక్కటేకాదు. సహజాతాల (Instinects) అంతరాత్మల (Conscience) రణరంగం. ప్రబోధనలను*

*అణచివేసే యుద్ధభూమి. యుద్ధం అనివార్యం. ఈ యుద్ధానికి మానవుడు దూరంగా ఉండలేడు. బాహ్య ప్రపంచంలోకి సాంఘిక ధార్మికతకు స్వీయ అంతర్ప్రపంచంలోని సంవేదనలనకు మధ్య అతను సాహసోపేతమైన సేనాని కావాలి. ధైర్యవంతుడైన న్యాయనిర్ణేత కావాలి. అలాకాక పలాయనం చిత్తగించాడో రుగ్మతకు గురైనాడన్నమాటే'* [41] స్త్రీలపట్ల సదభిప్రాయం లేని సీతారామారావు ఎంతలా ప్రేమించి పెళ్ళి చేసుకున్నా వివాహానికి ఎన్ని నూతన అర్థాలు కల్పించే ప్రయత్నం చేసినా మామ ఇప్పించిన ఉద్యోగం, భార్య శారీరక లావణ్యం తగ్గనంత వరకే సమాజంలో బాధ్యతగా ఉన్న మనిషి, తన కుటుంబం ఆర్థిక పరిస్థితిని గమనించి తన అహాన్ని, అదుపులో పెట్టుకొని, ఉద్యోగం చేస్తుండాలి. ఒకవేళ చేస్తున్న ఉద్యోగం నచ్చకపోతే ఫరవాలేదు. కానీ భార్య పిల్లల పోషణభారం తనపై ఉన్నప్పుడు తన ప్రవర్తన ఎలా ఉండాలి?

ఉన్ననాడు సంక్రాంతి, లేనినాడు శివరాత్రి. అన్నట్లుగా సీతారామారావు– 'ఉన్నప్పుడు' నిప్పులు చిమ్ముకుంటూ పైకి వెళ్ళలేకపోయాడు. లేనప్పుడు మాత్రం నెత్తురు కక్కుకుంటూ నేలకు రాలిపోయాడు.' అతని ఏ ప్రయత్నంలోనూ నిజాయితీ లేదు. కాబట్టి దానం చేసినపుడు ఎవ్వరూ గౌరవించలేదు. తిండికి ఇబ్బంది పడుతున్నప్పుడు ఎవ్వరూ కనికరించలేదు. వ్యక్తిగతంగా సామాజికపరంగా ఓటమి చెందాడు సీతారామారావు.

తార్కిక విశ్లేషణ వ్యక్తికి జీవితాన్ని చక్కగా, నిర్మాణాత్మకంగా గడిపేందుకు ఉపకరిస్తుంది. విశ్లేషణ కేవలం అక్కడే ఆగిపోకుండా అది ఎలాంటి సమాధానం ఇస్తుందో, ఆ సమధానాన్ని కాలపరీక్షకు పెట్టి నిర్వహణలో దాని ఫలితాన్ని అంచనా వేయడం తెలివైనవారు చేసేపని, నకారాత్మకమైన ఆలోచనలున్నవారు ఎప్పుడూ 'బుకాయించే' ప్రయత్నం చేసేవారు. ఎదుటివారిని 'తెలివి'గా బురిడీ కొట్టిస్తామనుకుంటారు. కాని నిజానికి మోసపోయేది వీరే. సీతారామారావు తన భార్య విషయంలో ఇలాగే ప్రవర్తించేవాడు. చివరకి తానే ఎటూ కాకుండా పోయాడు. ''*సీతారామారావు హేతువాదం నవ్వుతో బాటు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. అయితే అతగాడి హేతువాద ధోరణిని జాగ్రత్తగా గమనిస్తే సీతారామారావు జీవితం మళ్ళీదోవలో నడవడానికి కారణం హేతువాదం కాదు. తనలోని మానసిక దౌర్బల్యాల కారణంగా అతగాడు మళ్ళీదోవలో కావాలని నడిచి, ఆ తప్పును హేతువాదం మీదకు నెట్టేశాడని తెలుస్తుంది. అమాయకుడిగా కనిపిస్తూనే, హేతువాదం చేత బండచాకిరీ చేయించుకున్న ఘటికుడు సీతారామారావు*''[42]

---

[41] సిగ్మండ్ ఫ్రాయిడ్ , పు:50

[42] తెలుగు నవలాసాహిత్యంలో మనోవిశ్లేషణ, పు:178

## 4.5 .7 సీతారామారావు వాస్తవికతా సంఘర్షణ :

''*వృత్తి, సామాజిక, వైవాహిక రంగాల్లో పరాజయం పొందిన తర్వాత, సమాజానికి, అంతరంగికులకు తనపై ఏహ్యాభావమే ఉన్నట్లు గ్రహిస్తాడు. ఆత్మన్యూనతకు లోనైన అతనికి జీవితం నుంచి, వాస్తవం నుంచి పారిపోవడం సహజగుణం*''[43] కాబట్టే సీతారామారావుకి వాస్తవ ప్రపంచం పెద్దగా రుచించదు. ఒంటరిగా, సోమరిగా పడుకోవడం, కలలుకనడం—— ఇవే వ్యాపకాలుగా మారతాయి. ''*జీవితంలో వాస్తవ పరిస్థితులలో సమన్వయం కుదుర్చుకోలేకపోవటం వలన అంతస్సంఘర్షణ, ఆ అంతస్సంఘర్షణ వలన మనోదౌర్బల్యం, దాని నుండి మానసిక రుగ్మత, అటు తరువాత అది పూర్తిగా ఉన్మాదంలోకి దారితీయటం ఏ విధంగా సంభవిస్తుందని పరిశీలించటానికి నవల ఒక మంచి నిదర్శనం.*''[44] సమాజానికి, జీవితానికి చక్కని సమన్వయం కుదిరితే ఏ ఉద్యోగమైనా నిజాయితీగా, తృప్తిగా చేసేవాడు. సమన్వయం లోపించినపుడు, ఆలోచనల్లోకూడ సహజ విరుద్ధమైన కలలు రావడం సహజం. బందిపోటు కలలో అందర్నీ దోచుకోవడం, అందమైన యువతిని మానభంగం చేయక ఔదార్యాన్ని ప్రకటించడం ఇవన్నీ అతని విపరీత ప్రవర్తనా చిహ్నాలే.

ఆఖర్లో, శ్మశానంలో సీతారామారావు ఇన్నేళ్ళ భ్రాంతిలో నుండి బయటికి వచ్చాడు. జీవితానికి అక్కరకు రాని అనవసరమైన ప్రశ్నలనుండి తేరుకున్నాడు. జీవితాన్ని భ్రమల్లో, కాకుండా నిజంగా జీవిస్తేనే జీవితానికి సార్ధకత అని తెలుసుకునే సందర్భంలో ఉన్నాడు. అతని సంఘర్షణ ముగింపుకి వచ్చింది. సంఘర్షణ ముగింపులోనే జ్ఞానం వికసిస్తుంది. ఆ సమయంలో శ్మశానంలో ఓ వృద్ధుడు తన విషాదగాథ చెప్పుకొని ''*ఏం నాయినా నేను చేసింది తప్పా*'' అని *అడిగితే అంతకు అనవసరమైన విషయాలకి, అనవసరమైన తర్కంతో విశ్లేషించే సీతారామారావు* ''*ఏది తప్పో ఎవరు చెప్పగలరు? ఎవళ్ళ మనస్సు వాళ్ళకే సాక్షి*'' అనడంలో అతని అహం తొలగిపోయింది. మనసులో ఎలాంటి సంఘర్షణ వాతావరణం లేకుండా తండ్రి సమాధి వద్దకు వెళ్తాడు.

తండ్రి సమాధి దగ్గర జిల్లేడు మొక్కలు కనిపించాయి. జిల్లేడు మొక్కలకు తండ్రి ఎరువులా మారాడనిపించింది. తనకు ఆదర్శంగా ఉండే తండ్రి జిల్లేడు మొక్కలకు ఎరువుగా మారడం, తన పుట్టుకకూ, జిల్లేడు పుట్టుకకూ తండ్రే కారణం– జిల్లేడు మొక్కలకు కాక గులాబీ మొక్కలకు ఎరువుగా మారవచ్చుగదా తన బదులు ఒక గొప్పవ్యక్తి కొడుకు కాకూడదు. ఇలా ఆలోచించి ఈ

---

[43] తెలుగు సాంఘిక నవలల్లో కథాకథన శిల్పం, పు:133

[44] తెలుగు నవల – మనోవిశ్లేషణ, పు:63

ఆలోచనల్లోంచే ఒక సకారాత్మక నిర్ణయానికి వస్తాడు. భ్రమ తొలగిపోతుంది. తన తండ్రిలో కూడ ఏదో దోషం ఉందని గుర్తిచగలుగుతాడు. ఇంతలో తండ్రి సీతారామారావు మీదికి విరుచుకుపడతారు. 'నీమీద ఆశపెట్టుకుంటే – నా వంశ ప్రతిష్టనూ, గౌరవాన్ని, ఔన్నత్యాన్ని బుగ్గిపాలు చేసావు అంటారు. సీతారామారావు ''*డబ్బు అయిపోయింది నాన్నా!*'' అని జవాబిస్తాడు. దీన్తో తండ్రి మరింత కోపానికి వస్తాడు. ''*సీతారామారావు జీవయాత్ర హాస్యస్ఫోరకంగా ప్రారంభమై కరుణాజనకంగా పరిణమించి భీభీత్సంలో అంతం అవుతుంది! అతని ఘర్షణ లోకంతో అన్నట్లుగా మొదటతోచి వాస్తవంలో అది అతని ఆంతర్యంలోని సంఘర్షణగానే వ్యక్తమై, చివరకు ఆత్మహత్యగా పర్యవసిస్తుంది. ఆ పర్యవసానంలో ఆ చివరిఘట్టంలో సీతారామారావు పాత్రకూ, మనస్తత్వానికీ కీలకమైన రహస్యం వ్యక్తం చేయబడుతుంది.*''[45]

సీతారామారావుకి అహం పొర తొలగిపోయేసరికి తన వంశం తాను ఇలా అయ్యేందుకు పూర్తి కారణం నువ్వే అంటూ తండ్రి నిలదీస్తాడు. నీ వంశం సంప్రదాయాలు, గౌరవం అనే గానుగలో ఎందరు పిప్పి అయ్యారో తెలుసా? నాకిన్ని కష్టాలు వచ్చినా నీ ఆత్మశాంతిగా ఉండాలని ప్రయత్నించాను. ఇప్పుడు నేనే పాతాళానికి పోతున్నాను. తండ్రిని ఎదిరిస్తాడు. తల్లి సమాధిపై పడి ఏడుస్తాడు. తల్లి 'నువ్వు మారావు నాయినా' అంటుంది. ''*నేను మారానా అమ్మా, నేను నిన్ను సంతోషం పెట్టగలనా అమ్మా?! అంటూ భోరున విలపిస్తాడు. మరి లాభం లేదమ్మా! ఆలస్యం అయిపోయిందమ్మా!' అంటూ తన నీడతో పోట్లాడి తన రెండు చేతుల్తో, గొంతు పట్టుకుని పిసిక్కొంటాడు. సీతారామారావు చనిపోయాడు. తన అసమర్ధతని కప్పిపుచ్చుకునేందుకు అతనికి ఏదారీ కనబడలేదు. వెనక్కి తిరిగి చూసుకుంటే అతని మూర్ఖతం వల్ల తానూ కుటుంబం ఎంతగా హింసించబడ్డారో తెలిసింది. దీనికంతటికి 'తానే' కారణమని తెలుసుకున్నాడు. ''మానవుని కొక్క తెలివియుండుటయే చాలదు. ఒక్క విజ్ఞానమే చాలదు. దాని నుపయోగించుకొను పద్ధతులు గూడ, తెలియవలెను. ఉత్తమ సంస్కార ముండిననే గాని వాని తెలివితేటలు, విజ్ఞాన వివేకములు చదువు సంధ్యలు సద్వినియోగమునకు రావు......*''[46]

ఇంతకు మునుపు ప్రపంచం మొత్తం తనపై పగ తీర్చుకుంటుందనుకునేవాడు. ఇప్పుడు తన ఆలోచనలోని వైరుధ్యాన్ని తెలుసుకున్నాడు. ''*సీతారామారావు కథలో మనకు ఎన్నో సంఘర్షణలు కనబడతాయి. అతడు తల్లి తండ్రి నుండి వారసత్వంగా తెచ్చుకున్న భావాల మధ్య*

---

45 సాహిత్యంలో దృక్పథాలు, పు:152

46 ఆంధ్ర నవలా పరిణామము, పు:428

*సంఘర్షణ, హేతుజ్ఞానానికీ జ్ఞానానికీ మధ్య సంఘర్షణ, ఆదర్శానికీ ఆచరణకీ మధ్య సంఘర్షణ. ఆ సంఘర్షణలన్నింటిలోనూ సీతారామారావు అసమర్థునిగానే ఋజువు చేసుకున్నాడు.''*[47] అనే విశ్లేషణ అసమర్థుని జీవితం ఎలా ముగిసిపోయిందో తెలుపుతుంది.

సీతారామారావులో ఎలాంటి నిర్మాణాత్మక ధోరణి కనిపించదు. కుటుంబంలో కొడుకులా తండ్రిని, వారిని, ఇల్లును సరిదిద్దే ప్రయత్నం చేయడు. తండ్రి తదనంతరం తండ్రి దారిలోనే ప్రయాణిస్తూ భార్యాపిల్లల్ని వీధిపాలు చేస్తాడు. బంధువులపట్ల అవమానంగా ప్రవర్తిస్తాడు. ఉద్యోగంలో నిలకడ ఉండదు. సాటి ఉద్యోగస్తులతో సఖ్యత ఉండదు. మిత్రులతో అనవసరపు వ్యాఖ్యలు. తోవలో కనిపించిన ఆడవారిపై చులకనగా మాట్లాడతాడు. కలల్లో కూడా అసహజపు కలలు కంటాడు. కుటుంబ సంబంధాలను, సామాజిక సంబంధాలను నిర్మించుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందుతాడు. మెలకువలోనే కాదు. నిద్రలో కూడ ఇతని ప్రవర్తన ఆక్షేపణీయం. సీతారామారావు అంతర్గతంగా బహిరంగంగా మానవీయ విలువలను అహం కారణంగా నిలుపుకోలేక పోవడం వల్ల– జీవితం ద్వారా దేన్నీ పొందలేకపోయాడు.

★★★

[47] తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ: (పు:182)

ఐదవ అధ్యాయం

# తెలుగు నవలల్లో మానవ సంబంధాలు - శిల్ప వైవిధ్యం

## 5.0 పరిచయం:

రచయిత తాను సమాజంలో ప్రత్యక్షంగా చూస్తూ, అనుభవంలోకి తెచ్చుకున్న అనేక విషయాలను ఆధారంగా చేసుకొని, భావనలో విశేషమైన అనుభూతిని పొందుతాడు. ఇది తన అంతరంగంలో 'విషయము'గా అనేకసార్లు మననము చేయబడి సాధనరూంలో 'రచన'గా వెలువడుతుంది. అంటే రచనకు పూర్వము రచయిత మనసులో రూపుదిద్దుకున్న విశేషమే, సార్వజనీన లక్షణాలతో 'సృజన'గా లోకానికి పరిచయం చేయబడుతుంది. ఏ రచనల అయినా 'లోకం' ద్వారానే పుట్టి మన అనుభవంలోకి వస్తుంది.

*"....అతడా జీవిత నాటకంలో పాత్ర వహించి తీరాలి. ఒక నవల ప్రథమాధ్యాయం ప్రారంభించేముందు, నెలలకొలది, సంవత్సరాలకొలది సన్నాహం చేయాలి. నోట్సు మొదటి ప్లానులు వగైరా సిద్ధం చేసుకోవాలి. ఇతర ప్రజలతో కలిసి గాఢంగా జీవించాలి. వారి సుఖసంతోషాలలో పాల్గొనడం. ఉత్సాహ నిరుత్సాహాలతో భాగస్వామి కావడం, యితర ప్రజలతో సన్నిహిత సంబంధం మొదలైనవి వుండాలి"*[1] మనము సాధారణంగా చేసే పనులు మనస్సు యొక్క పైభాగం నుండే సాగుతాయి. 'సృజన'మాత్రం మనస్సు యొక్క అంతరాంతరాలకు సంబంధించిన వ్యవహారం, సమాజంలో ప్రతి మనిషికి కొన్ని ధర్మాలుంటాయి. అలాగే రచయిత సృష్టిలోని పాత్రలకు కొన్ని ధర్మాలుంటాయి. ఈ ధర్మాలు పాత్రలు, చేష్టలు, మాటల రూపంలో కనిపిస్తాయి. ఇలాంటి పాత్రల్నే సజీవ పాత్రలు అంటారు.

## 5.1 నిర్వచనం:

సరైన విమర్శనాశక్తి ఉన్న రచయిత తన అభిరుచి మేరకు రచన చేస్తున్నప్పుడు, అతని సృజనాత్మక, వివేచనాత్మక శక్తులు రెండూ ఆ 'రచన'ను పూర్తిగా తమ ఆధీనంలో ఉంచుకొంటాయి. రచయిత ఏది చేసినా పూర్తిగా తెలుసుకొని చేయాలి. 'రచన'లో ప్రతీ అంశమూ ప్రయోజనవంతంగా ఉండాలి.

---

[1] రచయిత శిల్పమూ, పు:23

రచన ప్రయోజనవంతంగా ఉండాలంటే రచనా నిర్మాణంలో మొదటి బహిరంగంగా కన్పించే కూర్పులోని నేర్పుకాగా రెండోది రచయిత హృదయంలో సాగే మానసిక వ్యాపారము. వీటికోసం సృజనకారుడు, ''*ఒక నవలలోని పాత్రలు ఫోటోగ్రాఫ్ ల సంపుటి కాదు. లేక వ్యక్తికి సంబంధించిన శాఖలో ప్రశ్నల పరంపరల ఫైలూ కాదు. రచయిత ఊహాచిత్రానికి ఆ వ్యక్తులయినా, వారు వాస్తవిక వ్యక్తులే, ఎందుచేతనంటే, జీవితాన్ని లోతుగా చూసి అన్వయించే నైపుణ్యం గల రచయిత ఆ పాత్రలకు జీవం పోస్తాడు.*''[2] కాబట్టి రచనను 'లోనారపి' చూపడం, అలాగే అందులో నిరూపించబోయే వివిధాంశాల మధ్య సూక్ష్మమైన సంబంధం ఉండేలా చూస్తాడు. ఈ విధంగా రచన యొక్క బయటి శరీరానికి, లోని ఆత్మకు మధ్యగల – 'సంవిధానము' గూర్చి తెలిపేదే 'శిల్పమని భావించవచ్చు. ''*రచనా కౌశల్యం మాత్రమే గాక, నవలను పాఠకులకు ఆసక్తితో చదివేట్లు దాని సంవిధానం ఉండాలి. రచయిత కౌశల్యం అంటే మాటల కోసం ఆర్ద్రతమాత్రమే కాదు. కల్పనాశక్తి కూడ వుండాలి. మామూలుగా ఆలోచన అని పిలువబడేది సృజనాత్మక పునాది అనీ వేరే చెప్పనక్కరలేదు*''[3] రచయిత తన 'రచనతో ప్రతీ అంశాన్ని సూక్ష్మంగా పరీక్షించి, దాని స్వభావాన్ని గాఢంగా వివరించడమే శిల్పంగా చెప్పవచ్చు. రచనలోని ప్రతీ సంఘటన రచయిత ఉద్దేశించిన విషయానికి బలాన్ని చేకూర్చే దిశలో నడవాలి. దీని కొరకు రచయిత ప్రతీ అక్షరాన్ని 'స్పృహ'లోనే రాయాలి. అలాంటప్పుడే రచయిత తన రచనలో నిరూపించదలచిన 'పరమార్థం' పొందుతాడు.

భారతకథలో ''ఏ యది హృద్యమపూర్వం....'' అనే పద్యంలో హృద్యత, అపూర్వత అనేవి శిల్పానికి సంబంధించినవి. 'అపూర్వత' అంటే రచనను ఎన్నిసార్లు చదివినా ఎప్పుడు కొత్తకొత్త అర్థాలు స్ఫురించడం దీనికోసం రచయితకు ప్రపంచంపై గాఢమైన అభినివేశం ఉండాలి. సూక్ష్మ పరిశీలనాశక్తి ఉండాలి. అలాంటి సందర్భంలోనే రచయిత తన 'సృజన'ను విశేషంగా చేయగలుగుతాడు. 'హృద్యత' అంటే కథను చదువుతుంటే ముందు జరగబోయే కథపై ఉత్కంఠ పెరగడం. ఇది ప్రస్తుత కథ నుండే పుట్టాలి. అంటే రచనా సంవిధానం ఆ రచన నిండా ఉండాలి. ఏరచనలోనైనా 'హృద్యత' అపూర్వతపైనే ఆధారపడి ఉంటుంది.

రచనను అపూర్వంగా చేయాలనే ఉద్దేశంతోనే రచయిత ఆ రచన మొదట, చివరా పాఠకునిలో ఉత్సుకత పెంచేందుకు తన రచన ద్వారా పాఠకులకు దేన్ని

[2] రచయితా శిల్పము: పు:33

[3] రచయితా శిల్పము: పు:20

తెలియజేయాలనుకున్నాడో దాన్ని నిక్షేపిస్తాడు. రచనలో అన్ని సన్నివేశములు ఆ రచన యొక్క 'ప్రయోజనాన్ని' నిరూపించేందుకు దోహదపడాలి.

రచయిత తన అనుభవములోనికి వచ్చిన అన్ని విషయాలను వర్ణించాలనుకున్నప్పుడు అందులో సహజంగానే రాగద్వేషాలుంటాయి. వీటిని 'ఉచితమైన' రీతిలో వర్ణించాలి. ''*రచయిత తాను అనుభవించిన దానినే కాక, పరిశీలించిన దానిని కూడ మార్చుతాడు. అయినా ప్రజల ఆలోచనను, భావోద్రేకాలను తాను అర్థం చేసుకోగలడు. ఆ ప్రజలనే రచయిత యెప్పుడూ వర్ణించుతాడు. ఆ రచనలోని పాత్రలు యెలా నడుస్తాయో అర్థం చేసుకోవాలి. ఆ పాత్రల స్వభావాన్ని తనకు వెల్లడించే అనుభవాన్ని రచయిత పొందాలి.*''[4] దీర్ఘ వర్ణనలు కథ యొక్క 'ఐక్యత'కు భంగం కలగకుండా చూసుకోవాలి. ఇవి సాధారణంగా కథా గమనానికి అడ్డంగా వస్తూ, రచనా సౌందర్యాన్ని దెబ్బతీస్తాయి.

రచయిత చెప్పదలచుకున్న భావాలను వ్యాఖ్యానించేందుకు, వాటికి తాను ఉద్దేశించిన దృక్కోణాన్ని కల్పించి, ఆ కోణం నుండే పాఠకులకు కథను అందించేందుకు 'శిల్ప' సాయపడుతుంది. సాధారణంగా శిల్పం కథా ప్రయోజనం పైనే కాకుండా అది చెప్పే రీతి పైన కూడ ఆధారపడుతుంది. శిల్పి ఏ ప్రయోజనాన్ని ఆశించి రచన చేస్తున్నాడో దానికి అభిముఖంగానే వర్ణనలు చేయాలి. అక్కడ కూడ దీర్ఘ వర్ణనలు వస్తువు యొక్క జీవితాన్ని దెబ్బతీస్తాయి. రచన 'ఔచిత్యాన్ని' కోల్పోకుండా చూసుకోవాలి. రచయిత అనుభవంలోని 'వస్తువే' పాఠకునికి చేరాలి. ''*రచయిత దేనిపైన బడితే దానిపైన ఎవరిపైన బడితే వారిపైన రాయలేడు. విషయాన్ని ఎన్నుకోవడంలోను, పాత్రలను ఎన్నుకోవడంలోను, ప్రతి రచయితలకూ ఒక పరిమితి ఉంది. ప్రతి రచయితకూ, అతడందరికన్నా గొప్పవాడైనా, కొన్ని అడ్డుగోడలున్నాయి. నవలా రచయిత యొక్క రచన అతను నివసించే సమాజం చేత నిశ్చయించబడుతుంది.*''[5] రచయిత 'వస్తు నిరూపణ' లో ఏ సన్నివేశంలోనైనా పట్టు కోల్పోతే పాఠకునికి అతని ఉద్దేశం సరిగ్గా అర్థం కాకపోవచ్చు. ఇక్కడ రచయిత 'జవాబుదారీ'గా ఉండాలి అని అర్థమౌతుంది.

## 5.2 శిల్ప ప్రయోజనం:

రచయిత తన రచనను మిక్కిలి ప్రయోజనవంతంగా, పాఠకుల హృదయాల్లో చిరకాలం ఉండేలా నిర్మాణం చేయాలంటే కొన్ని సామాన్యాంశాలపట్ల దృష్టి పెట్టడం తప్పనిసరి. కథలోని

---

[4] రచయితా శిల్పము, పు:23

[5] రచయితా శిల్పము, పు:12

వివిధ సన్నివేశాల మధ్య నిర్మాణాత్మకమైన సంబంధం. రచయిత యొక్క పరిశీలనానుభవం రచయితకు తన సమకాలీన విషయాలపట్ల పూర్తి అవగాహన, అతని వ్యక్తిత్వం ఆ రచనను ప్రజల దగ్గరికి చేరుస్తాయి.

రచన కేవలం పాఠకునికి ఆనందాన్ని ఇచ్చేందుకే కాక, కేవలం సాహిత విలువలు నిరూపించుకనేందుకే కాక, అది పాఠకునికి సామాజిక బాధ్యతను కూడ గుర్తు చేసేందుకు కూడ దోహదపడాలి. రచనా నిర్మాణము పాఠకున్ని ఆ వైపుగా నడిపించేందుకు రచయిత 'వస్తువు'ను పూర్తి చైతన్యవంతంగా తయారుచేయాలి.

రచన కేవలం కొన్ని సంఘటనల కూర్పుగానే చూడరాదు. దీని నిర్మాణములో ఆ రచనలోని అన్ని సన్నివేశములు 'మధ్య' 'పొందిక' ఎంతో అవసరం. అవసరం లేని సన్నివేశాలు, పాత్రలు విషయాలు రచన యొక్క సాంద్రతని తగ్గిస్తాయి. నేర్పరి యైన రచయిత ప్రతీ వాక్యానికి ఒక సన్నివేశాన్ని సృష్టిస్తాడు. పాత్రల యొక్క మానసిక అవస్థల ఆధారంగా అవి ప్రతిపాదించే విషయాల ఆధారంగా, ఇంకా అనేక విశేషముల ఆధారంగా ఆ రచనలో భాష – శైలి మారుతుంటాయి. ''*భాష పట్ల రచయితకు గల భావనతో సన్నిహితంగా అతని నైపుణ్యం కూడా ముడిపడి ఉంటుంది. నిరంతరం కష్టపడిపని చేయడం వల్లనే అతని పనితనం అభివృద్ధి చెందుతుంది.*''[6] ఔచిత్యం తెలిసిన రచయిత వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని నైపుణ్యంతో రచన చేస్తారు. రచనలో కథ, పాత్రలు, ప్రకృతి వర్ణన మొదలైనవి అన్ని కథా ప్రయోజనానికి అనుకూలంగా ఉండాలి. ఇవన్నీ కలిసి 'ఏకరూపత'ను సాధించాలి. కథ యొక్క మొదలు, ముగింపు కలిపే విధంగా రచన సాగాలి. రచన యొక్క 'పరమార్థం' తప్పనిసరిగా ఆ రచన నిండా పరుచుకొని ఉంటుంది. సన్నివేశానుకూలంగా రచయిత దాన్ని మొదటా, చివరా సూచిస్తూ ఉంటాడు. తాను స్వీకరించిన వస్తువు యొక్క ప్రయోజనాన్ని, అంటే తన 'రచన' ద్వారా పాఠకులకు ఏ 'విషయాన్ని' చేరవేయదలచినాడో దాని గురించి కచ్చితమైన అభిప్రాయం ఉన్న రచయిత తప్పనిసరిగా వివరిస్తాడు.

ఒక్కో రచనను ఒక్కో విధంగా చదవాల్సి వుంటుంది. అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఏ ప్రయోజనాన్ని ఆశించి, ఏ ఉద్దేశ్యంతో ఆ 'రచన' చేయబడి ఉందో అదే ఉద్దేశ్యంతో చదివితేనే అతడు దాని యందుంచిన 'ప్రయోజనం' దొరుకుతుంది. ''*రచయిత వినోదం కోసం, పేరు ప్రతిష్ఠల కోసం రాయడు. ప్రజలను బాగు చేయాలని, జీవితాన్ని మరింత ఉన్నత పథాలకు*

[6] రచయితా శిల్పము: (పు:18).

*నడపాలని రచయిత భావించుతాడు. మా పోరాటంలో పుస్తకాలను ఒక నైతిక ఆయుధంగా అతడు భావిస్తాడు.''* [7] ప్రయోజనం లేకుండా రాయడం, ప్రయోజనం లేకుండా చదవడం 'కాలక్షేప' రచనా ప్రక్రియగా మిగిలిపోతుంది.

రచనా నిర్మాణ సందర్భంలో, నిపుణుడైన రచయిత, తన రచన ద్వారా పాఠకులను ఉత్కంఠ భరితుల్ని చేస్తాడు. రచనలోని అధ్యాయాల విషయంలో, ఆయా సన్నివేశాల విషయంలో పాఠకుల మనస్సు 'భావనామయం' అయ్యేటట్లుగా చేస్తాడు. పాఠకుడు రచనను ఆస్వాదిస్తూ చదువుతాడు. ''*ఒక నవలను చదివినపుడు పాఠకుడు రచయితకు సంబంధించిన కృషికి తోడుగా మరికొంత పని చేస్తాడు. కథలోని ఖాళీలను ఊహలతో నింపుతాడు. తనకున్న అనుభవాన్ని పురస్కరించుకొని సహజంగా పాఠకుడు ఈ పని చేస్తాడు. ఒక నవలలోని పాత్రలను విభిన్న పాఠకులు విభిన్న విధాలుగా అవలోకించుతారు. పాఠకుని ఊహననుసరించి ఆ పాత్రలను పైకెత్తడమో, దిగజార్చడమో చేస్తారు.''* [8] రచయితకు 'వస్తువు'ను ఎంచుకోవడంలోనే అతని ప్రతిభ కనిపిస్తుంది. ఉత్తమమైన భావాల్ని సామాజిక చైతన్యాన్ని, మానవీయ విలువల్ని ప్రతిపాదించే వస్తువును ఎన్నుకొని, నైపుణ్యవంతంగా, చైతన్యవంతంగా, దాన్ని నిర్వహించాలంటే రచయితకు నిగ్రహశక్తి, ప్రతిభను అదుపుచేసుకునే శక్తి ఉండాలి. అందుకనే ప్రతీ ఉత్తమ సంస్కారం గల రచయిత ప్రతిదీ 'తెలుసుకొని రాస్తారు'. రాసిన దాంట్లో అనేక విషయాలను చేర్చి రాస్తారు. ''*సాధారణంగా ఒక నవలలోని పాత్ర అనేక వ్యక్తుల మేళనం. అనేక మంది ప్రజలను అనేకసార్లు కలుసుకున్నాక అవి సృష్టించబడతాయి. ఆ పాత్రలలో రచయిత తన యావజ్జీవిత అనుభవాన్ని చొప్పించుతాడు.''* [9] తన జీవితాంతం సంపాదించిన జ్ఞానాన్ని తన రచనలో కూర్చి పాఠకులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తారు.

అత్యంత నేర్పరితనంతో రచయిత, తన రచనతో సంఘటనలను చెప్పడంలో అనేక పద్ధతులను, మెలకువలను ఉపయోగిస్తాడు. పైపై అంశాలను మాత్రమే గమనించే సాధారణ పాఠకునికి పైకి కన్పించే అర్థము. ఒక విధంగానూ జాగ్రత్తగా చదివినచో దాని వెనక అనంతమైన వైవిధ్యముతో 'మహార్థాన్ని' విశేష పాఠకులకు కూర్చుతారు. ఇది భాష నుండి సంఘటనలు, సన్నివేశాలు, శైలి ఇలా అనేక రకమైన 'ఆకరాల'పై ఆధారపడి ఉంటుంది. ఇంకా సందర్భానికి అనుగుణంగా ప్రకృతి వర్ణనలు, పాత్రపోషణ మొదలైనవి తప్పనిసరిగా ఉండాలి. తాను వర్ణించే

---

[7] రచయితా శిల్పము, పు:20

[8] రచయితా శిల్పము, పు:26

[9] రచయితా శిల్పము, పు:31

ప్రతి విషయం కథా వస్తువులో కలిసిపోయే విధంగా రచయిత జాగ్రత్తలు తీసుకోవాలి. సారాంశమేమనగా రచయిత నిశిత పరిశీలనా దృష్టి, మంచి, చెడులను విచారించే సంస్కారం ఉంటూ తాను ఏ ఉద్దేశంలో 'రచన' చేస్తున్నాడో ఆ పరమార్థాన్ని పాఠకులకు అందించేందుకు తన రచనలో మొదటి అధ్యాయం నుండి చివరి వరకు తగిన జాగ్రత్తతో నిర్మాణం చేయాలి. వస్తువును ఎన్నుకోవడంలో, నిర్వహణలో, సామాజిక స్పృహతో పాటు, నిర్మాణ కౌశల్యాన్ని కలిగివుండాలి. తన రచనలో అధ్యాయాల విభజనలో, పాత్ర పోషణలో, కథా సంవిధానంతో, భాష – శైలులు విషయంలో, ప్రకృతి వర్ణనల సందర్భంలో ప్రతి అంశాన్నీ 'తెలుసుకొని' రచన చేయాలి. తన యొక్క సుదీర్ఘమైన, సునిశితమైన పరిశీలనా శక్తిని, వర్తమాన సమాజంలో జరుగుతున్న అనేక విషయాలపై చక్కని అవగాహన కల్గి వుండాలి. తన రచనోద్దేశ్యంగా దీన్ని పాఠకులకు చేరవేయదలచినాడో ముఖ్యంగా దాని పట్ల రచయితకు పూర్తిగా సాధికారిత ఉండాలి. పాఠకుల స్థాయిని ఉద్దేశించి 'రచనా వస్తువు'ను ఎన్నుకోవాలి. తాను ఏ వర్గం పాఠకులను ఆశించి రచన చేస్తున్నాడో వారి మానసిక – సామాజిక – నైతిక స్థాయిల ఆధారంగా రచన చేయాలి. సాధారణంగా ఉత్తమ అభిరుచి గల రచయిత సమాజంలో చైతన్యం రావాలని, సంస్కృతీ సాంప్రదాయాలను బలోపేతం చేయాలని, మూఢ విశ్వాసాలను తొలగించుకోవాలని, తార్కికంగా, స్నేహపూర్వకంగా, సిద్ధాంత పరంగా, సూచనప్రాయంగా, ఇలా ఎక్కడెక్కడ ఎలా ఎలా చెప్పాలో అలా చెప్పి, పాఠకులల్లో చైతన్యాన్ని పెంచే ప్రయత్నం చేస్తాడు.

సమాజంలో ఉన్నటువంటి 'వస్తవు'నే తీసుకొని రచయిత రచన చేస్తాడు. అయితే ఆ 'వస్తువు' ద్వారా ప్రస్తుత సమాజంలోని మేలు కీడులని తెలియజేస్తూ – సమాజం యొక్క గుణాత్మక అభివృద్ధిని మానవీయ విలువలను పెంచేందుకు తన రచనా క్రియను వాడుకుంటాడు. ఈ విధంగా తయారైన 'రచన' సాహిత్యంలో అన్ని ప్రక్రియల్లో కనబడుతుంది.

ఆధునిక తెలుగు సాహిత్యంలో 'నవలా' ప్రక్రియ కూడా ఇంతటి నిర్మాణాన్ని కలిగివుంటుంది. ఈ నిర్మాణ చాతుర్యాన్ని 'శిల్పం' అనే పేరుతో పిలుస్తారు. తెలుగు సాంఘిక నవల్లో – 'శిల్పం' ఏ మేరకు ఆయా నవలల్లో మానవ సంబంధాలను వివరించే ప్రయత్నం చేస్తున్నదో చూడాలి. నవలలో ప్రధానంగా కథ, కథావస్తువు, పాత్రలు, నేపథ్యాలు అంగాలుగా ఉంటాయని విమర్శకులు తెలిపారు.

రచయిత ముందుగా 'వస్తువు' కోసం ప్రయత్నిస్తాడు. తాను ఏ విషయం గురించి పాఠకులకు తెలియజేద్దామనుకుంటాడో, ఏ విషయం ద్వారా పాఠకునికి ఆనందాన్ని, చైతన్యాన్ని కలిగిద్దామనుకుంటున్నాడో ఆ 'ముడిసరుకు'ను 'వస్తువు'గా భావించవచ్చు. ఆ 'వస్తువు' చుట్టూ

సన్నివేశాలు, పాత్రలు, సంఘర్షణ, వర్ణనలు ఇవన్నీ కలిపి కథగా చెప్పవచ్చు. వస్తువును కథగా విడమర్చేందుకు వస్తువు యొక్క సారాన్ని 'కథ' రూపంలో విస్తరించేందుకు కథను మొదటి నుండి చివరి వరకూ నడిపించేవి 'పాత్రలు'. ఆ పాత్రల సన్నివేశాల, సంఘర్షణల, శైలి విన్యాసాలకు బలాన్ని చేకూర్చేది. వాటిని ముందుకు నడిపించేది 'నేపథ్యం'గా పిలుస్తారు. ప్రతీ 'నవల'కు కథ – కథా వస్తువు – పాత్రలు – నేపథ్యం తప్పనిసరిగా ఉంటాయి. అప్పుడప్పుడు వ్యాపార నవలకు కథ ఉంటుంది. కానీ 'కథావస్తువు' ఉండదు. ఏవో సన్నివేశాలను 'కాలక్షేపం' కోసం అల్లి 'కథ'ను సృష్టిస్తారు. దీనికి శక్తి చాలా తక్కువ. ఇది సమాజంపై చూపే ప్రభావమేమీ లేదు. కానీ, సామాజిక బాధ్యత గల చైతన్యవంతుడైన రచయిత పై నాలుగు అంశాలను దృష్టిలో ఉంచుకొని రచన చేస్తాడు.

'వస్తువు'ను అనుకొన్నాక అతడు ఆ సమస్యను ఏ దృక్కోణం నుంచి వెల్లడి చేయదలచాడో, ఆ సమస్యలోని ఏ ప్రత్యేకమైన విషయాన్ని విశ్లేషణ చేయదలచినాడో, దాని స్వరూపం ఎంతవరకు అర్థం చేసుకోగలిగాడో నిరూపించేది ఇతివృత్తం. ఇతివృత్తాన్ని ఏర్పరచుకొన్నాక, ఆ కథను ఏ పాత్ర దృష్టి నుంచి చెప్పాలో నిర్ణయించుకుంటాడు. దీన్నే 'దృక్కోణం' అంటారు. కథను ఎవరు చెబుతున్నారు. రచయిత అయితే తన స్వాతంత్ర్యాన్ని ఎంతవరకు ఉపయోగించుకున్నాడు? నవలలోని పాత్రనే కథగా చెప్తుంటే ఆ పాత్రకు ఉన్న స్థానమెటువంటిది? ఇలాంటివన్నీ 'దృక్కోణం'లో ఉంటాయి. ఇవి ప్రధానంగా మూడు రకాలుగా ఉంటుంది.

## 5.3 నవలా శిల్పం – రకాలు:

1. స్వర్వజ్ఞతా దృక్కోణం. 2. పరిమిత సర్వజ్ఞతా దృక్కోణం. 3. నాటకీయ దృక్కోణం.

### 5.3.1 సర్వజ్ఞతా దృక్కోణం:

ఇందులో రచయితనే కథను నడుపుతాడు. కథలో పాత్ర కనిపించకుండా, ప్రతి పాత్ర వెనక నుండి ఆ పాత్రను చిత్రిస్తాడు. అన్ని సందర్భాల్లో, అన్ని సమయాల్లో, అన్ని పాత్రల్లో ప్రవేశించి అందరి అభిప్రాయాలలో తానే చెప్తాడు. అందరి చర్యలను, వాటికి ప్రతి చర్యలను తానే తెలియజేస్తాడు. ఇందులో పాఠకుడికి, పాత్రకు మధ్య రచయిత కనిపిస్తాడు.

### 5.3.2 పరిమిత సర్వజ్ఞతా దృక్కోణం:

ఇందులో ప్రథమ పురుష, ఉత్తమ పురుషలో కథ సాగుతుంది. కథ అంతా ఒక పాత్ర దృష్టి నుండి చెప్పబడుతుంది. ఆ పాత్రకు కథలో ఎలాంటి స్థానమున్నా, కథ చెప్పేది ఆ పాత్ర కాబట్టి కథలోని సన్నివేశాలు, పాత్రలు, పాత్రల చిత్రీకరణ, మనస్తత్వాలు మొదలైనవి అన్నీ ఈ

‘పరిమిత’ సర్వజ్ఞత కూడిన దృష్టితోనే చెప్పబడుతాయి.  ఆ పాత్ర యొక్క అవగాహన మేరకు కథ జరుగుతుంది.

### 5.3.3 నాటకీయ దృష్టి కోణం:

ఇందులో రచయిత కథను ఉన్నది ఉన్నట్టుగా వర్ణించడం జరుగుతుంది.  తన యొక్క ప్రమేయం లేకుండా పాత్రలు, సన్నివేశాలు, సంఘటనలను ‘రికార్డ్’ చేస్తాడు.  అతడు ఆ పాత్రల విషయంలో గానీ, సంఘటనలు సన్నివేశాల విషయాల్లో కానీ ఎలాంటి వ్యాఖ్యలు చేయడు. పాత్రలు, సన్నవేశాలే కథను నడిపిస్తాయి.  రచయిత ప్రమేయం లేకుండా కేవలం పాత్రలు, సన్నివేశాల ద్వారానే కథను నడిపించడం కొన్ని కఠినమైన విషయమే.  దీనిని విశిష్టమైన ‘శిల్ప’ ప్రయోగంగా చెప్పవచ్చు.

నవలలోని పాత్రల శరీరాల వర్ణన క్లుప్తంగా ఉంటుంది.  ఇది పాత్ర ప్రవేశంలోగాని, ఆ పాత్రపై ఇతర పాత్రల అభిప్రాయాలు ఆయా సంభాషణల్లో వచ్చినప్పుడు, వ్యక్తి శారీరక వర్ణన చేయడం జరుగుతుంది.  ఈ వర్ణన ఆ వ్యక్తి యొక్క వ్యక్తిత్వాన్ని తెలియజేసేదిగా కూడా ఉంటుంది.

ప్రకృతి వర్ణనలు కూడా నవలల్లో కనిపిస్తాయి.  వీటి ద్వారా ఆయా సందర్భాల్లో కథాగమనం, ప్రకృతి రమణీయత వల్ల గాని, వైపరీత్యాల వల్ల గాని ఎలాంటి ప్రభావాన్ని పొందిందో తెలిపేదిగా ఉంటుంది.  కేవలం ప్రకృతి వర్ణన కోసం మాత్రమే వర్ణిస్తే లాభముండదు. ‘‘ఏ ప్రయోజనాన్ని ఆశించకుండా రచన చేస్తే ‘కాలక్షేపమే’ అవుతుంది.  సంక్షిప్త కథనం కూడ ‘శిల్పం’ లో భాగమే.  సాంఘిక, సామాజిక, రాజకీయ వాతావరణ చిత్రా కథాగమనానికి, కథా పుష్టికి తాను నిరూపించదలచిన ‘మహార్థాన్ని’ మరింతగా నిరూపించేది అయితే నవలాకారుడు ఆయా నేపథ్యాలను అవసరం మేరకు వాడుకుంటాడు.  ఇదంతా శిల్పంలో భాగమే, ఈ సందర్భాలను ఉపయోగించి నవలకారుడు ‘రచన’ చేస్తాడు.  నవలలోని నిరూపించబడిన మానవ సంబంధాలు ‘శిల్ప’ ప్రయోగాల ద్వారా పాఠకునికి మరింతగా అర్థమయ్యే అవకాశం ఉంది.  ఇవేకాక పాత్రచిత్రణ, కథాకథనం, శైలి, వాతావరణం, ప్రారంభ ముగింపుల్లో రచయిత చేసే ‘శిల్పవిన్యాసాలు’ ఆయా నవలల్లో నిరూపించబడిన మానవ సంబంధాల్లోని గాఢతను, క్లిష్టతను, సమన్వయాన్ని స్పష్టంగా తెలియజేస్తాయి.

తెలుగు సాంఘిక నవలల్లో మానవ సంబంధాలను నిరూపించే విషయంలో కథా ప్రయోజనాన్ని సాధించేందుకు నవలాకారుని ఉద్దేశ్యాన్ని పాఠకునికి అందించేందుకు నవలల్లోని పాత్రల మనస్తత్వాన్ని, పరిణామశీలాన్ని, వ్యక్తిత్వాలను ఆవిష్కరించేందు కు నవలల్లోని ‘శిల్పం’ ఎంతగానో సహకరిస్తుంది.

## 5.4 నవలల్లో మానవ సంబంధాలు – శిల్ప వైవిధ్యం:

సృజనకారుడు తాను చెప్పాల్సిన విషయాన్ని సమర్థవంతంగా చెప్పడానికి ఎన్నుకొనే నైపుణ్యం శిల్పంలో ఉంటుంది. ఒక్కొక్క విషయాన్ని ఒక్కొక్కపద్ధతిలో చెప్పినప్పుడే పాఠకుడు ఆసక్తిని ప్రదర్శిస్తాడు. కొన్ని సార్లు రచయిత కూడా కొన్ని శిల్పపద్ధతులను కొన్ని ప్రత్యేక ప్రయోజనాలను ఆశించి ఆ శిల్పపద్ధతిని ఎన్నుకుంటాడు. ఈ క్రమంలో ఈ పరిశోధనకు తీసుకున్న నవలల్లో వ్యక్తమైన శిల్పవైవిధ్యాన్ని ఇక్కడ వివరిస్తాను.

### 5.4.1 రాజశేఖర చరిత్ర నవల – శిల్ప వివేచన:

రాజశేఖరుడు కూతురు వివాహం విషయంలో డబ్బు అధికంగా ఖర్చుచేసి అప్పులపాలై – కుటుంబ సహితంగా కాశీయాత్రకు బయలుదేరుతారు. దారిలో దొంగలు కూతురుపై దాడి చేస్తారు. కూతురు చనిపోయిందని అలాగే అడవిలో వదిలేసి వెళ్తారు. రాజశేఖరుని కుటుంబం, అంతకు ముందు రుక్మిణి భర్త దేశాంతకం వెళ్తే! – ఎవరో, అల్లుడు చనిపోయాడని వార్త తెలియజేస్తారు. ఆ విషయంపై ఆరా తీయడు. రాజశేఖరుడు – శిల్ప నిర్వహణ పరంగా ఈ సంఘటనలు ఎంతో బలమైనవైనప్పటికి – రాజశేఖరుడు ఈ రెంటినీ పెద్దగా పట్టించుకోడు. బలహీనమైన మానవసంబంధాలను రచయిత తెలియజేస్తున్నాడు. కూతురు పెళ్ళి ఘనంగా చేస్తాడు. అల్లుడు చనిపోయాడన్న వార్తనూ! కూతురు బతికిందా! లేదా? అనే విషయాలపై సందేహం కూడా లేకపోవడం, నవలలోని కుటుంబ సంబంధాలలోని డొల్లతనాన్ని తెలుపుతుంది.

ఈ సంఘటనలకు కలిపి అర్థం చేసుకుంటే ఇందులోని శిల్పరహస్యం రచయిత ఉద్దేశ్యం తెలుస్తుంది. వీరేశలింగం గారికి తమ రచనతో 'సంఘసంస్కరణ'కు సంబంధించిన విషయాలనై దృష్టి పెట్టాలనే కోరికతో 'మానవ సంబంధాల' నిర్మాణం సరిగ్గా చేయలేదు. కూతురు వివాహం ద్వారా పేరొస్తుంది. అల్లుడు చనిపోయినాడని తెలిసినా, కూతురు శిరోజాలు తీసివేయకపోవడం లాంటి విషయాల్లో కీర్తిపై, సంఘసంస్కరణలపై దృష్టి ఉన్నట్లు తెలుస్తుంది. కూతురు చనిపోయిందన్న విషయం రచయిత ఉద్దేశించని మానవీయకోణం – అందుకే దీన్ని పెద్దగా ప్రస్తావన చేయలేదు. కానీ, రుక్మిణి పాత్రను నిండుగా తయారుచేసారు రచయిత. కూతురును అడవిలో వదిలేస్తే, ఆమెకున్న 'చదువు'తో తిరిగి కుటుంబాన్ని చేరుకుంది. ఇది 'చదువు' ద్వారా రుక్మాణి సాధించిన విజయం. రుక్మిణి 'చదువు' ద్వారా తాను అడవిలో ఉన్నా, నెమ్మదిగా స్పృహ తెచ్చుకొని తనను తాను రక్షించుకొనేందుకు మగవేషం వేసుకొని, గుమస్తాగా ఒకరి దగ్గర పనిచేస్తూ చివరికి కుటుంబాన్ని చేరుతుంది. రచయిత 'చదువు' ద్వారా ఎంతటి సాహసాలు

చెయ్యెచ్చో, ఎన్ని విజయాలు సాధించవచ్చో, ఆడవారికి చదువు ఎంత అవసరమో అంతకు ముందే ఒక సందర్భంలో గ్రామ ప్రజలతో వాదిస్తాడు. ''పురాణ స్త్రీలు కూడ చదువుకొని....'' అంటూ పురాణ స్త్రీలు చదువుకొని జీవితాన్ని ఎలా చక్కదిద్దుకున్నారో చెప్తూ ఆడపిల్లలకు చదువు 'అవసరం' అని వాదిస్తాడు. వీరేశలింగం గారు అద్భుతంగా రుక్మిణి పాత్రను తీర్చిదిద్దారు. ఈమె కథలో అద్భుతమైన 'నిర్మాణశిల్పం' ఉంది. రచయిత ఉద్దేశ్యాన్ని పట్టుకున్న పాఠకునికి స్త్రీ విద్య గురించి ముందే రాజశేఖరుడు ఉపన్యాసమిచ్చాడు, కాబట్టి ఒకవేళ రుక్మిణి బతికితే ఆమెకు ఎలాంటి ఇబ్బందులుండవు. అనే విషయాన్ని గ్రహించే అవకాశం ఉంది. అయితే ఈ విషయాన్ని రచయిత బలంగా చెప్పక పోయినందుకు కారణం – రచయిత దృష్టి కోణం వేరు. కానీ, సంఘసంస్కారం కన్నా, మానవీయ విలువలే ముఖ్యం – అడవిలో ఒంటరిగా స్పృహ కోల్పోయిన ఆడపిల్ల బతికిందా? అని అడుగుతారు. కానీ – ఆ పిల్లకు చదువువస్తుందా? అని తెలుసుకోరు. మానవీయ సంబంధాలను రాజశేఖరుడు సరిగ్గా నిర్మించుకోలేదన్న విషయం రచయిత తన నిర్మాణంలో చూపించాడు. తాను తీసుకున్న అంశం విస్తృత పరిధి ఉంది కావడం వల్ల కూడ, ప్రధానంగా ఉపన్యాస ధోరణిలో పాఠకులను ప్రబోధంతో చైతన్య పరచాలన్న ఉద్దేశంతో రచయిత వెలకువలను పాటించి ఉండడు. పైగా ఇది తెలుగులో తొలినవల. సాంఘికాచారాలను మాత్రమే తెలియచేసేందుకు రాయబడింది. రాజశేఖర చరిత్రలో గోదావరి దగ్గరికి నీళ్ళ కోసం వెళ్ళిన ఆడవాళ్ళు సంభాషణ ఆ కాలం నాటి అగ్రవర్ణ స్త్రీల ప్రవర్తన కనిపిస్తుంది. రచయిత ఈ సంఘటనలో అనేక సాంఘిక దురాచారాలను ఒకేసారి సంక్షిప్తంగా వర్ణించారు. శిల్పంలోని ఔచిత్యాన్ని తెలియజేస్తాడు. రచయిత తాను రచన ద్వారా నిరూపించదలచుకొన్న విషయాలను కథానాయకుని ద్వారా వివరిస్తూనే, దానికి బలాన్ని చేకూర్చే సంఘటనలను, ప్రత్యేకంగా చర్చించడం చక్కని రచనగా చెప్పవచ్చు. ఆడవాళ్ళ ముచ్చట్లలో ఊర్లో ఎవరింట్లో ఏమి జరిగిందో, ఏ భర్త వేశ్యనుంచుకున్నాడో, ఏ భార్య వొంటినిండా నగలున్నాయో....ఇలా వారికి అనవసరమైన విషయాలను ఎంతో ఆసక్తిగా వివరించుకోవడం అప్పటి అగ్రవర్ణ స్త్రీల సామాజిక స్పృహను తెలియజేస్తుంది. రచయిత చెప్పకనే అప్పటి స్త్రీ 'లౌకిక ప్రపంచం' గురించి తెలిపినట్లు కనిపిస్తుంది. ఇందులో ఏ ఒక్కటి ఎవరికి పనికివచ్చేది కాకపోగా, ఒకరిపట్ల ఒకరికి తెలియని ద్వేషాన్ని కలిగించేది. ఇదంతా కేవలం సంభాషణ రూపంలో చెప్పించడం కందుకూరి రచనలోని గొప్ప విషయం.

అక్కడక్కడా రచయితే అప్పటి సమాజంపై తీర్పుకూడా చెప్తాడు. ధనవంతుడు లోపల ఎన్ని చెడ్డపనులు చేస్తున్నా పైకి మాత్రం దర్జాగా కనిపిస్తే, అతని విలువ ఏ మాత్రం తగ్గదని ''వే

*యేల! చాటున లక్ష దుష్కార్యములు చేయుచున్నను....''* అంటూ ధనవంతుల అరాచకాలను తానే స్వయంగా చెప్తాడు. రచయిత కొన్ని సందర్భాలలో తెరచాటు నుండి బయటికి వస్తాడు. అక్కడ అనేక పాత్రలున్నా, ఏ పాత్రలోనైనా – తను చెప్పదలచుకున్న విషయాన్ని చెప్పించొచ్చు. బలమైన పాత్రలు లేకపోతే సృష్టించి చెప్పవచ్చు. కానీ, తమ మనస్సులో ఏ విషయాలపట్ల అత్యంత గాఢత ఉంటుందో, వేటిపట్ల తమ హృదయం పూర్తిగా స్పందిస్తుందో, ఏ విషయాలు ప్రజల జీవితాన్ని తీర్చిదిద్దుతాయో – ఆయా విషయాలను – తానే పాఠకునికి చేరవేయాలన్న స్పృహ అప్పటి రచయితల్లో ఎక్వగా కనిపించేది. అందులో రచయిత పాత్ర కాకపోయినా, వారి పాత్ర ఎక్కువే ఉండేది.

రాజశేఖరచరిత్ర ప్రధానంగా సంఘసంస్కరణ భావాలతో వచ్చిన, నవల తెలుగులో తొలి నవల. ఇందులో వీరేశలింగం గారు ఆనాటి సమాజంలో పేరుకు పోయిన అనాచారాలను గురించి విస్తృతంగా వర్ణించారు. ఈ కాలం రాచయితలకు 'శిల్పం' పై పెద్ద అవగాహన ఉన్నట్లు కనిపించరు. వారి రచనను ఆధారంగా చేసుకుంటే రచయితే కథ మధ్యలో తాను చెప్పదలచుకొన్న విషయాల్ని తానే పాఠకులకు వివరించే ప్రయత్నం జరిగింది. ఉపన్యాసాల రూపంగా – ఆనాడు సమాజంలో దిగజారిపోతున్న మానవీయ విలువలను వివరించే ప్రయత్నం జరిగింది. మూఢాచారములు, దెయ్యములు, జాతకాలు మొదలైన వాటి విషయంలో రాజశేఖరుడు మూర్ఖంగా ప్రవర్తిస్తుంటే రచయితనే కథ మధ్యలో *''ఆ కాలంలో నందెల్ల వారికిని దెయ్యము యందలి విశ్వాసమధికము....''* అంటూ ఆ మూఢ నమ్మకాల్ని ఖండించే ప్రయత్నం చేస్తాడు. ఎందుకంటే కథా నాయకుడైన రాజశేఖరుడు తొలుత మూఢ నమ్మకాల్ని నమ్మి మోసపోయి చివరికి జ్ఞానవంతుడౌతాడు. ఈ సంఘటన నవల తొలిభాగంలో జరిగింది. అప్పటికి రాజశేఖరుడు ఈ విషయాలపట్ల అవగాహన లేనివాడు. పైగా అలాంటి మూఢ విశ్వాసాలను ప్రోత్సహించేవాడు. కనుకనే రచయితే పాఠకునికి ఉపదేశం చేస్తాడు. ఇది బలహీనమైన శిల్పం. చాలా సందర్భాల్లో రాజశేఖరుని పరిస్థితికి కూడ స్వయంగా రచయితే వర్ణిస్తాడు.... చివర్లో రాజశేఖరుడు తెలివి తెచ్చుకొని సంఘంలో పోయిన గౌరవాన్ని తెచ్చుకొనే ప్రయత్నం చేస్తాడు. ఇక్కడ రాజశేఖరుని పాత్రను చక్కగా తీర్చిదిద్దుతాడు. జీవితాంతం ఒకలా ఉండకుండా (flat) జీవితంలో ఎత్తుపల్లాలు చూసిన వ్యక్తిగా, చివరకు జ్ఞానోదయం కలిగిన వ్యక్తిగా తీర్చిదిద్దడం ఔచితీవంతంగా ఉంది. *''....నాకిప్పుడు జ్యోతిషశాస్త్రము నందలి నమ్మకము పోయింది....''* అంటూ పాతరోజుల్లో తాను చేసిన తప్పులను ఒక్కొక్క దాన్ని జ్ఞాపకము తెచ్చుకొని

మరీ ఖండిస్తాడు.  ఈ పాత్ర నిర్మాణంలో రచయిత చక్కటి ప్రణాళఇకను అనుసరించి 'పరిపూర్ణుడు' గా తీర్చిదిద్దాడు.

ఈ నవలలో మొదట రచయిత, సంస్కరణలు లేని కారణంగా ఏయే అంశాలలో రాజశేఖరుని కుటుంబానికి మూఢనమ్మకాలతో సమాజం గాని మోసాలకు గురయిందో తెలియజేసి – దానికి గల కారణాలను వివరించారు.  తర్వత రాజశేఖరుని కుటుంబ పరిస్థితిని తారుమారుచేసి మళ్ళీ ఆయా సందర్భాలకు రాజశేఖరునికి పరిచయం చేస్తారు. డబ్బు ఉన్నప్పుడు సమాజం తనను ఎలా గుర్తించింది.  డబ్బు లేక కుటుంబం అవస్థలపాలై గతిలేని సందర్భంలో తనను సమాజం ఎంతగా ఇబ్బంది పెట్టింది.  మళ్ళీ రాజశేఖరుడు తన తప్పు తెలుసుకొని – జీవన విధానాన్ని మార్చుకున్న తర్వాత తనపట్ల తానుంటున్న సమాజం యొక్క వైఖరి ఎలా ఉందన్న విషయాలను వీరేశలింగం గారు చక్కటి ప్రణాళికతో నిర్మించారు.  వారి రచనా విన్యాసం, నిర్మాణ శిల్పం, పాత్రల పరిచయాలు, సన్నివేశాలలోని బలం, ఉపన్యాసాలలోని తీర్పు – నవలను మొదలు పెట్టడం – ముగించడం ఇవన్నీ – రచయిత అంతరంగాన్ని అద్భుతంగా ఆవిష్కరింపజేసింది.  రచయిత తానుంటున్న సమాజంలోని వ్యక్తులను, సంఘటనలను ఆధారంగానే చేసుకొని 'రచన' చేస్తాడు.  సమాజాన్ని పాఠకున్ని చైతన్యవంతులుగా తీర్చిదిద్దే బాధ్యతను మోస్తాడు.  ఇక్కడ రచయిత సామాజిక బాధ్యత నెరవేరింది.

### 5.4.2 గణపతి– శిల్ప వివేచన:

గణపతి హాస్య నవల అయినా, చదివిన తర్వాత 'దిగులు' కనిపిస్తుంది.  అప్పటి అగ్రవర్ణాల వారిలో ఉండే అనాచారాలను చిలకమర్తి హాస్య స్ఫోరకంగా రచించినా – 'గణపతి'లోని అమాయకత్వానికి అతడంటే 'జాలి' కలుగుతుంది.  రచయిత బాల్యవివాహాలు వల్ల జరిగే నష్టాన్ని, చదువుకోక పోవడం వల్ల జీవితంలో ఎదుర్కొనే సమస్యల్ని ఈ నవలలో వివరించారు.  బ్రాహ్మణ కుటుంబాలే అప్పటి నవలల్లో పాత్రలు కాబట్టి దాని ఆధారంగా ఆ కుటుంబాల్లోని 'అలజడి'ని హృద్యంగా వివరించారు.  మూడు తరాల కుటుంబాలను పరిచయం చేయడం అనేది ఆ సమస్యపై ఎంతటి అరాచకాన్ని సృష్టించిందో రచయిత కథాకథనంలో చూపాడు.  పాపయ్య, గంగాధరుడు, గణపతి ముగ్గురు మూడుతరాలకు చెందినవారు.  వీరు బ్రాహ్మణ కుటుంబానికి చెందిన తాత, కొడుకు, మనవడుగా పరిచయమౌతారు.  పాపయ్యకు, గంగాధరానికి వయస్సు మీరిన తర్వాత వివాహాలు కావడం – ముసలితనంలో పిల్లల్ని కనడం – చనిపోవడం – భార్యలు చిన్నవయస్సులోనే వితంతువులు కావడం – ఇదంతా చాలా

సహజంగా చిత్రించారు. కథలో ఈ బాల్యవివాహాలపై పెద్దగా చర్చ కూడ లేదు. కాబట్టి – అప్పటి సమాజంలో ఇది సర్వ సాధారణంగా కనిపిస్తుంది.

కథా నిర్మాణంలో రచయిత మామూలుగా సంఘటనలు ఒకదాని తర్వాత ఒకటి అల్లడం. కథను చెప్పుకుంటూ పోవడం జరుగుతుంది. శిల్పపరంగా పెద్దగా చెప్పుకునేది ఏమీ లేకపోయినా – 'గణపతి' పుట్టినప్పుడు ''*సింగమ్మకు వర ప్రసాదియై పప్పుభట్లు....*'' అంటూ అతని పుట్టుకను వర్ణించడం అంతవరకు నవలలో ఉన్న గాంభీర్యం స్థానంలో, హాస్యం కనిపిస్తుంది. పాపయ్య గంగాధరుల జీవితాలు చదువులేనివి, సంస్కారం లేనివి. ఉన్నత కుటుంబంలో పుట్టినా – చదువుకునేందుకు అవకాశం ఉన్న చదువుకోక పోవడం – సమస్యను 'క్లిష్టం' గా మార్చే ప్రయత్నం రచయిత చేసారు. బాల్య వివాహాలు, వితంతువులు, కన్యాశుల్కం, చదువులేకపోవడం, ఇవన్నిటిని కలిపి బ్రాహ్మణ కుటుంబంలోని 'డొల్లతనాన్ని' వెలికితీయాలి. ఇది రచయిత వేసుకున్న ప్రణాళిక. అది హాస్యాన్ని పండించాలి. రెండు భిన్న రసాల మధ్య రచన – ఒకటి విషాదం – రెండోది హాస్యం – మొదట చదివిన పాఠకుడు గణపతి చర్యలకు నవ్వుకున్నా – కొంత సేపటికి అందులోని విషాదానికి దిగులుపడతాడు. పిచ్చమ్మ, సూరమ్మల ప్రమేయాలు లేకుండానే వారి జీవితంలో అశాంతి, తరువాత వారి కుటుంబంపై ఎలాంటి ప్రభావాన్ని చూపించింది అనేది రచయిత నిర్మాణపరంగా, పాత్రల పరిచయంలో సంభాషణల్లో చూపించాడు. పిచ్చమ్మ తండ్రి, పిచ్చమ్మను మోసం చేయడం చాలా విషాదమైన కథ ''నాన్నా మీ యల్లుడు పోయి యిప్పటివరకు....'' అంటూ చనిపోయిన భర్త గురించి బాధపడాలో, కుమారున్ని పోషణభారం చూసుకోవాలో! ఆమెకు అర్థం కాక – తీవ్ర ఘర్షణకు గురౌతున్నట్లు ఆమె తండ్రితో జరిపిన సంభాషణల ద్వారా తెలుస్తుంది. రచయిత 'సంభాషణల కూర్పు' ద్వారా సన్నివేశాన్ని చక్కగా నిర్వహించారు.

గణపతి చిన్నప్పటి 'బడి సంగతులు' చాలా నవ్వు పుట్టిస్తాయి. రచయిత చిన్నప్పటి గణపతి చేష్టల ద్వారా భవిష్యత్తులో ఉపాధ్యాయునిగా అవతారమెత్తే గణపతిని మనకు పరిచయం చేయడం శిల్పపరంగా రచయిత సాధించిన విజయంగా చెప్పవచ్చు. వర్తమానంలో జరిగే సంఘటనలను, భవిష్యత్తులో జరిగే వాటితో ముడివేయడం – అదీ 'వ్యతిరేకదృష్టితో, రెండు వ్యతిరేక సందర్భాలతో ఒకటి చిన్నప్పుడు బడికి వెళ్ళకపోవడం – పెద్దయ్యాక బడిపంతులు కావడం – పైగా చిన్నప్పుడు తానెలా చదువుకున్నది వివరించాడు. ఇవన్నీ ఒకదానితో ఒకటి కలుపుకొంటే, గణపతి 'అమాయకత్వం' ప్రత్యక్షమౌతుంది.

అప్పటి సమాజంలో అగ్రవర్ణాల వారు మూఢ విశ్వాసాలతో అవిద్యతో ఎంతలా పతనమయ్యారో నిరూపించిన కథ.

### 5.4.3 మాలపల్లి– శిల్ప వివేచన:

మాలపల్లిలో రెండు కుటుంబాలు, రామదాసు కుటుంబం, చౌదరయ్య కుటుంబం. ఈ రెండు కుటుంబాల మధ్య ఘర్షణ సామాజిక, ఆధ్యాత్మిక, కుటుంబ ఘర్షణలుగా నిరూపిస్తూ భారతీయ జీవన విధానానికి ఏ రకమైన జీవితం తృప్తినిస్తుందో అత్యంత నిర్మాణాత్మక శిల్పకళా ప్రదర్శనలో ఉన్నవగారు నిరూపించారు.

నవల ప్రారంభంలోనే చౌదరయ్య రామదాసు చెల్లెల్ని ఇబ్బంది పెట్టగా, రామదాసు మౌనంగా భరిస్తాడు. ఈ సంఘటనను ఆధారంగా చేసుకుంటే, కథ నిర్మాణం సులభంగా అర్థమౌతుంది. రచయిత నవలా ప్రారంభంలోనే 'ఘర్షణ'ను సృష్టించి దానికి వ్యతిరేకమైన వ్యక్తిత్వాన్ని (సాత్త్విక) నిలబెట్టడం అనేది రచయిత శిల్పపరంగా సాధించిన గొప్ప విజయం. స్వాతంత్ర్యోద్యమం, గాంధీ సహాయనిరాకరణ, హరిజనోద్ధరణ, స్వేచ్ఛా ప్రణయం లాంటి రకరకాల భావజాలాలలో ఈ రెండు కుటుంబాలు ఏ విధంగా భాగస్వాములైనాయో, చివరకు ఏది ధర్మవిజయమో రచయిత చక్కగా వివరించారు. ఈ క్రమంలో ఈ రెండు కుటుంబాల మధ్య మానవ సంబంధాలలో ఎంతటి 'కల్లోలం' బయల్దేరిందో, అది ఆ రెండు కుటుంబాలను ఎంతగా నష్టపరిచిందో రచయిత – అద్భుతంగా చిత్రీకరించారు.

చౌదరయ్య దగ్గరే పనిచేసే సంగదాసు – చౌదరయ్యను మారుద్దామనుకుంటాడు. తన ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలనుకుంటాడు. చౌదరయ్య చేతిలోనే మరణిస్తాడు. రామానాయుడు చౌదరయ్య కొడుకు. తండ్రికి వ్యతిరేక మార్గంలో ప్రయాణం చేస్తాడు. సంగదాసును ఆదర్శంగా తీసుకుంటాడు తమ్ముడి మరణంతో అన్న వెంకటదాసు అప్పటివరకు నిర్లిప్తంగా ఉండేవాడు ఒక్కోసారి అగ్గిపిడుగుగా మారతాడు. చివరికి చనిపోతాడు. ఇదంతా చూస్తున్న రామదాసు దేనికీ స్పందించడు. సామాజిక చైతన్యం కోరిన రామానాయుడి యొక్క భార్య లేచిపోతుంది. కొడుకు చనిపోతాడు. భార్యను లేవదీసుకుపోయినవాడు రామానాయుడు స్థాపించిన ఆశ్రమానికి ఆస్తి రాసిస్తాడు. కుటుంబం బజారు పాలయ్యేసరికి చౌదరయ్య మరణిస్తాడు. రామానాయుడి భార్య రోగంతో చనిపోతుంది. చివరికి రామదాసు సంఘపీఠానికి అధ్యక్షుడౌతాడు. చాలా మలుపులతో కూడిన కథ – కథ నిర్మాణం, నిర్మాణ కౌశల్యం, రచనా శిల్పం ఈ నవలలో ఉన్నవ అద్భుతంగా నిర్వహించారు. రామానాయుడి భార్య కమలను స్వేచ్ఛ ప్రణయాన్ని కోరుకునే స్త్రీ గా వర్ణించాడు రచయిత. చౌదరయ్య చేస్తున్న దురాగతాలకు అతని

కుటుంబం నష్టపోవాలి. ఈ నష్టం 'మాలపల్లి'కి దోహదపడాలి కాబట్టి రామానాయుడి దంపతుల పాత్రలను క్లిష్టంగా మలిచాడు రచయిత. మోహనరావు పాత్ర ప్రవేశం దీనికి బలాన్ని చేకూర్చుతుంది. 'బిల్హణీయం' 'తారాశశాంక' లాంటి గ్రంథాలు చదివేవాడు. పాత్ర పరిచయంలోనే అతని గమ్యం తెలిపాడు. రచయిత కథా కథనంలో భాగంగా 'అతడు స్నానం చేస్తుంటే కమల చూడడం, అతను ఎక్కువ సేపు ఆమెను పరీక్షించడం.' ఇలాంటి అనైతిక చర్యలను ఆ పాత్రల చుట్టూ అల్లడం వారిని మరింతగా కదిలించేందుకు ఉపకరించింది. దీనికి తోడు రామానాయుడు ఇంటిపట్టున ఉండకపోవడం – మనకు రెండు పాత్రలపై సానుభూతి పెరిగే విధంగా కథా నిర్మాణం అందంగా కనబడుతుంది. నిమ్నవర్గాల అభివృద్ధికి రామానాయుడు ప్రయత్నిస్తాడు. ఇది ఆహ్వానించదగినదే – భర్త, భార్యను సరిగ్గా చూసుకోలేకపోతాడు. అందుకే భార్య మనసులో విపరీత భావాలు వస్తాయి – కమలను దృష్టిలో ఉంచుకుంటే ఇదీ న్యాయమే అనిపిస్తుంది. కానీ, రచయిత దృష్టిలో ఇవేవీ కాదు – చౌదరయ్యకు శిక్ష పడడం – ఎందుకంటే ఈ నవలా నిర్మాణం ప్రధానంగా సంఘ నిర్మాణం కోసమే కానీ, కుటుంబంలోని విలువల గురించి కాదు. అందుకే – మోహనరావును ప్రవేశపెట్టాడు. కమలలో కోరికలను పుట్టించాడు. చివరకు రామానాయుడి కొడుకు కూడా అర్ధాంతరంగా చంపేయడం, ఇవన్నీ నవల యొక్క 'పరమార్థానికి' అభిముఖంగా తీర్చిదిద్దిన కథా సంవిధానంలోని భాగాలుగా గుర్తించవచ్చు. ఇదంతా జరిగితేనే గాని రామానాయుడికి 'మాలపల్లే' కుటుంబం కాదు.

తన సొంత కుటుంబాన్ని పూర్తిగా కోల్పోయిన మిత్రుడి కలను నెరవేర్చేందుకు సంఘపీఠాన్ని స్థాపించేందుకూ ఇదంతా అతని కథను 'ఇతివృత్తం'గా తయారవడం రచనా శిల్పంలోని భాగమే. రామదాసు కొడుకులు సంగదాసు – చైతన్యశీలి – మితవాది, వెంకటదాసు – చైతన్యశీలి – తీవ్రవాది. రామదాసు జ్ఞానమార్గంలో ఆధ్యాత్మిక సాధకుడు – రచయిత. ఒక సమస్యను పరిచయం చేస్తూ – దాని ద్వారా వ్యక్తి జీవితంలోని అనేక పార్శ్వాలను పరిచయం చేస్తున్నాడు. ఏ మార్గం ఆధారంగా మనిషి ఉత్తమగతులను పొందగలడు? అనే విషయాన్ని రామదాసు కుటుంబం ద్వారా సంక్లిష్టమైన, నిర్మాణశిల్పం ద్వారా రచయిత సాధించాడు. అహింసామార్గం, తీవ్రవాద మార్గం – ఒకటి సామాజిక మార్పు. మరొకటి ఆర్థిక స్వాతంత్ర్యం – అణచివేయబడుతున్న వ్యక్తికి మొదట 'సామాజిక గౌరవం' తర్వాత ఆర్థిక స్థితి గతులలో మెరుగుదల – అందుకే – రామదాసు యొక్క పెద్దకొడుకు వెంకటదాసు అయినా చైతన్యం సంగదాసు ద్వారానే రావడం గమనించవచ్చు. సామాజికంగా గాంధేయమార్గంలో హరిజనోద్ధరణ జరిగిన తర్వాతనే – ఆర్థిక పరమైన అభివృద్ధి జరిగితే సమాజంలో 'క్రమమైన

మార్పు' జరుగుతుందని రచయిత ఈ కథ ద్వారా నిరూపించాడు. అయితే అహింసా మార్గంలో, సామాజిక మార్పును కోరిన సంగదాసు హత్య కావించబడతాడు. అహింసను – హింస బలితీసుకుంది. మార్పు రావాల్సింది శారీరకంగా కాదు – మానసికంగా – సంగదాసు 'సామాజిక మార్పు' కోసం సంఘంలో చైతన్యాన్నే తీసుకొని వచ్చాడు. తనకు వ్యతిరేక వర్గమైన అగ్రవర్ణాలవారినీ కలుపుకున్నాడు. రామానాయుడు దీనిలో భాగస్వామి కావడంతో ఈ 'విజయం' నిజంగా సఫలమైనట్లు తెలుస్తుంది. సామాజిక పరమైన మార్పు – అణగారిన వర్గాల్లో, శుచి, శుభ్రత, చదువు, సంస్కారం ఇవన్నీ కేవలం ఏ ఒక్క వర్గంతోనో సాధింపబడవు. అలా సాధింపబడితే అది సామాజిక చైతన్యమే కాదు. ఈ విషయాన్ని నిరూపించేందుకు రచయిత అద్భుతమైన కథా నిర్మాణం చేసాడు. సంగదాసును, రామానాయుడితో కలిపాడు. వ్యతిరేక వర్గాన్ని లేకుండా చూసుకున్నాడు. తన వర్గంలో చైతన్యం కల్గించాడు. రెండు చేతులూ ఒక్కటయ్యాయి. మార్పుకు తోవ సుగమమైంది. అయితే 'సంగదాసు' మరణాన్ని రచయిత కావాలనే చూపెట్టినట్టు తెలుస్తుంది. ఎందుకంటే సామాజిక చైతన్యం 'భావజాలాన్ని' మాత్రమే ప్రసరింపజేయగలదు. అది సంగదాసు ద్వారా పూర్తయ్యింది. ఇప్పుడు వెంకటదాసు 'ఆర్థిక పరిస్థితులను' చక్కదిద్దాలి. 'ఆర్థిక పరమైన సమానత్వం' కేవలం భావజాలంపై మాత్రమే ఆధారపడదు. దానికి 'సంఘటితం' గా పోరాడాలి. పోరాడాలి అంటే దోపిడి వర్గంపై తీవ్రమైన ద్వేషం కలగాలి. అందుకే అంతవరకూ తనపని తాను చేసుకునే వెంకటదాసు రూపంలో 'జగ్గడు' పుట్టుకొచ్చాడు. సమాజంలో ధనిక వర్గాన్ని దోచుకోవాలంటే తీవ్రమైన సంఘర్షణ జరగాలి. అహింసావాది అయిన తమ్ముని మరణం – వెంకటదాసులో కసిని పెంచింది. ఇదంతా రచయిత పాత్ర నిర్మాణంలో, పోషణలో, తీసుకున్న జాగ్రత్తవల్ల కుదిరింది. తీవ్రవాది జగ్గడు ధనవంతుల ఆర్థిక మూలాలను కదిలిస్తాడు. సామాజిక చైతన్యం, ఆర్థిక పరిస్థితుల్లో సమతుల్యం కనిపించే సరికి 'వెంకటదాసు' కూడ తన ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. రచయిత చాలా జాగ్రత్తగా ఏ పాత్ర ఎంతవరకు ఉండాలి. ఎక్కడ మొదలౌవాలి. ఎన్ని సంఘటనల్లో భాగస్వామి కావాలి? ఏ రసాన్ని ఎంతవరకు పండించాలి? ఎక్కడ ఏ పాత్రను ముగించాలి? అనే విషయాలను చాలా సూక్ష్మంగా, పరిశీలించి, నిర్మించిన విధానం మనకు ఈ పాత్రల ప్రవర్తన ద్వారా తెలుస్తుంది. ఈ రెండు పాత్రలు మాయమైనప్పటికీ 'రామదాసు' అలాగే ఉంటాడు. ఎలాంటి భావాన్ని వ్యక్తం చేయడు. సంగదాసు చనిపోతున్నా, వెంకటదాసు చనిపోతున్నా, కూతురు జ్యోతి జైలరు అన్యాయాన్ని భరించలేక చనిపోయినా, భార్య చనిపోయినా, తనకు తీవ్ర అవమానం జరిగినా – సుఖదుఃఖాలకు అతీతులుగా సమాజంలో జరిగే ప్రతీ సందర్భంలో ఉంటాడు – అన్నిటినీ

పరిశీలిస్తాడు – దేనికీ స్పందించకుండా – తన మార్గంలో తను ప్రయాణం చేస్తుంటాడు. రామదాసులోని ఆధ్యాత్మిక చింతనా మార్గమే. ఓ వైపు హింసామార్గంగా – మరోవైపు అహింసామార్గంగా రెండుపాయలుగా విడిపోయి చివరికి ఆ రెంటికీ సమన్వయం కుదిరినట్లుగా కనిపిస్తుంది. కూతురు జ్యోతి అమలిన శృంగారం మార్గంలో ప్రయోగించినా ఏ మాత్రం స్పందించడు. చివరకు భారతదేశానికి కులపాలికా ప్రణయమే కాని, అమలిన శృంగారం పనికి రాదని రచయిత జ్యోతి – అప్పాదాసు కథ ద్వారా తెలియచేస్తాడు. 'వివాహం' ద్వారా మొదలుపెట్టి క్రమంగా ఆధ్యాత్మికత వైపు మరల్చడమే శ్రేయస్కరంగా ఉంటుందని రచయిత జ్యోతిని, అప్పాదాసుల మరణం ద్వారా నిరూపించాడు.

### 5.4.4 వేయిపడగలు– శిల్ప వివేచన:

వేయిపడగల్లో శాస్త్రికి మంగకు కలిగిన సంతానం 'పసరిక' పసరిక పైరు పచ్చలకు ప్రతీక. పసరిక పరిచయంలోనే రచయిత గొప్ప నిర్మాణ శిల్పాన్ని, భావి కథార్ధ సూచనను చేసినాడు. పసరిక వచ్చి ధర్మారావును కౌగిలించుకొనెను. తమలపాకు తీగ వచ్చి యవిసె యొక్క మీద వాలినట్లయిందట. పసరిక దేశంలోని దేవ మాతృకలకు ప్రతీక. దీన్ని రచయిత 'తమలపాకు తీగ'తో ధ్వనింపజేసాడు. ''అప్పుడు ధర్మారావు'' నాయనా! నీకు వేయేండ్ల ఆయుర్ధాయమనిను''పై నుండి తీతువు పిట్ట కూసెను. ధర్మారావు మనసు కీడు శంకించింది. తీతువు పిట్ట అపశకునానికి ప్రతీక. రచయిత పసరిక నాశనాన్ని 'శకునం'తో పోల్చి – రాబోయే రోజుల్లో దేవ మాతృకలు నశిస్తాయని సూచించాడు. ఉత్తమస్థాయి పాఠకులకు మాత్రమే ఇలాంటి ప్రయోగాలు అర్థమౌతాయి. కానీ సామాన్య పాఠకుడు 'శకునం' దగ్గరే ఆగిపోతాడు. ఇక్కడ రచయిత శకునాలని సమర్థిస్తున్నాడనే వారూ ఉన్నారు. అయితే ముందే చెప్పినట్లు రచయిత ఏ మహార్థాన్ని ఆశించి రచన చేస్తున్నాడో, దాన్ని అన్వయించుకునే విధంగానే నవలను అర్థం చేసుకోవాలి. అల్ప విషయాలపై చర్చ చేయకుండా ఉండడమే మంచిది.

శాస్త్రికి రధంధరికి పుట్టిన కూతురు గిరిక. గిరిక దేవదాసి. ఆమె జీవితం వేణుగోపాలస్వామికి అంకితం. గిరిక పాత్ర ప్రవేశంలోనే ఆమె శారీరక వర్ణనలోనే. ఆధ్యాత్మిక భావాన్ని, పూజ్యభావాన్ని ప్రవేశపెద్దాడు రచయిత. ఎందుకంటే గిరిక దేవదాసీ అమ్మాయి. పూర్వాచారాలు ధ్వంసమై పాశ్చాత్య వ్యామోహాలు విచ్చలవిడిగా పెరుగుతున్న సందర్భంలో, దేశంలోని ప్రజలంతా – పాశ్చాత్య విలువలకు, అనైతిక సాంప్రదాయాలకు తోవలు తీస్తున్న సమయంలో కథ ప్రారంభమయింది. ఇప్పటికే దేశ సంస్కృతి శిథిలరూపంలో ఉంది. దేవదాసీ – భోగం వాళ్ళ పిల్ల పూర్వం భోగం వాళ్ళ దేవుని కైంకర్యం కొరకు వినియోగించ బడ్డవారు.

ప్రస్తుత వారి పరిస్థితి వేశ్యవృత్తికి దిగజారింది. అయితే దీనికి గిరిక. అపవాదు అన్న విషయం రచయిత శిల్ప చమత్కృతిలో చెప్పారు. ఆమె శరీరాన్ని వర్ణిస్తూ ''దాని యెదలి పైకిఁ దెలియకుండ మన్మధుడు వచ్చుచున్నాడు. దాని తెల్లని పలువరుస సుదర్శనాయుధ పుటంచులవలెఁ బదును పెట్టినట్లుండెను. దాని చెవులు శ్రీకారములై పాంచజన్యము లట్లుండెను. దాని కన్నులు కమలములు, దాని నాసిక కౌమోదకి, దాని భ్రూయుగ్మము శార్ జ్ఞము ద్విధావిభక్తమై నట్లుండెను. దాని మూర్తి వికుంఠమనోజ్ఞమయ్యెను. దాని పేరు దేవదాసి''[10] దేవదాసి యువతిగా మారే సందర్భమే అయినా ఆమె శరీరాంగముల వర్ణన విష్ణుమూర్తిని జ్ఞప్తికి తెస్తున్నది. ఇదంతా రాబోయే కథలో దేవదాసి పాత్ర నిర్మాణాన్ని ఆమె అంతరంగాన్ని, కథలో ఆమె ప్రాధాన్యాన్ని వివరిస్తున్నది. ఆమె పట్ల పాఠకుడు అలవరచుకునే దృష్టిని రచయిత ముందుగానే తెలియచేసాడు. ఇలా పాత్ర శారీరక, మానసిక వర్ణనలతో రచయిత ఆ పాత్రలపై పాఠకునికి సూచనచేస్తాడు.

వేయిపడగలు నవలలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి భారతీయ సాంప్రదాయక ధర్మాలకు ప్రతీక. వేయిపడగలు అంటే 'అనంతమైన' ధర్మాలనే అర్థంలో వాడారు రచయిత. అందులో అన్ని పడగలు– అంటే అన్ని ధర్మాలు నశించిపోయినా– చివరకు రెండు ధర్మాలు– రెండు పడగలు మిగులుతాయని ధర్మారావు అంటాడు. నవల మొదట్లో అరుంధతితో సంభాషిస్తూ; అరుంధతి ''ఆయనకు వేయిపడగలున్నావనియా? అనగా 'అన్నియు బోయినవి. మిగిలినవి రెండే పడగలు– 'నీవోపడగ నేనొక పడగ' అని చివరకు దాంపత్యధర్మమే మిగులుతుందని ఇది మిగతా ధర్మాలన్నిటిని పునరుద్ధరిస్తుందని విశ్వాసంతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ప్రతీకగా తీసుకొని చెప్తాడు. ఇక్కడ ప్రతీక ద్వారా శిల్పం సాధించబడింది. నవల చివర్లో చిన్న అరుంధతితో 'అవును నీవు మిగిలితివి. ఇది నాజాతి శక్తి, నాయదృష్టము నేను మిగిలితిని'' అనడంలో స్పష్టంగా భారతీయ వైవాహిక ధర్మాన్ని నిరూపించేందుకు రచయిత ఈ వాక్యాలను నవల మధ్యలో– చివర్లో చేర్చడం నిర్మాణశిల్పంలోని గొప్ప వైవిధ్యం– రచనలో మొదట్లో–చివర్లో తను నిరూపించదలచిన సిద్ధాంతాన్ని అభిప్రాయాన్ని రచయిత ఎంతో జాగ్రత్తగా నిర్వహించి– గొప్ప 'సంవిధానాన్ని' కూరుస్తాడు. ''ఈదేశంలో పతివ్రత చావదు. స్వామి రెండవ పడగ యిచ్చట నశించదు. కారణాంతరముల చేత మఱుగున పడవచ్చును.'' అనడంలో ప్రతీకను వాచ్యం చేయడంలో సాధారణ పాఠకుడికి కూడా శిల్పరహస్యం తేటతెల్లమౌతుంది.

[10] వేయిపడగలు, పు: 50

ఒకనాడు గణాచారి ధర్మారావుతో 'ఒకటి మాసిపోయినది– దానికి మఱల నాకృతి తేవలయును' అంటుంది. ఇక్కడ ఒక పడగ మాసిపోతుంది. అంటే దాంపత్యధర్మానికి చూసికవైన 'రెండు పడగలు'లో ఒకటి 'మాసి' పోతుందట. భార్యాభర్తల్లో ఒకరు చనిపోతున్నారని– ప్రతీకాత్మకంగా చెప్పడం. అయితే పడగ నశించిపోతుంది. అనకుండా 'మాసి' పోతుంది. అనడంలో ఔచిత్యం ఉంది. 'మాసి'పోతే మళ్ళీ శుభ్రం చేసుకోవచ్చు. నశిస్తే మళ్ళీ సృష్టించలేం అంటే వివాహవ్యవస్థలో ఒకరు మరణిస్తే, తిరిగి వారి స్థానాన్ని భర్తీచేయవచ్చని అర్థం. పునర్వివాహ రూపంలో 'వివాహవ్యవస్థ' సర్వథా నిలిచేవుంటుందని భావం. ఇక్కడ ధర్మారావు భార్య అరుంధతికి మరణకాలం సమీపిస్తుందని భావం. దీన్ని అర్థం చేసుకొని ధర్మారావు దుఃఖిస్తాడు. కథానాయకుడు ధర్మారావును కేంద్రంగా చేసుకొని కథ నిర్మితమైంది. కావున 'పడగ' మాసిపోతుంది. అంటే భార్య అరుంధతి చనిపోతుందని భావించాలి. పైగా అప్పటికే అరుంధతి జబ్బుపాలౌతుంది. భార్య మరణిస్తే భర్త తిరిగి వివాహం చేసుకోవచ్చని దీని అర్థం. భర్త చనిపోతే ఈ 'విధవావివాహానికి' కూడా 'మసి' అడ్డురాకుండా ఉండేందుకు– విశ్వనాథ ఈ వర్ణనలో అద్భుతంగా దాంపత్య వైభవాన్ని వివరించారు.

అరుంధతీ, ధర్మారావుల శోభనరాత్రులను కూడ విశ్వనాథ అద్భుతంగా వర్ణించారు. మనసులో ధర్మారావు పట్ల ప్రేమ లేకపోవడం వల్ల అరుంధతి మొదటి రాత్రి భర్తకు సహకరించదు. కులపాలికా ప్రణయము, దాంపత్య జీవితమే జాతిశక్తిగా చెప్పే 'వేయిపడగలు' నవలలో ఎవరోగిట్టని వాళ్ళ ప్రేరణచే భర్తను దూరంగా పెడుతుంది. అరుంధతి రెండోరోజు ధర్మారావు విజ్ఞత చేత రాజ్యలక్ష్మమ్మ అరుంధతికి లోకం పోకడగూర్చి, భార్యాభర్తల దాంపత్యం గురించి చక్కగా వివరిస్తుంది. ఇక్కడ ధర్మారావు భార్య ప్రవర్తనకు విసుగు చెందకుండా, అలా ఉండేందుకు కారణాలు కనుగొని వాటిని తొలగించే ప్రయత్నం చేస్తాడు. రాజ్యలక్ష్మమ్మ ఉపదేశంతో ధర్మారావు–అరుంధతిల కలయిక సఫలమౌతుంది. ఇక్కడ వారి మధ్య అపార్థం తొలగిపోయే, సందర్భాన్ని విశ్వనాథ ధ్వనింపజేస్తాడు.

ఎఱ్ఱయెండలు క్రమక్రమంగా నల్లబడి లేఁత చీఁకటులు కాఁజొచ్చినను అంతలోనొక కళ మిగుల్చుకున్న చంద్రుడు చీకటులు 'నుఫ్' అయి యూదినట్లు పురిటిలోనే సందుకొట్టిన పసిపిల్ల వలె అంధకారము పుట్టుచునే చచ్చిపోయెను' అంధకారము చచ్చిపోయెను 'పురిటి'లోనే– అంటే భార్యాభర్తల మధ్య 'తొలిరోజు'నే జరిగిన అపార్థము అనే అంధకారము సమసిపోయిందనే భావన. దీని ద్వారా మళ్ళీ వీరి మధ్య ఎలాంటి అపార్థాలు రాబోవని సూచన. అరుంధతి మరణసమయంలో 'మసి' పట్టినది అని వారి తొలిరాత్రిలోని అపార్థము 'చచ్చిపోయినది' అని

విశ్వనాథ గారు. 'నిర్మాణశిల్పాన్ని' అత్యంత గొప్పగా చిత్రించారు. మరణాన్ని 'మసి'గా పోల్చాడు. అనుమానాన్ని 'చావు'తో పోల్చాడు. దాంపత్యజీవితం మనదేశంలో అత్యంత ముఖ్యమైనది. శాశ్వతమైనదీ కనక దంపతులను ఎప్పుడూ 'జంటగానే' ఉండాలి గనక– అక్కడ అనవసర అపార్థాలు భార్యాభర్తల సుఖజీవితానికి అడ్డంకి కాబట్టి చిన్న అనుమానాన్నైనా శాశ్వతంగా తొలగించే ప్రయత్నం చేసారు. రచయిత తన రచనలో నిర్మాణదశలో ఎంతో చైతన్యవంతంగా స్పృహతో ఉంటారో ఈ సందర్భం తెలియజేస్తుంది. ఇది గొప్ప నిర్మాణశిల్పం– వర్తమానాన్ని – భవిష్యత్తును కలిపే సంఘటనలను మధ్య 'బలాన్ని' ఔచిత్యమంతంగా నిరూపించాడు.

వేయిపడగలులో హరప్పా స్వేచ్ఛా మరణం పొంద బోతుంటాడు. హరప్పాదేశంలో, నశించిపోతున్న అన్ని ధర్మాలను, సంప్రదాయాలను పునరుద్ధరించాలనే ఆశతో ఉన్నటువంటి జమీందారీ యువకుడు. కానీ వేగంగా మార్పును అతడు అదుపుచేయలేకపోతాడు. బ్రిటీష్ వారి నుండి యధేచ్ఛగా సంక్రమిస్తున్న సంస్కృతీ, నాగరికతలు, పాశ్చాత్య సంప్రదాయాలు, విలువలు ఇక్కడి సాంప్రదాయాలపై తీవ్రప్రభావం చూపినది. అన్ని పడగలు పోయి రెండే పడగలున్నప్పుడు, హరప్పా మళ్ళీ మళ్ళీ భారతీయ సాంప్రదాయ ప్రభావాన్ని పునరుద్ధరించేందుకు కంకణబద్ధుడౌతాడు. హరప్పాచే చెప్పించిన మార్పులు గొప్ప శిల్పాన్ని ప్రదర్శించింది. 'చేతనైనంత వరకును వేయి పడగలాడించితిని. ఆయాడించుట యేకదేశమైపోయెను నాయందున్న దోషము దానికి సంక్రమించినది'. అనడం కేవలం ఒక జమీందారు 'మార్పు'ను ఆపితే ఆగుతుందా? దేశంలోని అన్ని ప్రాంతాలు అందరు ప్రజలు చైతన్యవంతులై 'దేశీయత'ను కాపాడుకొంటేనే ఇది సాధ్యం అనే విస్తృతార్థాన్ని కేవలం 'ఏకదేశమై పోయెను' అనడంలో ధ్వనిస్తుంది. దీనిలో పాశ్చాత్య విలువల విజృంభన, దేశీయ యువకుల అలసత్వం. హరప్పా–అసహాయం అన్నీ కలిసి– గొప్ప తాత్విక అర్థాన్నిస్తుంది. ఇదంతా 'నిర్మాణశిల్పం' లోని భాగం ఈ నవలలో గణాచారి ఒక విచిత్రమైన వ్యక్తి. కాపు పడుచు, వ్యాఖ్యాత భూమికీ–ఆకాశానికీ, స్వర్గమర్త్యాలకూ, ప్రత్యక్ష–అప్రత్యక్షాలకూ మధ్యన ఉండే సంబంధాన్ని వ్యాఖ్యానిస్తుంది. దీనిని రచయిత గొప్పగా సాధించు. గణాచారి తన వ్యాఖ్యానాన్ని నోటితో తక్కువగా చేస్తుంది. సుబ్బన్నపేటలో జరిగే సంఘటనలు సుబ్రహ్మణ్యస్వామికి ఇష్టమో, లేదో అన్న విషయాన్ని గణాచారి రావిమండలూ, వేపమండలను అక్కడక్కడా వేస్తూ వివరిస్తుంది. గణాచారి ఆవూరి సాంప్రదాయంగా నిలుచున్న సంస్థ. ఆవూరి పూర్వీకుల నుండి ఇప్పటివరకు ఆమె చేష్టాగతాలను, ఆమె చర్యలను అందరూ అర్థం చేసుకుంటారు. పూర్వకాలంలో దేశం

పరాధీనమై పోకముందు ఆమె చెప్పినట్లు జరిగేది ఇప్పుడు ఆమె చర్యలను పట్టించుకునే వారే లేరు. అయితే ఆమె చేసే పనుల ద్వారా సంఘటనలను ఆవూరి ప్రజలు అర్థం చేసుకోగలుగారు. మనకు తెలియని కొన్ని సాంప్రదాయాలను మనము మన పూర్వీకుల ద్వారా తెలుసుకొని, వాటిని అలాగే పాటించే ప్రయత్నం చేస్తాం. అందులోని తోతుపాతులు అర్థాలు. ప్రజలందరు తెలుసుకొనే ప్రయత్నం చేయరు. ఇది సాంప్రదాయంగా జరుగుతున్నది. దీనినే విశ్వనాథవారు అత్యంత గంభీరంగా గణాచారి పాత్ర ద్వారా వివరించారు. ఇది శిల్పరహస్యం.

రంగారావు, చంద్రారెడ్డి, రంగమ్మ, పసరిక... ఈ నల్గురు ఒక్కొక్కరీతిలో దేశం ఆత్మకు నాశనానికి కారణమైన వాళ్ళు. వీరివల్ల ఒక్కొక్క మెట్టు దేశం దిగజారిపోతుంది. దీన్ని సూచిస్తూ గణాచారి పాటపాడుతుంది. ఈ పాట తర్వాత గణాచారి పాత్రకు పనిలేదు. అందువల్లనే ఈ పాత్ర ఇతివృత్తాన్ని ముగిస్తారు. రచయిత 'నాకును, స్వామికినింత సంబంధము లేదు'. అని గణాచారి అంటుంది. అంటే భూమికి ఆకాశానికి మధ్య స్వామికీ, లోకానికి మధ్య ఉన్న లంకె తెగిపోయిందని అర్థం– ఇలా నవలలో పాత్ర ప్రవేశానికి– నిష్క్రమణకు సరిగ్గా 'లంకె' కుదిర్చి రచయిత కావ్య పరమార్థాన్ని చక్కగా నిరూపించారు.

సిద్ధాంతపరమైన విషయాలను వివరించడంలో ప్రతీ అక్షరము. ప్రతీభావము ఆ సిద్ధాంతానికి అభిముఖంగా సాగడం రచయితలోని శిల్ప విలక్షణత. దేశం కేవలం భౌగోళిక సరిహద్దులతో కూడిందే కాదంటూ దేశంలో సర్వ సంస్థలూ, సర్వమత సంప్రదాయాలు ఇవన్నీ ఇక్కడి మనుష్యుల జీవన విధానాలని, వీటి ద్వారానే భారతీయుడిగా గుర్తింపబడుతున్నాడని ఇక్కడి మనుష్యుల మధ్య సంబంధాల్ని 'ఆచార సంప్రదాయాలతోని' మాత్రమే చూడాలని మానవ సంబంధాలని భౌగోళికేతర విషయాల ద్వారా నిరూపించడం జరిగింది. మనదేశ మనఁగా నాల్గు హద్దులు కల ప్రదేశమని కాదర్థము. ఇచ్చట మతము, సంఘము, ఆచారములు, సర్వమునని యర్థము. ఈ భూఖండము నందు, బుట్టినంతలో నొరిగినది లేదు. మన మత సంఘాచారారములందు బుట్టవలయును వాఁడు మన దేశస్థుడు అని ధర్మారావు చేత రచయిత అనిపిస్తాడు.

దేశం మనుష్యులలోని విశ్వాసం మీద నడుస్తుందని, ఆ విశ్వాసం ఆధారంగానే ఇక్కడి అక్కడి సంస్థలు సుభిక్షంగా ఉంటాయని, భూతదయ గురించి వివరిస్తూ, అన్ని ప్రాణుల్లో జీవం ఉంటుందనీ, ఇక్కడి సంస్కృతి తెలుపుతుందని 'ధర్మారావు చర్చరూపకంగా 'మా మతము దేవుఁడున్నాడని కాదు. ఆ దేవుఁ డుండనిమ్ము. చావనిమ్ము. సర్వమైన సృష్టియందును బ్రాణము. జీవము ఆత్మ కలకల లాడుచున్నదని మా పూర్వీకులు చూసిరి. సర్వవస్తుగత

ప్రాణమును సమరాధించిరి. అంతకన్న భూతదయలేదు కేవలం మానవుల మధ్య ఉన్న సంబంధమే కాకుండా అన్ని జీవరాశుల పట్ల ఇక్కడి మనుషుల ఆలోచనలు చర్చద్వారా తెలియజేయును. 'శిల్పం'లోని భాగమే. తాను నిరూపించదలచిన అభిప్రాయాన్ని తనకు తాను అనుకూలంగా లేని వర్గం దగ్గర– చర్చను ప్రారంభించి– చివరికి ఆ చర్చను తనకు అనుకూలంగా చేసుకొని, తాను చెప్పదలచుకున్న సిద్ధాంతానికి గట్టి పునాది వేసి– 'సూత్రబద్ధంగా' అసలు విషయాన్ని చెప్పగలగడం, చదువుతున్న పాఠకుడిపై ప్రభావం చూపెట్టడం — శిల్పమే.

సంప్రదాయంలోని గొప్పతనాన్ని సమర్థించేందుకు వేయిపడగలు నవలలో రచయితనే నేరుగా కథలోకి వచ్చి తనకు సంప్రదాయం పట్ల ఉన్న గౌరవాన్ని తెలుపుతారు. వ్యతిరేకవర్గం వారు జాతీయ సంప్రదాయాల్లోని అన్ని రకాల వ్యవస్థలపై దాడిని తీవ్రతరం చేసి వాటి నాశనానికి ఎదురుచూస్తున్న సమయంలో నవలలోని పాత్రలు దానిని సమర్థవంతంగా ఎదుర్కొంటాయి. అయితే తీవ్ర అభినివేశం ఉన్న రచయిత తన యొక్క బలమైన విశ్వాసాన్ని పాఠకునికి తెలిపేందుకు అక్కడక్కడ పాత్రలను కాదని తానే కథ మధ్యలోకి వచ్చి తన అభిప్రాయాన్ని బలంగా చెప్తాడు. 'ఇది మన సంప్రదాయములోని యుత్కృష్టత దానిని నీవెంతయైన పెల్లగించి వేయుము. అది మరల జివుర్చుచునే యుండును. అల్పశక్తివంతమైన సృష్టి చనిపోయినట్లు శక్తిమంతమైన సృష్టి చనిపోదు'. అనడంలో పాఠకుని హృదయం ఉప్పొంగుతుంది. ఇది శిల్పపరంగా గొప్పది కాకపోయినా నవలలో తాను నిరూపించదలచిన విషయాలను పాత్రలచేత చెప్పించడానికన్న రచయితే ముందుకు వచ్చి అంతరంగాన్ని ఆవిష్కరిస్తారు.

'వేయిపడగలు' అంతరార్థంలో వేయిపడగల సంకేతార్థమును వివరిస్తూ విశ్వనాథ ఇది ధర్మానికి రూపకల్పనగా వివరిస్తాడు. నవల మొత్తం మీద 'వేయిపడగలు' అనే పదానికి ఎక్కడ ఔచిత్య భంగం కాకుండా శిల్ప నిర్వహణ చేయడం జరుగుతుంది. ఆదిశేషువునకు వేయిపడగలున్నై... అనగా సహస్రముఖంగా ధర్మం ఉంటుంది. ఆ ధర్మము చేత భూమి పాలింపబడుతుంది. అన్నయర్థమే, సర్వత్రా ధర్మమే వుంటే అది సహస్రముఖంగా వున్నదని చెబుతాం. అదీ 'వేయిపడగలు' పాఠకుడు రచనను చదివి రచయిత ఉద్దేశించిన అర్థాన్ని అన్వయించుకోవడంలో పొరపాటు పడకుండా, నవలా రచయిత తన 'రచన'కు సంబంధించి వివరణ ఇచ్చుకోవడం కూడా శిల్పం లోని భాగమే. ఇలా పాఠకుడి మనస్సులో ఉన్న అన్వయక్లిష్టతను తొలగిస్తుంది.

### 5.4.5 నారాయణరావు– శిల్ప వివేచన:

నారాయణరావు నవల జాతీయోద్యమ స్ఫూర్తితో బాపిరాజుగారి కళాహృదయాన్ని ఆవిష్కరించింది. ఇందులో కథను మొత్తంగా రచయితతోనే వ్యాఖ్యానించినట్లు కనబడడం 'శిల్ప'పరంగా కొంత లోపమని చెప్పినా– కథాకథనం విషయంలో, పాత్రపోషణ సంభాషణల్లో రచయిత నేర్పు తెలుస్తుంది. పాఠకుడి ఆసక్తి పెంచేదిగా కనబడుతుంది.

జమీందారు నారాయణరావును అల్లునిగా చేసుకునేందుకే మొదటి పరిచయంలోనే 'నీకు పెళ్ళైందా' అని అడగడం రచయిత కుటుంబ సంబంధాల నిర్వహణకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నాడో తెలుస్తుంది. ఈ సందర్భం జమీందారు యొక్క పూర్తి మనస్తత్వాన్ని అర్థం చేయిస్తుంది. కథ తర్వాత ఎన్ని మలుపులు తిరిగినా తాను 'నారాయణరావు' పక్షమే ఉన్నట్లు కనిపిస్తుంది. ఈ విధంగా పాత్రలను పరిచయం చేయడంలోనే రచయితన తన ప్రతిభను చూపెట్టారు. కథ మధ్యలో నారాయణరావు దాంపత్యానికి భంగం కలిగించేలా– సన్నివేశాల కల్పన – నారాయణరావు దంపతుల యొక్క సాన్నిహిత్యానికి దోహదపడేలా చేసింది 'శారద' చదువుకున్నప్పటికీ తల్లి బంధువుల ప్రేరణతో భర్తను నిరాకరించడం అంతకు ముందే వ్యసనపరుడైన బావ పట్ల ప్రేమను చూపెట్టడం – లాంటి సంఘటనలు 'శారద' హృదయాన్ని అపార్థంగా అర్థం చేసుకునేలా రచన ఆయా సంఘటనలను 'నేర్పు'గా అల్లడం వల్ల– తర్వాత నారాయణరావు యొక్క 'సహృదయత'ను శారద సరిగ్గా అర్థం చేసుకోగలిగింది.

శ్యామ సుందరీ దేవి ప్రమేయంతో 'శారద' నారాయణరావుకు దగ్గరౌతుంది. అతని 'పరోపకారబుద్ధి' కూడ దీనికి తోడవుతుంది. పెళ్ళికాకముందు నుండే బావ జగన్మోహనరావు వికృత చేష్టలు, పెళ్ళయినా కూడ అతని నీచ ప్రవర్తన ఒకవైపు – పెళ్ళయినా కూడా భర్త నారాయణరావు భార్య 'గౌరవానికి' విలువనివ్వడం ఒకవైపు – లాంటి సంఘటనలు సృష్టించి కుటుంబంలో వివాహవ్యవస్థ యొక్క గొప్పతనాన్ని రచయిత సాధించారు. ఏ మధ్యవర్తుల కారణంగా 'శారద' భర్తకు దూరంగా ఉందో – మళ్ళీ అలాంటి 'మధ్యవర్తుల' సాయంతోనే భర్తకు దగ్గర కావడం–లాంటి అన్వయంతో కూడిన నిర్మాణశిల్పం ద్వారా పాఠకునికి ఆయా పాత్రల పట్ల గౌరవాన్ని కలిగింపజేస్తాడు. నారాయణరావు వ్యక్తిత్వాన్ని కూడ రచయిత అద్భుతంగా తీర్చిదిద్దాడు. పరోపకారబుద్ధి, భార్య ప్రవర్తనను గౌరవించడం రాజేశ్వరరావు లాంటి మిత్రుల దుష్ప్రవర్తనను ఖండించడం తననుండి భార్యను, విడదీసే ప్రయత్నం చేసిన జగన్మోహనరావును క్షమించి అతన్ని ఆర్థికంగా ఆదుకోవడం తన సోదరి కుటుంబాన్ని సరిదిద్ది బావలో పరివర్తన తేవడం, జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొని, జైలుకుకూడ వెళ్ళడం లాంటి అనేక సంఘటనలు

ఆ పాత్రయొక్క 'ధీరోదాత్తత లక్షణాలను తెలుపుతాయి. ఈ సంఘటనలు సర్వసాక్షి దృక్కోణంలోంచి జరుగుతున్నా పాఠకుడు కథలో లీనమౌతాడు. ఇవన్నీ కథలో తరువాత జరుగబోయే సంఘటనలు– వీటన్నింటిని రచయిత ముందుగా చెప్పే అవకాశం లేదు. కానీ జమీందారు తొలి పరిచయంలోనే 'నారాయణరావు' అంటే ఇష్టపడతారు. జమీందారీ గారి 'దూరదృష్టి' ఇంతదూరం విస్తరించిందనే విషయాన్ని రచయిత కథా ప్రారంభంలోనే 'సూచనప్రాయంగా' తెలియజేసారు. పాఠకుడు నారాయణరావు పాత్రపట్ల ఎలాంటి సందర్భంలో అపోహపడడు. నారాయణరావు ముందు నుండి చివరి వరకు ఒకే విధంగా ఉంటుంది. ఒక విధంగా 'flat' క్యారెక్టర్ అయినా, అన్ని సంఘటనలు అతని ద్వారా జరుగుతాయి. కాబట్టి– ప్రతీ సంఘటనను నారాయణరావు దృష్టిలో అర్థం చేసుకోవాల్సి వస్తుంది.

'స్వేచ్ఛా ప్రణయ సిద్ధాంతం' ప్రతిపాదనతో రాజేశ్వరరావు పుష్పలీలను లేవదీసుకుపోతాడు. వయోవృద్ధుడు స్వేచ్ఛాప్రణయ అభిరుచి సుబ్బయ్యశాస్త్రి భార్య పుష్పలీల– తన భర్త అభిమానించే సంఘ సభ్యురాలై రాజేశ్వరరావులతో లేచిపోవడం అక్కడ కూడ అతనిలో 'సహజీవనం' చేయక వేరే అతనితో వెళ్ళిపోవడం అనేది స్వేచ్ఛాప్రణయ సిద్ధాంతాన్ని బలంగా నిర్వహించాడు రచయిత. ఈ పాత్రలను కల్పించడం వాటి మధ్యన సన్నివేశాలను సృష్టించడం స్వేచ్ఛాప్రణయ సిద్ధాంతానికి అనుకూలంగా వారి ప్రవర్తనలను తయారు చేయడం రచయిత ఆ మార్గంలో నిర్వహణ సరిగ్గానే చేసారు. దానితోపాటు సరిగ్గా దానికి వ్యతిరేకం మార్గంలో కులపాలికా ప్రణయాన్ని నిర్వహించారు. ఈ విషయాన్ని 'లోతుగా' అవగాహన చేసుకుంటే రచయిత యొక్క అంతరంగం అర్థమౌతుంది. స్వేచ్ఛాప్రణయంలోని సంఘంలో సభ్యులైన సుబ్బయ్య శాస్త్రి, పుష్పలీలలు తమ విపరీత పోకడలను భారతదేశ సాంప్రదాయాలే సరిపడని) దాంపత్య జీవితాన్ని కూలదోసుకొని చివరకి ఎటూ కాకుండా పోతారు. అదే నారాయణరావు విషయంలో సాంప్రదాయబద్ధమైన వివాహంలో భార్య తనకు అనుకూలంగా లేకపోయినా ఓపికతో, నేర్పుతో తమ సంసారాన్ని నిలబెట్టుకుంటాడు. ఈ దాంపత్యంలో ఎంత నిజాయితీ ఉందంటే– జగన్మోహనరావు, శారదను ఎన్నిసార్లు ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేసినా, రచయిత ఎవరినో ఒకర్ని అక్కడికి తీసుకువచ్చి ఆ ప్రయత్నాన్ని విరమింపజేసేలా చేస్తాడు. బలమైన ప్రత్యర్థిని నారాయణరావుకు, వ్యతిరేకంగా, అత్తవారింట్లోనే పెట్టి– అతన్ని వ్యసనపరుడిగా చిత్రీకరించి– శారద శీలానికి హాని కలిగించే సందర్భాల్ని సృష్టించి వాటినుండి మళ్ళీ తానే కాపాడుతాడు రచయిత. ఈ చర్యల ద్వారా రచయిత పాఠకునికి భారతీయ సాంప్రదాయ

వివాహంలోని గొప్పదనాన్ని, శాశ్వతత్త్వాన్ని తెలియజేసాడు. ఈ గొప్ప సంస్కృతిపై పాశ్చాత్య నీలినీడలు 'స్వేచ్ఛరూపంలో ముసురుకుంటే– ఎలాంటి విపత్తు దాపురిస్తుందో పుష్పలీల సంఘటన రుజువు చేస్తుంది. ఈ సంఘటనలు మనకు రెండు వేర్వేరుగా కన్పిస్తున్నా రెంటి మధ్య 'అంతస్సూత్రంగా' 'దాంపత్యం' అనే మౌలిక భావన ఉండడం విశేషం. దీనికి రచయిత నిర్మాణ శిల్పం'లో చక్కగా ఇమిడ్చినారు.

### 5.4.6 మైదానం– శిల్ప వివేచన:

స్వేచ్ఛాప్రణయాన్ని కోరుకుంటూ వ్యక్తిగత సుఖాలకై వెంపర్లాడేవాడు. చివరకి జీవితంలో ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందో, ఈ నవలలో చలం రెండు పాత్రలు సృష్టించి, అద్భుతమైన కథానిర్వహణ చేసాడు. రాజేశ్వరి, అమీర్ ల ద్వారా తాను నిరూపించదలచిన స్వేచ్ఛలోని వైఫల్యాన్ని పాఠకులకు తన ఆకర్షణీయమైన శైలిలో, పాత్రల గాఢమైన నిర్వహణలో, ఆగకుండా, ఆలోచించకుండా చేసే వాదనా పటిమతో, పాఠకుల్ని తమ తమ సామాజిక నేపథ్యాలను, కుటుంబ నేపథ్యాలను వదిలేసి– ఆ పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసేందగా తీసుకెళ్తాడు చలం తన శిల్పరచనా వేగంతో.

వివాహాన్ని కేవలం, కామ, మోహ స్థాయిలకు మాత్రమే పరిమితం చేసి పాశ్చాత్య విలువలతో ఇక్కడి సంప్రదాయాల్ని పాటిస్తే ఎంతటి ఘోరాలు జరిగిపోతాయో రాజేశ్వరి అమీర్ ల కథ ద్వారా తెలుస్తుంది.

రాజేశ్వరి – తనకు భర్త దగ్గర 'సుఖం' దొరకడం లేదని, అది అమీర్ దగ్గర దొరుకుతుందని – కేవలం తన సుఖం కోసమే సంఘంలో గౌరవంగా బతుకుతున్న భర్తని వదిలి మైదానంలోకి పరిగెత్తింది. అమీర్ తనకు రాజేశ్వరిపై మోహం తగ్గి 'తోళ్ళసాహెబ్' కూతురువైపు వెళ్తాడు. ఈ కథలో ఇద్దరూ కేవలం తన వ్యక్తిగత సుఖాలే చూసారు కానీ, కనీసం, సమాజం గురించి ఆలోచించకపోయినా తమ తోడున్నవారి గురించి కూడా ఆలోచించని సంకుచిత, నిరంకుశ, స్వార్ధ మనస్తత్వం గలవారు దీన్నంతా రచయిత అద్భుతమైన నిర్వహణలో చూపారు. రాజేశ్వరిని కేవలం స్త్రీగా కాక సమాజంలో గౌరవంగా బతికే వ్యక్తికి భార్యగా చూపడంలోనే రచయిత 'పాత్ర'ను ఉన్నతీకరించే ప్రయత్నం చేసాడు. స్వేచ్ఛా ప్రణయాన్ని కోరుకునే వారుగా మామూలు జీవితాన్ని అనుభవించే వారిని, సమాజంలో గౌరవం గానీ, ఆర్థికంగా ఉన్నతస్థితిని కలిగినవారినీ కాకుండా, బొటాబొటిగా జీవితాన్ని 'లాగే' ప్రయత్నంలో ఉన్నవారిని చూపిస్తే ఆ నిర్మాణంలో నిర్వహణలో అంత 'బలం' కనిపించదని, రచయిత తాను పాఠకుడికి చేరవేసే కథా

పరమార్థాన్ని పూర్తిగా అందించే ప్రయత్నంలో– ఇద్దర్నీ వేర్వేరు సామాజిక–ఆర్థిక వ్యవస్థల్లోంచి తీసుకోవడం జరిగింది.

ఇల్లు – కుటుంబం — భర్త – గౌరవం — ఇదీ రాజేశ్వరి చరిత్ర. ఒంటరిగా తీవ్రమోహం గల వ్యక్తిగా — ఎలాంటి బాధ్యతలు లేని వ్యక్తిగా — ఎవరికీ జవాబుదారీ కాని వ్యక్తిగా అమీర్ — ఇద్దర్నీ కలిపిన అంశం 'మోహం'. 'మోహం' అనేది ఎలాంటి వ్యక్తినైనా – తానున్న పరిస్థితి నుండి క్రిందికి లాగేస్తుందని రచయిత రాజేశ్వరి ద్వారా నిరూపించాడు. దీనికి రచయిత చూపుతున్న కారణం– రాజేశ్వరి భర్త రాజేశ్వరికి పడకసుఖాన్ని ఇవ్వకపోవడం– అమీర్ ద్వారా పొందగలగడం– రచయిత సంఘటనలను సన్నివేశాలను అత్యంత బలంగా, నిర్మించినాడనేది — ఈ రెండు పాత్రలు ఎంచుకున్న మార్గం ద్వారా తెలుస్తుంది. సమాజానికి బాధ్యుడు రాజేశ్వరి భర్త. సమాజం నుండి పారిపోయేవాడు అమీర్– సమాజాన్ని కావాలని బహిష్కరించి అమీర్ వెంట వెళ్ళింది రాజేశ్వరి. రచయిత ఇక్కడ 'మోహం' యొక్క పూర్తి స్వభావాన్ని తెలియజేసాడు. మోహితులు ఎలాంటి బాధ్యత ను కలిగివుండరని కామాతురానాం నభయం..... అన్నట్లుగా విశృంఖల విచ్చలవిడి 'కామ ప్రవృత్తి' కలిగి వుంటారని ఈ విచ్చలవిడి తనాన్ని సమాజం అంగీకరించదు. కనుక 'మైదానం' లోకి వెళ్ళి తమ వాంఛల్ని తీర్చుకుంటారని అర్థమవుతుంది.

సమాజంలో ఉన్నవారు తమ నిత్యజీవితంలో అనేకమైన వ్యవస్థలకి బాధ్యత వహిస్తారు. వివాహవ్యవస్థలో భార్యకు, భర్తకు విడివిడిగా, ఇద్దరూ కలిసి నిర్వహించే బాధ్యతలు ఉంటాయి. ఆ బాధ్యతలు వారు నిర్వహించుకుంటూ దాంపత్యజీవితాన్ని ప్రేమమయం చేసుకుంటారు. అనేక రకాల వ్యవహారాల్లో నిత్యం గడిపేవారికి– 'శారీరక కలయిక' ఒక తృప్తి నిస్తుంది. ఒకరిపై ఒకరికి ప్రేమని, నమ్మకాన్ని పెంచుతుంది. అలా ఇద్దరు కలిసి జీవన ప్రయాణం సాగిస్తారు. వీరిద్దరి మధ్య 'శారీక సుఖం' కేవలం ఒక అంశం మాత్రమే. వివాహం ఆ ఇద్దర్నీ కలిపేందుకు అవకాశం ఇచ్చింది. అంటే సమాజం వారిద్దర్నీ 'శారీరకంగా' ఏకం చేసింది. అలాకాకుండా కేవలం శారీరకంగా ఒకటవడమే పరమార్థంగా పెట్టుకున్నవారికి – సమాజం యొక్క అవసరం ఏమీ ఉండదు. సమాజంతో సంబంధం పెట్టుకోకపోతే – జీవితం 'నిస్సారం'గా ఉంటుంది. నిస్సార జీవితంలో సెక్స్ సుఖం కూడా సారవిహీనమౌతుంది. చూపు మరలుతుంది. ఇదంతా రచయిత చెప్పక – ఇద్దర్నీ 'మైదానం'లోకి పంపించాడు. దీన్నంతా పాఠకుడు తన వివేచనతో, వివేకంతోనే అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. కథాకథనంలో ఇన్ని 'రహస్యాలు' నింపుతారు – శిల్పమర్మం తెలిసిన రచయితలు. ప్రేమ కలిగినవారిలోనే – ఆర్ద్రత ఉంటుందని కేవలం మోహం, కామంలో ఉన్నవారికి ఎలాంటి విలువలపై సంబంధాలపై నమ్మకం ఉండదని 'కామతృప్తి'కి

సమాజాన్ని అడ్డుగా భావించి అక్కడ అన్ని వ్యవస్థల్ని వదిలేసి మైదానంలోకి వచ్చిన రాజేశ్వరికి ఒంటరితనాన్ని, అమీర్ తనను నిర్లక్ష్యం చేయడం వల్ల కలిగిన బాధను తప్పించుకునేందుకు 'మాతృత్వాన్ని' కావాలనుకున్నది. తర్వాత అమీర్ మాటకు ఎదురుచెప్పలేక, గతి లేక గర్భాన్ని తీయించుకుంటుంది. గౌరవాన్ని కల్పించిన భర్తను అవమానించిన రాజేశ్వరి, తన్ని అవమానపరిచి హింసించిన ప్రియుడికోసం మాతృత్వాన్ని వదులుకొంటుంది. భర్తను కాదని ప్రియుడితో లేచి వచ్చిన రాజేశ్వరికి, మరో ప్రియుడి తోడై– ఇద్దర్నీ కోరుకోవడం– ఈ నవలలో రాజేశ్వరి యొక్క 'మోహ వాంఛ' ఆమెలోని కామానికి పరాకాష్ట కావచ్చు. అలాగే మొగవాడి అల్పత్వాన్ని రచయిత పాఠకులకు గోప్యంగా వివరించాడు. అమీర్ ఇద్దర్నీ కోరుకుంటే తప్పులేదుకానీ, రాజేశ్వరి ఇద్దర్నీ కోరుకుంటే తప్పేంది? అనే ప్రశ్న సహజంగానే పాఠకునిలో వస్తుంది. చివరికి స్వేచ్ఛాప్రణయంకోసం అక్కసుతో కుటుంబాన్ని నవ్వులపాలు చేసి బయటకు వచ్చిన రాజేశ్వరి, సహకరించిన అమీర్ ఇద్దరూ సమాజం నుండి అర్థాంతరంగా నిష్క్రమించారు. భారతీయ సంప్రదాయంలో వివాహవ్యవస్థ, సంఘంలో ఉంటూ సంఘశ్రేయస్సుకై ఉపయోగపడే 'స్వేచ్ఛని' ఆహ్వానిస్తుందని సంఘమర్యాదల్ని, కట్టుబాట్లు కాలదన్నే 'స్వేచ్ఛను' అంగీకరించదని ఈ నవల ద్వారా రచయిత స్పష్టం చేసారు.

### 5.4.7 చివరకు మిగిలేది– శిల్ప వివేచన:

చివరకు మిగిలేది నవల బుచ్చిబాబు యొక్క అద్భుత సృష్టి. దయానిధి తనను తాను అన్వేషించుకొంటూ ప్రయాణం చేయడం ఇందులోని కథాంశం. అత్యంత అద్భుతమయిన శిల్పవిన్యాసం ఇందులో కనిపిస్తుంది. దయానిధి జీవితంపై ప్రభావం చూపెట్టిన వారిలో ప్రధానంగా తల్లి, కోమలి, అమృతాలు, వీరందరి ప్రభావం వల్ల దయానిధి అంతరంగం ఎంతగా సంఘర్షణకు లోనైంది అనేది రచయిత శిల్పవైదుష్యాన్ని గమనిస్తే– సాధారణంగా రచయిత కథలో దూరి తాను చెప్పదలచుకున్న విషయాలను వ్యాఖ్యాన రూపంలో చెప్పే ప్రయత్నం చేస్తాడు. పాత్రల నిర్మాణంలో తానాశించిన ప్రయోజనం రావడం లేదని భావిస్తే సహజంగా రచయితనే రంగప్రవేశం చేస్తాడు. కథను తాను పాఠకులకు చేరవేసే విషయాలవైపుకి నడిపిస్తాడు. కానీ ఇందులో రచయిత 'దయానిధి' తల్లిపాత్రను సృష్టించి– ఆమె పాత్రను నవలలో ఒక అక్షరంలో కూడా ప్రత్యక్షంగా చూపించక– నవల మొత్తం ఆమె నీడను పరిచేలా రచనను నిర్మించడం– గొప్ప శిల్పానికి ఉదాహరణ.

పాత్రల అభిప్రాయాలు, పాత్రల నిర్మాణం, సన్నివేశాలు, సంభాషణలు ఇవి సాధారణంగా కథను చెప్పే పయత్నం చేస్తాయి. దయానిధికి ప్రతీ సందర్భంలో 'తల్లినీడ' వెంటాడి అతని

జీవితాన్ని కూడ అదే తల్లిపట్ల విపరీతమైన అభిమానం ఉన్న కొడుక్కి– తల్లి గురించి చేదువార్త తెలియదు. తల్లి మరణించడం ఒక పార్శ్వమైతే అతనిలో తల్లిపట్ల ఆరాధన/ద్వేషం– రెండూ జీవితాన్నిండా పరుచుకొనేలా చేసి అతని యొక్క అంతరంగం– సమాజం నిత్యం ఘర్షణపడేలా చూడడం, ఈ ఘర్షణలో దయానిధి 'సత్యాన్వేషణ' చేస్తూ ప్రయాణించారు. రచయిత అద్భుత సృష్టిని తెలుపుతుంది. దయానిధిలో అంతర్గతంగా నిలిచిపోయిన మాతృభావన జీవితాంతం వెంటాడుతుంది. అంతేగాక అతడు ఎంతదూరం వెళ్ళినా, తనతల్లి పతిత అనే తిరస్కారం, దూషణలను ఎదుర్కోక తప్పలేదు. తల్లిశీలంపై ఏర్పడిన 'మచ్చ'ను తొలగించివేసే సామర్థ్యం దయానిధిలో ఉండదు. పరాయి స్త్రీల వ్యామోహాన్ని పెంచుకుంటాడు. ఇక్కడ రచయిత కథను మలిచిన తీరు పాఠకున్ని ఆశ్చర్యపరుస్తుంది. కోమలి, అమృతాలు ఇద్దరు దయానిధికి జీవితంలో ముఖ్యపాత్రలు. తల్లిపై దయానిధికి ఉన్న ప్రేమ, ఆరాధనలే ఈ ఇద్దరిపట్ల దయానిధికి కలుగుతుంది. తల్లిలోని ప్రేమ ఆరాధన భావాలే–అమృతంగాను తల్లిలోని స్వేచ్ఛా ప్రవృత్తే–కోమలిగా రచయిత మనకు పరిచయం చేస్తాడు. అందుకే ఈ రెండు పాత్రలు దయానిధికి అత్యంత సన్నిహితంగా ఉంటాయి. అగ్నిసాక్షిగా తాళి కట్టిన ఇందిర కూడ. దయానిధికి దగ్గర కాలేకపోతుంది. ఎందుకంటే దయానిధి తల్లి యొక్క వైవాహిక జీవితం విఫలం కావడంవల్ల తాను కూడ ఆ జీవితం పట్ల ఎక్కువ ఆసక్తి చూపించడు. సుశీల అహంకారం అసూయలు కలగలిపిన చుట్టాలమ్మాయి, ఆ అమ్మాయి దయానిధిని వివాహమాడేందుకు నిరాకరిస్తుంది. దీన్ని కూడ దయానిధి తల్లిపాత్రను ఆధారంగా పోల్చుకోవాలి. దయానిధి తల్లిలోనేని అసూయ, అహంకారాలు సుశీలలో ఉండడం వల్ల ఆమె దయానిధికి దగ్గర కాలేక పోయింది.

'అమృతం' పాత్ర అత్యంత దయగల పాత్రగా రచయిత చిత్రించారు. పరిచయంలోనే ఆమెకు దయానిధిపైగల ప్రేమ, ఆప్యాయతలను తెలియజేస్తారు. దయానిధి తల్లి పట్ల 'అనుకూల దృక్పథాన్ని' చూపెట్టిన అమృతం– తన జీవితం సాఫల్యమయ్యేంతవరకు దయానిధి వెన్నంటే ఉంటుంది. చివరికి అతనితో భౌతికంగా కలిసి, తన జీవితాశయాన్ని లాగే దయానిధిలోని స్తబ్ధతల్ని తొలగిస్తుంది. ఈ నిర్మాణాన్ని రచయిత 'అమృతాన్ని' దయామయి పరిచయం చేస్తూ, చాలా జాగ్రత్తగా పాత్రపోషణ జరిపి– దయానిధి తల్లిలోని ప్రేమ, వాత్సల్యాన్ని ఈమె ద్వారా దయానిధికి పరిచయంచేసి– ఇద్దర్నీ గెలిపిస్తాడు. కోమలి స్వేచ్ఛ ప్రియత్వంగల వ్యక్తి– పతిత – లోకనిందకు భయపడి, మరణించిన తల్లి పట్ల విపరీతమైన ప్రేమగల దయానిధికి ఆమెను సంఘం బాధించిన తీరును తట్టుకోలేకపోతుంది. దయానిధి కోమలిని కోరుకోవడంలో ఆంతర్యం, తల్లిపై పడిన మచ్చ ద్వారా సమాజంలో గౌరవాన్ని కోల్పోయిన సందర్భంలో, కోమలి

లాంటి వ్యక్తులే దయానిధితో చనువుగా ఉండగలరు. కాబట్టి దయానిధి కోమలితో ఎక్కువ చనువుగా ఉండేందుకు ప్రయత్నిస్తాడు. కానీ అతడు కోమలితో శారీరకంగా, కలవలేకపోతాడు. ఎందుకంటే 'వివాహవ్యవస్థ' వ్యక్తికి శారీరక, మానసిన తృప్తిని కలిగిస్తుంది. దయానిధి 'వివాహం' సాఫల్యం కాకపోవడంతో అతని శారీరక, మానసిక వ్యవస్థలు తృప్తిని పొందలేకపోయాయి. తరువాత జరిగిన పరిణామాలలో అమృతం ద్వారా శారీరక తృప్తి కలిగింది. కాబట్టి అతనిలో ఆ 'భావన' తొలగిపోయింది. ఇక 'మానసికంగా' కోమలిని జీవితాంతం తన దగ్గరే ఉంచుకోవడంతో తను మానసికంగా కూడా గెలిచాడు. వివాహవ్యవస్థపై అతడు పెంచుకున్న వ్యతిరేకతకు కారణం– అతడు వైవాహిక వ్యవస్థ వైఫల్యం ఫలితం అనుకోవడమే. ఇందిర చివరిదశలో దాన్ని చెరిపేస్తూ అతని వివాహం జీవితం సఫలమైనట్లుగా చేస్తుంది. ఈ విధంగా దయానిధి జీవితాన్ని అన్వేషించుకుంటూ, తల్లి ద్వారా తను పడుతున్న అవస్థను చివరికి తొలగించుకొని 'సత్యాన్వేషణ' లో ప్రయాణం సాగించడం ఈ కథలోని సారాంశం. ఇంతటి వైవిధ్యభరితమైన రచన ద్వారా రచయిత కోమలి, అమృతం, ఇందిర పాత్రలను అద్భుతంగా తీర్చిదిద్దాడు. ఈ మూడు పాత్రలు అత్యంత పరిణామశీలమైన పాత్రలు. పాత్రల పరిచయం డి, కథ సందర్భాలననుసరించి, చివరికి ముగింపు వరకు ఈ మూడు పాత్రల్లో గణనీయమైన మార్పు కనిపిస్తుంది. కోమలి సాధారణ జీవితం నుండి, దయానిధిని ఆట పట్టించడం– అతని నుండి దూరంగా వెళ్ళడం– పరిపూర్ణ పరిణితిరావడం – చివరికి దయానిధిని చేరడం– అమృతం దయానిధితో స్నేహం చేయడం, సంసారంలో సుఖాన్ని, పిల్లల్ని పొందకపోవడం, దయానిధితో కలిసి ఇద్దర్నీ గెలిపించడం, ఇందిర పెద్దల మాటల్ని విని భర్తను దూరం చేసుకోవడం– చివరికి అతనికి సమాజంలో గౌరవనీయమైన స్థానాన్ని కల్పించడం– కథలో లేని తల్లి ప్రభావం కథంతా పరచుకొని నవల చివర్లో తల్లిపట్ల కేవలం 'గౌరవాన్ని' మాత్రమే కలిగేలా ఈ నల్గురు దయానిధి జీవితంలోని 'చీకటిని' తొలగించి వెలుగులవైపు నడిపించారు. కథావస్తువు చిన్నదైనా, విస్తరణ ఎక్కువగా ఉన్నా, అందులోని ప్రతీ సన్నివేశాన్ని రచయిత 'వస్తువు' నిరూపణకి అనుకూలంగా, మలచడంలో ప్రతీపాత్ర నిర్మాణం అవసరమైనంతమేరకే ఉపయోగించుకోవడం. అప్రధాన పాత్రలైన దయానిధి తండ్రి, ఇందిర తండ్రి, శ్యామల, నాగమణి, నారయ్య, వైకుంఠం మాస్టారు, జగన్నాథం, రాజభూషణం, చివర్లో, రాయలసీమ ప్రాంతీయులు ఇలా అన్ని పాత్రల్ని రచన పరమార్థానికి అభిముఖంగా నిర్మాణం చేయడంలో రచయిత స్పష్టమైన ఆలోచనలో ఉన్నట్లు 'నవల' చదివిన పాఠకుడు చాలా సేపటి వరకు 'ఆలోచనా మగ్నుడై ఉండడం ద్వారా దయానిధిలో తనను తాను పోల్చుకునే ప్రయత్నం

చేస్తాడు. రచయిత తన రచన ద్వారా పాఠకుల్ని తాను సృష్టించిన పాత్రల్లో లీనమయ్యేలా చెయ్యడమనేది ఆ రచన యొక్క 'అపూర్వత'కు నిదర్శనం.

### 5.4.8 అసమర్ధుని జీవయాత్ర– శిల్ప వివేచన:

తండ్రి చనిపోతూ ''బాబూ వంశగౌరవం నిలబెట్టు'' అని చెప్పిన మాటను నిజం చేసే ప్రయత్నంలో సీతారామారావు కుటుంబ, నైతిక, సామాజిక జీవితాలను చిన్నాభిన్నం చేసుకొని వివరికి అసమర్ధునిగా చనిపోవడం కథాంశం. రచయిత సీతారామారావులోని అసమర్ధతని నిరూపించేందుకు నవలలో అతని కుటుంబ, ఉద్యోగ, సామాజిక, వ్యక్తిగత జీవితాలలో జరిగిన సంఘటనల కూర్పుద్వారా వివరించారు. ఈ అన్ని రకాల జీవితాలను గురించి సీతారామారావు మనోవిశ్లేషణ అతి తీవ్రంగా వ్యతిరేకమార్గంలో ఉండడం రచయిత శిల్పపరంగా సాధించాడు.

సీతారామారావు తండ్రిమాటను నిలబెట్టేందుకు వంశగౌరవాన్ని కాపాడేందుకు వారి దగ్గర అప్పు తీసుకున్న వారినుండి కూడ డబ్బులు వసూలు చేయకుండా ఔదార్యాన్ని ప్రకటిస్తాడు. దీని వల్ల అతని వంశగౌరవం పెరగకపోగా ఆర్థిక పరిస్థితి దిగజారిపోతుంది. కీర్తికోసం, వంశమర్యాదకోసం దానధర్మాలు చేస్తాడు. తీసుకున్న వాళ్ళందరూ ''*మనకోసం పెట్టాడా? పేరుకోసం పదిమందిలో మంచివాడనిపించుకోవడం కోసమని వెక్కిరిస్తారు. తండ్రి ఆశయాన్ని నెరవేర్చే క్రమంలో ఈ రకంగా సమాజం నుండి గుర్తింపు రాకపోగా, 'హేళన' మిగులుతుంది. దీన్ని జీర్ణించుకోలేక ''దానం చేయడం కోసమే దానం చేసాను*'' అని సమర్థించుకోజూస్తాడు. ఉద్యోగం చేయాల్సిరావం సీతారామారావుకి అతికష్టమైపోతుంది. కుటుంబాన్ని నడిపించడం అసహ్యంగా తోచినా, జీవనం గడవాలి కాబట్టి భార్యాబిడ్డల్ని పోషించుకోవాలి.

కాబట్టి మామగారు ఇచ్చిన ఉద్యోగం చేస్తుంటాడు. అక్కడ 'వంశగౌరవానికి' భంగం కలిగే సందర్భాలు ఎదురౌతాయి. ఆఫీసు డ్యూటిలో భాగం బయట పని కొంత చేయాల్సి వస్తుంది. దానికి తీవ్రంగా కలత చెంది– తన అసమర్ధతను, చికాకును ఎలా తొలగించుకోవాలో తెలియక 'మామ ఇప్పించిన ఉద్యోగం' నేను చేయను అంటూ ఉద్యోగం మానేసి ఇంట్లోనే కూర్చుంటాడు. సీతారామారావుకి తన అసమర్ధత తెలుసు. అయినా లేని డాంబికాన్ని ప్రదర్శిస్తూ, తప్పును వేరేవారిపై నెట్టేస్తాడు. ఇక్కడ రచయిత సీతారామారావు అంతరంగంలో జరిగే ఘర్షణని చక్కగా చూపిస్తాడు. సీతారామారావు కల గంటాడు. ఈ కలలో అతడు అడవిలో తపస్సు చేసుకుంటాడు. ఇక్కడ అడవి ప్రస్తావన రావడమంటేనే సమాజంనుండి దూరంగా పారిపోవడమని తెలుస్తుంది. ఏమాత్రం కష్టపడకుండా భోజనం దొరకాలనే వరం కోరడం తన నిష్క్రియాపరత్వాన్ని, సోమరితనాన్ని, అంగీకరించడం, సామాజిక సంబంధాలను తెంపుకొని

అడవిలో కూర్చున్న సీతారామారావుల జీవితం ఎలా గెలవగలడు? పైగా ఆడిపిల్లని కాపాడడం, డబ్బున్నవాళ్ళని దోచుకోవడం. ఇది అతనిలో అంతర్లీనంగా దాగిన కామవాంఛను, డబ్బులేనితనాన్ని సూచిస్తుంది. అన్ని రకాలుగా అసమర్థతను నిరూపించుకొని, ఇంట్లో భార్యాపిల్లల్ని అస్తమానం ఏడిపిస్తూ, అప్పుడప్పుడూ కొడుతూ తను చేస్తున్నది తప్పనితెలిసినా ఎలాగోలా సమర్థించుకొని తప్పంతా భార్యాపిల్లలమీదికి నెట్టేస్తాడు – అయినా ఇంట్లోవారు ఏమి అనరు? దీనిని రచయిత సీతారామారావు వైవాహిక జీవితం ద్వారా వివరించడం ఈ సంఘటనలోని బలాన్ని పెంచుతుంది. సీతారామారావుకి ముందుగా వివాహం అంటేనే నచ్చదు. ఒకరితో కాపురం చేయడం, జీవితాంతం కలిసివుండడం లాంటివి అస్సలు ఇష్టముండదు. అయినా, ఇందిరను ప్రేమించి పెళ్ళి చేసుకుంటాడు.

మిత్రులు అడిగిన ప్రశ్నలకు తాను వివాహానికి కొత్త అర్థం చెప్పేందుకే పెండ్లి చేసుకున్నాను' అని జవాబిస్తాడు. ఎక్కడంటే అక్కడ, ఎలా వీలుంటే అలా సీతారామారావు ప్రతీ సందర్భంలో తనను తాను సమర్థించుకొంటాడు. కానీ, ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోడు. అలా ప్రేమించి పెళ్ళిచేసుకున్న సీతారామారావుకి ఉద్యోగం పోయి డబ్బుపోయి తాను సమాజం నుండి పొందాలనుకున్న గౌరవం కూడా రాకపోయేసరికి 'వంశగౌరవం' దెబ్బతింటుంది. పెళ్ళైయి బిడ్డపుట్టిన తర్వాత ఇందిర లావణ్యం దెబ్బతింటుంది. దీనితో సీతారామారావుకి ఆమె పట్ల ప్రేమ తగ్గుతుంది. ఇందిర కూడా భర్తపట్ల 'అభావం' గా ఉంటుంది. ఇంట్లో, బయటా పలుచనౌతాడు. ఆర్థికంగా, హార్ధికంగా చూసుకునే వారుండరు. ఇదంతా రచయిత చెప్పక – అడవిలో తానొక బందిపోటుగా దొరికిన అమ్మాయిని వదిలేసేంత ఉదార స్వభావుడిగా ఊహించుకోవడం అతడు కోల్పోయిన డబ్బును కామవాంఛను ప్రతిబింబించేవే. రచయిత కథ చెప్పడంలో చూపెట్టిన 'నేర్పు' అద్భుతంగా ఉంటుంది. అనవసర దాతృత్వం వల్ల ఆస్తిని కోల్పోయి, అమర్యాద ప్రవర్తనతో బంధువులను దూరం చేసుకొని, మిడిసిపాటుతో ఉద్యోగం పోగొట్టుకొని, భార్యలోని లోపాలు వెతికి వివాహబంధానికి దూరమై– కలలు కంటూ 'గోడమీద బల్లి'తో ముచ్చట్లు పెట్టి సీతారామారావు చివరికి బల్లిని కూడ ఒప్పించలేకపోతాడు.

అది కూడ ఆహారంకోసం ప్రయత్నిస్తుంది. రచయిత సీతారామారావు అసమర్థతను ఈ బల్లి పోలికగా చక్కగా విశ్లేషించారు. అన్ని రకాల మానవ సంబంధాలను కేవలం మిథ్యాడాంబికంతో పోగొట్టుకొని, పైగా తనను తాను సమర్థించుకొనే ప్రయత్నంలో సమాజానికి దూరమై విపరీతమైన ఆత్మన్యూనతతో బాధపడే సీతారామారావు ఆఖరికి దీనికి కారణమైన నాన్నను అడుగుదామని 'శ్మశానం'లోకి వెళ్ళాడు. శ్మశానంలోకి వెళ్ళడంతోనే సమాజంనుండి

దూరమైనాడు. సీతారామారావు సమాధిలో ఉండే 'తండ్రి' చర్చించినట్లు రచయిత కల్పన చేత ఈ నవలలో సరికొత్త నాటకీయత. అంటే సీతారామారావుకి మిత్రులూ, నా అనేవాళ్ళు ఈ లోకంలో ఎవరూ లేరని భావించాలి. తండ్రితో వాదనకు దిగి తన పొరపాట్లు తెలుసుకొని, ఆ పొరపాట్లను సరిదిద్దుకునే ఓపిక, ధైర్యం తనలో లేవని చెప్పకనే – సీతారామారావు ఆత్మహత్య చేసుకుంటాడు. ఇందులో ఉండే సీతారామారావు రాన్రాను ఆత్మన్యూనతాభావానికి గురైయి చివరికి పిచ్చివాడై ఆత్మహత్య చేసుకోవడంలో ఈ పరిణామం కనిపిస్తుంది. కాకపోతే ఈ పరిణామం 'గుణాత్మక' పరిణామం అయితే 'సమర్థుడైన సీతారామారావు అయ్యేవాడు. ఆత్మన్యూనత– ఒంటరితనం, నిర్వ్యాపారత– అసంబద్ధ ఊహలు — నిర్మాణాత్మకంగా లేని ఆలోచనలు — మిథ్యా అహంకారం — వ్యవస్థను అర్థం చేసుకోకపోవడం — సర్దుకోలేకపోవడం లాంటి అనేక సమస్యలు మానవ సంబంధాలను ఎంతగా నిర్వీర్యం చేస్తాయో తర్వాత ఆవ్యక్తి జీవితం ఎటువైపు పోతుందో రచయిత ఈ నవల ద్వారా నిరూపించారు.

### 5.4.9 మానవసంబంధాల అభివ్యక్తి వైవిధ్యం :

శిల్పరీత్యా ఆయా నవలల్లోని పాత్రల పరిణామ శీలాన్ని పరిశీలిస్తే, మానవ సంబంధాల నిర్వహణలో భాగంగా తమ వ్యక్తిత్వాలను ఏవిధంగా మెరుగుపరుచుకొన్నారో లేదో కూలదోసుకున్నారో తెలుస్తుంది. ఈ విధమైన నిర్వహణ రచయిత శిల్ప విన్యాసంలో ప్రధానంగా కనబడుతుంది. రచయితకు ఆ పాత్రయొక్క పూర్తి తత్వంపై ఆ పాత్ర ఆ నవలలో నిర్వహించాల్సిన బాధ్యతలపై 'అవగాహన'ను కలిగివుంటేనే ఇది సాధ్యమౌతుంది. రాజశేఖర చరిత్రలో — రాజశేఖరుడు పూర్తి 'పరిణామశీలం'గల వ్యక్తి. తొలుత మూఢ విశ్వాసాలతో, సంపదను పోగొట్టుకొని, కుటుంబాన్ని అవస్థలపాలు చేసిన దారిద్ర్యంలోకి నెట్టివేయబడి, చివరికి మళ్ళా స్థితిమంతుడు కావడం, రాజశేఖరుని జీవితంలోని రకరకాల సందర్భాలను పరిచయం చేయడం ద్వారా తనను తాను సమన్వయపరకోవడంలో ఎలా వైఫల్యం చెందాడో, చివరికి ఎలా సాధిచాడు అనే తెలుస్తుంది. రుక్మిణి పాత్ర కూడ తండ్రి చాటు కూతురైనా భర్త చనిపోయడన్న వార్త తెలిసినా, అడవిలో ఒంటరిగా పడి ఉన్నా, మగవేషంలో వేరే ఊర్లో గుమాస్తాగా పనిచేస్తూ చివరికి క్షేమంగా తిరిగివచ్చిన భర్తతో, కుటుంబంతో హాయిగా ఉంటుంది. రుక్మిణి జీవితంలో కష్టాలు, సుఖాలు కలిసి, ఆమెను దృఢమైన చిత్తంగల వ్యక్తిగా ఆకాలంలోని అమ్మాయిలా బలహీనురాలుగా గాక, సమయస్ఫూర్తి తెలివి, హుందాతనం, నిబ్బరంగల వ్యక్తిగా పూర్తిగా, 'పరిణామశీలం'గల పాత్రగా రచయిత మలిచారు. గణపతిలో పరిణామ శీలత్వంలో కూడిన పాత్రలు కనబడవు. గణపతి మూత్రం బడికి వెళ్ళని విద్యార్థిగా జీవితం మొదలుపెట్టి,

బడిపంతులుగా మారడమే శిల్పవిన్యాసంలోని భాగంగా చెప్పవచ్చు. మాలపల్లిలో రామదాసు ఎలాంటి పరిణామాలకు ప్రభావితంకాని పాత్రగా నిలుస్తుంది. సంగదాసు తన ప్రజల శ్రేయస్సుకోసం, యజమానిని ఒప్పించడంలో విఫలమైనవాడిగా వెంకటదాసు సాధారణ జీవితం నుండి ఒక్కసారి తమ్ముని మరణంతో హింసావాదిగా రెండు భిన్న ధోరణులతో అత్యంత పరితామాత్మక వ్యక్తులుగా కనిపిస్తారు. రామానాయుడు పాత్ర, మొదటి చౌదరయ్య కుమారుడిగా సంగదాసు స్నేహితంతో అతని 'ఆశయాన్ని' ముందుకు తీసుకెళ్ళి విజయం సాధించినవాడిగా గుణాత్మక పరిణామశీలత్వంగల పాత్ర. చౌదరయ్య నిమ్నవర్గాల ప్రజలను దోచుకుంటూ చివరికి కుటుంబం నాశనమయ్యేసరికి– మరణించిన వ్యక్తిగా, అలాగే కమలను, చక్కని సంసారాన్ని నేలపాలు చేసుకొని, చివరికి ఆకుటుంబంలోనే పరాయివ్యక్తిగా జీవితాన్ని ముగించుకోవడం. ఈ రెండు పాత్రల్ని నకారాత్మక పరిణామంగల పాత్రలుగా చిత్రించారు రచయిత. అనేక వ్యవస్థలు, అనేక వ్యక్తులు, సుదీర్ఘమైన కాలక్రమంతో విస్తారమైన మానవ సంబంధాలతో క్లిష్టత కూడిన సమన్వయంతో నిర్మించబడినది వేయిపడగలు. ఇందులో ప్రధానంగా ధర్మారావు నవల ప్రారంభంనుండి చివరి వరకు ఎలాంటి ప్రభావాలకు లోనుకాని వ్యక్తిగా తన ముందే అన్ని వ్యవస్థలు కూలిపోతుంటే కేవలం 'సాక్షి'గా మిగిలిపోతారు. అయినా, తనచుట్టూ తనతోపాటు ఉన్న వ్యక్తులలో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తాడు. ధర్మారావు ఈనవలలో మార్గదర్శియే గాని మార్గంలో ప్రయాణించేవారు కాదు. రంగారావు మొదట విదేశీవ్యామోహానికి గురై, కుటుంబంతో, సంఘంలో మర్యాదను కోల్పోయి, ప్రభువు స్థానం నుండి భూస్వామి స్థాయికి దిగజారి, చివరికి కొడుకు హరప్పా సహచర్యంలో, ధర్మారావు ఆలోచనలో పూర్వవైభవం సంపాదించుకునే 'గుణాత్మక పరిణామాత్మకమైన పాత్రగా, అరుంధతి మొదట భర్తకు వ్యతిరేక ప్రవర్తనతో, తర్వాత నిజాన్ని గ్రహించి, ఆసాంత భర్త మేలుకోసం తపించే సకారాత్మక పరిణామశీలత్వం గల నవలలో చూపెట్టడం జరిగిం. మంగమ్మ మొదట వ్యక్తిత్వం లేని వ్యక్తిగా, అనైతిక ప్రవర్తనలతో కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసుకొని, తర్వాత తప్పు తెలుసుకొని, పదిమందికి ఉపయోగపడే పాత్రగా 'గొప్ప పరిణామం' గల పాత్రగా కనబడుతుంది. పసరిక, దేవదాసి, గణాచారిలు కాలగమనంలో ఉనికిని, పరిణామాన్ని ప్రభావాన్ని అస్తిత్వాన్ని, వైభవాన్ని కోల్పోయే పాత్రలుగా చిత్రించబడ్డాయి. 'నారాయణరావు' పాత్ర చైతన్యశీవంతమైన పాత్ర – ఆ పాత్ర చుట్టూ ఉన్న వ్యక్తులు, వివిధ రకాల పోకడలతో జీవితాలన్నీ కాంతివంతము, చీకటిమయమూ చేసుకుంటారు. నారాయణరావు మొదటి నుండి

చివరి వరకు ఒకే విధమైన వ్యక్తిత్వంతో ఉంటాడు. కానీ అతనికి తారసపడిన వ్యక్తులను మార్చి సన్మార్గంలో పెట్టేవాడుగా చైతన్యవంతుడిగా ఉత్తమశీలం గల గాంధీ అనుయాయుగా నిలిచాడు.

సత్యం కోసం అన్వేషణ చూపే వ్యక్తిగా దయానిధికి పూర్తిగా 'పరిణామాత్మక పాత్ర'గా కనిపిస్తాడు. అతనిపై తల్లి, కోమలి, అమృతం, ఇందిరల ప్రభావం వల్ల– జీవితంలోని ఎదురైన అనేక సంఘటనలకు, అంతస్సంఘర్షణలకు గురై చివరికి తనను తాను తెలుసుకొని తనలోని 'స్వేచ్ఛ'కై సాగిపోతాడు. కోమలి– అనాగరిక వ్యక్తిగా, సంఘంలో తిరస్కారం పొందిన స్త్రీగా కనిపించి, దయానిధి ప్రేమకు పాత్రురాలై చివరికి గంభీరమైన మనస్తత్వాన్ని, ఏర్పరచుకొని దయానిధితో ప్రయాణం సాగించే గుణాత్మక పరిణామశీలత్వం గల పాత్రగా, అమృతం చలాకీగా ఉంటూ, కుటుంబంలో ఒంటరితనానికి గురై దయానిధి ద్వారా బిడ్డని కని జీవితంలో స్థిరపడ్డ వ్యక్తిగా 'పరిపూర్ణవ్యక్తిత్వం' గల వ్యక్తిగా కనిపిస్తుంది. మైదానంలో రాజేశ్వరి సంసారాన్ని కూలదోసుకొని, స్వేచ్ఛకోసం మైదానం బాట పట్టి చివరికి జీవితంలో ఘోరంగా ఓడిపోవడం నకారాత్మక పరిణామాత్మక పాత్రగా మిగిలిపోతుంది. సీతారామారావు తీవ్రమైన మనస్తత్వంలో, విపరీతమైన మానసిక దౌర్బల్యంతో, ఆత్మన్యూనతతో తనను, చుట్టూ ఉన్న వారిని హింసిస్తూ చివరికి చనిపోవడం 'నకారాత్మక పరిణామశీలత్వం'గల పాత్రగా కనిపిస్తుంది.

ఈ విధంగా పైన వివరించిన పాత్రలు వారి వారి జీవితాల్లో వారికి ఎదురైన సంఘటనలు అంతర, బహిస్సంఘర్షణల కారణంగా జీవితంలో ఎలా ఉత్థాన పతనాలను ఎదుర్కొన్నది– ఈ విషయాలన్నీ ఆయా రచయితలు తమ నవలల్లో, పాత్రల చిత్రీకరణ ద్వారా ఎలా నిరూపించారన్నది శిల్ప విమర్శలో గమనించడం జరిగింది.

★★★

ఆరో అధ్యాయం

# తెలుగు నవలల్లో మానవసంబంధాలు

# దార్శనికుల ప్రభావం

## 6.0 ఆధునిక దార్శనికుల ప్రభావం:

తెలుగు నవలల్ని స్థూలంగా పరిశీలించినప్పుడు భారతీయులపై పాశ్చాత్య ప్రభావం తీవ్రంగానే పడిందని వేయిపడగలు నవలలో భారతీయ కుటుంబ వ్యవస్థ ద్వారా కనిపించే మానవసంబంధాలు తెలియజేస్తున్నాయి. కానీ పాశ్చాత్య మానవ సంబంధాల్ని తనలో జీర్ణించుకుంటూనే తన మూలాల్ని బలంగా కాపాడుకున్న భారతీయజీవన విధానమే ఈ నవలలోని ధర్మారావు పాత్ర ద్వారా నిరూపితమైంది. అలాగే, జిడ్డుకృష్ణమూర్తి గారి దార్శనిక ప్రభావం చివరికి మిగిలేది నవలలో గాఢంగానే కనిపిస్తుంది. పాశ్చాత్య ఆర్థిక, రాజకీయ ప్రభావాలు భారతీయ సమాజంపై చూపిన మానవసంబంధాల్ని 'మాలపల్లి' నవల ప్రతిఫలిస్తుంది. వీటిని అరవిందుని దార్శనిక ప్రభావం ప్రపంచ మానవసంబంధాల్లో క్రియాశీల ఆధ్యాత్మికజీవన సంబంధాల్ని ఆలోచింపజేశాయి. ఇలా ఆధునిక దార్శనికుల ప్రభావం తెలుగు నవలా సాహిత్యంపై విస్తృతంగానే కనిపిస్తుంది. నవల సామాజిక వాస్తవికతకు ప్రతిబింబంగా భావించినప్పుడు, ఆ కాల్పనిక సాహిత్యంలో కూడా మానవసంబంధాల ప్రతిఫలనం ఉంటుంది. అందువల్ల ఈ అధ్యాయంలో భారతీయ సంస్కృత సాహిత్యం, ఆధునిక దార్శనికల ప్రభావాన్ని పరిచయం చేస్తూ మానవసంబంధాల్లో కనిపించే వివిధాంశాలను వివరిస్తాను.

## 6.1 ప్రాచీన సంస్కృత సాహిత్య ప్రభావం:

'భారతీయాత్మ'ను గాఢంగా పరిశీలించాలంటే ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేయాలి. ఒక దేశం యొక్క సంస్కృతి, వారసత్వాలు ఆదేశపు సాహిత్యంలో కనిపిస్తాయి. దేశం యొక్క సంస్కృతి ఆ సాహిత్యానికి జీవాన్నిస్తుంది. దేశ సంస్కృతి యొక్క ఎత్తు పల్లాలను, సాఫల్యవైఫల్యాలను ఆ దేశ సాహిత్యంలో చూడవచ్చు. భారతదేశం యొక్క సంస్కృతి, సంస్కృత సాహిత్యంలో ప్రతిబింబిస్తుంది. భారత హృదయానికి సంస్కృత సాహిత్యం అద్దం లాంటిది. భారతీయ సంస్కృతీయాత్మ సంస్కృత సాహిత్యం నిండా పరుచుకొని ఉంది. భారతీయుల సామాజిక, రాజకీయ, మత, కళా, శాస్త్రాభివృద్ధులన్నీ సంస్కృత సాహిత్యంలో చోటుచేసుకున్నవి. భారతదేశం యొక్క సుదీర్ఘకాలానికి చెందిన భౌతిక, ఆధ్యాత్మిక జీవనం సంస్కృత సాహిత్యం

నిండా కనిపిస్తుంది. సంస్కృత సాహిత్యం ద్వారా ప్రాచీన భారతీయుల చరిత్రను అధ్యయనం చేయవచ్చు. నేటి మానవుని జీవితం నిన్నటి చరిత్ర ద్వారా తెలుస్తుంది. గత చరిత్రను, వైభవాన్ని మరిచి – వర్తమానంలోనే జీవిద్దామనుకుంటే ప్రగతివైపు బాటలు వేయడం కష్టం. ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేసి అందులో ప్రస్తుతకాలానికి అవసరమైన మూల్యాలను గ్రహించటం విజ్ఞులు చేసే పని. సంస్కృతభాష అతి ప్రాచీనమైన భాష. అందులోని సాహిత్యం మానవ జీవన మూల్యాలను జాతికి అందించింది.సంస్కృత భాష ఒకప్పుడు భారతీయ భాషలకు మూలభాషగా ఆదరింపబడింది. ఆయా ప్రాంతీయ భాషలకు, సాహిత్యాలకు ఇది ఎంతో శక్తి సామర్థ్యాలను ఊపును అందించింది.

భగవంతుని నిశ్వాస రూపాలైన వేదాలు కొందరు మంత్రద్రష్టలైన మహర్షులచేత దర్శింపబడ్డాయి. అవి వైదిక సంస్కృతంలో ఉన్నాయి. సంహితలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులని నాలుగు రంగాలలో వైదిక వాఙ్మయం ఏర్పడింది. ఆదికావ్యం రామాయణం వాల్మీకీచే రచించబడింది. ఈ కావ్యంతోనే లౌకిక సంస్కృత భాష రూపుదిద్దుకొంది. ఆదికావ్యం తర్వాత ఏర్పడిన వాఙ్మయమంతా లౌకిక సంస్కృత భాషలో ఉంది. ఈ లౌకిక సాహిత్యం వేల సంవత్సరాల నుంచి తరతరాలుగా పెరుగుతూ భారతీయ సంస్కృతిని తీర్చిదిద్దుతూ సమాజకళ్యాణానికి ఎంతో దోహదం చేస్తున్నది.

మానవ జీవితానికి ఒక అర్థం పరమార్థం ఉందని భారతీయులు అతి ప్రాచీన కాలంలోనే గుర్తించారు. అందుకే ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే నాలుగు పురుషార్థాలను ప్రతివారు సాధించాలని శాసించారు. అర్థకామాలను, ధర్మాన్ని అతిక్రమించకుండా సాధించే మార్గాలను ఉపదేశించారు. పరుమ పురుషార్థమైన మోక్షాన్ని సాధించడంలోనే మానవత్వానికి సార్థకత్వం ఉందనే సత్యాన్ని గుర్తించారు. సంస్కృత సాహిత్యం కేవలం పారలౌకిక పరమార్థం మోక్షాన్ని మాత్రమే బోధించలేదు.ఇహలోక సుఖాలు శాశ్వతం కాదని మాత్రమే హెచ్చరించింది.

సంస్కరణ వ్యక్తి నుండి మొదలుకావాలని ప్రాచీన భారతీయుల నమ్మకం. అందుకే వాళ్ళు వ్యక్తిని తీర్చిదిద్దేందుకు ఎన్నో మార్గాలను అన్వేషించారు. కట్టుదిట్టమైన సమాజాన్ని నిర్మించుకున్నారు. శీలమే పరమావధిగా వ్యక్తిని ఎంతో చక్కగా తీర్చిదిద్దారు. వ్యక్తి సంస్కారవంతుడు కానిదే ఏ సమాజం సంస్కారం పూర్ణం కాదు. వ్యక్తిగతమైన సాధన చేయనివాడు సామాజికంగా ఏదో సాధిస్తామనుకోవడం కేవలం భ్రమ. ఈ సత్యాన్ని సంస్కృత సాహిత్యం గుర్తించింది. అందుకే ఇది వ్యక్తిగతమైన సాధనను పెంచుకోమని ఎన్నో విధాలుగా

ఉపదేశించింది. ప్రాచీన భారతీయుల ఆదర్శ జీవితాలను వర్ణించే సాహిత్యం ఉత్తమ జీవితాలకొక నిదర్శనం లాంటిది. ప్రాచీన సంస్కృత సాహిత్యం మానవ జీవితానికి, మనుగడకు, అభివృద్ధికి సంబంధించిన ఎన్నో ఉత్తమ విలువలను బోధించింది. 'తల్లిదండ్రులు, గురువు దైవంతో' సమానమంటూ ''మాతృదేవోభవ, పితృదేవోభవ! ఆచార్యదేవోభవ!'' అనడంలో తల్లిదండ్రులు జన్మనిచ్చినందుకు, విద్యబుద్ధులు నేర్పి ఈ సమాజంలో మంచి పౌరుడిగా తీర్చిదిద్దినందుకు 'గురువు'ను ప్రత్యక్ష దైవాలని తెలిపింది.

దైవం పైన విశ్వాసం లేనివాడు దానవుడే అవుతాడు. తన సృష్టికి, స్థితికి, కారణమైన భగవంతునిపైన విశ్వాసం లేని వానికి తనపైన మాత్రం ఎలా విశ్వాసం కలుగుతుంది? దైవాన్ని భక్తితో ఆరాధించాలి. అనుసరించాలి. ఆశ్రయించాలి. ప్రపంచమంతా వ్యాపించిన భగవంతున్ని 'ఈశావాస్యమిదం సర్వమ్' అనుకుంటూ ఆ దేవదేవుని అనుగ్రహాన్ని సాధించాలి ఇది మన ఉపనిషత్తుల ఉపదేశం. మానవుని జీవనం సక్రమంగా నడవాలని భగవంతుడు మనకు మూడు సాధనాలిచ్చాడు. అవి మనస్సు, మాట, చేష్ట, ఈ మూడింటి మధ్య సమన్వయం ఉండాలి. మనస్సులో అనుకున్నదే మాటలో చెప్పాలి. మాటలో చెప్పిందే ఆచరణలో చూపాలి. దీనినే త్రికరణశుద్ధి అంటారు. ఈ మూడింట మధ్య ఎవరు సమన్వయం సాధిస్తారో వారు మహాత్ములు. అలాగే చేసే పని ఫలాపేక్షతో చేయకూడదని గీత చెప్తుంది.

''*కర్మణ్యే వాధి కారస్తే మాఫలేషు కదాచన* /

*మా కర్మ ఫల హేతర్భూర్మాతే సఙ్గోస్త్వ కర్మణి* //''[1] అయినంత మాత్రాన ఏ పనులూ చేయకూడదని అర్థం కాదు. కర్మలు కర్తవ్య భావంతో చేస్తూనే ఉండాలి. ఫలాన్ని మాత్రం ఆశించకూడదు. ఇదే నిష్కామ ప్రవృత్తి. ఇది భారతీయులు తరతరాలుగా అలవరచుకున్న జీవనమూల్యం. సోమరిగా కూర్చోకుండా, అలాగే ఫలాపేక్ష లేకుండా కర్తవ్య నిష్టతో పనిని చేసిన వాడు 'కర్మబంధం' లేని వాడవుతాడు. అతనికి తేలికగా నిష్కామకర్మయోగం సిద్ధిస్తుంది. ప్రాణాలు పోయే పరిస్థితి వచ్చినా తన కర్తవ్యాన్ని తాను ఆచరించి, తర్వాత పోయే ప్రాణాలు నిలుపుకొనేందుకు కూడా కానిపనిని ఎన్నటికీ చేయకూడదు. కర్తవ్య పరిపాలనలో ప్రతివానికి దృఢమైన దీక్ష ఉండాలి. ఫలితం ఎలా జరిగినా సరే మన బాధ్యతను సక్రమంగా నిర్వహించాలి. ఎన్ని ఇబ్బందులొచ్చినా ఇతరులెంత నిరుత్సాహం పరిచిన మనం వెనకడుగు వేయకూడదు.

---

[1] భగవద్గీత పు: 2- 47.

'నేను నా తండ్రి చేసిన ప్రతిజ్ఞను దాటి ఒక్క అడుగు కూడా ముందుకు వేయనని' రామాయణంలో శ్రీరాముడు అంటాడు. భారతీయుల్లో ప్రతిజ్ఞాపాలనలో అంకురిత దీక్ష ఉంది. ఇచ్చిన మాటకు కట్టుబడిన జాతి మన భారతజాతి. మానవుడు తన ప్రవర్తనను బట్టి ఈ లోకంలో గౌరవాన్ని పొందుతున్నాడు. ప్రవర్తన బాగాలేని వాన్ని ఎంత నిపుణుడైన ఈ సమాజం గౌరవించదు. ఎప్పుడో ఒకప్పుడు పొరపాటున ఎవరినైనా గౌరవించినా త్వరలోనే తన తప్పును తెలుసుకుంటుంది. అందువలన సత్ప్రవర్తన తనకు తన చుట్టూ ఉన్న సమాజానికి మంచిని కలిగిస్తుందని సంస్కృత సాహిత్యం మనకు ఉపదేశిస్తుంది.

మనం పొందుతున్న కొద్ది ఆనందం చెదరకుండా ఉండాలన్న, అది ఇంకా పెరిగి మన జీవితం ఆనందమయం కావాలన్నా, చివరకు మనకు ఆనందం శాశ్వతం కావాలన్నా మనలో కొద్దిగానైనా వైరాగ్య భావన ఉండాలి. అప్పుడే మన జీవితం ప్రశాంతితో శోభిస్తుంది. ఈ విరక్తి లేకపోతే మన వైఫల్యాలు మనల్ని కుంగదీసి నాశనం చేస్తాయి. వాల్మీకి రామాయణంలో శ్రీరామచంద్రుడు భరతునితో అరణ్యకాండలో 'ఈ ధనరాశులన్నీ ఏదో ఒకరోజు నశిస్తాయి. ఈ అభ్యుదయాలు ఏదో ఒకరోజు పతనమైపోతాయి. ఈ కలయికలు శాశ్వతంగా ఉండవు. జీవితం ఎప్పుడూ మరణంతోనే పూర్తవుతుంది' అని ఉపదేశిస్తాడు. అంటే అశాశ్వతమైన ఈ లౌకిక విషయాల కోసం ఎక్కవగా మనస్సును పాడుచేసుకోకు. ఓర్పును పెంచుకొని, వైరాగ్య భావనతో జీవితాన్ని సుఖమయం చేసుకోవాలని పెద్దలమాట.

సుభాషితాల్లో కార్యశూరున్ని గురించి 'అంతంత మాత్రం వాళ్ళు ఏ పని మొదలుపెట్టితే ఏ విఘ్నమొస్తుందోనని భయపడి ఏ పనీ చేయరు. కొందరు ఆరంభశూరులు కొన్ని పనులు మొదలుపెడతారు. ఏవైనా విఘ్నం వస్తే చాలు చటుక్కున అస్త్రసన్యాసం చేసి పారిపోతారు. ఇక ఉత్తమగుణ సంపద గల ధీరోదాత్తులు ఎన్నిసార్లు ఎన్ని విఘ్నాలొచ్చిన మొదలుపెట్టిన పని పూర్తయ్యేవరకు ఓర్పుతో, నేర్పుతో తట్టుకొని నిలబడతారు. అంతిమ విజయం సాధిస్తారు' అని చెప్పడంలో అలాంటి పట్టుదల, కార్యదీక్షను గురించి చెప్పుకొనేటప్పుడు మనకు భగీరథుడు మొదలగు మహనీయులు గుర్తుకు వస్తారు. వారి బాటలో పయనించి పట్టుదలతో చేపట్టిన పని పూర్తి చేయమనే మన ప్రాచీన సంస్కృత సాహిత్యం బోధిస్తుంది.

మనం చేసే పనుల్లో చాలా పనులు శ్రద్ధ లేకపోవడం వల్లనే చెడిపోతుంటాయి. శ్రద్ధలేని వాడిని ఈ లోకంలో ఎవ్వరూ బాగుచేయలేరు. ఎప్పటిపని అప్పుడు చేయాలని క్రమశిక్షణతో ప్రతివారు పనిచేస్తే ఆదివ్యక్తిని, దేశాన్ని కూడ అభ్యుదయపథంలో నడిపిస్తుందని, రేపు

చేయగలమనుకున్న పనిని ఈనాడే పూర్తిచేయడం, చేసిన వ్యక్తికి గల శ్రద్ధకు నిదర్శనమని ప్రాచీన సాహిత్యం చెప్తుంది. ప్రతిమానవుడికి శరీరం, బుద్ధి, ఆత్మ అని మూడు భాగాలున్నాయి. అందరికీ కనబడేది శరీరం. ప్రవృత్తిని బట్టి అంచనా వేయబడేది బుద్ధి, ఈ రెండింటినీ నడిపేదీ, నిత్యమైనది ఆత్మ. ఆత్మకుగల సంస్కారాన్ని పెంచుకుంటూ ఆత్మ గుణాలను అభివృద్ధి చేసుకుంటూ తీవ్రమైన జీవితాన్ని గడిపేవారు. చాలా కొద్దిమంది అటువంటి మహాత్ములకుండే గుణాలను పెద్దలు గుర్తించారు. నిండైన మానవుడిగా పుట్టి తోటివారి విషయంలో దయతో మెసలకపోవడం మహాపాపం. మనసారా ఇతరులపై దయచూపనివాడు ఎన్ని ధర్మాలు చేసినా అవి బూడిదలో పోసిన పన్నీరే. కనుక జీవులందరిపైన ఎప్పుడూ దయతో ఉండడం మహాత్ముని మొదటి లక్షణం. రెండోలక్షణం 'క్షమ' అంటే ఓర్పు. శీతోష్ణాలు, సుఖదుఃఖాలు, ఆకలిదప్పులు మొదలగు మంటలను సహించి ఉండడాన్నే 'క్షమ' అంటారు.

ఓర్పు లేనివాడు సమాజానికి భారంగా తయారవుతాడు. ఏపనినీ సాధించలేడు. ఇతరుల అభ్యుదయాన్ని చూసి ప్రతివాడు తనకు లేదే అని అసూయపడతాడు. కానీ మహాత్ముడు ఇతరులకు కలిగిన మంచిని తనకు కలిగినట్లు భావించి సంతోషపడతాడు. అసూయ లేకపోవడమే 'అనసూయ'. అసూయ లేనివాడు ఎలాంటి కష్టాన్ని పొందకుండా ఎప్పుడూ ఆనందంతో ప్రకాశిస్తూ ఉంటాడు. 'పరిశుభ్రత' ఎంతగొప్ప వాడైనా అపరిశుభ్రంగా ఉంటే సమాజం అతణ్ణి గౌరవించదు. అంతశ్శుద్ధితో పాటు బాహ్యశుద్ధి కూడా చాలా అవసరం. 'అలసట లేకుండా ఉండడం' కొందరు ప్రతి చిన్న విషయానికి ఆరాటపడతారు. అసూయ పడతారు. తామెంతో పోగొట్టుకున్నట్లు బాధపడతారు. తమకు కలిగిన కొద్ది దుఃఖానికి లోకంలో ఎవరూ ఏమీ పట్టించుకోలేదనుకుంటారు. వీటిని పట్టించుకోకుండా, ఎలాంటి అలసట లేకుండా సుఖంగా కాలం వెళ్ళబుచ్చుతుంటారు. సాధువులు నాతోపాటు అందరూ సుఖంగా ఉండాలని కోరుకోవడం – కేవలం మానవులకే సాధ్యం.

అందరూ సుఖంగా ఉండాలి ఆరోగ్యంగా ఉండాలి. అందరూ అభ్యుదయాలనందుకోవాలి. ఎవ్వరూ దుఃఖపడకూడదు అని లోకంలో అందరి మంచిని కోరడం ఒకనాటి భారతీయుల ప్రత్యేక లక్షణం. పిసినిగొట్టు జీవితమంతా గడిపి ఎంతో ధనాన్ని కూడ బెట్టినా ప్రయోజనం లేదు. మితంగా సంపాదించాలి. మితంగా అనుభవించాలి. లోభితనంతో తను అనుభవించకుండా, ఇతరులకు పెట్టకుండా డబ్బును కూడబెట్టకూడదు. కోరికలే దుఃఖానికి కారణం. కోరికలెంత తగ్గితే అంత మనశ్శాంతి లభిస్తుంది. దైవానుగ్రహం వల్ల లభించిన

దాంతో తృప్తిపడి జీవనాన్ని సాగించడం తనకూ సమాజానికి కూడా మంచిది. ఈ విధంగా మహాత్మునికి ఉత్తమ లక్షణాలుంటాయని ప్రాచీన సాహిత్యం తెలుపుతుంది.

అలాగే పరమత సహనం, పరోపకారం ఐకమత్యంతో కూడిన జీవితాల గురించి సంస్కృతి సాహిత్యం అనేక కథల్లో వివరించింది. కఠినంగా మాట్లాడకుండా ప్రియంగా మాట్లాడడం – మితంగా, హితంగా మాట్లాడడంలో ఎంతో ఆనందం ఉంది. ఇతరుల్ని నొప్పించకుండా మాట్లాడడం ఉత్తమ సంస్కారానికి సంబంధించినది. అలాగే 'సత్సంగం' మహాత్ములతో సంబంధం మంచికి మార్గమౌతుంది. భౌతిక విషయాలకోసం కాకుండా, ఆధ్యాత్మిక విషయాల చింతన కోసం, జ్ఞాన సముపార్జన కోసం పెద్దలనాశ్రయించడం వారిద్వారా ఆత్మోన్నతికి కావలసిన విశేషాలను తెలుసుకోవడం చాలా మంచిదని మనకు సంస్కృత సాహిత్యం చెప్తున్నది. నిగ్రహం, సత్యవాక్యం, ధర్మం, ప్రేమ, అహింస లాంటి దైవగుణాల గురించి విస్తృతమైన సాహిత్యం మనకుంది. మానవ కల్యాణానికి దోహదపడే విషయాలతోపాటు మానవాభ్యుదయ నిరోధకాలైన దోషాలను ఖండించింది – మన సాహిత్యం. అస్థిర మనస్సు, అసంతృప్తి, నిరుత్సాహం, సంశయం, భయం, అవివేకం లాంటి అసురగుణాల గురించి కూడా విశేషంగా వివరించింది ప్రాచీన సంస్కృత సాహిత్యం. ఒక జాతి గుణశీలాల్ని తీర్చిదిద్దడంలో సంస్కృత సాహిత్యం ప్రభావం చూపినంతగా మారే సాహిత్యం తన ప్రభావాన్ని చూపలేదు. తపస్సు, త్యాగం ఉదారత. ఆశావాదం, మానవత, సర్వసమానత్వం వీటన్నింటినీ భారతీయులకు బోధించేది. సంస్కృత సాహిత్యమే. ప్రజలను చైతన్యపరచడమే వేద పురాణ కావ్య నాటకాదుల ప్రయోజనం. ధర్మానికి, సత్యానికి, విజయం కలుగుతుందని, దానశీలత అన్ని ధర్మాలకన్నా మించినదని సంస్కృత సాహిత్యం చెప్తున్నది. ఆదర్శ జీవితాన్ని, ఆదర్శశీలాన్నీ, ఆశావాదాన్ని చిత్రించడమే సంస్కృత సాహిత్య ప్రధానలక్ష్యం. అందుచేతనే సుఖాంతమైన కథలు మనకు సంస్కృత సాహిత్యంలో కన్పిస్తున్నది.

ధర్మాధర్మానికి, సత్యాసత్యాలను, దేవత్వరాక్షసత్వాలకు నడుమ ఘర్షణను సృష్టించి చివరకు ధర్మం, సత్యం, దేవత్వం జయించినవని చూపించడమే సంస్కృత కావ్యాల్లో జరిగింది. మానవ జీవితాన్ని ఉన్నది ఉన్నట్లుగా చూపెట్టడమే కాకుండా, సహజ జీవన చిత్రకళలతో నిండి ఉండకుండా మానవునికి ఆశావాదత్వాన్ని బోధించడమే సంస్కృత సాహిత్య ప్రయోజనం. అందుకే సంస్కృత కావ్యాల్లో దేవత్వ మానవత్వాలకు ప్రతినిధియైన నాయకుడు. రాక్షసత్వానికి ప్రతినిధియైన ప్రతినాయకుడు కనిపిస్తాడు. నాయిక ప్రతినాయకుల మధ్య ఘర్షణ కల్పింపబడి దేవత్వ మానవత్వాలు, విజయాలు సాధించినట్లుగా కథలను సుఖాంతం చేయడం సంస్కృత

సాహిత్యంలో కన్పిస్తుంది. సమాజంలోని వ్యక్తుల మధ్య సమన్వయం రావాలంటే, దానికి బీజాలు ముందుగా కుటుంబంలో నాటుకోవాలి. ప్రేమ ఆప్యాయతలు కుటుంబంలో వెలిసాయంటే అవి సమాజంలోకి అప్రయత్నంగా వస్తాయి అని అథర్వణవేదంలోని ఒక మంత్రసారాంశం ''తండ్రి పాటించిన నియమాలను కుమారుడు పాటించుగాక. తల్లి విషయంలో మంచి మనస్సుతో ఉండుగాక. భార్యభర్తతో తేనెలొలికే మాటలు మాటలాడుగాక. సోదరుడు సోదరుణ్ణి ద్వేషించకపోవుగాక. సోదరి సోదరిని ద్వేషించకుండుగాక, కుటుంబంలోని వాళ్ళందరూ పరస్పరం అనుకూలంగా ఉండి, ఒక విధమైన మంచి నియమం పాటిస్తూ మంగళకరమైన మాటలే మాటలాడుకొందురుగాక'' ఇలాంటి ఉపదేశాలు రామాయణ, భారతాల్లోనూ, పురాణాల్లోనూ అనేకంగా కథల రూపంలో ఉన్నాయి.

సాంస్కృతిక వికాసం దృష్టితో చూస్తే రామాయణంలోని నాగరికులకూ, ఆటవికులకూ మధ్య కొంతదూరం కనిపిస్తుంది. ఐతే ఈ అంతరం వారి పరస్పర స్నేహభావానికి ఏమాత్రం అభ్యంతరం కలిగించలేదు. రామాయణంలో వర్ణించిన మానవ నాగరికతకీ, వానర నాగరికతకీ, రాక్షస నాగరికతకీ మధ్య కూడ అంతరం అత్యధికంగానే కనబడుతుంది. అయితే ఉత్తమమైన విలువలకి ప్రాధాన్యం ఇవ్వాలనే నిశ్చితమైన అభిప్రాయాలు, సంస్కారం అనేది ఉంటే ఇలాంటి అంతరాలు అడ్డురావనే విషయం రామాయణంలో శ్రీరాముడు గుహ–సుగ్రీవ– విభీషణాదులతో చేసిన స్నేహాన్ని చూస్తే అర్థమౌతుంది.'నిషాదుడైన గుహున్ని దూరం నుంచే చూసి, లక్ష్మణ సమేతుడైన రాముడు ఎదురుగా వెళ్ళి అతన్ని కలుసుకున్నాడు. రామునికి కలిగిన రాజ్యభ్రంశ దుఃఖానికి ఎంతగానో దుఃఖిస్తూ గుహుడు రాముణ్ణి కౌగిలించుకున్నాడు'. 'రాముడు సుగ్రీవుడు చెప్పిన మాటలన్నీ విని, చాలా సంతోషించి స్నేహ సూచకంగా అతని చేతితో చేయి కలిపి అభినందించాడు' వాలి సుగ్రీవుల మధ్య వైరానికి కారణం తెలుసుకొని, తాను ధర్మపక్షపాతి కాబట్టి సుగ్రీవునితో స్నేహం చేయదలిచాడు అని రామాయణ కర్త ఉద్దేశం.

రామునికి, విభీషణునికి ఉన్న మైత్రి, ఒకరిపట్ల ఒకరికి ఉన్న గౌరవం ప్రసిద్ధమైనవే. రావణవధ తర్వాత – రామునికి ఇంత అపకారం చేసిన అన్నగారైన రావణునికి ఉత్తర క్రియలు సరిగా చేయకుంటే, రాముడు సంతోషిస్తాడేమోనన్న ఆలోచనతో విభీషణుడు ఆ విషయంలో కొంచెం ఉదాసీనతతో ఉంటాడు. అప్పుడు రాముడు, విభీషణున్ని అన్నగారికి ఉత్తరక్రియలు చేయవలసినదిగా అన్నమాటలు, ధర్మదృష్టి, నిర్మలమైన మనస్సు ఉన్న మానవుడు ఎంతటి మహోన్నతమైన ఆదర్శాన్ని మాటలలోనే కాకుండ, కార్యంలో కూడ ఆచరించి చూపగలుగుతారో స్పష్టమౌతుంది.

''ఎంతద్వేషం ఉన్నా అది మరణంతో అంతమైపోవాలి. నా కర్తవ్యం నేను పూర్తి చేసుకున్నాను. ఇంక రావణుడు నీకెంతో నాకూ అంతే. అందుచేత చేయవలసిన సంస్కారల్నీ చెయ్యి'' అని రాముడు విభీషణున్ని ఆదేశిస్తాడు. సీతాదేవి కూడ ఇలాంటి మనోభావాన్నే ప్రకటించింది. రావణ సంహారం వార్త ఆశోకవనిలో ఉన్న సీతకు చెప్పవలసినదిగా రాముడు హనుమంతుణ్ణి ఆదేశిస్తాడు. హనుమంతుడు ఆ వార్త సీతకు చెప్పి *''ఇన్నాళ్ళు నిన్ను బాధపెట్టిన ఈ రాక్షస స్త్రీ లందర్నీ చంపేస్తాను. అనుమతి ఇయ్యి''* మని ఆమెను కోరతారు. అప్పుడామె వాళ్ళ విషయంలో ఎంతో ఉదారతను చూపిస్తూ *''వీళ్ళు ఆ విధంగా నన్ను బాధలు పెట్టినారంటే తమ ప్రభువు ఆజ్ఞ ప్రకారం అలా చేసారు. ఇక ఇప్పుడు వారిని ఏమి బాధలు పెట్టకూడదు.''* అని అతన్ని ఆపుతూ *''పాపాత్ములైనా, పుణ్యాత్ములైనా, చివరికి వధ్యులైనా అందరి విషయంలోనూ కూడా కారుణ్యం చూపేవాడే ఉత్తముడు, పూజ్యుడు. లోకంలో అపరాధం చెయ్యని వాళ్ళు ఎవరుంటారు?''* అని అంటుంది. ఇలా రామాయణంలో మానవీయకోణాల్ని స్పృశించే అనేక అంశాలు మనకు కనబడతాయి. ఆకలితో ఉన్నవాడికి అన్నపానీయాలను అందించడం తద్వారా తోటి మానవునికి సహాయం చేయడం పంచమహాయజ్ఞాలలో ఒక యజ్ఞంగా ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. దీనిని మనుష్యయజ్ఞం అని పేరు. దీనికి పురాణాల్లో అనేక ఉదాహరణలున్నాయి.

*''నత్వాహం కామమే రాజ్యం న స్వర్గం నాపునర్భవమ్*
*కామయే దుఃఖతప్తానాం ప్రాణినామార్తి నాశనమ్''*

*''నాకు రాజ్యం వద్దు, స్వర్గం వద్దు, మోక్షం ఇచ్చిన వద్దు, దుఃఖంతో బాధపడుతున్న ప్రాణుల దుఃఖాన్ని తొలగించడం అనేది ఒక్కటే చాలు''* అని ఒక పౌరాణిక శ్లోకం చెప్తుంది. రఘువంశం' లాంటి కావ్యాలలో కాళిదాసులాంటి కవులు కూడా దిలీపుడు రఘురాముడు మొదలైన వారి రాజ్యాలను వర్ణించే ఘట్టంలో సమాజక్షేమమే వారి పరమధ్యేయమని స్పష్టంగా ప్రతిపాదించారు. ప్రాచీన సాహిత్యం 'ధర్మం' గురించి కూడ విస్తారంగా చర్చించింది. మానవుని ఒక విశిష్టమైన కార్యం వైపు నడిపించేది ధర్మం. ఏ కొంచెం పొరపాటుకి సర్దుబాటు లేకుండా ఏ నడవడిని పాటిస్తే మానవుడు మానవత్వపు మర్యాదలను రక్షింపగలడో ఆ నడవడినే ధర్మం అంటాము. దానిని రక్షించిన వానిని అది రక్షిస్తుంది.

రామాయణంలో ప్రధానంగా ధర్మోపదేశం కోసమే రాసిన కావ్యం. సృష్టిలో వ్యక్తులకూ, వ్యక్తులకూ మధ్య సంబంధాలు ఎంత ఉదాత్తస్థాయిలో ఎంత ఉన్నత శిఖరాలలో ఉండాలి, అలా

వుంటే వారి జీవితం ఎలా భావితరాలకు ఆదర్శ ప్రాయమౌతుందో వివరించడం, పతిధర్మం, పాలకధర్మం, పత్నీధర్మం, పితృధర్మం, భక్తధర్మం మొదలైన వానిని స్పష్టంగా చూపడం ఈ కావ్యం పరమార్థం. వ్యాసుడు భారతరచనలో సూటిగానూ, స్ఫురణ రూపంగాను ధర్మాలను చూపెట్టినాడు. ఎందుకంటే – ఏ వ్యక్తికి ఏ మార్గంలో రుచిస్తుందో, ఏ వ్యక్తిమీద ఏ విధానం ఏ విధంగా ప్రభావం చూపుతుందో మొత్తం మీద గ్రంథం అనుశీలించిన వ్యక్తికి, ఏ విధంగానైనా సరే ధర్మస్వరూపం తెలిసి తరాలనీ వ్యాసుని ఉద్దేశం.

రామాయణంలోని ప్రధాన పాత్రలన్నీ ఆదర్శపాత్రలు, శ్రీరాముడు ఆదర్శప్రభువు, లక్ష్మణ భరత శత్రుఘ్నులు ఆదర్శసోదరులు, సీత ఆదర్శ పత్ని ఆదర్శసేవకుడు ఆంజనేయుడు. సత్యం, ధర్మం, త్యాగం, సేవ రామాయణ పాత్రలకు మూలం సమాజం రూపొందించేది వ్యక్తులే. ప్రతివ్యక్తి తన కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వహించి, ధర్మబద్ధంగా వ్యవహరించినపుడు జీవితం ఆనందంతో నిండిపోతుంది. రామాయణం అటువంటి వ్యక్తుల చరిత్ర. శ్రీమద్రామాయణ కల్పవృక్షం మహాకావ్యంగా రాసిన విశ్వనాథ వారే వేయిపడగలు కూడా రాశారు. కుటుంబ విలువల స్థిరీకరణకు కుటుంబమే పాదులు వేస్తుంది. శ్రీరాముడు ఆదర్శపురుషుడుగా ప్రపంచానికి కనిపించడానికి ధార్మికజీవనమే ప్రాణప్రదంగా నిలుస్తుంది. దీన్నే వేయిపడగలు నవలలో ధర్మారావు దాంపత్యజీవితంలో ఒక నూతనకోణంలో విశ్వనాథవారు వివరించారు.

**6.2. వేయిపడగలు – వివాహం–విలువలు:**

భారతీయ ధర్మాల్లో వివాహం అత్యంత ప్రాధాన్యమైనది. ఈ వివాహాన్ని ఆధారం చేసుకునే కుటుంబం, సమాజం విస్తృతమౌతాయి. ఈ నవలలో రామేశ్వరశాస్త్రి నలుగురిని వివాహం చేసుకుంటాడు. భౌతికంగా చూస్తే శాస్త్రి కాముకుడిగా కనబడతాడు. కానీ, రచయిత ఆ వివాహాలను ప్రతీకాత్మకంగా చూపెడతారు. శాస్త్రిగారికి ధర్మపత్ని సావిత్రమ్మ. అతని ప్రేమ ఫలితంగా పొందిన భార్యలు రంగాజమ్మ, హైమావతులు. వీరు వేరే కులస్త్రీలు, ధర్మపత్ని సావిత్రమ్మ అయినప్పటికీ, శాస్త్రి – రంగాజమ్మ ప్రణయం మధురమైనది. శాస్త్రి మరణానంతరం కుమారుడైన రామచంద్రరాజుతో గ్రామాంతరం వెళ్ళేందుకు ఆమెకు ఇష్టం ఉండదు. భర్త జీవించి, మరణించిన గడ్డలోనే తన జీవితం అనుకుంది. భర్త ఉన్నప్పుడు సావిత్రమ్మ రంగాజమ్మ గురించి తిరస్కారంగా మాట్లాడినా, రంగాజమ్మ గొప్ప మనస్సుతో ఊరుకుంటుంది. ''*మానవుడి ప్రయత్నానికి అతి మానవవములైన అతీత శక్తులకు నడమ సంఘర్షణము మాత్రమేకాక అది అతనిలోని ధర్మాధర్మముల మధ్య సంఘర్షణము కూడ హేతువవుతున్నది. సృష్టిమూలమైన కామము. సృష్టి వికాసమైన మానవుని ఉత్పత్తి శక్తుల సమిష్టి రూపమైన అర్థం. ఈ రెండూ ఒక*

*నియమానికి కట్టుబడి అందరికీ సమానంగా లభ్యం కావడానికి ఏర్పరచుకొన్న నియమసంపుటి ఈ ధర్మం. అర్థకామాలను సుష్ఠుగా తీర్చిదిద్ది సమాజవ్యవస్థను సమిష్టి, క్షేమ పర్యవసానంగా రూపొందించేది ధర్మము''*[2] దీనికి శాస్త్రి హృదయం ఉప్పొంగుతుంది. శాస్త్రి మరణానంతరం ఆ కుటుంబాన్ని ఆదుకునే ప్రయత్నం చేస్తుంది. ధర్మారావు అరుంధతిల వివాహం సఫలం అయ్యేందుకు దోహదపడుతుంది. జీవితంలోని అన్నిదశల్లో స్త్రీ గా తాను నెరవేర్చాల్సిన ధర్మాలను త్రికరణశుద్ధిగా ఆచరించిన ఉత్తమ ఇల్లాలు.

ధర్మారావు, అరుంధతిల ప్రణయం రాన్రాను చిక్కనౌతుంది. వివాహం అయిన తొలిరోజుల్లో ఇద్దరి మధ్యా అపార్థాలు చోటుచేసుకుంటాయి. అరుంధతి తల్లిదండ్రుల మాటలు విని భర్తయైన ధర్మారావును చులకనగా చూస్తుంది. ''*నీ జీవితము నా జీవితము ముడివడి, సుఖదుఃఖములు మన ఇరువురి వొకటిగాని, నీ తల్లికిగాని నీ తండ్రికి గాని యేమియు సంబంధము లేదే?*''[3] అని స్త్రీకి భర్తా? తల్లిదండ్రులా? శాశ్వతమెవరు? అనే ఆలోచనను భార్యలో కలిగించి ఆమె మనస్సు మార్చేందుకు ప్రయత్నిస్తాడు.

భర్త ఆదర్శాలను, జీవిత లక్ష్యాలను గమనించి, గౌరవించి తానూ వాటి సాధనలో భర్తకు సహకరించి, తన సహధర్మ చరిత్రము, చరితార్థము చేసుకుంటుంది అరుంధతి. ఇద్దరు శరీరం మాత్రంగా వేర్వేరుగానీ, ఆత్మలు సంయోగించబడ్డాయి. వీరి ధార్మిక ప్రణయం ''*ప్రతి నిమిషము వారి ఆత్మలలో దేవతలు తాండవించిరి. వేద ఋక్కులు వారి క్రీడలలో నర్థవంతములయ్యెను. కులదేవతలు వారి లీలాపాంగముల యందు భావ్యాశలు (త్రవ్వుకొనిరి. పితృ దేవతలకు వారి శృంగార లీలలందు తర్పణములందినవి.*''[4]

ధర్మారావు బీదరికం అరుంధతి మనస్సును గాయపరుస్తుంది. ఈ విషయం చంద్రహారం సంఘటన తెలుపుతుంది. దేవతా ప్రసాదంలాంటి చంద్రహారాన్ని అమ్మేయాలనే దుర్బుద్ధి తనలో వస్తుందేమోనన్న అనుమానంతో ఆ హారాన్ని తాకొద్దనుకుంటాడు ధర్మారావు. ఈ కారణంగా భర్త స్పర్శకు దూరమౌతుంది అరుంధతి. చంద్రహారమే అడ్డు అని తెలుసుకొని దాన్ని విసిరేస్తుంది. ''*దాంపత్యానికి ప్రధానమైనది అన్యోన్యానురాగం. ఆ అనురాగం స్త్రీ మూర్తిలో ఆరాధ్యంగా పరిణమించి, భక్తిగా పర్యవసించడమే పాతివ్రత్యం. భార్య అంటే భర్త చేత భరించబడేది అని అర్థం కావచ్చు. కాని భర్త కొరకు బాధ్యత పడగలిగినప్పుడే స్త్రీ మూర్తికి*

---

[2] సహృదయ చక్రము: పు: 7

[3] వేయిపడగలు, పు: 157

[4] వేయిపడగలు, పు: 197

*పరిపూర్ణత్వం సిద్ధిస్తుంది.*''[5] ప్రణయం ముందు ధనం 'గవ్వ'లాంటిదని ఈ సంఘటన ఋజువు చేస్తుంది. ''*నీ వోక పడగ నేనొక పడగ.... ఏడేండ్లయింది. ఈ మాణిక్యరాశి నా వైపున కొఱగి నా తనువు పులకించింది. నా యాత్మలో కామధేనువుల పయోధారలు పితికినది.... రెండు పడగలతో నున్న స్వామి మాత్రము మిగులనట్లు తోచెడి నీవైన పడగ యొక్క మనోహరత్వము మానదు....*''[6] ధర్మారావు అరుంధతిల మధ్య జరిగే వైవాహిక చర్చలో అప్పుడప్పుడు అరుంధతి యొక్క ఆలోచనా తీరే ఉన్నతంగా కనిపిస్తుంది.

అరుంధతి వ్యాధి గ్రస్తురాలైన తర్వాత వారిద్దరి ప్రణయం మరింత ఉదాత్తస్థాయికి చేరుకుంటుంది. ''*మీరు నా యొద్ద యున్నగాని ప్రాణములు నిల్చునట్లు లేవు*''[7] అనే మాటలు ఈ విషయాన్ని స్పష్టపరుస్తాయి. ఇలాంటి సందర్భంలో భార్యాభర్తల దాంపత్య జీవన పారమ్యాన్ని తెలిపే సంఘటన వ్యాధి గ్రస్తురాలైన అరుంధతికి ధర్మారావు సేవచేయడం. భర్తతో సేవ చేయించుకోవడం అరుంధతికి బాధ కల్గిస్తుంది. ''*నేను మీకు పరిచర్య చేయవలసినది పోయి మీరు నాకు చేయుట కాడికి వచ్చినది*'' [8] అన్న మాటకు సమాధానము ''*ఈ ధర్మము పరస్పరమైనది. కాని పురుషుని యాదధికత కలది కాదు.....*''[9] అంటూ వివాహ వ్యవస్థలో భార్యాభర్తల సమ ప్రాధాన్యాన్ని తెలియజేస్తాడు ధర్మారావు. అరుంధతి మరణానంతరం ధర్మారావు దుఃఖంతో అన్నమాటలు సహచరిత్వం. దాంపత్యం అనే ధర్మాలకు పరమార్థంగా తోస్తాయి. ''*అది కట్టెయా! నా జీవిత సర్వస్వము దాని నెత్తురులో, బొమికలలో, మాంసములో ఉన్నది*''[10] అన్న శోకతప్త హృదయంలోనుండి వచ్చిన మాటలు వారి ప్రణయ దాంపత్యాన్ని నిరూపిస్తాయి.

### 6.3. కుటుంబం: దాంపత్యం:

మానవ సంబంధాలలో అర్థ, కామాలను ధర్మబద్ధంగా నేరవేర్చుకునేందుకు ఏర్పడిన దాంపత్య జీవనం. సృష్టి వికాసానికి, స్త్రీ పురుషుల సమన్వయాన్ని సూచిస్తుంది. ధర్మారావు, అరుంధతిల దాంపత్యం ఉదాత్తమైనది. ఏ క్షణంలో కూడ వారు ఒకరినొకరు విడిచి ఉండలేకపోయారు. అరుంధతి మరణసమయంలో భర్తతో ఇలా అంటుంది. ''*నేను నిన్ను వదిలి*

---

[5] భారతం, ధర్మాద్వైతం – వ్యాసుని దర్శనం – తిక్కన సందర్శనం, పు: 232

[6] వేయిపడగలు, పు: 356

[7] వేయిపడగలు, పు: 689

[8] వేయిపడగలు, పు: 798

[9] వేయిపడగలు, పు: 798

[10] వేయిపడగలు, పు: 819

*యుండలేను. ఈ దేశంలో పతివ్రత చావదు. స్వామి రెండవ పడగ ఇచ్చుట నశించదు. కారణాంతరముల చేత మరుగుపడవచ్చును. నేనెవ్వరు! పతివ్రతను. అల్ప కారణముల వలన భయము లేదు? నేను నీ వలెనే సనాతనిని''* అని అన్నది. అరుంధతికి జీవితమంతా ధర్మారావే గురవూ, దైవము, సర్వస్వము. ఇలాంటి దాంపత్యం పరిపూర్ణత సాధించడం సులభం. అందుకే గిరిక అరుంధతిని కౌగిలించుకొని ''*వదినే నీవు నా వెంటనే వచ్చుచుంటివి. నీ ధన్యత నా కెచ్చటినుండి వచ్చును? నేను బహు ప్రయాసపడి సాధించుకున్నది. నీకుఁ బూర్వ జన్మ సంస్కారము చేత సహజముగా లభించినది. కులమింట బుట్టినావు. ఏకాగ్రత సాధించుటకుఁ గులస్త్రీలందఱకును బతి యేర్పడనే యేర్పడియున్నాడు. మీ యందు ధర్మకామములు కలిసియున్నవి. మేము వీనిని జంట కలుపుకొను వరకు మా సాధన క్లిష్టతరమై పోవుచున్నది. మీకు సులభముగా నున్నది.''*[11]

కుటుంబ వ్యవస్థలో ఎలాంటి అభ్యంతరాలు రానంతవరకూ, భార్యాభర్తల మధ్య ఆధిక్యత భావాలు చోటు చేసుకోనంతవరకు కుటుంబం, సమాజంపై చక్కటి ప్రభావాన్ని చూపుతుంది. భార్యాభర్తల సంబంధంలో పట్టింపులు, అనుమానాలు, వ్యక్తిగత స్వేచ్ఛలు, విశృంఖల భావాలు చోటు చేసుకుంటే సమాజంలో అలజడి మొదలవుతుంది. ప్రణయ దాంపత్య నిరూపణగా ధర్మారావు, అరుంధతిల జంట కనిపిస్తే దాంపత్యాన్ని బలహీనపరుచుకున్న జంటగా రంగారావు సరోజనీలు కనిపిస్తారు. రంగారావు సంప్రదాయ వ్యతిరేకి, పాశ్చాత్య వ్యామోహి. ''*రంగారావు హిందూమతాన్ని తిరస్కరించాడంటే, సనాతన ధర్మబద్ధమైన భారతీయ జీవన విధానాన్ని కాదన్నాడని, ఇక్కడి రంగారావు రాజ్యవ్యవస్థ మౌలిక సూత్రాలు సనాతనధర్మాన్ని కాదని ఒకానొక సంకుచిత మత సూత్రాలు ఆధారంగా మార్పు చెందుతుందని స్పష్టం చేయబడింది.''*[12] సరోజిని భారతీయ ప్రణయిని. ఇద్దరి మనస్సులు, ఆలోచనలు వ్యతిరేక మార్గంలో పయనించడం వీరిద్దరి దాంపత్యాన్ని శిథిలం చేస్తాయి. గవర్నర్ ప్రాపకం సంపాదించేందుకు సరోజినిను పార్టీలకి తీసుకెళ్ళేందుకు ప్రయత్నిస్తాడు రంగారావు. పాశ్చాత్య సమాజాలలో, మానవ సంబంధాలు క్రొత్తగా సంతరించుకున్న భౌతికశీలంలో, ఏకాకిత్వం, నిర్వీర్యతలు ద్విగుణీకృతమయ్యాయి. మనిషికి, మనిషికి మధ్య సంబంధం మానవ మానవతా లక్షణాలను కోల్పోయింది. మనిషి మరొక మనిషిని ఉపకరణంగా చూస్తున్నాడు. విపణి ధర్మాలు మానవ సంబంధాలను ఏలుతున్నాయి. సరోజిని తిరస్కారం అతనికి కోపకారణమౌతుంది. ఇది స్వాతంత్ర్యం కాదు.

[11] వేయిపడగలు, పు: 837

[12] వేయిపడగలు – సమకాలీనత – సార్వకాలీనత, పు: 39

పెదథోరణి అని విశ్వనాథ అభిప్రాయం. రంగారావు భార్యలో 'రాణి'ని చూస్తుంటే సరోజిని రంగారావులో 'భర్త'ను చూస్తుంది. భార్యాభర్తల మధ్య సంబంధం కూడ 'హోదా'కి తగినట్లు ఉండాలంటాడు రంగారావు. ఇద్దరి మధ్య 'ప్రణయం' ఉండాలంటుంది సరోజిని. అనారోగ్యంతో బాధపడుతున్నా సరోజినిని పట్టించుకోడు రంగారావు. అతని నిరాసక్తతకు లొంగి బానిసలా అతడు చెప్పింది చేయలేక, ఆత్మాభిమానాన్ని చంపుకోలేక సరోజిని తీవ్రమైన కలత చెందుతుంది. వివాహబంధంలో స్త్రీ, పురుషులిరువురికి సమాన స్వాతంత్ర్యాలుంటాయని ధర్మారావు, అరుంధతిలు నిరూపిస్తే ఇక్కడ స్వాతంత్ర్యం పేరుతో అభిమానవతి అయిన భార్యను తక్కువ చేస్తాడు రంగారావు. రంగారావు సుసానీల వివాహం భోగలాలసతకు – దారిద్ర్యానికి సంబంధించినది. వీరిరువురు తమ తమ వ్యక్తిగత భౌతికావసరాలకు, శారీరకావసరాలకు ఒక్కటయ్యారే గాని నిజమైన, పవిత్ర దాంపత్యానురక్తి వీరిలో కనిపించదు. వీరి దాంపత్యం ధనవ్యామోహం ఆధారంగా ముడివడింది.

*"…..అంటే అర్థకామములను సమిష్టి దృష్టితోను అనుభవించటం ధర్మబద్ధమైన బ్రతుకు అర్థకామములు రెండు భౌమములు, మోక్షము దివ్యజగత్తు ఈ రెంటిని బంధించు సూత్రము ధర్మము. సమన్వయ సూత్రమైన ఈ ధర్మము పునాదిగా జీవితాన్ని నిర్మించుకున్నప్పుడు వ్యక్తి సురక్షితుడవుతాడు. వ్యక్తి యొక్క విస్తృతమైన సంఘము సువ్యవస్థితమవుతుంది. వ్యష్టి దృష్టితో సమన్వయరహితంగా అనుభవించాలను కున్నప్పుడు సంఘర్షణ మొదలవుతుంది. అంటే వ్యక్తావ్యక్తముల మధ్య వ్యష్టికి సమిష్టికి మధ్య సమన్వయాన్ని త్రెంచుకొని బ్రతకటం అధర్మబద్ధమైన బ్రతుకు సమన్వయ రాహిత్యం సంఘ సుస్థిరతను దెబ్బతీస్తుంది."*[13] ధర్మారావు అరుంధతుల దాంపత్యం ధన ప్రసక్తి లేకపోవడం వల్ల బలపడింది. ధర్మారావు, రంగారావులలో గార్హస్థ్య ధర్మం పట్ల పూర్తి విరుద్ధ అభిప్రాయాలుంటాయి. రంగారావుకి వివాహం కేవలం ఒక తంతు. అది తన వ్యక్తిగత జీవితానికి పరిపూర్ణత నిచ్చేదికాదు. కానీ ధర్మరావుకి 'వివాహం' జీవితానికి ఆలంబన. ధర్మానికి విరుద్ధంగా వేరే స్త్రీతో కలవడం లేదా వ్యక్తిగత హోదా కోసం, ద్వితీయ, తృతీయ వివాహాలు చేసుకోవడం రంగారావులోని మానసిక దౌర్భల్యానికి, ఆంగ్లభావ దాస్య ప్రవృత్తికీ నిదర్శనం. దీనినే రామాయణ కల్పవృక్షంలో విశ్వనాథ శూర్పణఖ, సీతల సంభాషణలలో రామునిచే చెప్పిస్తాడు. స్వయానా భార్యయైన సీత, శూర్పణఖ వాదంలో నిజాయితీని రామునికి తెలియజేసే సందర్భంలో రాశాడు.

[13] వేయిపడగలు – సమకాలీనత – సార్వకాలీనత, పు: 53

*‘‘ఆమె యెఱిగిన కామంబు నది యెఱుంగ*

*ఈమె యెఱిగిన వేదాంతమిది యెఱుంగ*

*మనుజడను నేను మనుధర్మంబు నాది*

*ఇలన ధర్మంబు చాయ సహించుటెఱుఁగ’’*

(రామాయణ కల్పవృక్షం: అరణ్య; పంచవటి: 183 – 188)

అర్థ కామాదులకన్నా, వేదాంతం – ఆధ్యాత్మిక విచారణకన్న మానవుడికి కావలసినది మానవధర్మం. ఈ మానవధర్మం సరిగ్గా నిర్వర్తించబడినప్పుడే మిగిలిన ధర్మాల ప్రసక్తి వస్తుంది. మానవుడిగా రాముడు అధర్మప్రవృత్తిని సహించడు. ‘రామో విగ్రహవాన్ ధర్మ:’ అనేది భారతీయ సనాతన ధర్మానికి ప్రతిరూపం. భారతీయ దాంపత్యం ఒకధర్మవిధానం కాదనీ, స్వేచ్ఛాప్రణయమే గొప్పదని చెప్పాలనుకున్న వాళ్ళు, ముఖ్యంగా చలం లాంటి వాళ్ళుకూడా చివరికి తన భావాలు భారతీయసమాజానికి సరిపడవని అంగీకరించారు. దీన్ని చలం రాసిన ‘మైదానం’లో రాజేశ్వరి పాత్రద్వారా గుర్తించవచ్చు.

సమాజంలో అంతర్భాగంగా ఉండదలచినవారు ‘కామాన్ని’ క్రమబద్ధీకరించుకొని, మోహస్థాయిని ఉన్నతీకరించుకొని ప్రేమలో లీనమై పోవాలి. సమాజం నుండి దూరం కావాల్సినవారు ‘పశుప్రవృత్తి’లో కామ వికారాలకే పరిమితమౌతారు. ఉన్నతీకరణ చెందిన ప్రేమజీవులు – సమాజాన్ని దాటి ఆధ్యాత్మిక వెలుగులవైపు ప్రయాణం సాగిస్తారు. పశు ప్రవృత్తిలో ఉన్నవారికి, ఆధ్యాత్మిక చింతనా పరులకి పెద్దగా సమాజం యొక్క అవసరం ఉండదు. సహజ మానవ ప్రకృతిని కలిగినవారు సమాజానికి బద్ధులు. అయితే పశుప్రవృత్తిలో ఉన్నవారు సమాజానికి దూరంగా ఉన్నా ‘సహజాత లక్షణాల స్థాయి’ కారణంగా తప్పనిసరిగా సమాజంలో సంబంధం పెట్టుకోవాలి. లేకపోతే వారి ఉనికికి ప్రమాదం. ఆధ్యాత్మిక చింతనాపరులు – క్రిందిస్థాయిల గురించి పూర్తి అవగాహనతో సమాజం గురించి స్పష్టమైన అభిప్రాయాన్ని కలిగివుంటారు. కాబట్టి వారి ‘స్థాయీభేదం’లో ఏదైనా తేడాలు వచ్చినా సమాజం వారిని గౌరవిస్తుంది. వారికి సమాజంలో స్థానం ఉంటుంది. కానీ, పాశవిక ప్రవృత్తితో సమాజాన్ని ‘తన్ని’ పోయిన వారికి తిరిగి ‘సామాజీకరణ’ కష్టమే. అలాంటి పరిస్థితుల్లో రాజేశ్వరి – అమీర్ ల ప్రయాణం సాగుతుంది. ‘తీవ్రత’ అనే పదంలోనే దాని ‘పరిమితి’ ఉంది. తీవ్రత యొక్క పరిమాణం పెద్దదైనా, దానితో ప్రయాణం ఎక్కువసేపు ఉండదు. ఆసక్తి తగ్గిపోగానే తాము మోహించిన వ్యక్తుల పట్ల తూష్ణీ భావం కలుగుతుంది. దూరం కావాలనిపిస్తుంది. మోహానికి మోహం మొత్తుతుంది. అమీర్ కు రాజేశ్వరిపై ఇప్పుడు అలాంటి అభిప్రాయమే కలిగింది. ‘‘స్త్రీ

*చవక కావడం వల్ల స్త్రీ సౌందర్యాన్ని పూజించడం మానేశాడు పురుషుడు''*[14] కానీ మోహం పోలేదు. దాని తీవ్రతకు సంబంధించి రాజేశ్వరి పట్ల ఆసక్తి తగ్గింది. తోళ్ళ సాహెబ్ కూతురుపై అమీర్ దృష్టి మళ్ళింది. ''*ఎంత ప్రయత్నంచీ శృంగార వాంఛని ఈనాటి వరకూ జయించలేక పోయినాను. అదే లేకపోతే నేను ఎందుకు బ్రతికి? స్త్రీతో కొన్నాళ్ళు స్నేహమయితే మాలోని శృంగార భాం పాతబడి, ఇంత నన్ను ఆకర్షించడం మానేసేది. అప్పుడు యింకో కొత్త శృంగార సంబంధం కోసం కొట్టుకునే వాణ్ణి. ఇది గొప్ప ప్రేమ కాదు. ఉత్తకామము కాదు. పసితనం నుంచి నాకు అన్నేళ్ళుగా ఈ వాంఛలు వుంటూనే వుండేవి. ఎంతో విరహపడేవాణ్ణి అవే కలలు''*[15] అని చలం తన అనుభవం గురించి చెప్తాడు.

నిజానికి మొదటినుంచి 'మోహం' రాజేశ్వరికి ఉంది. కానీ, అమీర్ కు లేదు. అమీర్ ప్రయత్నం రాజేశ్వరి యొక్క 'మోహ' తీవ్రత రెండూ ఆమెను ఇంటినుండి బయటకు నడిపించాయి. రాజేశ్వరిలో ఆ 'తీవ్రత' లోని పదను అలాగే ఉంది. కాని అ అమీర్ లోని మోహం స్థాయీ భేదాల దృష్ట్యా మార్గం మళ్ళింపబడింది. ''*మనుషులు ఎలా పుట్టారో, అట్లానే చస్తారు. ప్రేమ వొక్కటే కారెక్టర్ ని కలత పెట్టి, పునాదివేళ్ళతో పెకలించి, కొత్త సౌధాలని నిర్మించగల శక్తి కలది. ఆ ప్రేమ తటస్థించే వాళ్ళు అరుదు.''*[16] ఇన్ని రోజులు తన 'మోహా'న్ని ప్రేమగా భావించి, భంగపడిన రాజేశ్వరికి, అమీర్ తోళ్ళ సాహెబు కూతురును కోరడం సబబే అనిపించింది.

కట్టుకున్న భర్తకు తనపై మోహం లేదనుకొని, తాను ఎలా లేచిపోయి వచ్చిందో, లేవదీసుకొని వచ్చినవాడు తనపై మోహం సన్నగిల్లితే, తన లాగానే వేరే అమ్మాయిని కోరుకుంటాడు అన్న విషయం రాజేశ్వరికి అర్థమయింది. ఇందులో వింతలేదని, తనకు తగిన శాస్తి జరిగిందని భావించింది. ''*మామయ్య మాటలు నిజమేనేమో! ఇట్లా శరీరాకర్షణకు లోబడి జీవితాన్ని వప్పగించుకున్న దౌర్భాగ్యుల గతి యింతేగావును. ఉధృతమూ నిరాటంకమైన మోహానికి అంతమింతేనేమో! ఏ నిగ్రహమూ, నియమం లేకుండా యింకొకరి భార్య అని యాచించకుండా నన్ను కోరిన అమీర్ నన్ను వొదిలి యింకొకర్ని మోహించడంలో ఆశ్చర్యమేముంది. ఎంత అసహ్యంగా వున్న సంఘ నిర్మితమైన సంసారంలో కొంత శాశ్వతత్వం కాలం వల్ల మాన్పబడి, భేదించడానికి సాధ్యంకాని బంధాలున్నాయి. ఇక్కడా! వెర్రిదాననైనా!*

[14] చలం – మ్యూజింగ్స్, పు: 139

[15] చలం – మ్యూజింగ్స్, పు: 139

[16] ప్రేమలేఖలు, పు: 184

*మామయ్యే చివరికి వివేకవంతుడా''*[17] రాజేశ్వరిలో ఆలోచనలు గజిబిజిగా తయారౌతున్నాయి. కామానికి అంకితమైన జీవితాన్ని పురుషులకు ఒప్పగించుకున్న స్త్రీ గతి దౌర్భాగ్యమైనదని రాజేశ్వరి గ్రహించింది. ఆమె అంతరంగం వివాహవ్యవస్థ ఎడల అనుకూలంగా ఒక్కసారైనా తిరిగింది. కుటుంబవ్యవస్థలో 'ధర్మబద్ధమైన' కామ 'నిర్వహణ'లో రాజేశ్వరికి భర్తకున్న పేరు 'మోహం' వల్లనో, భయం వల్లనో అనుకుంది. భర్తపై అసహ్యం పుట్టి మోహావేశంతో తన 'భద్రత'ను కాలదన్ని మైదానానికి పరిగెత్తింది.

*''వివాహవ్యవస్థలో సౌఖ్యం మృగ్యమైనా దానిలో స్త్రీ కి భద్రత ఉంది. దానిని ఛేదించుకొని మైదానంలోకి వస్తే విశాలమైన ప్రకృతి సౌందర్యాలతో పాటు ఆ ఆనందంతో పాటు సుడిగాలులను తుఫాను బీభత్సాలను కూడ ఎదుర్కోవలసి వస్తుంది. రాజేశ్వరి తన ప్రేమ కోసం ఈ భీభత్సాన్నంతా భరించింది. చలం ఎంతటి భావుకుడైనా సామాజిక స్పృహ లేనివాడు కాదు. అతడు ఏ నవలలోనూ వివాహవ్యవస్థ ఛేదించుకొని వచ్చిన స్త్రీ సమాజంలో సుఖంగా ఉందని రాయలేదు.''*[18] మైదానంలో తనకు జరిగిన మోసానికి ఇంకెటు పరిగెత్తాలో అర్థం కాక, అమీర్ కోరికను భరిస్తుంది. ఆమెకు ఇంతకు మించి అవకాశం లేదు. అయితే రాజేశ్వరికి సరిగ్గా అర్థం కానిది. తను సమాజంలో 'మగవాడి' నీడలోనే ఉంది. మైదానంలో కూడా మగవాడి 'ఆధీనం'లోనే ఉంది. *''కొత్త స్వేచ్ఛ, సమరం వల్ల స్త్రీ చాలా త్వరలో పురుష అధికారాన్ని తెగకొట్టి, బాధ్యతల్ని గుర్తించి తనని గౌరవించేటట్టుగా పురుషుణ్ణి మచ్చిక చెయ్యాలి. లేకపోతే తన స్త్రీత్వాన్ని శాంతిని వేళ్ళతో కదిలించేసుకుంటుంది.''* [19] ఆమె అంతరంగం ఎప్పుడూ 'మోహం'వైపు ఉండడం వల్ల అంతకుమించి తన కాళ్ళపై తాను నిలబడాలని, సొంతమైన వ్యక్తిత్వంతో బతకాలనీ ఎన్నడూ లేదు. భర్త సంపాదనతో పెంచిన యవ్వనాన్ని అమీర్ కి అప్పజెప్పింది. కనీసం 'పిల్లల' గురించి అయినా తల్లిగ ఆలోచిస్తే రాజేశ్వరి జీవితం వేరేలా ఉండేదేమో! సామాజిక జీవనంలో 'స్థానం' లేక మైదానాన్ని విడిచి బతికే 'తోవ' తెలియక అమీర్ కి తోళ్ళ సాహెబ్ కూతురిపై గల మోహాన్ని అహ్వానించింది. రాజేశ్వరికి ఆత్మనిగ్రహం లేదు. ఆత్మవిశ్వాసం లేదు. ఆత్మగౌరవం లేదు. ఆత్మవిమర్శలేదు. ఉన్నదొక్కటే ఆత్మవంచన. నిజానికి రాజేశ్వరికి వివాహవ్యవస్థలో ఆమె 'మోహం' తీరే అవకాశం ఉంటే ఇలా పతనమయ్యే అవకాశం ఉండకపోదు. రాజేశ్వరి రక్తగుణం అలాంటది – జెలసీతోనే అమీర్ ని, తోళ్ళసాహెబ్

---

[17] మైదానం, పు: 46-47

[18] నవలా విమర్శ, పు: 97

[19] చలం – మ్యూజింగ్స్, పు: 288

కూతురును కలిపి – 'త్యాగ'మని మురిసిపోయింది. ''*కానీ, యిప్పుడు నా బాధని అతని ఆనందంగా మార్చి అతని ఆనందంలో నేను ఆనందబడపోతున్నాను. గొప్ప సంతోషంతో నా వొళ్ళు పులకరించింది.*''[20] అని అందమైన ఆత్మవంచన చేసుకుంది. కాల్పానిక జగత్తులో రాజేశ్వరికి 'అసలు నిజం' అర్థం కాకపోవడం విచిత్రం

''*నా బాధని అతని ఆనందంగా మార్చి....*'' అనే రాజేశ్వరి, భర్త తన పట్ల విపరీత మోహంతో లేదని, తాను పడిన 'బాధ'ను మరిపించుకునేందుకు 'భర్త ఎందులో సంతోషపడుతున్నాడో, అందులోనే తన 'సంతోషాన్ని వెతుక్కుంటే ఇంతటి దురవస్థ లేకపోయేది. ఆత్మవంచనలో పరాకాష్టను చేరుకొని ''*ఏ త్యాగం నా వల్లనౌతుంది? ఏ స్త్రీలను అతనికోసం తీసుకురాగలను. నా ప్రాణాన్ని, మానాన్ని దేన్ని అర్పించను*''[21] ''*పూరికే కావిలింతలవల్ల వ్యక్తమౌతుందా ప్రేమ? అంత సర్వమూ త్యాగం చేసి అతని నుంచి నేను అనేది లేకుండా నా అహాన్ని బాపుకుంటేనేగాని*''[22] అని కలలు కంది. ఈ ఆలోచనంతా రాజేశ్వరి జెలసీకి సంబంధించి, అమీర్ తోళ్ళ సాహెబ్ కూతురుల కలయిక ఆమె మనస్సును ఎంతగానో కలిచివేసింది. ''*ఎంత ప్రయత్నించినా చెవులు మూసుకోలేకపోయాను. మొదట బాధపడ్డాను. నా వశం కాకుండా ఈర్ష్యపడ్డాను.*''[23]

ఇలాంటిది రాజేశ్వరి త్యాగం. తన నిస్సహాయత పూర్తిగా బయటపడింది. ''*సమస్త జీవరాసులు తమ జీవనం తామే సంపాదించుకుంటూ వుండగా లోకంలో కల్లా స్త్రీ మాత్రం తన జీవనం కోసం యింత నీచంగా పురుషుడి కాళ్ళు పట్టుకోవడమో, వెముకలు కొరక్కు తినడమో చేస్తుంది.... తిండికీ, బట్టకీ మానం అమ్ముకుంటుంది.*''[24] ఇక్కడ రాజేశ్వరికి అమీర్ తప్ప గత్యంతరం లేదు. అతనికి తోళ్ళ సాహెబ్ కూతురుపై ప్రేమ ఉన్నా ఇంక ఎవరిపై ప్రేమ ఉన్నాదాని అడ్డుకునే శక్తి రాజేశ్వరికి లేదు. అందుకే వివాహం సామాజికమైనది. మోహం వ్యక్తిగతమైనది. వ్యక్తిగతమైన మోహానికి సమాజం బాధ్యత వహించదు. పైగా 'మోహితులు' ఎవ్వరూ సమాజం యొక్క అనుమతిని కోరరు. కానీ వివాహం సామాజికమైనది. 'సకుంటుంబ సపరివారాల'తో జరుపుకునేది – వివాహం. కానీ, మైదానాల్లో ఏకాంతంగా తీర్చుకొనేది 'మోహం' మాత్రమే.

[20] మైదానం,పు: 47-48

[21] మైదానం, పు: 51

[22] మైదానం,పు: 51

[23] మైదానం, పు: 50

[24] స్త్రీ, పు:63

తోళ్ళసాహెబ్ కూతురుతో అమీర్ కలిసివుండడాన్ని ''*అమీర్ హృదయం నాదైనప్పుడు తనెందరి స్త్రీలతో వుంటే నాకేం? అతినికానందం కల్గిస్తున్నాననే ఆనందం కన్న వున్నతమైనదేమున్నది నాకు. అమీర్ నాకంత సౌఖ్యమిచ్చాడే నేనీ చిన్న సౌఖ్యాలతనికి సమకూర్చలేనా?*''[25] అన్న రాజేశ్వరి ఒక్కసారైనా ఇటు అమీర్ వైపు నుంచి ఆలోచించలేదు. అటు భర్త వైపు నుంచి ఆలోచించలేదు. భర్త తనను పట్టించుకోవడం లేదు కాబట్టి తను 'మైదానం'లోకి వచ్చింది – కానీ ఇప్పుడు అమీర్ తనని, కాదని ఎందుకు తోళ్ళసాహెబ్ కూతురుని మోహించాడు. భర్త తనను 'అంత తీవ్రంగా వాంఛించక పోయినా వేరే 'తోవ' తొక్కలేదు. పైగా సంఘంలో గౌరవం, అక్కడ తన 'మోహం' అర్థం చేసుకునే భర్త లేడు సరే ఇక్కడ అమీర్ తన 'మోహాన్ని' అర్థం చేసుకున్నాడు కదా! మరి తనెందుకు తోళ్ళ సాహెబ్ కూతురు వెంటపడడం– దీనికి జవాబు రాజేశ్వరి దగ్గలేదు అక్కడ మగవాడి నిర్లక్ష్యం అనుకుంటే– ఇక్కడ మగవాడి దౌర్జన్యం– నిర్లక్ష్యాన్ని 'తిరుగుబాటు'తో జయించింది. మరి 'దౌర్జన్యానికి బలైంది. ఇక్కడ భర్తా? అమీరా? ఎవరు రాజేశ్వరి పట్ల న్యాయం చేసింది?

దీనికి రాజేశ్వరి జవాబుల్లోనే 'క్లారిటీ' లేదు. కాకపోతే, మోహం తీవ్రతలు మారేకొలది స్త్రీ–పురుషులు పరస్పరం మార్చుకుంటూ పోయిన వారి జీవితాల్లో అలజడి, అశాంతి ఏర్పడి పిచ్చివారిలో మారే ప్రమాదముంది. తోళ్ళ సాహెబ్ కూతురు మోహావేశ తీవ్రత అమీర్ ని ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. అమీర్ ఆమెతో ఇమడ లేక పోతాడు. తనను వదిలించుకొని మళ్ళీ రాజేశ్వరితోనే ఉంటాడు. అమీర్ యొక్క మోహావేశానికి 'తన శరీరాన్ని కొరుక్కు తింటాడా? ఎముకల్ని విరిచేస్తాడా? అన్న భయం పట్టుకున్న రాజేశ్వరి కేవలం అతని ఆనందం కోసమే ఆ బాధనంతా సంతోషంగా స్వీకరించింది. పైగా, అమీర్ కోసం చచ్చినా ఫరవాలేదనే స్థితిలోకి వెళ్ళిపోయింది. అమీర్ యొక్క విచ్చలవిడి మోహాన్ని పంటి బిగువున రాజేశ్వరి భరిస్తుంటే– తోళ్ళసాహెబ్ కూతురు మోహాన్ని అమీర్ భరించలేకపోయాడు. బయటికి వచ్చేసాడు.– రాజేశ్వరి భరించింది. అమీర్ భరించలేకపోయాడు. రాజేశ్వరికీ, తోళ్ళసాహెబ్ కూతురికి ఇద్దరికీ తన మోహాన్ని పంచిన అమీర్ ఎక్కడ తనకు అనుకూలంగా ఉంటే, అక్కడే ఉన్నాడు కానీ, అంటే తన ఆనందం చూసుకున్నాడు. కానీ, అటు రాజేశ్వరి కానీ, ఇటు తోళ్ళసాహెబ్ కానీ, వాళ్ళ 'మోహాన్ని' గమనించలేదు. తన ఆనందం చూసుకున్న రాజేశ్వరికి– అతని ఆనందం మాత్రమే చూసుకునే అమీర్ కలవడం విచిత్రమేమీకాదు.

[25] మైదానం,పు: 50

రాజేశ్వరి అమీర్ ల మోహావేశ తీవ్రత 'ప్రతిఫలనం' అయ్యే సూచనలు కన్పించాయి. రాజేశ్వరి గర్భం దాల్చింది. గర్భాన్ని తీసివేయించుకోమని బలవంతపెట్టాడు అమీర్. ''*స్త్రీ హృదయంలో వుండే మాతృత్వాన్ని అనుభవించని ప్రియుడు స్వర్గానికి అంధుడు.*''[26] రాజేశ్వరి అందును అంగీకరించదు. తన మోహానికి గర్భం అడ్డమనీ – డొక్కలో తంతాడు అమీర్. పెండ్లయి, భర్తతో కాపురం చేసుకుంటూన్న రాజేశ్వరి, ఒక్క తోపు వీటన్నిటినీ తన్నేసి అమీర్ తో లేచివచ్చినపుడు – మాతృత్వం కావాలనుకుంటుంది. కారణం, ఒంటరిగా మైదానంలో ఉన్న రాజేశ్వర్కి అచ్చంగా తనవాడు ఒకడు తోడుండాలనిపించడమే. ఆమెను మైదానంలోని సంతోషాలు, సంగతులు అన్నీ మెల్లమెల్లగా అర్థం కాసాగాయి. కానీ, అశక్తురాలు ఏమీ చెయ్యలేని నిర్భాగ్యురాలు, మళ్ళీ ఆత్మవంచన చేసుకుంటుంది. అమీర్ తన్నుల్ని కూడ 'తమకం'తో స్వీకరించింది. అమీర్ ని తమ 'ప్రేమ'ని సమర్థించుకొంది. ''*అంతేకాని దిమ్మ తిరిగేట్టు అమీర్ మల్లే కొట్టమను యీ మగాళ్ళని అసలు వాళ్ళ చేతుల్లో సత్తువ ఏడిస్తే గదా!*''[27] అంటుంది. ఒకవైపు మాతృత్వం క్షోభించినా 'నిండామునిగాక చలేంటి' అన్నట్టుగా, రాజేశ్వరి ప్రవర్తన కనబడుతుంది. మోహశక్తి – ముందు మాతృశక్తిని ఓడించింది. మైదానంలో ఉండదలచిన వారి లక్ష్యం, గమ్యం 'మోహపాశ బంధితులు' కావడం. అదే సమాజంలో, సంసారంలో ఉన్నవారు, సంసారసాగరంలో ఈదులాడడం – సంసారంలో అనేక బంధాలుంటై – మైదానంలో ఇద్దరే ఉండాలి. మైదనాంలో ఉంటూ సమాజ ఫలితాలను ఆశిస్తే – కుదరదు. ఈ విషయం అమీర్ కి తెలుసు. అందుకే ఒంటరిగానే తీసుకొచ్చాడు. ఒంటరిగానే ఉంచదలచినాడు. అమీర్ కామం కొరకు తన మాతృత్వాన్ని వదులుకొంటుంది. గర్భాన్ని కాపాడుకోవడంలో ఆమె స్త్రీత్వాన్ని గాని, ధైర్యాన్ని గాని ప్రదర్శించలేక అమీర్ కాముకత్వానికి, తన మోహానికి లొంగిపోయింది. అమీర్ చేసిన పని అతని దృష్టిలో అనుకూలమైన పని. సంతానంతో మళ్ళీ సమాజంలో భాగస్వాములు కావడం అమీర్ కు ఇష్టం లేదు. ఆ కారణంగానే రాజేశ్వరితో శారీరకంగా దూరముండడమూ అతనికి అయ్యే పని కాదు. కాబట్టి ఇద్దరి మధ్య 'మూడోవ్యక్తి'ని రానీయలేదు. ఆమె అంగీకరించక పోయేసరికి, అతను మైదానం వదిలి ఎటో వెళ్ళిపోయాడు. ఈ పరిస్థితుల్లో రాజేశ్వరి సమాజంలోకి వెళ్ళలేదు. పుట్టేబిడ్డతో తనకు సమాజంతో సంబంధం ఏర్పడుతుంది. బిడ్డ ద్వారా సమాజం తనను గుర్తించి, తన స్థానాన్ని కూడా తెలుపుతుంది. తన పతనం కనిపిస్తుంది. కాబట్టే తన ప్రియుడి కోర్కెను గ్రహించి

---

[26] ప్రేమలేఖలు, పు:19

[27] మైదానం, పు: 61

మాతృత్వాన్ని కోల్పోయింది. అమీర్ ని దూరం చేసుకున్నప్పుడు పడిన వేదన హృదయ విదారకంగా ఉంది. ఇక్కడ అమీర్ యొక్క హృదయ కాఠిన్యత కనిపిస్తుంది.

అమీర్ దృష్టిలో రాజేశ్వరి ఎప్పుడూ భోగవస్తువే. కానీ రాజేశ్వరే. ఎప్పుడూ అమీర్ గురించి ఆలోచించడం వల్ల – తనవైపు నుండే అమీర్ ని చూసింది. కానీ అమీర్ వైపు నుండి తనను తాను గుర్తించలేకపోయింది. అంతగా 'మోహం'లో పడింది. అందవిహీన అయిన రాజేశ్వరితో అమీర్ ఎలాంటి సంబంధం పెట్టుకోదలచుకోలేదు. ఎందుకంటే ప్రధానంగా అమీర్ కామికుడు. ప్రేమికుడు కాదు. యవ్వనం, అందం వరకే కాముకుని చూపు, ఆలోచన ఉంటుంది. కానీ భర్త ఆలోచన యవ్వనం, అందంతో పాటు జీవితాంతం ఉంటుంది. ''*తనకి కావలసిన హక్కులకన్న, తను నెరవేర్చవలసిన బాధ్యతపైన దృష్టి నిలపాలి స్త్రీ. బైటవున్న పరిస్థితులకన్న, తన చుట్టూ వున్న వాతావరణం కన్న స్వతంత్రమూ, శాంతీ హృదయం లోపం పలికినప్పుడే స్థిరంగా నిలుస్తాయి. అత్త అధికారం నించి, భర్త ఆధీనం నుంచి తప్పించుకుంటున్న నవీన స్త్రీ షోకులకీ, సంఘ గౌరవానికీ, fashion కి బానిస ఔతుంది.*''[28] వివాహవ్యవస్థ బరువైనది. బాధ్యతగలది. రాజేశ్వరి, ఆ బరువు బాధ్యతలని మోయలేక – ఇప్పుడు దిక్కులేనిదయింది. అమీర్ రాజేశ్వరికి తోడుగా మీరాను ఉంచి వెళ్ళుతాడు. రాజేశ్వరి మీరాను సోదరునిగా భావిస్తుంది. మీరా ఆమెకు అన్ని సపర్యలు చేసి గర్భం తీయిస్తాడు. ఈ క్రమంలో రాజేశ్వరికి మళ్ళీ మీరా పైకి మనస్సు మళ్ళుతుంది. ఇక్కడ ఆమెలోని ఇంతకుముందటి పశ్చాత్తాపం కూడ కనబడదు. అమీర్ దూరమయ్యేసరికి గర్భం పోయే సరికి – మళ్ళా రాజేశ్వరిలో 'మోహావేశం' మొదలైంది. ఇంతటి విపరీత లక్షణాలు రాజేశ్వరి, తను చేసిన తప్పులకు, శిక్షపడినా కూడ పశ్చాత్తాపం పడని రాజేశ్వరి జీవితం ఉన్నత లక్ష్యాలను చేరుకోవడం అసాధ్యం. ఇంతలో అమీర్ మళ్ళీ వస్తాడు. అప్పుడు రాజేశ్వరి ఇద్దర్నీ కోరుకుంటుంది. ఇది చాలా అసహ్యంగా కనిపిస్తుంది. అంటే 'రాజేశ్వరి'ని దృష్టిలో పెట్టుకొని చూస్తే ఆమె 'కామతీవ్రత'కు ఆమె విచ్చలతనానికి అంతులేనట్లుగా అర్థమౌతుంది. సామాజిక దృక్పథం, బాధ్యత, తదనంతర పర్యవసానాలు అక్కరలేని స్త్రీ ఒకరికంటే ఎక్కువమందిని కోరడం సహజమే. ఇప్పుడు రాజేశ్వరి నాగరిక, సమాజానికి చాలా దూరంలో ఉంది. రాజేశ్వరికి ఇద్దర్నీ ప్రేమించగల 'ఆర్ధత' గల మనస్సు ఉన్నప్పటికీ వారిద్దరినీ 'ఏకదృష్టి'తో మోహించి, ఇద్దరితో సమానంగా సంచరించబోయి విఫలమౌతుంది. ఆమె మోహము, కాల్పనిక దృష్టి – వాస్తవాలను గుర్తించే స్థితిలో లేదు. వాటికి

[28] స్త్రీ, పు:3

లోబడి ఆమె శక్తి హీనురాలయ్యింది. తన లోపాన్ని ఈ విధంగా తర్కించుకుంటుంది. ''*ఎటు యేమి చేసినా, దోవలేని మహా అగాధం. ఈ జీవనదికి ఈ మహా సముద్రమే ఎటు ప్రవహించినా నా పుట్టుక. నేను ఏ పరిస్థితులలో పడ్డానో అది నా కర్మ. యీ ప్రపంచాన్ని పాలించే మహాశక్తి. మన హృదయాన్ని నడిపించే రహస్యసూత్రం, అదే నన్ను, అతన్నీ, ప్రేమనీ అన్నిటినీ, చిరునవ్వుతో యిట్లా మా అల్పశక్తుల్ని దాన్నుంచి తప్పించుకోవాలని చేసే మా అల్పవ్యర్థ ప్రయత్నాలని చూసి, చిరునవ్వుతో క్రూరంగా, నిరాఘాటంగా, సునాయాసంగా దొర్లించుకుంటూపోయింది. దానికి కళ్ళు లేవు, చెవులు లేవు, ఆత్మ లేదు. ఆశక్తే నీతిలోంచి, జడత్వంలోంచి శాంతిలోంచి, మర్యాదలోంచి మిమ్మల్ని, పాపంలోంచి, నరకంలోంచి, మహాబాధలోంచి నన్నూ, అందర్నీ ఎక్కడికో ఒక చోటుకేనేమో, తీసుకుపోతుంది.*''[29] అని బాధ పుడుతుంది. నీతి, స్థిరత్వం, శాంతి, మర్యాద, 'వ్యవస్థ'లో ఉండి– కామ, మోహాలను అదుపులో పెడుతుంది. పాపం, నరకం, బాధ, 'అవ్యవస్థ'లో ఉంటుంది. వ్యవస్థ, అవ్యవస్థల రూపం రాజేశ్వరికి ఇప్పటికి అర్థమైంది. కామం, మోహ బలీయమైనవి. దానిలో పడి స్వేచ్ఛగా తిరిగితే వచ్చే పరిణామం అశాంతి, అలజడి, ఈర్ష్యద్వేషాలు మాత్రమే. ఇది వివాహవ్యవస్థకు నాగరిక సమాజానికి సరిపడవు. ''*వీళ్ళ వాంఛలు అనాదివి. సృష్టి మూలసూత్రాలు. సంఘం లేకుండా, సృష్టి సాగుతుందికానీ, ఈ వాంఛలు లేకుండా సాగుతుందా?..... సంఘం చేతి ఆయుధం ప్రతిష్ఠ, సృష్టి చేతి ఆయుధం వాంఛ, యీ రెండికీ మధ్య పడి జీవితాలు తునకలైపోతున్నాయి.*''[30] అదుపు లేని కామం జీవితానికి విషాదాంతపు ముగింపునే ఇస్తుంది.

ఇలా రాజేశ్వరి ఇద్దర్నీ కోరడంతో వారిద్దరి మధ్య 'పోటీ' పెరుగుతుంది. తన అంతరాత్మ అనర్థమంటూ, అసహజమంటూ ఘోషించినా, ఆమెలోని రోమాంటిక్ 'అహం' మీరాను ఆహ్వానించింది. ''*అవి కొత్త అంతే. నువ్వు నాలుగు సార్లు వస్తే అదే అలవాటవుతుంది.*''[31] అని మీరాను రెచ్చగొట్టుతుంది. ''*అతను మాట్లాడలేదు, నామాటలు అబద్ధాలని నా అంతరాత్మ అంటూ వుంది. ఇద్దరిలో యెవరిని వొదలుకోవడానికి చేతగాక ఒకర్ని వొదలకూడదనే పేరాస. ఆ యిద్దర్నీ ప్రయత్నించి ఒకచోట చేర్చటం అనర్థమంటూనే ఉంది అంతరాత్మ. కాని నా శక్తిలో ఉండే నా అహంభావం నన్ను ప్రోత్సహించింది.*''[32] ఇలా ఇద్దరికి ఒకరిపట్ల ఒకరికీ జెలసీని

[29] మైదానం , పు:84

[30] స్త్రీ , పు:90

[31] మైదానం, పు:86

[32] మైదానం, పు:86

పెంచింది. మీరా రాజేశ్వరిని లేవదీసుకుపోయే ప్రయత్నం చేస్తాడు. మీరాను చంపి అమీర్ రాజేశ్వరిని దక్కించుకోవాలని చూస్తాడు. వీరిద్దరూ ఆమె రొమాంటిక్ దృక్పథాన్ని అర్ధం చేసుకోలేకపోయారు. ఇక్కడ ఈ అసహజ చర్చను గురించి కాకుండా పురుషుని ఆలోచన గురించి మాట్లాడితే – రాజేశ్వరి అమీర్ ను నమ్మి 'మైదానం' లోకి వస్తుంది. ఇంట్లో అన్ని సదుపాయాలు, హాయిగా అనుభవించేది. కేవలం 'కామోద్రేకం'తో ఆమీర్ తో వస్తుంది. తర్వాత అమీర్ కి తోళ్ళ సాహెబ్ కూతురుపై 'మోహం' పెరుగుతుంది. ఇది రాజేశ్వరిలో అలజడిని సృష్టించినా– 'ఏమీ చేయలేక 'అమీర్'ను తోళ్ళ సాహెబ్ కూతురులో పంచుకోవడానికి సిద్ధపడి తానే ఏర్పాటు చేసింది. కానీ అమీర్ తనను ఒంటరిగా వొదిలేస్తే మీరా చేసిన సాయానికి గుర్తుగా, ముందు సోదరునిగా భావించినా, తర్వాత తనను తాను అర్పించుకుంది అమీర్ కి రాజేశ్వరి ఇద్దరితో సంచరించడం నచ్చలేదు. స్త్రీ, పురుషుడిని వేరే స్త్రీతో అంగీకరించగా లేనిది పురుషుడు స్త్రీని వేరే పురుషుడితో అంగీకరిస్తే కలిగే నష్టం ఏంది! సభ్య సమాజంలో, సామాజిక బాధ్యతతో సంఘ విలువలను గౌరవిస్తూ, ఉన్నతంగా జీవితం గడిపేవారికి ఈ 'మర్యాదలు' ఉండడం సహజం. అన్నీ వదులుకొని వచ్చిన వారికి — ఈ స్వార్ధమేమిటో? కేవలం పురుషాధిక్యత, స్త్రీ తనతోపాటు వేరే పురుషుడిని కూడా ఆహ్వానిస్తుందని తెలిస్తే భరించలేడు. సంఘంలో లేని అమీర్ కే ఇంతగా, 'మీరా'ను చంపేద్దామన్నంతగా కోపం వస్తే – పాపం రాజేశ్వరి భర్త, సంఘంలో గౌరవం, పరపతి, మర్యాద ఉన్నవాడు ఏం చెయ్యాలి? అన్నీ ఉన్నవాడు కాబట్టే ఏమీ చేయలేకపోయాడు? ఏమీలేనివాడు కాబట్టే అమీర్ ఏదైనా చేసేందుకు సిద్ధపడ్డాడు. రాజేశ్వరికి ఉన్నటువంటి 'విశాలమైన దృష్టి' అమీర్ కు లేకపోయింది. స్త్రీ ఇద్దరు పురుషుల్ని రొమాంటిక్ దృష్టితో ప్రేమించినా, పురుషుడు అంత రొమాంటిక్'గా ఉండలేకపోతాడు. ఆమెను 'స్వంతం' చేసుకునే ప్రయత్నమే చేసాడు రాజేశ్వరి. ఇద్దరి ప్రేమను ఆహ్వానించి– విఫలమయింది ఇది అమీర్ ఆత్మహత్యకు దారితీసింది.

''*ఈ స్వేచ్ఛా ప్రణయ సిద్ధాంతాన్ని అనుసరించిన వ్యక్తులందరికీ చివరకు హత్య లేక ఆత్మహత్య శరణ్యమవుతోంది. ఈ రకంగా ఇది ఆచరణ యోగ్యంకాదని చెప్పక చెప్పినట్లవుతోందది.*''[33] ఇక్కడ అమీర్ ప్రాణత్యాగం గొప్పమలుపు రాజేశ్వరి 'మీరా'ను అమీర్ నుండి రక్షించబోతుంది. దీన్ని అవమానంగా భావించి, రాజేశ్వరిని ఏమీ చేయలేక తానే 'పొడుచుకొని' చనిపోతాడు. మొదట్లో రాజేశ్వరి చేసింది లజ్జా పరిత్యాగం– చివర్లో అమీర్

---

[33] తెలుగు నవల – నూరు సంవత్సరాలు, పు:62

చేసింది ప్రాణత్యాగం– అది స్త్రీ యొక్క 'రొమాంటిక్' మొదలైతే ఇది పురుషుడి రొమాంటిక్ ముగింపు. కాబట్టి వ్యవస్థాబద్ధంకాని, కామ, మోహాలు, కాల్పనిక దృక్పథం, సమాజంలో సత్ఫలితాలనివ్వదని స్వేచ్ఛాప్రణయం భారతీయ వ్యవస్థలో చెల్లదని ''*నా టెక్నిక్స్ అండ్ ఐడియాస్ చాలా పాశ్చాత్య వాతావరణాన్ని సూచిస్తాయి. కనక మన నేలమీద ఆరోగ్యంగా అభివృద్ధి చెందవు*''[34] చివర్లో చలం మాటల్ని గ్రహించాలి.

రామాయణంలో సేవ్యాసేవకానుబంధము, త్యాగనిరతి, శరణాగతరక్షకులు లాంటి ఉదాత్తగుణాలను పరిశీలిస్తే, స్వామిసేవలో ఆత్మార్పణ కావించుకోవాలంటే ముందు సేవకుడిలో దీనత్వం ఉండాలి. అహంభావం ఉండకూడదు. స్వామికి త్రికరణశుద్ధిగా శరణాగతుడు కావాలి. ఈ సేవాతత్వము రామాయణమంతటా కనిపిస్తుంది. అందుకే రామాయణాన్ని 'దీర్ఘశరణాగతి' కావ్యం అంటారు. విభీషణుడిని శరణాగతి ముందు రాముడు సుగ్రీవునితో 'ఒక్కమారు నేను శరణాగతుడను' నీ వాడను అని చెప్పి యాచించిన యెడల, అతనికి ఎవ్వరివలన ఏ భయములున్నా, ఆ భయము లన్నింటిని తీర్చడం నా వ్రతం' అంటాడు.

శ్రీరాముడు తన తల్లి చేయవలసిన సేవలను ఆమెకు గుర్తు చేస్తాడు. పితృవాక్య పరిపాలనా బద్ధుడై అరణ్యానికై వెళ్ళే సమయంలో తల్లి కౌసల్య కుమారుడితో అరణ్యానికి వస్తానంటుంది. అప్పుడు రాముడు ''అమ్మా! నాకు తండ్రి, నీకు భర్త అయిన దశరథమహారాజు జీవించినంతకాలం అతని సేవ చేయడం నీ ధర్మం. సనాతనమైన ఈ ధర్మాన్నే శృతిస్మృతులు రెండూ అంగీకరించాయి' అంటాడు. శ్రీరాముని సేవకోసం తన సర్వసుఖాలను తృణప్రాయంగా వదిలేసినవారు లక్ష్మణుడు. సకల భోగాలను, భాగ్యాలను విడిచి కందమూలాలను, మాత్రమే భుజిస్తూ కటికనేలపై శయనిస్తు, శ్రీరాముని పాదుకలని సింహాసనంపై వుంచి, వాటినే స్వామిగ భావించి ప్రజారంజకంగా పదునాలుగేళ్ళు పాలించిన భ్రాతృ సేవాపరాయణుడు భరతుడు. స్వామి కన్నా ఎక్కువగా కీర్తిపొందిన సేవకుడు హనుమంతుడు. అహర్నిశములు స్వామి సుఖానికి అంకితమైన వాడుగా హనుమంతుడు కనిపిస్తాడు. హనుమంతుని గురించి శ్రీరాముడు మాట్లాడుతూ, ''ఏ సేవకుడు ఏ కార్యం కొరకు స్వామిచే నియుక్తుడవుతాడో ఆకార్యంతోపాటు, దుష్కరమైన ఇతర కార్యములను సాధించువానిని పురుషోత్తముడంటారు. స్వామి తన సేవకుల ద్వారా దుష్కరకార్యములను చేయించుకుంటాడు. ఆ విధంగా సేవకుని కీర్తిని మరింతగా విస్తరింపజేస్తారు' సేవకుని గుణగనాలను ప్రశంసించిన తర్వాత తన కృతజ్ఞతను ప్రకటిస్తాడు.

---

[34] మ్యూజింగ్స్ , పు:12

భారతీయ ధార్మిక నైతిక, గార్హస్థ్య జీవితాలకు రామాయణం అద్దం పడుతుంది. తల్లిదండ్రుల, సోదర, మిత్ర, సేవక, పరిజన, పతి, పత్నీధర్మాలను ఈ కావ్యం వివరిస్తుంది. రామాయణం భారతీయ గృహస్థాశ్రమ ధర్మాన్ని బోధించే మహాకావ్యం. కుటుంబ జీవితం యొక్క ఆదర్శవంతమైన చిత్రణ ఇందులో మనకు కన్పిస్తుంది. నైతిక విలువల్ని బోధిస్తుంది. రామాయణం సాంస్కృతిక, ధార్మిక, నైతిక, రాజనీతి, ఆర్థిక సంబంధ సమాజ స్వరూపం కనిపిస్తుంది. ప్రాచీన భారతదేశంలోని సౌహార్థ, పరోపకారాలతో కూడిన ప్రజల జీవితాన్ని రామాయణం గొప్పగా చిత్రించింది. ప్రాచీనకాలంలో భారతదేశంలో కుటుంబవ్యవస్థ, జీవనవిధానాలను తెలుసుకునేందుకు రామాయణం ఆదర్శవంతమైన గ్రంథం. భారతీయుల నిస్వార్థమైన, కాంక్షరహితమైన మానవప్రేమ, అతిథిప్రేమలను వాల్మీకి ఎంతో బాగా చిత్రించారు.

వేయిపడగలు నవలలో రంగాజమ్మ మరణించిన తర్వాత రామచంద్రరాజు (ఆమె కొడుకు) ధర్మారావుతో ''*నాయనా! ఈ సంవిధానము చిత్రముగా లేదా? ఎక్కడి గంజాం జిల్లా! ఎక్కడి సుబ్బన్నపేట! నాయనగారక్కడికిఁ బోవుట యేమిటి? నేను కలుగుట యేమిటి? భిన్న వర్ణముల వారము మనమిద్దరము నన్నదమ్ములమేమిటి?*'' అంటాడు. ఈ వర్ణవ్యవస్థలోని అంతరాల గురించి, తద్వారా మానవ సంబంధాల్లో క్షీణిస్తున్న మానవీయ విలువల గురించి రచయిత చెప్పిన మాటలు గమనించదగినవి.

''*సంఘములోగాని మతములోగాని, మరొక దానిలోఁ గాని మీరెన్ని మార్పులైనఁ దేవచ్చును. ఇంద్రియనిగ్రహము, మనో నిగ్రహము, తద్వారా భక్తియో, జ్ఞానమో కలుగుటకు వీలుండెనేని మీరు తెచ్చిన మార్పు శిరోగ్రాహ్యము*'' అనడం వ్యక్తి ఎప్పుడూ ఇంద్రియ, మనో నిగ్రహాలు కల్గివుంటే జీవిత సాఫల్యఫలాలైన భక్తి లేక జ్ఞానం లభిస్తుందని తెలుస్తుంది. మానవుడు జీవితములో మరణానంతరం తన ప్రభావాన్ని తరువాత తరాలపై ప్రసరింపజేయడం భారతీయ తాత్త్విక భూమిక. అందులో భాగంగానే జీవించి ఉండగా నిగ్రహాన్ని పాటిస్తుంటే కైవల్యప్రాప్తి కలుగుతుందని, శాంతి మంతమూ, కాంతివంతమూ అయిన జీవనము తరువాత తరాల వారికి మార్గదర్శకత్వం వహిస్తుందని దీని భావం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో డబ్బు చలామణి పెరిగేసరికి ఆర్థిక అసమానతలు ఎక్కువైనాయి. వస్తువినిమయ పద్ధతి నుండి ధన వినిమయం మానవ సంబంధాల్లో అత్యాశను ప్రేరేపించింది. రైతులు మెట్టపంటలు మాని మాగాణి పండించడంలో వరి తప్ప వేరే పంటలకు తావు లేకుండా పోయింది. ''*ఈ విధంగా గ్రామవ్యవస్థ చెడిపోవటానికి కారణమైన మొదటి అంశం రైతుకు భూమికి మధ్య సంబంధంలో తీసుకువచ్చిన మార్పులు*

*రెండవది వృత్తులు దెబ్బతినటం, మూడవది పంటలలో వచ్చిన మార్పులు ఫలితంగా గ్రామ ఆర్థికవ్యవస్థలో ఏర్పడిన అస్తవ్యస్త పరిస్థితులు''*[35] వాణిజ్య పంటలు వచ్చేసరికి ఈ సంబంధాలు ఇంకా దిగజారిపోయాయి. వర్తకపు పంటల్ని ఎగుమతి చేయడం వల్ల స్వయం సమృద్ధికి మారుపేరయిన గ్రామవ్యవస్థ ఘోరంగా దెబ్బతింది. ఫ్యాక్టరీ యజమానులు, దళారుల మధ్య రైతుల ఆశావలయాల్లో చిక్కుకుపోయారు. పేద రైతు చితికిపోయాడు. కొత్త దోపిడీ రైతులకు అర్థమయ్యేసరికి రైతులు రైతు కూలీలుగా మారినారు.

వేయిపడగలులో ధర్మారావు ''ముసలిరైతుకు దీర్ఘోపన్యాసమిస్తాడు. దీనిలో దేశ ఆర్థికవ్యవస్థ గురించి స్పష్టంగా వివరిస్తాడు. *పది యెకరములు పొలములు కలవాడు. కొనవలసిన వస్తువేమిటి? రయితు మదమెక్కి యున్న పొలమంతయు వరి పండించి ధనాశాగ్రస్తుడైనాడు కానీ దీపముల కాముదములు పండించుకొనవచ్చును. కందులు, పెసలు, మినుములు, సెనగలు అన్ని కూరలు – మిరపవాము, ధనియాలు, మిరియాలు పొలములో పండించరానిదేమి? మనిషికిఁ గావలసినవి రెండే! కట్టుగుడ్డయుఁ దిన గూడును. ఇవి రెండును నేలనుండి తెచ్చుకొనవచ్చును. ఎన్ని రకములైన పంటలు పండించుకొనవచ్చును. మనమన్నిటి బదులు వరి యొక్కటియే పండించుకొనుచున్నాము. తక్కిన వానికి దరిద్రులమగుచున్నాము. రయితన్నప్పుడు ఉప్పు తక్క యేమియుఁ గొన నక్కఱ లేదు. ఆ యుప్పు కొనక తప్పక వచ్చినది కనుక. ఆ గీత మాత్రము తప్పించుకొనలేదు. కాని తెలివి తెచ్చుకొన్నచోఁ దెలుగురైతు దాక పోవుట యెందులకు? దురాశా పీడితము కానిచో దేశమును దారిద్ర్యమననుభవించ నక్కరలేదు. తన దేశ వైశాల్యము, అందుఁ బండదగిన పంటలు లెక్కచూచుకొనిన యెడలఁ బరదేశము మీఁదికి యుద్ధమునకు గాని బిచ్చమునకు గాని పోవుట యెందులకు – వచ్చురాబడికి, చేసికొను వ్యయమునకుఁ జక్కగా సరిపుచ్చుకున్నచో వ్యక్తి కేమి. దేశమునకేమి, జాతికేమి, దారిద్ర్యము లేదు. దురాశలేదు. అనవసరంగా వస్తువుల ధరలు పెంచి, యక్కఱలేని నాణేములు కల్పించి, వాని ధరలలోఁ దేడాలు తెచ్చి యార్థిక శాస్త్రమని, నాణెముల గూర్చిన శాస్త్రమని మిధ్యాకల్పన లక్కఱలేదు. దురాశము, నవివేకమును హేతువుగాఁ జెరిగిన యీ దుష్టమార్గము లన్నిటికి నాగరికత పేరు పెట్టుకొన నక్కఱలేదు. తెలుగు రైతు చచ్చిపోవుచున్నాడు. దేవ మాతృకలు దేశమున నశించినప్పుడే, సర్వము వరిపైరయినప్పుడే రయితు యొక్క యారోగ్యమును, వాని సంపదయు, వాని మనశ్శాంతియు జచ్చినవి. వాడును నితర దేశపు రయితు వలెనే – 'ధనము*

[35] వేయిపడగలు – సమకాలీనత – సార్వకాలీనత, పు: 58

*ధన'మని యంగలార్చుచున్నాడు. తాతా! కడుపులోని యాకలి కొంత సేపటికిఁ దీరును గాని, మనసులోని ధన తృష్ణ ఎట్లు తీరును''*[36] అని అంటాడు. నవలలో రైతులందరూ ధనాశాపరులు కావడంతో దేవమాతృనకు ప్రతిరూపమయిన పసరిక గూర్చి చెప్పుతూ ''*రయితు బిడ్డ యెప్పుడు చెడిపోయెనో పసరికయు నప్పుడే చెడిపోయెను*'' అన్నాడు. రైతులు, వ్యాపారులుగా మారితే తక్కిన కులాలవారు దళారులుగా మారి భూమిని, పంటను వ్యాపారం చేసారు.

రామాయణ కాలంలో సమాజం ధార్మిక ప్రవృత్తిగలది. సత్యవాక్పరిపాలన వారి ప్రధాన కర్తవ్యం. ముఖ్యంగా రాజు సత్సధర్మాలను ఆలోచించేవాడుగా ఉండాలి. రాజు ప్రజలకు ఆదర్శంగా నిలవాలి. అప్పుడే రాజ్యం సుఖసంతోషాలతో కూడి ఉంటుంది. రామాయణకాలంలో స్త్రీలకు గౌరవ సన్మాలుండేవి. అన్ని ధర్మకర్మానుష్ఠాలు భార్యతో కలిసి భర్త నిర్వహించేవాడు. కుటుంబంలో స్త్రీదే ప్రధానపాత్ర. స్త్రీలు ఆ కాలంలో ధర్మ పరాయణులుగా, నీతి కుశలురుగా, పాండిత్యం కలవారుగా ఉండేవారు. పతి సేవయే స్త్రీకి ప్రథమ కర్తవ్యం. భార్యకు సుఖసంతోషాలివ్వడమే భర్త ప్రథమదర్మం, కానీ ధర్మానుష్ఠాన సమయంలో భర్త, భార్య, పుత్రులు అనే మోహాన్ని విడిచి కఠోరంగా ప్రవర్తించగల నియమపాలనాశక్తి వారికుండేది. తల్లిదండ్రులకు సంతానం మీద అతి వాత్సల్యం. సంతానానికి తల్లిదండ్రులమీద భక్తిగౌరవాలుండేవి. బహుభార్యత్వం ప్రచారంలో లేదని చెప్పలేము. కాని పురుషుని పరస్త్రీ వ్యామోహం సంఘంలో నిరసింపబడేది. వైవాహిక జీవితాన్ని సుఖమయం చేసుకోవాలంటే భార్యభర్తల నడుమ ప్రేమవుంటే సరిపోదు. ఒకరి మీద ఒకరికి విశ్వాసముండాలి. స్త్రీలకు భర్తలను వరించే హక్కు ఉంది గాంధర్వ వివాహం ఉన్నట్లు కనిపిస్తుంది.

వేయిపడగలలో అక్కడక్కడా చిన్నచిన్న పాత్రలు కనిపిస్తాయి. ప్రధాన కథా స్రవంతిలో భాగం కాకపోయినా ఈ పాత్రల ఉదాత్తమైన చరిత్ర, మానవీయ విలువలోని గాఢతను తెలియజేస్తుంది. పరుల సొమ్ము గాని సాయాన్నిగాన్ని ఆశ్రయించిన కేవలం 'ఇవ్వడం'లోనే తృప్తిని పొందే ఈ వ్యక్తులు అచ్చమైన మానవత్వపు ప్రతినిధులుగా కనిపిస్తారు. లోకంలో ఇలాంటి వ్యక్తులు మనకు చాలా అరుదుగానైనా అక్కడక్కడ కనిపించి తీరుతారు. బహుశా వారి వల్లనే ప్రపంచం మనగలుగుతుంది. ప్రజలు వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని తమలోని పాశవిక ప్రవృత్తులను నిలువరించే ప్రయత్నం చేస్తారు. 'నాయరు' అలాంటి అరుదైన వ్యక్తి. మానవునికి సహజాతమైన కామాన్ని జయించిన వ్యక్తి నాయరు అర్థ సంపాదనను కూడ తన

[36] వేయిపడగలు, పు: 958

అదుపులోనే ఉంచుకోగలడు. అర్థ, కామాలను అదుపులో పెట్టుకున్న సమర్థుని జీవితం ఎంత ఉన్నతంగా, నిర్భయంగా, విశాలంగా ఉంటుందో ఇతని కథ ద్వారా తెలుస్తుంది. సంతోషాలకు, బాధలకు అతీతుడు నాయరు. మధ్య వయస్కుడైన నాయరు మళయాళీ, అవివాహితుడు. గుంటూరులో కిళ్ళీకొట్టు ఇతని జీవనోపాధి. ఎప్పుడూ ఆనందంగా కనిపించే వ్యక్తి. నిత్యం హరినామస్మరణం, కాపు పుచ్చుకోవడం, విభూతి ధరించడం, అతని అలవాటు. ప్రతిరోజు ఒక వృద్ధ బ్రాహ్మణునికి ఒక 'కానీ' దానం చేసి కానీ వ్యాపారం మొదలుపెట్టడు. విద్యార్థులు పెట్టిన ఖాతాకు లెక్కుండదు. ఇస్తే ఇచ్చినట్లు లేకపోతే లేదు. పిల్లలు అతన్ని మోసం చేయడం జరుగుతూనే ఉంటుంది. వీటనెవ్వటినీ పట్టించుకోని వ్యక్తి నాయరు. అప్పు ఇవ్వడమే కాని తిరిగి రాబట్టుకోవడం, అతనికి తెలియని విద్య ''*నా దొక పొట్ట. నాకు నెలకు అయిదు రూపాయలు చాలునండి*''[37] అంటాడు.

అనాథ ప్రేత సంస్కారానికి నాయరు ముందు నిలుస్తాడు. ''*మనము నెపుడో చచ్చెడిదే. నేనున్నాను చూడు బాబూ! రేపు చచ్చిపోయెదను. నీవంటి బాబు తీసుకొని తగుల వేయవలసిందే*'[38] అనే వేదాంతం మాట్లాడుతాడు నాయరు.

భారతీయ జీవన విధానంలో ఋషులు, మునులు అరణ్యప్రాంతాల్లో ఆశ్రమాలను ఏర్పరచుకొనేవారు. వారి కర్మానుష్ఠానాదులు సక్రమంగా నడిచేటట్లుగా చూసే బాధ్యత రాజుపై వుండేది. రాజు పురోహితుల, మంత్రుల సహాయంతో రాజ్యాన్ని పరిపాలించేవాడు. రాజు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించే వాడు కాదు. ప్రజాభిమతానుసారంగా, అతను నడుచుకోవలసి ఉండేవి.

వేయిపడగలు నవలలో రంగారావు పట్టాభిషేక సమయంలో, 'లక్ష్మణస్వామి' అనే ఏనుగు ఎదురుగా వస్తుంది. దాన్ని కాదని రంగారావు వెళ్ళిపోతాడు. ఈ అవమానానికి ఆ ఏనుగు చనిపోతుంది. ''*లక్ష్మణస్వామి మరణం రచయిత చేసిన ఒక గొప్ప సృష్టి. వేయిపడగలు నవల మొత్తం ఇతివృత్తాన్ని ఈ అనుభూతి శూన్యంగా చెప్తుంది. ప్రాచీనమైన విలువలు, సనాతన సంస్కృతి అకారణంగా ఉరితీయబడుతున్న రోజులవి. ఆధునిక నాగరికత తాకిడులవల్ల, జాతియొక్క ఆత్మవిశ్వాసం రోజురోజుకి తగ్గిపోతుండడం వల్లా ప్రాచీన సంస్కృతి నశిస్తుండడం, ఆదరణ కోల్పోతుండడం ఈ సంఘటన ద్వారా వ్యంగంగా రచయిత సూచించారు.*''[39] ఇక్కడ ఏనుగు కేవలం జంతువుగా గాక, జాతీయ భావానికి, గౌరవానికి ప్రతీకగా చెప్పవచ్చు.

[37] వేయిపడగలు, పు: 195

[38] వేయిపడగలు, పు: 197

[39] వేయిపడగలు: ఒక పరిశీలన, పు: 3

విదేశీవ్యామోహంతో రంగారావు పట్టాభిషేకానికి మోటారుకారు వాడినాడు. ''*ఇక్కడ మోటారు వైదేశిక నాగరికతకు చిహ్నం. రంగారావు మోటారును అధిరోహించి పట్టాభిషేకానికి వచ్చాడంటే పరిపాలనలో వైదేశిక నాగరికతను తీసుకువచ్చాడని, దీనితో పరిపాలన జాతీయ భావదూరమై పోయినది. కారుణ్యము, దయ, ప్రేమ మొదలైన భావాలకు పరిపాలనలో స్థానం లేకపోయాయి.*''[40] జాతీయ సాంప్రదాయాన్ని *వదిలినాడు అనే అర్థం స్ఫురిస్తుంది. ఒకచోట హరప్పానాయుడు ఏనుగులను పరిశీలిస్తుంటే రంగన్న ''అవునుబాబు! స్వామి గాంధీగారి వంటివాడు తరువాత బాబయ్యగారు మఱి యేనుగునుగాని గుఱ్ఱమునుగాని యెక్కలేదు. మోటారే యెక్కిరి''* అనడం రంగారావు పరిపాలనలోని 'విదేశీయత'ను ధ్వనింపజేస్తుంది.

జీవాత్మ, పరమాత్మ, ప్రకృతుల స్వరూపం, మానవుని కర్తవ్యం, భౌతిక ఆధ్యాత్మిక ఔన్నత్యాదుల రూపం, సమస్త వేద ధర్మశాస్త్రాదుల సారం అయిన 'భగవద్గీత' మహాభారతంలో ఉంది. మహాభారతంలో ఆనాటి రాజకీయాలు, రాజ్యపరిపాలనా విధానాలు, యజ్ఞయాగాది కర్మలు, మతం, ధర్మం, నీతి, దర్శనతత్త్వ రహస్యాలు, సాంఘిక జీవన విభాగం, వర్ణవ్యవస్థ మొదలైన ఎన్నో విషయాలు ప్రతిబింబించినవి. అంతేగాక మానవుని అంతర ప్రవృత్తుల వైవిధ్యం చాలా సహజంగా ఉంది. వ్యక్తిలో వుండే లోభం, ఈర్ష్య, కాంక్షాదుల స్వరూపాలు చక్కగా చిత్రించబడినవి. మహాభారతంలోని పాత్రలు నిత్యజీవితంలోని మానవులుగానే కన్పిస్తారు. కానీ ఆదర్శపాత్రలు కారు. మానవజీవితంలోని ఒడిదొడుకులు మానవ ప్రకృతి వైవిధ్యం, సంభాషణలు సహజంగా ఉన్నవి. రాజకీయపుటెత్తులు, పై యెత్తుల విధానం చెప్పబడింది. ఆయా సందర్భాలలో ధర్మసత్యాల రూప నిర్ణయం చేయబడింది. లౌకిక, ఆధ్యాత్మిక, పారదేశిక విద్యలన్ని దీనిలో ఉన్నవి. అందుకే మహాభారతాన్ని విజ్ఞాన సర్వస్వమన్నారు.

భారతం మూడు లోకాలను, మూడు కాలాలను, ప్రపంచంలోని సర్వవిధములైన పాత్రలను తన లోన ఇముడ్చుకుంది. అరణ్యపర్వంలో, ఉద్యోగపర్వంలో, శాంతిపర్వంలో అనుశాసనిక పర్వాలలో సూటిగ ధర్మబోధ కనిపిస్తుంది. భరతుడు సాహిత్యంలో హరిశ్చంద్రుడు, శ్రీరాముడు, ధర్మరాజు ప్రహ్లాదుడు, ద్రౌపది, సీత, సావిత్రి, దమయంతి లాంటి ఎందరో గొప్ప వ్యక్తిత్వం గల వ్యక్తులు కనిపిస్తారు.ఈ వ్యక్తుల జీవిత చరిత్రలను తర్వాతికాలంలో అనేకమంది ఆదరణతో చదువుతున్నారు. చదివిన వారందరూ హరిశ్చంద్రుడు మొదలైన వారిలా ఉన్నత వ్యక్తిత్వాన్ని పొందలేకపోయినా, ఆ ప్రమాణాలు అందుకోవాలనే భావనతో, దానికి

[40] వేయిపడగలు – సమకాలీనత – సర్వకాలీనత, పు: 43

కొంతయిన చేసే ప్రయత్నంలో ఉన్నారు. వీరి సంఖ్య తక్కువే కావచ్చు. కానీ, సాధించేది మాత్రం అనల్ప ఫలం. ఇటీవలి కాలంలో గాంధీ మహాత్ముడు. రామకృష్ణ పరమహంస, అరవిందయోగి, రమణమహర్షిలాంటి మహాత్ములు ఆ మార్గానికి చెందినవారే, ధర్మానికి, ధర్మాన్ని ఆచరించే వారికే ఎంత గొప్పస్థానం ఉంది. *'ధర్మము సమస్త జగత్తునకు ఆశ్రయభూతమైనది. లోకమున ధర్మమును అత్యంత శ్రద్ధాసక్తులతో ఆచరించువానిని ప్రజలు సమీపించుచుందురు. మానవుడు ధర్మముచేత పాపమును పోగొట్టుకొనుచున్నాడు. ధర్మమునందే సర్వమును నెలకొనియున్నది. అందువలన ధర్మమును పరమమైనదిగా చెప్పుచున్నారు''* అని వేదవేత్తలు చెప్పుతున్నారు.

మహాభారతంలో పాత్రలు మానవ సహజమైన లోటుపాట్లతో కన్పిస్తవి. మానవజీవితంలోని ఉత్థానపతనాలు అతి సహజంగ చిత్రీకరించబడినవి. దీనిలోని పాత్రలు కర్మ సిద్ధాంతాన్ని నమ్మి నిర్వీర్యులు కాక ధర్మం. సత్యాలకు కట్టుబడి సమర్థులై ఉండి కూడా కష్టాలను అనుభవిస్తారు. ఇట్లా కష్టాలను అనుభవించినా చివరకు ధర్మసత్యాలకే విజయం లభించినట్లుగా కవి చిత్రించాడు. మానవులు లోభమోహాదులకులోనై ఎట్లా దుర్గతిపాలవుతారో కవి కౌరవ పరాజయంలో సూచించి కావ్యాన్ని ధర్మనీతి బోధకంగా సాధించాడు. ఒక్కోపాత్ర ఒక్కో వ్యక్తిత్వంతో కనిపిస్తుంది. ధర్మరాజు ధర్మమూర్తి అయినా అతనిలోను మానవ సహజమైన కొన్ని లోపాలున్నట్లు చిత్రింపబడినది. ద్రౌపది, శకుంతలలు నిస్సహాయులైన సుకుమార సుందరీమణులు కాదు. అదేవిధంగా దుర్యోధన, కర్ణ, దృతరాష్ట్ర, భీష్మ, ద్రోణ, అశ్వద్ధామ, భీమార్జునాది పాత్రలెన్నో నిత్యజీవితంలో, వ్యక్తులలో కనిపించే లోపాలతో కనిపిస్తాయి.

ఈ విధంగా ప్రాచీన భారతీయ, వాఙ్మయంలో – అది వేద రూపంలోఉన్నా పురాణరూపంలో ఉన్నా, కావ్యరూపకాల రూపంలో ఉన్నా, ఏ మూలచూసినా దాని ప్రధాన ప్రతిపాద్యమైన లక్ష్యం ''విశ్వశ్రేయస్సే'', ఇంక ఆయా వాఙ్మయ విశేషాలలోని కథలైనా, వర్ణనలైనా వైదిక కర్మకాండ, జ్ఞానకాండాదులైనా, పౌరాణిక భక్తి, మార్గాలైనా రాజ్యపాలన విధానం మొదలైన సూచనలైనా ఈ విశ్వశ్రేయస్సుకు సాధనాలు మాత్రమే. దేశకాలాది భేదాలను పట్టే మారుతుంది. మానవుడు అభిరుచులను బట్టి కొన్ని సాధనాలు కొందరికి చెడ్డగా కనిపించవచ్చు. కొందరికి కొన్ని మంచిగా కనిపించవచ్చు. మొత్తానికి వివిధ రూపాలలో ఉన్న భారతీయ వాఙ్మయానికి మానవులందరికీ వైయుక్తికంగానూ, సామాజికంగానూ కూడా శ్రేయోమార్గం చూపించడమే, పరమలక్ష్యం అనడంలో ఎలాంటి సందేహం లేదు.

ప్రాచీన సంస్కృతం ఏ విధంగానైన భారతీయులను జీవన విధానాలను తీర్చదిద్దిందో వారి మానవీయ, నైతిక, ధార్మిక, జీవితాలను ఏ విధంగా ఉన్నతీకరించే ప్రయత్నం చేసిందో, మానవ

ప్రకృతిలో గల దానవ గుణాలను తొలగించి, మానవుణ్ని మహనీయునిగా చేసేందుకు వేల ఏండ్ల సాంస్కృతి సంప్రదాయాలకు విఘాతం కలగకుండా ధృడకవచాలతో ఏ విధంగా కాపాడిందో, అదేవిధంగా ఆధునిక యుగంలో కూడ కొందరు తత్త్వవేత్తలు భారతీయుల గొప్పలోని సత్యాన్ని, నిరూపించే ప్రయత్నం చేసారు.

వేల యేండ్లుగా భారతీయుల జీవన విధానాన్ని, ప్రాచీన సంస్కృత సాహిత్యం నిరూపించుకుంటూ వచ్చింది. ప్రాచీన సంస్కృత భారతీయ జీవనం రెండూ అవినాభావ సంబంధంతో ప్రపంచానికి మనిషి యొక్క వాస్తవిక ప్రగతిని చూపించాయి. అయితే వలసదేశంగా మారిన భారతదేశంలో, ఆంగ్లవిద్యవల్ల పాశ్చాత్య సంస్కృతి, సాహిత్యం, విలువలు మనదేశంలో చొచ్చుకొని రాసాగినవి. భారతీయులకు ప్రపంచాన్ని – పరిచయం చేయడం, అంగ్ల విద్యవల్ల ఇక్కడ ప్రజలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు రావడం వరకు బాగానే కనిపిస్తుంది. కానీ, లోలోపల ఆంగ్లవిద్య, పాశ్చాత్య నాగరికత, 'భారతీయాత్మ'ను ఇక్కడి జీవన విధానాన్ని ఇక్కడి ప్రజల నైతిక, ఆధ్యాత్మిక, మానవీయ విలువలల్ని బద్ధలు కొట్టే ప్రయత్నం చేసింది. దీన్ని ముందుగా గమనించి ఆ ప్రమాదం నుండి 'భారతదేశాన్ని' రక్షించే ప్రయత్నం చేసిన కొందరు తత్త్వవేత్తలను, వారి అభిప్రాయాలను తెలుసుకోవడం సమంజసంగా ఉంటుంది.

సత్యాన్వేషణ కోసం ఒంటరిగానే ప్రయత్నించాలనీ, ఎవర్నీ అనుసరించ కూడదన్న జిడ్డు కృష్ణమూర్తి తత్త్వాన్ని, ప్రాచీన సాంస్కృతిక, ఆధునిక దృక్పథంతో చూడాలన్న అరవిందుల ఆలోచనల్నీ, దరిద్ర నారాయణుల్ని ఆదుకుంటూ, భారతీయ ఔన్నత్యాన్ని కాపాడాలనే వివేకానంద బోధనల్నీ, స్వాతంత్ర్య పోరాటాన్ని సత్యాహింసలద్వారా చేయాలనీ, సామాజిక, ఆర్థిక పరమైన సమన్వయం కోసం పాటు పడాలన్న గాంధీజీ దర్శనాలను రేఖామాత్రంగా పరిచయం చేయడం జరుగుతుంది.

### 6.4. జిడ్డు కృష్ణమూర్తి దార్శనిక ప్రభావం:

భారతదేశంలో పుట్టి ఎంతో ఉన్నతంగా ఎదిగి జగద్గురువైనారు. మదనపల్లిలో పుట్టిన ఈయనను అనీబీసెంట్ దత్తత చేసుకొని ఇంగ్లాండులో పెంచి జగద్గురువుగా, ప్రవక్తగా ప్రకటించింది. 'ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ది ఈస్ట్' అన్న ప్రపంచవ్యాప్త సంస్థకు ఈయన్ని అధ్యక్షున్ని చేసింది. కృష్ణమూర్తిగారిలో క్రమక్రమంగా కలిగిన అంతరవికాసం ఈ అవకాశాలు కలిగించే ప్రలోభఆలకు ఆయన్ను లోబడనియ్యలేదు. ఆయన ఆలోచనలు అత్యంత విప్లవాత్మకంగా పరిణమించాయి. మనం హాయిగా ఉండడం కోసం మతాలు కావాలా? మనం ప్రేమించడం

కోసం దేవాలయాలు కావాలా? సత్యమనేది చీకటి గుయ్యారాలవంటి గర్భగుళ్ళోకాని, జిగేలుమంటూ వెలుగులీనే సమాజ మందిరాల్లోగానీ కనబడదు. పుస్తకాల్లో కనబడదు. కర్మకాండలలోను కనబడదు. అనుకున్నాడు. 1929లో ఆయన ఆర్డర్ ఆఫ్ దిస్టార్ ఆఫ్ ది ఈస్టును రద్దు చేసాడు. 'సత్యమనేది దారిలేని భూమి. ఏ దారిలోనూ దాన్ని చేరలేరు. ఏ మతం ద్వారానయినా సరే ఏ మతం ద్వారానయినా సరే ఒకరిని అనుసరించడం మీరు ఎప్పుడు ప్రారంభిస్తే అప్పుడే ముగుస్తుంది. మీ సత్యానుశీలత – మనిషి అన్ని రకాల బంధాల నుంచి, అని భయాల నుంచి విడుదల చెయ్యాలనీ కొత్త మతాల్ని స్థాపించగూడదనీ, నా అభిలాష. మనిషిని సంపూర్ణంగా, బేషరతుగా విడుదల చెయ్యాలన్నదే నా ఆవేదన' అన్నారు. ఆ ఆశయాన్ని ఆచరణలో నిరూపించారు.

తనను తాను తెలుసుకోవాలనే తనంతట తాను తెలుసుకోవాలని కృష్ణమూర్తిగారు చేసే బోధ చివరివరకు ప్రధానంగా మారలేదు. సామాజికంగా గాని వ్యక్తిగతంగా గాని ఏ మానవ సమస్యకూ సమాధానం మతాల్లోనూ, సిద్ధాంతాల్లోనూ ప్రజాఉద్యమాలలోను దొరకదని ఆయన స్పష్టం చేశారు. ఎందుకంటే ఇవి మనిషిని, మనిషిని విడదీసి సమస్యను సృష్టిస్తాయన్నారు. వావలసింది మానవచేతనలో లోలోతు గుహల్లో విప్లవాత్మక పరిణామమే కాని సంఘసంస్కరణకాదు. *''సమాజమన్నది దానంతట అది ఏదీ ఉండదు. సమాజమన్నది మీరూ నేను మన సంబంధం వల్ల సృష్టించింది. అది మన మానసిక స్థితులను బాహ్యప్రక్షపణ – అంచేత మీరు నునూ మనకు మనం తెలుసుకోకుండా కేవలం బయటదాన్ని మార్చడంవల్ల చెప్పుకోదగిందేమీ ఉండదు''* అన్నారు. సామాన్య మానవుడికి అర్థం కాని విధంగా జిడ్డుకృష్ణమూర్తి తత్వం ఉంటుంది.

**6.5. అరవిందుల దార్శనిక ప్రభావం:**

శ్రీ అరవిందఘోష్ 1872వ సంవత్సరం ఆగష్టు 15న కలకత్తా నగరంలో జన్మించాడు. లండన్ లో చదువుకొని, ఇంగ్లీషు భాషలో అసామాన్య పాండిత్యాన్ని గ్రీక్, లాటిన్, ఫ్రెంచి బాషల్లో గొప్ప వైదుష్యాన్ని, జర్మన్, ఇటాలియన్, స్పానిష్ భాషల్లో చక్కని పరిచయాన్ని పెంచుకున్నారు. భారతీయ సాహిత్య సంస్కృతులనూ, చరిత్రనూ, రాజకీయ పరిస్థితులనూ క్షుణ్ణంగా అధ్యయనం చేసి, భారతదేశ స్వాతంత్ర్యం కోసమై రాజకీయ కార్యక్రమాల్లో ప్రవేశించారు. 'వందేమాతరం' అనే దినపత్రికను ప్రారంభించి భారత జాతీయోద్యమానికి బలం చేకూర్చినారు. ఆలీపూర్ బాంబ్ కేసులో ముద్దాయిగా బంధింపబడి జైలులో అండర్ ట్రయిల్ ఫ్రిజినర్ గా ఒక సంవత్సరం గడిపాడు. ఆకాలంలోనే వారికి అమోఘమైన ఆధ్యాత్మికానుభావాలు కలిగినవి భగవద్గీత

అంతస్తత్వాన్ని సనాతన ధర్మ వైశిష్ట్యాన్ని తీవ్రంగా మననం చేసారు. 'సావిత్రి అనే మహాకావ్యంలో మానవ జీవన సారమ్యాన్ని చర్చించారు. ప్రాచ్య, పాశ్చాత్య విజ్ఞానాన్ని సంపాదించుకున్న శ్రీ అరవిందులు సంకుచిత లక్ష్యాలను భేదింది వర్తమాన ప్రపంచానికి, ఆధునిక, సమాజానికి ఆర్ష సంప్రదాయము ఎంత అనుగుణమైందో, శ్రేయోదాయకమైనదో, వికాసానికి ఎంతగా దోహదం చేస్తుందో, తమ వ్యాసాల్లో నిరూపించారు. The Human Cycle మొదలైన గ్రంథాల్లో శ్రీ అరవిందులు సామాజిక శాస్త్ర పరిజ్ఞానము ఎంత విస్తారమైందో, సునిశితమైనదో తెలుస్తుంది.

ప్రపంచంలో ప్రతిమానవుడు నిజమైన ఆనందాన్ని కోరుతాడు. శరీరానికీ, మనస్సుకీ, ఆత్మకు సహజమైన సామరస్యాన్ని సంపాదిస్తేనే నిజమైన ఆనందం సాధ్యమౌతుంది. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి సంస్కృతి యత్నిస్తుంది. అది భౌతికంగా గావచ్చు. వైజ్ఞానికంగా గావచ్చు. లేక భారతీయ సంస్కృతి వలె ప్రధానంగా ఆధ్యాత్మికం గావచ్చు. సాత్త్విక సముదాయాన్ని ఆశ్రయించి అన్నమయ స్థితినుండి ఆనందానుభూతి వరకు, ఆత్మ సాక్షాత్కారం వరకు అనేక జన్మసాధ్యమైన గమ్యాన్ని ధర్మనిష్టంగా చేరుకోవడమే భారతీయ జీవన ప్రధాన సిద్ధాంతమని శ్రీ అరవిందుల అభిప్రాయం. మనస్సు యొక్క పరిధికి అతీతమైన ఆత్మచైతన్యాన్ని ఆవిష్కరించడమే ఏకైక లక్ష్యం. అనంతమైన ఆధ్యాత్మిక ప్రస్థానమే పురోగతి. బాహిరమైన ప్రాపంచిక సుఖసంపదలను సంపాదించడం మన సంస్కృతి ప్రధానంగా భావించదు.

ప్రాపంచిక పాశ్చాత్య సంస్కృతి ప్రస్తుతం బలీయంగా ఉంది. అది భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు కబళించే ప్రయత్నం చేస్తుంది. సాహసోపేతంగా శత్రుకూటంలోకి చొచ్చుకుపోతే తప్ప ఆత్మ రక్షణ సాధ్యం కాదు. ఆ ఆక్రమణ సృజనాత్మకంగా వుండాలి అని అంటారు.

ప్రపంచమంతా శరవేగంతో పయనిస్తుంటే, మూలకు కూర్చోవడం అవివేకం. పూర్వ సంస్కృతి ఆధారంగా బ్రతకటమంటే పూర్వార్జితంపై చేరించడమే భారతీయ సంప్రదాయాన్ని వర్తమాన ప్రపంచంలో ప్రయోజనకరంగా దిద్దుకోకుంటే క్షీణించిపోతుంది. మార్పువద్దని, వికాసాన్ని కోరని మనుష్యులు నిర్వీర్యులౌతారు. కాలదోషం పట్టిన భావాలను వల్లె వేస్తే ప్రయోజనం లేదు భారతీయతమ్ము నష్టం లేకుండా స్వధర్మానుగుణంగా మారితేనే దేశభవిష్యత్తుకు క్షేమం అంటారు అరవిందులు. మనకు కలిగిన కొత్త అనుభవంతో వివేకంతో, వెలుగుతో ప్రాచీన సంస్కృతిని, నవీన దృక్పథంతో పరిశీలించాలి అని అరవిందులు అభిప్రాయపడ్డారు.

మాలపల్లి నవలలో అరవిందుల తత్త్వం రామదాసు కుటుంబంలో కనిపిస్తుంది. అలాగే వేయిపడగలు నవలలో కూడా పాశ్చాత్య ధోరణులు ప్రవేశిస్తున్నప్పుడు దేశీయ పరిస్థితులెలా సమన్వయించుకోవాలో ఈయన ఆలోచనా ధార ద్వార తెలుసుకోవచ్చు.

**6.6. స్వామి వివేకానంద దార్శనిక ప్రభావం:**

*'భారతదేశపుగాలి నా మహాభాగ్యం. భారతదేశపు ధూళి నాకు పరమ పవిత్రం. ఇప్పుడు భారతదేశం నాకు పావన తమ పుణ్యక్షేత్రం. భారతదేశమే నాబాల్యడోలిక యౌవన నందనవనం. వార్ధక వారణాసి, భారతవర్షం నశించిందా, ప్రపంచంలోని పారమార్ధికత అంతా నశిస్తుంది. నైతిక ధార్మిక సంపద అంతా నశిస్తుంది. దివ్యానందాన్ని చేకూర్చే మన సానుభూతి అంతా నశించిపోతుంది ఆదర్శజీవనమే నశిస్తుంది. వీటిస్థానంలో ధనం పురోహితత్వం వహిస్తుంది. స్పర్ధ, వంచన, బలాత్కారాలు, ఉపచారాలౌతాయి. మానవాత్మను బలిగా సమర్పిస్తారు. కామభోగాలనే స్త్రీ పురుష దేవతలు ఏలుబడి సాగిస్తారు. అయితే నామాట వినండి అటువంటిది ఎప్పటికీ జరగదు. జరగటానికి వీల్లేదు. నమ్మండి నామాట. ద్వేషం శక్తి కంటే ప్రేమశక్తి కోటిరెట్లు ఘనమైనది.'* భారతదేశపు ఆత్మోన్నత్వం గురించి వివేకానందుని మాటలుగా ప్రాచుర్యంలో ఉన్నాయి.

వివేకానందుడి చిత్తశుద్ధి, రామకృష్ణ గురుదేవుల సన్నిధిలో ఆయన సంశయాలన్నిటినీ తీర్చింది. అద్వైత సిద్ధి కలిగించింది. తర్వాత హైందవ ధర్మధ్వజాన్ని విదేశీయుల హృదయాల్లో నిలిపాడు. విదేశాల్లో తనకు ఆదర్శపూర్వకంగా లభించిన ధనాన్ని ఇక్కడ వారి సముద్ధరణకోసం వినియోగించాడు. భక్తి, జ్ఞాన కర్మయోగం గురించి గంభీరోపన్యాసాలు చేసి జ్ఞానామృతాన్ని పంచి పెట్టడంలో పరిపెట్టుకోక, స్వదేశ సముద్ధరణకోసం దీన జనాదరణ కోసం, దళిత జనాభ్యున్నతి కోసం కార్యశూరత్వాన్ని ధీరత్వాన్ని ఎలా అలవరచుకోవాలో ఉద్బోధించారు. ఆకలితో అలమటించే వాడికి పట్టెడన్నం కావాలి. కాని ధర్మ పన్నాలు వర్ణించడం సరికాదని చెప్పాడు.

తరతరాలుగా అనేక అవమానాలను, అనాదరణకూ, హింసలకూ గురి అయిన అభాగ్యులను దళితులకూ తోటి మానవులుగా పరిగణించకపోవడం వారి సముద్ధరణకు పూనుకోకపోవడం భారతదేశం చేసిన మహాపాపమన్నాడు. పీడిత జనోద్ధరణకు కంకణం కట్టుకోమని యవజనుల్ని ఉద్బోధించడమే కాక సంఘసేవాపరుల్ని కూడదీసి ఒక సేవసంఘాన్ని స్థాపించాడు. దైవ సాక్షాత్కారం పొందడం వల్ల కర్తృత్వ అహంకార భావం నశిస్తుంది. అప్పుడు ఏ సంస్కరణనైనా సాధించడానికి పూనుకుంటే అది ఫలిస్తుంది. అటువంటి వ్యక్తి ప్రబోధాలను

ప్రజలు కూడా తలదాలుస్తాము. అంతేకాని అతిశయంతో అహంకారముతో సామాజిక విప్లవాలు తాము సాధించగలనని ఎవరూ పూనుకోరాదు. వ్యక్తిలో అంతర్లీనమైన సంస్కారం, పరివర్తన ఉద్బోధం కాకుండా చట్టాలవ్ల నిర్బంధం వల్ల ఫలితాలు ఆశించడం అడియాస అవుతుంది. సృష్టిలో యుగయుగాల మానవాలి దైన్య బాధలకు ఒకానొక రాజకీయ సిద్ధాంతం సమహ్సాహం కలిగింగగలదా! మానవుడు తన వంతు కర్తవ్యాన్ని భగద్విశ్వాసం ఉంచి నిర్వహిస్తే తక్కిన భారాన్ని వహించవలసినవారు భగవంతుడు. కర్మ సిద్ధాంతం అనేది ముమ్మందు సక్రమంగా నడుచుకోవడానికి కాని సాంఘిక దురవస్థ ఆకర్మణ్యతను ఉపేక్షభావాన్ని వహించడానికి కాదు. మానవుడు తనను తాను సంస్కరించుకుంటే ఆ కట్టడి ఆ విలువల సంస్కరణ భారం సంఘం వహిస్తే సామాజిక సంక్షేమం దీర్ఘకాలికంగా మనగలుగుతుందనేది వివేకానందుని భావనల సారాంశం.

సమిష్టి జీవనం వల్లనే వ్యష్టిజీవనం సమిష్టి సుఖం వల్లనే వ్యష్టి సుఖం. సమిష్టి దృష్టి లేకపోతే వ్యష్టి ఉనికి కూడ అసంభవం. ఇది నిత్యసత్యం. ఇదే విశ్వం మనుగడకు మూలాధారం. అఖండ సానుభూతితో సమిష్టి సుఖమే తన సుఖమనీ సమిష్టి దుఃఖమే తన దుఃఖమనీ భావిస్తూ మెల్లగా పురోగమించడమే సృష్టి కర్తవ్యం. అని వివేకానందుడు అభిప్రాయపడ్డాడు. ఈ భావాల ప్రభావం మాలపల్లి, వేయిపడగల నవలల్లోని కొన్ని పాత్రల ద్వారా వ్యక్తమవుతుంది. సంగదాసు, రామదాసు, రామానాయుడు పాత్రల్లో వివేకానందుని దార్శనిక ప్రభావం గోచరిస్తుంది. వేయిపడగలు నవలలో సనాతన భారతీయ విలువల్ని కాపాడుకోవాలని ధర్మారావు పాత్ర ద్వారా వివేకానందుని తాత్వికభావాలు కనిపిస్తున్నాయి.

## 6.7. గాంధీజీ దార్శనిక ప్రభావం:

సత్యాన్వేషణ తన జీవితాదర్శంగా పెట్టుకొని జీవితాంతమూ అన్వేషిస్తూ సత్యంలోనే పరమాత్మ ఉన్నాడని తెలుసుకొని దాని సాధన జీవిత పరమార్థమని భావించిన మహోన్నత వ్యక్తిత్వం మహాత్మ గాంధీజీది. 'ఈ లక్ష్యసాధననే నా జీవితం నా నడవడి, నా మనుగడా!' అని అంటారు. ఆయన బోధించిన సత్యం, అహింసా సిద్ధాంతాలు ఆయన ప్రతిమాటలోనూ, చర్యలోనూ కనిపిస్తాయి. మానవజాతికి ముఖ్యంగా భారతజాతికి ఆచరణయోగ్యమైన, అనుసరణీయమైన, సిద్ధాంతాలను, దర్మాలను ప్రభోదించాడు. గాంధీజీ ప్రారంభించిన ప్రతి కార్యక్రమంలోనూ నిర్వహించిన ప్రతి ఉద్యమంలోనూ ఇది కన్పిస్తుంది. తాను చెప్పే సిద్ధాంతాలను, ఆదర్శాలను తాను స్వయంగా ఆచరించే వాడు గాంధీజీ.

స్వాతంత్ర్య సముపార్జనకు జరిగే పోరాటం, సత్యం, అహింసా, త్యాగం తన సిద్ధాంతాలపై జరగాలి అనే విధానానికి నాంది జరిగింది. ఈ విధానాలకు అనుగుణంగా ప్రభుత్వ వ్యతిరేక ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని పట్టుబట్టాడు గాంధీజీ. స్వాతంత్ర్య సముపార్జనకు ఆయన చూపిన అభినివేశంలో ద్వేషభావం కొంచెం కూడా కనబడదు. ''కలుషితమైన సాధనాలు కలుషితమైన ఫలితాలను ఇస్తాయి. అందువల్ల రాజు యొక్క శిరచ్ఛేదనం వల్ల రాజు, రైతూ సమానం కాజాలరు.'' అట్లాగే అభేదన విధానం ద్వారా యజమానీ, కర్షకుడూ కూడా సమానం కాలేరు. అసత్యాచరణం ద్వారా ఎవరూ సత్యాన్ని చేరుకోలేరు అన్నాడు. అహింస, సత్యం లోనూ సత్యం అహింసలోనూ అంతర్గర్భితమై ఉంటాయి. కాబట్టి అవి ఒకే నాణానికి రెండు ముఖాలు.... మనస్సులో ఏ మాత్రం ద్వేషానికి తావు ఇచ్చినా కూడా మనలో అసత్యమును హింస మిగిలివున్నట్లే. అందువల్ల కేవలం సత్యవ్రతులు అహింసాపరులు, నిష్కల్మష హృదయాలు మాత్రమే భరతవంశములో కానీ, ప్రపంచంలో మరెవ్వరైనా కానీ, సమాజవాద సంఘ నిర్మాణం చేయగలుగుతారు అని గాంధీజీ అభిప్రాయం. ''*మనం పాపాన్ని ద్వేషించవలెకాని పాపిని కాదు*'' అనేదే ఆయన నిర్వచనం. ఆనాటి విద్యావంతులను, యువతీయువకులను ఇది విశేషంగా ఆకర్షించింది. అసంఖ్యాకులైన ప్రజలు ఆయన పిలుపుకోరుకొని వివిధ సత్యాగ్రహోద్యమంలో, సహాయనిరాకరణోద్యమాలలో పాల్గొని కారాగార శిక్షలను అనుభవించారు.

గాంధీజీ ఉద్యమాలను ప్రజల్లోకి తీసికెళ్ళారు. ఆయనలోని చిత్తశుద్ధి, సత్యసంధత, కార్యదీక్ష నిస్వార్థ నిరాడంబరత వంటి మహోన్నత గుణాలు, ఆనాటి మేధావులు, ప్రముఖ వ్యక్తుల్ని ఎంతగానో ఆకర్షించినవి. వివిధ మతాలు, కులాలు, వర్గాలు, భాషలతో కూడి ఉన్న వ్యవస్థలోని భారతీయులందరినీ సమైక్యపరిచి, కార్యోన్ముఖుల్ని చేసి, ఒక్క త్రాటి మీద నడిపించింది. ఈ జాతి సమైక్యతను సాధించారు గాంధీజీ. జాతీయోద్యమానికి, సత్యాగ్రహోద్యమం ద్వారా, అహింసద్వారా మహోన్నత నైతికస్థాయిని మానవతా విలువల్ని, సంతరించి పెట్టిన మహనీయుడు గాంధీజీ. *''మనం జరిపే పోరాటంలో కానీ, ఉద్యమాల్లో కానీ హింసా చర్యలకు ఎటువంటి చోటు ఇవ్వకూడదనీ నేను అందరినీ అర్థిస్తున్నాను. పాలకులకు మీరు చెప్పదలచిన మాటలు దాపరికం లేకుండా స్పష్టంగా చెప్పండి. మీరు చేయదలచిన పనిని ముందుగా వారికి తెలిపి బహిరంగంగా చేయండి. మీ చర్యలు, మాటలు వారికి రుచించక వారి వలన ఏదైనా కష్టం*

*సంభవించినట్లయితే దానిని అత్యంత సంతోషంతో అనుభవించడానికి సిద్ధం కండి. వారిని ఎన్నడూ దూషించకండి.''* అంటారు[41].

గాంధీజీ దృష్టిలో శత్రువు అనేవాడు లేడు. తాను సత్యం న్యాయం అని నమ్మిన దానికై ఎంతటి ఆత్మార్పణ చేయగలడో దానిని బట్టి ఆ వ్యక్తి యొక్క చిత్తశుద్ధి నిర్ణయించబడుతుంది. తాను సత్యమని అనుకున్న దానికై అంచలంచలుగా నిలబడి తాను న్యాయమని నమ్మిన దానికై కష్టాలను ఎదుర్కోవడమే. ''సత్యాగ్రహం'' అన్నారాయన. పేదరికాన్ని కోరి వరించాడు. భారతదేశంలోని నిరుపేదలకు ప్రతినిధియై అతినిరాడంబరమైన, సరళమైన జీవితాన్ని ఐచ్ఛికంగా స్వీకరించి గడిపాడు.

భారతదేశానికి రాజకీయ స్వాతంత్ర్యంతో పాటు ఆర్థిక స్వాతంత్ర్యం సామాజిక న్యాయం చేకూరి సాంఘికాభివృద్ధి జరగాలనేది ఆయన ఆకాంక్ష. అందుకే అత్యధిక సంఖ్యాకులు నడిపించే గ్రామాలు, గ్రామీణ ప్రజలు అభివృద్ధి చెందనిదే 'స్వరాజ్యం' పరిపూర్ణం కాజాలదని గాంధీజీ అభిప్రాయం. సామాజిక న్యాయం గురించి హరిజన పత్రికలో దౌర్జన్య రహితమైన స్వాతంత్ర్యానికి ఆర్థిక సమానత్వం అమూల్యమైన సాధనం. ఆర్థిక సమానతకు కృషి చేయమంటే పెట్టుబడికీ, శ్రమకూ మధ్య గల నిరంతర సంఘర్షణకు స్వస్తి చెప్పడమన్నమాట. అంటే ఒక వైపు దేశ సంపత్తిలో హెచ్చుభాగం తమ చేతుల్లో కేంద్రీకృతమై ఉన్నటువంటి కొద్దిమంది ధనిక వర్గీయులను కిందికి దింపటమూ, మరొకవంక అర్థాకలితో, చింకి పాతలతో బ్రతికే లక్షలాది ప్రజాసామాన్యాన్ని పైకి లేవనెత్తటమని అని అర్థం. ధనిక వర్గానికి, ఆకలితో ఉన్న ప్రజానీకానికి మధ్య ఏర్పడి ఉన్నటువంటి అగాధాన్ని తొలగించటం ప్రభుత్వ విధానమై ఉండాలి. స్వతంత్ర్య భారతదేశంలో పేదవారికీ, కోటీశ్వరులతో సమానమైన హక్కులు ఏర్పడిననాడు కొత్త ఢిల్లీ నగరపు దివ్యభవనాలకు, పేదకార్మికులు నివసించే దుర్భర గుడిసెలకు గల అగాధ సదృశమైన తేడా ఒకరోజు నిలవజాలదు అని గాంధీ భావించారు. గ్రామసీమలు చైతన్యవంతం కానిదే దేశం సుసంపన్నం కాజాలదని గట్టిగా విశ్వసించిన గాంధీజీ ముందుగా గ్రామోద్ధరణకు పూనుకున్నారు. మత సామరస్యం అస్పృశ్యతా నివారణ. మద్యపాన నిషేదం. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి మహిళాభ్యుదయం, ఆర్థిక సమానత, గ్రామపారిశుధ్యం, బేసిక్ విద్య, రాష్ట్ర భాష హిందీ ప్రచారం, గ్రామ పంచాయితీ వ్యవస్థ, పునర్నిర్మాణం, భూసంస్కరణలు వంటి ఆయన నిర్మాణ కార్యక్రమంలో ముఖ్యమైన అంశాలు.

---

[41] గాంధీజి, ?

వ్యక్తి తన సంపదను సమాజ శ్రేయస్సుకు ఉపయోగించాలి. సంపద అంటే భూమి గాని, ధనం గానీ లేక ఇతరములైన ఏ వస్తువులైనా గానీ, అంటే విద్య, ప్రతిభానైపుణ్యాలు సైతం ఎవరి వద్ద ఉన్నా సరే అవి వారి సొంతం కావు. వాటికి వారు ధర్మకర్తలు మాత్రమే. అవి సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడాలి అనేది గాంధీజీ మౌలిక సిద్ధాంతం. ఈ భావనలు, సిద్ధాంతాలన్నీ తెలుగు నవలా సాహిత్యంలో వివిధ పాత్రలకు అనువర్తించడానికి ఎంతగానో అవకాశం ఉంది.

''*గాంధీగారికి హరిజనోద్యమం అత్యంత ప్రియమైనది అందుకు కారణం ఎంతో మౌలికమైనది. 'అస్పృశ్యత ఒక అమానుషమైన మూఢాచారం అనే భావం కేవలం సంఘసంస్కర్త అయిన వాని దృష్టి, అస్పృశ్యత ద్వారా సమాజానికి వెలిగాబడిన వర్గం ఆర్థికంగా పీడితవర్గం, శ్రామిక వర్గం. కాబట్టి ఈ వర్గానికి న్యాయం జరగాలి. విప్లవం ఈ వర్గం ద్వారా జరగాలి అనేది కేవలం రాజకీయవాది దృష్టి ఈ రెండు భావాలు సమన్వయం చేసుకున్న మానవ ధర్మపరిణామవాది గాంధీ. జరిగే విప్లవం, శాంతి, అహింస అనే ధార్మిక సూత్రాలమీద జరగాలి. అయితే ఇందులో శాంతి, అహింస, ఔదార్యము, క్షమ చూపవలసిన వారెవ్వరు? గాంధీ ఉద్దేశంలో రెండు వర్గాలవారూ చూపవలసిందే, అదే మానవతాధర్మం కాబట్టి*''[42] తరతరాలుగా అణచివేయబడుతున్న పంచములకు 'హరిజనులు' అని పేరుపెట్టి ఈ ఉద్యమాన్ని స్వాతంత్ర్యోద్యమంలో ఒక ప్రధానమైన భాగంగా నిర్వహించాడు. భూసంస్కరణోద్యమం, జాతీయోద్యమం, రైతుకూలీసమస్య, హరిజనాభ్యుదయం, స్వేచ్ఛాప్రణయం, ఆధ్యాత్మిక జీవనం లాంటి భూమికలతో 'మాలపల్లి' రచన సాగింది.

''*మాలపల్లి నిర్మాణంలో మహాభారత లక్షణం వుంది. అది అంతా రామదాసు వైయుక్తిక బిందువు నుంచి సామాజిక వలయందాకా శంఖాకారంగా రూపొందుతూ పోవడమే ప్రధానాంశం. భూమి నుంచి ఆకాశం దాకా, వాస్తవికత నుండి అవాస్తవికత దాకా వ్యక్తి ఎదిగిపోతూ, చుట్టూ అంటుకొని ఉన్న బంధాలను ఒక్కొక్కటిగా వదిలించుకుంటూ పోవడం చివరకు పరమ సాత్వికమూర్తిగా మిగిలిపోవడం దీనిలోని యితివృత్తం. మిగిలిన పాత్రలన్నీ రామదాసులోని అనేక సంక్లిష్ట చైతన్యాంశాలకు రూపకల్పనలే. భౌతిక జీవనంలో నుంచి ఆధ్యాత్మిక జీవనం ఎలా రూపొందవలసిందే. రెంటికీ మధ్య ఎట్లాంటి క్రమ పరిణామ సూత్రం ఉన్నదీ వ్యక్తీకరించడమే మాలపల్లి తత్వం.*''[43] సుఖమే పరమావధిగా జీవితాంతం అందర్నీ పీడించిన చౌదరయ్యకు చివరకు దుఃఖమే మిగులుతుంది. సామాజిక శ్రేయస్సే జీవిత లక్ష్యమని,

---

[42] సాహిత్యంలో దృక్పథాలు: (పు:64-65)

[43] సహృదయ చక్రము: (పు: 219)

దానికి అహింసామార్గాన్ని ఎంచుకున్న సంగదాసు జీవితం అర్థంతరంగా ముగిసినా అతని స్ఫూర్తి నిత్యం వెలుగుతూనే ఉంది. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం హింసావృత్తిని ప్రేరేపించగా ధనవంతుల పాలిట 'జగ్గడు' రూపంలో కొంత విజయం సాధించినా, వెంకటదాసు రగిలించిన 'స్ఫూర్తి' తత్కాలమైనదిగానే మిగిలిపోయింది.

కుటుంబాన్ని నేల పాలు చేసుకొని, శారీరక వ్యామోహంతో, స్వేచ్ఛపై పాకులాడిన కమలామోహనుల అనైతిక జీవనాలు విషాదంగానే మిగిలాయి. స్త్రీ, పురుషుల జీవితాల్లో వెలుగును నింపలేదని జ్యోతి అప్పాదాసుల ప్రేమ ద్వారా తెలుస్తుంది. ఉన్నత కుటుంబంలో పుట్టినా, సంఘంలో తాను చూస్తున్న అంతరాలలోని బేధాలను తుడిచేయాలని, సమసమాజ స్థాపనే ధ్యేయంగా పనిచేసిన రామానాయుడు కుటుంబాన్ని కోల్పోయినా చివరకు తన లక్ష్యం చేరుకొని గెలిచి నిలిచాడు. మోహనరావు జీవితం కూడ దుర్భరమౌతుంది. కమల పిల్లవాడు ఇద్దరూ చనిపోయేసరికి, పశ్చాత్తాపం మొదలౌతుంది. దీనికంతకకూ కారణం తన అధర్మ ప్రవర్తననే అని కుమిలిపోతాడు. భార్య కూడా కాపురానికి రాకుండానే మరణిస్తుంది. ప్రేమాస్పదురాలైన తల్లి చనిపోతుంది.

మనశ్శాంతి కోసం ఎన్ని ప్రదేశాలు తిరిగినా, ఎన్ని పుణ్యక్షేత్రాలు దర్శించినా, ఎందరు మహానుభావులను కలిసినా ఫలితం శూన్యం. మనశ్శాంతిని పొందలేకపోతారు. చివరకు మహాత్ముని ఆశ్రమంలో "*మహాత్ముని సాంగత్యం గలిగిన తరువాత కొంత మనశ్శాంతి*"[44] పొందుతాడు. తర్వాత క్షయవ్యాధితో అంధవికారిగా మారి తన ఆస్తినంతా రామానాయుడు ఏర్పాటుచేసిన కార్మిక కళాశాలకు రాసి రామానాయుడిని ధర్మకర్తగా ఉండమని కోరతాడు. ఇది మోహనరావులోని పశ్చాతాపం, ప్రాయశ్చిత్తం.

'స్వేచ్ఛా ప్రణయం కారణంగా అర్థాంతరంగ, విషాదంగ ముగిసిన జీవితాలు కమలా మోహనరావులవయితే, శారీరక అవధుల్ని దాటి అమలిన శృంగారంలో తమ ప్రేమను పరీక్షించుకున్నవారు జ్యోతి అప్పాదాసులు. వివాహరహితంగా, ఊహల్లో ప్రేమను శాశ్వతంగా నిలుపుకుందామనుకున్నారు. దీనికి సమాజం ఆమోదముద్ర వేయజాలదు. సమాజం అంగీకరించి ఇరువురి జీవితాలను 'వివాహం' అనే బంధంతో కలిపితేనే అది సామాజిక బంధం అవుతుంది. ఆ ఇరువురి జీవితాల పట్ల సమాజం బాధ్యత తీసుకుంటంది. వివాహరహితంగా యౌవనంలో శాశ్వతప్రేమ కన్పించవచ్చు. కానీ శాశ్వతంగా యౌవనం ఉండదు. శారీరక

[44] మాలపల్లి : (పు:661)

బంధం తోనే వివాహం బలపడుతుంది. ఇద్దరి శరీరాల ద్వారా ఆత్మలు ఏకమవుతాయి. కానీ మానసికంగా ఒకటవడం కేవలం ఊహాజనితం, నిజానికి అలాంటి ప్రేమికులు ఉంటే, దాన్ని ఆధారం చేసుకొని కుటుంబం, సమాజం తమ రూపాల్ని, విలువల్ని, పునఃపరిశీలించు కుంటాయి. కానీ ప్రస్తుతం ఉన్న సమాజాలను అంతటి విస్తృతి, వైశాల్యం లేవు. గోపికా, కృష్ణలలాంటి ప్రేమ జ్యోతి, అప్పాదాసులది. విశ్వ వ్యాపితమైంది. వరుసకు బావమరదళ్ళు, చిన్నప్పటి నుండి ఒకే ఇంట్లో ఉంటారు. చిన్నప్పటి పరిచయం వారికి ఒకరిపట్ల ఒకరికి ప్రేమను కల్గిస్తుంది. బహుశా ఒకే ఇంట్లో ఉండడం వల్ల ఎప్పుడూ ఒకరినొకరు చూసుకోవడం వల్ల యౌవనంలో, తొలిసారిగా కలగాల్సిన 'ప్రేమ' సహజంగా లేకపోయింది. దీనికి ఇద్దరి ఆలోచనా విధానాలు కూడా తోడయ్యాయి. వీరిద్దరి మధ్య గురుశిష్య సంబంధం కూడ ఉంది. సాహిత్యం మీద నుండి వీరిద్దరి సంభాషణ ప్రేమ మీదికి మరలుతుంది. వీరి భావాలేకాకుండా మాటలు కూడ 'అమలిన శృంగారం' ధోరణిలోనే సాగడం విశేషం. జ్యోతి 'నిర్గుణబ్రహ్మాన్ని ప్రేమించినట్టు ప్రేమిస్తా' నంటే అప్పారావు తనలోని ఉన్నతమైన స్త్రీ, పురుష భేదానికి అతీతమైన ప్రేమను ఇలా వ్యక్తం చేస్తారు. ''*నీవు నా బంగారు రాధవు. నా శ్రీకృష్ణుడవు కూడ నీవే. రాధ కృష్ణున్ని ప్రేమించినట్లు నిన్ను ప్రేమిస్తాను. మోక్ష ప్రదాయిని. నీవే నా ముక్తి కాంతవు.*''[45] ఈ ధోరణిలో ఉంటుంది. వీరి ప్రేమ, ప్రేమ లేకుండా ఇహమూ పరమూ లేదని భావిస్తారు. వివాహబంధంతో స్త్రీ పురుషులు శాశ్వతబంధాన్ని ఏర్పరచుకోవడం కాకుండా ప్రేమ ద్వారానే శాశ్వతంగా కలిసి ఉండొచ్చు అని దీనికి 'వివాహం ద్వారా ఏర్పడే'.... 'సంగమం' అవసరం లేదంటాడు. గోపికాకృష్ణుల ప్రేమనే ఆదర్శమంటాడు. ''*నేను ప్రేమించినా బాహ్య సాక్ష్యంతో పనిలేదు. కనుక యితరులు తెలుసుకోవలసిన అవసరం లేదంటాడు*''[46]

స్త్రీ పురుషుల ప్రేమ వారి వ్యక్తిగతమైనది. దానికి సమాజంలో పనిలేదంటాడు. కానీ భారతీయులకు ఆమోదయోగ్యమైనది సీతారామ ప్రేమ గానీ రాధాకృష్ణుల ప్రేమ కాదు. 'భారతకృష్ణుడు – భాగవతకృష్ణుడు' అనే ఉపశీర్షికతో రచయిత రెంటి మధ్య తేడా చూపాడు. ''*ఒక్కమాట, ఒక్క భావము, ఒక్క పత్ని వీనియందే శ్రీరామచంద్రుని జీవనమంతయు నిమిడియున్నట్లు సత్యము, త్యాగము, అహింస – ఈ మూడింటి యందే మహాత్ముని జీవితమంతయు నిమిడియున్నది. ఈ మూటిని మించిన ధర్మములు లేవు. అనుష్ఠానములు లేవు. ఈ మూటినే పూర్వులు వేరు వేరు పేర్లతో పిలిచిరి. సత్యమునే జ్ఞానమార్గమనిరి. త్యాగమునే*

[45] మాలపల్లి : (పు:343)

[46] మాలపల్లి : (పు:350)

*వైరాగ్యమనిరి. అహింసనే భక్తిమార్గమనిరి. మానవుని యందీత్రయము నిహితమైయున్నది. సమస్త మానవులకిదియే లక్ష్యము. సమస్త దేశముల కిదియే అనుష్ఠేయము.''*[47] భారతదేశానికి అమోదయోగ్యమైనది. ఆదర్శప్రాయమైనదీ సీతారాముల ప్రేమ కానీ, రాధాకృష్ణుల ప్రేమ కాదనీ నిరూపిస్తాయి. ''*ఉత్తములయిన పతి పుత్రాదిక ధర్మాలను తన జీవితంలో ప్రకటించి మనుష్యుల కాదర్శప్రాయమైన అవతారమూర్తి శ్రీరాముడు కృష్ణుడి ప్రేమ విషయం భిన్నమైనది. కృష్ణుడి ప్రేమ సామాన్య నైతిక విధులకు అతీతమైనది.''*[48] అంటూ కృష్ణుని ప్రేమ సామాన్య జనానికి అందుబాటులో లేనిది అంటాడు రచయిత.

వ్యక్తిగాని, సమాజంకాని, ఉద్ధరింపబడేందుకు బహిశ్చైతన్యముతో పాటు అంతర్గత చైతన్యం కూడా అవసరం. బాహిరమైన ప్రభావం కేవలం ఉన్నతీకరింపబడేందుకు సోపానాలు మాత్రం ఏర్పాటు చేస్తుంది. మారదలచుకున్నవారు తమ అంతర్గత శక్తులకు బలోపేతం చేసుకోవల్సి ఉంటుంది. హరిజనుల ఉద్ధరింపుకు మిగతా వర్ణాల, వర్గాల వారు అనుకూల పరిస్థితులు కల్గిస్తూ, సహకార భావనతో ముందుకు రావాలి. మార్గదర్శకత్వం వహించాలి.

సామాజిక, రాజకీయ రంగాలతో పాటు ఆత్మోద్ధరణ, ఆధ్యాత్మిక చైతన్యం లాంటి అంశాలలో కూడా ఈ వర్గాల సమన్వయం అవసరం. సమాజం మొదట భౌతిక జీవన రంగాల్లో వృద్ధి సాధించాలి. భౌతిక జీవనంలో ఎలాంటి సంఘర్షణలు లేకుంటే ఆధ్యాత్మిక జీవనం మరింత సులువౌతుంది. అయితే కొందరు భౌతిక జీవన, సంఘర్షణల ప్రభావం ఆధ్యాత్మిక జీవనంపై పడకుండా జాగ్రత్త పడతారు. 'స్థిత ప్రజ్ఞత' చూపుతారు. ఈ రెండు జీవితాల సమన్వయం, సమగ్రతలపై మానవ జీవన వికాసం ఆధారపడి ఉంటుందనేదే తెలుగు నవలల్లోని మానవసంబంధాల వల్ల వెల్లడయ్యే సత్యంగా తెలుస్తుంది.

**6.8 ఫలితాంశాలు :**

విద్యావంతుడు ధనవంతుడైన రాజశేఖరుడు మూఢ విశ్వాసాలతో మిధ్యాడాంభికాలతో సర్వస్వము కోల్పోయి చివరకు డబ్బులేని 'లోటు'వల్ల అసలైన ప్రపంచాన్ని చూడగలుగుతాడు. ఉన్నప్పటికీ, లేనప్పటికీ తేడా రాజశేఖరుడు సంఘం ద్వారా గ్రహిస్తాడు. సంస్కరణల నేపథ్యంలో కందుకూరి వ్యక్తి సమాజంలో 'సంపద'వల్ల కలిగే గౌరవాన్ని చక్కగా చూపెట్టాడు. 'మానవ సంబంధాలన్నీ ఆర్థికపరమైనవే' అన్న మాట రాజశేఖరుని పాత్ర ద్వారా నిరూపితమైనాయి. తొలి నవలలోనే సమాజంలోని మానవ సంబంధాలు 'మానవీయ సంబంధాలు'గా

---

[47] ఆంధ్రకవిత్వము – గాంధీతత్వము – (పు: 10)

[48] మాలపల్లి : (పు:385)

ఎదగలేకపోయేందుకు సమాజంలోని మూఢవిశ్వాసాలు, మూఢనమ్మకాలు, వ్యక్తుల్లోని గర్వం, అహంకారం లాంటి అసురగుణాలు కారణమౌతాయో చక్కగా నిరూపించబడినవి. గణపతి నవల కేవలం అవిద్య, మూర్ఖత్వం, బాల్య వివాహాలు, అమాయకత్వం లాంటివి మనుష్యుల జీవితాలను ఎంతలా అవస్థలపాలు చేస్తాయో చూపెట్టింది. సంస్కరణల నేపథ్యంలో బాల్యవివాహాలు కన్యాశుల్కం విధవ దయనీయస్థితి అగ్రవర్ణాలలోని మానసిక దైర్బల్యాలను చక్కగా వివరించాడు చిలకమర్తి. మాలపల్లి గాంధీజీ సహాయనిరాకరణ, జాతీయోద్యమం అహింస లాంటి ఉద్యామాలు, ఉత్తమ సంస్కారాల నేపథ్యంలో పుట్టింది. రామదాసు యొక్క ఇద్దరు కుమారులు, అహింసకు–హింస ప్రతిరూపాలు. సమసమాజ స్థాపన, హరిజనోద్ధరణ ఈ నవల నిరూపిత లక్ష్యం. ఇందులో అగ్రవర్ణీయులు కూడ భాగస్వాములు కావడం హర్షణీయం. రెండు కుటుంబాల మధ్య 'ఘర్షణ'ను పుట్టించి, చివరికి 'సంఘపీఠం'ను స్థాపింపజేస్తాడు. ఉన్నత భారతీయుల జీవన విధానాన్ని, జాతీయ మూలాలను, సంస్కృతిని, మానవ సంబంధాలను ఇలా భారతజాతిలోని అన్ని రకాలైన ధర్మాలను పాశ్చాత్య విద్య–విలువలు ఏవిధంగా ధ్వంసం చేస్తున్నాయో కన్నులకు కట్టినట్లు వేయిపడగలు నవలలో కనిపిస్తాయి. సహస్రముఖాలైన భారతీయ ధర్మాలన్నీ కూలిపోయిన చివరికి 'వివాహధర్మాన్ని' మాత్రం భారతీయుల నుండి ఎవ్వరు మాత్రం విడదీయలేరని మొత్తం 'జాతిశక్తి' ఈ వ్యవస్థలోనే ఉందని. ఇది ఇక్కడ ఉన్నంత వరకు ఏ శక్తి 'భారతదేశాన్ని' ఏమీ చేయలేదని, ఇతర సంస్థల్లో జరుగుతున్న దౌర్జన్యాన్ని చూస్తూ, బాధపడుతూ సాక్షీభూతంగా ఉన్న ధర్మారావు చుట్టూ 'వేయి పడగల్ని' సృష్టించారు విశ్వనాథ. జాతీయోద్యమం, గాంధీ సత్యాగ్రహాల నేపథ్యంలో మనిషిలో కళా సౌందర్యాన్ని ఆవిష్కరింపజేసింది. నారాయణరావు నవలలో నారాయణరావు జాతీయోద్యమంలో పాల్గొంటాడు. జైలుకెళ్తాడు. స్వేచ్ఛాప్రణయం కారణం సమాజంలో జరుగుతున్న విచ్చలవిడితనాన్ని ఖండిస్తాడు. అపోహలతో దూరమైన కుటుంబజీవనాన్ని చక్కదిద్దుకుంటాడు. గాంధీజీ సహాయనిరాకరణ పిలుపుకోసం ఎదురు చూస్తుంటాడు. బాపిరాజుగారు ఇందులో కళాసౌందర్యాన్ని ఆవిష్కరించారు. స్వేచ్ఛాప్రణయం పేరుతో గౌరవనీయమైన కుటుంబాన్ని కూలదోసుకొని, మైదానంలో 'మోహవాంఛల్ని' తీర్చుకోలేక చివరికి జీవితంలో ఓడిపోయింది చలం రాజేశ్వరి. సత్యాన్వేషణ మార్గంలో తనను తాను తెలుసుకొనేందుకు జీవితంలో తనపై 'బలంగా' పడిన తల్లి యొక్క వ్యతిరేక భావనను తొలగించుకునేందుకు, సమాజంలో కలవలేక ప్రేమను, ఆప్యాయతను, పొందేందుకు సహజమైన 'కామాన్ని' అనుభవించేందుకు నిత్యం 'ఘర్షణ' పడే దయానిధి చివరికి 'సత్యంవైపు'గా ప్రయాణం

చేయడాన్ని బుచ్చిబాబు అద్భుతంగా చిత్రించారు. 'వంశగౌరవం' అనే మిధ్యాడాంబికంతో సమాజంతో కలువలేక తనను తాను ప్రశ్నించుకుంటూ విపరీతమైన ఆత్మన్యూనతాభావంలో 'ఆత్మహత్య' చేసుకునే అసమర్ధుడు సీతారామారావుని చక్కగా చూపించారు గోపీచంద్.

సంస్కరణతో మొదలై గాంధీ సహాయనిరాకరణోద్యమం, హరిజనోద్ధరణ, జాతీయ పునురుద్ధరణ, కులపాలికా ప్రణయం, స్వేచ్ఛా ప్రణయం, హేతువాద భావాలు, అస్తిత్వవాద సిద్ధాంతం, మనోవిశ్లేషణ లాంటి సిద్ధాంతాల నేపథ్యంలో స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్న తెలుగు సాంఘిక నవలలోని 'మానవ సంబంధాల్లో'ను విశ్లేషించడం జరిగింది. మొత్తం మీద తెలుగు నవలలపై భారతీయ సంస్కృత సాహిత్య ప్రభావంతో పాటు, ఆధునిక దార్శనికుల ప్రభావం కూడా అత్యధికంగానే ఉందనీ, అందువల్లనే సమకాలీన సమాజంలోని మానవసంబంధాల్లో కనిపించి భిన్నకోణాల్ని రచయితలు సృజనీకరించగలిగారని తెలుస్తుంది. మానవసంబంధాల విచ్ఛిన్నత జరుగుతున్నప్పుడల్లా దార్శనికుల భావాలు రచయితలను చైతన్యవంతం చేయడం వల్లనే వారి నవలల్లో భిన్నదృక్కోణాలుగా వివిధ వస్తువుల్ని అందించినా, వాటిలో భారతీయాత్మదాగుండేలా చేయగలిగారని స్పష్టమవుతుంది. భారతీయుల్లోని పరస్పర సహకారం, కుటుంబవిలువలు, ధార్మికజీవనం మొదలైన అంశాలన్నీ కేవల ఆర్థిక, లైంగికసంబంధాలను ప్రభావితం చేయలేవని కూడా నిరూపితమైంది. ఈ పరిశోధనలోని ఫలితాంశాలను ముగింపులో కూడా వివరించాలనుకుంటున్నాను.

★★★

# ముగింపు

ఆంగ్లేయుల పాలనను  ఎదిరిస్తూ, స్వాతంత్ర్యం కోసం పోరాటం చేస్తున్న పందొమ్మిదో శతాబ్దం రెండో భాగంలో వలస పాలకుల సహచర్యం వల్ల అబ్బిన ఆంగ్లవిద్యవల్ల దేశంలో జరిగిన అనేక మార్పుల ద్వారా బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా, సమాజాన్ని ఉత్తేజపరిచే సాహిత్యం పుట్టింది.  పాశ్చాత్య నవల ప్రభావంతోనే ఇక్కడ నవల పుట్టింది.  జాతి జీవన విధానాన్ని నిరూపించేదే సాహిత్యం.  'నవల' ఆ పనిని చక్కగా నిర్వహించింది.  దేశంలో అప్పటికే పెరిగిపోయిన దురాచారాలను ఖండించేందుకు, జాతీయోద్యమ భావాలను, స్వాతంత్ర్య భావాలను పెంపొందించే రచనలు రాసాగాయి.  ఇతర సామాజిక ఉద్యమాలు కూడ వీటికి తోడు కావడంతో 'నవల' విస్తృతి పెరిగింది.  ఆధునిక సాహితీ ప్రక్రియల్లో అత్యంత ప్రభావశీలత్వంగలది.  మానవ జీవితంలోని అనేక కోణాలకు దర్పణం లాంటి నవల మానవానుభవాలను ఏ విధంగా పరామర్శించిందో ఈ సిద్ధాంతగ్రంథంలో వివరించాను. నేను ఈ సిద్ధాంత గ్రంథాన్ని **ఆరు అధ్యాయాలుగా** విభజించాను.

**మొదటి అధ్యాయం'' భారతీయ జీవన విధానం మానవసంబంధాలు''**లో వ్యక్తికి– సమాజానికి ఉన్న సంబంధాన్ని వివరించడం జరిగింది.  వ్యక్తి ఏవిధంగా సామాజికుడు అవుతున్నాడు?  సామాజిక భాగస్వామి అయిన వ్యక్తికి, ప్రకృతిలో ఎలా సమన్వయం సాధించాడు అనే విషయాలు వివరించాను.  వ్యక్తిని– పూర్వ దార్శనికులు ఏవిధంగా దర్శించినారనే విషయాన్ని భారతీయ సంస్కృతిలో వ్యక్తికి– సమాజానికి మధ్య నున్న సంబంధాన్ని చెప్తూ ఇక్కడి దార్శనికుల ఆలోచనల ప్రకారం భారతీయుని సుఖవంతమైన జీవనానికి కావలసిన చతుర్విధ పుషార్థాలు, చతురాశ్రమ ధర్మాలను వివరించడం జరిగింది. బ్రిటీష్ వారి పరిపలన వలన భారతదేశంలో వివిధ రకాల వ్యవస్థల తీరుతెన్నులు వివరించాను.  దేశంలో సామాజిక మార్పుల వల్ల ప్రజల మధ్య ఎలాంటి 'వాతావరణం' నెలకొన్నదో వివరించడం జరిగింది.  గ్రామీణ వాతావరణంలో బ్రిటిష్ వారి రాక ఎలాంటి విధ్వంసాన్ని సృష్టించిందో వివరించాను. భూసంబంధాల్లో– రైతు భూమిని పండిస్తూ గ్రామానికి అండగా ఉండే పరిస్థితి నుండి బ్రిటిష్ వారి పారిశ్రామిక నాగరికత ద్వారా– రైతును ఇతర వృత్తుల వారికి మధ్య నున్న సంబంధాలు ఎలా బలహీనపడ్డాయో తెలుస్తుంది.  పట్టణ నాగరికత యువతలో కుటుంబాల్లో, ఉపాధి అవకాశాల్లో ఎంతటి మార్పులు తీసుకువచ్చిందో, ఏ విధంగా పాశ్చాత్య విద్య భారతీయాత్మ పరోక్షంగా 'మింగేసే' ప్రయత్నం చేసిందో వివరించాను.  భారతీయ పునరుజ్జీవనంలో భాగంగా

పాశ్చాత్యులను ఎదుర్కొనేందుకు దేశంలో బ్రహ్మ సమాజం, ఆర్యసమాజం, రామకృష్ణమఠం లాంటివి ఏవిధంగా దోహదపడ్డాయో వివరించాను.

రెండవ అధ్యాయం **''తెలుగు సాంఘిక నవలమానవసంబంధాల పరిణామం''** లో నవల నిర్వచనం, స్వరూప స్వభావాలను గురించి వివరిస్తూ, నవల పుట్టుకకు కారణమైన వాతావరణాన్ని పరిచయం చేయడం జరిగింది. ఆనాడు ప్రపంచమంతా వస్తున్న, సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో వచ్చిన పెనుమార్పులకు స్పందించిన రచయితలు 'నవల'ను సృష్టించారు. నవలకు పాశ్చాత్యులు ఇచ్చిన నిర్వచనాలను గురించి సూత్రప్రాయంగా వివరించాను. తెలుగు సాహిత్యంలో ఆధునిక ప్రక్రియగా నవల పుట్టుకకు ఆంగ్లవిద్య ఏవిధంగా దోహదపడిందో వివరిస్తూ, తెలుగులో సాంఘిక నవల లక్షణాలను వివరించాను. ఈ అధ్యాయంలో తెలుగు నవలల్లో మానవసంబంధాల పరిణామ గతులను విశ్లేషించాను. దీనిలోనే రాజశేఖరచరిత్ర, గణపతి, నారాయణరావు, మైదానం నవలల ఇతివృత్తాలను వివరించి, వాటిని సోదాహరణంగా విశ్లేషించాను.

మూడవ అధ్యాయం **''*మాలపల్లి, వేయిపడగలు* నవలలు– మానవసంబంధాలు''లో** 'మానవ సంబంధాలను', వాటి సిద్ధాంతాలను వివరిస్తూ ఈ సంబంధాలు వ్యక్తిని, కుటుంబంను, సమాజాలను ఏవిధంగా సమన్వయపరుస్తాయో వివరించాను. కుటుంబ సంబంధాల్లో వివాహం గృహస్థుని యొక్క ప్రాధాన్యత అలాగే సమాజంలోని అనేక రకాల వ్యవస్థలు వ్యక్తిపై ఎలాంటి ప్రభావాన్ని చూపెడుతున్నాయో వివరించడం జరిగింది. ఈ అధ్యాయంలో తెలుగు సాంఘిక నవలలోని మానవ సంబంధాలను కుటుంబ సంబంధాలు, సామాజిక సంబంధాల రూపంలో వివరించాను. పరిశోధనకు ఎంపిక చేసుకున్న మాలపల్లి, వేయిపడగల నవలల్లోని ప్రధాన పాత్రలు, పాత్రల మనస్తత్వాలు సమాజంతో ఆయా పాత్రల 'వ్యవహారాలను సోదాహరణంగా విశ్లేషించాను.

నాల్గవ అధ్యాయం **''*చివరకు మిగిలేది, అసమర్థుని జీవయాత్ర* నవలలు– మానవసంబంధాలు**''లో మనస్తత్వశాస్త్రవేత్తల సిద్ధాంతాలను పేర్కొని, ఆ సిద్ధాంతాలు ఆయా సమాజాల్లో రావడానికి గల కారణాలతో సహా మానవసంబంధాలను వివరించాను.

ఐదవ అధ్యాయం ''**తెలుగు నవలల్లో మానవ సంబంధాలు– శిల్ప వైవిధ్యం**'' లో పరిశోధనకు స్వీకరించిన నవలల్లోని ముఖ్య పాత్రలను వివరించి, వారి వారి జీవితాల్లో వారికి ఎదురైన సంఘటనలు అంతర, బహిస్సంఘర్షణల కారణంగా జీవితంలో ఎలా ఉత్థాన

పతనాలను ఎదుర్కొన్నది– ఈ విషయాలన్నీ ఆయా రచయితలు తమ నవలల్లో, పాత్రల చిత్రీకరణ ద్వారా ఎలా నిరూపించారన్నది శిల్ప విమర్శలో గమనించడం జరిగింది.

ఆరో అధ్యాయం **''తెలుగు నవలల్లో మానవసంబంధాలు దార్శనికుల ప్రభావం''** లో నా పరిశోధనకు సంబంధించిన తెలుగు నవలల్ని స్థూలంగా పరిశీలించినప్పుడు భారతీయులపై పాశ్చాత్య ప్రభావం తీవ్రంగానే పడిందని వేయిపడగలు నవలలో భారతీయ కుటుంబ వ్యవస్థ ద్వారా కనిపించే మానవసంబంధాలు తెలియజేస్తున్నాయి. కానీ పాశ్చాత్య మానవ సంబంధాల్ని తనలో జీర్ణించుకుంటూనే తన మూలాల్ని బలంగా కాపాడుకున్న భారతీయజీవన విధానమే ఈ నవలలోని ధర్మారావు పాత్ర ద్వారా నిరూపితమైంది. అలాగే, జిడ్డుకృష్ణమూర్తి గారి దార్శనిక ప్రభావం చివరికి మిగిలేది నవలలో గాఢంగానే కనిపిస్తుంది. పాశ్చాత్య ఆర్థిక, రాజకీయ ప్రభావాలు భారతీయ సమాజంపై చూపిన మానవసంబంధాల్ని 'మాలపల్లి' నవల ప్రతిఫలిస్తుంది. వీటిని అరవిందుని దార్శనిక ప్రభావం ప్రపంచ మానవసంబంధాల్లో క్రియాశీల ఆధ్యాత్మికజీవన సంబంధాల్ని ఆలోచింపజేశాయి. ఇలా ఆధునిక దార్శనికుల ప్రభావం తెలుగు నవలా సాహిత్యంపై విస్తృతంగానే కనిపిస్తుంది. నవల సామాజిక వాస్తవికతకు ప్రతిబింబంగా భావించినప్పుడు, ఆ కాల్పనిక సాహిత్యంలో కూడా మానవసంబంధాల ప్రతిఫలనం ఉంటుంది. అందువల్ల ఈ అధ్యాయంలో భారతీయ సంస్కృత సాహిత్యం, ఆధునిక దార్శనికల ప్రభావాన్ని పరిచయం చేస్తూ మానవసంబంధాల్లో కనిపించే వివిధాంశాలను వివరించాను.

''ముగింపు''లోను, అలాగే ఆరో అధ్యాయం చివరిలోను పరిశోధన ఫలితాంశాలు సారాంశాన్ని పేర్కొన్నాను. చివరిలో ఉపయుక్తగ్రంథసూచినిచ్చాను.

★★★

# ఉపయుక్త గ్రంథసూచి


1. అనుభవానందస్వామి, <u>*సర్వసిద్ధాంత సౌరభము*</u> (4), భీమునిపట్నం : పరమహంస కార్యాలయం, 1984.
2. అరవిందులు, <u>*భారత పునర్జన్మ*</u> (ప్రథమ ముద్రణ), మైసూర్ : మీరా అదితి, 1993.
3. అంకయ్య, వడ్డెగుంట, <u>*ఆంధ్ర కవిత్వం – గాంధీ కవిత్వము*</u>, గుంటూరు : 1980.
4. ఆనందారామం, సి., <u>*నవలా విమర్శ*</u>, హైదరాబాదు : సొంత ప్రచురణ, 1994.
5. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ(సం.), <u>*సాహిత్యోపన్యాసములు*</u> (17), హైదరాబాదు : 1980.
6. ఆంధ్ర సారస్వత పరిషత్ (సం), <u>*మన నవల – పరిశీలన*</u> (వ్యాస సంకలనము), హైదరాబాదు : 1979.
7. ఇల్యా ఎహ్రెన్ బర్గ్, <u>*రచయితా శిల్పమూ*</u>, హైదరాబాదు : విశాలాంధ్ర, 1969.
8. కాత్యాయని విద్మహే, <u>*చివరకు మిగిలేది – మానసిక సామాజిక జీవన స్రవంతి – నవలా విమర్శ.*</u>
9. కార్ల్ మార్క్, <u>*వలస విధానం.*</u>
10. కుటుంబరావు, కొడవటిగంటి, <u>*సాహిత్య ప్రయోజనము*</u>, హైదరాబాదు : విశాలాంధ్ర, 1969.
11. కృష్ణమాచార్య, ఎక్కిరాల, <u>*శంఖారావం*</u>, విశాఖపట్నం : కులపతి బుక్ ట్రస్ట్, 1985.
12. కృష్ణమూర్తి, జిడ్డు, <u>*ముందున్న జీవితం*</u>, విశాలాంధ్ర, 1999.
13. కృష్ణారావు, మోపిదేవి, <u>*భారత ధర్మాద్వైతం – వ్యాసుని దర్శనం – తిక్కన సందర్శనం,*</u> 1984.
14. కోటేశ్వరరావు, తుమ్మపూడి, <u>*శ్వేతపద్మం*</u>, ఏలూరు : ముముక్షువు, 1990.
15. కోటేశ్వరరావు, తుమ్మపూడి, <u>*వేయిపడగలు – మణిప్రభలు*</u>, మచిలీపట్నం : కవిప్రభ, 1989.
16. గోపీచంద్, త్రిపురనేని, <u>*అసమర్థుని జీవయాత్ర.*</u> మద్రాసు : శేషాచలం అండ్ కో, 1978.

17. చలం, *మ్యూజింగ్స్,* హైదరాబాద్ : చలం సాహితి, 1976.

18. చలం, *ప్రేమలేఖలు*, విజయవాడ : అరుణా పబ్లికేషన్స్, 1995.

19. చలం, *స్త్రీ,* విజయవాడ : దేశి కవితా మండలి, 1956.

20. చలం, *మైదానం,* ఎమెస్కో, 1976.

21. చెంచయ్య, దరిశి, *నేనూ – నాదేశం* (మూడవ ముద్రణ), విజయవాడ : జయంతి పబ్లికేషన్స్, 1985.

22. జయరాములు, బి, (సంపా. ), *జి.వి.యస్. పీఠికలు*, 1996.

23. తారాచంద్, *భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర*, II వ భాగం.

24. *విజ్ఞాన సర్వస్వము* (3వ సంపుటము), మదరాసు : తెలుగు భాషా సమితి, 1967.

25. దక్షిణామూర్తి, పోరంకి (సంపా), *తెలుగు నవల – నూరు సంవత్సరాలు*, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, 1973.

26. దేవీ ప్రసాద్ ఛటోపాధ్యాయ, *భారతీయ తత్త్వశాస్త్రం*, హైదరాబాద్ : విశాలాంధ్ర, 1984.

27. నరసింహ రాఘవన్, *వేయిపడగలు – సమకాలీనత – సార్వకాలీనత*, హైదరాబాద్ : తెలుగు అకాడమీ, 1989.

28. నాగభూషణశర్మ, మొదలి, *తెలుగు నవలా వికాసం*, హైదరాబాద్ : నాట్య కళా ప్రెస్, 1971.

29. నారాయణరెడ్డి, రావి, *వీర తెలంగాణ – నా అనుభవాలు – జ్ఞాపకాలు* (IVవ ముద్రణ) హైదరాబాదు : విశాలాంధ్ర, 1983.

30. *మార్క్స్ – ఎంగెల్స్ రచనలు – సంకలిత రచనలు*, మాస్కో : ప్రగతి ప్రచురణలు, 1982.

31. బాపిరాజు, అడవి, *నారాయణరావు*, మద్రాసు : త్రివేణి పబ్లిషర్స్, 1961.

32. బుచ్చిబాబు, *చివరకు మిగిలేది*, ఎమెస్కో ప్రచురణ, 1970.

33. *మనువు*, కర్నూలు : మనుస్మృతి బాలసరస్వతి బుక్ డిపో సంవత్సంర (?).

34. మృణాళిని, సి., *తెలుగు సాంఘిక నవల – కథాకథన శిల్పం*, తెలుగు పరిశోధన ప్రచురణలు 4, 1998.

35. మంగమ్మ, జె., (అను), *శ్రీ అరవిందులు – నవజాత*, న్యూఢిల్లీ : నేషనల్ బుక్ ట్రస్ట్, 1981.

36. రమాపతి రావు, అక్కిరాజు, *వీరేశలింగం పంతులు – సమగ్ర పరిశీలన,* హైదరాబాదు : విశాలాంధ్ర, 1972.

37. రమాపతి రావు, అక్కిరాజు, *వీరేశలింగం రచనలు – స్వీయ చరిత్రము* (మొదటి సంపుటం) హైదరాబాదు : విశాలాంధ్ర, 1993.

38. రమాపతి రావు, అక్కిరాజు, *వీరేశలింగం రచనలు – స్వీయ చరిత్రము* (రెండవ సంపుటం) హైదరాబాదు : విశాలాంధ్ర, 1984.

39. రంగనాథాచార్యులు, కే.కే., *సామయిక వ్యాసాలు*, స్వీయ ప్రచురణ, 2000.

40. రాజగోపాలరావు, యం., *భారతీయ దర్శనం* IVవ భాగం, హైదరాబాదు : తెలుగు అకాడమీ, 1991.

41. రాజేశ్వరరావు, కే.(అను), *వివేకానందుని సామాజిక – రాజకీయ దృక్కోణాలు*, హైదరాబాదు : విశాలాంధ్ర, 1988.

42. రాధాకృష్ణమూర్తి, కోగంటి, *గాంధీమార్గం*, హైదరాబాదు : ప్రజాస్వామ్య ప్రచురణలు, 1980.

43. రామకోటి శాస్త్రి, కేతవరపు, *మహాభారత భారతము – తత్త్వదర్శనము*, విజయవాడ : గంగాధర పబ్లిషర్స్.

44. రామమూర్తి, కోడూరి, *తెలుగుసాహిత్యంలో మనోవిశ్లేషణ*, విజయవాడ : కిరణ్ కిషోర్ పబ్లికేషన్స్, 1979.

45. రామలింగం, డి., *భారతీయ పునరుజ్జీవనము.*

46. రామశాస్త్రి, వావిళ్ళ, *పండిత మదన మోహన మాళవ్య జీవితము*, చెన్నపురి : వావిళ్ళ ప్రచురణలు, 1951.

47. రామానుజ రావు, దేవులపల్లి, *తెలుగు సీమలో సాంస్కృతిక పునరుజ్జీవనం*, హైదరాబాద్ : దేవీ పబ్లికేషన్స్, 1983.

48. లక్ష్మీకాంతం, పింగళి, *సాహిత్య శిల్ప సమీక్ష*, విశాలాంధ్ర, 1991.

49. లక్ష్మీనరసింహం, చిలకమర్తి, *గణపతి,* రాజమండ్రి : కాలచక్రం ప్రచురణలు, 1966.

50. లక్ష్మీనారాయణ, ఉన్నవ, *మాలపల్లి*, మద్రాసు : త్రివేణి పబ్లిషర్స్, 1984.

51. లక్ష్మీరంజనం, కే., బాలేందు శేఖరం, కే., *ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి*, బాలసరస్వతి బుక్ డిపో, 1980.

52. లక్ష్మీరంజనం, కే., బాలేందు శేఖరం, కే., *సామాజిక శాస్త్రము*, తెలుగు అకాడమీ, 1964.

53. వామ పాదానంద, *శ్రీ లీలా సమాధి* (షిరిడీ సాయిబాబా తత్త్వం), ఏలూరు : ముముక్షువు, 1990.

54. విద్యేశ్వరి, డి., *తెలుగు నవల – మనోవిశ్లేషణ*, హైదరాబాదు : నితిన్ ఎంటర్ ప్రైజెస్, 1980.

55. విశ్వం, విద్వాన్ (అను), *నేటి భారతం* (IIవ ముద్రణ), విజయవాడ : చరిత ప్రింటర్స్, 1984.

56. విశ్వనాథశాస్త్రి, సరిపెల్లి,(అను), *ప్రాక్పశ్చిమ తత్త్వశాస్త్రము చరిత్ర* (ప్రథమ సంపుటి) ఆంధ్ర సారస్వత పరిషత్, 1961.

57. వీరభద్రయ్య, ముదిగొండ, *తెలుగు కవిత – సాంఘిక సిద్ధాంతాలు*, హన్మకొండ : శ్రీ అరవింద సొసైటీ, 1980.

58. వీరభద్రయ్య, ముదిగొండ, *వేయిపడగలు – ఒక పరిశీలన*, వరంగల్లు : కులపతి ప్రచురణలు, 1984.

59. వీరభద్రయ్య, ముదిగొండ, *జిడ్డు కృష్ణమూర్తి తత్త్వం – చివరకు మిగిలేది*, హైదరాబాదు : తెలుగు అకాడమీ, 1992.

60. వీరభద్రరావు, కొత్తపల్లి, *తెలుగు సాహిత్యంపై ఆంగ్ల ప్రభావము*, ఢిల్లీ విశ్వవిద్యాలయం, 1960.

61. వీరేశలింగం, కందుకూరి, *రాజశేఖర చరిత్ర*, విశాలాంధ్ర ప్రచురణలు, 1985.

62. వెంకటరంగయ్య, మామిడిపూడి, *మారుతున్న సమాజం – నా జ్ఞాపకాలు*, మచిలీపట్నం : తెలుగు విద్యార్థి ప్రచురణలు, 1981.

63. వెంకటేశ్వరరావు, నిమ్మగడ్డ, *చలం – శ్మశాన సాహిత్యం* (ద్వితీయ ముద్రణ), విజయవాడ : జయంతి పబ్లికేషన్స్, 1983.

64. వెంకటేశ్వరరెడ్డి, అన్నపురెడ్డి, *సిగ్మండ్ ఫ్రాయిడ్,* హైదరాబాదు : తెలుగు అకాడమీ, 1985.

65. వెంకటసుబ్బయ్య, పులిపాటి, *భాగవత రహస్యోపన్యాసములు.*

66. వేంకట కుటుంబరావు, బొడ్డుపాటి, *ఆంధ్ర నవలా పరిణామము*, గాయత్రీ ప్రచురణలు, 1971.

67. వేంకట శివరావు, దిగవల్లి, *విస్మృతాంధ్రము – విశాలాంధ్రము*, విజయవాడ : ఆదర్శ గ్రంథ మండలి, 1975.

68. వేంకట సూర్యప్రకాశరావు, పులిజాల, *భాగవతముపై భగవద్గీత ప్రభావము*, విజయవాడ : 1989.

69. శ్యామలాదేవి, దిట్టకవి, *విశ్వనాథవారి నవలలో ముఖ్యస్త్రీపాత్ర చిత్రణము*, హైదరాబాదు : 1984.

70. శ్రీనివాస అయ్యంగార్, కే.ఆర్., *శ్రీ అరవిందుల విశ్వదర్శనం*, తెలుగు అకాడమీ.

71. శ్రీరామమూర్తి, కోడూరి, *తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ*, 1979.

72. సత్యనారాయణ, కంభంపాటి, *గతి తార్కిక భౌతికవాదం*, విశాలాంధ్ర, 1953.

73. సత్యనారాయణ గుప్త, గొట్టె, *ఉపనిషత్ కల్పతరువు* (IIవ భాగం), విజయవాడ : ప్రార్థనాగాన ప్రచార సంఘము. (?)

74. సత్యనారాయణ, విశ్వనాథ, *వేయిపడగలు*, 1984. ప్రచురణలు (?)

75. సత్యనారాయణ, విశ్వనాథ, *సముద్రపు దిబ్బ*, 1962. ప్రచురణలు (?)

76. సరస్వతీదేవి, ఇల్లందుల, *మహాత్ముడు – మహిళ*, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ, 1969.

77. సుదర్శనం, ఆర్. ఎస్., *సాహిత్యంలో దృక్పథాలు*, విజయవాడ : నవోదయ, 1982.

78. సుప్రసన్నాచార్యులు, కోవెల, *భావుక సీమ*, హైదరాబాదు : యువభారతి, 1993.

79. సుప్రసన్నాచార్యులు, కోవెల, *సహృదయ చక్రము*, హన్మకొండ : శ్రీవాణి ప్రచురణలు, 1983.

80. సుబ్బమ్మ, మల్లాది, *ఆంధ్రప్రదేశ్ లో మహిళోద్యమం, మహిళా సంఘాలు*, (1860 – 1983), హైదరాబాదు : ప్రజాస్వామ్య ప్రచురణలు, 1985.

81. సుబ్బారావు, సి.వై.,(సంపా.), *విభాత సంధ్యలు – తెలుగు సాహిత్యంలో సమాజం* (మొదటి ముద్రణ), హైదరాబాదు : సౌత్ ఇండియా పబ్లికేషన్స్.

**ఆంగ్ల గ్రంథములు**

82. Arabindo, *The Human cycle*, Pondicherry: Sri Arabindo Ashram Trust, 1985.

83. Krishnamacharya, E., *Our Heritage*, Vizag: The World Teacher Trust, 1983.

84. Maceterver, R.M. and Ch. Page, *Society – An Introductory Analysis.*

85. Rabindranath Tagore, *The Religion of Man*, London: Uniwn Banks, 1975.

86. Ramachandra Rao, Kandarpa, *Integral Humanism*, Hyderabad: Academy of Integral Humanism, 1995.

**Webliography**

http://www.corwin.com/upm-data/9805_039184ch02.pdf

★★★